# క్రైస్తవ కుటుంబం

shepherds
GLOBAL CLASSROOM

Shepherds Global Classroom క్రీస్తు శరీరాన్ని శక్తివంతం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న క్రైస్తవ నాయకుల కోసం పాఠ్యాంశాలను అందిస్తు వారిని సిద్ధ పరుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆధ్యాత్మిక శిక్షకులకు 20-కోర్సుల పాఠ్యాంశాల సాధనాన్ని అందించడం ద్వారా, స్వదేశీ శిక్షణా కార్యక్రమాల సంఖ్యను విస్తరించాలని మేము ఆశిస్తున్నాము.

ఈ కోర్సు ఉచితంగా అందుబాటులో ఉంది డౌన్‌లోడ్ చేసుకోవడానికి https://www.shepherdsglobal.org/courses

ప్రధాన రచయిత: Dr. Stephen K. Gibson

కాపీరైట్ © 2023 Shepherds Global Classroom

మొదటి ఇంగ్లీష్ ఎడిషన్ నుండి తెలుగులోకి అనువదించబడింది.

సర్వ హక్కులు ప్రత్యేకించబడినవి.

థర్డ్-పార్టీ వనరులు వాటి సంబంధిత యజమానుల కాపీరైట్ గా ఉన్నాయి మరియు మరియు వివిధ లైసెన్సుల ద్వార పంచుకొనబడ్డాయి.

సూచించకపోతే, అన్ని వాక్యాలు తెలుగు తెలుగు ఓల్డ్ వెర్షన్ బైబిల్ - పరిశుద్ధ గ్రంథము O.V. బైబిల్ నుచి తీసుకొనబడినవి. కాపీరైట్ © 2016 బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా అనుమతి ద్వారా ఉపయోగించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా అన్ని హక్కులు ప్రత్యేకించబడ్డాయి.

**అనుమతుల గమనిక:**

ఈ కోర్సు క్రింది మార్గదర్శకాల ప్రకారం ప్రింట్ మరియు డిజిటల్ ఫార్మాట్‌లలో ఉచితంగా ముద్రించబడుతుంది మరియు పంపిణీ చేయబడుతుంది: (1) కోర్సు కంటెంట్ ఏ విధంగానూ మార్చబడకపోవచ్చు. (2) కాపీలను లాభం కోసం అమ్మకూడదు. (3) విద్యా సంస్థలు ఈ కోర్సును ఉచితంగా లేదా ట్యూషన్ ఫీజు తీస్కొని కాపీ గా ఉపయోగించు కోవచ్చు (4) Shepherds Global Classroom అనుమతి మరియు పర్యవేక్షణ లేకుండా కోర్సు అనువదించబడదు.

# విషయాసూచిక

కోర్సు అవలోకనం ..... 5
(1) సంబంధం కోసం సృజించబడ్డాం ..... 7
(2) వాక్యానుసారమైన కుటుంబం ..... 21
(3) వివాహం గురించి బైబిలు బోధన ..... 39
(4) లైంగికత - విషయాలు ..... 53
(5) అవివాహ స్థితి ..... 79
(6) వివాహానికి సిద్ధపాటు ..... 95
(7) బలమైన వైవాహిక బంధాన్ని పెంపొందించుకోవడం ..... 111
(8) ప్రేమకు ఐదు భాషలు- భాగం 1 ..... 125
(9) ప్రేమకు ఐదు భాషలు – భాగం 2 ..... 141
(10) సంతానలేమి సమస్య ..... 161
(11) పిల్లల అభివృద్ధి, సంరక్షణ ..... 175
(12) ఉద్దేశ్యపూర్వక పిల్లల పెంపకం ..... 187
(13) పిల్లలను పెంపకంలో సమస్యలు ..... 203
(14) కౌమారదశలోని పిల్లలను పెంచడం ..... 219
(15) యువ వయోజనుడు ..... 233
స్త్రీల పట్ల గౌరవం ..... 249
జనన నియంత్రణ ..... 253
సిఫార్సు చేయబడిన వనరులు ..... 257
అభ్యాసాల రికార్డు ..... 259

# కోర్సు అవలోకనం

## కోర్సు వర్ణన

ఈ కోర్సు, జీవితంలో విభిన్న దశలకు, కుటుంబ సంబంధాలకు, ముఖ్యంగా వైవాహిక జీవితానికి పిల్లల్ని పెంచడానికి అవసరమైన దేవుని సూత్రాల్ని బోధిస్తుంది. ఈ అధ్యయనం ద్వారా, విద్యార్థులు తమ ప్రస్తుత జీవన దశలోను, వాళ్ల సంబంధాల్లోను దేవుణ్ణి గౌరవించడం నేర్చుకుంటారు. వారు ఇతరులకు బైబిలు సూత్రాలను, వాటి అన్వయాల్ని బోధించడానికి సిద్ధపడతారు. విద్యార్థులు తమ స్థానిక సంఘాలతో కలిసి తమ సమాజంలోను, కుటుంబాలలో దైవభక్తి కోసం ప్రభావం చూపడానికి ప్రోత్సహించబడతారు.

విద్యార్థులు, ఇతర విషయాలతో పాటు, పిల్లలు, కౌమారదశలో ఉన్న వారికి కుటుంబ శిష్యత్వ తర్ఫీదును ఎలా చేయాలో (family discipleship) గురించి నేర్చుకుంటారు. 12వ పాఠం 3వ అభ్యాసంలో, ఈ కోర్సు చేస్తున్న తల్లిదండ్రులు, వారి కుటుంబంలో అనుదిన వాక్యధ్యాన సమయాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించడానికి సూచనలు ఉన్నాయి. *కుటుంబ బోధనా సాధనాలు,* అనే కుటుంబ శిష్యత్వాన్ని గురించిన పుస్తకాన్ని Shepherds Global Classroom రూపొందించింది. దీనిని తల్లిదండ్రులు వారి కుటుంబ ఆరాధనలో వాడుకోవచ్చు. shepherdsglobal.org. నుండి ఈ పుస్తకాన్ని డౌన్లోడ్ చేసుకోవచ్చు.

## తరగతి నాయకులకు సూచనలు

**చర్చా ప్రశ్నలు, క్లాసులో చేయాల్సిన కార్యకలాపాలను** ► గుర్తుతో సూచించడం జరిగింది. చర్చా ప్రశ్నల కోసం, తరగతి నాయకుడు ప్రశ్న అడిగి, విద్యార్థులు చర్చించుకోవడానికి తగినంత సమయం ఇవ్వాలి. ఒకే విద్యార్థి పదే పదే జవాబు చెబుతుంటే, లేక కొందరు విద్యార్థులు అస్సలు మాట్లాడకుండా ఉంటే, నాయకుడు ఒక విద్యార్థిని ప్రత్యేకంగా ప్రశ్నించవచ్చు: “అభయ్, ఈ ప్రశ్నకు నువ్వేలా సమాధానం చెబుతావు?”

ప్రతి పాఠం చివర చర్చ కోసం కొన్ని ఐచ్ఛిక ప్రశ్నలు ఉన్నాయి. గ్రూపులో ఏ ప్రశ్నలు చర్చించాలో తరగతి నాయకుడు ఎన్నుకోవచ్చు.

కోర్సులో చాలా బైబిలు వచనాలను ఉపయోగించడం జరిగింది. తరగతిలో బిగ్గరగా చదవాల్సిన వాక్యభాగాలు బాణం గుర్తుతో ఉన్నాయి. ఒక విద్యార్థి వాక్యభాగాన్ని బిగ్గరగా చదువుతుండగా, మిగిలిన వాళ్ళంతా దాన్ని చూడాలి.

కొన్నిసార్లు, లేఖన భాగాలు అదనపు వివరణతో ఉంటాయి. ఉదాహరణకు: (ఎఫెసీయులకు 6:1). అవి వాక్యభాగానికి సహాయకరంగా ఇచ్చాం. ప్రతిసారీ అదనపు వివరణతో ఇచ్చిన వాక్యభాగాల్ని చదవాల్సిన అవసరం లేదు.

ఈ కోర్సు ముగింపులో, రెండు ప్రత్యేక విషయాల్ని ఉద్దేశించి చిన్న చర్చలు ఉన్నాయి. ఈ విషయాలు ఏ ఇతర పాఠానికి సంబంధించినవి కాదు, అలాగని పూర్తి పాఠాలు కూడా కాదు. అయినప్పటికీ, వాటిని క్రైస్తవ దృక్కోణంలో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. 3వ పాఠం తర్వాత, తరగతి అంతా అనుబంధం A ను, మరియు 10వ పాఠం తర్వాత, అనుబంధం B ను అధ్యయనం చేసి చర్చించాలి. ఈ విషయాన్ని గుర్తు చేసే సూచనలు ఆ రెండు పాఠాల చివర్లో ఉన్నాయి.

ప్రతి పాఠం, అభ్యాసంతో ముగుస్తుంది. తరువాత పాఠంలోకి వెళ్లే ముందు, అభ్యాసాన్ని పూర్తి చేసి, అప్పగించాలి. ఒకవేళ ఎవరైనా అభ్యాసం పూర్తి చేయకపోతే, తర్వాత చేయొచ్చు. అయితే, విద్యార్థులు తరగతిలోనే ఎక్కువగా నేర్చుకునేలాగా నాయకుడు సమయపాలనను ప్రోత్సహించాలి. ప్రతి పాఠంలో ఇచ్చిన అభ్యాసాలను పూర్తి చేయడంతో పాటుగా, తరువాత నేర్చుకోబోయే పాఠాన్ని ముందుగానే చదివి సిద్ధంగా ఉండాలి.

విద్యార్థి **Shepherds Global Classroom** నుండి సర్టిఫికేట్ పొందదలచుకుంటే, వారు క్లాస్ సెషన్లు హాజరై అభ్యాసాలను పూర్తి చెయ్యాలి. పూర్తైన అభ్యాసాలను నమోదు చేయడానికి కోర్సు చివర్లో ఒక ఫారం ఉంటుంది.

# పాఠం 1

# సంబంధం కోసం సృజించబడ్డాం

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) దేవుడు మనతో కలిగియుండాలనుకునే సంబంధాన్ని గుర్తించి, దాని విలువను తెలుసుకోవాలి.

(2) ప్రతి వ్యక్తిలో ఉండే దేవుని స్వరూపాన్ని గ్రహించి, గౌరవించాలి.

(3) మన సంబంధాల్లో, మనం తీసుకునే నిర్ణయాల విషయంలో దేవునికి లెక్క అప్పజెప్పవలసినవారమని గ్రహించాలి.

(4) దైవ సంబంధాలకు బైబిలు ఒక మార్గదర్శక పుస్తకమని, అలాగే మన సంబంధాల్లో మనం దేవుణ్ణి అనుసరించాలని తెలుసుకోవాలి.

## దేవునితో సంబంధం

లేఖనాలలో, దేవుడు వ్యక్తిగతమైన దేవుడని, సంబంధాలను కలిగి ఉంటాడని, ఇతరులతో సంభాషిస్తాడని మనం నేర్చుకుంటాం (హెబ్రీయులకు 1:1-2). తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు, పరిశుద్ధాత్ముడైన దేవుడు నిరంతరం పరస్పర సంబంధం కలిగియున్నారని లేఖనం చూపిస్తుంది.[1]

యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించాడు (నిర్గమకాండము 20:11). ఆయన చేసిన సృష్టి అంతటిలో, మానవాళి ఉత్తమైంది, అతి ముఖ్యమైందని కీర్తన 8:3-8 చూపిస్తుంది. దేవుడు సంబంధం కలిగియున్నట్లుగానే, మనుష్యుల్ని కూడా సంబంధాలు కలిగి ఉండేలాగా సృజించాడు. లేఖనమంతటా, దేవుడు ప్రజల్ని ఆయనతో జీవింపజేసే సంబంధంలోకి ఆహ్వానిస్తున్నాడు.[2]

---

[1] ఉదాహరణకు, ఈ లేఖనాలు తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్ముని మధ్య సంబంధాన్ని చూపిస్తాయి: యోహాను 17:22-24; యోహాను 14:16, 26; మరియు యోహాను 15:26. పరిశుద్ధాత్ముడు ఏ విధంగా నిత్యుడైయున్నాడో ఆ వచనాలు మాట్లాడవు కాని, హెబ్రీయులకు 9:14వంటి ఇతర వచనాల ద్వారా ఆయన నిత్యుడు అని మనకు అర్థమౌతుంది.

[2] ఉదాహరణకు, యెషయా 55:3, యోహాను 1:12-13, యోహాను 3:36, యోహాను 17:3, 2 కొరింథీయులకు 6:16-18, 1 యోహాను 1:3, ప్రకటన 3:20 చూడండి.

సృష్టికర్తయైన దేవుడు, నీతో నాతో సంబంధం కలిగియుండడానికి ఆశపడుతున్నాడని తెలుసుకోవడం ఎంత అద్భుతం!

► ఒక విద్యార్థి తరగతి కోసం ఆదికాండము 3:8-9 చదవాలి.

ఒక్క క్షణం ఆగి, కళ్లు మూసుకుని, మీరిప్పుడు చదివిన సన్నివేశాన్ని ఊహించుకోండి. ఈ వచనాలను జీవంలోనికి వచ్చినట్లుగా ఊహించుకోండి. ఒక అందమైన తోటలో, సాయంకాలవేళ చల్లగా వీస్తున్న గాలిని ఆస్వాదిస్తూ నిలబడ్డారు. దేవుని అడుగుజాడల శబ్దాన్ని, ఆయనకు ఇష్టమైన ఇద్దరు వ్యక్తులు మౌనంగా ఇచ్చే ప్రతిస్పందనను, ఆపై దేవుడు "ఎక్కడ ఉన్నావు?" అనే ప్రశ్నను కూడా వినండి.

దేవుడు స్త్రీ పురుషునితో సహవాసం చేయడానికి పిలుస్తున్న ఆ క్షణాన్ని మీరు ఊహించగలరా? మళ్ళీ ఆగి, దేవుని హృదయాన్ని గురించి ఆలోచించండి. దేవుడు ఆదాము హవ్వతో అలాగే నీతో, నాతో సహవాసం చేయాలని కోరుతున్నాడు-చూస్తున్నాడు!

మనం మన అవిధేయత ద్వారా దేవునికి దూరమైపోయినా (యెషయా 59:2), దేవుడు ఇంకను సజీవమైన ప్రతి వ్యక్తితో సంబంధం కలిగియుండాలని ఆశిస్తున్నాడు. ఆయన ప్రతి పాపి కోసం వెదకుతున్నాడని లూకా 19:10 చెబుతుంది. "నీవు ఎక్కడ ఉన్నావు?" అని దేవుడు ఇప్పటికీ అడుగుతున్నాడు. యేసు మన కోసం మరణించాడు గనుక, మనం ఆయనతో సరైన సంబంధంలోకి తిరిగి రాగలం (ఎఫెసీయులకు 2:13, 19). ఆయనతో సంబంధం కలిగియుండడానికే నీవు నేను సృజించబడ్డాం.

## మన సృష్టికర్త నిర్మాణం

ప్రేమతో కూడిన, ఉద్దేశపూరితమైన దేవుని సృష్టిని నమ్మనివాళ్లు, తమ వ్యక్తిగత గుర్తింపును, ఉద్దేశ్యాన్ని సృష్టించుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. దేవునితో సంబంధం లేకుండా మానవాళిని సరిగా అర్థం చేసుకోవడం అసాధ్యం. ఈ లోక జ్ఞానాన్ని అనుసరించి నడుస్తూ - మానవ ఆధారిత ఆనందాన్ని కోరేవాడు- జీవితాన్ని నిజంగా అర్థం చేసుకోలేడు.

మన గుర్తింపును (మనం ఎవరు), మన ఉద్దేశ్యాన్ని (మనం ఎందుకు ఉన్నాం), మరియు మనం ఎలా రూపించబడ్డామనే విషయాన్ని నిజంగా అర్థం చేసుకోవాలంటే, మన సృష్టికర్త ఉద్దేశ్యాన్ని తెలుసుకోవాలి, అది పరిశుద్ధ గ్రంథంలో లభిస్తుంది. దేవుడు ముందుగానే మన గుర్తింపును ఏర్పరచాడు; అది మనం సృష్టించుకునేది కాదు. ఆయన మనల్ని ఒక ఉద్దేశంతో సృష్టించాడు, ప్రణాళికతో రూపించాడు. మన జీవితాల్లో, మన సంబంధాల్లో దేవుని ప్రణాళికను అర్థం చేసుకున్నప్పుడే, మనం తగినవారీగా ఉంటూ, ఆయన ఉద్దేశ్యాన్ని నెరవేర్చగలం.

దేవుని స్వరూపంలో సృజించబడడం అంటే, ప్రజలు ప్రత్యేకంగా సంబంధం కోసమే సృజించబడ్డారని అర్థం. దేవుడు సంబంధం కలిగియున్నట్లుగానే, ఆయన మనుష్యుల్ని కూడా సంబంధాలు కలిగి ఉండేలాగా సృజించాడు. మనిషి దేవునితోను, ఇతరులతోను సంబంధం కలిగియుండాలని ప్రతి ఒక్కరికి ప్రాణం, ఆత్మ మరియు శరీరాన్ని దేవుడు ఇచ్చాడు.

**మానవ సంబంధాలకు మన మార్గదర్శిని.**

దేవుడు సంబంధం కోసం ప్రజల్ని రూపించాడనే వాస్తవం, మన సంబంధాలకు కావాల్సిన సూత్రాలు, మార్గదర్శకాలు ఆయన దగ్గర ఉన్నాయని సూచిస్తుంది. ఒక వస్తువును తయారు చేసినవాడు, ఆ వస్తువు నిర్మాణం, రూపకల్పన గురించి, దాన్ని ఉపయోగించాల్సిన విధానం గురించి తెలియజేసే ఒక మాన్యువల్‌ని రాసిస్తాడు. అలాగే, దేవుడు తన వాక్యమైన బైబిలు గ్రంథాన్ని మనకు ఇచ్చాడు, అది మన నిర్మాణం గురించి, మన జీవితాలు, సంబంధాలు సరిగా ఎలా పనిచేస్తాయో అనే విషయం గురించి వివరిస్తుంది.

మానవ సంబంధాల కోసం దేవుడు నియమించిన పాత్రల్ని బైబిలు స్పష్టంగా వివరిస్తుంది. అది భార్యాభర్తలు; తల్లిదండ్రులు, పిల్లలు; అన్నదమ్ములు అక్కచెల్లెళ్లు; తాతమామ్మలు; మిత్రులు; శత్రువులు; పొరుగువారు; ప్రభుత్వం మరియు పౌరులు; యజమానులు మరియు ఉద్యోగులు వీళ్లందరి పాత్రలు గురించి మాట్లాడుతుంది. మన పరిస్థితులు మన పరిసరాలు ఎలా ఉన్నప్పటికీ, దేవుని వాక్యంలోని సూత్రాలు ఆయన మన కోసం రూపించిన నిర్మాణాన్ని మనకు బోధిస్తాయి. మన జీవితంలోని ప్రతి దశలో బైబిలు దేవుని చిత్తాన్ని తెలియజేస్తుంది.

మనుష్యుల సమాజాలు, సంస్కృతులు దేవుని నిర్మాణాన్ని ప్రతిబింబిస్తాయి, కాని పరిపూర్ణంగా కాదు. సంబంధాలన్నిటిలో, పరిస్థితులన్నిటిలో మనుష్యులు సాధారణంగా ఎలా ప్రవర్తిస్తారో సంస్కృతి వివరిస్తుంది. ప్రతి సంస్కృతి వివాహ సంబంధాలు, పిల్లల పెంపకం లాంటి విషయంలో తనదైన విధానాలను కలిగి ఉంది. సంప్రదాయాలు, పర్యావరణం, జన్యుశాస్త్రం, వంటి ముఖ్య విషయాల్లో సంస్కృతులు వైవిధ్యాన్ని చూపిస్తున్నా కాని ప్రతి సంస్కృతిలో ఒక ప్రాథమిక నైతికత ఉంటుంది. ఉదాహరణకు, ప్రతి సంస్కృతిలో వివాహ వ్యవస్థ ఉంటుంది. అయితే, ప్రవర్తన అంతటిని సాంస్కృతిక నియమాల ప్రకారం కాకుండా బైబిలు సూత్రాల ప్రకారం పరిశీలించాలి. మన అధికారం బైబిల్, సంస్కృతి కాదు (రోమా 12:2).

సాంస్కృతిక విషయాలు తటస్థంగా ఉండవు, అవి అలా ఉండాలని మనం ఆశించకూడదు (ఎఫెసీయులకు 2:2). తప్పుడు కోరికలతో, స్వార్థంతో నిండిపోయిన పతనమైన ప్రజల ద్వారా సంస్కృతులు అభివృద్ధి చెందాయి. సమాజానికి కొంత బైబిలు పరిజ్ఞానం ఉండొచ్చు కాని, ఏ సమాజం కూడా దేవుని నియమాలకు అనుగుణంగా ఏది తప్పు ఏది ఒప్పు

అనేదానిపై నిలకడగా ఉండదు. సాంస్కృతికమైనదని దేనిని కూడా సమర్థించకూడదు. కేవలం బైబిలే దేవుని ప్రమాణాన్ని పరిపూర్ణంగా చూపిస్తుంది (కీర్తన 19:7-11).

ఒకవేళ మీరు లిబియా దేశానికి వెళ్లి, అక్కడి ప్రజలు భద్రత గురించి ఆలోచించకుండా వాహనాలు నడపడం చూసినప్పుడు, "అది వాళ్ల సంస్కృతి; వాహనాలు నడిపే ఆ విధానం వాళ్ళకి పని చేస్తుంది" అని అనుకోవచ్చు. అది వాస్తవమే, వాళ్ళు వాళ్ళ సంస్కృతి ప్రకారం, వాహనాలు నడపడం నేర్చుకున్నారు. అయితే, ప్రపంచంలో రోడ్డు ప్రమాదాలు లిబియాలోనే అత్యధికంగా జరుగుతాయి. వాళ్ల ప్రమాద రేటు, అధిక రోడ్డు ప్రమాదాలు జరిగే రెండవ స్థానంలోని దేశం కంటే రెండింతలు ఎక్కువ. స్పష్టంగా చెప్పాలంటే, వాళ్ల సంస్కృతి సురక్షితమైన డ్రైవింగ్ విధానాన్ని అభివృద్ధి చేసుకోలేదు.

జీవితం ఎలా సాగిపోవాలో దేవునికి తెలుసు గనుక నియమాలు ఇచ్చాడు. మనం కేవలం వాటిని పరీక్షించి, ప్రయోగాలు చేయకూడదు. మనకు కావలసిన దానిని ఇచ్చేది మాత్రమే చేయకూడదు. మనకు సంతోషం కలిగిస్తుందని ఆశించే దానిని మాత్రమే చేయకూడదు. మనం సంబంధాల విషయంలో ఖచ్చితంగా దేవుని నిర్మాణాన్ని, విధానాన్ని అనుసరించాలి.

ముఖ్య విషయం ఏంటంటే, దేవుని నియమాలకు లోబడడం మనకే మేలు. దేవుడు మనల్ని ప్రేమిస్తున్నాడు గనుక ఆజ్ఞలను ఇచ్చాడు (ద్వితీయోపదేశకాండము 6:24). వాటిని గైకొనడం ద్వారా, మంచి ఫలితాలు అనుభవిస్తాం, అలాగే అనేక చెడు పర్యవసానాల నుండి తప్పించబడతాం. మనకు ఏది ఉత్తమమో మనల్ని రూపించిన వానికి తెలుసు, గనుక మనం ఆయన ప్రణాళికను అనుసరించినప్పుడు, ఆశీర్వదించబడతాం.

**సంబంధాల విషయంలో దేవునికి లెక్క అప్పజెప్పడం**

► ఇతరులతో మనం ప్రవర్తించే విధానం, దేవునితో మన సంబంధాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

► విద్యార్థులు తరగతి కోసం క్రింద ఇవ్వబడిన ప్రతి వాక్యభాగాన్ని చదవాలి. ఈ మానవ సంబంధాల విషయంలో దేవుడు ఏం కోరుతున్నాడో, విధేయత దేవునితో మనం కలిగియున్న సంబంధంపై ఎలా ప్రభావం చూపుతుందో చర్చించండి. దేవుని నియమాలకు లోబడకపోతే, అది దేవునితో మనకున్న సంబంధాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

| ఇతరులతో మన సంబంధం మరియు దేవునితో మన సంబంధం | | | |
|---|---|---|---|
| లేఖన భాగం | వ్యక్తి/ పాత్ర | మానవ సంబంధాల్లో దేవుడు ఏం కోరుతున్నాడు | దేవునితో సంబంధంపై ప్రభావం |
| 1 పేతురు 3:7 | భర్త | భార్యను అర్థం చేసుకుని, గౌరవించాలి | భర్త ప్రార్థనలకు అభ్యంతరం కలుగదు. |
| ఎఫెసీయులకు 5:22, 24, 33; 1 పేతురు 3:1-6 | భార్య | భర్తకు లోబడాలి | ఈ విధంగా భార్య దేవునికి లోబడుతుంది. దేవుడు ఆమెలోనున్న ఈ వైఖరిని, ప్రవర్తనను గౌరవిస్తాడు. |
| కొలొస్సయులకు 3:20 | పిల్లలు | అన్ని విషయాల్లో తల్లిదండ్రుల మాట వినాలి. | ఈ ప్రవర్తనను ప్రభువు మెచ్చుకుంటాడు. |
| మత్తయి 6:12-15 | అందరూ | మనకు వ్యతిరేకంగా పాపం చేసిన వారిని క్షమించాలి. | దేవుడు మనల్ని క్షమిస్తాడు. |
| రోమా 13:1-5 | అందరూ | భూలోక అధికారులకు లోబడాలి. | ఈ విధంగా దేవునికి లోబడతాం. |
| 1 పేతురు 2:18-20 | పనివాడు | అన్యాయంగా శ్రమపొందినప్పుడు ఓర్పుగా సహించాలి. | పనివాడు దేవుని కృపను పొందుకుంటాడు. |

మనం నైతికత కలిగిన వాళ్ళం, అంటే మంచేదో, చెడేదో తెలిసిన వాళ్ళం. అలాగే మనం తీసుకున్న నిర్ణయాల ద్వారా దేవునికి లెక్క అప్పగించవలసినవారమై ఉన్నాం. ఇది మనకు ఒక గొప్ప సామర్థ్యాన్ని, బాధ్యతను ఇస్తుంది. మనం తీసుకునే నిర్ణయాలు, దేవునితో మనకున్న సంబంధంపై ప్రభావం చూపుతాయి. సంబంధాల విషయంలో దేవుని నియమాలకు లోబడడం అంటే కేవలం సంతోషంగా ఉండడం, జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించడం మాత్రమే కాదు. మనం తీసుకున్న నిర్ణయాల విషయంలో, అలాగే సంబంధాల్లో మనం చూపించే ప్రవర్తన విషయంలో దేవునికి లెక్క అప్పజెప్పాలి (రోమా 14:10, 12).

ఇతరుల పట్ల న్యాయం చూపడానికి, ప్రేమ కనికరాలతో వ్యవహరించడానికి దేవుడు మనల్ని పిలిచాడు (మీకా 6:8). సమస్య ఏంటంటే, ఆదాము చేసిన పాపంవల్ల అతని సంతానమంతా పాప స్వభావంతో పుట్టారు (రోమా 5:12, 19). దీనివల్ల, మనం నిరంతరం ప్రేమించలేం, కనికరించలేం, న్యాయంగా ప్రవర్తించలేం (రోమా 7:15-24). అయితే మనం తిరిగి జన్మించినప్పుడు దేవుని కృప మనల్ని మార్చింది. దేవుడు కోరిన వాటిని నెరవేర్చే కృప పరిశుద్ధాత్ముడు మనకు అనుగ్రహించాడు (రోమా 8:3-4).

### ప్రతి వ్యక్తికున్న విలువ

► విద్యార్థులు తరగతి కోసం యెషయా 44:24, కీర్తన 139:13-16, ఆదికాండము 9:6, మరియు యాకోబు 3:9 చదవాలి. ఈ వాక్యాలు ప్రతి జీవితం యొక్క విలువ గురించి మనకు ఏమి తెలియజేస్తాయి? ఒక వ్యక్తికి విలువను ఇచ్చేది ఏమిటి?

ఇతరులతో ఆరోగ్యకరమైన సంబంధాలు కలిగియుండాలంటే, మనం దేవుడు విలువిచ్చినట్లుగా మనుష్యులకు విలువివ్వాలి. **ప్రతి వ్యక్తి దేవుని స్వరూపంలో సృజించబడ్డాడు గనుక విలువైనవాడు.** ప్రతి వ్యక్తి, అది స్త్రీయైనా లేక పురుషుడైనా, ఆరోగ్యవంతుడైనా లేక రోగియైనా, సంపూర్ణ శరీరంతో ఉన్నా లేక వికలాంగుడైనా, యౌవ్వనుడైనా లేక వృద్ధుడైనా, ధనికుడైనా లేక పేదవాడైనా (సామెతలు 14:31), పుట్టినవాడైనా లేక తల్లి గర్భంలో ఉన్నా; వాళ్ల రంగు ఏదైనా వాళ్ల మానసిక లేక శారీరక సామర్థ్యాలు ఎలా ఉన్నా సరే (నిర్గమకాండము 4:11) వాళ్లు దేవుని ప్రత్యేకమైన సృష్టి.

పెద్దలను మర్చిపోయే, స్త్రీల కంటే పురుషులకు అధిక ప్రాధాన్యత ఇచ్చే లేక పిల్లల్ని భారంగా భావించే సంస్కృతులు ఉన్నాయి. కొన్ని సంస్కృతుల్లో, వికలాంగుల్ని శాపంగా భావించి, వాళ్లని సమాజంలో నుండి తిరస్కరిస్తారు లేక దాచిపెడతారు. ప్రపంచమంతటిలో జాత్యహంకారం సర్వసాధారణం: ఒక తెగ లేక ఒక జాతి వాళ్లని వాళ్లు ఉన్నతంగా భావించుకుని, మిగిలినవాళ్లని అవమానిస్తారు. ఇలాంటి ప్రతి క్రియ, దేవుని సృష్టి అంతటిలో శ్రేష్ఠులైన మనుష్యుల్ని అగౌరవపరుస్తుంది. దేవుణ్ణి-మహిమపరచే సంబంధాలు, ఆరోగ్యకరమైన సంబంధాలు కలిగి ఉండాలంటే, మొదట ప్రజలందర్ని దేవుని స్వరూపులుగా భావించాలి.

### దేవుని కోసం, ఇతరుల కోసం సృజించబడడం

దేవుడు సమస్తాన్ని తన కోసమే సృష్టించుకున్నాడని ప్రకటన 4:11 తెలియజేస్తుంది. అందులో ఖచ్చితంగా మానవాళి ఒక భాగం. దేవుడు మనల్ని తన కోసమే సృష్టించాడు. మనం ఏది చేసినా అది దేవుని మహిమ కోసమే చెయ్యాలి (1 కొరింథీయులకు 10:31, 1 పేతురు 2:12). మనం ఇతరుల ప్రయోజనం కోసం కూడా సృజించబడ్డాం.

**మనం ఇతరులతో కలిసి పనిచేస్తూ దేవుని ఉద్దేశాలు నెరవేర్చాలని ఆయన మనల్ని సృజించాడు.** వివాహం, ప్రజలు కలిసి పనిచేయడానికి దేవుడు రూపొందించిన ఒక ఉదాహరణ. దేవుడు మొదటి మానవుని చేసిన వెంటనే, “నరుడు ఒంటరిగా నుండుట మంచిది కాదు; వానికి సాటియైన సహాయమును వానికొరకు చేయుదుననుకొనెను” (ఆదికాండము 2:18). కొన్ని ముఖ్యమైన విషయాల్లో స్త్రీ పురుషుడు సమానంగా ఉంటారు, కాని మరికొన్ని ముఖ్యమైన విషయాల్లో భిన్నంగా ఉంటారు. వాళ్లిద్దరు కలిసి దేవుని ఉద్దేశ్యాల్ని నెరవేర్చగలరు. దేవుడు వాళ్లు చేయవలసిన పనిని – కలిసి చేసే పనిని - వాళ్లకు అప్పగించాడు (ఆదికాండము 1:26-28).

ప్రజలు కలిసి పనిచేసే విషయంలో దేవుని నిర్మాణాన్ని, నమూనాను చూపించగల మరొక ఉదాహరణ, సంఘం. అపొస్తలుడైన పౌలు శరీర అవయవాల దృష్టాంతాన్ని ఉపయోగించాడు (1 కొరింథీయులకు 12:12-26). ఒక వ్యక్తి, ఒంటరిగా దేవుని ఉద్దేశాన్ని నెరవేర్చగలనని లేక తనకు ఇతరుల అవసరం లేదని అనుకోకూడదు. ప్రజలు కలిసి పని చేయాలని దేవుడు చూపించిన అనేక ఉదాహరణలలో సంఘం, వివాహం కేవలం రెండు ఉదాహరణలు మాత్రమే.

**మనం ఇతరులకు పరిచారం చేయడానికి సృజించబడ్డాం** (గలతీయులకు 5:13-14). ఇతరులతో ప్రేమగల సంబంధాలు కలిగియుండడానికి, ఇతరుల ప్రయోజనం కోసం మనల్ని మనం అప్పగించుకోవడానికి సృజించబడ్డాం.

► విద్యార్థులు తరగతి కోసం సామెతలు 17:17, గలతీయులకు 6:2, మరియు ఫిలిప్పీయులకు 2:4 చదవాలి.

దేవుడు మనల్ని తనకోసం, ఇతరుల కోసం సృష్టించాడు. దేవుడు వాక్యంలో దేవుడు మన నుండి ఆశించే ప్రతిదీ, ఆయనతో మనకున్న సంబంధం గురించి లేక ఇతరులతో మనకున్న సంబంధం గురించి లేక రెండు సంబంధాల గురించి మాట్లాడుతుంది. నిజానికి, దేవుడు మన నుండి ఆశించేవన్నీ, దేవుణ్ణి పరిపూర్ణంగా ప్రేమించడం, అలాగే మనవలె మన పొరుగువారిని ప్రేమించడం అనే ఆజ్ఞలో సంగ్రహించబడ్డాయని యేసు చెప్పాడు.

► ఒక విద్యార్థి తరగతి కోసం మత్తయి 22:36-39 చదవాలి.

మనం దేవుని కోసం, ఇతరుల కోసమూ సృజించబడ్డాం; ఈ వాస్తవాలకు పరస్పర సంబంధం ఉంది. మనం దేవుణ్ణి మహిమపరచి, ఆయన స్వరూపాన్ని ప్రతిబింబించే ప్రధానమైన విషయాలలో ఇతరులతో మనకున్న సంబంధాలు కూడా ఒకటి. దేవుని గుణం, ఆయన కార్యాలు మనం ఆయనలాగే ఉండాలని పిలుపునిస్తాయి (1 పేతురు 1:16, మత్తయి 5:48). అందరు దేవుని స్వరూపంలో చేయబడ్డారు, కాని మనం ఆయన వ్యవహరించినట్లుగా వ్యవహరించగలిగినప్పుడే దేవుని స్వభావాన్ని ప్రతిబింబించగలం.

అవసరతలో ఉన్నవాళ్ళపై కనికరం చూపినప్పుడు, అతను చూపిన కనికరం దేవుడు చూపిన కనికరాన్ని పోలి ఉంటుంది, అతని దయగల కార్యం దేవుని పనిని పోలి ఉంటుంది. కనికరం చూపేవాడు విశ్వాసియైనా లేక అవిశ్వాసియైనా, ఇది వాస్తవం. అయితే, దేవునితో మనం సమాధానపరచబడినప్పుడు, ఆయన ఆత్మ మనలో పని చేస్తున్నప్పుడు, అత్యుత్తమంగా దేవుని పోలి నడుచుకోగలం.

► ఒక విద్యార్థి తరగతి కోసం 2 పేతురు 1:2-11 చదవాలి.

దేవునిని వెంబడించే ప్రతి ఒక్కరి విషయంలో ఆయన కలిగియున్న అద్భుతమైన ప్రణాళికను ఈ వాక్యభాగం వివరిస్తుంది. ఈ వాక్యభాగం నుండి మనం ఈ విషయలను నేర్చుకుంటాం:

1. ఆయన మహిమనుబట్టి, గుణాతిశయాన్ని బట్టి, యేసు మనల్ని పిలిచాడు, అద్భుతమైన వాగ్దానాలు దయచేశాడు (వచనాలు 3-4).
2. ఈ వాగ్దానాల ద్వారా, క్రీస్తును ఎరిగినవారు దైవస్వభావం కలిగియుంటారు (వచనం 4).
3. తండ్రియైన దేవునితో, యేసుతో సంబంధం కలిగి ఉండడం ద్వారా, జీవానికి, భక్తికి కావాల్సిన ప్రతిదీ మనం కలిగియుంటాం (వచనం 3).
4. ఈ విషయాల ద్వారా, మనం యేసు జీవించినట్లుగా జీవిస్తాం, దేవుడు పిలిచిన పిలుపుకు తగినట్లుగా జీవిస్తాం (వచనాలు 5-8).

► మన సంబంధాల్లో దేవుని స్వభావాన్ని, ఆయన గుణాన్ని ప్రతిబింబించడం ఎలా సాధ్యమౌతుంది?

► ఒక విద్యార్థి తరగతి కోసం 2 కొరింథీయులకు 4:4 చదవాలి. దేవుని పరిపూర్ణ ప్రతిరూపం ఎవరు?

► ఒక విద్యార్థి తరగతి కోసం 2 కొరింథీయులకు 3:18 చదవాలి.

పరిశుద్ధాత్ముడు, ప్రభువు మహిమను అధికంగా ప్రతిబింబించేలా విశ్వాసుల్ని మారుస్తాడు. యేసుని చూస్తూ, మనం మన వైఖరుల్లో ప్రవర్తనల్లో ఆయన పోలికగా మార్చబడతాం. సువార్తకు ఉన్న గొప్ప శక్తి ఇదే. తండ్రియైన దేవుడు, యేసు మరియు పరిశుద్ధాత్మ శక్తి ద్వారా, మనం దేవుని గుణాన్ని ప్రతిఫలిస్తూ, ఆయన్ను అనుసరించగలుగుతాం.

ఇతరులతో మనకున్న సంబంధాల్లో, ఆయన్ను పోలి నడుచుకోవాలని దేవుడు మనల్ని పిలుస్తున్నాడు (ఎఫెసీయులకు 5:1). పిల్లవాడు తన తల్లిదండ్రుల్ని లేక తన అన్నల్ని, అక్కల్ని చూసి నేర్చుకున్నట్లే, మనం

ఇతరులతో వ్యవహరించేడప్పుడు యేసు మాదిరిని చూసి, ఆయన వైఖరులు, అభిప్రాయలు, క్రియల్ని పోలి నడుచుకోవాలి (ఫిలిప్పీయులకు 2:5-7, ఎఫెసీయులకు 5:2).

► విద్యార్థులు తరగతి కోసం క్రిందనున్న ప్రతి వాక్యభాగాన్ని చదవాలి. రెండు విషయాలను గమనించాలి (1) దేవుని గుణం లేక కార్యం మరియు (2) దేవుడు మన నుండి ఏం ఆశిస్తున్నాడు. (మొదటి రెండు వాక్యభాగాలకు నోట్సు ముందుగానే ఉదాహరణగా ఇవ్వబడింది. ఈ పాఠం ముగింపులో, అభ్యాసం 2 ఈ అధ్యయనానికి కొనసాగింపుగా పనిచేస్తుంది.)

| **మానవ సంబంధాలు దేవుని మహిమను ఎలా ప్రతిబింబిస్తాయి** | | |
|---|---|---|
| **లేఖనభాగం** | **దేవుడు ఏం చేశాడు/క్రీస్తు ఏం చేశాడు** | **దేవుని ప్రతిబింబించే మన కార్యం** |
| ఫిలిప్పీయులకు 2:3-8 | ఆయన హక్కులు విడిచిపెట్టాడు.<br>దాసుడయ్యాడు.<br>సంపూర్ణ విధేయత చూపి, తగ్గించుకున్నాడు. | మన హక్కులు విడిచిపెట్టాలి.<br>ఇతరుల కార్యాలపై దృష్టిపెట్టాలి.<br>విధేయులవ్వాలి. |
| యోహాను 13:3-5, 12-15 | తన శిష్యులకు పరిచారం చేశాడు, రోజువారీ అవసరత తీర్చాడు. | ఇతర విశ్వాసులకు పరిచారం చెయ్యాలి. |
| ఎఫెసీయులకు 4:32-5:2 | | |

మనలో ఎవ్వరు దేవుని ప్రేమను స్వాభావికంగా చూపలేరు ఎందుకంటే మనందరం స్వార్థ పూరిత స్వభావంతో పుట్టాం. అయితే, దేవుడు తన స్వభావం, నిర్మాణంలోనికి పునఃస్థాపించడానికి కృపను మనకు అనుగ్రహించాడు. ఒక వ్యక్తి, వినయంగా అప్పగించుకుంటానని చేసే ఒక చిన్న ప్రార్థన ఈ అద్భుతమైన మార్పుకు నడిపిస్తుంది.

## ముగింపు

దేవుడు తన ప్రజల్ని సంబంధాల కోసం: ఆయనతో, ఇతరులతో సంబంధం కలిగియుండడం కోసం ప్రేమతో రూపించాడని బైబిల్ స్పష్టంగా చెప్తుంది.

దేవుడు ప్రజల్ని సృజించి, సంబంధాల కోసం రూపించాడు, గనుక మనం:

1. మన సంబంధాల్లో ఆయన దృక్కోణాన్ని పొందాలి.
2. మన సంబంధాల్లో తీసుకునే నిర్ణయాల విషయంలో ఆయనకు లెక్క అప్పజెప్పవలసినవారమని గుర్తించాలి.
3. మన సంబంధాల్లో ఆయన ప్రణాళికను అంగీకరించి, దాన్ని అనుసరించాలి.

ఈ కోర్సు అధ్యయనం, ఈ విషయాలు పాటించడానికి మీకు సహాయపడుతుంది అలాగే మానవ సంబంధాల్లో దేవుని చిత్తం ఏంటో ఇతరులకు బోధించడానికి మిమ్మల్ని సిద్ధం చేస్తుంది.

## సమూహ చర్చ కోసం

► మానవ సంబంధాల్లో, సంస్కృతి అనేది ఒక మార్గదర్శినిగా ఎందుకు చాలదు?

► ఈ పాఠంలో మీకు కొత్తగా అనిపించిన అంశం ఏమిటి? అది ఎందుకు ముఖ్యమైనది? దానిని అర్థం చేసుకోవడం మీ సంబంధాలలో ఎలా సహాయపడుతుంది? దానిని అర్థం చేసుకోవడం మీ పరిచర్యపై ఎలా ప్రభావం చూపుతుంది?

► ఈ కోర్సు అధ్యయనం ద్వారా మీరు ఏ విధంగా ఎదగాలని ఆశపడుతున్నారు?

## ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ,

నన్ను ఒక ఉద్దేశ్యంతో, నీ స్వరూపంలో సృజించినందుకు వందనాలు.

నీతో సంబంధం కలిగియుండేలా నన్ను రూపించినందుకు అలాగే నా పాపాల నిమిత్తం యేసు మరణం ద్వారా దాన్ని సాధ్యపరచినందుకు వందనాలు.

ఇతరులతో ఎలా సంబంధం కలిగి ఉండాలో, దాని ద్వారా నిన్నెలా మహిమపరచాలో నాకు బోధించే నీ వాక్యపు నిధిని బట్టి కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.

నీ వాక్యం ద్వారా, నీ ఆత్మ ద్వారా, నా పట్ల నీ ప్రణాళికను అంగీకరించడం నాకు నేర్పించు.

ఇతరులు నీ దగ్గరకు వచ్చి, నిన్ను తెలుసుకొనునట్లు, నా చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరితో నిన్ను పోలి నడుచుకోవడానికి సహాయం చెయ్యి.

ఆమెన్

## పాఠం అభ్యాసాలు

(1) దేవుని స్వరూపంలో సృజించబడ్డారనే సత్యం, ప్రతి వ్యక్తికి ఎలా విలువిస్తుందో, దాన్ని తిరస్కరించడం ద్వారా మనుష్యులు తమ విలువను ఎలా కోల్పోతారో వివరించండి?

(2) క్రింద ఇవ్వబడిన పట్టికలో, ప్రతి వాక్యభాగాన్ని చదవండి. ఈ రెండు విషయాలపై నోట్స్ రాయండి (1) దేవుని గుణం లేక పని మరియు (2) దేవుడు మన నుండి ఏం ఆశిస్తున్నాడు.

(3) అభ్యాసం 2లో పట్టికను, అలాగే పాఠం చివర్లో ఇవ్వబడినదాన్ని చూస్తూ, మీ జీవితాన్ని పరీక్షించుకోవడానికి సమయం కేటాయించండి:

- నీవు ప్రస్తుతం దేవుణ్ణి గౌరవించి, మహిమపరిచే విధంగా ఆయన స్వరూపాన్ని ప్రతిబింబిస్తున్నావా?
- మీ జీవితం స్పష్టంగా మరింత శక్తివంతంగా దేవుని ప్రణాళికకు అనుగుణంగా ఉండడానికి, మీరు ఒప్పుకుని విడిచిపెట్టవలసిన అవిధేయత ఏదైనా ఉందా?
- యేసు పోలికలోకి మారడానికి మీరు ఏ విషయాలు పాటించాలని దేవుడు ఆశిస్తున్నాడు?

ఈ అధ్యయనానికి ప్రతిస్పందనగా ఒక పేరా ప్రార్థన రాయండి. (దీన్ని మీ తరగతి నాయకుడితో పంచుకోనవసరం లేదుగాని, కేవలం అభ్యాసం చేశారని రిపోర్ట్ ఇవ్వొచ్చు.)

| మానవ సంబంధాలు దేవుని మహిమను ఎలా ప్రతిబింబిస్తాయి | | |
|---|---|---|
| **లేఖనభాగం** | **దేవుడు ఏం చేశాడు/క్రీస్తు ఏం చేశాడు** | **దేవుని ప్రతిబింబించే మన కార్యం** |
| కీర్తన 68:5; యాకోబు 1:27 | | |
| 2 పేతురు 3:9; తీతుకు 3:1-5 | | |
| మత్తయి 5:43-48,<br>1 థెస్సలొనీకయులకు 5:14-15 | | |
| యోహాను 13:1, 34;<br>1 యోహాను 4:7-8, 11-12 | | |

# పాఠం 2

# వాక్యానుసారమైన కుటుంబం

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) వివాహ వ్యవస్థ, త్రిత్వంలోని సంబంధాల్ని ఎలా ప్రతిబింబించాలో అర్థం చేసుకోవాలి.

(2) పిల్లల్ని కలిగి ఉండడంపై దేవుని దృకోణాన్ని అంగీకరించాలి.

(3) పతనం, వైవాహిక జీవితాన్ని, కుటుంబ సంబంధాల్ని ఎలా ప్రభావితం చేసిందో గ్రహించాలి.

(4) మనుష్యుల లోపాలున్నా కూడా, దేవుని రక్షణ ప్రణాళిక ఎలా నెరవేరిందో తెలుసుకోవాలి.

(5) దేవుని ప్రణాళికకు లోబడడంవల్ల ఏ కుటుంబమైనా ఆయన కృపను, స్వస్థతను అనుభవించగలదని గ్రహించాలి.

## కుటుంబ సంబంధాల ప్రభావాలు

ఈ కోర్సులో, మనం ప్రధానంగా ఒకే గృహంలో నివసించే కుటుంబాలను గురించి నేర్చుకుంటాం. ఒక ఇంట్లో అనేక రకాల ప్రజలు కలిసి నివసిస్తూ ఉంటారు. వాటిని మనం కుటుంబాలు అంటాం. తల్లి లేక తండ్రి ఒక్కరు మాత్రమే ఉన్న కుటుంబాలు, విడాకులవల్ల విడిపోయిన కుటుంబాలు, రెండవ వివాహంవల్ల కలిసిన కుటుంబాలు, దత్తతకు తీసుకున్న పిల్లలతో ఉన్న కుటుంబాలు, బహుళ తరాలుగల కుటుంబాలు, అలాగే తాత్కాలికంగా అదనపు పిల్లల్ని లేక పెద్దలకు ఆతిథ్యమిస్తున్న కుటుంబాలు ఉన్నాయి.

కుటుంబం అంటే ఏమిటి అనే దానిపై మనకంటూ ఒక ఆలోచన ఉంటుంది. కుటుంబం గురించిన చర్చలు మన వ్యక్తిగత అనుభవాలను బట్టి మనలో వివిధ రకాల భావోద్వేగాలను కలిగిస్తాయి.

### బాల్యం మనల్ని ఎలా ప్రభావితం చేస్తుంది

మీరు మీ బాల్యం గురించి అద్భుతమైన జ్ఞాపకాలను కలిగి ఉండవచ్చు. లేక చిన్నతనంలో ఎదుర్కొన్న అనుభవాలను బట్టి మీరు కోపంతో ఇబ్బందిపడుతూ ఉండొచ్చు. మీ కుటుంబ సభ్యులు ఒకరికొకరు సహాయం చేసుకుంటూ, ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ఉండొచ్చు లేక ఒకరినొకరు పట్టించుకోకుండా దూరంగా ఉంటూ, కలిసినప్పుడు

గొడవలు పడుతూ ఉండొచ్చు. మీ జీవితానికి మీ కుటుంబమే ఒక గొప్ప ఆధారమని మీరు అనుకోవచ్చు, లేక ఎప్పుడు బయటపడదామా అని అనుకునే ఒక చెరసాలగా ఉందని అనుకోవచ్చు. మీ కుటుంబం కంటే మంచిగానున్న మరో కుటుంబాన్ని చూసినప్పుడు, మీ వైఫల్యానికి మీ కుటుంబమే కారణమని అనుకోవచ్చు.

మన కుటుంబాల్ని గురించి మన అవగాహన చాలా ముఖ్యం ఎందుకంటే జీవితం పట్ల, దేవుని పట్ల మనకున్న అవగాహనను అది ప్రభావితం చేస్తుంది. దేవుడు తన ప్రజలకు తండ్రిగా ఉన్నాడని బైబిలు చెబుతుంది. మన తల్లిదండ్రులతో-ముఖ్యంగా మన తండ్రులతో-మనకున్న సంబంధం, పరలోకపు తండ్రి గురించి మనలో ఒక అవగాహనను ఏర్పరుస్తుంది. ఒకవేళ మనకు శారీరక తండ్రి లేకపోతే, అతడు క్రూరుడైతే, పట్టించుకోకపోతే, కఠినుడైతే, మోసగాడైతే, పనిచేయని వాడైతే, లేక ఏ విధంగానైనా బాధించేవాడైతే, తండ్రియైన దేవుని గురించి మన ఆలోచన సరిగా ఉండకపోవచ్చు. మనం ఆయన వాక్యం ద్వారా, యేసు జీవితం ద్వారా, ఆయనతో మన వ్యక్తిగత సంబంధం ద్వారా దేవుణ్ణి తెలుసుకునే వరకు, ఆయన్ని మంచి తండ్రిగా చూడడం కష్టంగా ఉంటుంది. ఆయన నిజంగా ఒక మంచి తండ్రిగా, తన పిల్లల్ని కాపాడతాడు, వాళ్ళకి కావాల్సింది ఇస్తాడు. ఆయన తన పిల్లల మాట వింటాడు, వాళ్ళతో మాట్లాడతాడు, వాళ్లని నడిపిస్తాడు, వాళ్ల శ్రేయస్సు కోరతాడు. మనం దేవుణ్ణి తెలుసుకునేకొద్దీ, ఆయన పట్ల మన అవగాహనను సరిచేసుకోవడానికి దేవుడు సహాయం చేస్తాడు.[3]

### ఆత్మీయ భిన్నతలు మనల్ని ఎలా ప్రభావం చేస్తాయి

క్రీస్తును వెంబడించడంవల్ల కొంతమంది తమ కుటుంబీకుల నుండి తిరస్కరణ ఎదుర్కొంటారు. మనం ఆయన పట్ల విశ్వాసం వల్ల అవిశ్వాసులైన కుటుంబీకుల నుండి హింసలు ఎదుర్కోవలసి వస్తుందని యేసు చెప్పాడు. అనేక ప్రదేశాల్లోని విశ్వాసులు, క్రీస్తును అంగీకరించని తమ కుటుంబీకుల ద్వారా తిరస్కరణ, అవమానం, నిందలను భరిస్తున్నారు లేక చంపబడుతున్నారు.

► ఒక విద్యార్థి మత్తయి 10:21-22, 28, 32-39 చదవాలి. ఈ వచనాలు చదివిన తర్వాత, క్రింది ప్రశ్నలను చర్చించాలి:

- ఈ వాక్యభాగం ప్రకారం, విశ్వాసులు ఏం ఆశించాలి?
- ఇక్కడ ఏ వాగ్దానాలు ఉన్నాయి?
- విశ్వాసులు, హింస గురించి ఎలా ఆలోచించాలి?

---

[3] దేవుని గురించిన అవగాహనను ఎలా పునరుద్ధరించుకోవాలో తెలుసుకోవాలంటే, Shepherds Global Classroom నుండి *Spiritual Formation* 4వ పాఠం చూడండి.

మనలో మరికొంతమంది తమ కుటుంబీకుల ద్వారా హింస ఎదుర్కోకపోయినా, వారి విశ్వాసం కారణంగా సంబంధాల్లో సమస్యలను ఎదుర్కోవచ్చు. విశ్వాసులుగా మన జీవన విధానం మన కుటుంబీకుల జీవన విధానం కంటే భిన్నంగా ఉంటుంది కాబట్టి, మన కుటుంబ బాంధవ్యాలు వికృతంగా, దూరంగా లేక పరిమితంగా ఉండొచ్చు. మనల్ని అపార్థం చేసుకోవచ్చు లేక అగౌరవపరచవచ్చు. బంధువులు మన పరిచర్యను అడ్డుకోవడానికి ప్రయత్నించవచ్చు. యేసు కూడా ఇలాంటి సమస్యలు ఎదుర్కొన్నాడు (మార్కు 3:21, యోహాను 7:3, 5) కాబట్టి మనకు ఇలా జరిగినప్పుడు, ఆశ్చర్యపోకూడదు.

## మీరు, మీ కుటుంబం

కొద్ది నిమిషాల్లో, మీరు మీ తోటి విద్యార్థులకు మిమ్మల్ని పరిచయం చేసుకుంటారు, కాని మీ పేరు ఒక్కటే కాకుండా మీ కుటుంబంలో మీరు ఎవరో కూడా పంచుకుంటారు.

మొదటిగా, మీరు మీ కుటుంబంలో కుమారుడు లేక కుమార్తె, భార్య లేక భర్త, తల్లి లేక తండ్రి, అత్త లేక మామయ్య, అమ్మమ్మ లేక తాతయ్య వంటి విభిన్న హోదాలో, దేనిని కలిగియున్నారో ఆలోచించాలి. అదనంగా ఉండే హోదాల గురించి ఆలోచించగలరా? బహుశా మీరు అనేక హోదాలను కలిగి ఉండవచ్చు.

మీ కుటుంబంలో మీకున్న ఇతర బాధ్యతలు లేక స్థానాలు ఏంటి? మీరు పెద్దవాళ్ళా లేక చిన్నవాళ్ళా? ఆర్థిక విషయాలు చూసుకుంటారా? ఇంటి పనులు చూసుకుంటారా? వృద్ధుల్ని లేక వికలాంగుల్ని చూసుకుంటారా? మీ కుటుంబంలో మీకున్న ఇతర పాత్రలు, బాధ్యతల గురించి ఆలోచించండి.

► మీ కుటుంబంలో మీకున్న పేర్లు, పాత్రలు పేర్కొంటూ, తోటి విద్యార్థులకు మిమ్మల్ని మీరు పరిచయం చేసుకోండి.

► ఇప్పుడు, మీ హోదాలు, బాధ్యతలు (1) మిమ్మల్ని మీరు చూసుకునే విధానాన్ని (2) మీరు మీ కుటుంబీకుల్ని చూసే విధానాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో ఆలోచించండి.

మీ సొంత కుటుంబం గురించి లేక మీ బంధువులు గురించి మీరేమి అనుకున్నప్పటికీ, వాళ్లు మీ వాళ్ళే. మీ కుటుంబం చిన్నాభిన్నమై, గాయాలు బాధలు అనుభవిస్తూ ఉండొచ్చు. మీరు పరిపూర్ణంగా ఉన్నారని ప్రజలు మీ కుటుంబాన్ని చూసి అసూయపడవచ్చు: మీకు మంచి వివాహ జీవితం కలిగి ఉండవచ్చు, తెలివైన, ఆరోగ్యకరమైన పిల్లలు, ప్రేమ, శాంతి, నవ్వులతో నిండిన కుటుంబం ఉండవచ్చు.

**మీ కుటుంబం బలహీనంగా ఉన్నా, బలంగా ఉన్నా, దేవుడు మీ కుటుంబం పట్ల శ్రద్ధ కలిగి, దానిని పట్టించుకుంటాడు. మీ కుటుంబం పట్ల ఆయనకు ఒక ప్రణాళిక ఉంది.**

► మీ కుటుంబ సభ్యుల పేర్లు రాయండి (కనీసం 3-4 తరాల కుటుంబ సభ్యులు). ఉదాహరణకు, మీ తాత అమ్మమ్మల పేర్లు (మొదటి తరం), మీ తల్లిదండ్రుల పేర్లు (రెండవ తరం), మీ పేరు, మీ తోబుట్టువుల పేర్లు (మూడవ తరం), మీ పిల్లల పేర్లు లేక మేనల్లుడు మేనకోడల్ల పేర్లు (నాల్గవ తరం).

మీకు ఎవరితో సన్నిహిత సంబంధం, మంచి సంబంధం ఉందో వాళ్ల పేర్ల ముందు నక్షత్రం గుర్తు గీయండి. ఎవరితో తక్కువ సంబంధం ఉందో వాళ్ల పేర్ల ముందు త్రికోణం గుర్తు గీయండి, మరియు ఏ కారణం చేతైనా సంబంధం పోగొట్టుకున్న వాళ్ల పేర్ల ముందు చతురస్రం గుర్తు గీయండి.

మీకు రక్తసంబంధం లేకపోయినా కుటుంబ సభ్యుల్లా భావించే వాళ్లు ఎవరైనా ఉన్నారా: కుటుంబ సభ్యుల్లాగా ప్రతి కుటుంబ సమావేశాల్లో, వేడుకల్లో పాల్గొనేవారు? వాళ్ల పేర్లు రాసి, ఆ పేర్ల చుట్టూ గుండ్రంగా గీయండి.

## మొట్టమొదటి మానవుని కుటుంబం

► ఆదాము, హవ్వ మరియు అబ్రాహాము శార జీవితాలు అధ్యయనం చేస్తుండగా మీ బైబిల్లో ఆదికాండము పుస్తకం తెరచి ఉంచండి.

### మొట్టమొదటి వివాహం

ఆదాము హవ్వలు, మొట్టమొదటి కుటుంబంగా ఉన్నారు: ఒక భర్త, ఒక భార్య మరియు ఒక పురుషుడు ఒక స్త్రీ వివాహంలో జతపరచబడ్డారు. మొదటి వివాహంలో, "నా యెముకలలో ఒక యెముక నా మాంసములో మాంసము ఇది నరునిలోనుండి తీయబడెను గనుక నారి అనబడును" (ఆదికాండము 2:23) అని ఆదాము పేర్కొన్నాడు.

తర్వాత వచనం, బైబిలు ప్రకారమైన వివాహాన్ని నిర్వచిస్తుంది: "కాబట్టి పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారు ఏక శరీరమైయుందురు" (ఆదికాండము 2:24). క్రొత్త నిబంధన గ్రంథంలో, మత్తయి 19:5 మరియు ఎఫెసీయులకు 5:31లో ఇవే మాటలు పునరావృతమౌతాయి. **భార్యభర్తలు ఏకశరీరమవ్వడం అనేది స్థిరమైన నిబద్ధత, అంటే అది జీవితకాలం ఉంటుందని దేవుని యెదుట, మానవుని యెదుట ప్రమాణం చేయడం.**

> వివాహం అనేది మూడు విధాల అద్భుతం. ఇద్దరు వ్యక్తులు ఏకశరీరమయ్యే జీవసంబంధ అద్భుతం; రెండు కుటుంబాలు కలిసిపోయే సామాజిక అద్భుతం; క్రీస్తుకు, వధువు సంఘానికి మధ్య ఐక్యతను ప్రతిబింబించే ఆత్మీయ అద్భుతం.[4]

[4] *The Woman's Study Bible*, (Thomas Nelson, Inc., 1995), 9.

## వివాహం, త్రిత్వంలోని సంబంధాల్ని ప్రతిబింబిస్తుంది

> "వివాహం.....నిబంధన కర్తగా, నిబంధనను పాటించేవ్యక్తిగా దేవుని గుణాన్ని వెల్లడి చేస్తుంది. నిబంధనలో, కీలకమైన విషయాలు భావోద్వేగం కాదుగాని విశ్వసనీయత, యదార్థత."
> - Robertson McQuilkin,
> *An Introduction to Biblical Ethics*

వివాహం, దేవుని గుణాన్ని ఆయన సంబంధాల్ని ప్రతిబింబించేలా రూపొందించబడింది. తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు, పరిశుద్ధాత్ముడైన దేవుడు నిరంతరం పరస్పర సంబంధం కలిగియున్నారు, కలిగియుంటారు. ప్రతి ఒక్కరు ప్రత్యేకమైన బాధ్యతలు కలిగి ఉన్నప్పటికీ, త్రిత్వంలోని ముగ్గురు వ్యక్తులు నిత్యం ఏకమై ఉన్నారు, ఒకే స్వభావాన్ని కలిగియున్నారు. త్రిత్వంలోని ముగ్గురు వ్యక్తుల మధ్యగల సంబంధంలో, ఐక్యత, నమ్మకం, స్థిరమైన ప్రేమను మనం చూస్తాం. ఈ అద్భుతమైన సంబంధానికి అనుగుణంగా వివాహ బంధం ఏర్పాటు చేయబడింది. భార్యభర్తలు తమ ప్రేమ విషయంలో, సమర్పణకలిగి ఉండే విషయంలో జీవితాంతం పవిత్రంగా ఉండాలని దేవుడు ప్రణాళిక కలిగియున్నాడు.

మానవుని వైవాహిక బంధం ఈ విషయాల్లో త్రిత్వంలోని సంబంధాల్ని ప్రతిబింబించాలి:

1. వివాహం అంటే భాగస్వామితో జీవితాంతం నమ్మకంగా స్థిరమైన బంధం కలిగియుండడం.
2. వివాహం అంటే నిస్వార్థమైన ప్రేమ బంధం.
3. వివాహం అంటే ఫలభరితమైన బంధం.

## మొదటి ఆజ్ఞ

దేవుడు తానే చేసిన మొదటి వివాహంలో,

> దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా—మీరు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి; సముద్రపు చేపలను ఆకాశపక్షులను భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను (ఆదికాండము 1:28).

బైబిల్లో దేవుడు ఇచ్చిన మొదటి ఆజ్ఞ, ఫలించి అభివృద్ధి పొంది, విస్తరించడం. **వివాహ బంధం, త్యాగపూరితమైన ప్రేమతో కూడిన ఫలప్రదమైన సంబంధంగా ఉండాలి.** భార్యభర్తలు *కలిసి* దేవుని సృజనాత్మక పనిని కొనసాగిస్తూ, నూతన జీవితాల్ని కుటుంబ బంధంలోకి తీసుకొస్తారు గనుక వైవాహిక జీవితంలో పిల్లల్ని కనడం సృష్టికర్తను మహిమపరుస్తుంది. ఎంత గొప్ప భాగ్యం, ఎంత గొప్ప బాధ్యత!

► ఒక విద్యార్థి తరగతి కోసం కీర్తన 127:3-5 చదవాలి. ఈ వాక్యభాగం, పిల్లలు గురించి వివరించడానికి పదచిత్రాలను, సాదృశ్యాలను ఉపయోగిస్తుంది. పదచిత్రాలు అంటే ఏంటి? ఈ పదచిత్రాల ఆధారంగా, మనం మన పిల్లలు గురించి ఎలా ఆలోచించాలి?

పిల్లలు బహుమానమని, విలువైన స్వాస్థ్యమని బైబిలు చెబుతుంది. వాళ్లని, కేవలం లైంగిక సంబంధం ద్వారా పుట్టినవారిగా భావించకూడదు. ఒక శిశువును గర్భం ధరించిన పరిస్థితులు కోరుకున్నవైనా లేదా నీతియుక్తమైన, జీవాన్నిచ్చే దేవుడు ప్రతి శిశువును ఉద్దేశ్యపూర్వకంగానే గర్భంలో ఉంచాడు, పుట్టించాడు. నిన్ను నన్నూ కూడా అలాగే సృజించాడు. ఒకరి పుట్టుక పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ కూడా దేవుడు ప్రతి వ్యక్తిని ఒక ఉద్దేశ్యంతో చేశాడు.

అవును, పిల్లలు దేవుడిచ్చు బహుమానం, అయితే వాళ్లు తల్లిదండ్రులు దేవునికిచ్చే బహుమానంగా కూడా ఉన్నారు.

> కొంచెముగానైనను దైవాత్మనొందినవారిలో ఎవరును ఈలాగున చేయలేదు; ఒకడు చేసినను ఏమి జరిగెను? దేవునిచేత సంతతి నొందవలెనని అతడు యత్నము చేసెను గదా; కాగా మిమ్మును మీరే జాగ్రత్త చేసికొని, యౌవనమున పెండ్లిచేసికొనిన మీ భార్యల విషయములో విశ్వాసఘాతకులుగా ఉండకుడి (మలాకీ 2:15).

పిల్లలు ఒక పవిత్రమైన నమ్మకం (పవిత్రమైన బాధ్యత). తల్లిదండ్రులు తన ఉద్దేశాల్ని నెరవేర్చడానికి పిల్లల్ని పెంచాలని దేవుడు ఆశిస్తున్నాడు. తన రాజ్య వ్యాప్తి కోసం దేవుడు మన పిల్లల్ని వాడుకుంటాడు (ఆదికాండము 18:19). తనకు పరిచర్య చేసే విధంగా పిల్లల్ని సిద్ధపరిచే బాధ్యత దేవుడు మనకిచ్చాడు (ద్వితీయోపదేశకాండము 6:2). వాళ్లని, మన సేవ కోసం లేక మన కలలు నెరవేర్చుకోవడం కోసం పెంచట్లేదు. దేవుడు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునే బాణాలుగా వాళ్లని మనం చూడాలి.

**మానవ కుటుంబం పతనం, విచ్ఛిన్నం**

ఆదికాండము 3లో, అప్పటివరకు పరిపూర్ణంగా ఉన్న ఏకైక కుటుంబం పతనమైపోయి, రక్షకుని అవసరతలో ఉంది. ఆదాము, హవ్వ పాపం చేశారు, మరణ శాపం మానవాళి మీదికి వచ్చింది. ఆదాము, హవ్వ పరస్పరం కలిగియున్న సంబంధం శాశ్వతంగా నాశనమై, వారు దేవునికి దూరమైయ్యారు.

స్త్రీ పురుషులు ఇద్దరు మరిన్ని శాపాలు అనుభవించారు:

- ప్రసవ వేదన ఎక్కువగా ఉంటుంది.
- భర్తలు అధికారాన్ని దుర్వినియోగం చేస్తారు.
- భార్యలు తిరుగుబాటు చేస్తూ, అగౌరవంగా ఉంటారు.

- పని నిరుత్సాహంగా, కష్టతరంగా మారుతుంది.[5]

ప్రజలు సాతాను అబద్ధాలను నమ్మినందున కుటుంబం పట్ల దేవుని పరిపూర్ణ ప్రణాళిక వక్రీకరించబడింది.

ఆదికాండము 4వ అధ్యాయం, పతనమైన మానవ కుటుంబ స్థితిని చూపిస్తుంది.

ఇప్పుడు మొట్టమొదటి గర్భధారణ, పుట్టుకను వివరించే ఆదికాండము 4:1ను గమనించండి. ఈ వచనం తొమ్మిది నెలల కాలాన్ని-శిశు గర్భధారణ మొదలుకొని, పుట్టుకవరకు- చూపిస్తుంది. హవ్వ తన భయాల్ని ఆనందాన్ని ఆదాముతో చెప్పే ప్రయత్నంలో, ఆ తొమ్మిది నెలలు హవ్వకు ఎలా ఉండి ఉంటాయో ఊహించండి. ఆమెకు సలహాలు, తన ప్రశ్నలకు జవాబులును ఇచ్చేవారు ఎవరూ లేరు. ఆమె పొట్ట పెరగడం, బిడ్డ తన్నడం, పురిటి నొప్పులు మరియు ప్రసవ వేదన - ఇవన్నీ ఏ మానవ తల్లికైనా మొదటిసారి అనుభవాలే. అందుకే కయీను పుట్టుక గురించి హవ్వ “యెహోవా దయవలన నేనొక మనుష్యుని సంపాదించుకొన్నా” (ఆదికాండము 4:1) అని చెప్పడంలో ఆశ్చర్యమేమి లేదు.

కాలం గడిచింది, ఆ తర్వాత వచనంలో రెండవ గర్భధారణ, పుట్టుక గురించి మనం నేర్చుకుంటాం. ఇప్పుడు ఆదాము, హవ్వ కుటుంబంలో నలుగురు ఉన్నారు. అదే వచనం, రెండో భాగంలో వాళ్ల కుమారుల పని గురించిన సమాచారం ఉంది, 3వ వచనానికి వచ్చేసరికి, పిల్లలు పెరిగి పెద్దవారైపోయారు, ఆ తర్వాత వచనాల్లో మొదటి హత్య గురించిన విషాద కథను మనం చదువుతాం. ఆదాము హవ్వల పెద్ద కుమారుడు కోపం, అసూయతో తన సోదరుడ్ని చంపేశాడు. ఆ దిగ్భ్రాంతి, విచారం, ప్రశ్నలు, బాధ, గాయం మీరు ఊహించగలరా?

“అవును! నేను ఊహించగలను. నిజానికి, నాకూ ఇలాంటిదే జరిగింది!” అని మీరు చెప్పొచ్చు. అయితే మీకొక ప్రోత్సాహకరమైన వార్త: మీరు ఒంటరివారు కాదు. మీ కుటుంబం విడుదల పొందగలదు! ప్రతి కుటుంబానికి ఒక శుభవార్త ఉంది.

గోర్డాన్ వెన్హాం (Gordon Wenham) ఇలా రాశాడు,

---

[5] **శిశుజన్మ**, శాపంలో భాగం కాదని నొక్కి చెప్పడం చాలా ముఖ్యం. శిశుజన్మలో **వేదన** అనేది శాప ఫలితం, కాని తర్వాత తరంవారిని ఉనికి లోనికి తీసుకురావడానికి శిశుజన్మ ఎల్లప్పుడు దేవుని అద్భుతమైన ప్రణాళికగానే ఉంది. **పని** శాపం కాదుగాని **కష్టంతో** పనిచేయడమనేది శాప ఫలితం. నిజానికి ఆదికాండము 1:28 లో దేవుడు ఆదాము హవ్వలకు ఇచ్చిన ఇతర ఆజ్ఞలు, మనం పని కోసం చేయబడ్డామని సూచిస్తాయి! దేవుని స్వరూపాన్ని ప్రతిబింబించే విధానాల్లో పని కూడా ఒకటి.

......ఆదికాండములోని సందేశం... మానవుడు పాపం చేసినప్పటికీ దేవుని కృప గెలిచిందని చెబుతుంది, పాపంవలన కుటుంబాలు విచ్ఛిన్నమైనప్పటికీ దేవుని కృప విజయం సాధించిందని చూపిస్తుంది. ఈ పుస్తకం, లోకం ఎంత అద్భుతంగా సృష్టించబడిందో అనే విషయంతో మొదలై, దేవుడు తన స్వరూపంలో మానవుని సృజించాడని, దేవుడు తాను చేసింది యావత్తును చూసినప్పుడు అది చాలా మంచిదిగా ఉందని చెబుతుంది......కాని మూడవ అధ్యాయంలో విషయాలు తలక్రిందులౌతాయి, అవిధేయత కనిపిస్తుంది, [విభేదం], మరియు విధేయత, సామరస్యం, జీవితమనే విషయాల్ని మరణం భర్తీ చేస్తుంది. 4వ అధ్యాయంలో పరిస్థితులు మరింత ఘోరమయ్యాయి....6వ అధ్యాయంలో మరింత దిగజారిపోయాయి, అక్కడ భూమి బలాత్కారముతో నిండిపోయిందని చెబుతుంది (ఆదికాండము 6:11, 13).[6]

## అబ్రాహాము కుటుంబంలో విచ్ఛిన్నత (నలిగిన స్థితి)

తర్వాత ఆదికాండములో, హెబ్రీయులకు తండ్రిగా పిలువబడిన అబ్రాహాము గురించి చదువుతాం (ఆదికాండము 11:27-25:11).[7] దేవుడు, అబ్రాహాము కుటుంబం ద్వారానే మానవుని కుటుంబంలోకి రక్షకుని అనుగ్రహిస్తాడు.

### గొడ్రాలితనం[8]

ఆదికాండము 11 నోవహు కుమారుడైన షేము వంశంలో పుట్టిన అబ్రాము వంశావళి గురించి మాట్లాడుతుంది. అబ్రాము భార్యయైన శారయి గొడ్రాలై సంతానం లేకుండా ఉందని ఆదికాండము 11:30 చూపిస్తుంది. దీన్ని చదివేవాళ్లకి ఇది కన్నీళ్లు, బాధ, హృదయవేదన, నిరాశ, కోపం మరియు దుఖం కలిగించే వచనం. ఒకవేళ ఈవచనంలోని శారయివలే మీరు ఉన్నట్లయితే, మీరు ఒంటరిగా లేరని తెలుసుకోండి.

పిల్లలు కావాలనుకుని గొడ్రాలైనవాళ్లు, ఆదికాండము 1:28 మరియు కీర్తన 127:3-5 వంటి వాక్యభాగాలు చదివినప్పుడు గొప్ప బాధ, దుఖం కలుగుతుంది. పిల్లలు లేకపోవడాన్ని శిక్షగా లేక శాపంగా భావించడం సహజమే.

---

[6] Gordon Wenham writing in *Family in the Bible*, edited by Richard S. Hess and M. Daniel Carroll R., Grand Rapids, MI: Baker Academic, 2003, 29

[7] ఆదికాండము 17:5, 15లో దేవుడు అబ్రాము, శారయి పేర్లను అబ్రాహాము, శారాగా మార్చాడు.

[8] ఈ విషయంపై మరింత సమాచారం కోసం 10వ పాఠం చూడండి.

వాస్తవమేంటంటే, మీకు పిల్లలు లేనందున, దేవుని దృష్టిలో మీరు విలువలేని వారు కాదు. ఆయన మిమ్మల్ని మర్చిపోలేదు. మీకు పిల్లలు లేరంటే మీ కుటుంబం లోపాలతో ఉందని కాదు. ఇతరులు కూడా ఇదే లోతైన బాధను అనుభవించారు.

సంతానలేమి సమస్యతో బాధపడే దంపతులు, వ్యక్తిగతంగాను, జంటగాను కలిసి ఎలా ఎదుర్కొంటారు అనేది చాలా ప్రాముఖ్యం. అబ్రాము, శారాయి జీవితాల్లో మనం చూసినట్లు, అనాలోచితంగా మనం తీసుకొనే నిర్ణయాలు మరిన్ని సమస్యలకు నడిపిస్తాయి.

**వాగ్దానం కోసం వేచి ఉండడం**

> మనల్ని యేసువలే మార్చడానికి దేవుడు కార్యం చేస్తున్నాడు. కొన్నిసార్లు దేవుడు మనల్ని వేచి ఉండేలా చేస్తాడు, ఎందుకంటే ఆ వేచియున్న సమయం ద్వారా మరో విధంగా సాధ్యం కాని కార్యాన్ని మన హృదయాల్లో చేస్తాడు.

తండ్రి మరణం తర్వాత, అబ్రాము తన కుటుంబానికి మూల పురుషుడయ్యాడు. దేవుడు అబ్రామును గొప్ప జనంగా చేస్తానని (ఆదికాండము 12:2), అలాగే అతని సంతానానికి కనాను దేశాన్ని ఇస్తానని వాగ్దానం చేశాడు (ఆదికాండము 12:7). అప్పుడు అబ్రాముకు 75 సంవత్సరాలు (ఆదికాండము 12:4) శారా అతని కంటే పది సంవత్సరాలు చిన్నది (ఆదికాండము 17:17). శారయి 65 సంవత్సరాల వయస్సులోను అందంగా ఉన్న స్త్రీ (ఆదికాండము 12:11), ఇంకా సంతానం లేకుండా, సాధారణ సంతానోత్పత్తి వయస్సు దాటిపోయి ఉంది.

ఆదికాండము 13:14-17లో దేవుని వాగ్దానం స్పష్టంగా పునరుద్ధరించబడినప్పటికీ, సంవత్సరాలు గడిచిపోతున్నా, ఇంకా సంతానం కలుగలేదు. ఆదికాండము 15:2-3లో, తన దాసుడే తన వారసుడని అబ్రాము మాట్లాడుతున్నాడు గనుక సొంత బిడ్డకు తండ్రయ్యే ఆశను కోల్పోతున్నట్లు కనిపిస్తున్నాడు. అప్పుడు దేవుడు, “ఇతడు నీకు వారసుడు కాడు; నీ గర్భవాసమున పుట్టబోవుచున్న వాడు నీకు వారసుడగునని” (ఆదికాండము 15:4) చెప్పాడు. అటు తర్వాత, దేవుడు అబ్రాముకు లెక్కింపజాలని సంతానం గురించిన రెండవ వాగ్దాన చిత్రాన్ని ఇచ్చినప్పుడు, అబ్రాము దేవుని నమ్మాడు (ఆదికాండము 15:6).

వేచి ఉండిన ఈ సంవత్సరాలన్ని శారయికి ఎలా గడిచి ఉంటాయో ఆలోచించండి:

> ఆమె గురించి ఇతరులు చేసిన విమర్శల కంటే కూడా తన వ్యక్తిగత నిరుత్సాహమే మరెక్కువ బాధ కలిగించి ఉంటుంది. బహుశా తాను తల్లి అవ్వాలనే తపన మాత్రమే కాకుండా, పిల్లలు లేని వారిని చిన్న చూపు చూసే ఆ సమాజంలో తల్లులకు లభించే గౌరవం, మర్యాద తనకు కూడా కావాలనుకుంది. సంతానలేమికి పురుషుల్లోని వంధత్వం కూడా కారణం కావచ్చని మనకు తెలుసు, కాని శారయి జీవించిన కాలంలో ఈ

విషయం పట్ల అంత అవగాహన లేదు. ఒక స్త్రీగా శారయి గుర్తింపు, ఆమె విలువ పిల్లల్ని కని, పెంచడం మీద ఆధారపడి ఉంది. ఆమె, నీతిగా నమ్మకంగా జీవించడం ద్వారా విలువ పొందుకోదు గాని, తన భర్తకు వారసుని కనడంవల్ల విలువ సంపాదించుకుంటుంది. సంతాన లేమి అంటే అర్థరహిత జీవితమని అర్థం.[9]

**మానవుల పరిష్కారాలు, బాధాకరమైన ఫలితాలు**

అబ్రాముకు 85 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు, శారయికి ఒక ఆలోచన వచ్చింది- అదే అబ్రాముకు సంతానం ఎలా కలుగుతుందో అనే విషయానికి పరిష్కారం. శారయి దాసి వాళ్ల బిడ్డకు తల్లి కావచ్చు! (ఆదికాండము 16:1-4). కాని, పరిపూర్ణ పరిష్కారంగా ఉంటుందని అబ్రాము శారయి చేసిన ఆలోచన, హాగరు గర్భం దాల్చినప్పుడు తమ ఇంటిలో సమాధానాన్ని నాశనం చేసింది. ఎంతో మంచిగా, సరైనదిగా అనిపించిన ఆలోచన తప్పు అయ్యింది. దేవుని వాగ్దానాన్ని నెరవేర్చడానికి వాళ్లు చేసిన ప్రయత్నం విభేదాలు సృష్టించింది. ప్రజలు దేవుని సమయాన్ని, ఆయన ప్రణాళికను నమ్మకపోతే, తత్ఫలితంగా సంబంధాలు తెగిపోతాయి, బాధలు అనుభవించవలసి వస్తుంది.

> "ఎలీసబేతు విషయంలో చేసినట్లుగా (లూకా 1:7, 13) మనం ఎంత వేడుకున్నా, కొన్ని పరిశుద్ధ కారణాలవల్ల దేవుడు ఆలస్యం చేస్తాడు, మరియు విషయంలో చేసినట్లుగా (లూకా 1:34) సిద్ధంగా లేకపోయినప్పటికీ దేవుడు ముందుకు సాగుతాడు.
> మనం దేవునికి విధేయత చూపించి, ఆయన్ను ఆరాధించినప్పుడు, ఆయన నడిపిస్తాడు, బోధిస్తాడు, మరియు ఆయన ప్రణాళికకు అవసరమైనదానిని అనుగ్రహిస్తాడు, ఆ ప్రణాళిక మనం ఊహించలేనంత గొప్పది."
> - షానా లెటెల్లియర్ (Shauna Letellier) నుండి తీసుకున్నది,
> *రిమార్కబుల్ అడ్వెంట్ (Remarkable Advent)*

తరువాత సంవత్సరాల్లో, ఉద్రిక్తత, బాధ, అపార్థాలు, సంభాషణ సమస్యలు, కోపం, పరిత్యాగం, నిరాశ అబ్రాము శారయి ఇంట్లో మాత్రమే కాకుండా తన సహోదరుని కుమారుడైన లోతు కుటుంబంలో కూడా అంతకంతకు పెరిగాయి (ఆదికాండము 16-21).

**లోపాలున్న కుటుంబాలు**

జనములకు తండ్రిగా దేవుడు అబ్రామును ఎన్నుకున్నాడు, ఈ వంశం ద్వారానే యేసు జన్మిస్తాడు! అబ్రాము తన కుటుంబ సభ్యులవలే, దేవుని ప్రణాళికను నాశనం చేస్తున్నట్లుగా కనబడుతున్నాడు! వారి కుటుంబం, లోపాలున్న కుటుంబానికి మాదిరి.

[9] David and Diana Garland, *Flawed Families of the Bible*, Grand Rapids, MI: Brazos Press, 2007, 21-22

ఆదికాండము 49:33 నాటికి, అబ్రాహాము, శారా, ఇస్సాకు, రిబ్కా, యాకోబు, తన భార్యలు అందరు చనిపోయారు. యాకోబు పిల్లలతో సహా, వాళ్లంతా వైఫల్యాలు, లోపాలున్న కుటుంబంగా ఉన్నారు. పోరాటాలు, వాదాలు, పక్షపాతం, మోసం, పరిత్యాగం, తోబుట్టువుల మధ్య శత్రుత్వం, మానభంగం మరియు అనుచిత సంబంధాలు ఇవన్నీ వాళ్ల కుటుంబంలో భాగమయ్యాయి. ఈ మాటలన్నీ వర్ధిల్లుతున్న, సమాధానకరమైన కుటుంబాన్ని సూచించవు!

విచారకరంగా, అప్పటినుండి కూడా ఈ కథ బైబిలు అంతటా, అలాగే ప్రపంచమంతటా పునరావృతమౌతూనే ఉంది. అయితే, ఈ కుటుంబాల్లో కూడా అనందకర పరిస్థితులు, అందమైన ప్రేమ కథలు, మరియు కొందరు నీతిమంతులు కూడా ఉన్నారు.

వీటన్నిటిలో కూడా, మానవాళిని విడిపించాలనే ఆయన ప్రణాళికను దేవుడు విడిచిపెట్టలేదు. కుటుంబపట్ల ఆయన ప్రణాళికను కూడా మార్చుకోలేదు. మీరు పాత నిబంధన గ్రంథమంతా చదవడం కొనసాగించుచున్నప్పుడు, హెబ్రీ కుటుంబ కథల్లో విమోచన అనే ఒక అద్భుతమైన విషయాన్ని చూస్తారు. అనేక సంఘటనలు యేసు వైపుకు సూచిస్తాయి. అబ్రాహాము ఇస్సాకును అర్పించడం; పస్కా మరియు ఇశ్రాయేలీయులు ఐగుప్తు బానిసత్వం నుండి విడిపించబడటం; రాహాబు తీర్పు నుండి తప్పించబడి, దేవుని ప్రజల్లో చేర్చబడడం; ఇంకా అనేక ఇతర సంఘటనలు, రక్షకుడు వచ్చి మానవాళిని విమోచిస్తాడని చూపిస్తాయి.

## కుటుంబాల్లో దేవుని స్వస్థత, కృప

వివాహమనేది క్రీస్తుకు, ఆయన వధువైన సంఘానికి మధ్య సంబంధానికి సూచనగా ఉండడానికి దేవుడు రూపొందిచాడని ఎఫెసీయులకు 5 చెబుతుంది. శిరస్సైన క్రీస్తు సంఘం కోసం తన్నుతాను అప్పగించుకున్నట్లుగా, తన భార్యకు శిరస్సైన ప్రతి భర్త ఆమె కోసం తన్నుతాను అప్పగించుకోవాలి. అలాగే, ప్రతి భార్య సంఘు మాదిరిని అనుసరించాలి. సంఘం క్రీస్తుకు లోబడినట్టుగా, ప్రతి భార్య తన భర్తకు లోబడాలి.

మానవాళి పతనం, మానవ కుటుంబాల కోసం దేవుడు ఏర్పాటు చేసిన ప్రణాళికను నాశనం చేసింది, వైవాహిక సంబంధాల్లో వినాశనకరమైన పరిణామాలను తీసుకొచ్చింది. మానవుడు పాపంలో పడిపోవడం వలన కలిగే పర్యవసానాల్ని ప్రతి కుటుంబం ఎదుర్కొంటుంది. అయినప్పటికీ,

> యేసు వివాహంతో పాటు సమస్తాన్ని విమోచించడానికి వచ్చాడు. పాపంవల్ల నాశనమై, దెబ్బతిన్న ప్రతిదాన్ని విడిపించి, పునరుద్ధరించడానికి వచ్చాడు. వివాహంపట్ల దేవుడు కలిగియున్న ప్రణాళిక ప్రకారం మనం జీవించలేనప్పుడు, యేసు దేవుని ప్రమాణాల్ని పరిపూర్ణంగా నెరవేర్చాడు. యేసు, సంఘం కోసం ప్రాణం ఇచ్చేంతగా దాన్ని ప్రేమించాడు. ఆయన తండ్రియైన దేవుని ప్రణాళికకు పరిపూర్ణంగా అప్పగించుకున్నాడు.

యేసు దేవుడు రూపొందించిన దానికి పరిపూర్ణమైన నెరవేర్పుగా ఉన్నాడు: మన వివాహాలు నెరవేర్చలేని ప్రేమను, విధేయతను ఆయన నెరవేర్చాడు.[10]

► వివాహమైన వ్యక్తి కలిగియుండవలసిన వైఖరికి యేసు ఎలా ఆదర్శంగా ఉన్నాడు?

యేసు పరిపూర్ణంగా లోబడడం ద్వారా, పరిపూర్ణంగా ప్రేమించడం ద్వారా దేవుని చిత్తాన్ని నెరవేర్చడమే కాకుండా, సహజంగా పతనమైన మానవుల్లో నష్టాన్ని, కీడును కలిగించే ధోరణిని జయించే శక్తి భార్యభర్తలకు అనుగ్రహించాడు. ఆయన కృపను బట్టి, భార్యభర్తలు ఇరువురు పరిశుద్ధాత్మ శక్తి ద్వారా జీవించినప్పుడు, వివాహ విషయంలో దేవుని ప్రణాళికను నెరవేర్చగలరు (ఎఫెసీయులకు 5:18).

ఏ కుటుంబం కూడా పరిపూర్ణమైంది కాదుగాని దేవుడు ప్రతి కుటుంబాన్ని విమోచించాలని ఆశిస్తున్నాడు. దేవుని కృప కుటుంబాల్లో పనిచేసి, ప్రతి వ్యక్తిని దేవుడు మొదటగా ఉద్దేశించిన దానికి తగినట్లుగా మార్చగలదు. కుటుంబాలలోని వ్యక్తులు దేవుని ఆజ్ఞలకు విధేయులై జీవించినప్పుడు, వారి విధేయత కుటుంబాలు సహజమైన లోపాలను, తప్పులను సరిదిద్దుకోవడంలో వాటికి సహాయపడుతుంది. మానవ సంబంధాలను ప్రభావితం చేసే పతనపు ఫలితాలు మనం దేవుని చిత్తానికి లోబడినప్పుడు తగ్గుతాయి.

ఉదాహరణకు, ఎఫెసీయులకు 5లో దైవికమైన భర్త దేవుని ఆజ్ఞలకు లోబడినప్పుడు, భార్యపై తన అధికారాన్ని స్వార్థపూరితంగా ఉపయోగించే తన సహజ ధోరణిని అధిగమిస్తాడు. దేవుని పట్ల అతడు చూపే విధేయత, పతనంవల్ల కలిగే ప్రభావాల్ని తగ్గించి, స్వస్థతను ఇస్తుంది. ఈ విధేయత వల్ల, అతని భార్య లోబడాలనే ప్రేరణను పొందుతుంది.

భార్య దేవుని ఆదేశాన్ని (ఎఫెసీయులకు 5:24) అనుసరించి తన భర్తకు లోబడినప్పుడు, ఆమె తన భర్త అధికారాన్ని ఎదిరించాలనే తన సహజ పాపపు ప్రవృత్తిని జయిస్తుంది. ఆమె దేవునికి విధేయత చూపడం ద్వారా వారి సంబంధం దేవుడు వివాహాన్ని ఉద్దేశించిన విధంగా (1 కొరింథీయులకు 11:3, 1 పేతురు 3:1-7) మరింత పునరుద్ధరించబడుతుంది.

కుటుంబ సంబంధాలు దేవునికి చాలా ముఖ్యం. ఈ కారణంతోనే, దేవుడు స్వస్థతను, పునరుద్ధరణను తీసుకొచ్చే సూచనలను కుటుంబాలకు ఇచ్చాడు.

---

[10] Christina Fox, “Redeeming Marriage.” నవంబరు 29, 2022 న https://cbmw.org/2013/08/29/redeeming-marriage/ నుండి తీసుకొనబడింది.

## కుటుంబం పట్ల బైబిలు సంబంధిత బాధ్యత

### తల్లిదండ్రులు, తాత అమ్మమ్మల బాధ్యతలు

తల్లిదండ్రులు, తాతలు, అమమ్మలు తమ పిల్లలకు, మనవళ్ళకు, మనవరాళ్లకు దేవుని మార్గాల్ని బోధించవలసిన అవసరతను గురించి అనేక వాక్యభాగాలు మాట్లాడతాయి. మూడింటిని క్లుప్తంగా చూద్దాం.

► ఒక విద్యార్థి తరగతి కోసం ఎఫెసీయులకు 6:4 చదవాలి. ఈ వాక్య అర్థమేమిటి?

తల్లిదండ్రులు తమ పిల్లలకు దేవుడిని తెలుసుకోవడం, ఆయనకు విధేయత చూపడం ఎలాగో నేర్పించడం దేవుని ప్రణాళిక. తల్లిదండ్రులు తమ పిల్లలను నడిపించే, బోధించే, సరిదిద్దే, శిక్షణ ఇచ్చే విధానం, దేవుడు తన పిల్లల పట్ల ఈ పనులను చేసే విధానాన్ని ప్రతిబింబించాలి.

► ఒక విద్యార్థి తరగతి కోసం కీర్తన 78:1-8 చదవాలి. ఈ క్రింది ప్రశ్నలకు జవాబులివ్వండి:

- ఈ వాక్యభాగంలో ఎన్ని కుటుంబ తరాలు పేర్కొనబడ్డాయి?
- ప్రతి తరం యొక్క బాధ్యత ఏంటి?
- పెద్దవాళ్లు యువ తరాలకు ఏం నేర్పించాలి?

కీర్తన 78 దేవుని అద్భుతమైన కృప మరియు దయతో నిండియుంది. ఇది ఐగుప్తును విడిచిపెట్టిన నాటనుండి దావీదు రాజు పరిపాలన వరకు ఇశ్రాయేలు కుటుంబాల్లో ఆయన చేసిన కార్యమును తెలియజేస్తుంది. ఈ కీర్తన, పాఠకుల కుటుంబ పరిస్థితుల్లో నిరీక్షణను అనుగ్రహిస్తుంది.

► ఒక విద్యార్థి తరగతి కోసం ద్వితీయోపదేశకాండము 6:1-9 చదవాలి. ఈ వాక్యభాగం పరిశీలిస్తూ, దేవుని ప్రజలైన మనం చేయవలసిన కొన్ని పనులు ఏంటి?

ఈ వాక్యభాగం, దేవుడు ఇశ్రాయేలీయులకు ఇవ్వబోయే వాగ్దాన దేశంలోకి వెళ్లే ముందు, మోషే వాళ్లకు ఇచ్చిన ఉపదేశంలో భాగం. వారు దేవుని ప్రజలుగా ఎలా ఉండాలో, దేవునికి చెందినవారిగా ఉండడం అంటే ఏంటో నేర్చుకుంటున్నారు. ఈ వచనాల్లోని సత్యాలు, ఇప్పటికీ దేవుని పిల్లలుగా జీవించుటకు పునాది వలె ఉన్నాయి.

ఆయన వాక్యాన్ని విధేయతతో విని- ఆయన మన నుండి ఆశించేది చేయాలని దేవుడు మనలను ఆజ్ఞాపించుచున్నాడు! (వచనాలు 3-4).

మనం చేయవలసినవి:

1. పూర్ణహృదయముతోను, పూర్ణాత్మతోను, పూర్ణశక్తితోను దేవుణ్ణి ప్రేమించాలి (వచనం 5).
2. దేవుని వాక్యాన్ని మన హృదయాల్లో ఉంచుకోవాలి (వచనం 6).
3. దేవుని వాక్యాన్ని ఎలా అనుసరించాలో మన పిల్లలకు జాగ్రత్తగా నేర్పించాలి (వచనం 7).
4. ఎల్లప్పుడు దేవుని వాక్యాన్ని మన మనస్సుల్లో, మన యెదుట ఉంచుకోవాలి (వచనాలు 8-9).

ఈ ఆజ్ఞలు ప్రతి తరానికి ఇవ్వబడినవని గమనించండి (వచనం 2). తమ పిల్లలకు, మనవళ్లు మనవరాళ్ళకు తనను ఎలా అనుసరించాలో నేర్పించే బాధ్యత తల్లిదండ్రులకు, తాత అమ్మమ్మలకు దేవుడు ఇచ్చాడు. ఎంతకాలం వరకు? వారు జీవించినంతకాలం (వచనం 2). తల్లిదండ్రులు తమ పిల్లలకు దేవుని మార్గాలు గురించి రోజంతా బోధించాలని, ప్రతిరోజు, వాళ్లు ఎక్కడికి వెళ్ళినా, ఏం చేసినా, బోధిస్తూ ఉండాలని దేవుడు తెలియజేస్తున్నాడు (వచనలు 7-9).

> పిల్లల ఆత్మీయ విద్య తల్లిదండ్రుల బాధ్యతే. ఈ బోధన ప్రతిరోజు తల్లిదండ్రులు చూపించే మాదిరివల్ల, ధర్మశాస్త్రాన్ని పదే పదే చెప్పడంవల్ల జరగాలి. ఈ ఆజ్ఞకున్న ప్రాముఖ్యత, తల్లిదండ్రులు పిల్లలకు బోధించడానికి ఎంత దూరం వెళ్తున్నారనే విషయంలో కనిపిస్తుంది. ఇది కేవలం ధర్మశాస్త్రంలోని విషయాలు బోధించడమే కాదుకానీ, ప్రతిరోజు జీవించే విధానంలో చూపే జీవనశైలి కావాలి. ఇంటి పనులు చేసుకుంటూనే దేవుని కట్టడల్ని బోధించడానికి సృజనాత్మకత చాలా అవసరం.[11]

తల్లిదండ్రులు తమ పిల్లల మనస్సులకే కాకుండా వారి హృదయాలకు బోధించాలి. వారు దేవుని గురించిన సత్యాలను మాత్రమే కాకుండా, దేవునితో సహవాసం కలిగి జీవించడాన్ని, ఆయనకు విధేయత చూపించడాన్ని, ఆచరణాత్మక అన్వయాలను కూడా బోధించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు మాటలతోను, అలాగే జీవనశైలి ద్వారాను బోధించాలి. రెండూ అవసరమైనవే.

ఈ వాక్యభాగం సులభంగా కనిపించవచ్చు, కాని ఇది చాలా ముఖ్యమైనది. ఈ సత్యాలు, ఆజ్ఞలు వ్యక్తులకు, కుటుంబాలకు కావలసిన ఉద్దేశ్యాన్ని, మార్గాల్ని కలుగజేస్తాయి. తల్లిదండ్రులు ఎల్లప్పుడూ దేవుణ్ణి బాగా ఎరిగి, అన్ని విషయాల్లో ఆయనకు పూర్తిగా విధేయులవ్వడానికి ప్రయత్నిస్తూ ఉంటే, వారు తమ పిల్లలకు కూడా అదే నేర్పగలరు.

---

[11] *The Woman's Study Bible*, Thomas Nelson, Inc. 1995, 292

తల్లిదండ్రులలో కూడా జీవితాంతం నేర్చుకొనే, విధేయత చూపే వైఖరి ఉండాలి. ఇది వారి పిల్లలకు మాదిరి, అలాగే దేవుని గురించి మరింత తెలుసుకోవాలనే ఆకాంక్షను వాళ్లలో కలుగజేస్తుంది.

► తల్లిదండ్రులు ప్రతిరోజు తమ పిల్లలకు క్రైస్తవ శిష్యత్వ తర్ఫీదునిచ్చే కొన్ని ఆచరణాత్మక మార్గాలు ఏవి?

**కుటుంబం-ఇతరుల్ని ప్రేమించడానికి శిక్షణ స్థలం**

► ఒక విద్యార్థి తరగతి కోసం 1 యోహాను 4:7-13, 19 చదవాలి.

ఈ వాక్యభాగంలోని ప్రధాన విషయం ప్రేమ. దేవుడు తన సంపూర్ణతలో ఏమై ఉన్నాడో తెలుసుకోవడానికి మనం ఒకనినొకడు ప్రేమించాలి. *ఒకనినొకడు* అంటే ఇందులో కుటుంబం కూడా భాగం. దేవుడు మనకు కుటుంబాన్ని ఇచ్చిన కారణాలలో ఒకటి - మనం ఇతరులను ఎలా ప్రేమించాలో నేర్చుకోవడం. మనం మన కుటుంబీకుల్ని ప్రేమించడం నేర్చుకుంటున్నప్పుడు (అది కష్టంగా ఉన్నప్పటికీ), మనం దేవునివంటి వారమవుతాం - ఎందుకంటే దేవుడు ప్రేమస్వరూపి! (వచనం 8).

కుటుంబ సభ్యులు - ఆత్మీయులైనా లేక భౌతిక కుటుంబమైనా- ఒకరినొకరు ప్రేమించుకున్నప్పుడు, వారు దేవుని మూలంగా పుట్టారని తెలుస్తుంది (వచనం 7). వారు ఒకరినొకరు ప్రేమించినప్పుడు, దేవుని ప్రేమ వారియందు సంపూర్ణమౌతుంది (వచనం 12).

దేవుడు మనం ఇతరుల్ని ప్రేమించాలని మాత్రమే ఆశించడు, ఆయనే మొదట మనల్ని ప్రేమించాడు (వచనాలు 9-11, 19). మన పాపాలకు ప్రాయశ్చిత్తంగా యేసును పంపడం ద్వారా ఆయన మనల్ని ప్రేమించాడు (వచనం 10). ఆయన ప్రేమే, మనం ఇతరుల్ని ప్రేమించడానికి ప్రేరణ (వచనం 11).

మన కుటుంబాన్ని ప్రేమించడం కొందరికి సులభం, మరికొందరికి చాలా కష్టం, కానీ మనందరం దేవుని ఆజ్ఞకు విధేయులవ్వడానికి కావలసినదంతా ఉంది- అనగా దేవుడు పరిశుద్ధాత్మని ద్వారా మనలో నిలిచియున్నాడు (వచనాలు 12-13).

దేవుడు మనల్ని ఒకరినొకరు ప్రేమించుకోమని పిలుస్తున్నాడు, ఇందులో మన తల్లిదండ్రులు, జీవిత భాగస్వాములు, పిల్లలు ఉన్నారు. మన కుటుంబ సభ్యులను ప్రేమించడం అంటే వారు చేసే తప్పులను లేదా చెడు పనులను ఆమోదించడమని కాదు. వారిని జవాబుదారులుగా ఉంచకూడదని కాదు. మన కుటుంబ సభ్యులకు ఏది మంచిదో అదే మనం కోరుకుంటున్నామని, వారి మంచి కోసం మనల్ని మనం త్యాగం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని దీని అర్థం.

## సమూహ చర్చ కోసం

► త్రిత్వంలో ఉన్న సంబంధాల్ని వివాహం ఎలా ప్రతిబింబిస్తుందో మీ మాటలలో వివరించండి.

► పాపం ద్వారా పాడైన వివాహ బంధాన్ని దేవుడు ఎలా బాగుచేశాడో చెప్పండి.

► దేవునికి విధేయత చూపడం, పాపం ద్వారా నాశనమైన దాన్ని ఎందుకు స్వస్థపరుస్తుందో, పునరుద్ధరిస్తుందో వివరించండి.

## ప్రార్థన

కొద్ది సమయం తీసుకొని, మీ కుటుంబం కోసం దేవునికి కృతజ్ఞతలు చెప్తూ ప్రార్థించండి. మీ కుటుంబం కోసం ప్రార్థించండి. బాధలు, వైఫల్యాలు, వేడుకలు మరియు ఆనందాలు గురించి ప్రార్థించండి. ద్వితీయోపదేశకాండము 6:4-9లోని మాటల్ని మీ సొంత మాటల్లో, సమర్పణ, విజ్ఞాపన ప్రార్థనగా చేయండి.

## పాఠం అభ్యాసాలు

(1) ద్వితీయోపదేశకాండము 6:4-9ను కంఠస్తం చెయ్యండి. తరువాత క్లాసును మొదలుపెట్టే ముందు, కంఠస్తం చేసిన వాక్యభాగాన్ని రాయండి లేక చెప్పండి.

(2) ద్వితీయోపదేశకాండము 6:1-9లో, దేవుడు మన నుండి నాలుగు విషయాలను కోరుతున్నాడు. ఈ నాలుగు అంశాలలో మిమ్మల్ని మీరు ప్రార్థనాపూర్వకంగా, నిజాయితీగా మూల్యాంకనం చేసుకోండి.

మనం చేయవలసినవి:

- పూర్ణహృదయముతోను, పూర్ణాత్మతోను, పూర్ణశక్తితోను దేవుణ్ణి ప్రేమించాలి (వచనం 5).
- దేవుని వాక్యాన్ని మన హృదయాల్లో ఉంచుకోవాలి (వచనం 6).
- దేవుని వాక్యాన్ని ఎలా అనుసరించాలో మన పిల్లలకు జాగ్రత్తగా నేర్పించాలి (వచనం 7).
- ఎల్లప్పుడు దేవుని వాక్యాన్ని మన మనస్సుల్లో, మన యెదుట ఉంచుకోవాలి (వచనాలు 8-9).

ప్రతిదాని గురించి ఒక వ్యక్తిగత ప్రార్థన రాయండి (దీన్ని మీ తరగతి నాయకుడితో పంచుకోనవసరం లేదుగాని, కేవలం అభ్యాసం పూర్తి చేశారని రిపోర్ట్ ఇవ్వొచ్చు.)

(3) అబ్రాహాము, శారా జీవితంలో నుండి ఎక్కువ సమయం వేచి ఉండడం గురించి మనం నేర్చుకుంటాం. ఈ ప్రశ్నలు గురించి ఆలోచించండి:

- దేవుని సమయం కోసం మీరు వేచి ఉన్న సందర్భాలు ఏవి? ఈ వేచి ఉండిన సమయాల ద్వారా మీరేం నేర్చుకున్నారు?
- దేవుని వాగ్దానాల్ని మీరు ఎంతగా నమ్ముతారు? ప్రస్తుతం వాగ్దానం విషయంలో మీరు ఇబ్బంది పడుతున్నారా? ఆ ఇబ్బంది మీ కుటుంబంపై ప్రభావం చూపుతుందా? ఎలా?
- దేవునిపై ఆధారపడకుండా మీ సమస్య లేక మీ కుటుంబ సమస్యను మీకు మీరుగా పరిష్కరించుకోవడానికి ప్రయత్నించిన సందర్భాలున్నాయా? వాటి ఫలితాలు ఏంటి?
- అసహనం, అవిశ్వాసం కుటుంబాలపై ఎలాంటి ప్రభావాలను చూపిస్తాయి?

ఈ విషయంపై జవాబుగా మూడు పేరాలు రాయండి. (దీన్ని మీ తరగతి నాయకుడితో పంచుకోనవసరం లేదుగాని, కేవలం అభ్యాసం పూర్తి చేశారని రిపోర్ట్ ఇవ్వొచ్చు.)

# పాఠం 3

# వివాహం గురించి బైబిలు బోధన

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) వివాహ విషయంలో దేవుని రూపకల్పనకు, ఉద్దేశ్యాలకు కట్టుబడి ఉండాలి.

(2) క్రైస్తవ వివాహ విషయంలో దేవుని నియమాలకు వ్యక్తిగతంగా విధేయత చూపించడానికి కట్టుబడి ఉండాలి.

(3) వాక్యానుసారమైన వివాహం గురించి ఇతరులకు బోధించడానికి సిద్ధంగా ఉండాలి.

## రాబర్ట్సన్ మెక్క్విల్కిన్, వాగ్దానం నెరవేర్చువాడు

డా. రాబర్ట్సన్ మెక్క్విల్కిన్ 12 సంవత్సరాలు జపాన్‌లో మిషనరీగా పనిచేశారు. తరువాత ఆయన కొలంబియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీకి అధ్యక్షుడయ్యారు. రచయితగా, వక్తగా, విద్యావేత్తగా ఆయన సుప్రసిద్ధులు. ఆయన భార్య మురియెల్‌కు మెదడు వ్యాధి సోకింది, ఇది ఆలోచనా శక్తిని, జ్ఞాపకశక్తిని, సంభాషించే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. వ్యాధి ముదిరి, మురియెల్‌కు నిరంతర సంరక్షణ అవసరమైనప్పుడు, డా. మెక్క్విల్కిన్ తన భార్యను చూసుకోవడానికి యూనివర్సిటీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. పెళ్లి చేసుకున్నప్పుడు ఆమెకు ఇచ్చిన వాగ్దానాన్ని తాను నిలబెట్టుకుంటున్నానని ఆయన చెప్పారు. యూనివర్సిటీ అధ్యక్ష పదవిలో కొనసాగడం కంటే తన భార్యను చూసుకోవడం చాలా ముఖ్యమని ఆయన నమ్మారు.

## దేవుడు ఏర్పరచిన వివాహ వ్యవస్థ

దేవుడు తాను సృజించిన మొదటి స్త్రీ పురుషుల కోసం వివాహ వ్యవస్థను ఏర్పాటు చేశాడు. ప్రజలకు అవసరమైన రీతిలో దేవుడు వివాహ వ్యవస్థను స్థాపించాడు. అది ఖచ్చితంగా మానవుని స్వభావానికి తగినట్టుగానే నిర్మించబడింది. దేవుడు ఏదైనా రూపొందించినప్పుడు, ఏదైనా ఆశించినప్పుడు, మనకు ఏది ఉత్తమమో అదే చేస్తాడు (ద్వితీయోపదేశకాండము 6:24). వివాహం కొరకైన తన ప్రణాళికలో, ప్రతి భాగస్వామికి ఉత్తమమైన భావోద్వేగ, సంబంధిత, ఆత్మీయ శ్రేయస్సు కలిగించాలని దేవుడు ఉద్దేశించాడు.

వివాహంలో, స్త్రీ పురుషుడు తమ తల్లిదండ్రుల్ని విడిచి ఏకమౌతారని దేవుడు చెప్పాడు. వివాహ వ్యవస్థ, ఇద్దరు వ్యక్తుల మధ్య స్నేహబంధాన్ని, భాగస్వామ్యాన్ని ఏర్పరుస్తుంది, ఇది అన్ని మానవ సంబంధాలకంటే కూడా మరింత సన్నిహితమైంది, బలమైంది. ఇది కేవలం ఇద్దరి మధ్య ఉండే పరిమితమైన భాగస్వామ్యం కాదు. వారి జీవితాలు మిళితమైపోతాయి, తద్వారా వారిద్దరూ ఒక్క వ్యక్తిగానే ఉంటారు. ఇది, వారి వ్యక్తిత్వాన్ని నాశనం చేయడం కాదుగాని, ఒక ప్రత్యేకమైన ఐక్యతను కలిగించే బంధం.

## వాక్యానుసారమైన వివాహం

వాక్యానుసారమైన వివాహం అందమైంది. కాని అందులోని సౌందర్యాన్ని, మకరందాన్ని, మంచితనాన్ని అనుభవించాలని కోరుకునే దంపతులు లేఖనాలు ఏం బోధిస్తున్నాయో పరిశీలించి, ఆ తర్వాత వారు నేర్చుకున్నదానికి విధేయత చూపించాలి. ఒక సంతృప్తికరమైన వైవాహిక జీవితం ప్రయాసను, త్యాగాన్ని కోరుతుంది.

### వాక్యానుసారమైన వివాహం, సాంగత్యం కోసం

ఆదికాండం దేవుడు ఏర్పరచిన వివాహ వ్యవస్థను వివరిస్తుంది. వివరణలోని ప్రతి భాగం, వివాహ వ్యవస్థ ఘనతను తెలుపుతుంది.

> దేవుడైన యెహోవా—నరుడు ఒంటరిగా నుండుట మంచిది కాదు; వానికి సాటియైన సహాయమును వానికొరకు చేయుదుననుకొనెను (ఆదికాండము 2:18).

దేవుడు తండ్రిగా, కుమారుడిగా మరియు పరిశుద్ధాత్ముడిగా సహవాసంలో ఉన్నట్లు, మనల్ని కూడా సామాజికంగా ఉండేలా రూపొందించాడు. సంభాషించుకోవడానికి మనల్ని సృజించాడు. సన్నిహిత సంబంధం కోసం, సహవాసం కోసం సృజించాడు. ఒంటరిగా ఉండడం మంచిదికాదని దేవుడు సెలవిచ్చాడు!

దేవుడు, నరుని ప్రక్కటెముకలో నుండి ఒకదానిని తీసి, ఒక అందమైన స్త్రీని - దేవుని స్వరూపంలోనే, అదే విలువతో, కాని భిన్న రూపకల్పనలో- పురుషుని సంపూర్ణం చేసే వ్యక్తిని చేశాడు. ఆమె “సృష్టికర్త చివరి పరిపూర్ణమైన పనిగా, ప్రత్యేకమైన ఘనతతో పురుషుని యొద్దకు తీసుకురాబడింది.”[12]

---

[12] Charles Ellicot, ed., *Ellicot's Commentary for English Readers.* (Notes on Genesis 2:22). Retrieved from https://biblehub.com/genesis/2-22.htm#commentary on December 29, 2020.

***వివాహ వ్యవస్థ, ఆనందకరమైన కలయికగా ఉండాలి***

"నా యెముకలలో ఒక యెముక" (ఆదికాండము 2:23) అని ఆదాము చెప్పినప్పుడు, అతడు గౌరవాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాడు. "ఎట్టకేలకు, ఒక బానిస! నా బట్టలు ఉతకడానికి, ఆహారం వండడానికి, కాళ్ళు నొక్కడానికి, నా పనులు చేయడానికి ఒకరున్నారు!" అని ఆదాము చెప్పలేదు. కాని, "ఎట్టకేలకు, నన్ను సంపూర్తి చేసే సహాయకురాలు!" అని చెప్పాడు.

***వివాహ వ్యవస్థ, సమానుల కలయికగా ఉండాలి***

> ... సాటియైన సహాయమును వానికొరకు (ఆదికాండము 2:18).

స్త్రీని పురుషునికి సంపూర్ణంగా సరిపోయేలా మరియు అతన్ని పరిపూర్ణం చేసేలా దేవుడు రూపొందించాడు.

మాథ్యు హెన్రీ మనకు ఈ విధంగా జ్ఞాపకం చేస్తున్నాడు, "స్త్రీ ఆదాము ప్రక్కటెములో నుండి వచ్చింది; అతనిని పాలించునట్లు తలలో నుండి తీయలేదు, అతని కాళ్ళ క్రింద అణగద్రొక్కబడునట్లుగా అతని కాలులో నుండి తీయలేదు, అతనితో సమానంగా ఉండడానికి ప్రక్కటెములో నుండి తీయబడింది, అతని రెక్కల క్రింద భద్రంగా కాపాడబడడానికి, ప్రేమించబడడానికి హృదయానికి దగ్గరగా తీయబడింది."[13] స్త్రీ, పురుషుని కంటే తక్కువ కాదు లేక ఎక్కువ కాదు, కాని అతనితో సమానం.

***వివాహ వ్యవస్థ నిబంధన కలయికగా ఉండాలి***

> కాబట్టి పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును; వారు ఏక శరీరమైయుందురు (ఆదికాండము 2:24).

బలమైన వివాహ బంధాలు నిరంతర ప్రేమానుభూతులపై (భావోద్వేగాలు స్థిరంగా ఉండవు), లేక ఆనందంపై (ఆరోగ్యకరమైన వివాహాలు ఆనందాన్ని ఇచ్చినప్పటికీ), లేక వ్యక్తిగత నెరవేర్పులపై (బలమైన వివాహాలు తృప్తినిచ్చినప్పటికీ) వాటిపై ఆధారపడవు. వివాహం ద్వారా కలిగే అద్భుతమైన మేలులు బలమైన వివాహ బంధానికి మూల *కారణం* కావు; అవి బలమైన వివాహ బంధం యొక్క *ఫలితాలుగా* ఉంటాయి. వివాహం అనేది ఒక స్త్రీ, ఒక పురుషుడు తమ జీవితాంతం ఒకరికొకరు సమర్పణ కలిగి కలిసి జీవించే- స్థిరమైన నిబంధన పునాదిపై స్థాపించబడింది.

---

[13] Matthew Henry, *Matthew Henry's Commentary on the Whole Bible.* (Notes on Genesis 2:21-25). Retrieved from https://studylight.org/commentaries/eng/mhm/genesis-2.html on July 31, 2023.

వివాహబంధం పారదర్శకంగా, నమ్మకంగా, ఒకరినొకరు అంగీకరించుకొనేట్లుగా ఉండాలి— “అప్పుడు ఆదామును అతని భార్యయు వారిద్దరు దిగంబరులుగా నుండిరి; అయితే వారు సిగ్గు ఎరుగక యుండిరి” (ఆదికాండము 2:25). పాపం, ఇంకా మొదటి దంపతుల నిష్కపటత్వాన్ని పాడుచేయలేదు గనుక, వారి వివాహ బంధం తీర్పు, అవమానం, భయం లేకుండా ఉండింది. “వివాహము అన్ని విషయములలో ఘనమైనదిగాను, పానుపు నిష్కల్మషమైనదిగాను ఉండవలెను...” (హెబ్రీయులకు 13:4) అని క్రొత్త నిబంధన బోధిస్తుంది.

అభద్రత, అవిశ్వాసం, అనుమానం, లేదా భయం ఉన్న చోట, జీవిత భాగస్వాములు ఒకరికొకరు వివాహానికి కట్టుబడి ఉన్నారని ఖచ్చితంగా తెలియని చోట బలమైన వైవాహిక బంధం ఉండదు. ఒక జీవిత భాగస్వామి చనిపోయినప్పుడు మాత్రమే ముగిసే వాగ్దానం బలమైన వివాహాలకు అవసరం (రోమా 7:1-2).

వివాహం అనేది స్త్రీ పురుషుడు మధ్య జీవితకాల నిబంధనగా ఉండాలని దేవుని ఉద్దేశించాడు (మత్తయి 19:3-6). ఒక అవిశ్వాసియైన భాగస్వామి తమను విడచిపెట్టినప్పుడు విశ్వాసులకు నిర్బంధం ఉండదని (1 కొరింథీయులకు 7:15), అయితే విశ్వాసి, అవిశ్వాసియైన తన భాగస్వామిని విడిచిపెట్టకూడదని పౌలు చెప్పాడు (1 కొరింథీయులకు 7:12-14, 16). ప్రభువు కూడా ఇదే చెప్పాడని పౌలు మునుపటి వచనాల్లో రాశాడు: విశ్వాసులు తమ భాగస్వాముల్ని విడిచిపెట్టకూడదు, ఒకవేళ ఆ విధంగా చేస్తే, వాళ్లు మరొకరిని వివాహం చేసుకోకూడదు (1 కొరింథీయులకు 7:10-11, మత్తయి 5:31-32, మత్తయి 19:9).

నిబంధన ప్రేమ అనేది త్యాగం చేసేది, గౌరవప్రదమైంది, సంబంధం కష్టంగా ఉన్నప్పుడు కూడా అది అందాన్ని తెస్తుంది (1 కొరింథీయులకు 13). బలహీనమైన సమర్పణ మాత్రం తాత్కాలిక ప్రయాస, భావోద్వేగ విచ్ఛిన్నత, వెనుకంజవేయడం, అలాగే శోధనకు దారి తీస్తుంది.

ఒక భర్త తన భార్య స్పందించకపోయినా, మర్యాదగా నడుచుకోకపోయినా లేదా అనారోగ్యంగా ఉన్నప్పటికీ ఆమెను విడనాడకుంటే, అతడు నిబంధన ప్రేమతో జీవిస్తున్నాడని అర్థం. భర్త ప్రేమించనప్పటికీ కూడా క్రీస్తు నిమిత్తం తన భర్తను గౌరవించి, అతనికి లోబడితే భార్య నిబంధన ప్రేమతో జీవిస్తుందని అర్థం.

అతని ప్రేమ ఆమె గౌరవాన్ని గెలుచుకుంటుంది, అలాగే ఆమె గౌరవం అతని ప్రేమను గెలుచుకుంటుంది. వారు ఇరువురూ కలిసి ఎదుగుతూ ఉంటారు!

► వైవాహిక జీవితంలో అసంతృప్తి కలిగినప్పుడు నిర్ణయం మార్చుకుందామనే ఆలోచనతో ప్రజలు పెళ్లి చేసుకుంటే ఎలాంటి సమస్యలు ఎదురౌతాయి? వివాహం శాశ్వతమైందని నమ్మినప్పుడు, సంపూర్ణ సమర్పణ ఎలాంటి మార్పును తీసుకొస్తుంది?

**వాక్యానుసారమైన వివాహం, లైంగిక సంతృప్తికి, సంతానోత్పత్తికి సరైన విధానం**

> దేవుడు లైంగిక సంబంధాన్ని ఆనందదాయకంగా, శక్తివంతమైందిగా చేశాడు. ఇది భార్యభర్తల్ని శారీరకంగా, భావోద్వేగపరంగా, ఆత్మీయంగా ఏకం చేయడానికి ఉద్దేశించబడిన చర్య. ఆరోగ్యకరమైన లైంగిక జీవితం ఆనందాన్ని, ఏకత్వాన్ని కలిగించడమే కాకుండా, అది వివాహ బంధాన్ని బలపరుస్తుంది. బైబిలు ప్రకారమైన లైంగిక నీతిని అనుసరించదలచినవారికి, లైంగికత అనేది వివాహంలో మాత్రమే పూర్తిగా ఆనందించడానికి దేవుడు ఇచ్చిన వరం.[14]

► విద్యార్థులు తరగతి కోసం 1 కొరింథీయులకు 7:1-5 మరియు హెబ్రీయులకు 13:4 చదవాలి.

వివాహానికి ఒక ఉద్దేశ్యం లైంగిక కోరికలను తృప్తిపరచడమని 1 కొరింథీయులకు రాసిన పత్రికలోని వచనాలు చెబుతాయి. భార్యభర్తలు తమ సొంత శరీరాలపై తమ హక్కును విడిచిపెట్టి, ఒకరికొకరు అప్పగించుకుంటారు. అంటే, వివాహితులు తమకు నచ్చినప్పుడు మాత్రమే లైంగిక సంబంధం కలిగియుండడం కాకుండా తన భాగస్వామి కోరికలకు కూడా ప్రతిస్పందించాలి. ఒక వ్యక్తి, భాగస్వామికి ఇష్టం లేకపోయినా, సంతృప్తిని కోరగలడని ఈ వచనాలు చెప్పవు. బదులుగా, ఇరువురూ పరస్పర అవరసరాలకు స్పందించాలని చెబుతాయి.

భార్యభర్తలు ఒకరికొకరు ఈ విశేషాధికారం నుండి దూరంగా ఉండకూడదని ఈ వాక్యభాగం బోధిస్తుంది. ఉపవాసంలా కొద్ది కాల లైంగిక విరామం అనేది మంచిదే, కాని ఎక్కువకాలం దూరంగా ఉంటే తీరని కోరికలవల్ల శోధనకు గురౌతారు. కొన్నిసార్లు దంపతులు, ఒకరు దూరప్రాంతంలో పనిచేయడానికి లేదా చదువుకోవడానికి వెళ్ళినప్పుడు, కొన్నినెలలు లేదా అంతకంటే ఎక్కువకాలం వేరుగా ఉండాలని నిర్ణయించుకుంటారు. అటువంటి నిర్ణయం తీసుకునేముందు, ఆ ఆలోచన దేవుని ప్రణాళికకు అనుగుణంగా ఉందో లేదో చూసుకోవాలి. ఎక్కువకాలపు ఎడబాటు వలన వారు సమస్యలను ఎదుర్కొనవచ్చు.

కొందరు పిల్లలు లేకుండా ఉండే జీవనశైలిని కోరుకుంటారు, కానీ తల్లిదండ్రులకు దైవికమైన పిల్లలు ఉంటే దేవుడు ఇష్టపడతాడని బైబిలు బోధిస్తుంది (మలాకీ 2:15). దేవుడు కేవలం సంతానోత్పత్తిని మాత్రమే కాకుండా, *దైవికమైన* పిల్లల్ని కోరుతున్నాడని గమనించడం ముఖ్యం. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీస్తును వెంబడించేలా నేర్పించడానికి దేవుడు వారిని పిలిచాడు.

---

[14] "Spiritual Health and Porn Addiction," https://thefreedomfight.org/health/porn-addiction-and-spiritual-health/ నుండి July 31, 2023న తీసుకొనబడింది.

## వాక్యానుసారమైన వివాహం క్రీస్తు కొరకు

► విద్యార్థులు తరగతి కోసం 1 పేతురు 3:1-7 మరియు ఎఫెసీయులకు 5:22-33 చదవాలి. ఈ చర్చా సమయంలో, సమూహం పరిశీలన కోసం ఈ వాక్యభాగాల్ని తెరచి పెట్టుకోవాలి.

ఎఫెసీయులకు 5:30-32లో, యేసు వచ్చేవరకు మర్మంగా ఉంచబడిన వివాహ అర్థాన్ని పరిశుద్ధాత్ముడు బయలుపరచాడు. వివాహం అనేది యేసుక్రీస్తు, సంఘానికి మధ్య ఉండే సంబంధాన్ని ప్రతిబింబించే ఒక భూలోక చిత్రం.

పౌలు ఈ భాగాన్ని విశ్వాసులు ఆత్మతో నింపబడాలని ఉపదేశిస్తూ ఆరంభించాడు (ఎఫెసీయులకు 5:18). ఈ సందర్భంలోనే, వివాహం గురించిన కొన్ని సూచనలు ఇచ్చాడు.

**విశ్వాసులు యేసుకు లోబడినట్టుగా ఆత్మతో నింపబడిన వధువు ప్రభువునందు తన వరునికి (ఆమె "శిరస్సు)లోబడుతుంది** (ఎఫెసీయులకు 5:24, 32; అలాగే 1 పేతురు 3:1 కూడా చూడండి). ఈ విధంగా ఆమె యేసును అలాగే ఆమె భర్తను గౌరవిస్తుంది. భర్త విశ్వాసి కానప్పటికీ కూడా భార్య అతని నాయకత్వాన్ని అంగీకరించవలసి ఉంది. ఆమె ఇలా చేసినప్పుడు, రక్షించబడని తన భర్త విశ్వాసిగా మారే అవకాశం ఉంది.

ప్రతి భార్య లోబడి ఉండడంలో ప్రభువును దృష్టిలో ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఆమె ఆయనకు, ఆయన కోసం లోబడుతుందే గాని, కేవలం తన భర్త కొరకు మాత్రమే కాదు. ఆమె దృష్టి ఏ తప్పులేని ఆ యేసుపై పెడుతుంది. భార్య తన భర్తకు ఇష్టపూర్వకంగా లోబడినప్పుడు, అది యేసును ఆరాధించే చర్య అవుతుంది.

వాక్యానుసారమైన విధేయత, ప్రేమ వలె, బలవంతంగా చేయించదగినది కాదు. వాక్యానుసారమైన విధేయత క్రీస్తుపట్ల తమకున్న గౌరవాన్ని బట్టి భార్యలు తమ భర్తలకు ఇచ్చే ఒక బహుమతి. (ఎఫెసీయులకు 5:22-24). ప్రతి విషయంలో లోబడడం అంటే యేసుని ఆరాధించడమే.[15]

భార్య తన భర్తకు లోబడడం అంటే, ఆత్మతో నింపబడిన జీవితంలో భాగంగా (ఎఫెసీయులకు 5:18-21) అతన్ని గౌరవించడం (ఎఫెసీయులకు 5:33). సాధువైన, మృదువైన గుణం ద్వారా వచ్చే ఈ గౌరవం, దేవుని దృష్టికి బహు విలువైనది (1 పేతురు 3:4).

**ఆత్మతో నింపబడిన వరుడు** తన వధువుని, యేసు తన సంఘాన్ని ప్రేమించినట్లుగా ప్రేమిస్తాడు (ఎఫెసీయులకు 5:25). వరుడు తన సొంత శరీరాన్ని ప్రేమించుకున్నట్లుగా ఆమెను ప్రేమించాలి (ఎఫెసీయులకు 5:28-29). యేసు సంఘం

[15] ఈ విషయం గురించి మరింత తెలుసుకోవడానికి, *Spiritual Formation* లో 10వ పాఠాన్ని చూడండి, ఇది Shepherds Global Classroomలో అందుబాటులో ఉంది.

కోసం తననుతాను అర్పించుకున్నట్లే, అతడు అదే ఆత్మతో నింపబడిన త్యాగాన్ని చూపించాలి. ఇది, దేవునికి అతడు లోబడే చర్య (ఎఫెసీయులకు 5:21). ఒక వ్యాఖ్యత దీనిని ఇలా చెప్పాడు:

> సంఘాన్ని రక్షించడానికి ఆయన (యేసు) తననుతాను సిలువలో శ్రమలనుభవించడానికి అప్పగించుకున్నట్లుగా, భార్యను సంతోషపెట్టడానికి మనం కూడా మనల్ని మనం ఉపేక్షించుకుని, [కష్టపడి పనిచేయడం, కష్టాలను] భరించుటకు సిద్ధంగా ఉండాలి. ఆమెను పోషించడానికి [శ్రద్ధగా పనిచేయడం]; ఆమె అవసరాలు తీర్చడం; అనారోగ్యంగా ఉన్నప్పుడు ఆమెను చూసుకోవడానికి అవసరమైతే తన విశ్రాంతిని, సౌఖ్యాన్ని విడిచిపెట్టడం; ప్రమాదంలో ముందు నిలబడడం; ఆమె [ప్రమాదకరమైన పరిస్థితి]లో ఉన్నప్పుడు ఆమె ప్రక్కన నిలబడడం; ఆమెకు చిరాకుగా ఉన్నప్పుడు సహనంగా ఉండడం; దూరంగా నెడుతున్నప్పుడు ఆమెను హత్తుకోవడం; ఆత్మీయ సమస్యలో ఉన్నప్పుడు ఆమెతో కలిసి ప్రార్థించడం; ఆమెను రక్షించడానికి ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉండడం భర్త యొక్క బాధ్యత. ఇదెందుకు ఇలా ఉండకూడదు? ఒకవేళ ఓడ బద్దలై, సురక్షితంగా ఉండడానికి కేవలం ఒక్క చెక్క ముక్క మాత్రమే మిగిలియుంటే, తన ప్రాణానికి ముప్పు వచ్చినా, అతడు ఆమెను దానిపై కూర్చోబెట్టి సురక్షితంగా చూసుకోవడం అతని బాధ్యత కాదా? అయితే దీని కంటే మరింత గొప్ప బాధ్యత ఉంది......తన భార్య రక్షణ పొందాలని ఆశించడం భర్త జీవితంలో అతి ముఖ్యమైన లక్ష్యం. ఆమె ఆత్మకు అవసరమైన ప్రతిదానిని భర్త ఇవ్వాలి.....మరియు ఒక మాదిరిగా ఉండాలి; అవసరమైతే సలహా ఇవ్వాలి; రక్షణ మార్గాన్ని సాధ్యమైనంత సులభం చెయ్యాలి. భర్త, రక్షకునివలె తననుతాను ఉపేక్షించుకుని, త్యాగపూరితమైన మనసు కలిగియున్నప్పుడు, తన కుటుంబ రక్షణ కోసం చేసే ఏ త్యాగమైనా అది పెద్దగా అనిపించదు.[16]

క్రీస్తు, తన వధువు సంఘాన్ని పరిశుద్ధపరచినట్టుగా, వరుడు తన వధువు పరిశుద్ధతను కోరుకోవాలి (ఎఫెసీయులకు 5:26-27).

1 పేతురు 3:7 ప్రకారం, భర్త తన భార్యతో జ్ఞానంగా నడుచుకోవాలి, అంటే ఆమెను అర్థం చేసుకోవడానికి మంచిగా ప్రయత్నించాలి. ఆమె అవసరాలు అర్థం చేసుకోవడానికి ఆమెను లోతుగా తెలుసుకోవాలి. ఈ వచనంలో స్త్రీ, "బలహీనమైన ఘటమ"ని పిలువబడింది. భర్త తన భార్యను అర్థం చేసుకోవడం అవసరం. అతడు ఆమెను శారీరక ప్రమాదం నుండి మాత్రమే కాకుండా చింత, మానసిక ఒత్తిడి నుండి కూడా కాపాడాలి.

---

[16] Albert Barnes, *Barnes' Notes on the Whole Bible*. (Notes on Ephesians 5:25). Retrieved from https://studylight.org/commentaries/eng/bnb/ephesians-5.html on July 31, 2023.

భర్త, తన భార్య వృద్ధి చెందడానికి అవసరమైన ప్రతిదీ ఇవ్వాలి: నమ్మకత్వం, షరతులులేని ప్రేమ, అవగాహన, ప్రార్థన, సలహా, బోధ, మరియు దయ.

భర్త, తన భార్యను ఆ విధంగా ప్రేమించినప్పుడు, అతడు తిరిగి సంతోషాన్ని పొందుతాడు. "తన భార్యను ప్రేమించువాడు తన్ను ప్రేమించుకొనుచున్నాడు" (ఎఫెసీయులకు 5:28) అని పౌలు చెప్తున్నాడు. ఈ విధంగా, త్యాగపూరితమైన ప్రేమతో భార్యల్ని ప్రేమించే భర్తల్ని ప్రభువు దీవిస్తాడు, అంతేకాదు భార్యలు వాళ్లని గౌరవిస్తారు, ఆప్యాయత చూపిస్తారు, వాళ్లకు నమ్మకంగా ఉంటారు.

► భర్త తన భార్యకు ఆత్మీయ సహాయం కల్పించడానికి చేయవలసిన కొన్ని నిర్దిష్టమైన పనులు ఏంటి?

ఈ వచనాలలో ఆజ్ఞలు ఎలా ఉన్నాయో గుర్తుచేసుకోవడం చాలా ముఖ్యం. భర్త, తన భార్యపై అధికారం చూపించకూడదు. భార్య తన భర్తకు లోబడాలి, అయితే భర్త ఆమెను లోబడమని బలవంతం చేయకూడదు. అతడు తన భార్యను ప్రేమించాలి, అవసరమైతే ఆమె కోసం త్యాగం చెయ్యాలి. అలాగే, భర్త శ్రద్ధ చూపాలని భార్య బలవంతం చేయకూడదు; ఆమె అతన్ని గౌరవించాలి.

తన అధికారాన్ని నిలుపుకోవడం కాదుగాని ప్రేమను పంచడమేత భర్తకున్న ప్రాధాన్యత. తనపై శ్రద్ధ చూపమని కోరడం కాదుగాని భర్తను గౌరవించడమే భార్యకున్న ప్రాధాన్యత.

భర్త తన భార్యను సరిగా పట్టించుకోకపోతే, అతని ప్రార్థనకు అభ్యంతరం కలుగుతుందని అపొస్తలుడైన పేతురు హెచ్చరించాడు. ఒక వ్యక్తి తన భార్యకు చూపవలసినంత శ్రద్ధ చూపనప్పుడు, దేవుణ్ణి ప్రేమించవలసినంతగా ప్రేమించడని పౌలు, పేతురు మాటల్లో మనకు అర్థమౌతుంది. భర్తను గౌరవించవలసిన రీతిలో గౌరవించని స్త్రీ, దేవుణ్ణి గౌరవించదు. **వివాహ జీవితంలోని మన ప్రవర్తన, దేవునితో ఉన్న మన సంబంధాన్ని ప్రభావితం చేస్తుంది.**

## వివాహపు స్థిరత్వం

వివాహ వ్యవస్థ స్థిరంగా ఉండాలని దేవుడు ఉద్దేశించాడు. వివాహంలో, స్త్రీ పురుషుడు జీవితకాలం ఒకరికొకరు నమ్మకంగా ఉంటామని వాగ్దానం చేస్తారు.

పరిసయ్యులతో జరిగిన సంభాషణలో, వివాహం గురించి యేసు మాట్లాడిన మాటలు బైబిలులో ఉంటాయి.

► ఒక విద్యార్థి తరగతి కోసం మత్తయి 19:3-8 చదవాలి.

వివాహ వ్యవస్థను శాశ్వతంగా ఉండడానికే దేవుడు ఉద్దేశించాడని యేసు చెప్పాడు. విడాకులు అనేవి దేవుణ్ణి అనుసరించని వారి కోసం ఏర్పరచబడ్డాయని అయన చెప్పాడు.

దేవుడు వివాహాన్ని శాశ్వతంగా ఉండాలని ఉద్దేశించడానికి అనేక కారణాలు ఉన్నాయి, వాటిలో కొన్ని గత భాగంలో మనం చర్చించాం. వివాహం శాశ్వతంగా ఉండడానికి మరో కారణం, పిల్లలు. వివాహ విషయంలో దేవుని ప్రణాళికకు లోబడడం, పిల్లల్ని పెంచడానికి ఒక మంచి వాతావరణాన్ని సృష్టిస్తుంది. తల్లిదండ్రులు తమ వైవాహిక బంధంలో, అలాగే తమ కుటుంబంలో దేవుని నియమాలకు లోబడినప్పుడు, పిల్లల్ని దేవుని భయభక్తుల్లో పెంచగలుగుతారు (మలాకీ 2:15).

పిల్లలు, పెరిగి పెద్దవారవ్వడానికి అనేక సంవత్సరాలు పట్టేంత విధంగా దేవుడు మానవుని జీవితాన్ని రూపొందించాడు. ఈ సమయంలో, పిల్లలు తమ భద్రత, పోషణ, శిక్షణ కోసం తల్లిదండ్రుల మీద ఆధారపడతారు. ఇది ఒకటి లేక రెండు సంవత్సరాల్లోనే పరిపక్వతను పొందే జంతువుల కంటే భిన్నంగా ఉంది. మనుష్యులు పరిపక్వతలో అభివృద్ధి చెందడానికి ఎక్కువ సమయం అవసరం. కుటుంబం పిల్లలను పెంచడానికి దేవుడు రూపొందించిన మార్గం. నమ్మకమైన తల్లిదండ్రులున్న కుటుంబాలు లేకపోవడం వల్లనే సమాజంలో అనేక సమస్యలు ఎదురౌతున్నాయి.

వివాహ వ్యవస్థలో, జీవితకాలం ఒకరికొకరు కట్టుబడి ఉంటామని వాగ్దానం చేసుకునే ప్రజలు కావాలి. వివాహాన్ని ఎంతో నిబద్ధతతో చూపించే ఆచారాలు లేక విధానాలు ప్రతి సంస్కృతిలో ఉంటాయి. ఈ ఆచారమే, స్త్రీ పురుషుడు జీవితకాలం ఒకరికొకరు కట్టుబడి ఉంటామని బహిరంగంగా తెలియజేసే మార్గం.

చాలా ప్రభుత్వాలు వివాహాల రికార్డులను నిర్వహిస్తాయి. వివాహ చట్టాలు భూయాజమాన్యంపై, పిల్లల సంరక్షణపై, మరియు వారసత్వంపై ప్రభావం చూపుతాయి.

ఇది, అనేక వివాహాల్లో ఉపయోగించే వివాహ ప్రమాణాల ఉదాహరణ:

> ఈ రోజు మొదలు కష్టమందును, దుఃఖమందును, కలిమియుందును, లేమియందును, వ్యాధియందును ఆరోగ్యమందును, నిన్ను ప్రేమించి, పోషించి, మరణం మనల్ని వేరు చేసేంతవరకు దేవుని పరిశుద్ధ నిర్ణయం చొప్పున నా [భర్త/భార్య] గా అంగీకరించుచున్నానని ప్రమాణము చేస్తున్నాను.

ప్రేమ భావాలు ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉండవు, మారుతూ ఉంటాయి. అటువంటి మార్పు చెందే వ్యక్తిగత భావాలపై వివాహ బంధం ఆధారపడి ఉండదు. వివాహ ప్రమాణాలు అంటే భార్యాభర్తలిద్దరూ చివరి శ్వాస వరకూ ఒకరికొకరు నమ్మకంగా ఉంటామని చేసుకునే వాగ్దానం. ఈ వాగ్దానం ఎటువంటి షరతుల మీద ఆధారపడి ఉండదు.

వివాహం శాశ్వతమైనది కాబట్టి, క్రైస్తవులు తమ వైవాహిక జీవితంలో సమస్యలు వచ్చినప్పుడు, విడాకులు తీసుకుంటామని చెప్పే మాటలను అస్సలు వాడకూడదు. "నిన్ను పెళ్లి చేసుకోకుండా ఉండాల్సింది" లేదా "మనం విడిపోదామా?" లాంటి మాటలు అనకూడదు. కొన్నిసార్లు, ఇలాంటి మాటలు అవతలి వ్యక్తి తమ వివాహ బంధం పట్ల ఎంత శ్రద్ధ చూపిస్తాడో తెలుసుకోవడానికి ఒక ప్రయత్నంగా వాడతారు. ఇలా కఠినమైన మాటలు చెబితే, అవతలి వ్యక్తి భార్య/భర్తను సంతోషపెట్టడానికి ఇంకా ఎక్కువగా ప్రయత్నిస్తారని అనుకుంటారు, కానీ అది చాలా అరుదుగా జరుగుతుంది. బదులుగా, అవతలి వ్యక్తి "సరే, నీకు కావాలంటే మనం విడాకులు తీసుకోవచ్చు" అని అంటారు. అప్పుడు ఇద్దరూ తమ కోరికల వల్ల విడాకులు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పినట్లు అవుతుంది, మరియు బంధం మరింత దిగజారుతుంది.

► వివాహం ప్రేమ వ్యక్తీకరణతో కాకుండా ప్రమాణాలతోనే ఎందుకు ఆరంభమవుతుంది?

► అతను/ఆమె వివాహ బంధంలో అవసరమైన సమర్పణను గ్రహించకుండా, కేవలం వివాహ బంధంలోని ప్రయోజనాలనే ఆశించి దానిలో ఎలా ప్రవేశించారో మీలో ఎవరో పంచుకోగలరా?

## వివాహం, క్రైస్తవ భాగస్వామ్యం

► ఒక విద్యార్థి తరగతి కోసం 2 కొరింథీయులకు 6:14-18 చదవాలి.

ఒకవేళ విశ్వాసి అవిశ్వాసులతో సన్నిహితంగా ఉంటే, అది ఆ విశ్వాసి సమర్పణకు భంగం కలిగిస్తుందని ఈ వచనాలు పేర్కొంటాయి. ఒక విశ్వాసి, సాతానుని ఆరాధించే వ్యక్తితో కలిసి అరాధించలేనట్లుగానే, అతడు అవిశ్వాసుల జీవనశైలులను, ప్రాధాన్యతలను అనుసరించలేడు. వ్యాపార భాగస్వామ్యాలతో పాటుగా వివిధ రకాల సంబంధాలకు కూడా ఈ హెచ్చరిక వర్తిస్తుంది.

వివాహం, మానవుల మధ్య ఉండే అత్యంత సన్నిహిత బంధం. ఒక విశ్వాసి, సమర్పణలేని మరొక విశ్వాసిని వివాహం చేసుకోకూడదు (1 కొరింథీయులకు 7:39). అవిశ్వాసిని పెళ్లి చేసుకున్న విశ్వాసికి, పిల్లల్ని పెంచే విషయంలోనూ, జీవిత నిర్ణయాల విషయంలోనూ అనేక ఆటంకాలు, చింతలు ఎదురౌతాయి.

భార్యభర్తలిరువురూ విశ్వాసులై ఉండి, వేర్వేరు సంఘాల నుండి వచ్చినట్లయితే, ప్రధాన ఆత్మీయ విషయాల్లో వారిద్దరూ ఏకీభవించేలా చూసుకోవాలి. వారు పెళ్లి తర్వాత, ఒకే స్థానిక సంఘానికి వెళ్లేలా చూసుకోవాలి.

## దంపతులు తమ వివాహ జీవితాన్ని బలపరచుకునే మార్గాలు

**(1) వాళ్ళు దేవుని అసలు ప్రణాళికను ఆనందిస్తూ, వివాహ జీవితంలో ప్రత్యేకమైన వాళ్ల ముఖ్య బాధ్యతల్ని అభినందించాలి.**

భర్త, తన భార్య దేవుడిచ్చిన బహుమానమని, తనను సంపూర్తి చేసే సహాయకురాలని గుర్తుంచుకోవాలి. ఆమె భద్రత కోసం, ఆత్మీయ, మానసిక, శారీరక శ్రేయస్సు కోసం అతడు తన ప్రాణం పెట్టాలి. కేవలం దేవుడు మాత్రమే ఆమెలో మార్పు తీసుకురాగలడని గ్రహించి, ఆమె అర్హురాలు కాకపోయినా ప్రేమించాలి, ఆమె పట్ల కృతజ్ఞతాభావంతో ఉండాలి. దేవుడు అతని విధేయతను, విశ్వాసాన్ని గౌరవిస్తాడు.

దేవుడు తన భర్తను తనకు శిరస్సుగా చేశాడన్న విషయాన్ని భార్య గౌరవించాలి, ప్రతి విషయంలో అతన్ని, అతని నాయకత్వాన్ని గౌరవించాలి. అతడు తప్పులు చేసినప్పటికీ, అర్హుడు కానప్పటికీ అతనికి లోబడి అతన్ని గౌరవించాలి. అతనిలో రావాల్సిన మార్పుని దేవుడు తీసుకొస్తాడని ప్రార్థన చేయాలి. దేవుడు ఆమె విధేయతను, విశ్వాసాన్ని గౌరవిస్తాడు.

**(2) వివాహమైన దంపతులు నిజమైన ఆత్మీయతను, శారీరక సాన్నిహిత్యాన్ని పెంపొందించుకోవాలి**

వారు భయం, విమర్శ, ఇతరులతో పోల్చుకోవడం , దుర్వినియోగం, స్వార్థపు కోరిక, లేక భ్రష్టత్వం ఇవేవీ లేకుండా ఒకరినొకరు *తెలుసుకోవడానికి* ప్రయత్నించాలి. వారు దేవుని యెదుటను, ఒకరి యెదుట మరొకరును పారదర్శకత, యథార్థతతో జీవించాలి.

**(3) వివాహ దంపతులు విఫలమైనప్పుడు, దేవుని కృపా మాదిరిని అనుసరించాలి.**

ఆదాము హవ్వ పాపంలో పడి, అవమానంతో పశ్చాత్తాపపడినప్పుడు, దేవుడు వారి వైఫల్యాలు సవరించడానికి తన శక్తిని కనుపరచాడు. దేవుడు, వారి దిగంబరతను కప్పడానికి, జంతువును బలి ఇచ్చి చొక్కాయిలను చేయించాడు (ఆదికాండము 3:21). దేవుని ప్రేమగల ఈ కార్యం, కృపకు, క్రీస్తు ద్వారా విమోచన వాగ్దానానికి ప్రతీక. మనం క్షమాపణను, పునరుద్ధరణను పొందునట్లు క్రీస్తు కృప చూపాడు. వివాహ దంపతులు విఫలమైనప్పుడు కూడా క్రీస్తు ద్వారా ఎటువంటి అవమానం లేకుండా సన్నిహిత సంబంధంలోకి తిరిగి రాగలరు.

## ముగింపు

వివాహ వ్యవస్థ, దేవుని సృష్టి కాని మానవునిది కాదు. కాబట్టి, సలహా కోసం దేవుని దగ్గరకు వెళ్లాలి గాని లోకం లేక సంస్కృతిని ఆశ్రయించకూడదు. మన వైవాహిక సంబంధాల్ని ఎలా బలపరచాలో, ఎలా నడిపించాలో, ఎలా ఆశీర్వదించాలో కేవలం ఆయనకు మాత్రమే తెలుసు. అయితే పరిశుద్ధాత్ముని సహాయం లేకుండా మనం ఎప్పటికీ మంచి భాగస్వాములుగా ఉండలేం!

## సమూహ చర్చ కోసం

► వివాహం విషయంలో చాలామంది మరచిపోయే ఒక సత్యం ఏంటి?

► వివాహ బంధాల్ని బలపరచడానికి సంఘం బోధించవలసిన సూత్రాలు వివరించండి. ముఖ్యంగా, మీ ప్రాంతంలో వివాహం గురించి ఏ అవగాహన లోపించింది?

## ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ,

వివాహమనే అద్భుతమైన బహుమానాన్ని మాకు ఇచ్చినందుకు కృతజ్ఞతలు. దాన్ని అందంగా రూపొందించినందుకు కృతజ్ఞతలు. వివాహ బంధాన్ని, మేం నీ ప్రణాళిక చొప్పున అనుభవించడానికి కావలసిన సమర్పణను చేసుకోవడానికి సహాయం చేయండి.

క్రీస్తుకు, సంఘానికి మధ్య ఉన్నటువంటి ప్రేమను ప్రతిబింబించేలా మాకు సహాయం చెయ్యండి.

ఒకరికొకరు గౌరవించుకునే విషయంలో సంప్రదాయాల ఊహలకు మించి నడుచుకోవడానికి సహాయం చెయ్యండి.

సంతోషకరమైన, బలమైన బంధాల్ని సాధ్యపరచే పరిశుద్ధాత్మ పనికై వందనాలు.

ఆమెన్

## పాఠం అభ్యాసాలు

(1) ఈ పాఠంలో మీకు క్రొత్తగా అనిపించిన రెండు సూత్రాలను ఎన్నుకోండి. వాటిని మీ సొంతమాటల్లో వివరిస్తూ ఒక పేరా రాయండి.

(2) క్రింద ఇవ్వబడిన అంశాల్లో ఒకదానిపై క్లుప్త వివరణ (ప్రెజెంటేషన్) సిద్ధం చేయండి. (తరగతి నాయకుడు, ప్రతి విద్యార్థికి ఒక అంశాన్ని కేటాయిస్తాడు.) తరువాత తరగతిని ప్రారంభించేటప్పుడు ఆ వివరణను (ప్రెజెంటేషన్) పంచుకోండి.

- వివాహంలో, దేవుడు ఏర్పరచిన ఐక్యత
- వివాహం గురించి బైబిలు ఉద్దేశ్యాలు
- వివాహంలో దేవుడిచ్చిన పాత్రలు, మరియు ఆ పాత్రల్ని నెరవేర్చడానికి ఆత్మతో నింపబడే ప్రాముఖ్యత.
- వివాహం యొక్క స్థిరత్వం

(3) మీరు అవివాహితులై, భవిష్యత్తులో వివాహం చేసుకునే ప్రణాళికలో ఉంటే మీ భవిష్యత్ వివాహంలో దేవుని సూత్రాలకు లోబడాలనే సమర్పణ గురించి రెండు పేరాలు రాయండి. మీరు వివాహితులైతే, మీ వివాహ బంధంలో దేవుని సూత్రాలకి లోబడాలనే సమర్పణ గురించి రెండు పేజీలు రాయండి.

## స్త్రీల పట్ల గౌరవం

నాలుగో పాఠం మొదలుపెట్టే ముందు, తరగతి మొత్తం అనుబంధం A-ను అధ్యయనం చేసి, చర్చించాలి. ఇది స్త్రీల పట్ల గౌరవం గురించి మాట్లాడుతుంది, ఇది వివాహానికి, కుటుంబానికి సంబంధించిన అంశం.

# పాఠం 4

# లైంగికత - విషయాలు

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) పతనం, మానవుని స్వభావాన్ని, లైంగిక కోరికల్ని ఎలా ప్రభావితం చేసిందో చర్చించాలి.

(2) వ్యక్తిగత గుర్తింపును, అలాగే అది వ్యక్తిగత నైతికతకు ఎలా వర్తిస్తుందో వివరించాలి.

(3) మానవ లైంగికత, లైంగిక అనైతికతగురించి బైబిలు దృక్పథాన్ని అంగీకరించాలి.

(4) పాపం నుండి స్వేచ్ఛను కనుగొని, అనైతికతకు నడిపించే శోధనలో జయాన్ని అనుభవించాలి.

(5) సహాయం, విజయం అవసరమైన వారికి పరిచర్య చేయడానికి సిద్ధంగా ఉండాలి.

## క్రిష్టఫర్ యూస్

క్రిస్టోఫర్ యునైటెడ్ స్టేట్స్‌లోని ఒక ఆసియా-అమెరికన్ కుటుంబంలో పెరిగాడు. అతను యుక్తవయస్సు నుంచే స్త్రీల పట్ల కాకుండా పురుషుల పట్ల ఆకర్షితుడయ్యాడు. అతని తల్లిదండ్రులు తమ కొడుకుకున్న ఈ ఆసక్తిని చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు, సిగ్గుపడ్డారు. యువకుడిగా అతను పురుషులతో అనేక సంబంధాలు పెట్టుకున్నాడు. అతను నిజమైన ప్రేమను, సమర్పణను కనుగొంటాడని ఆశించాడు, కానీ ప్రతి సంబంధం చివరికి విఫలమైంది. అతను నిర్లక్ష్యంగా చాలా మంది పురుషులతో అనైతిక సంబంధాలు పెట్టుకోవడం ప్రారంభించాడు. అతని తల్లి విశ్వాసిగా మారి, అతను ఇంతకు ముందెన్నడూ అనుభవించని ప్రేమను, అంగీకారాన్ని అతనికి చూపినప్పుడు క్రిస్టోఫర్ జీవితంలో అంతా మారడం ప్రారంభించింది. దేవుని స్వరూపంలో తాను ఒక వ్యక్తిగా ఉన్నాడని అతను గ్రహించడం మొదలుపెట్టాడు. అతను పశ్చాత్తాపపడి, తన జీవితంలోని అన్ని విషయాలను దేవునికి సమర్పించాడు. దేవునితో తన సంబంధంలో నెరవేర్పును, ఉద్దేశ్యాన్ని కనుగొన్నాడు.

## పతనమైన మానవ స్వభావం, పాప కోరికలు

దేవుడు ఆదాము హవ్వను సృజించినప్పుడు, ఎటువంటి లోపం లేకుండా వారిని అన్ని కోణాల్లో పరిపూర్ణంగా చేశాడు (ఆదికాండము 1:31). వాళ్ల స్వభావం, ఏది సరైనదో ఏది మంచిదో దాన్నే కోరుకునేది. వారి మనసులు, శరీరాలు పరిపూర్ణంగా పనిచేసేవి. కాని ఆ తరువాత, ఆదాము దేవుని ఆజ్ఞలకు అవిధేయుడయ్యాడు. అతను అలా చేసినప్పుడు, మానవుని స్వభావం చెడిపోయింది (రోమా 8:20-23). మానవుల శరీరాలు, మనసులు ప్రభావితమయ్యాయి. ఆరోగ్యవంతుడు, జ్ఞానవంతుడు కూడా పాప ఫలితాలకు గురయ్యాడు. పరిపూర్ణంగా ఉన్నదానిని, పాపం శాశ్వతంగా నాశనం చేసింది. క్రీస్తు తిరిగి వచ్చే వరకు సృష్టిలో ఏది పరిపూర్ణ స్వస్థత పొందుకోలేదు (1 కొరింథీయులకు 15).

మానవుని స్వభావం, శరీరాలు నాశనానికి గురయ్యాయి గనుక, మన శరీర కోరికలు ఎప్పుడూ మంచిగా, సమతుల్యంగా ఉంటాయని మనం అనుకోకూడదు. వాస్తవం ఏంటంటే, మన కోరికలు సమతుల్యంగా ఉండట్లేదు. మనుష్యులు సహజంగానే చెడును కోరుకుంటున్నారు. యేసు, హృదయంలో నుండి వచ్చే పాపాల జాబితా గురించి మాట్లాడినప్పుడు, సహజ మానవుని పాప స్వభావాన్ని గమనించాడు (మార్కు 7:21-22).

ఈ పాఠంలో, మనం లైంగిక సమస్యలు గురించి మాట్లాడుతున్నాం. మానవుని కోరికలన్నిటిలో, లైంగిక కోరిక అత్యంత శక్తివంతమైనదిగా ఉండవచ్చు.

తప్పుడు లైంగిక కోరికలు, వాటిని కలిగి ఉన్న వ్యక్తికి సహజంగానే కనిపిస్తాయి. తన కోరికల్ని తీర్చుకుంటున్నందుకు తనను ఎవ్వరు తప్పుపట్టకూడదని భావిస్తాడు. అయితే, ప్రతి వ్యక్తి సరైంది చేయడానికి, తన స్వాభావిక కోరికలను ఎదురించాలి. ఒక వ్యక్తికి అబద్ధం చెప్పే స్వభావం ఉండొచ్చు, లేక దొంగతనం లేక హింసాత్మకంగా ఉండడం, సోమరితనం, లేక అసహనంగా ఉండే స్వభావం ఉండొచ్చు. లోపాలతో పుట్టడానికి ప్రజలు బాధ్యులు కారు కాని, సహజ కోరికల్ని అనుసరించి పాపం చేసినప్పుడు వాళ్లు దోషులౌతారు.

కొన్నిసార్లు చిన్నతనంలో లైంగిక వేధింపులకు గురవ్వడంవల్ల లేక పరిసరాల పరిస్థితుల కారణంగా కొందరు స్వలింగ సంపర్క కోరికలతో లేక ఇతర తప్పుడు లైంగిక కోరికలతో బాధపడుతుంటారు. అయితే, తప్పుడు లైంగిక కోరికల్ని ఇతర పాప కోరికలకు భిన్నంగా చూడకూడదు. కారణం ఏదైనప్పటికీ, ఆ వ్యక్తి విమోచించబడాలంటే, దేవుని నుండి శుద్ధీకరణపొందాలంటే అదే కృప అవసరమౌతుంది.

తప్పుడు కోరికలు కొంతమందికి తప్పుగా అనిపించవనే వాస్తవాన్ని బట్టి మనం ఆశ్చర్యపోకూడదు. పాప కోరికలుగల వ్యక్తికి పాపం సాధారణంగా, సహజంగా అనిపిస్తుంది.

మనం స్వభావసిద్ధంగా దైవ ఉగ్రతకు పాత్రులమయ్యాం (ఎఫెసీయులకు 2:3). అంటే, మనం స్వాభావికంగా పాపానికి మొగ్గుచూపుతాం, మరియు స్వాభావికంగా పాపం చేయడం ద్వారా మనల్ని మనం శిక్షావిధిలోకి తెచ్చుకుంటున్నాం. ఒక వ్యక్తి పాపస్వభావంతో పుట్టాడంటే, అది అతనికి సహజంగా అనిపించినప్పటికీ అతడు దానిని అనుసరించాలని కాదు దీని అర్థం.

► మనం మన స్వాభావిక కోరికలన్నిటికి ఎందుకు లోబడకూడదు?

మనం క్రీస్తుతో సారూప్యంగలవారగుటకు పిలువబడ్డామని బైబిలు బోధిస్తుంది (రోమా 8:29). మనం ప్రభువైన యేసుక్రీస్తును ధరించాలి. మన శరీరేచ్ఛలు జీవనాధారం కాకూడదు. బదులుగా, తప్పుడు ప్రేరణల్ని దేవుని అధికారానికి అప్పగించాలి (రోమా 13:14).

► మన తప్పుడు ప్రేరణల్ని దేవుని అధికారానికి లోబరచడం ఎలా ఉంటుంది?

మీ లైంగిక కోరికల్ని, దేవుని స్వరూపాన్ని ప్రతిబింబిస్తూ ఆయన్ను మహిమపరచాలనే మీ అంతిమ ఉద్దేశ్యానికి లోబరచాలి. క్రీస్తును అనుసరించే జీవితం, మీకున్న దేవుని స్వరూపానికి అనుగుణంగా ఉండే జీవితంతో సమానం.

## మానవుని గుర్తింపు

### మానవుని గుర్తింపును గురించి సరైన అవగాహన

అనేకమంది వారి మానవ స్వభావం తమను మంచి మార్గంలో నడిపిస్తుందని తప్పుగా భావిస్తారు. వ్యక్తిగత స్వభావంవల్ల కలిగే కోరికలు వాళ్లని తృప్తిపరుస్తాయని భావించడం వాళ్లకు సరైందిగా అనిపిస్తుంది. వాళ్ళ స్వభావం పాపం వల్ల నాశనమైందని, అందుకే దాన్ని నమ్మకోకూడదనే వాస్తవాన్ని గ్రహించరు. ఒక వ్యక్తి స్వాభావిక కోరికలు అతన్ని తృప్తిపరచలేవు ఎందుకంటే అవి వికృతమైనవి. దేవునికి వేరుగా, మానవుని స్వాభావిక కోరికలు సరైన నైతికతలోకి నడిపించలేవు.

ప్రజలు వారి జీవితంలో సొంత ఉద్దేశ్యాన్ని సృష్టించుకోవడానికి సొంత కోరికల్ని, భావాల్ని అనుసరించాలనే నమ్మకంతో జీవిస్తున్నారు. వారు ఏ అధికారానికి లేక నైతిక ప్రమాణాలకు లోబడకుండా సొంత గుర్తింపును సృష్టించుకోవడం చాలా ముఖ్యమని అనుకుంటారు. వ్యక్తులు ఏది మంచిదో, ఏది విలువైందో వారే నిర్ణయించుకోవాలనుకుంటారు. మంచి మార్గంలో నడిపించబడ్డానికి సొంత ఆలోచనలను నమ్ముకుంటారు. వారు తమ ప్రవర్తనను పరిమితం చేసే సంస్థల్ని లేక నియమాల్ని ఇష్టపడరు. చెడిపోయిన మానవ స్వభావం దేవుని వాక్యానికి బదులుగా నైతికతకు ప్రమాణంగా మారిపోతుంది.

లైంగికత మానవ స్వభావంలో శక్తివంతమైంది గనుక, చాలామంది లైంగిక కోరికలను వారి గుర్తింపుకు కేంద్రమని భావిస్తారు. వాళ్లు వాళ్లుగా ఉండాలంటే లైంగిక కోరికల్ని అనుసరించాలని అనుకుంటారు. ప్రజలు లైంగికత అంటే వాళ్లకు ఏది కావాలో లేక వాళ్లు ఏం చేస్తున్నారో అనేది కాదు, అది వాళ్ల గుర్తింపని భావిస్తారు. దానిని వారి గుర్తింపుగా చేసుకుంటారు.

లోక ఆలోచనకు భిన్నంగా, **మనం దేవుని స్వరూపంలో సృజించబడ్డామని, దేవునితో సంబంధం కలిగి ఉండడానికి ఉద్దేశించబడ్డామని బైబిలు మాట్లాడుతుంది. మానవులుగా ఇదే మన నిజమైన గుర్తింపు.**

ఈ లోకంలో ఏది కూడా మనకు నిజమైన గుర్తింపు ఇవ్వదు. ఈ లోకంలో ప్రస్తుతం మనకున్న లక్షణాలు కేవలం మన పరిస్థితులు మాత్రమే. అవి మన వ్యక్తిత్వాన్ని నిర్ణయించలేవు. మన జాతి, సామాజిక హోదా, లేక ఆర్థిక స్థాయి మన గుర్తింపు కాదు, అవి కేవలం మన పరిస్థితులు మాత్రమే. ఒక వ్యక్తి వైద్యుడు కావచ్చు, సినీ నటుడు కావచ్చు లేక దేశ నాయకుడు కావచ్చు, కాని అతడు దేవుని యెదుట దేవుని స్వరూపంలో సృజించబడిన దేవుని సృష్టి మాత్రమే, ఈ గుర్తింపే చాలా ముఖ్యమైంది.

మన లైంగికత మన జీవిత పరిస్థితిలో ఒక ముఖ్య భాగం. మనకు లైంగిక కోరికలు, ఆశలు, నిరాశలు ఉంటాయి. కాని అవి మన గుర్తింపు కాదు; అవి కేవలం మన పరిస్థితిలో ఒక భాగమే.

ఆదాము చేసిన పాపం మానవాళిని దేవునికి దూరం చేసింది కాబట్టి మనం పాప స్వభావంతో పుట్టాం (రోమా 5:18). అయితే మన పాప స్వభావం కూడా మన గుర్తింపు కాదు; అది మన పరిస్థితి, మరియు ఆ పరిస్థితి దేవుని కృప, శక్తి ద్వారా మారగలదు (రోమా 5:19).

► ఒక వ్యక్తి *గుర్తింపు*కు, అతని *స్థితికి* మధ్య వ్యత్యాసం ఏంటి?

**మానవుని గుర్తింపు మరియు వ్యక్తిగత నైతికత**

గుర్తింపు అనేది ముఖ్యం ఎందుకంటే ఒక వ్యక్తి తన నైతికతను తన గుర్తింపుపై ఆధారం చేసుకుంటాడు. నైతికత అంటే ఒకరి ప్రవర్తనను తప్పు లేక ఒప్పుగా చూపించే నియమాలు. ఒక వ్యక్తి లైంగికతనే గుర్తింపుగా భావిస్తే, అతని లైంగిక కోరికల్ని అనుసరించడం *సరైనదే* అని అనుకుంటాడు.

కొన్నిసార్లు ఒక వ్యక్తి "నేను ఇలా పుట్టాను; నేను ఇలా చేయడం సహజం; కాబట్టి, ఇది నాకు తప్పు కాదు" అని చెబుతుంటారు. అయితే మనందరం పాప స్వభావంతో పుట్టామని బైబిలు బోధిస్తుంది (రోమా 5:12, ఎఫెసీయులకు 2:3). మనకు సహజంగా అనిపించినంత మాత్రాన మన పాప స్వభావాన్ని అనుసరించడం సరైనది కాదు.

మన పాప స్వభావం మన నిజమైన వ్యక్తిత్వం కాదు. మన పాప స్వభావం మన స్థితి మాత్రమే. మన లైంగికత కూడా మన గుర్తింపు కాదు. మనం దేవుని స్వరూపంలో చేయబడడమే మన గుర్తింపు. మనం ఈ సత్యాన్ని ఒప్పుకున్నప్పుడు, ఏది మంచిదో ఏది చెడ్డదో నిర్ణయించువాడు దేవుడేనని, మనం ఆయనకు లెక్క అప్పజెప్పవలసినవారమని గ్రహిస్తాం. మన నిజమైన గుర్తింపు, పరిశుద్ధ ప్రవర్తన గురించిన సరైన ప్రామాణికతను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది.

► ఒక వ్యక్తికి తన గుర్తింపుపై ఉన్నటువంటి అవగాహన, తన నైతికతపై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది?

**లింగం (జెండర్) గురించి సరిగా అర్థం చేసుకోవడం**

మనుష్యులు, చాలా జంతువులు, ఆడు-మగవిగా విభజించబడ్డాయని మనందరికీ తెలుసు. దేవుడు కూడా పురుషుడు లేక స్త్రీ అని మనం అనుకోవచ్చు, కాని అది తప్పు. దేవుడు లింగ భేదానికి అతీతుడు, స్త్రీ పురుషులు ఉనికిలోనికి రాకముందే ఆయన ఉన్నాడు. స్త్రీ పురుషులు ఇద్దరినీ దేవుడు తన స్వరూపంలో సృజించాడు (ఆదికాండము 1:27). స్త్రీ పురుషులు ఇరువురూ దేవుని స్వరూపానికి ప్రతిరూపాలు.

దేవుని స్వరూపం, మానవుని స్వభావంలో చేర్చబడిన ఒక భాగం మాత్రమే కాదు. దేవుని స్వరూపం అంటే, ప్రేమించే సామర్థ్యం, అందాన్ని ప్రశంసించడం, తప్పొప్పులను తెలుసుకునే శక్తి వంటి లక్షణాలు మాత్రమే కాదు. మానవుని స్వభావం అంతా కూడా దేవుని ప్రతిబింబమే. దేవుని స్వరూపమే మన అసలైన ఉనికికి సారం. మనం ప్రధానంగా దేవుని స్వరూపంలో సృజించబడినవారం. మానవుని పరిస్థితిలో ఏది కూడా ప్రాధమిక గుర్తింపు అవ్వకూడదు లేక మన నైతికతకు ఆధారమవ్వకూడదు.

దేవుడు స్త్రీలుగా పురుషులుగా సృష్టించడం, వాళ్ళు దేవుని స్వరూపాన్ని ఎలా వ్యక్తపరచాలన్న దేవుని ప్రణాళికలో భాగం. కొందరు దేవుడు వారికిచ్చిన లింగాన్ని తిరస్కరిస్తారు. వ్యతిరేక లింగంగా జీవించడానికి ప్రయత్నిస్తారు. కొందరైతే శస్త్ర చికిత్సల ద్వారా వారి శరీర ఆకారాన్నే మార్చుకుంటారు. ఇలా చేయడం, దేవుని సృష్టిని నాశనం చేయడమే అవుతుంది ఎందుకంటే ఒక వ్యక్తి తన శరీర ఆకారాన్ని మార్చుకున్నంత మాత్రాన లింగాన్ని మార్చలేడు. ప్రతి వ్యక్తి, కేవలం శారీరకంగానే కాకుండా స్వభావమంతటిలో స్త్రీ లేక పురుషుడుగానే ఉంటాడు. దేవుడు మనకిచ్చిన లింగంలో కూడా ఆయన స్వరూపాన్ని ప్రతిబింబిస్తూ, ఆయనకు మహిమ తీసుకురావాలని కోరుతున్నాడు.

### దేవుని నైతిక ప్రమాణం

► ఒక విద్యార్థి తరగతి కోసం హెబ్రీయులకు 13:4 చదవాలి.

వివాహాన్ని ఘనంగా ఎంచాలని ఈ వచనం చెబుతుంది. లైంగిక పాపం అంటే వివాహాన్ని అగౌరవపరచడమే. దేవుడు జారత్వానికి తీర్పుతీర్చుతాడు.

► ఒక విద్యార్థి తరగతి కోసం 1 కొరింథీయులకు 6:18 చదవాలి.

లైంగిక పాపాల్లో, కామపు కల్పనలు, జారత్వం, వ్యభిచారం, వరుసకాని వారితో లైంగిక సంబంధం, మానభంగం, పిల్లలపై లైంగిక వేధింపులు, స్వలింగ సంపర్క కార్యకలాపాలు, అశ్లీలత భాగం.

- **కామపు కల్పనలు:** జీవిత భాగస్వామి కాకుండా మరొకరితో లైంగిక చర్య గురించి ఊహించడం.
- **జారత్వం:** వివాహం కానివారి మధ్య లైంగిక చర్య.
- **వ్యభిచారం:** వివాహమైన మరొక వ్యక్తితో లైంగిక చర్య.
- **వరుసకాని వారితో లైంగిక సంబంధం:** మీ జీవితభాగస్వామితో కాకుండా సన్నిహిత బంధువుతో లైంగిక చర్య.
- **లైంగిక దాడి / మానభంగం:** లైంగిక వేధింపులు, ఇష్టం లేకుండా ఒక వ్యక్తిని లైంగిక చర్యకు బలవంతం చేయడం.
- **పిల్లలపై లైంగిక వేధింపులు:** లైంగిక సంబంధమైన నిర్ణయాలు తీసుకునే వయసులేనివారితో లేక లైంగిక కోరికలతో సరిగా వ్యవహరించలేనివారితో (బాలుడు లేక బాలికతో) లైంగిక చర్య.
- **స్వలింగ సంపర్క చర్య:** ఒకే లింగం వారి మధ్య లైంగిక చర్య.
- **అశ్లీలత:** నగ్నత లేక లైంగిక చర్యలకు కారణమయ్యేలా రూపించబడిన పుస్తకాలు, చిత్రాలు, లేక వీడియోలు.

ఇవన్నీ కూడా వివాహ బంధం యొక్క ఉల్లంఘనలే.

> గుర్తించుకోండి- శరీరంలో మనల్ని ప్రలోభపెట్టే ప్రతి కోరిక, దేవుడు ఉత్తమంగా తీర్చగల అవసరతను నాశనం చేయడమే అవుతుంది. వివాహ బంధమే, దైవికమైన లైంగిక చర్యకు ఉన్న ఏకైక సందర్భం. అక్రమ లైంగిక సంబంధం......–తక్షణమే తీపిగా ఉంటుంది, కానీ మన ఆధ్యాత్మిక ఆకలికి విషంలా మారి, చివరికి మనల్ని

> నాశనం చేసే వాటిని కోరుకునేలా చేస్తుంది. అక్రమ లైంగిక చర్య మన పరిశుద్ధతను, నీతిని, మన జీవితాల్లో దేవుని సన్నిధిని దూరం చేస్తుంది.[17]

లైంగిక అనైతికత ఒక వ్యక్తి జీవితాన్ని నాశనం చేస్తుంది, మరణానికి నడిపిస్తుందని సామెతలు గ్రంథంలో అనేకచోట్ల హెచ్చరించబడింది (ఉదాహరణకు, సామెతలు 2:16-19 మరియు సామెతలు 6:24-29, 32-33).

రాబర్ట్సన్ మెక్క్విల్కిన్ ఇలా రాశాడు,

> [మానవుని లైంగిక చర్యపట్ల దేవుని ఉద్దేశాలు] చర్యలో పాల్గొన్నప్పుడు ఎంతగా ఉల్లంఘించబడతాయో, మనసులో తప్పుగా ఆలోచించినప్పుడు కూడా అంటే ఉల్లంఘించబడతాయి. ఆయన కేవలం స్త్రీ పురుషులను యేర్పరచడమే కాదు; వైవాహిక బంధంలో నిత్యం వారిద్దరూ ఒకరికొకరు సన్నిహితంగా ఉండేటట్లు, వారి ఏకత్వం దేవుని స్వభావాన్ని ప్రతిబించే విధంగా చేశాడు. ఈ ఉన్నతమైన ఉద్దేశ్యం నెరవేర్చబడాలంటే, సన్నిహిత సంబంధం ప్రత్యేకమైందిగా (భార్యభర్తల మధ్య మాత్రమే), వారి సమర్పణ శాశ్వతమైందిగా ఉండాలి లేకపోతే నిజమైన ఏకత్వం ఉండదు. నమ్మకత్వం అనేది ముఖ్యంగా మనసులో మొదలౌతుంది. ప్రత్యేకమైన సన్నిహిత సంబంధం, శాశ్వతకాల సమర్పణ, పరస్పర నమ్మకం మొదటిగా మనసులో ఉల్లంఘించబడతాయి.[18]

► విద్యార్థులు తరగతి కోసం 1 కొరింథీయులకు 6:9-11, 15-20 మరియు మత్తయి 5:27-30 చదవాలి.

ప్రతి సమాజానికి స్త్రీ, పురుషుల మధ్య సంబంధాల విషయంలో కొన్ని సాంస్కృతిక దృక్పథాలు ఉంటాయి. ఈ సాంస్కృతిక దృక్పథాలు బైబిల్ నైతిక ప్రమాణాల కంటే తక్కువ ప్రమాణాలను కలిగి ఉంటాయి. చాలా సంస్కృతులలో, ఒక క్రమబద్ధమైన సమాజాన్ని నిర్వహించడానికి అవసరమైన నియమాలు మాత్రమే ఉంటాయి. చెడు పరిణామాలు లేదా అపవాదు రాకుండా జాగ్రత్తగా చూసుకుంటే లైంగిక పాపాన్ని కూడా అవి సహిస్తాయి. అయితే బైబిల్ చెప్పే నైతిక ప్రమాణం భిన్నంగా ఉంటుంది.

---

[17] Gary Thomas, *Sacred Marriage* (Grand Rapids, MI: Zondervan, 2000), 210.

[18] Robertson McQuilkin, *An Introduction to Biblical Ethics,* 2nd ed. (Wheaton, IL: Tyndale House Publishers, Inc., 1995), 216.

విచారకరంగా, కొన్ని సంఘాల్లో బైబిలు బోధించే నైతిక ప్రమాణాలు కాకుండా తమ సంస్కృతి అందించే ప్రమాణాలను ఎక్కువగా పాటిస్తున్నారు. నిర్లక్ష్య వైఖరితో, బహిరంగంగా పాపం చేసేవారిని శిక్షిస్తూ, రహస్యంగా అదే పాపం చేస్తూ బయటపడని వారిని లేక వాటి ద్వారా వచ్చే ఫలితాల్ని దాచేవారిని సహిస్తున్నారు.

ఈ విధమైన పాపాలు చేసే వారు, విశ్వాసులు కారని, వారు పరలోకం చేరరని ఈ వచనాలు బోధిస్తున్నాయి. కొరింథీయులకు సంఘంలో కొందరు గతంలో ఈవిధమైన పాపాలు చేశారు, కాని వాటి నుండి రక్షించబడ్డారు.

విశ్వాసియైన వాడు ఈ పాపాలు చేయవచ్చని అనుమతించే ఏ సిద్ధాంతమైనా అది తప్పుడు బోధే అవుతుంది. ఒకడు క్రీస్తు అనుచరుడ్ని అని చెప్పుకుంటూ లైంగిక పాపం చేస్తే, లేఖనం ప్రకారం అతన్ని సంఘంలో నుండి వెలివేసి, విశ్వాసిగానే పరిగణించకూడదు (1 కొరింథీయులకు 5:11-13).

సంఘ నాయకులు మంచి ప్రవర్తనకు ఆదర్శంగా ఉండాలి. ఎప్పుడైతే సంఘం ఆరాధన నడిపించే నాయకుల అసభ్యకరమైన వస్త్రధారణను లేదా కామాతురమైన నృత్య ప్రదర్శనల్ని అనుమతిస్తుందో, అది అక్రమ లైంగిక కోరికలు సహజమని చెప్పినట్లే అవుతుంది. లైంగిక పాపం అంత తీవ్రమైంది కాదని చెప్పినట్లే అవుతుంది.

సమాజంలో ఉన్నటువంటి వస్త్రధారణ ప్రకారం, ఎవరైనా శరీర భాగాల్ని కనుపరుస్తూ లైంగిక ఆకర్షణ కలిగించే విధంగా వస్త్రాలు ధరించినప్పుడు, ఆ వ్యక్తి వస్త్రధారణ సరిగా లేదని భావించవచ్చు. కొన్నిసార్లు సంఘ విశ్వాసులు కొన్నిసార్లు, మరి ముఖ్యంగా ప్రత్యేక వేడుకల సమయాల్లో ఈ తప్పుడు ధోరణికి గురైపోతారు. వారు సమాజ వస్త్రధారణ విధానాన్ని అనుసరించకపోతే మంచిగా దుస్తులు ధరించనట్లుగా భావిస్తారు. ఇలాంటి అభిప్రాయం తప్పని సంఘం ఖచ్చితంగా బోధించాలి. ఒక విశ్వాసి ఇతరుల్లో తప్పుడు కోరికలను కలిగించకూడదు. 1 తిమోతికి 2:9-10 ప్రకారం, విశ్వాసుల వస్త్రధారణ ఎలా ఉండాలంటే, ఎవరైనా వాళ్లని చూసినప్పుడు వీళ్ళు చాలా జాగ్రత్తగా, పరిశుద్ధంగా జీవిస్తున్నారు, పాపానికి చోటివ్వట్లేదు లేక ఇతరులని పాపానికి గురిచేయట్లేదని భావించాలి.

## అశ్లీల చిత్రాలు

అశ్లీలత అంటే శరీరాన్ని నగ్నంగా చూపిస్తూ లేక లైంగిక చర్యను చూపిస్తూ ఎదుటివారిలో లైంగిక భావాలు కలిగించేందుకు రూపించబడిన సాహిత్యాలు, చిత్రాలు, లేకా వీడియోలు.

ఇంటర్నెట్ అశ్లీలతను ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోనికి తీసుకొచ్చింది. అనేకమంది పాత కాలపు పాస్టర్లు, నాయకులు ఇలాంటి శోధనలకు గురికాలేదు ఎందుకంటే వారు యౌవ్వనంలో ఉండగా ఇంటర్నెట్ సదుపాయం

అందుబాటులో లేదు. అందుకే ఈ తరం యువత ఎదుర్కొంటున్న సంగతులు వాళ్లకు పూర్తిగా అర్థం కాకపోవచ్చు. అయితే, వినోదాల్ని ఎంపిక చేసుకునే విషయంలో బైబిలు సూత్రాల్ని అన్వయించుకోవాలని ప్రజలకు బోధించాలి.

**అశ్లీలత చెడ్డది,** ఎందుకంటే ఇది ఒక వ్యక్తిలో జారత్వం, వ్యభిచారం, అనేకరకాలైన అక్రమ లైంగిక చర్యల గురించి ఆలోచింపజేస్తుంది. ఇది పాప కోరికలుగల వ్యక్తిని ఆకర్షిస్తుంది. దేవుడు ఖండించే అక్రమ చర్యల్లో పాలుపొందేలా చేస్తుంది. ఇలాంటి వాటి గురించి ఊహించడం పాపమని యేసు చెప్పాడు (మత్తయి 5:28).

అశ్లీలత చెడ్డది ఎందుకంటే అది మనుష్యుల్ని, వాళ్ల మధ్య ఉన్న సంబంధాల విలువను పోగొడుతుంది. ఇది లైంగిక చర్యను ఒక స్వార్థపూరితమైనదిగా మార్చేస్తుంది. ఇది మానవుల్ని, దేవుని స్వరూపంలో చేయబడినవారిగా, ఆరోగ్యకరమైన బంధాల కోసం ఏర్పాటు చేయబడినవారిగా చూడకుండా, వ్యక్తిగత సంతోషం కోసం వాడుకునే వస్తువుల్లా చూస్తుంది.

**అశ్లీలత ఒక వ్యసనం.** అశ్లీలత, అన్ని పాపాలవలే బానిసలను చేస్తుంది (యోహాను 8:24, 2 పేతురు 2:19). అశ్లీలతను చూసే వ్యక్తికి, అది అవసరమని, అది లేకుండా జీవించడం అతనికి అసాధ్యమని అనిపిస్తుంది. అతనికి అశ్లీలత ద్వారా లభించే ఆ ఊహలు లేకపోతే జీవితం వెలితిగా, ఆసక్తి లేకుండా అనిపిస్తుంది. ఇతర వ్యసనాల్లా, కోరిక దహించివేస్తుంది, కాబట్టి అప్పుడు అతడు తన జీవితంలోని మంచి విషయాలను త్యాగం చేయడం మొదలుపెడతాడు.

**అశ్లీలత క్రమంగా పెరుగుతుంది.** అశ్లీలతకు గురైనవాడు క్రమేపీ మరింత అసభ్యకరమైన, వికృత విషయాలు చూడడానికి ఇష్టపడతాడు. గతంలో అతడు అసహ్యంగా భావించిన లేక భయపడినవాటిని బట్టి ఇప్పుడు ఊహాగానాల్లో విహరిస్తూ ఆనందించడం ప్రారంభిస్తాడు.

**అశ్లీలత హానికరం.** అశ్లీలతలో మునిగిపోయినవాడికి ఆరోగ్యకరమైన బంధాలు ఆనందంగా అనిపించవు. అతని కోరికలు అసహజంగా ఉంటాయి గనుక అవి ఎన్నడు తృప్తిపరచవు. ఇతరుల బాధలు పట్టించుకోడు అలాగే తన అనందం కోసం ఇతరులు బాధపడినా ఇష్టపడతాడు.

> "సాతానుడు మీ లైంగిక తృప్తిని 'దొంగతనం, హత్య, నాశనం" (యోహాను 10:10) చేయడానికి చూస్తాడు, మరియు వాడు ఉపయోగించే సాధనం అశ్లీలత. అశ్లీలత లైంగిక తృప్తిని ఇస్తుందని చెబుతుంది కాని ఆస్వాదించే మీ సామర్థ్యాన్ని తొలగిస్తుంది."
>
> - The Freedom Fight

**అశ్లీలత యొక్క కొన్ని ప్రభావాలు**

అశ్లీలతలో చిత్రీకరించబడిన చర్యల్ని ఊహించడంవల్ల, స్వయంగా వారే ఆ చర్యల్ని జరిగిస్తున్నారన్నట్లుగా వీక్షకుల మనసులు, శరీరాలు ప్రభావితమౌతాయి.

అశ్లీలత వాస్తవ విరుద్ధమైన పరిస్థితుల్ని కలిగిస్తుంది, ఇవి సాధారణ లైంగిక సంపర్కంలో కలిగే ఆనంద స్పందన కంటే మెదడులో మరింత బలమైన ఆనంద స్పందనను కలిగిస్తాయి.[19] మెదడు, ఈ అసహజమైన అధిక సంతోష రసాయనాలకు అలవాటుపడుతుంది. దీనివల్ల, మెదడు ఎల్లప్పుడు మరింత ఎక్కువగా అశ్లీల చిత్రాలను కోరుతుంది, విపరీతంగా అసభ్యకరమైన చిత్రాలను కోరుతుంది తద్వారా వీక్షకులు మరింత సంతృప్తిపడతారు. మెదడులో కలిగే రసాయనాల మార్పులవలన ఒక వ్యక్తి చివరికి, సహజమైన నిజజీవిత లైంగిక అనుభూతిని పొందలేకపోవచ్చు లేక ఆస్వాదించలేకపోవచ్చు. మెదడులో, ఆనందాన్ని కలిగించే రసాయనం ఎక్కువగా ఉండడంవల్ల నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడే భాగం కూడా దెబ్బతింటుంది.

దేవుడు లైంగిక అనుభవాలను బంధాల్ని బలపరచడానికి రూపొందించాడు. లైంగిక సంపర్క సమయంలో మెదడులో విడుదలయ్యే హార్మోన్, భావోద్వేగంగా భాగస్వాముల్ని కలుపుతుంది, వాళ్ల బంధాన్ని బలపరుస్తుంది. ఇది వివాహ వ్యవస్థలో అద్భుతమైన బహుమానం. అయితే, అశ్లీల చిత్రాలను చూసేవారికి అశ్లీల చిత్రాలతోనే భావోద్వేగ బంధం ఏర్పడుతుంది.

అశ్లీల చిత్రాలు చూడడం వలన కలిగే అపరాధం, అవమానం ప్రజల్ని ఒంటరివారిగా చేస్తుంది, ఆరోగ్యకరమైన సంబంధాల్లో ఇతరులతో కలవకుండా చేస్తుంది. వివాహ బంధంలో నమ్మకాన్ని కూడా ఇది నాశనం చేస్తుంది.

అది మెదడులో రసాయన సమతుల్యతను మార్చేస్తుంది గనుక, అశ్లీలత వీక్షకుణ్ణి మానసికంగా కృంగదీయవచ్చు.

అశ్లీల చిత్రాల్లో చిత్రీకరించబడిన దృశ్యాలు కొన్నిసార్లు నిజ-జీవిత లైంగిక సంబంధాల్లో హింసకు, వేధింపులకు నడిపిస్తాయి.

అశ్లీలతవలన కలిగే ప్రమాదాలను గురించి పాస్టర్లు, తల్లిదండ్రులు యౌవనులను హెచ్చరించాలి. పిల్లలకు శోధనను జయించే పరిపక్వత లేనప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇంటర్నెట్ సదుపాయం కలిగించకూడదు. అశ్లీల చిత్రాలు చూడాలనే శోధనతో పోరాడుతున్నవారు ఎల్లప్పుడు దైవికమైన వ్యక్తికి లేక నమ్మకమైన వ్యక్తికి వారి విజయాలు లేదా వైఫల్యాలను నివేదిక ఇస్తూ ఉండాలి. పరిణతి చెందిన విశ్వాసితో తరచుగా పరిశీలించుకున్నప్పుడు, శోధనలో పోరాడుతున్న వ్యక్తి పరిశుద్ధతకు కట్టుబడి ఉంటాడు, నిదానంగా విజయం సాధిస్తాడు.

---

[19] ఈ పేరాగ్రాఫ్‌లోని సమాచారం మరియు తర్వాతి నాలుగు పేరాగ్రాఫ్‌లలోని సమాచారం మొత్తం https://thefreedomfight.org నుండి స్వీకరించబడింది. అశ్లీలత బానిసత్వం నుండి విముక్తి పొందాలనుకునే వారికి సిఫార్సు చేయబడిన బైబిల్-ఆధారిత వనరుగా ఇది ఉపయోగకరమైంది.

► అశ్లీలత అనే వ్యసనం నుండి ప్రజల్ని కాపాడడానికి మీరు ఏ విధమైన పద్ధతుల్ని సిఫార్సు చేయాలి? సంఘం ఎలా సహాయపడుతుంది?

## పిల్లలపై అత్యాచారం / లైంగిక దాడులు

పిల్లలపై అత్యాచారం అంటే పిల్లలతో లైంగిక చర్యలో పాల్గొనడం. ఇది లైంగికతకు సంబంధించిన వికృత చర్య. అనేక కారణాలవల్ల ఇది చాలా చెడ్డది, ఆ కారణాలు ఏవనగా:

- నిబంధన వివాహంలో లైంగిక సంబంధం పట్ల దేవుడు కలిగియున్న మంచి ఉద్దేశ్యాల్ని ఇది ధిక్కరిస్తుంది (హెబ్రీయులకు 13:4).
- ఇది పిల్లల అమాయకత్వాన్ని దొంగిలిస్తుంది- పిల్లలకు తెలియకూడని విషయాలపై అనుభవం ఏర్పడుతోంది.
- పిల్లల కన్యత్వాన్ని దోచుకుంటుంది (1 థెస్సలొనీకయులకు 4:3-7).
- పిల్లవాడికి ఇది తప్పుడు అపరాధ భావనను కలుగజేస్తుంది; పిల్లవాడు తప్పుడు చర్యలో ఉంటాడు కాని నిజమైన నిర్ణయం తీసుకోలేడు లేక తీసుకోవడానికి అనుమతించబడడు.
- ఇది లైంగికతకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునేందుకు పిల్లవాడికి తగిన పరిణతి ఉండనప్పటికీ నిర్ణయాలు తీసుకోవడానికి కారణమౌతుంది.
- ఇది పిల్లలకు అపవిత్రంగా లేక విలువలేకుండా ఉన్నామనే భావన కలిగించి, భవిష్యత్తులో అనైతికమైన ప్రవర్తన ఎంచుకునే అవకాశాన్ని కలిగిస్తుంది (మత్తయి 18:6).
- ఇది పిల్లలకు భవిష్యత్తులో, వక్రమార్గంలో లేక వేధింపుల చర్యల్లో పాల్గొనే శోధనను పెంచుతుంది.
- ఇది బలహీనంగా ఉన్నవారిని లేక తమనుతాము రక్షించుకోలేని వారిని పాడుచేస్తుంది.
- ఇది గొప్ప విలువతో దేవుని స్వరూపంలో సృజించబడినవారిని గాయపరుస్తుంది (ఆదికాండము 1:27).

కొన్నిసార్లు కుటుంబ సభ్యుల మధ్య, స్నేహితుల మధ్య కూడా పిల్లలపై అత్యాచారం జరుగుతుంది. వాళ్లు నమ్మకంగా కనిపిస్తారు కాబట్టి ఇలాంటి దానిని ఎవరు అనుమానించకపోవచ్చు, మరియు పిల్లలు జరిగిన విషయాన్ని ఎవరికైనా చెప్పడానికి భయపడవచ్చు.

లైంగిక దాడి అనేది ఇష్టం లేకుండా ఒక వ్యక్తిని (పిల్లలైనా లేక పెద్దలైనా) లైంగిక చర్యలో పాల్గొనమని బలవంతం చేయడం. పిల్లలపై అత్యాచారం ఎలాగైతే అనేక కారణాలవల్ల చెడ్డదిగా ఉందో అవే కారణాలవల్ల లైంగిక దాడి కూడా చెడ్డదే (ద్వితీయోపదేశకాండము 22:25-27).

లైంగిక వేధింపులకు మరో రూపం సెక్స్ ట్రాఫికింగ్ (sex trafficking). ప్రపంచమంతటా, అపరిచితులు పిల్లల్ని, యౌవనుల్ని దొంగిలిస్తున్నారు లేక కుటుంబ సభ్యులే అమ్మేస్తున్నారు, వాళ్లని వ్యభిచారం కోసం అలాగే అశ్లీల చిత్రాల కోసం వాడుతున్నారు. పేద కుటుంబాలకు డబ్బు అవసరం గనుక ఈ చెడు వ్యాపారం నుండి తమ పిల్లల్ని కాపాడలేకపోతున్నారు. ఎవరో లాభం పొందుకుంటారు, కాని పిల్లలు కేవలం శారీరకంగానే కాకుండా మానసికంగా, భావోద్వేగపరంగా కూడా బాగా దెబ్బ తింటున్నారు. ఇది పేదలను, బలహీనుల్ని అణచివేయడం, బాధించడం. దేవుడు దీనికి తీర్పుతీర్చుతాడు (సామెతలు 14:31).

పిల్లల విషయంలో చేసే ఈ పాపాలు దేవుని హృదయాన్ని గాయపరుస్తాయి (మత్తయి 18:10-14, కీర్తన 146:7-9). ఈ పాపాలు చేసేవారు శిక్ష నుండి తప్పించుకోలేరు (1 థెస్సలొనీకయులకు 4:6, యెహెజ్కేలు 7:8-9). విశ్వాసులు దేవుని ప్రేమ, కనికరాన్ని పంచాలి, బానిసలైనవారిని రక్షించడానికి, విడిపించడానికి, స్వస్థపరచడానికి కృషి చెయ్యాలి (సామెతలు 24:11-12, యోబు 29:12-16, కీర్తన 72:12-14).

## స్వీయ-లైంగిక చర్య

హస్తప్రయోగం అంటే లైంగిక ఆనందం కోసం లేదా లైంగిక ఉద్రిక్తతను తగ్గించుకోవడానికి తమ జననాంగాలను స్వయంగా ఉత్తేజపరచుకోవడం.

హస్తప్రయోగం అనైతికమని బైబిలు స్పష్టంగా ఖండించదు. కాని స్వీయ-లైంగిక చర్య కామపూరితమైన ఆలోచనల్ని కలుగజేస్తుంది, అశ్లీల చిత్రాలు చూడడం, జారత్వం వంటి పాప కార్యాలలోకి నడిపిస్తుంది (మత్తయి 5:27-28, మత్తయి 15:19-20).

హస్తప్రయోగం అవివేకం ఎందుకంటే అదొక వ్యసనం: ఎంత ఎక్కువగా చేస్తే, అంత ఎక్కువగా చెయ్యాలని అనిపిస్తుంది.

బలవంతపు హస్తప్రయోగం కొన్నిసార్లు భావోద్వేగపరమైన లేక సంబంధాలకు సంబంధించిన సమస్యల్ని సూచిస్తుంది లేక గతంలో జరిగిన లైంగిక వేధింపుల్ని సూచిస్తుంది.

► విద్యార్థులు తరగతి కోసం 1 కొరింథీయులకు 6:12-13, 18-20 మరియు 1 థెస్సలొనీకయులకు 4:1-8 చదవాలి.

భార్యభర్తలు భావోద్వేగపరంగా, ఆత్మీయంగా ఏకమవ్వడంలో సహాయపడడానికి దేవుడు వివాహంలో శారీరక ఐక్యతను రూపొందించాడు (1 కొరింథీయులకు 6:16-20, మలాకీ 2:15).

> హస్తప్రయోగం, వివాహం చేసుకునేంతవరకు ఒంటరితనాన్ని తట్టుకోవడానికి సహాయపడుతుందని అనేకులు భావిస్తారు, కాని అది అలవాటుగా మారినప్పుడు భవిష్యత్తులో వైవాహిక బంధంలో ఉండే అందాన్ని, సన్నిహిత బంధాన్ని నాశనం చేయగలదని వారు గ్రహించరు.
>
> స్వీయ-లైంగిక చర్య లైంగిక అనుభవాన్ని ఇస్తుంది కాని లైంగిక సంబంధంలోని అసలైన ఉద్దేశ్యాన్ని కోల్పోతుంది: ఇద్దరు శారీరకంగా, ఆత్మీయంగా ఏకమవ్వడం.......వైవాహిక జీవితంలో ఉండే ఆరోగ్యకరమైన సహజ లైంగిక చర్యకు ప్రత్యామ్నాయంగా హస్తప్రయోగాన్ని ఉపయోగించకూడదు.[20]

ఒకవేళ అవివాహితుని జీవితంలో హస్తప్రయోగం సమస్యగా ఉంటే అతడు ఏం చేస్తాడు? ఎవరైనా, లైంగిక ఉద్రేకతను తగ్గించుకోవడానికి మాత్రమే హస్తప్రయోగం చేస్తున్నప్పుడు కూడా దానిని నివారించడమే ఉత్తమం, ఎందుకంటే వారు శోధనలను ఎదుర్కొంటారు. స్వీయ-లైంగిక చర్య లైంగిక సంబంధం పట్ల దేవుని ఉద్దేశాల్ని నెరవేర్చదు.

ఒకవేళ వాళ్ల జీవితంలో ఏదైనా అనైతికత ఉంటే, ఆ పాపాన్ని ఒప్పుకుని విడిచిపెట్టాలి. దైవభక్తిగలవారి దగ్గర జయాలు, అపజయాలు గురించి పంచుకోవాలి, వాళ్లు ప్రార్థించి సలహాలు ఇస్తారు.

ఒకవేళ హస్తప్రయోగానికి భావోద్వేగరమైన సమస్యలు, సంబంధబాంధవ్యాల సమస్యలు, గత లైంగిక వేధింపుల సమస్యలు కారణమైతే, ఒక శిక్షణ పొందిన క్రైస్తవ కౌన్సిలర్ దగ్గర సహాయం పొందడం మంచిది.

## స్వలింగ సంపర్క చర్య గురించి బైబిలు ఏం చెబుతుంది

దేవుడు వివాహం అనేది స్త్రీ పురుషుల మధ్య జీవితకాలం, సమర్పణ కలిగి ఉండే బంధంగా రూపొందించాడు. ఆదాముకు సాటియైన సహాయం అవసరమని దేవుడు చూశాడు (ఆదికాండము 2:18). సహాయకుడు అంటే, మరొకరికి సరిపోయేవాడు, భిన్నంగా ఉంటూ అనేక విధాలుగా సహాయపడేవాడు. ఆదాముకు సాటియైన సహాయంగా దేవుడు స్త్రీని చేశాడు కాని మరొక పురుషుని చేయలేదు (ఆదికాండము 2:22). సృష్టి కథనం సర్వ మానవాళికి వివాహం గురించి- వివాహంలో, స్త్రీ పురుషుడు ఒక విశేషమైన రీతిలో ఏకమౌతారు- అనే ఒక సాధారణ సూత్రాన్ని ఇస్తుంది (ఆదికాండము 2:24).

---

[20] Dr. Tim Clinton and Dr. Diane Langberg, *The Quick-Reference Guide to Counseling Women*, (Grand Rapids, MI: Baker Books, 2011), 185.

దేవుడు ఏర్పాటు చేసిన వివాహం గురించి యేసు మాట్లాడాడు (మత్తయి 19:4-6). ఆదికాండములోని వాక్యభాగాన్ని సూచిస్తూ, స్త్రీ పురుషుడు ఏకశరీరమై, శాశ్వతమైన బంధంలోకి నడిపించబడతారని చెప్పాడు.

అపొస్తలుడైన పౌలు వివాహం గురించి అనేక ప్రకటనలు చేశాడు. వివాహం అనేది క్రీస్తుకు, సంఘానికి మధ్య ఉన్న సంబంధం గురించి మనకు బోధించే ఒక దృష్టాంతమని చెప్పాడు (ఎఫెసీయులకు 5:22-33). ఎఫెసీయులకు రాసిన పత్రికలోని ఆ వాక్యభాగమంతటిలో, పురుషులకు, వారి భార్యలకు మధ్య సంబంధం గురించి అతడు మాట్లాడాడు. భార్యభర్తల మధ్య ఉండే ఆ విశేషమైన సంబంధం గురించి చెప్పడానికి ఆదికాండము మరియు మత్తయి సువార్త నుండి ఉల్లేఖించాడు (ఎఫెసీయులకు 5:31). వివాహం అనేది స్త్రీ పురుషుల మధ్య ఉండే బంధమని ఈ వాక్యభాగం ద్వారా స్పష్టమౌతుంది.

లేవీయకాండములో, దేవుడు ఇశ్రాయేలీయులకు ఇచ్చిన ధర్మశాస్త్రాన్ని గూర్చిన వివరణ ఉంది. స్త్రీతో శయనించినట్లుగా, ఒక పురుషుడు మరొక పురుషునితో శయనించడం హేయమని అది చెబుతుంది (లేవీయకాండము 18:22). స్వలింగ సంపర్కం చేసిన వారు హేయమైన పని చేసారు కాబట్టి ఇద్దరికీ మరణశిక్ష విధిస్తారు (లేవీయకాండము 20:13).

కొందరు లేవీయకాండము ఈ కాలపు ప్రజలకు వర్తించదని చెబుతుంటారు. నిజానికి, లేవీయకాండములో ఉన్న కొన్ని ఆజ్ఞలు కేవలం ఆచార సంప్రదాయాలకు సంబంధించినవి. అయితే, లేవీయకాండము 18-20 లోని ఆజ్ఞలు, సన్నిహిత బంధువులతో, జంతువులతో లైంగిక చర్యలో పాల్గొనడం, కుమార్తెను వ్యభిచారిణిగా చేయడం వంటి ఇతర లైంగిక సంబంధాల్ని నిషేధిస్తాయి. ఈ అధ్యాయాలలోని మిగిలిన ఆజ్ఞలు, పిల్లల్ని బలి ఇవ్వడం, దొంగతనం, విగ్రహారాధన, చెవిటివారిని లేక గ్రుడ్డివారిని బాధించడం, బీదలను అణచివేయడం, పరదేశులను బాధించడం, కొలతలలో అన్యాయం చేయడం వంటి వాటిని నిషేధిస్తాయి. ఈ ఆజ్ఞలన్ని దేవుని న్యాయసమ్మతమైన నైతిక ప్రమాణాల్ని చూపిస్తున్నాయి, ఇవి అన్ని చోట్ల, అన్నివేళలా, అందరికీ వర్తిస్తాయి.

► ఒక విద్యార్థి తరగతి కోసం రోమా 1:18-32 చదవాలి.

ఈ వాక్యభాగం తెలిసి తిరుగుబాటు చేసే వారందరిపై దేవుని తీర్పు వస్తుందనే మాటతో ప్రారంభమౌతుంది. సృష్టికర్తయైన అద్వితీయ సత్య దేవుణ్ణి గురించిన జ్ఞానాన్ని ప్రజలు తిరస్కరించినప్పుడు, వారు విగ్రహారాధికులై సృష్టిని పూజించడం మొదలుపెట్టారని ఈ వాక్యభాగం చెబుతుంది. వారు సత్యాన్ని తిరస్కరించినందువల్ల ఎంతగా లైంగిక పాపంలో పడిపోయారంటే, స్వలింగ సంపర్కమనే పాపానికి దిగజారిపోయారు. స్వలింగుల మధ్య లైంగిక సంబంధం సహజత్వానికి విరుద్ధం అని ఈ వాక్యభాగం చెబుతుంది. కొందరు ఈ వాక్యభాగం బలవంతపు స్వలింగ సంపర్కం గురించి

మాట్లాడుతుందని చెబుతారు, కానీ వారు *కలిసి* పాపం చేసి దేవుని తీర్పు పొందుకున్నారు గనుక ఇది స్వచ్ఛందమైన చర్యనే సూచిస్తుందని వాక్యభాగం మాట్లాడుతుంది. వాక్యభాగం ఇంకా అనేకమైన పాపాలు గురించి మాట్లాడుతూ, దేవునికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసే వైఖరిని వివరిస్తుంది.

అపొస్తలుడైన పౌలు, దేవుడు ఖండించే ఇతర పాపాల జాబితాలో స్వలింగ సంపర్క చర్యను కూడా చేర్చాడు (1 కొరింథీయులకు 6:9-10, 1 తిమోతికి 1:9-10).

## సంఘ బాధ్యతలు

కొన్ని సంఘాలు లైంగిక సంబంధమైన పాపంలో పడిపోయినవారిని ఎలా ప్రేమించాలో తెలియక సతమతమౌతున్నాయి. కొన్ని సంఘాలైతే, కొన్ని లైంగిక పాపాల్ని సహజమైనవిగా పరిగణించి, వాటిని అంగీకరించడం మొదలుపెట్టాయి.

► లైంగిక నైతికతకు సంబంధించిన విషయాల గురించి సంఘం ఎలాంటి బాధ్యతలు తీసుకోవాలి?

### నీతిని బోధించాలి, ప్రేమించాలి

కొన్నిసార్లు, సంఘం కొన్ని లైంగిక అనైతిక చర్యలు పెద్ద హానికరమైనవి కాదని, చాలా వికృతమైనవి కాదని భావించి, వాటి పట్ల నిర్లక్ష్యంగా ఉంటుంది. ఉదాహరణకు, లైంగిక అనైతికత విషయంలో ఎదురయ్యే శోధనపై ఎలా విజయం సాధించాలో బోధించకుండా, వివాహం కాని అనేకమంది యౌవ్వనస్థులు లైంగిక చర్యలో పాల్గొంటారని భావిస్తారు. విశ్వాసులు దేవుని పరిశుద్ధ జీవన ప్రమాణానికి కట్టుబడి, లైంగిక చర్యను వివాహానికే పరిమితం చెయ్యాలి.

సంఘం చెప్పే సందేశం బైబిల్‌లో ఉన్న విషయాలంత స్పష్టంగా ఉండాలి. వివాహం వెలుపల లైంగిక కార్యకలాపాలు చేసేవారికి దేవుడు తీర్పు తీరుస్తాడు (హెబ్రీయులకు 13:4). విశ్వాసులు అనైతిక లైంగిక కార్యకలాపాలు చేసే వ్యక్తిని అభినందించకూడదు. క్రీస్తును అనుసరించేవారు లైంగిక అనైతికత గురించి జోకులు వేయకూడదు. లైంగిక పాపాన్ని అవాంచిత గర్భం, లైంగిక వ్యాధులు రాకుండా జాగ్రత్తగా నిర్వహించాలని లోకం బోధిస్తుంది, కానీ సంఘం చెప్పే సందేశం మరింత ముఖ్యం. లైంగిక పాపం దుఃఖానికి, కుటుంబాలు దెబ్బతినడానికి, శోధన పెరగడానికి, అసంతృప్తి మరియు అపరాధ భావాలకు దారితీస్తుందని సంఘం బోధించాలి.

### సువార్తను పంచాలి

సంఘం పాపులందర్నీ ప్రేమించాలి, క్రీస్తు కృప, క్షమాపణను అనుగ్రహించాలి.

శోధించబడడం పాపం కాదు; క్రీస్తు కూడా శోధించబడ్డాడు, కాని పాపం లేనివాడుగా ఉన్నాడు (హెబ్రీయులకు 4:15). శోధనలను బట్టి, అవి ఘోరమైన లైంగిక చర్యలకు నడిపించే శోధనలైన సరే, వాటిని బట్టి ఎవరూ ఖండించబడినవారిగా లేక నిరీక్షణలేనివారిగా భావించేలా సంఘం చేయకూడదు. తప్పుడు కోరికలు ప్రతి వ్యక్తిలో ఒకేలా ఉండవు, కాని అందరు తప్పుడు కోరికలు కలుగజేసే పాపస్వభావంతో, ఆత్మీయ లోపాలతోనే పుట్టారు.

తప్పుడు కోరికలతో బాధపడుతున్న వ్యక్తికి సహాయం చేయడానికి తనకు తగినంత శిక్షణ లేదని ఒక పాస్టర్ అనుకోవచ్చు, కాని ఇతర పాపాలతో పోరాడుతున్నవారికి ఎలా సహాయపడతాడో అలాగే ఈ సమస్యలో ఉన్నవారికి కూడా సహాయం చేయగలడు, సలహా ఇవ్వగలడు. (ఈ పాఠంలో తర్వాత వచ్చే రెండు భాగాలూ, జారత్వమనే శోధనపై జయం పొందడానికి విశ్వాసులకు మంచి సలహాలిస్తాయి.)

► సంఘ సభ్యుడు జారత్వం చేస్తున్నప్పుడు సంఘం ఏం చేయాలి?

**పాపిని తిరిగి పునరుద్ధరించడం**

గలతీయులకు 6:1 చెబుతోంది, పాపం చేసిన సంఘం సభ్యుడిని సంఘం పునఃస్థాపించడానికి ప్రయత్నించాలి. దీని అర్థం, ఒక వ్యక్తి పాపం చేసిన తర్వాత కూడా అతను పరిచర్య స్థానంలో ఉండాలి లేదా అతన్ని త్వరగా తిరిగి పరిచర్య స్థానంలో పెట్టాలి అన్నది కాదు. పునఃస్థాపన అంటే, సంఘం సహవాసంలోనూ శ్రద్ధలోనూ తిరిగి ఆహ్వానించబడటం. సభ్యుడు నిజంగా పశ్చాత్తాపపడితే, దేవుడు అతన్ని క్షమిస్తాడు, సంఘం కూడా క్షమిస్తుంది. సంఘం అతనికి ఆత్మీయ జవాబుదారీతనాన్ని ఇచ్చి, అతడు విజయాన్ని కొనసాగించడానికి, ఆత్మీయంగా బలపడడానికి సహాయం చేయాలి. పునఃస్థాపించబడిన విశ్వాసి జవాబుదారీతనంతో జీవించినప్పుడు, తన విశ్వాస కుటుంబ నమ్మకాన్ని క్రమంగా తిరిగి పొందగలడు.

పెళ్లికాని అమ్మాయి గర్భం దాల్చినప్పుడు, ఆమె ఆత్మీయ పునరుద్ధరణకు ప్రయత్నించకుండా, ఆమెను సంఘ సహవాసం, సంరక్షణ నుండి దూరం చేయకూడదు. ఆమె పశ్చాత్తాపపడి, ఆత్మీయ జవాబుదారీతనానికి లోబడితే, క్షమించబడుతుంది. ఆమె పాపం ఆ పాపానికి కారణమైన పురుషుని కంటే మరింత చెడ్డదేమి కాదు. కొన్నిసార్లు, అమ్మాయి చేసిన పాప ఫలితం కళ్లకు కనిపిస్తుంది కాబట్టి ఆమెను తీవ్రంగా వేధిస్తారు.

కొన్నిచోట్ల, వైవాహిక బంధానికి వెలుపల పుట్టినందువల్ల పిల్లల్ని చాలా హీనంగా చూస్తారు కాని అలా చేయడం తప్పు ఎందుకంటే అది వారి తప్పు కాదు. సంఘం అలాంటి పిల్లల్ని ప్రేమించి, అంగీకరించాలి, అంటే దానర్థం పాపాన్ని అంగీకరించాలని కాదు.

**బలహీనులను రక్షించాలి**

కొన్ని సమాజాల్లో, పెళ్ళికాని అమ్మాయి గర్భం దాల్చినందువల్ల తల్లిదండ్రులకు అవమానం కలుగుతుందని భావించి, కుటుంబ పరువు కాపాడుకోవడానికి పుట్టని ఆ బిడ్డను చంపెయ్యాలనుకుంటారు. కాని హత్యకు ఎన్నడూ మంచి కారణమనేది లేనేలేదు (నిర్గమకాండము 20:13). పుట్టని ప్రతి బిడ్డ దేవుని స్వరూపంలో సృజించబడినవాడే (ఆదికాండము 9:6, కీర్తన 139:13-14). ఆ బిడ్డను కాపాడాలి, ప్రేమించాలి మరియు పోషించాలి.

**పేదరికానికి ప్రత్యామ్నాయాలు అందించాలి**

సంఘమంటే విశ్వాస కుటుంబం. సంఘం, పాపాల్ని ఖండిస్తే చాలదు. అది దాని సభ్యుల్ని సంరక్షించాలి. ఉదాహరణకు, పాప కార్యాల ద్వారా ఆర్థిక సహాకారాన్ని పొందుకుంటున్న వ్యక్తికి, ప్రత్యామ్నాయ ఆర్థిక సహాకారాన్ని వృద్ధి చేయడంలో సహాయం చెయ్యాలి.

ఉదాహరణకు, చాలామంది అమ్మాయిలు ఒక పెద్ద సంఘానికి హాజరౌతూ, గాయక బృందంలో పాటలు పాడుతున్నారు. వాళ్ల కుటుంబాలు చాలా పేదరికంలో ఉన్నాయి. అయితే తమ కుటుంబాలకు ఆర్థికంగా సహాయం చేయడానికి వాళ్లు పురుషులతో అక్రమ సంబంధాలు పెట్టుకున్నారు. ఇటువంటి పరిస్థితిలో సంఘం ఏం చెయ్యాలి?

► పాప జీవన విధానాన్ని విడిచిపెట్టడానికి మీ సంఘం ఎలా సహాయపడుతుంది?

## శోధన సహించేవారికి సహాయం చేయడం

ఈ పాఠంలో అనేక క్లిష్టమైన విషయాల గురించి మనం చర్చించుకున్నాం. ఈ పాఠాన్ని చదువుతున్న చాలామంది ఏదొక సమస్యతో బాధపడుతుండవచ్చు. కొంతమంది పాఠకులు, శోధనలు ఎదుర్కొంటున్న విశ్వాసులకు ఎలాంటి సలహాలు ఇవ్వాలో తెలియక ఇబ్బందిపడుతున్న సంఘ నాయకులై ఉన్నారు.

శోధన ఏదైనాసరే, ఒక విశ్వాసిని విజయ బాటలో నడిపించే ప్రవర్తనలు, ఆలోచనా విధానాలు కొన్ని ఉన్నాయి.

క్రీస్తును వెంబడించే వ్యక్తి ఇలా సహాయం పొందగలడు:

1. **క్రీస్తుతో మీకున్న సంబంధానికి పూర్తిగా కట్టుబడి ఉండాలి (మత్తయి 16:24-27).** ఇతర శోధనల్లా, అక్రమ లైంగిక (జారత్వ) సంబంధ శోధన కూడా సాతానుడు మీ మీద చేసే దాడి (1 పేతురు 2:11). సాతానుడు కేవలం దొంగతనమును హత్యను నాశనమును చేయుటకు (యోహాను 10:10) మాత్రమే వస్తాడు. మీరు మీ ప్రాణం కోసం పారిపోవాలి (2 తిమోతికి 2:22).

2. **యేసు శ్రద్ధ చూపుతాడనే నమ్మకంతో ఉండటం (కీర్తన 139:1-3, 1 పేతురు 5:6-10).** మీ విశ్వాసం, మీ శారీరక అవసరాలు, మీ పరిశుద్ధత పట్ల ఆయన శ్రద్ధ చూపుతాడు. మీ విశ్వాసం, మీ శారీరక అవసరాలు, మీ పరిశుద్ధత పట్ల ఆయన శ్రద్ధ చూపుతాడు. ఆయన మానవునిగా ఉన్నప్పుడు, మనం ఎదుర్కొనే శారీరక, మానసిక శోధనలను జయించాడు. అందువల్ల మనం విజయం సాధించడానికి అవసరమైన కృప ఆయన వద్ద ఉంది (హెబ్రీయులకు 4:14-16).

3. **అపవాది అబద్ధాలు నమ్మకూడదు (యోహాను 8:44).** అపవాది మీతో, దేవుడు నిన్ను పట్టించుకోవడం లేదు, ఒకవేళ పట్టించుకుంటే నిన్ను ఎంతో బాధించే లైంగిక కోరికలను తీసివేసేవాడు" అని చెప్పవచ్చు. అయితే యేసు పట్టించుకుంటాడని, అపవాది నాశనం చేస్తాడని 1 పేతురు 5:7-8 చెప్తుంది. లైంగిక కోరికలవల్ల, మీరు పాపంతో నిండిపోయినవారని అపవాది మీపై తప్పుడు ఆరోపణలు చేయవచ్చు (ప్రకటన 12:10).

4. **యేసు మీద దృష్టిపెట్టి, ఆయన ఏమైయున్నాడనే దాన్నిబట్టి ఆయన్ను ఘనపరచాలి (కీర్తన 105:3-4).** అపవాది ఈ పరీక్ష ద్వారా మీ విశ్వాసాన్ని దేవునితో మీకున్న సంబంధాన్ని నాశనం చేస్తాడు (యోహాను 10:10). అయితే ఈ పరీక్ష పెట్టడంలో యేసు ఉద్దేశ్యం ఏంటంటే, మీ విశ్వాసం బలపడాలి, మీరు ఆయన్ను మరింత మహిమపరచాలి (1 పేతురు 1:5-9). మీరు యేసును ఆరాధించడంపై దృష్టిపెట్టినప్పుడు, ఆయన మీకు సహాయం చేస్తాడు (కీర్తన 46:1).

5. **దేవుని వాక్యాన్ని ధ్యానించాలి (కీర్తన 119:9).** దేవుని వాక్యం చదవడం, వినడం, ధ్యానించడం శోధనను జయించడానికి సహాయపడతాయి. యేసు శోధించబడినప్పుడు, దాన్ని జయించడానికి ఆయన లేఖనాలను ఉపయోగించాడు (మత్తయి 4). మనం కూడా అలాగే చెయ్యాలి.

6. **శోధనను జయించే శక్తి కోసం ప్రార్థిస్తున్నప్పుడు కూడా, మీ లైంగిక కోరికలను బట్టి యేసుకు కృతజ్ఞతలు చెప్పాలి (2 కొరింథీయులకు 12:7-9).** మీరు మీ సహజ కోరికలను బట్టి కృతజ్ఞులుగా ఉండాలి ఎందుకంటే అది దేవుడు మీ మానవత్వంలో ఏర్పరచిన భాగం, అవి మిమ్మల్ని దేవుని మీద ఆధారపడేలా చేస్తాయి, ఆయన బలాన్ని వెదకేలా చేస్తాయి. మీ బలహీనతలు, మీరు దేవునితో నడిచే విధానంలో ముందుకువెళ్ళడానికి ఒక అవకాశంగా పనిచేస్తాయి.

7. **కనీసం ఒక దైవికమైన, అనుభవజ్ఞులైన వ్యక్తికి జవాబుదారులుగా ఉండాలి (గలతీయులకు 6:2).** విశ్వాస యాత్రలో మీ కంటే గొప్పగా ఉన్నవారితో (మీ లింగం వారితో) పారదర్శకంగా, యధార్థంగా ఉండడం చాలా

సహాయకరం. వారు మీ కోసం ప్రార్థన చేస్తారు, మీకు సలహాను ఇస్తారు. వారితో మీ బాధలు గురించి పంచుకున్నప్పుడు, మీరు మీ పరిశుద్ధతను కాపాడుకోగలుగుతారు, విశ్వాసంలో మరింత బలపడతారు.

8. **ఇతరులకు పరిచారం చేయాలి, వారి అవసరాలపై దృష్టిపెట్టాలి (ఫిలిప్పీయులకు 2:3-5).** ఇతరులకు పరిచారం చేయడం ద్వారా మీ సొంత అవసరాలు, సొంత కోరికలపై ఎక్కువగా దృష్టిపెట్టుకునే విధానంతో పోరాడాలి.

9. **దేవుని సమయంలో సరైన వ్యక్తిని వివాహం చేసుకోవాలి (సామెతలు 5:15, 18-19).** (వివాహంలో తెలివిగా ఎలా నిర్ణయం తీసుకోవాలో ముందున్న పాఠాలు చర్చిస్తాయి.)

► వీటిలో, ఏ విషయాలు మీకు క్రొత్తగా ఉన్నాయి? మీ జీవితంలో ఏవి సహాయకరంగా ఉన్నాయి?

► ఏ ఇతర ప్రవర్తనలు లేక ఆలోచనా విధానాలు మీకు సహాయకరంగా ఉన్నాయి?

## వివాహానికి ముందు నైతిక పరిశుద్ధత

యౌవనస్తులు వివాహానికి ముందు బలమైన శోధనలను ఎదుర్కొంటారు. నమ్మకమైన జీవిత భాగస్వామి తమకు అవసరమని గుర్తుంచుకోవడం వారికి చాలా ముఖ్యం.[21] వివాహం లేకుండా తాత్కాలిక అనందం కోరుకునే వ్యక్తితో సంబంధం కలిగి ఉండకూడదు. సమర్పణ కలిగిన విశ్వాసం లేని వ్యక్తితో సంబంధం పెట్టుకోవడానికి ఇష్టపడకూడదు (1 కొరింథీయులకు 7:39). వారు నమ్మకమైన జీవిత భాగస్వామి, మంచి తల్లిదండ్రులు అయ్యేవారిని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి.

మంచి వివాహ బంధం కలిగి ఉండాలనుకునే యవ్వనస్తులు నమ్మకంగా ఉండాలి, క్రీస్తును సమర్పణతో అనుసరించాలి అప్పుడు సరైన వ్యక్తిని ఆకర్షించగలుగుతారు (సామెతలు 3:4-8). ఒక వ్యక్తి తన మంచి ప్రవర్తన, మంచి వస్త్రధారణ ద్వారా తమ గుణాన్ని బయలుపరచగలడు (1 తిమోతికి 2:9-10). అబ్బాయిలు అమ్మాయిలతో, అమ్మాయిలూ అబ్బాయిలతో అజాగ్రత్తగా ప్రవర్తించేవారు, తప్పుడు కోరికలతో వారితో సంబంధాన్ని ఇష్టపడుతున్నారని సూచిస్తారు (1 థెస్సలొనీకయులకు 4:1-7). చెడు కోరికలు కలిగించే విధంగా దుస్తులు ధరించిన వ్యక్తి, సమర్పణ లేకుండా కేవలం సుఖాన్ని మాత్రమే కోరుకునే వ్యక్తిని ఆకర్షిస్తారు (సామెతలు 7).

---

[21] సామెతలు 31:11-12, 1 తిమోతికి 3:11-12, మలాకీ 2:14-16, మరియు సామెతలు 2:16-17 చూడండి.

దేవుడు ప్రవర్తనలో, వస్త్రధారణలో, సంబంధాల్ని ఎంపిక చేసుకునే విషయంలో సహాయకరంగా ఉండడానికి తల్లిదండ్రుల్ని, పాస్టర్లను, ఇతర క్రైస్తవ నాయకుల్ని ఇచ్చాడు. యౌవనులు, దేవునికి విధేయులై ఈ నాయకులకు లోబడినప్పుడు, దేవుని గొప్ప ఆశీర్వాదాలు పొందుకుంటారు, అపాయం నుండి, శోధనల నుండి కాపాడబడతారు.

► విద్యార్థులు తరగతి కోసం 1 పేతురు 5:5 మరియు హెబ్రీయులకు 13:17 చదవాలి.

తమ తల్లిదండ్రుల, ఆత్మీయ నాయకుల నాయకత్వ జ్ఞానానికి లోబడడం పిల్లల, యౌవనుల బాధ్యత. శోధనల్ని జయించడానికి యౌవనులకు సహాయం చేయడం నాయకుల బాధ్యత.

► విద్యార్థులు తరగతి కోసం రోమా 13:14 మరియు 1 కొరింథీయులకు 10:13 చదవాలి.

విశ్వాసులు సహింపగలిగినంత కంటే ఎక్కువగా దేవుడు శోధింపబడనియ్యడు, శోధనలో నుండి పారిపోలేనంతగా శోధింపబడనియ్యడు. శోధనలో నుండి పారిపోవలసిన బాధ్యత యౌవనస్తులది (2 తిమోతికి 2:22). అయితే, యౌవనులు సాధ్యమైనంతవరకు శోధనను అనుభవించకుండా తల్లిదండ్రులు నిరోధించాలి. కనీసం మూడు మార్గాల్లో తల్లిదండ్రులు దీన్ని చేయగలరు:

1. **పిల్లలు ఏం చెయ్యాలి, ఏం చెయ్యకూడదు, ఎవరితో ఉండాలి, ఎక్కడికి వెళ్లాలి అనే వాటి గురించి నిర్దిష్టమైన సూచనలు ఇవ్వాలి (ఎఫెసీయులకు 6:1-4).** శోధనలో నుండి తప్పించుకోగలిగేంత ఎదుగుదల లేని పరిస్థితుల్లో తల్లిదండ్రులు పిల్లల్ని విడిచిపెట్టకూడదు. ఉదాహరణకు, ఒక యువకుడు ఒక యువతి రహస్య ప్రదేశంలో ఉన్నప్పుడు, తప్పుగా ప్రవర్తించే శోధనకు గురౌతారు.

2. **శోధన సమయాల్లో తమ యౌవనుల్ని జవాబుదారులుగా చెయ్యాలి.** తల్లి లేక తండ్రి తమ యౌవన బిడ్డలతో కలిసి ప్రార్థించి, వాళ్ల జీవితం గురించి అడిగి తెలుసుకోవాలి. తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య ఉన్న బలమైన బంధంపై జవాబుదారీతనం ప్రభావం ఆధారపడి ఉంది. పిల్లలు, తమ తల్లిదండ్రులు ప్రేమిస్తారని, అంగీకరిస్తారని, సహాయం చేస్తారని నమ్మకపోతే, వాళ్ళు తమ తప్పుల్ని ఒప్పుకోవడానికి ఇష్టపడరు.

3. **యౌవన బిడ్డలకు దైవికమైన సలహా ఇవ్వాలి.** యౌవనులు బైబిలు సూత్రాల్ని దృష్టిలో ఉంచుకుని, పరిస్థితుల్ని పరిగణించేలా తల్లిదండ్రులు సహాయపడాలి (సామెతలు 4:1-9, సామెతలు 7:1, 4-5). వారు ఎదుర్కొనే ప్రమాదాలు గురించి వాళ్ళతో మాట్లాడాలి. వాళ్లు తీసుకోవలసిన వివిధ నిర్ణయాల విషయంలో సహాయపడాలి. శోధనను ఎలా జయించాలో, శోధనలు వచ్చినప్పుడు ఏం చెయ్యాలో ముందుగానే ఆలోచించగలిగేలా సహాయం చెయ్యాలి.

సంఘం, వాక్యానుసారమైన నైతికత గురించి బోధించేటప్పుడు, అది దాని సంస్కృతికి భిన్నంగా ఉండాలి. అనేక సంస్కృతులలో, లైంగిక పాపాన్ని తీవ్రంగా పరిగణించరు. వివాహానికి ముందు, పెళ్లికాని యువతీయువకులు లైంగిక సంబంధంలో పాల్గొనడాన్ని సహజంగా భావిస్తారు. సంఘం పాపంతో రాజీపడకూడదు. యౌవనుల మధ్య లైంగిక పాపం సహజమని భావించకూడదు. వ్యభిచారులకు క్రీస్తు రాజ్యంలో హక్కు లేదని దేవుడు చెప్పాడు (ఎఫెసీయులకు 5:5).

► లోక శోధనలతో పోరాడుతున్న యవ్వనస్థులకు సంఘం ఎలా సహాయపడుతుంది?

► విద్యార్థులు తరగతి కోసం ఎఫెసీయులకు 5:3-7 మరియు హెబ్రీయులకు 13:4 చదవాలి.

వివాహానికి ముందు, సంబంధం కలిగియున్న సమయం, లైంగిక సంబంధాన్ని మొదలుపెట్టే సమయం కాదు. బదులుగా స్త్రీ పురుషులిద్దరూ ఒకే ఆత్మీయ, బైబిలు ప్రాధాన్యతలు కలిగియున్నారో లేదో పరిశీలించుకోవలసిన సమయం. ఒకరినొకరు అర్థం చేసుకొని, ఒకరితోనొకరు నిత్య నిబంధన చేసుకునేంతగా ఒకరినొకరు నమ్మే సమయం. ఒకవేళ ఈ విధమైన నమ్మకాన్ని ఏర్పరచుకోలేకపోతే, వారు పెళ్లి చేసుకోకుండా అక్కడితో ఆగిపోవాలి.

కొన్ని సమాజాల్లో వివాహాన్ని ఒక విస్తృతమైన, ఖర్చుతో కూడిన వేడుకగా భావిస్తారు గనుక వివాహాలు చాలా ఆలస్యంగా చేస్తారు. చాలాసార్లు, వివాహం ఆలస్యమైన కారణంగా, వారిరువురు సంవత్సరాలపాటు కలిసి జీవించి పిల్లల్ని కూడా కంటారు. కొంతమంది, తమ వివాహానికి ఉన్నదంతా ఖర్చు చేస్తారు, అవసరమైతే అప్పు కూడా తీసుకుని ఖర్చు పెడతారు కాబట్టి వివాహమైన తర్వాత ఆర్థికంగా అది వాళ్లని బాగా కృంగదీస్తుంది. సంఘం, వివాహం గురించి ఒక భిన్నమైన ఆదర్శాన్ని చూపించే విశ్వాస సమాజంగా ఉండాలి. క్రైస్తవ వివాహం, స్త్రీ పురుషులు దేవునికి మరియు ఒకరికొకరు కట్టుబడి ఉండడం కోసం నిర్ణయించబడింది, వివాహాన్ని ఆలస్యం చేసే లేక భవిష్యత్తులో దంపతుల్ని బాధించే గొప్ప ఖర్చు దీనికి అవసరం లేదు.

► సమాజంలోని వివాహ సంప్రదాయాల కంటే క్రైస్తవ వివాహం భిన్నంగా ఉండే కొన్ని మార్గాలు ఏంటి?

## లైంగిక సంబంధం గురించి దేవుని ఉద్దేశ్యాన్ని, సూత్రాల్ని పిల్లలకు బోధించాలి

పిల్లలు, లైంగిక సంబంధం గురించిన సూచనలు చూస్తారు, వింటారు. ఏది తప్పో ఏది ఒప్పో ప్రజలు చెప్పే అభిప్రాయాలను వారు వింటారు. తుదకు, పిల్లల్లో లైంగిక కోరికలు, వాంఛలు, కలుగుతాయి, శోధనలు ఎదుర్కొంటారు కాబట్టి దేవుడు లైంగిక సంబంధం గురించి ఏం చెబుతున్నాడో పిల్లలకు బోధించడం క్రైస్తవ తల్లిదండ్రులకు చాలా ముఖ్యం. పిల్లలకు లైంగిక చర్యల వివరణ గురించి తెలియకూడదు, ఎందుకంటే వాళ్లు పెళ్లి చేసుకునేంత పెద్దలు కాదు, అది వాళ్లని అనవసరమైన శోధనల్లోకి నడిపిస్తుంది.

పిల్లలకు దేవుని ప్రణాళిక తెలియాలి, వారు దానికి విధేయులవ్వాలి. శోధనలు వస్తాయని వారికి తెలియాలి. వారు దేవునికి లోబడడానికి అలాగే వివాహమయ్యేంతవరకు తమ లైంగిక కోరికల్ని నియంత్రించుకోవడానికి సిద్ధంగా ఉండాలి.

లైంగిక చర్య వివరాల గురించి మాట్లాడకుండా లైంగికత గురించి క్రైస్తవ్యం ఏం మాట్లాడుతుందో పిల్లలకు బోధించడానికి ఈ మెటీరియల్ సహాయపడుతుంది. దీనిని చాలా తేటగా, మీరు పిల్లలతో మాట్లాడే విధంగా రాయడం జరిగింది.

**పిలల్లతో మాట్లాడడం**

► ఆదికాండము 2:7, 18-24 పిల్లలతో కలిసి చదవాలి.

ఈ లేఖనభాగం, దేవుడు మొదటి పురుషుడు, మొదటి స్త్రీని సృజించి వారిని ఒక ప్రత్యేకమైన బంధంలో ఎలా ఉంచాడో మాట్లాడుతుంది.

దేవుడు వివాహాన్ని స్త్రీ పురుషుల మధ్య ఒక విశేషమైన బంధంగా ఏర్పాటు చేశాడు. వివాహమైన దంపతులు ఒకరిపైనొకరు ఒక ప్రత్యేకమైన ప్రేమ చూపుకుంటారు. ఆ బంధంలో భార్యాభర్తలు ఇరువురు రహస్యంగా శరీరాల కలయికతో ఒక ప్రత్యేకమైన ఆనందాన్ని పంచుకుంటారు, దీనిసే *లైంగిక సంబంధం* అంటారు. దేవుడు భార్యభర్తలు ఇద్దరి మధ్య ఆనందాన్ని కలిగించడానికి, మరికొన్నిసార్లు బిడ్డల్ని ఇవ్వడానికి లైంగిక సంబంధాన్ని సృష్టించాడు.

లైంగిక సంబంధం ఒక ప్రత్యేకమైన ఆనందాన్ని ఇస్తుంది గనుక, సహజ కోరికను బట్టి స్త్రీ పురుషులు ఒకరినొకరు చూసుకోవడానికి, తాకడానికి, ఒకరి దృష్టిని మరొకరు ఆకర్షించుకోవడానికి ఇష్టపడతారు.

బైబిల్లో, భార్యభర్తల మధ్య లైంగిక సంబంధం మంచిది, సరైనదని దేవుడు చెప్పాడు. అయితే, పెళ్లి చేసుకోనివారు లైంగిక సంబంధం కలిగి యుండడం చాలా తప్పని కూడా దేవుడు చెప్పాడు. కనీసం నాలుగు కారణాల వల్ల దేవుడు లైంగిక చర్యకు సంబంధించిన సూత్రాలను ఇచ్చాడు:

(1) లైంగిక ఆనందం వివాహ బంధం కోసం రూపొందించబడింది

దేవుడు లైంగిక సంబంధాన్ని, వివాహంలో ఒక ప్రత్యేకమైన భాగం చేశాడు. ఈ విధంగా ఏ పురుషుడైనా స్త్రీయైనా ఆనందాన్ని పొందుకోవడం సాధ్యమైనప్పటికీ, వివాహంలో ఈ ఆనందం విశేషమైంది ఎందుకంటే ప్రతి ఒక్కరు తమ భాగస్వామికి మాత్రమే పూర్తిగా సమర్పించుకుంటారు. పెళ్లి చేసుకోనివారి విషయంలో, లైంగిక సంబంధానికి ఈ భావం ఉండదు, దేవుడు ఉద్దేశించిన బంధం వారు పూర్తిగా కలిగి ఉండలేరు. కాబట్టి, పెళ్లి చేసుకోవడానికి ఇంకా సిద్ధంగా లేనివారు లైంగిక సంబంధం కలిగి ఉండకూడదు. బహిరంగంగా వివాహ వేడుక లేకుండా, వివాహానికి సంపూర్ణంగా

సమర్పించుకోకుండా లైంగిక సంబంధం పెట్టుకోకూడదు. ఒకడు తన సొంత భాగస్వామితో మాత్రమే లైంగిక సంబంధం కలిగి ఉండాలి.

(2) లైంగిక సంబంధమైన కోరికలు చాలా బలమైనవి.

లైంగిక సంబంధమైన కోరికలు తప్పు కాదు ఎందుకంటే దేవుడు వాటిని కలిగించాడు. కాని దేవుడు ఇష్టపడని వాటిని చేయాలనే కోరికను కావాలని పెంచుకోవడం తప్పు. వీటి కారణంగా:

- వివాహంలో తప్ప, ఒక వ్యక్తి లైంగిక కోరికలు బలపడేలా మరొకరి శరీరాన్ని చూడడం లేక దాని గురించి ఆలోచించడం చేయకూడదు.
- వివాహంలో తప్ప, లైంగిక కోరికల్ని ప్రేరేపించేలా ఒకరు మరొకరిని తాకడం తప్పు.
- ఒక వ్యక్తి చెడ్డ పనులు చేస్తున్నట్లుగా ఊహించుకోవడం తప్పు.
- ఆనందం కోసం, తప్పుడు పనులు చేస్తున్న వారిని చూపించే చిత్రాలు లేక వీడియోలు చూడకూడదు.
- ఇతరుల్లో తప్పుడు కోరికలు ప్రేరేపించేలా లేక తప్పుడు పనులు చేస్తున్నట్లు ఊహించుకునేలా దుస్తులు ధరించకూడదు.
- తప్పుడు కోరికలతో ఉన్నట్లు చూపించే విధంగా ప్రవర్తించకూడదు లేక మాట్లాడకూడదు.

(3) మన కోరికలు మనల్ని నడిపించలేవు.

జంతువులు తమ భావాలు, కోరికల ద్వారా నియంత్రించబడతాయి. మనం జంతువులం కాదు; దేవుని స్వరూపంలో చేయబడిన మనుష్యులం. దీని కారణంగా, మనం ఏం *చెయ్యాలి* అనే దాని గురించి ఆలోచించాలి, అప్పుడు సరైన నిర్ణయాలు తీసుకోవాలి. మనం మన భావాలు, కోరికల ద్వారా నడిపించబడకూడదు. కొన్నిసార్లు మనకు అనిపించింది చేయడం మంచిదే; కొన్నిసార్లు మంచిది కాదు. లైంగిక సంబంధం ఎప్పుడు మంచిదో మన కోరికలు చెప్పకూడదు. మన భావాలకు లొంగిపోకుండా, దేవుని ఆత్మ సహాయం ద్వారా బైబిలు ఆదేశాలను పాటించాలి.

(4) కొన్నిసార్లు లైంగిక సంబంధం పిల్లల్ని కలుగజేస్తుంది

దేవుడు ప్రేమ బంధం నుండి పిల్లలు పుట్టేలా చేశాడు. పిల్లలు, అనేక సంవత్సరాలు తమను ప్రేమించే, పోషించే కుటుంబంలో పెరగాలి అనే విధంగా దేవుడు చేశాడు. పెళ్లి చేసుకోని తల్లిదండ్రులకు పుట్టిన బిడ్డ, సాధారణంగా పెరిగి పెద్దయ్యేవరకు ఆ బిడ్డకు తల్లిదండ్రుల సహాయం ఉండదు.

పైన పేర్కొనబడిన నాలుగు వాస్తవాలు గ్రహించి, దేవుణ్ణి మెప్పించాలని, మంచిగా జీవించాలనుకునేవారు దేవుని మార్గనిర్దేశంలో నడుస్తారు. దేవునికి అవిధేయత చూపించే శోధనల్ని జయించడానికి సహాయపడే అలవాట్లను అలవరచుకుంటారు.

**ఒక యవ్వనస్థుల ప్రార్థన**

ప్రియమైన దేవా,

నన్ను (అబ్బాయి లేక అమ్మాయి)గా చేసినందుకు వందనాలు. వివాహం పట్ల నీ ప్రత్యేకమైన, మంచి ప్రణాళికకై వందనాలు. నా జీవితాంతం నిన్ను ప్రేమించి, నీకు లోబడడానికి సహాయం చేయి. నేను చేసే ప్రతిదీ నీకు తెలుసు, నా ప్రతి ఆలోచన నీకు తెలుసు. నీవు నడిపించే మార్గంలో నడవడానికి సహాయం చేయి. నా ఆలోచనలు, నా క్రియలు నీకు ఇష్టంగా ఉండాలి. నేను ఒక ఆదర్శంగా ఉండి, నా మిత్రుల్ని నీవైపు ఆకర్షించడానికి సహాయం చేయండి. సరైన సమయంలో, నేను ఎదిగినప్పుడు, నీవు కోరుకునే (భర్త లేక భార్య)గా ఉండడానికి సహాయం చేయండి. దేవా నిన్ను ప్రేమిస్తున్నాను!

ఆమెన్

**ప్రార్థన**

పరలోకమందున్న తండ్రీ,

మమ్మల్ని నీ స్వరూపంలో చేసినందుకు, మా జీవితాలకు ఉద్దేశ్యాన్ని అర్థాన్ని ఇచ్చినందుకు వందనాలు. నీ స్వరూపాన్ని ప్రతిబింబించేలా స్త్రీనిగా పురుషునిగా చేసినందుకు వందనాలు.

వివాహంలో, లైంగిక సంబంధం కోసం నీవు చేసిన మంచి రూపకల్పనను బట్టి, ఉద్దేశ్యాలను బట్టి వందనాలు.

నీ వాక్యానికి అవిధేయత చూపినందుకు మమ్మల్ని క్షమించు. మమ్మును యేసు నామంలో కడుగు, క్షమించు, పరిశుద్ధపరచు (1 కొరింథీయులకు 6:11). పాపానికి దాసులు కాకుండా మమ్మును విడిపించు (రోమా 6:6-7). మా శరీరాలు నీకు అప్పగిస్తున్నాం, మీ దృష్టికి ఏది మంచిదో అదే చేస్తాం (రోమా 6:13-14).

నీతియుక్తమైన ఆలోచనలు, ప్రవర్తన కలిగి జీవించడానికి సహాయం చేయండి (1 తిమోతికి 4:7, కీర్తన 23:3). మా నోటి మాటలు, మా తలంపులు నీ దృష్టికి అంగీకారమగును గాక (కీర్తన 19:14). ప్రతి శోధనలో జయమిస్తానని వాగ్దానం చేసినందుకు కృతజ్ఞతలు (1 కొరింథీయులకు 10:13).

ఆమెన్

## పాఠం అభ్యాసాలు

(1) ఈ పాఠంలో చర్చించుకున్న విషయాల్ని పరిగణలోకి తీసుకుని గలతీయులకు 5:16-6:9 చదవండి. ఈ ప్రశ్నలకు జవాబులు రాయండి:

- శరీరేచ్ఛలకు (5:16) మరియు శరీరకార్యాలకు (5:19) వ్యత్యాసం ఏంటి?
- శరీర కార్యాలు చేయువారికి ఏ రెండు విషయాలు వాగ్దానం చేయబడినవి (5:19-21, 6:7-8)?
- విశ్వాసి శరీరకార్యాలకు లోబడకుండా, ఎలా బలంగా ఉండగలడు (5:16, 22-23, 25)?
- శోధన సమయాల్లో వాటిపై జయం పొందడానికి విశ్వాసులు గుర్తుంచుకోవలసిన కొన్ని సత్యాలు ఏవి? (ఈ వాక్యభాగం నుండి కనీసం నాలుగింటిని చెప్పండి.)
- ఈ వాక్యభాగంలో విశ్వాసులు ఏం చెయ్యాలని ఆజ్ఞాపించబడెను? (ఈ వాక్యభాగం నుండి కనీసం నాలుగింటిని పేర్కొనండి.)
- విశ్వాసులు ఒకరికొకరు చూపించుకోవలసిన బాధ్యతలు ఏవి (గలతీయులకు 6:1-2, 6)?

(2) రోమా 6:1-23 చదవండి. క్రింది ప్రశ్నలకు జవాబివ్వండి:

- ప్రతి విశ్వాసి విషయంలో ఏవి వాస్తవమని ఈ వాక్యభాగం చెబుతుంది? (6-8 విషయాలను చెప్పండి)
- విశ్వాసుల విషయంలో ఏది వాస్తవమో దానిని బట్టి వారు ఏ నిర్ణయాలు తీసుకోవాలి? (6-8 విషయాలను చెప్పండి.)
- పాప శోధనలో, విశ్వాసి జయాన్ని ఎందుకు ఆశించగలడు? (ఒక పేరా రాయండి.)

(3) రోమా 8:1-14 చదవండి. ఈ వాక్యభాగంలో సత్యాల ఆధారంగా ప్రార్థన రాయండి.

(4) రోమా 6:11-14 మరియు కొలొస్స 3:5-7 కంఠస్థం చేయండి. తర్వాత క్లాసు ఆరంభించే ముందు, కంఠస్థం చేసిన వాక్యాలను రాయండి లేక చెప్పండి.

# పాఠం 5

# అవివాహ స్థితి

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) అవివాహ స్థితి గురించి బైబిలు దృక్పథాన్ని అర్థం చేసుకోవాలి.

(2) వివాహం, అవివాహ స్థితికి సంబంధించిన నిర్ణయాలు తీసుకునేటప్పుడు బైబిలు ప్రాధాన్యతలు గుర్తించాలి.

(3) ఈ జీవితంలో నైతిక పవిత్రతకు, దైవికమైన ప్రవర్తనకు, ఫలభరితమైన పరిచర్యకు కట్టుబడి ఉండాలి.

(4) ప్రభువుగా యేసుకు అప్పగించుకోవాలి, ఆయనలో సంపూర్ణమవ్వాలి.

## వివాహం చేసుకునా, చేసుకోక పోయినా యేసును ఆరాధించడం

మహిత్, సౌందర్య, వివాహం చేసుకోవడం దేవుని చిత్తమా కాదా అని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. మిషనరీగా ఉన్న- మహిత్ ను పెళ్లి చేసుకుంటే తన జీవితం అనేక విధాలుగా మారిపోతుందని సౌందర్యకు తెలుసు. ఆమె క్రొత్త దేశానికి వెళ్లాలి, క్రొత్త భాష నేర్చుకోవాలి, క్రొత్త సంస్కృతికు అనుగుణంగా ఉండాలి. తాను సౌకర్యవంతమైన, సుపరిచితమైన ప్రదేశాన్ని విడిచిపెట్టాలని ఆమెకు తెలుసు. నిరాశలు ఎదురౌతాయి, త్యాగాలు చేయవలసి ఉంటుంది. వివాహమంటే కేవలం భర్తను ప్రేమించడానికి కట్టుబడి ఉండడమే కాకుండా, యేసుని ప్రేమించడం, విశ్వాసంతో పని చేయడం.

కాలక్రమేణా, మహిత్ మరియు సౌందర్య ఒకరికొకరు సరిపోరని, పెళ్లి చేసుకోకూడదని గ్రహించారు. సౌందర్య నిరాశ చెందింది. ఆమె తన నిరాశ గురించి ప్రార్థన చేసింది. తన జీవితంలోని ఈ సమయంలో దేవుని కోసం ఫలభరితంగా ఉండటానికి సహాయం చేయమని ఆమె ప్రార్థించింది. ఆమె అలా ప్రార్థిస్తున్నప్పుడు, వివాహం చేసుకోవడం యేసుపై ఎంత విశ్వాసంతో, ఎంత ప్రేమతో కూడిందో, దేవుని చిత్తానికి ఇలా లోబడడం కూడా విశ్వాసం, ప్రేమతో కూడుకున్న పని అని ఆమె అర్థం చేసుకుంది.

## అవివాహ స్థితి

ఈ కోర్సులో దేవుడు వివాహాన్ని ఎలా రూపొందించాడో అన్వేషిస్తాం. లేఖనంలో నుండి వివాహానికి సంబంధించిన దేవుని ఉద్దేశ్యాలు నేర్చుకుంటాం. దేవుడు వివాహం కోసం ఇచ్చిన ఆదేశాలను చర్చించుకుంటాం, మన వివాహాల్ని బలపరచే ఆచరణాత్మక మార్గాలను కూడా చూస్తాం. వివాహం పట్ల దేవుని ప్రణాళిక మంచిదని చూస్తాం.

వివాహమనేది అనేకమంది జీవితాల్లో దేవుని చిత్తం. కాని వివాహం చేసుకునే ముందు చాలామంది అనేక సంవత్సరాలు వయోజనులుగా ఒంటరిగానే జీవిస్తారు. కొన్నిసార్లు, చాలా ఎక్కువకాలం ఒంటరిగానే ఉంటారు. కొందరైతే, వివాహమైన తర్వాత తమ భాగస్వామి మరణించడంవల్ల లేక విడాకులు తీసుకోవడం వల్ల ఈ ఒంటరితనాన్ని అనుభవిస్తారు. కొందరైతే అసలు వివాహమే చేసుకోరు.

ఒక వ్యక్తి వివాహం చేసుకోకుండా ఉండడానికి కారణం వీటిలో ఒకటి లేక అంతకంటే ఎక్కువ కావచ్చు:

- వివాహం చేసుకోవడం కంటే కూడా చేసుకోకపోవడంవలన కలిగే ప్రయోజనాల్ని వారు ఇష్టపడతారు.
- వాళ్ళు ఎప్పుడూ మంచి వివాహ సంబంధాలను చూడలేదు గనుక వివాహం గురించి చింతపడతారు.
- వారు ప్రస్తుతం విద్య లేక కేరీర్ వంటి లక్ష్యాలపై దృష్టిపెడుతున్నారు.
- వివాహానికి ఎటువంటి భావోద్వేగ లేక భౌతిక అవసరాన్ని వారు భావించరు.
- మంచి వివాహం చేసుకునే అవకాశం వారికి రాలేదు.

అవివాహ స్థితిలో ఉన్న వ్యక్తి తీసుకునే నిర్ణయాలు దేవునితోను, ఇతరులతో ఉన్న బంధాల్ని గొప్పగా ప్రభావితం చేస్తాయి గనుక, ఈ పాఠం వివాహం చేసుకోని విశ్వాసి జీవితంపై దృష్టిసారిస్తుంది.

### యేసు, పౌలు అవివాహ స్థితి గురించి ఏం చెప్పారు

విడాకుల గురించి పరిసయ్యులు యేసును ప్రశ్నించారు. యేసు చెప్పిన జవాబు విన్న తర్వాత, ఆయన శిష్యులు పెండ్లి చేసికొనుట యుక్తము కాదని (మత్తయి 19:10) చెప్పారు. పెళ్లి చేసుకోకుండా భూలోకంలో తన జీవితకాలమంతా ఒంటరిగా ఉన్న యేసు, చాలామంది పెళ్లి చేసుకోవాలని, కొందరు మాత్రమే ఒంటరిగా ఉండడానికి అనుగ్రహం పొందినవారని జవాబిచ్చాడు (మత్తయి 19:11-12).

అపొస్తలుడైన పౌలు-ఎన్నడు వివాహం చేసుకొనని లేక భార్య చనిపోయినవారికి- కూడా కొరింథులో అవివాహిత విశ్వాసులకు అదే సలహా ఇచ్చాడు. లైంగిక అనైతిక శోధన కారణంగా, చాలామంది వివాహం చేసుకోవడం మంచిది (1 కొరింథీయులకు 7:2, 8-9). వైవాహిక జీవితంలో లైంగిక సాన్నిహిత్యం దేవుడు అనుగ్రహించిన వరమని పౌలుకు

తెలుసు (1 కొరింథీయులకు 7:7, 1 తిమోతికి 4:1-5, హెబ్రీయులకు 13:4). అతడు వివాహేతర లైంగిక సంబంధాలు ఉండకూడదని చెప్పాడు (1 స్సలొనీకయులకు 4:3-4).

అవివాహితులకు ఉండే మేలు గురించి పౌలు వివరించాడు. అవివాహితులు వారి సమయం, శక్తి, ప్రభువును సంతోషపెట్టడానికి ప్రయత్నం చేయడం, పరిచర్య చేయడం వంటి వాటిపై మనసు పెట్టగలరు (1 కొరింథీయులకు 7:32-35).

పౌలు వివాహం చేసుకోకుండా అలాగే ఉండిపోయాడు (1 కొరింథీయులకు 9:5). దేవుడు తనకు అప్పగించిన పరిచర్యా పని మీద దృష్టిపెట్టడానికి అతడు వివాహం చేసుకోకుండా ఉండిపోయాడు. ఒంటరితనాన్ని ఒక వరంగా భావించాడు (1 కొరింథీయులకు 7:7-8). తన పరిచర్యలో ఎన్నో బాధలను భరించాడు (2 కొరింథీయులకు 11:23-28). అతనికి భార్య లేక పిల్లల బాధ్యత లేనందున ఈ బాధ సులభంగా భరించగలిగాడు (1 తిమోతికి 5:8).

అవివాహ స్థితి, తన పరిచర్యకు ప్రయోజకరంగా పౌలు భావించినప్పటికీ, వివాహం కూడా పరిచర్యకు ప్రయోజనకరంగా ఉండే మార్గాలు ఉన్నాయి.

► మీరు అవివాహ స్థితిని పరిచర్యకు ప్రయోజనకరంగా ఎలా చూస్తారు? వివాహ బంధాన్ని పరిచర్యకు ప్రయోజనకరంగా ఎలా చూస్తారు?

పెళ్లి చేసుకోవాలా వద్దా అని నిర్ణయించుకునేటప్పుడు అనేక విషయాల్ని పరిగణలోకి తీసుకోవాలని పౌలు చెప్పాడు:

- పెళ్లి చేసుకోకుండా జీవించగల వ్యక్తిగత సామర్థ్యం లేక అసామర్థ్యం (1 కొరింథీయులకు 7:9, 36-37)
- హింస వంటి ప్రస్తుత క్లిష్ట పరిస్థితులు (1 కొరింథీయులకు 7:26)
- వివాహ బాధ్యతలు (1 కొరింథీయులకు 7:27-28, 32-35)

**సరైన ప్రాధాన్యతలు**

అవివాహ స్థితి లేక వివాహం ఒకదానికంటే మరొకటి మెరుగైందో లేక ఆత్మీయమైనదో కాదు. **రెంటిలోనూ శోధనలు, కష్టాలు, ఆశీర్వాదాలు, అవకాశాలు ఉన్నాయి.** ప్రతిదీ వేర్వేరు సమయాల్లో, వేర్వేరు వ్యక్తులకు తగినదిగా ఉంటుంది.

ఒక వ్యక్తి వివాహం చేసుకున్నా, చేసుకోకపోయినా చివరికి, వ్యక్తిగత సంతృప్తి, సంపూర్ణత అనేవి దేవునితో ఉన్న సంబంధంలో నుండే రావాలి (కీర్తన 73:25, కీర్తన 107:8-9). అంతేకాదు, విశ్వాసులంతా-వివాహితులైనా కాకపోయినా- నిత్యత్వంపై దృష్టిపెట్టాలి ఎందుకంటే జీవితం చిన్నది నిత్యత్వం ఖచ్చితమైంది (1 కొరింథీయులకు 7:31).

► ఒక విద్యార్థి తరగతి కోసం మత్తయి 6:26-33 చదవాలి.

ఈ వాక్యభాగంలో, లోక విలువలు, ప్రాధాన్యతలు - విశ్వాసుల విలువలు, ప్రాధాన్యతల కంటే భిన్నమైనవని యేసు చెప్పాడు. దేవుని రాజ్యంలో చేరడమే విశ్వాసికి ఉన్నత లక్ష్యం. దేవుని కృప ద్వారా నీతిగా జీవించడమే విశ్వాసికి మొదటి ప్రాధాన్యత. దేవుని పిల్లలు, మత్తయి 6:33లోని యేసు మాటలకు లోబడినప్పుడు వాళ్ల భౌతిక అవసరాలు, వస్తు అవసరాలను తీరుస్తానని దేవుడు వాగ్దానం చేశాడు.

ఒక క్రైస్తవుడు ఎప్పుడు వివాహం చేసుకోవాలి? దేవుని రాజ్యంలో పరిచర్య చేయడానికి వివాహం అతనికి ఉత్తమంగా సహాయపడినప్పుడు చేసుకోవాలి. మరింత ఫలవంతమైన, జయవంతమైన నీతి జీవితాన్ని జీవించడానికి అతనికి సహాయపడినప్పుడు చేసుకోవాలి.

ఒక వివాహం కానీ క్రైస్తవుడు ఎప్పుడు ఒంటరిగా ఉండాలి? వివాహం గురించిన అన్వేషణ లేక వివాహం దేవుని రాజ్యం మీద నుండి తన దృష్టిని మళ్లిస్తున్నప్పుడు, అతడు ఒంటరిగా ఉండాలి. ఒం ఒంటరి వ్యక్తిగా, అతను ఆత్మీయతలో మరింతగా ఫలిస్తున్నప్పుడు. వివాహ బంధంలో ఉండే లైంగిక సంబంధం లేకుండా, తన నైతికతను కాపాడుకుంటూ, నీతిగా జీవించగలిగితే ఒంటరిగా ఉండొచ్చు.

► మీరు అవివాహితులైతే, ఒక్క నిమిషం పాటు యధార్థంగా మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి.

- మీరు దేవుని వాక్యానికి విధేయులై జీవిస్తున్నారా?
- ప్రస్తుతం, దేవుడు తన రాజ్యంలో మీకు ఏ పనిని అప్పగించాడు?
- మీ జీవితంలో సుధీర్ఘకాలం దేవుడు మిమ్మల్ని ఏ పని కోసం పిలిచాడని మీరు అనుకుంటున్నారు?
- వివాహం, దేవునితో మీకున్న సంబంధాన్ని అలాగే ఈ లోకంలో మీరు దేవుని కోసం చేసే పనిని బలపరుస్తుందా లేక నష్టపరుస్తుందా?

అవివాహితులైన విశ్వాసులు పెళ్లి చేసుకోవాలా లేదా అనే విషయాన్ని నిర్ణయించుకునేటప్పుడు దేవుని ప్రాధాన్యతల్ని అంగీకరించడం సహాయకరంగా ఉంటుంది. అలాగే ఏ రకమైన భాగస్వామిని ఎన్నుకోవాలో అర్థం చేసుకోవడానికి కూడా సహాయపడుతుంది. పెళ్లి చేసుకోవాలనుకునే ప్రతి విశ్వాసి, తమ భాగస్వామి దేవునికి ప్రథమ స్థానం ఇస్తున్నారా, దేవుని వాక్యానికి లోబడుతున్నారా, దేవుని రాజ్య వ్యాప్తి కోసం ప్రాకులాడుతున్నారా అనే విషయాలను చూసుకోవాలి.

► విద్యార్థులు తరగతి కోసం ఎఫెసీయులకు 4:17-24 మరియు 1 యోహాను 2:15-17 చదవాలి.

లోకానికి చెందిన వారు తమకోసమే జీవిస్తారు. తమ శరీరాలు మరియు మనసులు కోరిన వాటిని చేయటానికి వారు ఎంచుకుంటారు (ఎఫెసీయులకు 2:3), మరియు దేవుని వాక్యానికి అవిధేయత చూపటానికి సిద్ధంగా ఉంటారు. పాపస్వభావం కలిగిన వారు తరచుగా ఏది మంచిగా అనిపిస్తుందో, ఏది సౌకర్యంగా ఉంటుందో, లేదా ఏది ఇతరులు తమపైన దృష్టి పెట్టేట్టు చేస్తుందో, వాటినే చేస్తారు. వారి ప్రాధాన్యత తమను తాము సంతోషపరచుకోవడమే. వారు కేవలం శారీరకంగా ఎవరికైనా ఆకర్షితులయ్యారని మాత్రమే ఒక రొమాంటిక్ సంబంధాన్ని ఏర్పరచుకోవచ్చు. ఎవరి దగ్గర ఉన్నప్పుడు ఉత్తేజకరమైన భావనలు కలుగుతున్నాయని మాత్రమే కారణంగా వారితో సంబంధంలో ఉండవచ్చు.

స్వార్థపరులు, వివాహ జీవితంలో ఉండే త్యాగపూరితమైన బంధాన్ని అంగీకరించరు. దేవుడు తప్పు అని చెప్పినా కూడా, వారు వివాహం చేసుకోకుండా లైంగిక సంబంధాలు పెట్టుకుంటారు (1 కొరింథీయులకు 6:9-11).

వివాహం చేసుకున్న స్వార్థపరులు, కష్టాలు వచ్చినప్పుడు తమ భాగస్వామిని విడిచిపెడతారు. విడాకులు తీసుకుని మరొకరితో క్రొత్త బంధం ఏర్పాటు చేసుకుంటారు. అయితే, దేవుని వాక్యానికి లోబడి జీవించేవారికి, దేవుడు ఎంతో మేలు దాచి ఉంచాడు (కీర్తన 19:8, 11, ద్వితీయోపదేశకాండము 6:24).

ప్రతి విషయంలో దేవుణ్ణి సంతోషపెట్టడానికి యేసు మనల్ని పిలిచాడు (మత్తయి 16:24, 2 కొరింథీయులకు 5:9, కొలొస్స 1:10). మనం క్రీస్తు అనుచరులం గనుక, దేవుని రాజ్యం, నీతి అనేవి మన ప్రాధాన్యతలు కావాలి. అంతేకాకుండా, వివాహం పట్ల మన అన్వేషణలో దేవుని రాజ్యానికి, ఆయన నీతికి ప్రాధాన్యత ఇవ్వాలి. వివాహం పట్ల మన కారణాలలో, మనం వివాహాన్ని కోరుకునే విధానంలో దేవుడిని గౌరవించాలి. యేసు చెప్పిన విలువలను మనం వినాలి. ఆయన సరైనది, మంచిది అని చెప్పిన వాటిని పాటించాలి. అప్పుడు మనం భార్యాభర్తలుగా మన నుండి ఆయన ఆశించే వాటిని పాటించడం ద్వారా దేవుడిని గౌరవించాలి.

**ప్రతిదానికి ఒక సమయం ఉంది**

వివాహం చేసుకోవడానికి ప్రారంభ యుక్తవయసు మంచి సమయం (సామెతలు 5:18, మలాకీ 2:15, తీతుకు 2:4). ఒక యువకునిగా, ఇప్పటికే శిక్షణ పొంది, జీవితం గడపడానికి సిద్ధంగా ఉండాలి. యువకుడు లేక యువతి నిర్ణయాలు తీసుకునేందుకు, బాధ్యతలు చేపట్టేందుకు పరిపక్వత చెంది ఉండాలి (1 తిమోతికి 4:12). సాధారణంగా, యౌవనస్థులు వివాహానికి, పిల్లల్ని పెంచే బాధ్యతలను తీసుకోవడానికి సిద్ధంగా ఉంటారు. సంతానోత్పత్తికి వారి శరీరాలు కూడా సిద్ధంగా ఉంటాయి, చాలా సందర్భాల్లో, వారిలో బలమైన లైంగిక కోరికలు ఉంటాయి, అలాగే వివాహ బంధంలో సన్నిహిత సంబంధం అవసరాన్ని కలిగియుంటారు.

నేడు చాలా సంస్కృతుల్లో, ఉన్నత విద్య ముగించుకుని లేక ఉద్యోగాల్లో స్థిరపడేవరకు వివాహం చేసుకోకుండా ఒంటరిగా ఉండడం సర్వసాధారణమైపోయింది. మరికొందరు బాధ్యతలు తీసుకోవడానికి ఇష్టపడక, వివాహం పట్ల ఆసక్తి చూపించట్లేదు.

చాలామంది యౌవనులు వివాహానికి ముందే అక్రమ లైంగిక సంబంధాల్లో ఉంటారు. వారికి బలమైన లైంగిక కోరికలు ఉంటాయి. భావోద్వేగపరంగా, వారు సన్నిహిత సహవాసం కోరుకుంటారు. అయినా, బాధ్యతలు తీసుకోకూడదనే ఆలోచనలతో లేక జీవిత లక్ష్యాల కారణంగా, వివాహం చేసుకోవడానికి, కుటుంబాన్ని పోషించడానికి ఇష్టపడరు.

వివాహాన్ని ఆలస్యం చేస్తూ ఒంటరిగా జీవిస్తున్న క్రైస్తవ యౌవనస్తులు తమ ప్రాధాన్యతల్ని జాగ్రత్తగా ఆలోచించాలి. వారు దైవికంగా, పరిశుద్ధంగా జీవించాలి అలాగే దేవుని చిత్తానికి లోబడేడట్లు చూసుకోవాలి. కొందరైతే, వివాహం, పిల్లల్ని పెంచడంపై దేవుడు చూపించే ప్రాముఖ్యతను గురించి ఆలోచించాలి.

***వివాహం చేసుకోకుండా కలిసి సహజీవం చేసే జంటలు***

కొన్నిసార్లు, స్త్రీ పురుషులు సన్నిహిత సంబంధంతో కలిసి జీవిస్తారు, కాని వివాహాన్ని ఆలస్యం చేస్తారు. బహుశా వారు ఒకరి పట్ల ఒకరు సమర్పణ కలిగి ఉండొచ్చు, కాని వివాహ నిబంధనలు చేయలేదు. దీనికి రకరకాల కారణాలు ఉండొచ్చు:

1. కొన్నిసార్లు, వివాహాలు ఘనంగా, భారీగా, అంగరంగ వైభవంగా జరగాలనే సాంస్కృతిక అభిప్రాయాలవల్ల పేదరికంలో ఉన్న జంటలు సరైన విధానంలో పెళ్లి చేసుకోలేరు.
2. కొన్నిసార్లు, వివాహం విఫలమైపోతుందనే భయంతో వివాహానికి కట్టుబడి ఉండరు. పెళ్లి కాకుండా విడిపోతే అది పెద్ద నష్టం కలిగించదని అనుకుంటారు. కలిసి జీవిస్తే బంధం ఇంకా బలపడుతుందని అనుకుంటారు.

దేవుడు లైంగిక సంబంధాన్ని వివాహనికే పరిమితం చేశాడు (హెబ్రీయులకు 13:4). పెళ్లి చేసుకోకుండా కలిసి జీవించే జంటలు దేవుని వాక్యానికి అవిధేయులై అపరాధులౌతారు. వారిద్దరి మధ్య శాశ్వతమైన, ప్రత్యేకమైన నిబద్ధత లేకపోవడం మరియు పరస్పర నమ్మకం కొరవడటం వల్ల, వారి సాన్నిహిత్యం ఎప్పటికీ ఉండాల్సినంత గొప్పగా ఉండదు.

విశ్వాసులు, అవిశ్వాసుల మాదిరిని అనుసరించక, దేవుని వాక్యానికి లోబడాలి. సంఘం దేవుని నైతిక ప్రమాణాలకు కట్టుబడి, వివాహ విషయంలో లేఖన ప్రణాళికను అనుసరించి నడుచుకునేలా జంటలకు సహాయం చెయ్యాలి. ఉదాహరణకు, ఒకవేళ వారు ఖర్చుతో కూడిన వివాహ వేడుక చేయలేని పరిస్థితిలో ఉన్నప్పుడు, సంఘ కుటుంబం వివాహాన్ని తక్కువ ఖర్చుతో జరిపించాలి. దీని ద్వారా, వివాహ బంధం దేవుని నైతిక ప్రమాణాలను పాటించేందుకు

సహాయపడుతుంది. ఇది అప్పుల భారం లేకుండానే తమ వైవాహిక జీవితాన్ని ప్రారంభించేందుకు కూడా సహాయపడుతుంది. వివాహ వేడుక కంటే కూడా వివాహమనేది చాలా ముఖ్యమైందని క్రైస్తవులు గుర్తుంచుకోవాలి, అయితే ఒక స్పష్టమైన వివాహ నిబద్ధత మాత్రం ఉండాలి.

► విద్యార్థులు తరగతి కోసం రోమా 12:2 మరియు ఫిలిప్పీయులకు 2:15-16 చదవాలి. విశ్వాసులు నైతిక ప్రమాణాలకు కట్టుబడి ఉన్నప్పుడు, అది వారి చుట్టూ ఉన్నటువంటి సంస్కృతిని ఎలా మార్చగలదో చర్చించండి.

## ఆరోగ్యకరమైన అవివాహ స్థితి

### సమర్పణకు సంబంధించిన విషయం

> "సంతృప్తి అంటే, దేవుడు నా పరిస్థితులన్నిటికంటే సార్వభౌముడు మరియు నాకు ఏది ఉత్తమమో దానినే అనుగ్రహిస్తున్నాడని తెలుసుకుని తృప్తి పొందడమని అర్థం."
> - Phil Brown

ప్రతి దేవుని బిడ్డ తన (ఆమె లేక అతని) కోరికలను యేసుకు సమర్పించుకోవాలి. యేసే ప్రభువుగా ఉండాలి. జీవితకాలమంతా, ప్రతి విశ్వాసి తన విశ్వాస జీవితంలో యేసే వారి ప్రభువుగా పరీక్షించబడతాడు. కొన్నిసార్లు కష్టాలు ఎదురౌతాయి.....లేక మరికొన్నిసార్లు మనం *కోరుకున్న* మంచి జరగదు.....అప్పుడు యేసు తన అనుచరుల్ని ఇలా అడుగుతాడు, "నేను నీకు నిజంగా ప్రభువునా? నా మంచితనాన్ని నీవు నమ్ముతావా? నేను పరిపూర్ణ ప్రణాళిక కలిగియున్నానని నీవు నమ్ముతావా? నాకు లోబడతావా? నాకు అప్పగించుకుంటావా? నా కార్యాలకు లోబడతావా? ఇందులో నన్ను మహిమపరుస్తావా?"

కొందరు అవివాహితులు ఒంటరిగా ఉండడానికే ఇష్టపడతారు. కాని, పెళ్లి చేసుకోవాలన్న ఆశ ఉన్నప్పటికీ, పెళ్లి చేసుకునే మంచి అవకాశం లభించనివారు, వివాహాన్ని నిలువరించే దేవుని ఎంపికను వినయంగా అంగీకరించాలి.

> క్రైస్తవ స్త్రీ పురుషులు.....ఒకవేళ దేవుడు తమను వివాహం చేసుకోమని ఆశిస్తే, ఆయన కాలంలో ఆయన దానిని స్పష్టం చేస్తాడని గ్రహించాలి. అయితే, ఆయనకు మొదటి స్థానం ఇవ్వాలి, ఎలప్పుడు ఆయన్ను [పూర్తిగా నమ్మాలి].[22]

దేవుడు నమ్మదగినవాడు, మంచివాడు. అవివాహితులైన విశ్వాసుల హృదయాల్లో ఆయన కార్యాలు చేయాలని ఆశపడుతున్నాడు. దేవుడు ఎల్లప్పుడు, తన పిల్లలకు ఏది ఉత్తమమో, మరి ముఖ్యంగా యేసును ఏది ఎక్కువగా మహిమపరుస్తుందో దానిని చేస్తాడు. అన్ని విషయాల్లో, దేవుడు మనల్ని యేసు పోలికలో మార్చడానికి (రోమా 8:28-

[22] Leslie Ludy, *Sacred Singleness* (Eugene, OR: Harvest House Publishers, 2009), 24 నుండి తీసుకోబడింది.

29), నిరంతరం యేసును ఆరాధించవలసిన రీతిలో ఆరాధించేటట్లు చేయడానికి (1 పేతురు 1:6-7) కార్యాలు చేస్తున్నాడు.

దేవుడు తన పిల్లల్లో ఒకరికి దైవభక్తిగల భాగస్వామిని పరిపూర్ణంగా అందించగలడు. ఒక క్రైస్తవ పురుషునికి, తన జీవితంలో దేవుణ్ణి గౌరవించే ఒక గుణవంతురాలైన స్త్రీ కోసం వెదకుచుండగా, దైవభక్తిగల భార్యను కనుగొనడంలో దేవుడు అతనికి సహాయం చేస్తాడు (సామెతలు 18:22, సామెతలు 19:14, సామెతలు 31:10).

క్రీస్తు కోసం జీవిస్తున్న ఒక అవివాహితురాలు, దేవుడు ఆమెకు భర్తను ఇచ్చినా ఇవ్వకపోయినా సరే, దేవుడు తన అవసరాలు ఉత్తమమైన రీతిలో తీరుస్తాడని నమ్మాలి. దేవుని అనుగ్రహం, ఆయన నమ్మకత్వాన్ని బట్టి ఆమె పూర్తిగా, ఆత్మీయంగా ఫలభరితమైన జీవితం గడుపుతుంది.

ఒకవేళ అవివాహ స్థితి, ఆమె పట్ల దేవుని ఉద్దేశ్యమైతే, ఆమెకు దేవుడే పరిపూర్ణ ప్రియుడు, పోషకుడు, రక్షకుడు, నాయకుడు. ఆమె హృదయానికి యేసు భర్తగా ఉండగలడు (యెషయా 54:5), భూలోక సంబంధమైన భర్తకు బదులుగా ఆమె ఆయనను ప్రేమించగలదు, ఘనపరచగలదు, లోబడగలదు.

> **ఒక ప్రార్థన**
>
> "ప్రభువా, నేను నీ
> వాడను/దానను.
> అదే నా గుర్తింపు, ,
> నా పిలుపు,
> నా భద్రత,
> నా ఆదరణ,
> నా ఉద్దేశ్యం,
> నా ఆనందం, మరియు
> నా బహుమానం.
> నువ్వు నాకు కావాలి.
> నువ్వు చాలు.
> నువ్వు నన్ను నింపు.
> నువ్వే నా ఆధారం.
> నన్ను పరిపూర్ణంగా చేసేది
> నువ్వే."

ఒకవేళ ఆమె వివాహం చేసుకోవడం దేవుని ఉద్దేశ్యమైతే, ఆమె ఒంటరిగా ఉన్నటువంటి సమయం దేవుణ్ణి (*కేవలం* ఆయనే పరిపూర్ణ ప్రియుడు, పోషకుడు, రక్షకుడు మరియు నాయకుడిగా) నమ్మడం ఆమెకు నేర్పుతుంది, అపరిపూర్ణుడైన శారీరక భర్తను ఎలా ప్రేమించాలో, గౌరవించాలో అతనికి ఎలా లోబడాలో కూడా నేర్పుతుంది.

**క్రీస్తులో సంపూర్ణత**

విశ్వాసులందరూ తమ సంపూర్ణ సంతృప్తిని మానవుడైన భాగస్వామియందు కాకుండా క్రీస్తులోనే కనుగొనాలి. ఒకవేళ వివాహం చేసుకోవాలనుకున్నవారు కూడా, ఎక్కువకాలం ఒంటరిగా ఉండడం ద్వారా యేసులోనే సంతృప్తి పొందే అవకాశాన్ని పొందుతారు. అవివాహ స్థితిలో ఒంటరిగా ఉండే సమయం యేసు ఉంటే చాలు అని చెప్పే అవకాశాన్ని కలుగజేస్తుంది (ఫిలిప్పీయులకు 4:11-13).

> దేవుడు వివాహాన్ని ఏర్పాటు చేశాడని, దానిని మనం ఘనంగా యెంచాలని లేఖనం స్పష్టంగా తెలియజేస్తుంది... ఆదాము ఒంటరిగా ఉండుట మంచికాదని చెప్పినప్పుడు, ఆదాము అవసరాలు తీర్చడానికి

దేవుడొక్కడు సరిపోడనా? ఖచ్చితంగా కాదు! బైబిలు వివరిస్తున్నట్లుగా, ఆదాముకు *సహాయం* అవసరం గనుక ఆదాము చేయవలసిన పనిలో సహాయపడేందుకు దేవుడు హవ్వను చేశాడు. అవును, ఆదాము, హవ్వ తమ సహచర్యం ద్వారా అనేక ఆశీర్వాదాలు, మేలులు పొందుకున్నారు కాని వారి వివాహం ఎప్పటికీ దేవుని స్థానాన్ని తీసుకోకూడదు. ఆయన దేవుడుగానే ఉన్నాడు. మన మొదటి ప్రేమ, ఆరాధన ఆయన పట్ల మాత్రమే ఉండాలి.[23]

ఒక వ్యక్తి, శారీరక భావోద్వేగ ఆప్యాయతను అందించడానికి భాగస్వామిగాని లేక కుటుంబంగాని లేనప్పుడు, దేవుని ప్రేమను ఎక్కువగా అనుభవించడం నేర్చుకుంటాడు. భావోద్వేగ పరీక్షల్లో మరియు శారీరక శోధన సమయాల్లో కీర్తన 73:25-26 వంటి లేఖనాలు ప్రోత్సాహంగా ఉంటాయి:

ఆకాశమందు నీవు తప్ప నాకెవరున్నారు? నీవు నాకుండగా లోకములోనిది ఏదియు నా కక్కర లేదు. నా శరీరము నా హృదయము క్షీణించిపోయినను దేవుడు నిత్యము నా హృదయమునకు ఆశ్రయ దుర్గమును స్వాస్థ్యమునై యున్నాడు.

లెస్లీ లుడి ఇలా రాశారు,

కీర్తనాకారుడైన దావీదు తన జీవితంలో అనేకమంది స్త్రీలతో సహవాసం చేశాడు. కాని *దేవునితో* అతనికున్న సన్నిహిత సంబంధమే అతనికి పరిపూర్ణ సంతృప్తి కలుగజేసిందని ఈ వచనాలు చూపిస్తాయి.[24]

ఒంటరిగానున్న విశ్వాసి, యేసు చాలని భావిస్తారు; దేవునితో సంబంధం సంతృప్తినిస్తుంది.

**పరిచర్య అవకాశాలు**

అవివాహితులైన విశ్వాసులు, క్రీస్తులో తమ సంతృప్తిని కనుగొన్నప్పుడు, ఇతరులకు పరిచారం చేయడానికి ఆయన వారి అవివాహ స్థితిలో ఒంటరితనాన్ని ఒక అవకాశంగా వాడుకుంటాడు. వారి సొంత అవసరాలపై దృష్టిపెట్టి, అసంతృప్తి చెందకుండా, వారు ఇతరుల అవసరాలు గుర్తించి వాటిని తీరుస్తారు. ఫలవంతమైన,

> "మీరు ఒంటరివారైతే, మీ సొంత అన్వేషణల్లోబడి మీ సమయాన్ని, స్వేచ్ఛను వృథా చేసుకోకుండా, సంఘానికి, లోకానికి పరిచర్య చేయడానికి పిలువబడ్డారని గుర్తుంచుకోండి."
> - Adapted from Paul Lamicela.

[23] Leslie Ludy, *Sacred Singleness*, 66-67.

[24] Leslie Ludy, *Sacred Singleness*, 67. Leslie Ludy కీర్తన 16:11, కీర్తన 73:25, మరియు కీర్తన 107:9 ను సూచిస్తున్నారు.

తృప్తికరమైన జీవితం జీవించడానికి ఇతరులకు సహాయపడడం ఒక ఉత్తమ మార్గం. ఈ సమయంలో పెంపొందించుకున్న గుణం, తమ జీవితకాలమంతా ఫలించడానికి సహాయపడుతుంది.

► విద్యార్థులు తరగతి కోసం ఫిలిప్పీయులకు 2:3-4 మరియు తీతుకు 3:8, 14 చదవాలి.

ముందు చెప్పినట్లుగా, విభిన్న జీవన పరిస్థితులు ప్రత్యేకమైన అవకాశాలను కలిగిస్తాయి. ప్రతి జీవన దశలో, ఒక వ్యక్తి కొన్ని పనులు చేయగలడు, కొన్ని పనులు చేయలేడు. ముఖ్యంగా, ఒక యువతి, ఒంటరిగా ఉండడం వలన తాను చేయగల పనులను జాబితా చేసింది. ఇతర ఒంటరి పురుషులు, మహిళలు తాము చేయగల విభిన్న పనుల్ని కూడా ఈ జాబితాలో చేర్చవచ్చు.

నేను ఒంటరి అమ్మాయిని గనుక, నాకు ఇవి చాలా సులభం:

- వృద్ధుల్ని సందర్శించి, సమయం గడపడం.
- నిరాశ్రయులకు ఆహారం తయారు చేసి పెట్టడం.
- లోతైన బైబిలు అధ్యయనం చేయడం, పిల్లల కోసం బైబిలు పాఠాలు సిద్ధపరచడం.
- మా ఇంట్లో స్త్రీలకు, ఆడపిల్లలకు పరిచారం చేయడం.
- అంతరాయం లేకుండా విజ్ఞాపన ప్రార్థన చేయడం.
- క్రొత్త నైపుణ్యం నేర్చుకోవడం.
- ప్రోత్సాహకరమైన ఉత్తరాలు, కార్డులు రాయడం.
- ప్రాజెక్టుల్లో ఇతరులకు సొంతగా సహాయం చేయడం.
- అనుకోకుండా ఏదైనా అవసరత ఏర్పడినప్పుడు లేక ఏదైనా సంఘటన వచ్చినప్పుడు, నా పనుల్ని సర్దుబాటు చేసుకోవడం.

ప్రతి ఒక్కరికి వారి వారి జీవన పరిస్థితిని బట్టి నిర్దిష్ట అవకాశాలు లేక బాధ్యతలు ఉంటాయి. ఉదాహరణకు, చిన్న పిల్లల తల్లి, తన పిల్లలకు ఏం నేర్పుతుందో లేక వారికి ఎలా శిక్షణ ఇస్తుందో ఒక జాబితా తయారు చేయవచ్చు. ఆమె వారి తల్లి గనుక, ఈ విధంగా పని చేసే అవకాశం, బాధ్యత దేవుడు ఆమెకు ఇచ్చాడు. (ఈ పాఠం ముగింపులో మీరు మీ సొంత జాబితా తయారు చేస్తారు.)

**సహచర్యం**

వివాహం కాని వారు ఆరోగ్యకరమైన బంధాలు ఏర్పరచుకోవడం ఎంతో ముఖ్యం. మునుపటి పాఠాల్లో చర్చించినట్లుగా, దేవుడు తనతో, ఇతరులతో సంబంధం ఏర్పరచుకోవడానికే ప్రజలను సృజించాడు.

- వివాహం కానివారు, తాము పరిచారం చేయగలవారితో బంధాలు నిర్మించుకోవాలి-బహుశా పిల్లలతో లేక యౌవనులతో లేక పెద్దలతో.
- వివాహం కానివారికి సలహా ఇవ్వడానికి, జవాబుదారితనం కోసం పరిణతిచెందిన పెద్దలు, సలహాదారులు అవసరం.
- వివాహం కానివారికి, తమలాంటి స్థితిలో ఉన్నవారు స్నేహితులుగా ఉండాలి, తద్వారా ప్రభువులో, సహవాసంలో ఒకరికొకరు ప్రోత్సహించుకుంటారు.
- వివాహం కానివారు, వివాహితులతో, కుటుంబాలతో స్నేహితులుగా ఉండాలి. అలాంటి స్నేహంలో పరస్పర ఆశీర్వాదాలు ఉంటాయి.

వివిధ రకాల వారితో స్నేహం చేయడం వలన, అనేకమందికి పరిచారం చేసే అవకాశాలు లభిస్తాయి. వివాహం కానివారికి అవసరమైన మానసిక, ఆత్మీయ ప్రోత్సాహాన్ని స్నేహ బంధం అందిస్తుంది. ఒకవేళ వారి కుటుంబం సమీపంగా లేనట్లయితే, స్నేహితులే కుటుంబీకులుగా ఉంటారు.

రెండు ముఖ్య హెచ్చరికలు ఉన్నాయి:

1. ఒక వ్యక్తి, తన మానసిక, శారీరక అవసరాలను బట్టి అనైతికమైన లేక అజ్ఞానమైన బంధాలు ఏర్పాటు చేసుకోకూడదు.
2. ఒక వ్యక్తి, మనుష్యులతో సంబంధాలకు మించి దేవునికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

**ఆలోచనాత్మకమైన జీవితం**

విశ్వాసులందరూ తమ ఆలోచనల్ని దేవుని కృప ద్వారా పవిత్రంగా ఉంచుకోవాలి (సామెతలు 4:23). కీర్తన 19:14 ఒక ప్రార్థనగా మన ఆలోచనల్లో, మన మాటల్లో ఆయనకు ఇష్టప్రకారంగా జీవించడానికి దేవుని సహాయం ఆశించేదిగా ఉంది. మన ఆలోచనల్లోనూ, మాటల్లోనూ దేవునికి లెక్క అప్పజెప్పవలసినవారంగా ఉన్నామని ఈ ప్రార్థన మనకు జ్ఞాపకం చేస్తుంది.

మన తలంపుల విషయంలో ఎంపికలు ఉంటాయి (ఫిలిప్పీయులకు 4:8): ఏం చూడాలి, వినాలి లేక చదవాలి. మనం దేవుణ్ణి గౌరవించాలంటే, మనల్ని దేవునికి సమీపంగా నడిపించే, ఆయన మాటలకు విధేయత చూపించే పవిత్రమైన మానసిక ఆహారం తీసుకోవాలి (రోమా 12:2, రోమా 13:14).

క్రీస్తు అనుచరులు ఇతరుల పాపపు కార్యాలతో తమను తాము వినోదపరచుకోకూడదు (కీర్తన 101:3, 1 కొరింథీయులకు 15:33). అనైతికమైన ప్రవర్తన చూసి అనందించడమంటే వారి పాపంలో పాలుపుచ్చుకోవడమే (రోమా 1:32). అలాంటి వాటిని చూడడం, వినడం వలన విశ్వాసి పాప విషయంలో జాగ్రత్తగా ఉండకుండా, దేవుణ్ణి సంతోషపెట్టే విషయాల్లో ఆసక్తి కోల్పోతాడు (సామెతలు 13:20). మనం ఎల్లప్పుడు దేవుని ఘనపరచాలని (సామెతలు 23:17) ఆయనవలె చెడుతనాన్ని అసహ్యించుకోవాలని (సామెతలు 8:13) దేవుని వాక్యభాగం నొక్కి చెబుతుంది. దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనాన్ని అసహ్యించుకున్నప్పుడు, మనం ధన్యులం (కీర్తన 111:10).

మన మనసుల్లో ఏం ఉంచుకోవాలో, వేటిని గూర్చి ధ్యానించాలో దేవుడు సూచించిన విషయాలకు మనం అవిధేయత చూపినప్పుడు, మనం మన పాపాన్ని ఒప్పుకొని, ఆ పనులు చేయడం మానేయాలి. అలాంటి సందర్భాలలో, ఏదైనా ఒక చెడు విషయాన్ని మనం అనుకోకుండా విన్నా లేదా చూసిన, వాటి స్థానంలో మంచివైన, దైవీకమైనవైన ఆలోచనలను ఉద్దేశపూర్వకంగా భర్తీ చేయాలి.

► విద్యార్థులు తరగతి కోసం కీర్తన 19:14, కీర్తన 1:1-2, ఫిలిప్పీయులకు 4:6-8, మరియు ఎఫెసీయులకు 5:25-27 చదవాలి.

దేవుడు మన హృదయాలకు, మనసులకు కావలికాయాలని ఆశపడుతున్నాడు, అయితే మనం కూడా ఉద్దేశ్యపూర్వకంగా మంచి ఆలోచనలపై దృష్టిపెట్టడం ద్వారా అందుకు సహకరించాలని ఫిలిప్పీయులకు రాసిన పత్రికలోని వచనాలు మాట్లాడుతున్నాయి. మంచి ఆలోచననాత్మకమైన, పవిత్రమైన జీవితానికి లేఖనాన్ని ధ్యానించడం చాలా ముఖ్యం. దేవుని వాక్యం మనల్ని కడుగుతుందని ఎఫెసీయులకు రాసిన పత్రిక చెబుతుంది. ఇది ఖచ్చితంగా మన తలంపులు, ఆలోచనలను కూడా కడుగుతుంది.

► దేవుణ్ణి-ఘనపరచే ఆలోచనా జీవితాన్ని కలిగియుండడానికి ఏ కార్యకలాపాలు సహాయపడతాయి? మీ ఆలోచనాత్మక జీవితంలో మీకు సహాయపడిన ఇతర వచనాలు ఏమిటి?

### అవివాహ స్థితి మరియు లైంగికత

*కోర్సు అంతటితో నిమిత్తం లేకుండా మీరు ఈ పాఠం అధ్యయనం చేస్తున్నట్లయితే, దయచేసి 4వ పాఠం కూడా చదవండి, అందులో లైంగిక పవిత్రత మరియు నైతిక విషయాలను గురించి చర్చించబడినది.*

### ముగింపు

అవివాహ స్థితి, విశ్వాసులు క్రీస్తుతో తమ బంధాన్ని పెంపొందించుకోవడానికి, అలాగే ఇతరులకు పరిచారం చేయడం నేర్చుకోవడానికి ప్రత్యేక అవకాశాలను ఇస్తుంది. అవివాహితులు ఇతరులతో ఆరోగ్యకరమైన బంధాలు ఏర్పాటు చేసుకుంటూ క్రీస్తులో తమ సంతృప్తిని కనుగొనాలి. తమ అవివాహ స్థితిని దేవుని మహిమ కోసం, ఆయన రాజ్య మేలుకై ఉపయోగించాలి. దేవుని ప్రాధాన్యతల్ని అనుసరించడం ద్వారా, విశ్వాసులు వివాహాలపై మంచి నిర్ణయాలు తీసుకోగలుగుతారు.

### సమూహ చర్చ కోసం

► ఒంటరిగా ఉన్న సంవత్సరాలు, వివాహం చేసుకునే నిర్ణయం, మరియు వివాహ ప్రయత్నం వంటి విషయాలలో నిర్ణయాలకు మార్గనిర్దేశం చేయాల్సిన అనేక ప్రాధాన్యతలను పేర్కొని, వాటిని చర్చించండి.

► వివాహం కానివారికి సంఘం ప్రభావవంతంగా ఎలా పరిచర్య చేయగలదు?

► వివాహం కానివారితో మీ కుటుంబం ఎలా స్నేహంగా ఉండగలదు?

► ఒకవేళ మీరు వివాహం కానివారైతే, మీ సంఘానికి మీరెలా సహాయపడగలరు? వివిధ కాలాలు, వయస్సుల వారికి మీరెలా ఆశీర్వాదంగా ఉండగలరు?

► ఈ పాఠంలో ఏ ఆలోచనలు మీకు క్రొత్తగా ఉన్నాయి?

► ఈ పాఠంలో ఏ విషయాలను చర్చిస్తే బావుంటుందని మీరు భావిస్తున్నారు?

► ఈ పాఠంలోని విషయాలు జీవితంలో ఇతర కాలాలకు ఎలా వర్తిస్తాయో చర్చించండి.

## ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ,

మా జీవిత ప్రతి దశలో నమ్మదగినవానిగా ఉన్నందుకు కృతజ్ఞతలు. వివాహం కాని ఈ స్థితిలో నీ సన్నిధానంలో, నీ మహిమకోసం జీవించినవారిని మాకు మాదిరిగా చూపినందుకు ధన్యవాదాలు.

మా జీవితకాలమంతా నీకు సంపూర్ణంగా లోబడి జీవించడానికి సహాయం చెయ్యండి. నీతో మాకున్న సంబంధంలో ఆనందం, సంతృప్తి పొందడానికి సహాయం చేయండి. మా జీవితంలో నువ్వు మాకిచ్చిన అవకాశాలు వాడుకోవడానికి సహాయం చెయ్యండి.

మా ఎంపికల్లో, మా తలంపుల్లో, మా బంధాల్లో, మా పరిచర్యలో ఎల్లప్పుడు నిన్ను ఘనపరచు కృపనిమ్ము. నీ మహిమ కోసం మమ్మల్ని ఫలదాయకంగా చేయండి.

ఆమెన్

## పాఠం అభ్యాసాలు

(1) యేసు, ఏ పరిస్థితిలో మిమ్మల్ని తన ప్రణాళికకు లోబడమని చెప్పాడో ఆలోచించండి. కనీసం రెండు పేరాల్లో ఆ పరిస్థితిని వివరించి, మీరు దానికి ఎలా స్పందించారో వ్రాయండి. (ఇది ప్రస్తుత పరిస్థితి కావచ్చు లేదా గతంలో జరిగినదై ఉండవచ్చు.) ఆ సందర్భంలో మీ విశ్వాసం ఎలా పరీక్షించబడింది? ప్రభువు మిమ్మల్ని ఎలా నడిపించాడు? ఆయన ప్రణాళికకు మీరు లోబడారా? ఆయనతో మీరు ఏమని చెప్పారో వ్రాయండి. ఈ పరిస్థితిలో విధేయత మీకు ఎలా అనిపించిందో వివరించండి.

(2) మీ వివాహ పరిస్థితి, లింగం, లేక జీవన పరిస్థితి కారణంగా ఎలాంటి అవకాశాలు ఉన్నాయి? ఒక్క నిమిషం పాటు, మీరు చేయలేని విషయాల గురించి ఆలోచన చేయకండి. బదులుగా, ప్రస్తుతం దేవుడు మిమ్మల్ని ఉంచిన స్థితిలో మీరు చేయగల పనులను జాబితా చేయడానికి కొంత సమయం కేటాయించండి. దీనిని రాయండి, “నేను __________ఉన్నాను కాబట్టి __________చేసే అవకాశం లభించింది”

(3) క్రింద ఇవ్వబడిన లేఖనాలను చదివి, అధ్యయనం చేయండి, ఇవన్నీ పాఠం చివర్లో సూచించబడ్డాయి. మీరు మార్చుకోవలసినవి ఏవి ఉన్నాయో దేవుణ్ణి అడగండి, తద్వారా మీ ఆలోచనలు పవిత్రంగాను, ఆయనకు ప్రియంగాను ఉంటాయి. ఒప్పుకోలు ప్రార్థన, విధేయత చూపుతాననే ప్రార్థన చేయండి.

- కీర్తన 1:1-2
- కీర్తన 19:14
- కీర్తన 101:3
- కీర్తన 111:10
- సామెతలు 4:23
- సామెతలు 8:13
- సామెతలు 13:20
- సామెతలు 23:17
- రోమా 1:32
- రోమా 12:2
- రోమా 13:14
- 1 కొరింథీయులకు 15:33
- ఫిలిప్పీయులకు 4:6-8

(4) 3వ అభ్యాసంలో నుండి మూడు వచనాలను ఎంచుకుని, కంఠస్తం చెయ్యండి. తర్వాత తరగతి మొదలుపెట్టే ముందు, కంఠస్తం చేసిన వచనాలను రాయండి లేక చెప్పండి.

# పాఠం 6

# వివాహానికి సిద్ధపాటు

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) జీవిత భాగస్వామిని జ్ఞానయుక్తంగా ఎంచుకోవలసిన ప్రాముఖ్యతను గ్రహించాలి.

(2) బైబిలు ప్రాధాన్యతలు, సూత్రాలకు ఆధారంగా, విశ్వాసికి తగిన జీవిత భాగస్వామి ఎలా ఉండాలో చర్చించాలి.

(3) వివాహానికి ముందు సంబంధాలలో తల్లిదండ్రుల ప్రమేయానికి బైబిల్ సూత్రాలను వర్తింపజేయాలి.

(4) వివాహానికి ముందు, స్నేహితుల్ని ఎంచుకునేటప్పుడు జ్ఞానయుక్తంగా నిర్ణయాలు తీసుకోవాలి.

## దివ్య మరియు కిరణ్

దివ్య భారతదేశంలోని ఒక క్రైస్తవ కుటుంబంలో పెరిగింది. ఒకరోజు, ఆమె కుటుంబ సభ్యులు, కిరణ్ అనే ఒక యవ్వన ప్రసంగికుని గురించి ఆమెకు చెప్పారు. వారు ఆమె గురించి కిరణ్ తో కూడా మాట్లాడారు. అయితే దివ్య, అతన్ని చూడడానికి ఆసక్తి చూపలేదు. ఒకరోజు సాయంత్రం ఆమె ఇంటికి తిరిగి వచ్చే సరికి, కొన్ని గంటల నుండి ఆమె కోసం ఎదురుచూస్తున్న కిరణ్ కనబడ్డాడు. ఆమెకు ఇష్టం లేకపోయినా, అతడు ఏం చెబుతాడో విందామని అక్కడ కూర్చుంది. అప్పుడతడు, “నేను ఒక బైబిలు కళాశాల బోధకుడ్ని. నాకు జీతం తక్కువ. కొన్నిసార్లు ప్రభువు సువార్త ప్రకటన కోసం కష్టమైన ప్రదేశాలకు వెళ్తాను, కొన్నిసార్లు ఆరుబయట నేలమీదే పడుకుంటాను. నాతో బాధలు అనుభవించడానికి నువ్వు సిద్ధంగా ఉన్నావా?” అని అడిగాడు. అతడలా చెప్తుండగా దివ్య ఏడ్వసాగింది ఎందుకంటే దేవుడు ఇతన్నే తన జీవిత భాగస్వామిగా నిర్ణయించాడన్న భావన ఆమెకు కలిగింది. ఆ సంభాషణ తర్వాత, పెళ్లి వరకు వారు ఒకరినొకరు పెద్దగా చూసుకోలేదు, ఒంటరిగా కలవలేదు. ఇప్పుడు వారు కొన్ని సంవత్సరాలుగా కలిసి ప్రభువు పరిచర్యలో ఉన్నారు.

## జీవిత భాగస్వామిని ఎన్నుకోవడం

**జాగ్రత్తగా ఎన్నుకోండి!**

దేవుని ప్రణాళిక ప్రకారం, వివాహం జీవితాంతం కొనసాగే సమర్పణ అని యేసు చెప్పాడు (మత్తయి 19:6-8). మీరు ఇప్పటి కోసమే వివాహం చేసుకోవడం లేదు. మీలో ఒకరు చనిపోయే వరకు మీతో జీవిత భాగస్వామిగా ఉండే వ్యక్తిని మీరు వివాహం చేసుకుంటారు (రోమా 7:2). వివేకంతో ఎంపిక చేసుకోవాలి!

మీ జీవితంలో మీరు కేవలం మంచి దినాలను, ఆనందరకమైన దినాలను మాత్రమే పంచుకోరు. కష్టాలు, హృదయంలోని బాధలు, సంక్షోభాలు, అనేక విషాదాలు కూడా పంచుకుంటారు. ఎలాంటి దుఃఖ పరిస్థితులు ఎదుర్కొంటారో కూడా మీకు తెలియదు. కష్ట సమయాల్లో మంచి, దైవభక్తిగల భాగస్వామిని వివాహం చేసుకోవడం వల్ల అనేక ఆశీర్వాదాలు ఉన్నాయి. అయితే, ప్రభువులో బలంగా నాటబడని భాగస్వామిని మీరు కలిగియుంటే కష్టసమయాలు మరింత అధ్వాన్నంగా ఉంటాయి. మీరు మీ జీవితమంతా, అన్ని పరిస్థితుల్లో మీతో ఉండే ఒకరిని వివాహం చేసుకుంటున్నారు. కాబట్టి, భాగస్వామిని జాగ్రత్తగా ఎంపిక చేసుకోండి!

> "మీరు మీ కుటుంబంలో జన్మించాలని ఎంపిక చేసుకోలేదు; కాని మీరు తర్వాతి కుటుంబాన్ని నిర్మించడానికి ఎవరిని వివాహం చేసుకోగలరో ఎంపిక చేసుకోవచ్చు."
>
> \- Gary Thomas,
>
> *The Sacred Search*

మీరు మీ కుటుంబాన్ని నిర్మించి, అభివృద్ధి పరచుకోవడానికి ఒక వ్యక్తిని వివాహం చేసుకుంటారు. మీరు మీ పిల్లలకు తల్లిదండ్రుల్ని, వారసులకు తాత అమ్మమల్ని ఎన్నుకుంటున్నారు. మీ పిల్లల ఆత్మీయ జీవితాల్ని గొప్పగా ప్రభావితం చేసే వ్యక్తిని మీరు ఎన్నుకుంటున్నారు. వారి ప్రవర్తన, అలవాట్లు, గుణాలను మీ పిల్లలు అనుసరిస్తారు (ఎఫెసీయులకు 5:1). వారు తమ మాటలు, మాదిరి ద్వారా మీ పిల్లలకు శిక్షణ ఇస్తారు (సామెతలు 23:26). మీ పిల్లలను ప్రేమగా, జాగ్రత్తగా చూసుకునే, శ్రద్ధతో, ప్రేమతో వారిని నడిపించి క్రమశిక్షణ నేర్పించే వారిని ఎన్నుకోండి. మీరు తరాలపై మంచి లేదా చెడు ప్రభావం చూపే వారిని ఎంచుకుంటున్నారు. కాబట్టి, జ్ఞానంతో ఎంచుకోండి!

► విద్యార్థులు తరగతి కోసం సామెతలు 14:1, సామెతలు 24:3-4, మరియు సామెతలు 31:10-12, 30 చదవాలి.

జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడం అనేది మీ జీవితంలో మీరు తీసుకునే అత్యంత ముఖ్యమైన రెండవ నిర్ణయం; మొదటిది, యేసును మీ ప్రభువుగాను, రక్షకుడుగాను అంగీకరించడం. మీరు తీసుకున్న నిర్ణయం మీ జీవితాన్ని మార్చివేస్తుంది, అయితే అది ఇతరుల్ని కూడా ప్రభావితం చేస్తుంది. తెలివైన ఎంపిక మీకు, ఇతరులకు ఆశీర్వాదకరం. అవివేక నిర్ణయం మీకు, ఇతరులకు హానికరం. కావున, ప్రార్థనాపూర్వకంగా ఎన్నుకోండి!

లోకంలో పరిపూర్ణులు ఎవరూ లేరు. మీకు సమస్యలు, బలహీనతలు, వైఫల్యాలు ఉంటాయి. మీ జీవిత భాగస్వామి కూడా పరిపూర్ణులుగా ఉండరు, జీవితకాలం పరిపూర్ణత లేనివారిగానే ఉంటారు. కాబట్టి *పరిపూర్ణులైన* భాగస్వామి కోసం చూడకండి. బదులుగా, దేవుణ్ణి పరిపూర్ణంగా ప్రేమించే భాగస్వామి కోసం చూడండి. తప్పుల్ని, వైఫల్యాల్ని ఒప్పుకుని సరిదిద్దుకోవడానికి వినమ్రతతో సమ్మతించే వారి కోసం చూడండి. ఇలాంటి భాగస్వామి మీకు ఆశీర్వాదకరం, మరియు బలహీనతల్లో మీరు ఒకరుకొకరు సహాయం చేసుకొంటూ ఒకరికొకరు సహాయకరంగా ఉండగలరు.

► విద్యార్థులు తరగతి కోసం సామెతలు 11:14, సామెతలు 12:15, సామెతలు 13:18, మరియు సామెతలు 23:22 చదవాలి.

జ్ఞానంతో ఎన్నుకోండి. జీవితకాలం కోసం ఎన్నుకోండి. ఆత్మీయంగా ఉండే పెద్దల నుండి, మీ తల్లిదండ్రుల నుండి సలహా తీసుకోండి. వారి హెచ్చరికలు వినండి. మీ స్వంత భావోద్వేగాలు చెప్పే విషయాలు వినకండి. నిర్ణయం చాలా ముఖ్యమైనది, కాబట్టి మీరు అశ్రద్ధగా ఉండకూడదు.

### ఒక అవిశ్వాసిని వివాహం చేసుకోవద్దు

దేవుని దృష్టికి అతి ముఖ్యమైన ఒక విషయం ఏంటంటే, తన ప్రజలు విశ్వాసులనే వివాహం చేసుకోవాలి. ఎందుకంటే దేవునితో ఒకరి సంబంధం ఈ జీవితంలో, నిత్యత్వంలో అన్నింటికంటే ముఖ్యమైనది. వివాహం - మానవ సంబంధాలలో అత్యంత సన్నిహితమైనది - ఇది దేవునితో ఒక వ్యక్తి సంబంధాన్ని ప్రభావితం చేస్తుంది. ఒక విశ్వాసి, అవిశ్వాసియైన జీవిత భాగస్వామిని కలిగి ఉంటే, దేవునితో సన్నిహితంగా, జాగ్రత్తగా నడవటం మరింత కష్టం.

అంతేకాదు, తల్లిదండ్రుల అవిశ్వాసం పిల్లలపై గొప్ప ప్రభావాన్ని చూపిస్తుంది. తల్లిదండ్రులలో ఒకరు (తల్లి లేక తండ్రి) అవిశ్వాసిగా ఉన్నప్పుడు, ఆ కుటుంబంలో పిల్లలందరు ప్రభువును సేవించడం అనేది చాలా అరుదుగా జరుగుతుంటుంది. మనం ఆయన్ని సేవించాలని, మన పిల్లల్ని దేవుని పరిచర్యకొరకు పెంచాలని దేవుడు ఆశపడుతున్నాడు (ఆదికాండము 18:19; ద్వితీయోపదేశకాండము 6:2, 7; మలాకీ 2:15).

పాత నిబంధన గ్రంథంలో, ఇశ్రాయేలీయులకు, వారి విశ్వాస కుటుంబ పరిధి దాటి బయట ఎవ్వరితోనూ వివాహం చేసుకోవడానికి అనుమతి లేదు.[25] అవిశ్వాసుల్ని వివాహం చేసుకోవడం వలన, ప్రజలు ఇతర అన్యదేవతల్ని

[25] నిర్గమకాండము 34:11-16, ద్వితీయోపదేశకాండము 7:1-6, యెహోషువ 23:11-13, ఎజ్రా 9-10

ఆరాధిస్తారని, అద్వితీయ సత్య దేవునితో ఉన్న బంధాన్ని పాడు చేసుకుంటారని దేవునికి తెలుసు! ఇశ్రాయేలులో ఖచ్చితంగా ఇలాగే జరిగిందని పాత నిబంధన మనకు చూపిస్తుంది.[26]

నేటికీ, విశ్వాసులు విశ్వాసుల్ని మాత్రమే వివాహం చేసుకోవాలి. ఈ విషయంలో రాజీపడకండి. ఒక అవిశ్వాసితో ప్రేమ బంధాన్ని కొనసాగించవద్దు.

► విద్యార్థులు తరగతి కోసం 2 కొరింథీయులకు 6:14-18 మరియు 1 కొరింథీయులకు 7:39 చదవాలి.

**మీ జీవిత భాగస్వామి విశ్వాసి కానప్పుడు**

వివాహం కాని ఒక విశ్వాసి, అవిశ్వాసిని వివాహం చేసుకోకూడదని దేవుడు ఆశిస్తున్నాడు. ఇది ఖచ్చితం. అయితే, అవిశ్వాసులైన దంపతుల్లో, ఒక భాగస్వామి రక్షణ కోసం క్రీస్తులోనికి వచ్చినప్పుడు, తన భాగస్వామి అతనితో ఉండడానికి ఇష్టపడకపోతే తప్ప, అతడు అవిశ్వాసియైన తన భాగస్వామితోనే జీవించాలి (1 కొరింథీయులకు 7:12-16). కొన్ని సందర్భాల్లో, క్రైస్తవ భర్త లేక భార్య విశ్వాసాన్ని బట్టి అవిశ్వాసులైన భాగస్వాములు కూడా రక్షణ పొందుతారు (1 కొరింథీయులకు 7:14, 16; 1 పేతురు 3:1-2). అయితే, పెళ్ళికాని క్రైస్తవులు, అవిశ్వాసిని వివాహం చేసుకోవడానికి ఆలోచన కూడా చేయకూడదు.

**వివాహం చేసుకోవాలనుకొనే జీవిత భాగస్వామిలో చూడాల్సిన గుణాలు**

వివాహం కోసం సిద్ధపడుతున్నప్పుడు, తమను ఒక మంచి జీవిత భాగస్వామిగా చేయగల మంచి లక్షణాలను పెంపొందించుకోవాలి. వివాహం చేసుకోవాలనుకుంటున్నప్పుడు, ఈ క్రింది లక్షణాల్ని కలిగిన వారి కోసం వెదకాలి.

> వివాహం చేసుకునే స్త్రీ పురుషులు ఇద్దరూ ఒకరితో మరొకరు యదార్థంగా ఇలా చెప్పకుండా వివాహం చేసుకోకూడదు, "నా ఒంటరిగా ఉన్నప్పటి కంటే కూడా నిన్ను వివాహం చేసుకున్న తర్వాత ప్రభువును మరింతగా సేవించగలను."

1. **క్రీస్తుతో మీ సంబంధాన్ని ప్రోత్సహించే, ఆధ్యాత్మికంగా మీరు ఎదగడానికి సహాయపడే క్రీస్తుతో సంబంధం ఉన్నవారిని వివాహం చేసుకోండి.** (2 పేతురు 1:5-9, 2 పేతురు 3:18).

2. **మంచి ప్రవర్తన గలవారిని వివాహం చేసుకోండి.** భార్యలు తమ భర్తల్ని వ్యక్తిత్వంతో సంబంధం లేకుండా ప్రేమించాలని ఎఫెసీయులకు 5:33 ఆదేశిస్తుంది, అయితే గౌరవానికి అర్హులైనటువంటి పురుషుల్ని వివాహం చేసుకున్నప్పుడు ఈ పని చాలా సులభం. మంచి ప్రవర్తన అంటే, క్షమించడం, స్వీయ-నియంత్రణ

---

[26] న్యాయాధిపతులు 3:5-7, 1 రాజులు 11:1-6, ఎజ్రా 9:10-15

కలిగి ఉండడం, వినయంగా, శ్రద్ధగా, బాధ్యతాయుతంగా ఉండడం, బోధించే మనసు కలిగి ఉండడం అని అర్థం. మీరు వివాహం చేసుకునే వ్యక్తి పరిపూర్ణుడు కాలేడు కాని ఈ గుణాల్లో ఎదుగుతాడు.

దేవుడు సంఘ నాయకులు, వారి భార్యల విషయంలో ఉన్నత ప్రమాణాలను కలిగియున్నాడు (1 తిమోతికి 3:2-4, 8-9, 11-12; తీతుకు 1:6-8). సంఘ నాయకుడు చెడు ప్రవర్తనగల వ్యక్తిని వివాహం చేసుకుంటే, పరిచర్య చాలా దెబ్బతింటుంది.

3. **పవిత్రత, మంచి ప్రవర్తనకు పేరు సంపాదించుకునే వారిని వివాహం చేసుకోండి** (1 తిమోతికి 2:9-10, 1 తిమోతికి 3:7, 2 తిమోతికి 2:19, తీతుకు 1:15, తీతుకు 2:4-5).

4. **బైబిలు ప్రకారంగా ఆలోచించే వారిని వివాహం చేసుకోండి** (కీర్తన 119:66). శోధనలు, భయాలు, తప్పుడు వైఖరులు లేక తప్పుడు ప్రేరణలు ఎదురైనప్పుడు, వారు దేవుని వాక్యాన్ని గుర్తు చేసుకుంటారు, నమ్ముతారు, విధేయులౌతారు (సామెతలు 4:4-6, యెహోషువ 1:7-8). అవసరత, ప్రమాదం, బాధ, లేక ఏ విధమైన సమస్యైన ఎదురైనప్పుడు, వారు దేవుని మీద దృష్టిపెడతారు, వాక్యంలో వారికి కావాల్సిన సహాయాన్ని పొందుకుంటారు (కీర్తన 119:50, 92, 114).

5. **మీ పిల్లలకు మంచి తండ్రి లేక తల్లిగా ఉండేవారిని వివాహం చేసుకోండి:** దేవుని మార్గాల్ని వారికీ బోధించి, వారి యెదుట మంచి స్థిరమైన క్రైస్తవ జీవితాన్ని గడిపేవారిని వివాహం చేసుకోండి (సామెతలు 6:20-23, ఎఫెసీయులకు 6:4, 2 తిమోతికి 1:5, 2 తిమోతికి 3:14-15).

6. **దైవభక్తిగల మిత్రులు, సలహాదారుల ద్వారా ప్రభావితమయ్యేవారిని వివాహం చేసుకోండి** (కీర్తన 119:63, 2 తిమోతికి 2:22).

7. **అధికారానికి లోబడేవారిని వివాహం చేసుకోండి. ఒక పురుషుడు లోబడే స్త్రీని వివాహం చేసుకోవడం తెలివిగల పని** (ఎఫెసీయులకు 5:22). అలాగే స్త్రీ కూడా దేవునికి లోబడే వ్యక్తిని అలాగే సంఘంలో, ఉద్యోగంలో, ప్రభుత్వంలో దేవుడు అతనిపై ఉంచిన అధికారులకు లోబడే వ్యక్తిని వివాహం చేసుకోవాలి (రోమా 13:1, ఎఫెసీయులకు 6:5-8, హెబ్రీయులకు 13:17, 1 పేతురు 5:5). ఆమె భర్త దేవునికి లోబడినప్పుడు, ఆమె భద్రతను పొందుకుంటుంది, ఆశీర్వదించబడుతుంది.

► పైన పేర్కొన్న గుణాల్లో, మీకు ఏది ముఖ్యమైంది? ఈ గుణాల ప్రాముఖ్యతను చూపించే ఏ ఉదాహరణలు మీరు చూశారు?

## తల్లిదండ్రులు నిశ్చయించిన వివాహాలు

చాలా సంస్కృతుల్లో, తల్లిదండ్రులే తమ పిల్లలకు వివాహాలను నిశ్చయించడం సర్వసాధారణం. ఉదాహరణకు, ఒక పెద్ద దేశంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు తగిన జీవిత భాగస్వామిని కనుగొని వారి తల్లిదండ్రులతో మాట్లాడతారు. సాధారణంగా, అప్పుడు వాళ్ళు అబ్బాయి, అమ్మాయి కలుసుకోవడానికి అవకాశం ఇస్తారు. వివాహం చేసుకోవాలా వద్దా అని నిర్ణయించుకునే ముందు, యౌవనస్థులు ఇద్దరు ఒకటి లేక రెండు లేక మూడుసార్లు కలుసుకుంటారు. తల్లిదండ్రులు ఎన్నుకున్న వ్యక్తిని అంగీకరించాలో లేదో పిల్లలు నిర్ణయించుకోవచ్చు, కాని ఒకరికొకరు బాగా అర్థం చేసుకునే సమయం వారికి ఉండదు.

ఈ సంస్కృతుల్లోని క్రైస్తవ తల్లిదండ్రులు తమ పిల్లలకు భాగస్వాముల్ని వెదకుతున్నప్పుడు బైబిలు విలువలను పాటించాలి. తమ పిల్లలకు దైవికమైన, తెలివైన, పరిణతి చెందిన భాగస్వాముల కోసం చూడాలి. దేవునికి ప్రధాన స్థానం ఇచ్చే వారి కోసం చూడాలి. ఈ విషయాలు తల్లిదండ్రుల ఎంపికను ప్రభావితం చెయ్యాలి, అవి ఒకరి విద్య, వృత్తి, సామజిక హోదా లేక ఆర్థిక స్థితి కంటే మించినదిగా ఉండాలి.

## వ్యక్తిగతంగా నిశ్చయించుకున్న వివాహాలు

### జీవిత భాగస్వాముల్ని ఎంపిక చేసుకునే ఎదిగిన పిల్లల తల్లిదండ్రులకు ఉండాల్సిన జ్ఞానం

ఐరోపా, ఉత్తర అమెరికా దేశాలతో సహా, కొన్ని సమాజాల్లో సంస్కృతుల్లో, యౌవనస్థులు తల్లిదండ్రుల ఆలోచన లేకుండా తమ భాగస్వాముల్ని ఎన్నుకోవడం సర్వసాధారణం.

ఈ సంస్కృతుల్లో క్రైస్తవ తల్లిదండ్రులు, జీవితభాగస్వాముల్ని వెతుక్కుంటున్న యౌవనులైన తమ పిల్లల్నిప్రభావితం చేయకూడదని భావిస్తారు. వారి పిల్లలు వివాహం చేసుకుంటున్న వ్యక్తి వారికి ఇష్టం లేకపోయినప్పటికీ, వారికి అడ్డుచెప్పకూడదని భావిస్తారు. ఈ విమర్శలు భవిష్యత్తులో కుమారుడు/కూతురుకు మరియు కోడలు/అల్లుడికి మధ్య బేధాలు కలిగిస్తాయని భావిస్తారు.

క్రైస్తవ తల్లిదండ్రులు తమ పిల్లలకు వివాహాలు ఏర్పాటు చేయనప్పటికీ, పిల్లలు జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే విషయంలో ప్రభావం చూపించాలి. తల్లిదండ్రులు చిన్నతనంలోనే ఈ విషయాలు గురించి పిల్లలతో మాట్లాడాలి. తల్లిదండ్రులు ఉద్దేశ్యపూర్వకంగా తమ పిల్లల ఆలోచన విధానాన్ని, విలువల్ని ప్రభావితం చెయ్యాలి (ద్వితీయోపదేశకాండము 6:5-9). ఒక తల్లిగా/తండ్రిగా దీనిని మీరు ఎలా చేయగలరు?

1. **ఒక మంచి దైవికమైన జీవిత భాగస్వామిగా, మంచి తల్లి/తండ్రిగా మీరు స్వయంగా మంచి మాదిరిగా ఉండండి.** మీ జీవితంలో దేవుని సూత్రాలను పాటించకపోతే, మీరు మీ పిల్లలకు చెప్పే మాటలకు అర్థం ఉండదు. మీరు చెప్పే మాటలకు, మీరు చేసే పనులకు పొంతన లేకపోతే, మీ పిల్లలు మీ మాటల కంటే మీరు చేసే పనులనే ఎక్కువగా అనుసరిస్తారు.

2. **జీవిత ఉద్దేశ్యం గురించి, వివాహ ఉద్దేశ్యం గురించి, భాగస్వామిలో ఏం చూడాలో అనే విషయం గురించి దేవుని ప్రమాణాలు ఏం చెబుతున్నాయో నొక్కి చెప్పండి** (కీర్తన 34:11-12). మనం లోక నియమాల్ని చూస్తున్నప్పుడు, వింటున్నప్పుడు, లేక చదువుతున్నప్పుడు, దేవుని వాక్యాన్ని మాదిరిగా బోధించకుండా లోకమే మనకు మాదిరి అన్నట్లుగా పిల్లలకు బోధిస్తాం. కాబట్టి ఇలా చేయకుండా, దేవుని మంచి ప్రణాళికల్ని అనుసరించేవారి వైపు పిల్లల దృష్టిని మళ్లించి, దైవికమైన ఆశల్ని వారిలో పెంపొందించాలి. దేవుని విధేయత చూపడంవలన వీరు అనుభవించే మంచి ఫలాల్ని పిల్లలకు చూపించాలి.

3. **జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే విషయంలో ఇతర వాటన్నిటికంటే ప్రవర్తన ముఖ్యమని మీ పిల్లలకు బోధించాలి.** ఇతరుల శరీర లేక వ్యక్తిత్వ అందం కంటే కూడా వారి ప్రవర్తనను, మంచి గుణాన్ని చూడాలని చిన్ననాటి నుండి వారికి బోధించాలి. వారి స్నేహితులు బాధ్యత కలిగిన వారో లేదా సోమరులో, విధేయులో లేక అవిధేయులో, నిజాయితీపరులో లేక మోసపరులో గమనించమని వారికి బోధించాలి. వారి బాహ్య ఆకారం కంటే అంతరంగ ప్రవర్తనను ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలని వారికి నేర్పించాలి.

తల్లిదండ్రులు తమ పిల్లలు పెద్దయ్యాక జీవిత భాగస్వామిని ఎంచుకునేటప్పుడు వారి సలహాను తీసుకోవాలని కోరుకుంటే, చిన్నప్పటి నుండే వారికి తల్లిదండ్రుల మాట వినడం ఎంత మంచిదో నేర్పించాలి (సామెతలు 1:8). యుక్తవయస్సు వచ్చాక లేదా పెద్దయ్యాక ఈ విషయాన్ని నేర్పించడం చాలా ఆలస్యం అవుతుంది. పిల్లలు చిన్న వయసులో ఉన్నప్పుడే తల్లిదండ్రులు ఈ విషయాన్ని నేర్పించాలి (సామెతలు 4:3-9). దేవుని యందు భయభక్తులు గల తల్లిదండ్రుల మాట వినడం అనేది పిల్లలు రక్షించబడటానికి, ఆశీర్వదించబడటానికి దేవుడు ఏర్పాటు చేసిన మార్గం.

4వ పాఠంలో చర్చించుకున్నట్లుగా, యౌవనస్థులు తమ సంబంధాల విషయాల్లో పవిత్రంగా ఉండేలా చూడడం తల్లిదండ్రులకు దేవుడు ఇచ్చిన బాధ్యత. ఇలా చేయాలంటే, మీ పిల్లలతో మీకున్న సంబంధం మంచిగా, పారదర్శకంగా ఉండాలి, అప్పుడు వారు మీకు జవాబుదారులుగా ఉంటారు, మీ ఆలోచనలను అంగీకరిస్తారు. మీ చిన్నపిల్లలకు ప్రతిరోజు మీరు బోధిస్తుండగా, శిక్షణ ఇస్తుండగా, నడిపిస్తుండగా ఈ విధమైన బంధం వారి బాల్యంలోనే ఏర్పడుతుంది.

**జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకొనే యౌవనస్తులకు జ్ఞానం**

వివాహ విషయంలో సొంత నిర్ణయం తీసుకునే యౌవన విశ్వాసులకు దేవుడు జ్ఞానం ఇస్తాడు. ఇక్కడ మంచి నిర్ణయాలు తీసుకోవడానికి జ్ఞానంతో కూడిన కొన్ని సలహాలు ఉన్నాయి:

**(1)వాక్యానికి విరుద్ధమైన ఎంపికలను తిరస్కరించండి.**

ఉదాహరణకు, విశ్వాసులు అవిశ్వాసుల్ని వివాహం చేసుకోవడం దేవుని చిత్తం కాదని మనకు తెలుసు, కాబట్టి మనం అవిశ్వాసితో ప్రేమ బంధం పెట్టుకోవడానికి ఇష్టపడకూడదు.

**(2) జ్ఞానం కోసం ప్రార్థించడం** (సామెతలు 2; యాకోబు 3:13, 17).

మనం పూర్ణ హృదయంతో దేవుని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేసినప్పుడు, ఆయన మనకు జ్ఞానం ఇవ్వడానికి ఇష్టపడతాడు. జ్ఞానం అనేది దేవుని వాక్యాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేసి, దానికి విధేయత చూపినప్పుడు దొరుకుతుంది. దేవుడు, భక్తిపరులైన వ్యక్తుల సలహాల ద్వారా కూడా జ్ఞానాన్ని ఇస్తాడు. దేవుని జ్ఞానాన్ని సంపాదించినప్పుడు, అది మనల్ని పాపం నుండి కాపాడుతుంది, హాని నుండి తప్పిస్తుంది. ఆయన జ్ఞానం మనకు ఆశీర్వాదాన్ని అనుగ్రహిస్తుంది, దేవుని ఉన్నతమైన ప్రణాళికను ఉత్తమంగా అనుభవించేలా చేస్తుంది. మరి ముఖ్యంగా, మనం తెలివైన నిర్ణయాలు తీసుకున్నప్పుడు, పరలోకమందున్న మన తండ్రిని మహిమపరుస్తాం.

**(3) పరిశుద్ధాత్మ నడిపింపును అనుసరించడం** (కీర్తన 119:133, సామెతలు 3:5-7, యిర్మీయా 10:23).

పరిశుద్ధాత్ముడు మనల్ని వాక్యానికి అవిధేయత చూపే మార్గంలో ఎప్పుడూ నడిపించడు. బదులుగా, వాక్యం గురించి నమ్మకంగా మనకు జ్ఞాపకం చేస్తాడు (యోహాను 14:26, యోహాను 16:13-14). తనకు లోబడి జీవించే ఆయన ప్రజలను పాపం నుండి తప్పిస్తాడు, వారికి జీవాన్ని, సమాధానాన్ని అనుగ్రహిస్తాడు (రోమా 8:5-6, 13-14; గలతీయులకు 5:16, 22-25). ప్రతి పరిస్థితిలో దేవుని చిత్తానికి సంబంధించిన ప్రతి విషయం మీకు తెలియకపోవచ్చు, కాని ఖచ్చితంగా మీకు తెలిసిన దానిని మాత్రం పాటించాలి. మీరు ఆత్మీయంగా, నైతికంగా నమ్మకంగా ఉండాలని దేవుడు ఆశపడుతున్నాడని మీకు తెలుసు. మీరు కొన్ని విషయాలను విస్మరించి, కొన్నింటిని ఆచరించాలని ఆయన ఆశపడుతున్నాడనీ మీకు తెలుసు. దేవుని నడిపింపు కోసం ప్రార్థిస్తున్నప్పుడు, ఏది సత్యమని గ్రహిస్తారో దానిని చెయ్యండి.

**(4) దైవభక్తిగల ప్రజల సలహాలను శ్రద్ధగా వినాలి.**

దైవభక్తిగల తల్లిదండ్రుల్ని కలిగియున్న యౌవ్వనస్తులు వారి జ్ఞానాన్ని వెదకాలి. వారు తమ వివాహ విషయాలకు సంబంధించిన వాటిలో వారి తల్లిదండ్రులతో పారదర్శకంగా నిజాయితీగా ఉండాలి. వారి తల్లిదండ్రులకు ఉన్న ఆసక్తుల విషయంలో కుడా వారు శ్రద్ధ చూపించాలి. వారికి సహాయం చేసి, వారిని రక్షించి, ప్రతి విధమైన హాని నుండి వారిని తప్పించి వారికి మంచి చేయడానికి దేవుడు మంచి తల్లిదండ్రులను ఇచ్చాడు. యౌవనస్తులు ఈ విధంగా ఆశీర్వదించబడే అవకాశాల్ని వృథా చేసుకోకూడదు.

చాలామంది క్రైస్తవులైన యౌవనస్తులకు, దైవభక్తిగల పెద్ద కుటుంబ సభ్యులు ఉండకపోవచ్చు. మంచి ఫలితాలతో జ్ఞానయుక్తమైన నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యాన్ని కనబరిచే దైవభక్తిగల వ్యక్తుల నుండి వారు ఖచ్చితంగా సహాయం పొందాలి.

అయితే, యౌవనులు తమ తల్లిదండ్రులు ప్రభువును సేవించనప్పటికీ వారి సలహాలు విస్మరించకూడదు. కొన్నిసార్లు దేవుని మాటకు లోబడవలసివచ్చినప్పుడు, రక్షించబడని తమ తల్లిదండ్రుల మాట విస్మరించాల్సి వస్తుంది, అయినా కూడా తిరుగుబాటుతనంతో (1 సమూయేలు 15:23) లేక అగౌరవంతో విస్మరించకూడదు (నిర్గమకాండము 20:12). తల్లిదండ్రులు దేవునికి సమర్పించుకొనప్పటికీ, దేవుడు వారి హృదయాలను సున్నిత పరచగలడు అప్పుడు వారు వారి కుమారుడు లేక కుమార్తె వివాహాన్ని ఆశీర్వదిస్తారు. తమ తల్లిదండ్రుల మనసులు దేవుడు మార్చాలని ప్రార్థన చేస్తూ, వేచి ఉన్నప్పుడు అది కుమారుడు లేక కుమార్తె విశ్వాసాన్ని పరీక్షించి, బలపరుస్తుంది.

► వివాహ నిర్ణయాల్లో తల్లిదండ్రుల ప్రమేయం ఉన్నటువంటి లేఖన సూత్రాలు లేక ఉదాహరణలు చర్చించండి. భాగస్వామిని ఎంపిక చేసుకునే నిర్ణయాన్ని ప్రభావితం చేయడానికి తల్లిదండ్రులు ఏం చేస్తారు? వివాహ నిర్ణయాలలో ఒక క్రైస్తవ యౌవనస్తుని వైఖరి తమ తల్లిదండ్రుల యెడల ఎలా ఉండాలి?

## వివాహానికి ముందు, భాగస్వాముల మధ్య స్నేహం

వివాహానికి ముందు కోర్ట్షిప్ కాలం సాధ్యమైతే, ఒక స్త్రీ, పురుషులు వివిధ సందర్భాలలో ఒకరితో ఒకరు సమయం గడపడం ఉత్తమం. అప్పుడు వారు ఒకరు మరొకరు ఎలా ప్రవర్తిస్తారో, ఇతరులతో ఎలా మెలుగుతారో, అనుకోని పరిస్థితులకు ఎలా స్పందిస్తారో, వేర్వేరు పరిస్థితులను ఎలా నిర్వహించగలుగుతారో నేర్చుకోగలరు. కలిసి గడిపిన ఈ సమయం వారు వివాహ భాగస్వాములుగా సరిపోతారా లేదో అర్థం చేసుకోవడంలో సహాయపడుతుంది.

**పవిత్రతకు కట్టుబడి ఉండడం**

► విద్యార్థులు తరగతి కోసం 1 థెస్సలొనీకయులకు 4:1-8 మరియు 2 తిమోతికి 2:19-22.

దేవుడు స్త్రీ పురుషులను భావోద్వేగ, శారీరక కోరికలతో ప్రేమపూర్వకంగా సృజించాడు. ఈ కోరికల వలన, భవిష్యత్తులో వివాహం చేసుకోవాలని ఆశించేవారు తమ సంబంధంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈ కోరికలను కేవలం వివాహ నిబంధనలో మాత్రమే తీర్చుకోవడానికి దేవుడు ఉద్దేశించాడు.

ఒకవేళ స్త్రీ పురుషుడు తమ బంధంలో ఉద్దేశ్యపూర్వకంగా పవిత్రతకు కట్టుబడి లేనట్లయితే, శోధన సమయంలో తమ శరీర కోరికల్ని అనుసరించి దేవుని ఆదేశాలకు అవిధేయత చూపించే అవకాశం ఉంటుంది. నైతిక పవిత్రత విషయంలో దేవుని ఆజ్ఞలకు అవిధేయులవ్వడం వలన అది ఆ స్త్రీ పురుషుల మీద మాత్రమే ప్రభావం చూపక, అనేకుల మీద ప్రభావం చూపిస్తుంది. అవిధేయత వలన పశ్చాత్తాపం, బంధకం, అవమానం, అపరాధం, భయం, అపనమ్మకం కలుగుతాయి, బంధాలు తెగిపోతాయి.

దేవునికి లోబడడం అంటే, మీకు ఉత్తమమైనదేదో అది ఆయనకు తెలుసు, ఆయన అదే కోరుతున్నాడని నమ్మడం. (సామెతలు 3 చూడండి.)

పవిత్రత విషయంలో దేవుని ఆదేశాలు అనుసరించేవారికి దేవుడు అనేకమైన ఆశీర్వాదాలు దాచి ఉంచాడు. విధేయత చూపి దేవుణ్ణి గౌరవించేవారు దేవుడు వారి కోసం ప్రణాళిక చేసిన ప్రతి ఆశీర్వాదాన్ని అనుభవిస్తారు. అవిధేయతవలన కలుగు ఫలితాలను కాకుండా, వారు ఆనందాన్ని, సమాధానాన్ని అనుభవిస్తారు. వారు ఒకరినొకరు నమ్ముతారు. వారు ప్రభువుతో, ఒకరితోనొకరు ఉన్నతమైన సంబంధం కలిగి ఉంటారు.

ఈ ఆశీర్వాదాలు దేవుని పవిత్రత ప్రణాళికను అనుసరించడానికి బలమైన ప్రేరణ. అయితే, ఈ విషయంలో విశ్వాసులకు అతిపెద్ద ప్రేరణ, జీవితంలోని ప్రతి భాగంలో ప్రభువైన యేసుకు గౌరవం తీసుకురావాలనే వారి కోరిక అయి ఉండాలి. డేటింగ్ చేస్తున్న జంట "మా సంబంధంలో మేము దేవుడిని ఎలా ఉత్తమంగా గౌరవించగలం? మేము యేసుకు అత్యధిక మహిమను ఎలా తీసుకురాగలం?" అని అడగాలి.

అపవిత్రమైన కార్యాలు నివారించడానికి, డేటింగ్ చేస్తున్న జంట శారీరక సంబంధం లేకుండా జాగ్రత్తగా ఉండాలి. ఎవరు చూడని స్థలాల్లో ఎక్కువ సమయం గడపడం మానుకోవాలి. వారి జీవితంలో సంభాషణ కంటే శారీరక స్పర్శ ఎక్కువ ప్రాముఖ్యమైనప్పుడు వారు శోధనతో పోరాడతారు. వారి మనసులు, భావోద్వేగాలు శరీర కోరికలతో నిండి ఉంటాయి గనుక ఆత్మీయ విషయాలతో, సంబంధ బాంధవ్య విషయాలతో సరిగా వ్యవహరించలేరు. సంబంధం ఆరంభంలోనే, వివాహానికి ముందున్న సంబంధంలో ఎలాంటి పనులను చేయాలో (ఏవి చేయకూడదు అనుకుంటున్నారో) నిర్ణయించుకోవాలి. మీరు చేసుకున్న ప్రణాళిక పాపం నుండి ఇద్దరిని కాపాడుతుంది, మీ జీవిత భాగస్వామిని

ప్రేమించేలా చేస్తుంది, దేవుణ్ణి గౌరవించేటట్లు చేస్తుంది. మీ ప్రణాళికకు కట్టుబడి ఉండండి. దైవభక్తిగల వ్యక్తులకు జవాబుదారులుగా ఉండండి. వారి సలహాలు వినండి. ఇద్దరూ దైవభక్తిగల మిత్రులతో, కుటుంబ సభ్యులతో కలిసి సమయం గడపండి.

నేటి మీ స్వీయ-నియంత్రణ మీకు కాబోయే జీవిత భాగస్వామికి ఒక బహుమతి.
దేవునికి విధేయత చూపాలనే మీ నిర్ణయం వలన మీ భాగస్వామి భద్రతను, గౌరవాన్ని భావిస్తాడు.
జీవిత భాగస్వామి ప్రేమను అనుభవిస్తుంది.

**అభివృద్ధిని కలుగజేసే కార్యకలాపాలు**

కోర్ట్షిప్ అంటే ఒకరినొకరు బాగా తెలుసుకునే సమయం, కాని ఇది అభివృద్ధి చేసుకునే సమయంగా కూడా ఉండాలి. డేటింగ్ చేస్తున్న జంట కలిసి చేయవలసిన కొన్ని కార్యకలాపాలు ఇక్కడ ఉన్నాయి:

- ఇద్దరూ కలిసి ఏదైనా ఒక పని చేయడం
- మీ ఇద్దరికి క్రొత్తవైన నైపుణ్యాలు నేర్చుకోవడం.
- మంచి పుస్తకాలు చదివి వాటిని చర్చించడం.
- ఒకే లేఖన భాగాన్ని అధ్యయనం చేసి లేక కంఠస్తం చేసి, ఆ తర్వాత చర్చించడం.
- పరిచర్య కార్యకలాపాల్ని ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయడం.
- కలిసి పిల్లల్ని చూసుకోవడం.
- ఇరు కుటుంబాలతో సమయం గడపడం.

ఈ కార్యకలాపాలు:

- స్త్రీ పురుషుడు పరస్పరం అర్థం చేసుకోవడానికి సహాయపడతాయి.
- వారు ఒకరికొకరు సాటియైన సహాయం అవునా కాదా తెలుసుకోవడానికి సహాయపడతాయి.
- ఒకరికొకరు మంచిగా మాట్లాడుకునే సామర్థ్యాన్ని పెంచుతాయి.
- వాళ్ళలో అభివృద్ధిని కలుగజేస్తాయి.

► కోర్ట్షిప్ విషయంలో ఈ సూత్రాల్లో, ఆలోచనల్లో ఏవి మీకు క్రొత్తగా అనిపించాయి? మీ ప్రాంతంలోని విశ్వాసులు పవిత్రతను గురించిన బైబిలు సూత్రాలు ఎలా అన్వయించుకుంటారు మరియు వివాహానికి ముందు సంబంధాల్లో దేవుణ్ణి ఎలా గౌరవిస్తారు?

**వివాహానికి ముందు చర్చించుకోవలసిన విషయాలు**

పెళ్లి చేసుకోవాలనే నిర్ణయం తీసుకునే ప్రక్రియలో ఒకరినొకరు అర్థం చేసుకునేందుకు సమయం తీసుకునే సంస్కృతులలో, పెళ్లికి ముందు కొన్ని ముఖ్యమైన విషయాలు మాట్లాడుకోవాలి.

వివాహాలు తల్లిదండ్రులే నిశ్చయించే సంస్కృతుల్లో, ఇరువురు ఒకరినొకరు అర్థం చేసుకునే అవకాశం వారికి లభించదు. వివాహానికి ముందు ప్రతి ముఖ్య విషయాన్ని చర్చించుకునే అవకాశం వారికి ఉండదు. ఈ పరిస్థితిలో, స్త్రీ పురుషుడి తల్లిదండ్రులు ఒకరికొకరు సమాచారాన్ని పంచుకుని, యువ జంట ఒకరికొకరు సాటియైన సహాయంగా ఉండేలా చూసుకోవడం మంచిది.

ఒకరికొకరు సరిగా అర్థం చేసుకోకుండా వివాహం చేసుకున్న సందర్భాల్లో, వివాహమైన తర్వాత ఈ విషయాల గురించి ఆలోచిస్తారు కాని ఇవి వారి ఎంపికలను ప్రభావితం చేయలేవు ఎందుకంటే వారి ఇప్పటికే ప్రభువు యెదుట ఒకరితోనొకరు నిబంధన చేసుకున్నారు.

వివాహం చేసుకునే స్త్రీ పురుషుల నమ్మకాలు, నేపథ్యాలు, జీవిత లక్ష్యాలు, విలువలు ఎంత సారుప్యంగా ఉంటే వారి వైవాహిక జీవితం అంత అనుకూలంగా ఉంటుంది. సాధ్యమైతే, వివాహం చేసుకోవాలని ఆశించేవారు ఈ విషయాలను గురించి చర్చించుకోవాలి:

- వారి జీవిత లక్ష్యాలు
- వారిరువురికి ముఖ్యమైన విలువలు
- వారి చిన్నతనం, వారు పెరిగిన విధానం
- తల్లిదండ్రులతో, ఇతర బంధువులతో వారికున్న సంబంధం
- వ్యక్తిగత ఆత్మీయ క్రమశిక్షణ, సంఘానికి హాజరయ్యే విధానం, సేవ మరియు పరిచర్యా కార్యాలు వంటి వ్యక్తిగత నమ్మకాలు, విశ్వాసం గురించి మాట్లాడుకోవడం.
- పిల్లల్ని పెంచడం, వారికి బోధించడం, శిక్షణ ఇవ్వడం, క్రమశిక్షణలో పెంచడం, క్రీస్తును తెలుసుకోవడం, విధేయత చూపడం వంటి వివరాలను గురించి చర్చించుకోవడం.
- ఆర్థిక విషయాలు అంటే ఖర్చు చేయడం, పొదుపు చేయడం, కష్ట సమయాల్లో జీవించడం వంటి వాటి గురించి అభిప్రాయాలను తెలుసుకోవడం.

- ఏవైనా శారీరక లేక మానసిక సమస్యలు లేక వారికున్న అంగవైకల్యాలు, వారి కుటుంబంలో సాధారణంగా ఉన్నటువంటి ఆరోగ్య సమస్యలు.

ఈ విధమైన సంబంధంలో, జీవితంలో కష్టమైన, సంక్లిష్టమైన విషయాలను గురించి మాట్లాడుకోవాలి. ఒక్కసారి దేవునితో, భాగస్వామితో నిబంధన చేసిన తర్వాత, అది కష్టమైనా సుఖమైనా మీరు వివాహం చేసుకున్నట్లే (భార్యాభర్తలే). వివాహంలో, భార్యాభర్తలు వారిదగ్గర ఉన్నవన్నీ ఒకరితోనొకరు పంచుకుంటారు కాబట్టి వివాహం గురించి మాట్లాడుకునేటప్పుడు సంభాషణ యదార్థంగా ఉండడం చాలా ముఖ్యం. చర్చ, పారదర్శకంగా లోతుగా జరగాలి. ఒకవేళ మీరు వివాహం చేసుకోబోయే వ్యక్తి ఈ ముఖ్య విషయాలను మాట్లాడడానికి సుముఖత చూపకపోతే, అది అపాయ సంకేతం.

పెళ్లికి ముందు, కాబోయే దంపతులు తమ వైవాహిక జీవితంలోని లైంగిక సంబంధం గురించి వారి నమ్మకాలు, అంచనాలు, మరియు కోరికల గురించి చర్చించుకోవాలి. బంధం మొదలైన కొత్తలో దీని గురించి మాట్లాడటం అనవసరమైన శోధనలకు దారితీయవచ్చు. అయితే, పెళ్లికి ముందే ఈ అంశంపై మాట్లాడుకోవడం చాలా ముఖ్యం.

వివాహం చేసుకునే స్త్రీ పురుషులకు ఇవి చాలా సహాయకరంగా ఉంటాయి:

- మేధోపరంగా సమానంగా ఉండడం.
- వైవాహిక జీవితంలో సమానమైన అంచనాలను కలిగి ఉండడం.
- ఒకే రకమైన సిద్ధాంతపరమైన నమ్మకాలు, ఆత్మీయ ఆచరణలను కలిగి ఉండడం.
- డబ్బు, సమయాన్ని ఖర్చు చేసే విషయంలో ఒకే రకమైన విలువలు, ఆచరణలను కలిగి ఉండడం.
- జీవితం మరియు పిల్లల పెంపకం గురించి ఒకే ఆలోచన కలిగి ఉండడం.

**వివాహానికి ముందు సంబంధంలో అపాయ సంకేతాలు**

వివాహానికి ముందున్న సంబంధాన్ని ముగించడానికి స్త్రీ లేక పురుషుడు తీవ్రంగా పరిగణించవలసిన ఎనిమిది సమస్యల జాబితాను జాన్ డ్రేషర్ పొందుపరచారు:[27]

1. **మీరు, మీ స్నేహితుడు పరస్పరం తరచు వాదోపవాదాలు చేసుకుంటారు.**

[27] Adapted from John Drescher, *For Better, For Worse: A Premarital Checklist*, (Morgantown, PA: Masthof Press, 1999), 30-31.

2. **మీ స్నేహితునిని మానసికంగా బాధపెట్టడం ఎందుకనే ఉద్దేశ్యంతో సున్నితమైన విషయాలను చర్చించకుండా వదిలేస్తారు.** "దీని గురించి మాట్లాడకపోతేనే బాగుంటుంది" అని అనుకుంటారు-ఇది ప్రమాద సంకేతం. వివాహం అంటే, అనేక విషయాలు ధైర్యంగా, ప్రేమగా మాట్లాడుకోవాలని అర్థం.

3. **మీ సంబంధంలో శారీరక సాన్నిహిత్యం ఎక్కువగా ఉండడం.** వివాహమవ్వని జంటగా మీరు శారీరకంగా ఎంత దగ్గరైతే, మాటలు, స్వర స్థాయి, ముఖ కవళికలు మరియు శరీర భాష ద్వారా ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం అంత తక్కువగా నేర్చుకుంటారు. ఎక్కువగా తాకడం, తక్కువగా మాట్లాడడం మీ బంధానికి నిజమైన ప్రమాద సంకేతం కావచ్చు.

4. **ఒక రకమైన భయంతో మీరు సంబంధంలో ఉన్నారనే భావన మీకు కలుగుతుంది.** ఉదాహరణకు, "నేను ఈ బంధాన్ని తెంచుకోవాలని అనుకుంటున్నాను, కాని ఎవర్ని బాధపెట్టదలచుకోలేదు."

5. **మీ స్నేహితుడు మీ అనుకూల విమర్శలను అంగీకరించలేకపోవచ్చు.** మీ స్నేహితుడు తప్పు చేసినప్పుడు, క్షమాపణ చెప్పడానికి నిరాకరిస్తారా? అప్పుడది, పెద్ద సమస్యగా మారుతుంది, ఒకవేళ వివాహం చేసుకుంటే అది ఇంకా పెద్ద సమస్య అవుతుంది.

6. **మీ సంబంధ విషయంలో, మీరు వివాహం చేసుకోవాలనుకుంటున్న వారి విషయంలో తల్లిదండ్రులు, స్నేహితులు అభ్యంతరాలు చెప్పవచ్చు.** ఇది ఖచ్చితంగా అపాయ సంకేతం కావచ్చు, సంబంధాన్ని ముగించడానికి కారణమవ్వొచ్చు. మీరు ఆ వ్యక్తిని మాత్రమే వివాహం చేసుకోవట్లేదు కాని వివాహం చేసుకుని ఒక కుటుంబంలోకి వెళ్తారు, అది మీ భద్రతపై, మీ విజయంపై ప్రభావం చూపిస్తుంది.

7. **మీ స్నేహితుడు అసూయతో లేక అనుమానంతో నిండి ఉంటాడు.** ఉదాహరణకు, ఒకవేళ మీ స్నేహితుడు మీ మాటల్ని ప్రశ్నిస్తే లేక మీ మీద నమ్మకం కోల్పోతే, ఇది అపాయ సంకేతం. అపనమ్మకం ఏ వివాహ బంధాన్నైనా నాశనం చేస్తుంది. కాబట్టి, మీ స్నేహితుడు అతిగా అసూయతో లేదా అపనమ్మకంతో ఉంటే, మీకు అవకాశం ఉన్నప్పుడే సంబంధాన్ని ముగించండి.

8. **మీ సంబంధం గురించి మీకు అసౌకర్య భావన కలిగియుండవచ్చు;** మరి ముఖ్యంగా, మీ స్నేహితునితో ఒంటరిగా ఉన్నప్పుడు అసౌకర్య భావన కలిగియుండవచ్చు. "ఏదో తప్పు జరుగుతుంది" అనే ఆలోచన లేక భావన మీకు ఉండొచ్చు. అంతరంగంలో సమాధానం లేని స్థితిని జాగ్రత్తగా దృష్టించండి!

## ముగింపు

సామెతలు 24:3-4, “జ్ఞానమువలన ఇల్లు కట్టబడును వివేచనవలన అది స్థిరపరచబడును. తెలివిచేత దాని గదులు విలువగల రమ్యమైన సర్వ సంపదలతో నింపబడును.”

ఒక వ్యక్తి తీసుకోగల ఒక ముఖ్యమైన నిర్ణయం, జీవిత భాగస్వామిని ఎన్నుకోవడమే. దేవుని పిల్లలు జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే విషయంలో జ్ఞానంగా నడచుకోవడానికి ఆయన సంతోషంగా సహాయం చేస్తాడు.

## సమూహ చర్చ కోసం

► పాఠంలో మీకు కొత్తగా అనిపించిన అంశం ఏమిటి? అది ఎందుకు ముఖ్యమైనది? దానిని అర్థం చేసుకోవడం మీ సంబంధాలలో ఎలా సహాయపడుతుంది? దానిని అర్థం చేసుకోవడం ఇతరులకు మీరు చేసే పరిచర్యపై ఎలా ప్రభావం చూపుతుంది?

## ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ,

మమ్మును నడిపించినందుకు, మాకు అనుగ్రహించుచున్నందుకు ధన్యవాదా లు. జీవితంలో తీసుకునే ముఖ్య నిర్ణయాల విషయంలో తెలివైన ఎంపికలు చేసుకోవడానికి సహాయం చేసే సూత్రాలు నీ వాక్యంలో మాకు ఇచ్చినందుకు వందనాలు.

మేము జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునేటప్పుడు నీ ప్రాధాన్యతలను కలిగి ఉండేందుకు మాకు సహాయం చెయ్యి. నీవు కోరుకునే స్త్రీ పురుషులుగా మేము ఉండేందుకు మాకు సహాయం చెయ్యి. మేము వినయంగా ఉండి, భక్తిపరులైన వారి సలహాలను వినేందుకు మాకు సహాయం చెయ్యి.

నీకు మహిమ తీసుకొచ్చే పరిశుద్ధమైన, ఫలవంతమైన జీవితాలు జీవించడానికి మాకు సహాయం చేయండి.

ఆమెన్

## పాఠం అభ్యాసాలు

(1) మీ పరిచర్యలో బోధించడానికి ఈ పాఠంలో ఒక భాగం ఎంపిక చేసుకోండి. మీరు ఒక వ్యక్తికి బోధించవచ్చు లేక ఒక సమూహానికి కూడా బోధించవచ్చు. ఈ తరగతి వెలుపల బోధన చేయడం ముగిసిన తర్వాత, మీ తరగతి నాయకుడికి చెప్పండి.

(2) మీ సంస్కృతిలో వివాహం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్న లేక వివాహం గురించి ఆలోచిస్తున్న దైవభక్తిగల స్త్రీ లేక పురుషుని గుణాలను గురించి రాత పూర్వకంగా వివరించండి.

(3) మీరు వివాహితులైనా వివాహితులుకాకపోయినా, మీ జీవిత భాగస్వామిలో చూడాలని ఆశిస్తున్న గుణాల జాబితాను సమీక్షించండి. ఇచ్చిన ప్రతి లేఖన భాగాన్ని చదవండి. మీరెలా ఎదగాలని ఆశిస్తున్నారో దేవుణ్ణి చూపించమని వేడుకొనండి.

(4) ఒకవేళ మీరు ఒంటరివారైతే, భవిష్యత్తులో పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఉన్నట్లయితే, మీ జీవిత భాగస్వామిలో చూడాలనుకుంటున్న వాటిని జాబితా చేయండి. దీనిని మీ తరగతి నాయకుడితో పంచుకోవలసిన అవసరత లేదు కాని మీరు అభ్యాసం పూర్తి చేశారని చెప్పండి.

# పాఠం 7

# బలమైన వైవాహిక బంధాన్ని పెంపొందించుకోవడం

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) దేవుడు స్త్రీ పురుషుల అవసరాల్ని రూపొందించిన విధానానికి, వివాహ బంధాల గురించి దేవుడిచ్చిన సూచనలకు మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవాలి.

(2) లేఖన సూత్రాలకు లోబడడం ద్వారా భార్యాభర్తలు ఒకరికి ఒకరు వారి అవసరాలను ఎలా తీర్చుకోగలరో చూపించాలి.

## వ్యక్తిగత భిన్నత్వాలను అంగీకరించడం

స్త్రీ పురుషులు అనేక విషయాల్లో భిన్నంగా ఉంటారనే విషయం తెలియనిది కాదు! చాలామంది పురుషులు తమ భావోద్వేగాలను వ్యక్తపరచడానికి ఇబ్బందిపడతారు, కాని చాలామంది స్త్రీలు భావోద్వేగాలు వ్యక్తపరచడమే నిజమైన సంభాషణగా భావిస్తారు. పురుషులు ఎక్కువగా సాహసాలు చేయడానికి సిద్ధంగా ఉంటారు, కాని స్త్రీలు భద్రతను గురించి ఆలోచిస్తారు. పురుషులు సాధారణంగా శారీరక సౌందర్యానికి ఆకర్శింపబడతారు, కాని చాలామంది స్త్రీలు భావోద్వేగ బంధాలకు ఆకర్షితులౌతారు. ఇంకా చాలా తేడాలు చెప్పొచ్చు.

భార్య భర్తల మధ్య సర్వసాధారణంగా ఉండే లింగ వ్యత్యాసాలతో పాటుగా, వారి వ్యక్తిత్వాల్లో కూడా ఎన్నో తేడాలు కలిగి ఉంటారు. ఒకరు జనాల్లో ఉండడానికి ఇష్టపడవచ్చు, మరొకరు ఏకాంతంగా ఉండడానికి ఇష్టపడవచ్చు. ఇంట్లో ఎంత వెలుతురు ఉండాలి లేక ఎంత వేడి ఉండాలి వంటి చిన్న అభిరుచులలో కూడా తేడాలు ఉండవచ్చు. డబ్బును ఎలా ఖర్చు పెట్టాలి అనే విషయంలో చాలా వైవాహిక బంధాల్లో విభేదాలు వస్తుంటాయి. ఈ వ్యత్యాసాలు, ఖచ్చితంగా గుణంలో ఉండే వ్యత్యాసాలు కాదు; ఇవి కేవలం వ్యక్తిత్వం, అభిప్రాయాల్లో కలిగే తేడాలు.

వివాహం, స్త్రీ పురుషుల్ని ఐక్యపరుస్తుంది గనుక వాళ్ల మధ్య ఉండే వ్యత్యాసాలు ఉండకూడదని కొందరు భావిస్తారు. తన భాగస్వామికి ఉన్న తేడాల్ని లోపాలుగా భావించి వాటిని సరిచేసుకోవాలని భావిస్తుంటారు. ప్రతి ఒక్కరు తమ భాగస్వామి అభిప్రాయాలు, అలవాట్లు మరియు ప్రాధాన్యతలు తరచూ మార్చడానికి ప్రయత్నిస్తుంటారు.

ప్రతి ఒక్కరు తమ బంధాన్ని బట్టి అభివృద్ధి పొందాలనుకోవడం, మెరుగుపడాలనుకోవడం వాస్తవమే. అయితే, కొన్నిసార్లు మనం ఒక వ్యక్తిని మార్చడానికి చేసే ప్రయత్నం, వాళ్ల వ్యక్తిత్వం మీద దాడిచేసినట్లు అవుతుంది. ఆరోగ్యకరమైన వివాహ బంధాల్లో, ప్రతి భాగస్వామి ఒకరినొకరు ప్రేమించడం, గౌరవించడం, అభినందించడం మరియు సేవ చెయ్యాలనే క్రమశిక్షణను పెంపొందించుకోవడం చేయాలి.

► స్త్రీ పురుషుల మధ్య ఉండే ఇతర వ్యత్యాసాలు ఏంటి? వ్యక్తిత్వంలో ఇతరులు ఇంకా ఎటువంటి వ్యత్యాసాలు అంగీకరించాలి?

## సేవచేయడానికి నిర్ణయించుకోవాలి

*Sacred Marriage*, అను తన పుస్తకంలో గ్యారి థామస్ ఇలా చెప్పారు,

> *ఒక మంచి వివాహం అనేది దొరికేది కాదు, అది మీరు కష్టపడి నిర్మించుకోవాల్సింది. దీనికి కృషి అవసరం.* మీరు మీ స్వార్థాన్ని సిలువపెయ్యాలి. కొన్నిసార్లు మీరు హెచ్చరించాలి, మరికొన్నిసార్లు మీరు తప్పులు ఒప్పుకోవాలి. క్షమించే గుణం చాలా అవసరం. ఇది నిస్సందేహంగా కష్టమైన పని, కాని ఇది తుదకు ఫలిస్తుంది. చివరికి, ఒక అందమైన, నమ్మకమైన పరస్పరం సహాయం చేసుకునే బంధాన్ని ఏర్పాటు చేస్తుంది.[28]

థామస్, ఒట్టో పైపర్ మాటల్ని ఉదాహరిస్తూ ఇలా చెప్పారు:

> వివాహమనేది....చాలామందికి నిరాశపరచే అనుభవమైతే, వారి విశ్వాసపు [అలసటనే] అందుకు కారణం. నిరంతరం వెదకి, కనుగొన్నప్పుడే దేవుని ఆశీర్వాదాలు లభిస్తాయనే వాస్తవాన్ని ప్రజలు ఇష్టపడరు (మత్తయి 7:7; లూకా 11:9). కాబట్టి, వివాహం అనేది ఒక వరం, అలాగే నిర్వర్తించవలసిన ఒక బాధ్యత కూడా.[29]

వివాహాలు తరచుగా దెబ్బతినడానికి కారణం భార్యాభర్తలు ఒకరి అవసరాలను మరొకరు తీర్చడానికి ప్రయత్నించకుండా, వారి స్వంత అవసరాల గురించి మాత్రమే ఆలోచించడమే.

మనం ఒకరి లోతైన అవసరాలను మరొకరం పూర్తిగా తీర్చలేం. కేవలం మన పరలోకపు తండ్రి మాత్రమే మన కోరికల్ని, ఆశల్ని పూర్తిగా తృప్తిపరచగలడు, ఈ కారణంతోనే యేసు వచ్చాడు. మనల్ని రక్షించడం, ఆయన ఆత్మతో -

---

[28] Gary Thomas, *Sacred Marriage*, (Grand Rapids: Zondervan, 2000), 133.

[29] Ibid.

పరిశుద్ధాత్మతో - నింపడం, “అబ్బా తండ్రీ” (రోమా 8:14-15; గలతీయులకు 4:6) తో బలమైన, తృప్తికరమైన బంధంలోకి నడిపించడమే ఆయన ఉద్దేశ్యం.

అయితే, వివాహం అనేది సేవాగుణం నేర్చుకోవడానికి ఒక శిక్షణా క్షేత్రంగా ఉండాలనేది దేవుడు వివాహ బంధాన్ని నియమించడానికిగల ఉద్దేశాలలో ఒకటి; ఇలాంటి సేవగుణాన్నే మనం యేసులో చూస్తాం (యోహాను 13:14). దేవుడు ప్రతి ఒక్కరికి, తమ భాగస్వామికి పరిచారం చేసే దీన హృదయాన్ని ఇవ్వాలనుకుంటున్నాడు (ఫిలిప్పీయులకు 2:3-8).

ఒక భాగస్వామి తన సొంత అవసరాలపై దృష్టిపెట్టకుండా, తన భాగస్వామి అనారోగ్యం, వైఫల్యం, విషాదం, దుఖం మొదలగు కష్ట పరిస్థితుల్లో వారికి సేవ చేస్తారు గనుక కొన్ని వివాహ బంధాలు అందంగా, ఆనందంగా ఉనికిలో ఉన్నాయి. వారి భార్యలు వారి కోసం ప్రార్థించకపోతే, వారిని క్షమించకపోతే, వారిని జవాబుదారితనంగా ఉంచకపోతే, ప్రేమించదగని స్థితిలో కూడా వారిపై ప్రేమ చూపకపోతే, వారి జీవితాలు సర్వనాశనమైపోయేవని కొంతమంది భర్తలు చెబుతారు. కొంతమంది భార్యలు, వేధించే తండ్రి ద్వారా లేక ఇతర గాయాల ద్వారా వారు పొందిన మానసిక వేదనను అధిగమించడానికి, వారి భర్త చూపిన సహనం, అర్థం చేసుకున్న విధానమే కారణం అని చెబుతారు. మనం పతనమైన, పాపభరితమైన, సృష్టి అంతా మూల్గుతున్న లోకంలో జీవిస్తున్నాం గనుక (రోమా 8:22) వివాహమైన ప్రతి ఒక్కరు, గాయాలు దెబ్బలు అనుభవిస్తారు. కాని, ఒకరినొకరు ఓదార్చుకుంటూ, గాయాల్ని కట్టుకోవడానికి దేవుని కృప ఎంతో సహాయపడుతుంది!

మనమందరం స్వార్థపరులుగానే పుట్టాం. మనం ఇతరుల అవసరాల కంటే మన అవసరాలపైనే ఎక్కువ దృష్టిపెడతాం. అయితే, మనలో నివసించే పరిశుద్ధాత్మ ద్వారా మనల్ని రక్షించే, పవిత్రపరచే దేవుని కృప, మన అవసరాల కంటే ఇతరుల అవసరాలపై ఎక్కువ దృష్టిపెట్టేవరకు మనల్ని మార్చగలదు. ప్రతి ఒక్కరు తమ భాగస్వామి అవసరాలు, కోరికలపై ఆసక్తి చూపినప్పుడు వివాహ బంధాలు మరింతగా బలపడతాయి.

►సేవ చేయాలని నిర్ణయించుకోవడం అంటే ఏమిటి?

### భార్యాభర్తల ప్రాథమిక అవసరాలు

దేవుడు స్త్రీ పురుషుల్ని వేర్వేరు అవసరాలు, కోరికలతో రూపించాడు. అంటే, తనకు ఏదైతే సంతోషాన్ని ఇస్తుందో అదే భార్యకు కూడా సంతోషాన్ని ఇస్తుందని పురుషుడు అనుకోకూడదు. భార్య, తన భర్తను ఆమె కావలసిన విధంగానే చూసుకోవాలని అనుకోకూడదు. స్పష్టంగా చెప్పాలంటే, కొన్ని విషయాల్లో మర్యాద, కనికరం అనేవి ఇద్దరికీ ఒకే విధంగా ఉండాలి, కానీ స్త్రీ పురుషులు ఇద్దరు కొన్ని ప్రత్యేక అవసరాలను కలిగి ఉంటారు.

పురుషులు మరియు స్త్రీల ప్రత్యేక అవసరాలను మనం అర్థం చేసుకుంటే, జీవిత భాగస్వామి అవసరాలను ఎలా తీర్చాలో మనం తెలుసుకోవచ్చు. భార్యాభర్తల మధ్య జరిగే అనేక వాదనలు, చర్చలు సమస్యలను పరిష్కరించలేకపోవడం బాధాకరం, ఎందుకంటే ప్రతి ఒక్కరూ అవతలివారి అవసరాలను అర్థం చేసుకోలేరు. అవతలివారు తమను అర్థం చేసుకోలేదని ప్రతి ఒక్కరూ కోపంగా, ఆగ్రహంగా ఉండవచ్చు.

అందరిని ప్రేమించాలి, గౌరవించాలి కాని స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసం ఉంది. స్త్రీ ప్రాథమిక అవసరత ప్రేమ, పురుషుని ప్రాథమిక అవసరత గౌరవం.[30]

► స్త్రీ పురుషుల అవసరాల మధ్య ఈ వ్యత్యాసాన్ని మీరు ఎలా గమనించగలరు?

## భర్త, తన భార్యను ఎలా ప్రేమ చూపాలి

ఎఫెసీయులకు 5:25, 28, "పురుషులారా, మీరును మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి...దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను...అటువలెనే పురుషులు కూడ తమ సొంతశరీరములనువలె తమ భార్యలను ప్రేమింప బద్ధులైయున్నారు..." అని సెలవిస్తుంది.

భర్త ఎల్లప్పుడు తన భార్యతో, నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్పాలి గాని, ఆమెకు తెలుసులే అనుకోకూడదు. అతడు తన ప్రేమను మాటల్లోనే కాకుండా చేతల్లో కూడా చూపించాలి. ఆమెకు ఇష్టమైన మార్గాల్లో కనుపర్చాలి. తనకు నచ్చిన రీతిలో ప్రేమ చూపి, ఆ ప్రేమను ఆమె అనుభూతి చెందాలని అనుకోకూడదు. ఆమె అవసరాలు అతని అవసరాలకంటే భిన్నంగా ఉంటాయి.

### (1) భర్త, తన భార్యకు భద్రత ఇవ్వడం ద్వారా ఆమెను ప్రేమిస్తాడు.[31]

భార్య, తన భర్త తనను శారీరకంగా, మానసికంగా కాపాడుతున్నాడో లేదో తెలుసుకోవాలని ఆశ పడుతుంది. పొరుగువారితో ఏదైనా వివాదం ఏర్పడినప్పుడు భర్త దానిని పరిష్కరించగలగాలి. భర్త, ఇల్లు సురక్షిత ప్రాంతంగా ఉందో లేదో చూసుకోవాలి. ఇతరులు, బంధువులు తనను విమర్శించినప్పుడు అతడు ఆమె పక్షాన మాట్లాడాలి. తనకు లోబడాలని భార్య మీద చెయ్యెత్తడం లేక శారీరకంగా బాధపెట్టడం వంటివి చెయ్యకూడదు. ఆయన తన కుటుంబ

[30] The book *Love and Respect* by Dr. Emerson Eggerich has been very helpful in this section.

[31] ఎఫెసీయులకు 5:28-31, కొలొస్సయులకు 3:19 (భావోద్వేగ భద్రత), 1 తిమోతికి 5:8 (భౌతిక సదుపాయం), నెహెమ్యా 4:13-14 (శారీరక భద్రత), and 1 తిమోతికి 2:14 (ఆత్మీయ భద్రత) తో పాటుగా ఈ సత్యానికి సంబంధించి అనేక లేఖన భాగాలు ఉన్నాయి.

అవసరాలను తీర్చడానికి తన శక్తిమేర కృషి చేయాలి. ఒక భర్త డబ్బు విషయంలో అజాగ్రత్తగా ఉంటే, తన కుటుంబ అవసరాల గురించి అతడు పట్టించుకోవడం లేదని భార్య భావిస్తుంది.

*భర్తలకు ఆర్థిక సూచనలు*

ఆర్థిక సమస్యలే వివాహ బంధాల్లో గొడవలకు ఒక ముఖ్య కారణం. భర్తలారా,

- లాభాపేక్ష కోసం మోసం చేయొద్దు, అనైతికతకు పాల్పడొద్దు; దేవుని అధికారంలో ఉన్నారని గుర్తుంచుకోండి.
- సమస్తం సమకూర్చువాడు దేవుడేనని నమ్మి, సంఘంలో మీ దశమభాగం ఇవ్వండి.
- ఉపాధి కోసం మంచి ఉద్యోగం చూసుకోండి, కాని ప్రస్తుతానికి మీకు ఇష్టంలేని పనైనా చేయడానికి సిద్ధంకండి.
- ఉద్యోగియైనా కాకపోయినా, మీకు, మీ చుట్టూ ఉన్న ఇతరులకు సహాయపడేలా ప్రతి రోజు పని వెతుక్కోండి.
- ఈరోజు అప్పు అడిగి, రేపటి డబ్బును ఖర్చు చేయకండి.
- సంతోషం కోసం ఖర్చు చేసినప్పుడు, అందులో భార్యను పిల్లల్ని కూడా భాగం చెయ్యండి.
- ఇంటి అద్దె వంటి సాధారణ అవసరాల కోసం నిత్యం కొంత డబ్బు దాచుకోండి.
- సౌకర్యం కోసం డబ్బు ఖర్చు చేసుకోకుండా మీ స్థితిని మెరుగుపరచుకోవడానికి పెట్టుబడి పెట్టండి.

**(2) భర్త, తన్ను తాను ఆమెకు అప్పగించుకోవడం ద్వారా ఆమెను ప్రేమిస్తాడు.**

భర్త తననుతాను పవిత్రంగా కాపాడుకుంటూ, భార్యయందు ఆనందించాలి, "ఆమె అతిప్రియమైన లేడి, అందమైన దుప్పి ఆమె రొమ్ములవలన నీవు ఎల్లప్పుడు తృప్తినొందు చుండుము. ఆమె ప్రేమచేత నిత్యము బద్ధుడవై యుండుము" (సామెతలు 5:19). ఒకవేళ భర్త ఇతర స్త్రీలతో అక్రమ సంబంధాలు పెట్టుకుంటే లేక అపవిత్రమైన వినోదాలను అనుభవిస్తే, భార్య తన ప్రేమను అనుభూతి చెందదు.

**(3) భర్త, తన భార్యను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం ద్వారా ఆమెను ప్రేమిస్తాడు.**

భర్త, తన భార్యను అర్థం చేసుకునే విషయంలో ఎల్లప్పుడు విజయం సాధించడు, కాని ఆమె మాటలు విని, ఆమె గురించి తెలుసుకోవడానికి సమయం వెచ్చిస్తాడు. లేఖనం భర్తలతో, "అటువలెనే పురుషులారా, జీవమను కృపావరములో మీ భార్యలు మీతో పాలివారైయున్నారని యెరిగి...జ్ఞానము చొప్పున వారితో కాపురము చేయుడి" (1 పేతురు 3:7) అని మాట్లాడుతుంది. భర్త, తన భార్య భావాల్ని అభిప్రాయాల్ని ఎగతాళి చేస్తే, తన భర్త తనను ప్రేమించడనే భావన కలుగుతుంది. ఆమె మాటలు అతనికి సరైనవిగా అనిపించేలా లేకపోయినా తన విషయాన్ని అర్థం చేసుకోవడానికి అతను ప్రయత్నించడం ఆమెకు అవసరం.

దేవుడు, భర్తను తన కుటుంబానికి శిరస్సుగా చేశాడు గనుక (ఎఫెసీయులకు 5:23), కుటుంబాన్ని నడిపించే బాధ్యత భర్తది (1 తిమోతికి 3:4-5). అయితే, నిర్ణయాలు తీసుకునే విషయంలో, భార్యాభర్తలిద్దరూ చర్చకు కొంత సమయం కేటాయించాలి. తన భార్య అభిప్రాయాలు, భావాలు పరిగణలోనికి తీసుకోకుండా, భర్త తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. ఒకవేళ ఏదొక విషయంలో వారిద్దరూ ఏకీభవించకపోతే, భర్త నిర్ణయం తీసుకోవాలి కాని ఏకీభవించలేకపోయినందుకు భర్త బాధపడాలి. సహజంగా, ఏకీభవించకపోవడమనేది భర్తకు ఒక హెచ్చరికగా ఉండాలి. మంచి నిర్ణయాలు తీసుకునే విషయంలో భర్తలకు అవసరమైన జ్ఞానం, వివేచన భార్యలకు ఉంటుంది.

► ఒక విద్యార్థి తరగతి కోసం ఎఫెసీయులకు 4:2-3, 15-16 చదవాలి. ఈ వచనాలు భార్యభర్తల బంధానికి ఎలా వర్తిస్తాయి?

**(4) భర్త, తన భార్యను అభినందించడం ద్వారా ఆమెను ప్రేమిస్తాడు.**[32]

భర్తలు, తాము చేసే పనిని అభినందించరని చాలామంది భార్యలు భావిస్తారు. భర్త, తన భార్యకు కృతజ్ఞుడై ఉండాలి. కుటుంబం కోసం ఆమె పడే ప్రయాసను గుర్తించాలి. ఇతరుల యెదుట ఆమెను ఎన్నడు కించపరచకూడదు.[33] ఆమె గుణాన్ని, ఆకర్షించే విధానాన్ని, సామర్థ్యాల్ని మెచ్చుకోవాలి. సాధ్యమైనంతవరకు, మంచి వస్త్రాలు ధరించడానికి సహాయపడాలి. తన రూపం గురించి భర్త పట్టించుకోవట్లేదని ఆమెకు అనిపించినప్పుడు, అతను తనను ప్రేమించట్లేదనే భావన కలుగుతుంది.

భర్త, తన భార్యను విమర్శించినప్పుడు, ఒక వ్యక్తిగా తాను సరిపోలేనెమోనన్న భావన కలిగించి, నిరుత్సాహానికి గురి చేస్తాడు. పౌలు విశ్వాసులకు ఇలా చెప్పాడు, "మనుష్యులందరియెడల సంపూర్ణమైన సాత్వికమును కనుపరచుచు, ఎవనిని దూషింపక, జగడమాడనివారును శాంతులునై యుండవలెననియు" (తీతుకు 3:2). ఒకవేళ విమర్శించవలసి వస్తే, తాను చేసే విమర్శల కంటే తన అభినందనలే గొప్పగా ఉండేలా చూసుకోవాలి. రకరకాల గుణాల్లో, తన భార్య కంటే ఉత్తమంగా ఉన్న స్త్రీలను మాదిరిగా చూపకూడదు.

---

[32] సామెతలు 31:28-31

[33] వివాహ బంధంలో, ఇది ఎఫెసీ 4:29-32, ఎఫెసీ 5:25-29 మరియు మత్తయి 7:12 లో దేవుడు మనకు ఇచ్చిన సూచనల యొక్క అన్వయం.

**(5) భర్త, తమ బంధానికి కొంత సమయం కేటాయించడం ద్వారా ఆమెను ప్రేమిస్తాడు.**

కలిసి జీవించాలంటే, సంభాషణకు కొంత సమయం కేటాయించాలి. బంధాలు మాటల ద్వారా బలపరచబడతాయి (సామెతలు 16:24, సామెతలు 20:5). భార్యభర్తలు, రోజు జరిగే విషయాలను గురించి మాట్లాడుకోవాలి. వారి బంధాలు, భావాలు, కోరికలు, అందోళనల గురించి మాట్లాడుకోవాలి. భార్య తన భర్త కొంత సమయం కేటాయించి, తనతో మాట్లాడుతూ తన మాటలు ఆలకిస్తున్నప్పుడు, భర్త తనను ప్రేమిస్తున్నాడని భావిస్తుంది. పనిలో అలసిపోయి ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, ఇంట్లో సమస్యలు గురించి మాట్లాడడానికి, వినడానికి ఇష్టపడడు, కాని ఈ అవసరాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. భర్త, భావోద్వేగ సాన్నిహిత్యానికి అందుబాటులో లేకుండా కేవలం శారీరక సాన్నిహిత్యాన్ని మాత్రమే కోరుకుంటే, అతడు ఆమెను వాడుకుంటున్నాడు కాని ప్రేమించట్లేదనే ఆలోచన భార్యకు కలుగుతుంది.

**(6) భర్త, తన భార్య బలహీనతల్లో సహనం చూపడం ద్వారా ఆమెను ప్రేమిస్తాడు.**

1 పేతురు 3:7, "అటువలెనే పురుషులారా...యెక్కువ బలహీనమైన ఘటమని భార్యను సన్మానించి...జ్ఞానము చొప్పున వారితో కాపురము చేయుడి..." చాలామంది స్త్రీలు శారీరకంగా చాలామంది పురుషులంత బలంగా ఉండరు. అలాగే, చాలామంది స్త్రీలు భావోద్వేగపరమైన బాధకు, నిరాశకు పురుషులకన్నా ఎక్కువగా లోనవుతారు. భర్త తన భార్యను ఆదరించాలి, ప్రోత్సహించాలి. ఆమె ఒత్తిడిని తగ్గించడం ఎలా అనేది అతడు నేర్చుకోవాలి. భార్య అలసిపోయినప్పుడు, ఒత్తిడికి గురైనప్పుడు, లేక చింతిస్తున్నప్పుడు, ఆమెపై డిమాండ్లు పెట్టకుండా ఉండాలి.

**(7) భర్త, తన భార్య అవసరాలను తీర్చడం ద్వారా ఆమెను ప్రేమిస్తాడు.**

భర్త, తన పని చేసుకోవడానికి మంచి పనిముట్లు, మంచి ప్రదేశం కావాలని కోరుకున్నట్లే, తన భార్యకు కూడా ఒక మంచి వాతావరణాన్ని సృష్టించాలి. ఇంట్లో ఆమెకు అవసరమైనవన్ని ఉండేలా చూసుకోవాలి.

**భర్తలు తమ భార్యల్ని ప్రేమించినప్పుడు వచ్చే ఫలితాలు**

చాలామంది భర్తలు, తమ భార్యల్ని ప్రేమించినప్పుడు, భార్యలు ఎంతో సంతోషంగా సహకారంగా ఉండడం గమనిస్తారు. భర్తలు, తమ భార్యల పట్ల అంకితభావంతో ఉన్నప్పుడు, వారిని నిజంగా ప్రేమించినప్పుడు వారు ఆనందిస్తారు. భర్తలు, భార్యల్ని ప్రేమించినప్పుడే వివాహ బంధంలో గొప్ప మేలు అనుభవిస్తారు (ఎఫెసీయులకు 5:28). అయితే, పురుషులు ఎల్లవేళలా ఇలా ఉంటారని హామీ ఇవ్వలేం. కొన్ని మినహాయింపులు ఉంటాయి. భర్త, భార్య నుండి ఏదో పొందుకోవాలనే ఉద్దేశ్యంతో ఆమెను ప్రేమించకూడదు. అతడు, తన వ్యక్తిగత అవసరాలను గురించి చింతపడకుండ, తన భార్య అవసరాలను తీర్చడానికి, దేవుణ్ణి సంతోషపరచడానికి భార్యను ప్రేమించాలి.

భర్తల ప్రేమకు కొందరు భార్యలు వెంటనే స్పందించకపోవచ్చు, ఎందుకంటే గత అనుభవాల వల్ల వాళ్ళు మానసికంగా గాయపడివుంటారు. ప్రేమను చూపించే ఈ పద్ధతులు కొన్ని రోజులు ప్రయోగంలా చేసి చూసేవి కావు. భర్త తన హృదయంలో దేవుని పట్ల, తన భార్య పట్ల ఉన్న ప్రేమను బట్టి ఈ మార్గాల్లో స్థిరంగా ప్రేమను చూపిస్తూనే ఉండాలి. క్రీస్తు సంఘాన్ని ఇలాంటి నమ్మకత్వం, త్యాగపూరితమైన సమర్పణతో ప్రేమిస్తున్నాడు.

## భార్య, తన భర్తను ఎలా గౌరవించాలి

ఎఫెసీయులకు 5:33 ఇలా ఆదేశిస్తుంది, "మెట్టుకు మీలో ప్రతి పురుషుడును తననువలె తన భార్యను **ప్రేమింపవలెను**, భార్యయైతే తన భర్తయందు **భయము** కలిగి యుండునట్లు చూచుకొనవలెను."

భర్తకు గౌరవం అవసరం. చాలామంది పురుషులు, ఇతర ప్రజలు తమను ఇష్టపడాలకునే దానికంటే తమను గౌరవించాలనే ఎక్కువగా కోరుకుంటారు. తమ కుటుంబాల్ని రక్షించి, పోషించి, నడిపించేటట్లుగా దేవుడు పురుషుల్ని చేశాడు. తండ్రి, భర్త - ఈ రెండు స్థానాలు, ఏ పని చేయక మునుపే, స్వాభావికంగానే గౌరవం పొందడానికి యోగ్యమైనవి. భర్త చేసే పనులు తప్పైనప్పటికీ, భార్య తన భర్తను గౌరవించాలి. అతడు తన అధికారాన్ని పరిపూర్ణంగా ఉపయోగించనప్పటికీ, అతడు దేవుని స్వరూపంలో సృజించబడ్డాడనే ఆలోచనతో ఆమె అతన్ని గౌరవించాలి (ఎఫెసీయులకు 5:23). దీని అర్థం అతని చర్యలు లేదా నిర్ణయాలతో ఆమె విభేదించకూడదని కాదు, కానీ ఆమె అతన్ని అగౌరవపరచకూడదు.

భార్య, తన భర్త అధికారానికి లోబడుతూ అతన్ని గౌరవించినప్పుడు, యేసు పట్ల తనకున్న ప్రేమను ఆమె చూపిస్తుంది (ఎఫెసీయులకు 5:22, 31-33).

కొంతమంది భార్యలు తమ భర్తలను అగౌరవంగా చూస్తూ కూడా, అంటే స్నేహితుల ముందు వారిని విమర్శించడం, రహస్యంగా వ్యవహరించడం మరియు బాధపెట్టే మాటలు ఉపయోగించడం వంటివి చేస్తూ కూడా తాము వారిని ప్రేమిస్తున్నామని అనుకుంటారు. ఎంత ఆప్యాయత ఉన్నా అగౌరవాన్ని భర్తీ చేయలేదని వారు అర్థం చేసుకోవాలి.

చాలామంది మహిళలకు చిన్న పిల్లల పట్ల మాతృత్వం చూపించాలనే బలమైన కోరిక ఉంటుంది. వారికి బిడ్డ అవసరాలను తీర్చగల సహజమైన సామర్థ్యం, సహజమైన కోరిక ఉంటాయి. "నీకు పిల్లల్ని చూసుకోవడం చేతకాదు" అని ఎవరైనా ఒక మహిళతో అంటే ఆమెకు ఎలా అనిపిస్తుందో ఊహించండి. అదేవిధంగా, పురుషులకు రక్షించడం, పోషించడం, నాయకత్వం వహించడం పట్ల బలమైన కోరిక ఉంటుంది. తన భార్య "ఆ పనులు నువ్వు చేయలేవని చెప్పినప్పుడు" అతను ఒక పురుషుడిగా తాను విఫలమయ్యానని భావిస్తాడు.

భార్య తన భర్త కంటే బలమైన వ్యక్తిత్వమున్నవారు, బాగా సంపాదించేవారు లేక ఉన్నతమైన స్థానాలు అధిరోహించిన పురుషులు ఉంటారని గ్రహించాలి. భర్తను ఇతర పురుషులతో పోలుస్తూ, విఫలమయ్యాననే భావన కలిగించకూడదు. ఎఫెసీయులకు 5:21-33 లో మనం నేర్చుకున్నట్లుగా, భార్య భర్త ఏకశరీరులు. భార్య, తన భర్తను ఇతరులతో పోల్చినప్పుడు లేక విమర్శించినప్పుడు, ఆమె ఇద్దరికీ బాధ కలిగిస్తుంది, అలాగే వారి బంధాన్ని నాశనం చేస్తుంది.

► ఒక విద్యార్థి తరగతి కోసం సామెతలు 31:11-12, 26 చదవాలి. దైవికమైన భార్య తన మాటల్లో, ప్రవర్తనలో తన భర్తను ఎలా చూడాలని ఈ వచనాలు బోధిస్తాయి?

**(1) భార్య, తన నిశ్చయ మాటలతో తన భర్తను గౌరవిస్తుంది.**

భార్య, తన భర్త సామర్థ్యాన్ని ధృవీకరించాలి. భార్య తన భర్తతో మాట్లాడే ధృవీకరణ మాటల ద్వారా భర్త పట్ల ఆమెకున్న గౌరవం కనబడుతుంది. పురుషులపై మాటల ప్రభావం చాలా ఉంటుంది. అయితే అవి బలపరుస్తాయి లేక బలహీనపరుస్తాయి (సామెతలు 14:1). అవి ప్రోత్సహించగలవు లేదా నిరుత్సాహపరచగలవు. అవి అతనిని ధైర్యపరచగలవు లేక మనసును కృంగదీయగలవు (సామెతలు 18:21). భర్త, ప్రతి పయత్నంలో విజయం సాధించకపోవచ్చు, కాని కుటుంబాన్ని పోషించేందుకు, దాన్ని కాపాడేందుకు అతను చేసే కృషిని భార్య గుర్తించాలి. క్రొత్త సవాళ్లు ఎదుర్కునేప్పుడు, క్రొత్త ఆలోచనలు చేసేటప్పుడు భార్య అతన్ని నిరుత్సాహపరచకూడదు.

► విద్యార్థులు తరగతి కోసం సామెతలు 15:4 మరియు సామెతలు 16:24 చదవాలి.

**(2) భార్య, భర్తకు లోబడడం ద్వారా అతన్ని గౌరవిస్తుంది** (1 పేతురు 3:5).

భార్య భర్తకు లోబడటం అంటే ఆమె భర్త కంటే తక్కువ అని కాదు. బదులుగా, వారి పాత్రలు భిన్నంగా ఉన్నాయని దీని అర్థం. త్రిత్వంలో కూడా కుమారుడు తండ్రికి లోబడటం మనం చూస్తాం, అయినప్పటికీ కుమారుడు స్వభావంలో గానీ, శక్తిలో గానీ, ఏ విషయంలో గానీ తండ్రి కంటే తక్కువ కాదు.

కొందరు భార్యలకు ఈ సూత్రం సులభంగా అనిపించకపోవచ్చు, ప్రత్యేకించి వారి భర్త దేవుని వాక్యం ప్రకారం జీవించనప్పుడు లేదా వారి పట్ల దయ చూపనప్పుడు అసలు సులభం కాదు. కొందరు భార్యలు తమ భర్తల కంటే లేదా తమ కుటుంబం కంటే తామే మంచి నిర్ణయాలు తీసుకోగలమని భావిస్తారు. కొన్నిసార్లు భార్య చెప్పింది సరైనది కావచ్చు, భర్త సరైనది చేయకపోవచ్చు. అయితే, భార్య తన భర్తతో ఏకీభవించినప్పుడు మాత్రమే అతనికి లోబడితే, ఆమె అధికారాన్ని చెలాయిస్తున్నట్లు అవుతుంది తప్ప నిజంగా లోబడినట్లు కాదు. లోబడటం అంటే మరొకరు నిర్ణయం తీసుకోవడానికి అనుమతించడం.

పేతురు భార్యలకు ఇలా చెబుతున్నాడు,

> స్త్రీలారా, మీరు మీ స్వపురుషులకు లోబడియుండుడి; అందువలన వారిలో ఎవరైనను వాక్యమునకు అవిధేయులైతే...వాక్యములేకుండనే తమ భార్యల నడవడివలన రాబట్టబడవచ్చును.... జడలు అల్లుకొనుటయు, బంగారునగలు పెట్టుకొనుటయు, వస్త్రములు ధరించుకొనుటయునను వెలుపటి అలంకారము మీకు అలంకారముగా ఉండక, సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారముగల మీ హృదయపు అంత రంగ స్వభావము మీకు అలంకారముగా ఉండవలెను; అది దేవునిదృష్టికి మిగుల విలువగలది (1 పేతురు 3:1-2, 3-4).

అనేక క్లిష్ట పరిస్థితులు ఉన్నాయి. చాలా మంది భార్యలు "అతను నన్ను ________ చేయమని చెబితే నేను చేయాలా?" అని అడుగుతారు. ఈ పాఠం అన్ని రకాల పరిస్థితుల గురించి వివరించదు. అయితే, లోబడడానికి సంబంధించిన సమస్య, భర్త భార్య చేయకూడని పనులను చేయమని చెప్పడం వల్ల తలెత్తదు. భార్య విధేయత చూపేందుకు ఇష్టపడకపోవడానికి కారణం, ఆమె అలా చేస్తే తన భర్త సరిగా ఉండడని భావించవచ్చు. బహుశా భర్త ప్రేమగా, దయగా ఉండకపోవచ్చు. భార్య తన సొంత నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛను వదులుకోవడానికి ఇష్టపడకపోవచ్చు. భార్యకు ధిక్కార వైఖరి ఉండవచ్చు. భార్య తన భర్త యొక్క దయలేని చర్యలు లేదా తప్పులను సాకుగా చూపి, సాధారణంగా అతని అధికారాన్ని తిరస్కరిస్తుంది. ఇది దేవుని వాక్య ఆజ్ఞలకు అవిధేయత చూపడం.

దైవికమైన, విధేయత చూపించే భార్య ప్రభువునందు తన భర్తను గెలుచుకుంటుందని బైబిల్ చెబుతుంది. మంచి భార్య వలన భర్త ఒక మంచి విశ్వాసి అవుతాడనేది ఖచ్చితంగా చెప్పలేం గాని, క్రైస్తవురాలైన భార్య తిరస్కారపు స్వభావం గలదైతే, అతడు విశ్వాసిగా మారే అవకాశం ఉండదు. భార్య తన భర్తను గౌరవించడం ద్వారా అధిక దయను పొందవచ్చు కాని ఆమె గౌరవించడానికి అదే ప్రధాన కారణం కాకూడదు. భర్తను గౌరవించవలసిన బాధ్యత ఆమెపై ఉంది గనుక, దేవునిని సంతోషపెట్టవలసిన బాధ్యత ఆమెపై ఉందని భర్తను గౌరవించాలి.

సామెతలు 12:4, “యోగ్యురాలు తన పెనిమిటికి కిరీటము, సిగ్గు తెచ్చునది వాని యెముకలకు కుళ్లు” అని చెబుతుంది. భార్య, తన భర్తను తన స్నేహితుల సమక్షంలో అగౌరవపరిస్తే, అతని గౌరవాన్ని పోగొడుతుంది, దాన్ని ఎన్నటికి తిరిగి పొందుకోలేదు. భర్త పట్ల సమర్పణ కలిగిన భార్యలు ఉన్న పురుషులను ఇతర పురుషులు మెచ్చుకుంటారు. లోబడని భార్యలుగల భర్తలపై జాలిపడతారు.

**(3) భార్య, తన భర్త అవసరాల పట్ల శ్రద్ధ చూపుతూ అతన్ని గౌరవిస్తుంది** (సామెతలు 31:15, 21, 25, 27).

భార్య, తన భర్తకు ఇష్టమైన రీతిలో ఆహారం సిద్ధపరచినప్పుడు, కుటుంబాన్ని చూసుకుంటున్నప్పుడు అది అతనికి గౌరవంగా ఉంటుంది. ఒకవేళ అతని కోసం తన అలవాట్లు మార్చుకోవడానికి నిరాకరిస్తే, తాను ఆమెకు ప్రాముఖ్యం కాదని భావిస్తాడు.

ఒకవేళ భార్య పనిలో లేక మిత్రులతో లేక సంఘంతో లేక వినోదంతో నిమగ్నమై, భర్త మాటలు వినడానికి అతని అవసరాలు పట్టించుకోవడానికి సమయం కేటాయించకపోతే, తానంటే ఆమెకు అంత ముఖ్యం కాదని భావిస్తాడు.

ఆదికాండము 2:18 ఇలా బోధిస్తుంది: "మరియు దేవుడైన యెహోవా—నరుడు ఒంటరిగా నుండుట మంచిది కాదు; వానికి సాటియైన సహాయమును వానికొరకు చేయుదుననుకొనెను."

**(4) భార్య, తన భర్త పట్ల శారీరకంగా ప్రేమ చూపడం ద్వారా అతన్ని గౌరవిస్తుంది.**

కొందరు స్త్రీల కంటే కూడా, చాలామంది పురుషులకు లైంగిక సంతృప్తి అనేది చాలా ముఖ్యం. స్త్రీలు భావోద్వేగాలు, మానసిక స్థితి అనుకూలించినప్పుడు మాత్రమే లైంగిక కార్యకలాపాల పట్ల ఆసక్తి చూపుతారు, ఇది పురుషులు కోరుకునే దానికంటే చాలా తక్కువ. అంటే, భార్య తన భర్త అవసరాలను అర్థం చేసుకోనప్పుడు, అసంతృప్తిగా ఉంటాడు. బహుశా, గతంలో ఆమె అనుభవించిన లేక చూసిన బలాత్కారంవలన పురుషుల లైంగిక కోరికను ఆమె ద్వేషిస్తుంది. భర్త, తన భార్యను అర్థం చేసుకునే విషయంలో సహనంగా ఉండాలి. అయితే, భార్య తనకు అవసరం అనిపించకపోయినప్పటికీ కూడా భర్తకున్న లైంగిక అవసరాలు తీర్చడం మంచిదని గ్రహించాలి. భర్త, ఇతర స్త్రీలతో అక్రమ సంబంధం పెట్టుకోకుండా తన భార్యపట్ల నమ్మకంగా ఉంటే, తన భార్య తన లైంగిక కోరికలు పట్టించుకోనప్పుడు నిరాశ చెందుతాడు. ఒక భర్త తన వైవాహిక బంధానికి కట్టుబడి ఉండటం అనేది అతడి శారీరక సంతృప్తిపై ఎప్పుడూ ఆధారపడి ఉండకూడదు, అయితే అతడి భార్య అతని లైంగిక అవసరాలపై శ్రద్ధ చూపించడం వలన అతడు శోధనలతో చేసే పోరాటం తగ్గవచ్చు.

పరమగీతము ఇలా సూచిస్తుంది, "నా ప్రియుడు నా వాడు నేను అతనిదానను... **నా ప్రియుడా, లెమ్ము రమ్ము** మనము పల్లెలకు పోదము గ్రామసీమలో నివసింతము... అచ్చటనే **నా ప్రేమసూచనలు నీకు చూపెదను.** (పరమగీతము 2:16; పరమగీతము 7:11-12; అలాగే 1 కొరింథీయులకు 7:3-5 చూడండి).

## దేవుని ఆదేశాలకు విధేయత చూపడం వలన కలిగే ఫలితాలు

ఈ పేరాల్లో ఇవ్వబడిన వివరాలు వైవాహిక జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యకు వర్తించవు, కానీ సర్వసాధారణం. ఈ వివరాలు, భార్యాభర్తలు (1) వారి కోరికలను గుర్తించకుండా, (2) దేవుని సత్యాన్ని, వారి పట్ల దేవుని ఆశను జ్ఞాపకం చేసుకోకుండా, (3) బైబిలు మార్గాల్లో స్పందించడానికి ఆత్మపై ఆధారపడకుండా, తమ కోరికలకు ఆత్మీయంగా స్పందించనప్పుడు కలిగే కారణ-ఫలిత ప్రవర్తనను చూపిస్తాయి.

భార్య, ఆత్మానుసారంగా నడచుకోకుండా, దేవుని ప్రేమ ద్వారా నడిపించబడకుండా ఉంటే, ఆమె వైవాహిక బంధానికి హాని కలిగించే విధంగా స్పందిస్తుంది. భార్యకు ప్రేమించబడట్లేదు అనే భావన కలిగితే, భద్రతను అనుభవించలేదు. ఆమె తననుతాను ధృవీకరించుకుంటూ, భర్త అధికారాన్ని దిక్కరిస్తుంది ఎందుకంటే ఆమె అతని సంరక్షణను నమ్మదు. ఆమె ఇలా చేసినప్పుడు, అతడు అగౌరవాన్ని పొందుతాడు. ఒకవేళ అతడు తన అధికారాన్ని నొక్కి చెప్పి, గౌరవాన్ని బలవంతంగా కోరితే, అతను తనను ప్రేమించట్లేదని మరెక్కువగా భావిస్తుంది.

భర్త, ఆత్మానుసారంగా నడచుకోకుండా, దేవుని ప్రేమ ద్వారా నడిపించబడకుండా ఉంటే, వైవాహిక బంధాన్ని బలపరచే వైఖరిని కలిగియుండలేడు. భర్త, అగౌరవాన్ని ఎదుర్కొన్నప్పుడు, బాధపడతాడు, కోపపడతాడు. భార్యను బాధపెట్టే విధంగా మాట్లాడతాడు. ఒకవేళ అతడు తన భావాలను దాచుకోవడానికి ప్రయత్నిస్తే, మౌనంగా ఉంటాడు. భార్యకు దగ్గరగా ఉండలేడు లేక మనస్పూర్తిగా మాట్లాడలేడు, ఎందుకంటే ఆమె తన సంబంధి కాదనుకుంటాడు. అతడిలా చేసినప్పుడు, ఎందుకిలా చేస్తున్నాడో భార్యకు అర్థం కాదు. అతను చేసే పనులు ఆమెకు ఇష్టం లేకపోవడం వలన అతనిలో మార్పు తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో బహుశా ఆమె అతన్ని అగౌరవపరచి ఉండొచ్చు. అతడు కోపపడినా లేక వెనక్కి వెళ్లిపోయినా, తన భావాలు పట్టించుకోనట్లుగా ధృవీకరిస్తున్నాడని భావిస్తుంది. ఆమె మరింత అగౌరవం చూపించవచ్చు.

వైవాహిక బంధాలు దెబ్బతిన్నప్పుడు, భాగస్వాములు మరింత శోధనలకు గురౌతారు. భార్య, తన భర్త నాయకత్వాన్ని మరింత ధిక్కరిస్తుంది. అతని గురించి ఇతరుల దగ్గర అమర్యాదగా మాట్లాడే శోధనకు గురౌతుంది. ఆమెను అభినందించే మరో పురుషుడి వైపు ఆకర్షించబడే శోధనలో పడిపోతుంది. భార్య ప్రవర్తన తనకు అభ్యంతర కారణంగా ఉండడం వలన అతడు ఆమెకు దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తాడు. ఆమె కోసం ప్రేమగా ఏది చెయ్యడు. అతన్ని అభినందించే ఇతర స్త్రీల వైపు ఆకర్షించబడతాడు.

ప్రతి ఒక్కరు తమ నిర్ణయాల విషయంలో దేవునికి లెక్క అపజెప్పవలసినవారిగా ఉన్నారు. తన భాగస్వామి చేసిన పని కారణంగా దేవుడు ఒక వ్యక్తి పాపాన్ని క్షమించడు. మనం జీవించవలసిన రీతిలో జీవించడానికి దేవుడు మనల్ని

బలపరుస్తాడు. ఈ సమాచారం యొక్క ఉద్దేశ్యం, భాగస్వామి నుండి అవసరమైనది కోరుకోవడం లేక పాపాన్ని బట్టి భాగస్వామిని నిందించడం కాదు. దేవుణ్ణి సంతోషపెట్టే బాధ్యతను, భాగస్వామి అవసరాలు తీర్చే బాధ్యతను గ్రహించడమే దీని ఉద్దేశ్యం.

## తప్పుడు లక్ష్యాలు

కొన్నిసార్లు ఒక వ్యక్తి జీవితాన్ని సులభతరం చేసుకునే మార్గాల కోసం వెతుకుతాడు. భర్త, తన భార్యను మార్చడం వలన జీవితాన్ని సౌకర్యంగా చేసుకోవాలనుకుంటాడు. అలాగే, భర్త మారితే తన జీవితం సుఖవంతంగా ఉంటుందని భార్య అనుకుంటుంది. ఇద్దరిలో ఎవరో ఒకరు తన భాగస్వామిని ఎలా మార్చాలని సలహాదారుని లేక పాస్టర్‌ని లేక మిత్రుల్ని అడుగుతారు. తమ భాగస్వామిని మార్చుకోవడం సరైన లక్ష్యం కాదు. బంధాల మెలకువలను ఉపయోగించి తన జీవితాన్ని సులభతరం చేసుకోవడానికి ప్రయత్నించే వ్యక్తికి దేవునిపై లేదా ఇతరులపై ప్రేమ ప్రేరణ కాదు.

కొన్నిసార్లు, ఒక వ్యక్తి తన భాగస్వామిలో ఉన్నటువంటి లోపాలు సరిచేయడానికి సంవత్సరాల తరబడి ప్రయత్నిస్తుంటారు. అవే లోపాలని పదే పదే విమర్శిస్తుంటారు. ప్రతి వ్యక్తిలో నిజంగా లోపాలు ఉన్నప్పటికీ, ప్రతి భాగస్వామి లోపాలతోనే ఆ వ్యక్తిని అంగీకరించాలి. లోపాలు వ్యక్తిగత లోపాలు కావచ్చు, ప్రవర్తనలో కావచ్చు లేక ఆత్మీయ లోపాలు (పాపం కూడా) కావచ్చు. భాగస్వామి మారాలనే ఉద్దేశ్యంపై బంధాలు ఆధారపడకూడదు. వారు మారలేకపోవచ్చు. మారకపోవడానికి కారణం ఏదైనప్పటికీ, ప్రతి భాగస్వామి లోపాలున్నప్పటికీ కూడా ప్రేమను చూపిస్తూ, గౌరవిస్తూ విలువిచ్చేవారిగా ఉండాలి.

## ముగింపు

దేవుడు స్త్రీ పురుషుల స్వభావాలు రూపొందించాడు, మరియు మానవుల అవసరాలు తీర్చడానికి వైవాహిక బంధాన్ని ఏర్పాటు చేశాడు. అయితే, పాపం చేత కుటుంబాలు, వైవాహిక బంధాలు పతనమైన లోకంలో మనం జీవిస్తున్నాం. మనలో ప్రతి ఒక్కరం మన సొంత పాపాల వల్ల, ఇతరుల పాపాలు మనపై చూపిన ప్రభావం వల్ల పతనమైపోయాం. దేవుని కృప మనలను మార్చి, ఇతరులకు కృప చూపడానికి మనకు సహాయం చేయకపోతే, దేవుడు ఉద్దేశించిన వైవాహిక జీవితాన్ని మనం అనుభవించలేము. నిర్మలమైన ఉద్దేశాలు, బలమైన ప్రేమ, మరియు సేవ చేసే వినయం మనకు కలగాలంటే దేవుని ఆత్మ మనల్ని శుద్ధి చేయాలి.

## సమూహ చర్చ కోసం

► ఈ పాఠంలో మీకు క్రొత్తగా అనిపించినా విషయాలు ఏంటి? మీ వైఖరులు, ప్రవర్తనలు ఎలా మార్చుకోవాలని అనుకుంటున్నారు?

► వైవాహిక బంధాలు బలపరచడానికి సంఘం ఏమి చేయగలదు?

## ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ,

అనేక నిర్దిష్టమైన అవసరాలను తీర్చడానికి వైవాహిక బంధాన్ని ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు. వివాహానికి తగిన ఆదేశాలు ఇచ్చినందుకు వందనాలు.

ఎలా ప్రేమించాలో, ఎలా అర్థం చేసుకోవాలో మాకు నేర్పించు. లోకంలో నీ ప్రేమను ప్రతిబింబించే కుటుంబాలుగా మమ్మల్ని చేయండి.

నువ్వు ప్రేమించినట్లుగా ప్రేమించడానికి కృపను అనుగ్రహించినందుకు కృతజ్ఞతలు.

ఆమెన్

## పాఠం అభ్యాసాలు

(1) 1 కొరింథీయులకు 13:4-8 కంఠస్తం చెయ్యండి. తరువాత క్లాసును మొదలుపెట్టే ముందు, కంఠస్తం చేసిన వాక్యభాగాన్ని రాయండి లేక చెప్పండి.

(2) భార్య లేక భర్త అవసరాలను వివరిస్తూ రెండు-పేజీల వ్యాసం రాయండి. ఆ అవసరాలను తీర్చడానికి సహాయపడే భాగస్వామి ప్రవర్తన గురించి ఉదాహరణలు ఇవ్వండి. మీరు చర్చించే ప్రతి అవసరాన్ని బలపరచడానికి లేఖనాలు ఉపయోగించండి.

# పాఠం 8

# ప్రేమకు ఐదు భాషలు- భాగం 1

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) నిజమైన ప్రేమ గుణాలను, లక్షణాలను చర్చించాలి.

(2) ఒక వ్యక్తిని షరతులు లేకుండా ప్రేమించడమంటే ఏంటో వివరించాలి.

(3) ఒకరి ప్రేమభాషలో ప్రేమను వ్యక్తపరచడం ఎందుకు ముఖ్యమో చర్చించాలి.

(4) కుటుంబ సభ్యుని వ్యక్తిగత గుణాలు, స్వభావాలు, వ్యక్తిత్వాలు గురించి మెచ్చుకోవడానికి, వాటిని అభినందించడానికి ధృవీకరణ పదాలు ఉపయోగించాలి.

## రితేశ్ మరియు స్నేహ – ఎదుగుతున్న వైవాహిక బంధం

తన భార్య సంతోషంగా లేదని రితేశ్ నిరుత్సాహంతో ఉన్నాడు. ఆతని నుండి ఆమె ఏం ఆశిస్తుందో అతనికి అర్థం కాలేదు. రితేశ్ కష్టపడి పనిచేసి, ఉండడానికి ఇల్లు, తినడానికి ఆహారం, జీవితానికి కావలసిన ప్రతిదీ ఇచ్చాడు. ఆమెకు కావాల్సిన ప్రతిదీ కొనుక్కోమని చెప్పాడు. ఆమె దేని గురించి చింతపడనక్కరలేదు. భార్యకు ఇంకేం కావాలి? రితేశ్ తన భార్య తాను చేసే పనిని అస్సలు మెచ్చుకోదని భావించాడు.

స్నేహ సంతోషంగా లేదు, అందుకు కారణం రితేశ్ ఆమె కోసం కొన్ని ప్రత్యేకమైన పనులు చేయడం ద్వారా ఆమెకు ప్రేమను చూపించట్లేదు. రితేశ్ ఆమెకిచ్చిన ఇష్టమైన బహుమానం ఏమిటంటే, అతడు తన షాపులో ఒక చెక్క మీద ఆమె పేరు రాసి ఇచ్చాడు. నీకు ఏం కావాలో అది కొనుక్కో అని చెప్పడం కాకుండా కొన్నిసార్లు తన కోసం పువ్వులు కొనుక్కొస్తే బాగుండని ఆమె అనుకునేది.

రితేశ్ మరియు స్నేహ వారి భావాలను గురించి మాట్లాడుకుని, ఒకరి అవసరాలు మరొకరు అర్థం చేసుకోవడం మొదలుపెట్టారు.

## నిజమైన ప్రేమ అంటే ఏంటి?

► ఒక వ్యక్తిని నిజంగా ప్రేమించడమంటే అర్థం ఏంటి?

► ఒక విద్యార్థి తరగతి కోసం 1 కొరింథీయులకు 13:4-8 చదవాలి. ఈ వాక్యభాగం నుండి, ప్రేమ గుణాలు, కార్యాలు జాబితాను చేయండి. ప్రేమ అంటే ఏది కాదో, ప్రేమ ఏమి చెయ్యదో జాబితా చేయండి.

| **1 కొరింథీయులకు 13 ప్రేమ** | |
|---|---|
| **ప్రేమ ఎలా ఉంటుంది** | **ప్రేమ ఏం చేస్తుంది** |
| | |
| ప్రేమ ఎలా ఉండదు | ప్రేమ ఏం చెయ్యదు |
| | |

ఈ వాక్యభాగంలో ప్రేమ అంటే ఏమిటో అనేదానికన్నా ప్రేమ అంటే ఏది కాదో అనేదే ఎక్కువ కనిపిస్తుంది. ప్రేమ అంటే ఏది కాదో అనేదాని ద్వారా ప్రేమ అంటే ఏమిటో కూడా మనం తెలుసుకుంటాం. ప్రేమ ఉప్పొంగేది కాదు (గర్వపడదు) అంటే, మరి అది ఎలా ఉంటుంది? దానికి వ్యతిరేకంగా ఉంటుంది. ప్రేమ వినయంతో ఉంటుంది.

► 1 కొరింథీయులకు 13:4-8 మరియు పైన పట్టికలో రాయబడినట్లుగా, నిజమైన ప్రేమ ఏది కాదో దానికి వ్యతిరేక పదాలు జాబితా చేయండి.

| **ప్రేమ ఎలా ఉంటుంది** | **ప్రేమ ఏం చేస్తుంది** |
|---|---|
| | |

నిజమైన ప్రేమ:

- కేవలం భావన కాదు (భావనలు ప్రేమతో అనుబంధంగా ఉన్నప్పటికీ).
- అవసరాన్ని బట్టి కాదు, ఎంపికను బట్టి ఇవ్వాలి.
- ఒక నిబద్ధత.
- అది త్యాగపూరితం
- షరతులు లేనిది: ఎదుటి వ్యక్తి క్రియల మీద ఆధారపడదు.
- ఉద్దేశ్యపూరితం, యాదృచ్ఛికం కాదు.
- వెల చెల్లించాల్సింది.
- ఎదుటి వ్యక్తికి ఏది ఉత్తమమో అదే కోరుతుంది.
- ఇవ్వడం ద్వారా చూపిస్తుంది.

ప్రేమించకుండా కూడా ఇవ్వవచ్చు, కాని ఇవ్వకుండా ప్రేమించడం అనేది అసాధ్యం.
ప్రేమ మీ నుండి ఏదొకటి కోరుతుంది.
ప్రేమకు వెల చెల్లించవలసి ఉంటుంది.

“దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా ...” (యోహాను 3:16). నిజమైన ప్రేమ ఇవ్వడం ద్వారా వ్యక్తమవుతుంది. ఇది ఎప్పుడూ భౌతికమైన, స్పష్టమైన బహుమతిని ఇవ్వడం కాదు. కొన్నిసార్లు ఆ బహుమానం, ప్రేమగల మాటలు కావచ్చు. కొన్నిసార్లు ఆ బహుమానం సమయం కావచ్చు: ఒకరితో ఉండడం, వారికి అందుబాటులో ఉండడం. కొన్నిసార్లు ప్రేమ అనేది చేసే క్రియల్లో కనిపిస్తుంది, ప్రేమగా తాకడంలో కనిపిస్తుంది. తండ్రియైన దేవుడు మనల్ని ఎంతో ప్రేమించాడు గనుక మనం కూడా ఆయన పిల్లలమవ్వాలని మనకోసం తన అద్వితీయ కుమారుని అనుగ్రహించాడు. మనం ఇతరులను నిజంగా ప్రేమించినప్పుడు, మనం వారికి ఏదైనా ఇస్తాం.

నిజమైన ప్రేమ షరతులు లేనిది. ఇది ప్రేమించబడే వ్యక్తి ప్రవర్తనపై లేక విలువపై ఆధారపడదు. “నువ్విలా చేసి, నన్ను మెప్పిస్తేనే, నేను నిన్ను ప్రేమిస్తాను; ఒకవేళ అలా చేసి నన్ను బాధపెడితే, నేను నిన్ను ప్రేమించను” అని చెప్పదు.

షరతులతో కూడిన ప్రేమ ఇలా చెబుతుంది, “నీ ప్రవర్తన నాకు సంతోషం కలిగిస్తే, నీకు అర్థవంతం అనిపించే రీతిలో ప్రేమను చూపిస్తాను. ఒకవేళ నువ్వు నాకు నచ్చనిపని చేస్తే, అర్థవంతమైన ప్రేమ కార్యాలు చేయను.”

నిజమైన ప్రేమ షరతులు లేనిది. ప్రేమను పొందుకునే వ్యక్తి ఏం చేసినా, ఏం చెయ్యకపోయినా, నిజమైన ప్రేమ తననుతాను వ్యక్తపరచుకుంటుంది. ప్రేమను పొందే వ్యక్తి సరిగా స్పందించకపోయినా, ప్రేమను పొందే వ్యక్తి తిరిగి ఏమి ఇవ్వలేకపోయినా, అది వ్యక్తపరచుకుంటూనే ఉంటుంది.

ఒకరిని షరతులు లేకుండా ప్రేమించడం అంటే వారు కోరుకున్నది వారికి ఇవ్వడం కాదని మనం అర్థం చేసుకోవడం ముఖ్యం. దాని అర్థం, వారి చెడు ప్రవర్తన వలన వచ్చే పర్యవసానాలను మనం తొలగించమని కాదు. కానీ, మనం ఎల్లప్పుడూ వారికి ఏది మంచిదో అదే చేయడానికి ప్రయత్నిస్తామని అర్థం. మనం ఇష్టపడేవాళ్ళు బాధపడటం చూడటం కష్టమే, కానీ వారు తప్పు చేస్తున్నప్పుడు, ఆ శ్రమ అనుభవం తరచుగా వారిని నాశనకరమైన ఆ ప్రవర్తన నుండి దూరం చేయగల ఏకైక మార్గం. కొన్నిసార్లు మనం ఇష్టపడే వారిని వారి కష్టాలలో ఉండనివ్వడమే వారికి మంచిది. మరికొన్నిసార్లు, వారి కష్టం నుండి బయటపడటానికి మనం వారికి సహాయం చేయడం మంచిది. ఇటువంటి పరిస్థితులలో మనం ఏమి చేయాలో తెలుసుకోవడానికి మనకు తరచుగా దైవిక సలహా, పరిశుద్ధాత్మ సహాయం అవసరం.

► ఇతరులను షరతులు లేకుండా ప్రేమించడానికి ఏది మనల్ని ప్రేరేపిస్తుంది?

► ఒక విద్యార్థి తరగతి కోసం రోమా 5:8 చదవాలి.

దేవుని ప్రేమ, తాము చేసే పనులపై ఆధారపడి ఉంటుందని చాలామంది భావిస్తారు. దీని కారణంగా, వారు ఇతరులను ఎందుకు షరతులు లేకుండా ప్రేమించాలో అర్థం చేసుకోలేరు. అయితే, మనం శత్రువులుగా ఉన్నప్పుడే దేవుడు మనల్ని ప్రేమించాడని రోమా 5:8 చెబుతుంది. మనం పాపులమై ఉన్నప్పుడే ఆయన రక్షకుని అనుగ్రహించాడు. ఆయన షరతులు లేకుండా మానవాళి అంతటిని ప్రేమించాడు. నీవు దేవుని స్వరూపంలో సృజించబడిన వ్యక్తిగా ఉన్నావు గనుక దేవుడు నిన్ను ప్రేమించాడు.

ఆయన మనల్ని ప్రేమించిన రీతిగానే మనం ఇతరుల్ని ప్రేమించాలని ఆశపడుతున్నాడు (యోహాను 15:12, ఎఫెసీయులకు 5:2, 1 యోహాను 4:11). మనం ఇతరుల్ని షరతులు లేకుండా ప్రేమించడానికి ప్రధాన కారణం, అలా చేయమని దేవుడు మనల్ని పిలిచాడు (మత్తయి 5:43-48, 1 పేతురు 4:8).

## ప్రజలు, వివిధ రకాలుగా ప్రేమను అనుభవిస్తారు

దేవుడు వైవిధ్యాన్ని ఇష్టపడతాడు. ఆయన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైన వ్యక్తిత్వాలను ఇచ్చాడు. ఏ ఇద్దరు ఒకే రకంగా ఆలోచించరు, ఒకే రకంగా వారి భావనలు తెలియజేయరు. వ్యక్తిత్వాల్లో వైవిద్యం వల్ల, మన కుటుంబీకులకు మనకంటే భిన్నమైన అవసరాలు ఉంటాయి. మన వైవిధ్యాలు అనుదినం మన కుటుంబ బంధాలపై ప్రభావం చూపిస్తాయి.

ప్రేమను వ్యక్తపరిచే విధానంలోనూ, ఇతరులతో తమ సంబంధాలలో ప్రేమించబడినట్లు, అభినందించబడినట్లు, మరియు సురక్షితంగా ఉన్నట్లు భావించే విషయంలోనూ వ్యక్తులు.

ప్రేమ చూపించడానికి అనేక మార్గాలుంటాయి, ప్రేమను పొందుకోవడానికి అనేక మార్గాలుంటాయి. గ్యారీ చాప్మాన్ ప్రేమను వ్యక్తీకరించే ఐదు ప్రధాన విధానాలు గురించి చెప్పారు.[34] వాటిని, ప్రేమకు ఐదు భాషలుగా పిలిచాడు. ఈ ప్రతి ప్రేమ భాష కేవలం ఒక చర్యను మాత్రమే కాదుగాని, ప్రవర్తనా విధానమంతటిని చూపిస్తుంది.

ప్రతి ఒక్కరూ ఐదు రకాల ప్రేమను పొందాలని కోరుకున్నప్పటికీ, చాలా మంది వ్యక్తులు ఒక రకమైన ప్రేమను వ్యక్తం చేసినప్పుడు ఎక్కువ ప్రేమను పొందినట్లు భావిస్తారు. ఇతర రకాల ప్రేమ వ్యక్తీకరణలు వారికి అంతగా అర్థం కావు.

**ప్రేమకు ఐదు భాషలు**

ప్రజలు ఈ క్రింది మార్గాల ద్వారా ప్రేమను వ్యక్తపరుస్తారు:

---

[34] ఈ భాగంలోని అనేక ఆలోచనలు Gary Chapman, *ప్రేమకు ఐదు భాషలు (Telugu Edition),* (Manjul Publishing House Pvt. Ltd., 2014, ISBN: 9788183223911) ఆధారితమైనవి.

1. ధృవీకరణ మాటలు
2. నాణ్యమైన సమయం
3. బహుమతులు
4. సేవా కార్యాలు
5. శారీరక స్పర్శ

అలాగే, ప్రజలు ఈ ఐదు మార్గాల్లోనే ప్రేమను గుర్తిస్తారు, ప్రేమను పొందుకుంటారు.

**ప్రాథమిక ప్రేమ భాష**

సాధారణంగా చాలామంది పైన ఇవ్వబడిన ఐదింటిలో కనీసం ఒకటి లేక రెండు విధానాల్లో ప్రేమను గుర్తిస్తారు, ప్రేమను చూపిస్తారు. కుటుంబ సభ్యులు భాగస్వామికిగాని లేక పిల్లలకుగాని వారి ప్రాథమిక ప్రేమ భాషలో ప్రేమను చూపకపోతే, ఇతర మార్గాల్లో ప్రేమ చూపించినప్పటికీ, ఆ భాగస్వామి లేక ఆ పిల్లవాడు ప్రేమను అనుభవించలేడు.

ఉదాహరణకు, ఒక స్త్రీ తాను ప్రేమించే వారికి తన సమయాన్ని కేటాయించడం ద్వారా ప్రాథమికంగా తన ప్రేమను వ్యక్తపరుస్తుంది. ఆమె తాను ప్రేమించే వారితో మాట్లాడటానికి, వారితో కలిసి సమయం గడపడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటానికి ప్రయత్నిస్తుంది. ఆమె వారితో కలిసి పని చేయడానికి సమయాన్ని వెచ్చిస్తుంది. అదేవిధంగా, ఆమె ప్రేమను చూపించే ప్రధాన మార్గం ఇదే కాబట్టి, ఇతరులు తనపై చూపించే ప్రేమను కూడా ఆమె ఈ పద్ధతిలోనే సులభంగా గుర్తిస్తుంది. ఎవరైనా ఆమెకు తమ సమయాన్ని కేటాయించినప్పుడు ఆమె ఎక్కువగా ప్రేమించబడినట్లు భావిస్తుంది. ఆమె భర్త బహుమతులు కొనిచ్చినా లేదా ఆమె కోసం ఏదైనా చేసినా, అతను ఆమెతో కలిసి సమయాన్ని గడిపిన దానికంటే అవేవీ ఆమెకు ముఖ్యం కాదు.

ఒక పురుషుడు తన ప్రేమను ప్రధానంగా శారీరక స్పర్శ ద్వారా చూపిస్తాడు. అతను తన భార్యను, పిల్లలను కౌగిలించుకుంటాడు. వారు తనను కౌగిలించుకున్నప్పుడు, తన దగ్గర ఉండాలని కోరుకున్నప్పుడు అతను సంతోషిస్తాడు. అతను తన స్నేహితులను కూడా కౌగిలించుకోవచ్చు లేదా కనీసం వారి భుజాలను తట్టడం, వారితో ప్రేమగా సరదాగా గొడవపడటం చేస్తుంటాడు. తన కుటుంబం కోసం తన భార్య పడే కష్టాన్ని అతను అభినందించవచ్చు, కానీ ఆమె పని చేయడం వల్ల తనను ప్రేమిస్తుందని అతను భావించడు. ఆమె తన పక్కన కూర్చుని, తన చేయి తన చుట్టూ వేసుకోనిచ్చినప్పుడు లేదా ఆమె రకరకాల ఆప్యాయమైన పద్ధతుల్లో తనను తాకినప్పుడు అతను ప్రేమించబడినట్లు భావిస్తాడు.

ఒక వాహనంలో పెట్రోల్ ట్యాంక్ ఉంది. ఆ ట్యాంక్ ఖాళీ అయినప్పుడు, వాహనం నడవదు. అలాగే, ఒక వ్యక్తి తాను గుర్తించిన రీతిలో, తనకు అవసరమైన రీతిలో ప్రేమను పొందుకున్నప్పుడు, అది ఆ వ్యక్తి యొక్క భావోద్వేగ ట్యాంక్ కి, భావోద్వేగ ఇంధనాన్ని అందిస్తుంది. ఒక వ్యక్తి మానసికంగా నిండుగా ఉన్నప్పుడు, సవాళ్ళను ఎదుర్కొనే ధైర్యం, శక్తి అతనిలో ఉంటాయి. ఇతరులతో మరెక్కువగా సహకరించగలుగుతాడు. సంఘర్షణలను సులువుగా పరిష్కరించగలుగుతాడు. ఎదగాలని, ఏదైనా పొందుకోవాలనే కసితో ఉంటాడు.

అదే, తనకు అవసరమైన రీతిలో ప్రేమను పొందుకోలేనప్పుడు, అతనికి భావోద్వేగ ఇంధనం అందదు. ప్రేమను పొందుకోనప్పుడు, ఏదైనా సాధించాలన్న లేక ఏదైనా అభివృద్ధి చేసుకోవాలన్న కసి అతనిలో ఉండదు.

మనం మన కుటుంబ సభ్యులకు ప్రాథమిక ప్రేమ భాషలో తరచుగా ప్రేమను చూపించనప్పుడు, మనం ఎంత ప్రేమిస్తున్నామో వారికి అర్థం కాదు. ఎంత ప్రేమించినా, అది వారికి అర్థం కాదు, ఇది నిజం. వారికి అర్థమయ్యే రీతిలో ప్రేమను చూపించాలి.

మనం ఒకరి ప్రాథమిక ప్రేమ భాష విషయంలో వారిని బాధించినట్లయితే, అది మరింత ఘోరంగా మారుతుంది. ఉదాహరణకు, మనం మన పిలల్ని ప్రేమించే విధానం ధృవీకరణ మాటలైతే మనం విమర్శించినప్పుడు, పిల్లవాడికి ప్రేమ భాష కలిగించే మరో విధానంకంటే మరింత బాధ కలిగిస్తాయి.

## ఒకరినొకరు ప్రేమించుకోవడం ద్వారా అభివృద్ధి చెందడం

1వ పాఠంలో, దేవుడు తనతో మరియు ఇతర ప్రజలతో సంబంధం కలిగియుండాలనే ఉద్దేశ్యంతో ప్రజల్ని ఎలా సృజించాడో మనం నేర్చుకున్నాం. ప్రతి బంధంలో ప్రేమ చూపించే విధానాలు ముఖ్య భాగం. మన జీవిత భాగస్వాములు, పిల్లలు మరియు ఇతర కుటుంబీకులు ఎలా ప్రేమను అనుభవిస్తారో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. అప్పుడే, మనం వారికి అర్థమయ్యే భాషలో ప్రేమను చూపించగలుగుతాం.

వివాహం, చాలాసార్లు ప్రజల ఊహలకు భిన్నంగా ఉంటుంది. ప్రజలు తరచుగా వారి మధ్య మరియు వారి జీవిత భాగస్వాముల మధ్య ఉన్నటువంటి భిన్నమైన స్వభావాలను బట్టి నిరాశపడుతుంటారు. ప్రేమను వ్యక్తపరచే విధానానికి వస్తే, ఇరువురికి ప్రధాన ప్రేమ భాష ఒకటే అయితేనే ఉత్తమమని అనిపించవచ్చు. ఈ విషయంలో వారు ఒకటిగా ఉంటే అనేకమైన అపార్థాలకు, కోపాలకు తావు ఉండదు. అయితే, జీవిత భాగస్వాములు ఒకరికొకరు కట్టుబడి, ప్రేమలో ఎదుగుతూ ఉంటే, ఇలాంటి భిన్నతలు వివాహాన్ని బలపరుస్తాయి.

ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి, ఒకరికొకరు సర్దుకుపోవడానికి, అర్థవంతమైన రీతిలో శ్రద్ధ చూపించడానికి ప్రయత్నించే ప్రక్రియ ప్రతి వ్యక్తిని అభివృద్ధి చేస్తుంది. అంతేకాక, ఇది నిజమైన ప్రేమకు అద్భుతమైన వ్యక్తీకరణగా మారుతుంది. కుటుంబ సభ్యులకు ప్రేమను వ్యక్తపరిచే మార్గాల ద్వారా మనం వారికి సేవ చేస్తున్నప్పుడు, మన అవగాహన మరియు వ్యక్తిత్వం మరింతగా వృద్ధి చెందుతాయి.

> "మేము మీయెడల ఏలాగు ప్రేమలో
> అభివృద్ధిపొంది వర్ధిల్లుచున్నామో,
> ఆలాగే మీరును ఒకని యెడల
> ఒకడును మనుష్యులందరి యెడలను,
> ప్రేమలో అభివృద్ధిపొంది వర్ధిల్లునట్లు
> ప్రభువు దయచేయును గాక."
> - 1 థెస్సలొనీకయులకు 3:12

మన జీవిత భాగస్వామికి, కుటుంబ సభ్యులకు ప్రేమను వ్యక్తపరిచే విషయంలో, మనం మనదైన పద్ధతిలో మాత్రమే ప్రేమను చూపలేమని, లేదా మనకు అనిపించినప్పుడు మాత్రమే ప్రేమను వ్యక్తపరచలేమని అర్థం చేసుకోవడం ముఖ్యం. ప్రేమ అనేది ఒక ఎంపిక, సమర్పణ, సంబంధం యొక్క విలువ ద్వారా ప్రేరేపించబడుతుంది. కొన్ని సందర్భాల్లో, ప్రేమను వ్యక్తపరిచే కొత్త మార్గాలను మనం నేర్చుకోవలసి ఉంటుంది. బహుశా మనం పెరిగిన కుటుంబం ప్రేమను ఒక నిర్దిష్ట పద్ధతిలో వ్యక్తపరచకపోయి ఉండవచ్చు, కానీ ఈ రోజు ఒక కుటుంబ సభ్యునికి ఆ పద్ధతిలో ప్రేమ అవసరం కావచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో, మనకు పరిచయం లేని పద్ధతిలో ప్రేమను వ్యక్తపరచడం మొదట్లో వింతగా లేదా అసౌకర్యంగా అనిపించవచ్చు, కానీ మనం నేర్చుకోగలం! మన ప్రేమను వ్యక్తపరచడం అనేది ఇష్టంలేని బాధ్యత లేదా ఇబ్బంది అన్నట్లుగా కనబరచపోవడం ప్రాముఖ్యం. మనం ఏదో బాధ్యతగా, భారంగా చేస్తున్నట్లు అనిపిస్తే, మన ప్రేమ నిజమైన ప్రేమగా వ్యక్తపరచబడదు.

► విద్యార్థులు తరగతి కోసం రోమా 12:9-10, 16 మరియు 1 పేతురు 3:7-8 చదవాలి. ఈ లేఖనాల ఆధారంగా, మన కుటుంబ సభ్యులు ఎలా ప్రేమించబడాలని కోరుకుంటున్నారో మనం ఎందుకు శ్రద్ధ వహించాలో కొన్ని కారణాలను పేర్కొనండి.

**ప్రేమ అంటే మరొక వ్యక్తికి మేలు కలగడానికి, స్వయాన్ని త్యాగపూరితంగా సమర్పించుకోవడం అని జ్ఞాపకముంచుకోవడం ముఖ్యం.**

మనం పుట్టుకతోనే స్వార్థపూరిత స్వభావాన్ని కలిగి ఉన్నాం. ఇతరుల పట్ల నిజమైన ప్రేమ మనకు సహజంగా రాదు. పరిశుద్ధాత్మ మన హృదయాలలో పనిచేయడం ద్వారానే నిజమైన ప్రేమ సాధ్యమవుతుంది (రోమా 5:5). విశ్వాసులుగా, పౌలు ఫిలిప్పీయులకు 2లో వివరించినట్లుగా, మనం క్రీస్తు ఆలోచనా విధానాన్ని నేర్చుకోవాలి. అలా చేసినప్పుడు మనం:

- కక్షచేతనైనను వృథాతిశయము చేతనైనను ఏమియు చేయక (వచనం 3)

- వినయమైన మనస్సుగలవారై యొకనినొకడు తన కంటే యోగ్యుడని యెంచుచు (వచనం 3)
- ప్రతివాడు తన సొంత కార్యములను మాత్రమే గాక (వచనం 3)
- ఇతరుల కార్యములను కూడా చూస్తాము (వచనం 4)

కుటుంబ సభ్యుల పట్ల మన ప్రేమను అభివృద్ధి పరచుకోవడానికి మనం కట్టుబడి ఉండాలి. వారి అవసరాలను గమనించడం, వాటిని తీర్చడానికి మార్గాలను వెతకడం మనం నేర్చుకోవాలి. వారు ఎక్కువగా ప్రేమించబడ్డారని భావించే విధంగా వారికి మన ప్రేమను చూపడమే మన లక్ష్యం కావాలి.

తల్లిదండ్రులమైన మనం, మన పిల్లలకు ఈ విధంగా వారి తోబుట్టువులకు, తల్లిదండ్రులకు, తాత అమ్మమకు శ్రద్ధ చూపడం నేర్పించాలి. మన పిల్లలు వాళ్ల కుటుంబాలను ప్రేమించడం, సేవించడం నేర్చుకోవాలి. అర్థవంతమైన రీతిలో వాళ్ల కుటుంబాలను ఏ విధంగా ప్రేమించాలో వారు నేర్చుకోవాలి. మనం మాదిరి ద్వారా వారికి బోధించాలి. కొంత సమయం కేటాయించి మరీ ఈ విషయాలు వారికి బోధించాలి, వారి సంబంధాల్లో వాటిని ఎలా అన్వయించుకోవాలి కూడా చెప్పాలి.

► సొంత కుటుంబంతో మొదలుపెట్టి, తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ త్యాగపూరితమైన ప్రేమను ఏ విధంగా చూపించాలో నేర్పే కొన్ని ఇతర మార్గాలు ఏమిటి?

### ప్రేమ భాష 1: ధృవీకరణ మాటలు

అభినందించడమే ఒకరి ప్రధాన ప్రేమ భాష అయితే, ధృవీకరణ మాటలతో వారిని అభినందించినప్పుడు వారు ప్రేమను అనుభవిస్తారు. ఒక స్త్రీ ప్రధాన ప్రేమ భాష అభినందించడం అయినప్పుడు, భర్త ఆమెతో మాట్లాడుతున్నప్పుడు లేక ఆమె గురించి మాట్లాడుతున్నప్పుడు తన ప్రేమను వ్యక్తపరుస్తాడు. ఆమెను కొన్ని విషయాల్లో అభినందిస్తున్నానని చెప్పి ఒక కాగితంపై రాసి కూడా ఇవ్వవచ్చు. భార్యకున్న మంచి గుణం, మంచి పనులను గురించి ఇతరులకు చెప్పొచ్చు. భార్య అతని మాటలు విన్నప్పుడు, ఆమె ప్రేమను, విలువను అనుభవిస్తుంది.

మన స్నేహితుల విలువను గుర్తించే విధంగా వారిని సలహాలు అడగవచ్చు. ఉదాహరణకు:

- “మీరు ఎప్పుడు సహాయకరమైన అభిప్రాయలు చెబుతారు, కాబట్టి ఈ విషయంలో మీ ఆలోచన తీసుకోవాలని ఆశపడుతున్నాను...”
- “ఈ విషయంలో మీకు ఎక్కువ అనుభవం ఉంది, కాబట్టి మీ అభిప్రాయం కోసం చూస్తున్నాం.”

- “________గురించి నాకంటే మీకు బాగా తెలుసు, కాబట్టి ఏదైనా సలహాలు లేక అభిప్రాయాలు ఉంటే చెప్పండి, వింటాను.”

ధృవీకరణ మాటలను యదార్ధంగా చెప్పాలి. అలా కాకుంటే, అవి నిరుపయోగంగా లేక బాధాకరంగా ఉంటాయి. యదార్ధతలేని అభినందన మాటలు బంధాల్ని బలహీనపరుస్తాయి. అవి సత్యం మీద ఆధారపడవు గనుక వినేవారు చెప్పేవారి ప్రేరణ మాటలు నమ్మరు.

ధృవీకరణ మాటలు, సత్యానికి అనుగుణంగా ఉంటాయి. అవి అబద్ధపు మాటలు కాదు లేక అతిశయోక్తి మాటలు కావు. యధార్ధమైన ధృవీకరణ మాటలు హృదయంలో నుండి పుట్టుకొస్తాయి. అభినందించే వ్యక్తి తాను భావించింది, నమ్మిందే మాట్లాడతాడు.

ధృవీకరణ మాటలు వినేవారికి భవిష్యత్తులో వృద్ధి కలుగజేస్తాయి, వారి విజయానికి తోడ్పడతాయి కాని మోసపూరితంగా ఉండవు. మనం ధృవీకరణ మాటల ద్వారా ఇతరులను అదుపుచేయలేము.

► ఒక విద్యార్ధి తరగతి కోసం ఎఫెసీయులకు 4:29 చదవాలి. చెప్పకూడని విషయాలు గురించి ఇక్కడ ఇవ్వబడిన వివరణ ఏంటి? మన మాటలు ఏమి సాధించాలి? కొన్ని మాటలు ఒక పరిస్థితికే వర్తిస్తాయా మిగిలిన పరిస్థితులకు వర్తించవా?

మనం ఇతరులతో చెప్పే మాటలు సరైనవిగా, దయగలవిగా ఉండాలి. మనం మాట్లాడే మాటలు, ఎవరితో మాట్లాడుతున్నామో వాళ్ల హృదయాల్లో కార్యాలు జరిగించే దైవావకాశాలు అనుగ్రహించేవిగా ఉండాలి. మనం మాట్లాడే మాటలు నిర్మాణాత్మకంగా ఉండాలే గాని నాశనకరంగా ఉండకూడదు. అవి ఆరోగ్యం, స్వస్థత కలిగించేవిగా ఉండాలి కాని నాశనం కలిగించేవిగా ఉండకూడదు.

**అభినందనకు సంబంధించిన విషయాలు**

ధృవీకరించడానికి వివిధ రకాల పదాలు ఉంటాయి. ధృవీకరణ మాటలన్నిటికి ఒకే విలువ లేక ఒకే ప్రాముఖ్యత ఉండదు. గొప్ప ధృవీకరణ మాటలు చెప్పాలంటే, ఆ మాటలు పలికే వ్యక్తి ఎక్కువగా ఆలోచించాలి, ఎక్కువగా ప్రయత్నం చెయ్యాలి; కొన్నిసార్లు ఆ మాటలు చెప్పడం ఇబ్బందిగా ఉంటుంది; కాని ఆ మాటలు అర్ధవంతమైన రీతిలో ప్రేమను వెల్లడిపరుస్తాయి.

### *రూపాన్ని ప్రశంసించడం*

ఒకరి రూపాన్ని మెచ్చుకోవడం, వారిని ఒక రకంగా అభినందించడం అవుతుంది, అది వారు చేసిన కృషిని లేక వారి వ్యక్తిత్వాన్ని చూపించిన విధానాన్ని ప్రశంసించడమవుతుంది. అయితే, ఒకరు రూపాన్ని మెచ్చుకోవడం పైపైన అభినందించినట్లే ఉంటుంది కాని వారి అసలు వ్యక్తిత్వాన్ని అభినందించినట్లుగా ఉండదు.

ముఖ్యంగా ఆకర్షణీయంగా కనిపించేవారు, తమ రూపాన్ని బట్టి ప్రశంసలు విన్నప్పుడు, వారి విలువ ఆ రూపం మీదే ఆధారపడి ఉందనుకొని, అది మరింత పరిపూర్ణంగా కనబడాలేమో అనుకుని అభద్రతా భావంతో ఉంటారు.

వ్యక్తిగత విలువ అనేది ఆకర్షణ మీద ఆధారపడదు. అలాగే, ఒక వ్యక్తి తన శారీరక అందాన్ని పెంచుకోవడానికి చేసే పనులకు కూడా పరిమితి ఉంది. ఈ విషయాల కారణంగా, ఈ రకమైన అభినందనను అతిగా ఉపయోగించకూడదు.

### *విజయాల్ని, సేవలను అభినందించడం*

ఎదుటివారిని మాటలతో అభినందించే మరో మార్గం, వారు సాధించిన విజయాలను లేదా చేసిన పనిని మెచ్చుకోవడం. ఇలా అభినందించేటప్పుడు, ఆ వ్యక్తి చేసిన పనిని మామూలుగా తీసుకోకుండా, దాన్ని ప్రత్యేకంగా గుర్తించి అభినందిస్తారు.

ఉదాహరణకు:

- తన భర్త ఏ పని కోసం కష్టపడి పని చేస్తున్నాడో ఆ పనిలో విజయం సాధించినప్పుడు భార్య అతన్ని మెచ్చుకుంటుంది.
- భర్త ఏ పని కోసం కష్టపడి పని చేస్తున్నాడో ఆ పనిలో భార్య సహాయం చేసినందుకు అతడు అది గమనించి, ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతాడు.
- కుటుంబం కోసం రుచికరమైన భోజనం తయారు చేసినవారిని కుటుంబ సభ్యులు అభినందించాలి.

ఒకరి పని గురించి లేక విజయం గురించి మెచ్చుకుంటున్నప్పుడు, మీ ప్రేమ వారి పని మీద ఆధారపడి ఉందనే భావనను వారిలో కలిగించొద్దు. ఉదాహరణకు, మీ కుమారుడు పరీక్షలో ఎక్కువ మార్కులు సంపాదించడం వలన మీరు అతన్ని ప్రేమిస్తే, తక్కువ మార్కులు సంపాదించినప్పుడు తక్కువ ప్రేమిస్తారని భావిస్తాడు. ఒక వ్యక్తి విలువను గుర్తించే ఒక విధానం ఏంటంటే, “పరీక్ష మంచిగా రాసినందుకు చాలా సంతోషంగా ఉంది. నీ వంతు నువ్వు కష్టపడి బాధ్యతగా

చదివినందుకు అతిశయిస్తున్నాను" అని చెప్పడం. మీరు ఎలా చేసినా సరే, వారు చేసిన మంచి పనులను బట్టి వారిని మెచ్చుకోవడం విస్మరించవద్దు.

### *ప్రవర్తనను, ప్రయత్నాన్ని గుర్తించడం*

ఒక వ్యక్తి తాను చేసిన మంచి ప్రదర్శనను బట్టి అభినందించడం కంటే అతన్ని విజయానికి నడిపించిన తన వ్యక్తిత్వాన్ని, గుణాన్ని అభినందించడం మంచిది. ఉదాహరణకు, ఒక పిల్లవాడైన క్రీడాకారుడిని ఆటలో పొందిన విజయం కంటే కూడా అతడు చేసిన ప్రయత్నాన్ని బట్టి అతని మంచి పైఖరిని బట్టి అతన్ని మెచ్చుకోవాలి. కొందరు ఎల్లప్పుడు తమ ప్రదర్శనలో రాణించగలుగుతారు కాని ఒక వ్యక్తి తన మంచి గుణాన్ని, ప్రవర్తనను కలిగియుండడం ఎంతో ముఖ్యం.

### *ఒకరి వ్యక్తిత్వాన్ని బట్టి సంతోషించడం*

ఒక ఉత్తమమైన అభినందన, ఒకరి మంచి లక్షణాలను గుర్తిస్తుంది: వ్యక్తిగత గుణాలు, ప్రవర్తన, వ్యక్తిత్వం. ఈ విధమైన అభినందన, విజయం పొందినప్పుడు పొందే అభినందన కంటే గొప్పది ఎందుకంటే అది మారే పరిస్థితుల మీద ఆధారపడదు గాని వ్యక్తి విలువ మీద ఆధారపడుతుంది.

ఉదాహరణలు:

- "పిల్లలు మీ వైపు మొగ్గు చూపుతారు! మీరు విషయాల్ని వారికి బాగా వివరించగలరు, వాళ్ళు అడిగే ప్రశ్నలను ఓపికగా వింటారు."
- "మీరు నమ్మకస్తులని నాకు తెలుసు గనుక నేను మిమ్మల్ని నమ్ముతాను."

ఈ విధమైన అభినందనకు దగ్గరగా ఉన్నటువంటి విషయం ఏంటంటే, ఒక వ్యక్తి జీవితంలో దేవుని కార్యం చేస్తున్నాడని గుర్తించి, ఒక ప్రత్యేకమైన విధంగా జీవించడానికి లేక ఒక ప్రత్యేకమైన పని చేయడానికి వీలు కల్పించడం.

ఉదాహరణలు:

- "మీరు నడిపిస్తున్న యౌవనస్తుల జీవితంలో దేవుడు మిమ్మల్ని ఎలా వాడుకుంటున్నాడో చూడడమంటే నాకు ఇష్టం. మీ జీవితాన్ని పరిశీలించడం ద్వారా వారిలో ఒకామె యేసు కోసం జీవించాలనే నిర్ణయం తీసుకున్నానని నాతో చెప్పింది!"
- "మీకు అప్పగించబడిన ఈ పనిలో దేవుడు మీకు సహాయం చేస్తాడని నమ్ముతున్నాను. నేను మీ కోసం ప్రార్థిస్తాను!"

ఒక వ్యక్తి మన జీవితంలో ఉన్నందుకు సంతోషాన్ని, కృతజ్ఞతను వ్యక్తపరచడం అనేవి బలమైన ధృవీకరణ మాటల్లో కొన్ని. ఇవి ఆ వ్యక్తి విలువను తెలియజేస్తాయి.

ఉదాహరణలు:

- "మీతో ఉన్నప్పుడు కుటుంబ సమావేశాలు ఎల్లప్పుడు ప్రత్యేకంగా ఉంటాయి."
- "మీతో ఉండడం నాకు ఇష్టం."
- "మీరు నాకు విలువైనవారు, మీరంటే నాకిష్టం!"

**మాటలకు, అభినందనకు సంబంధించి ముఖ్య గమనికలు**

1. ఒక వ్యక్తి శారీరక లక్షణాల్ని విమర్శించకూడదు లేక అవమానించకూడదు. వారు వాటిని తమ జీవితకాలం కలిగియుంటారు. ఒకరి బాహ్య ఆకారాన్ని బట్టి, వారి లక్షణాల్ని బట్టి మరిముఖ్యంగా లోపాల్ని బట్టి పేర్లు పెట్టకూడదు.

2. ఒకరి సామర్థ్యాలు, గుణాలు, మంచి ప్రవర్తనను మెచ్చుకోవడం వలన వారు వాటిలో ఇంకా ఎదుగుతారు. లోపాలు ఎత్తి చూపడం సహాయకరం కాదు.

3. చిన్నపాటి సలహాలు కూడా తప్పుదిద్దుతున్నట్లుగా అనిపించవచ్చు. కాని మెచ్చుకోవడం వలన వారు సలహాలను సంతోషంగా అంగీకరిస్తారు. ఒకవేళ మీరు సలహా ఇవ్వాలనుకుంటే, సలహాతో పాటుగా వారికి బలమైన ధృవీకరణ మాటలు చెప్పండి.

4. ఫిర్యాదుల రూపంలో సలహాలు ఇచ్చినప్పుడు వారు వాటిని అంగీకరించలేరు. ఉదాహరణకు, ఒక పనిని ఇప్పటికే పూర్తి చేసి ఉండాలి అని చెప్పడం లేక ఆ పని చెయ్యడంలో వారు విఫలమయ్యారని చూపించడం సహాయకరం కాదు. ఇలా చెప్పడం వలన విఫలమయ్యామనే భావన ఆ వ్యక్తిలో కలుగుతుంది; ఒకవేళ ఆ పని ఆలస్యంగా చేసినప్పటికీ విఫలమయ్యాననే భావనలోనే ఉంటాడు.

**బాధకలిగించే మాటలు**

ధృవీకరణ మాటలు ఎక్కువగా ఇష్టపడేవారికి, కఠినమైన మాటలు బాధను కలిగిస్తాయి. ముఖ్యంగా విమర్శలు వారిని బాగా బాధపెడతాయి, ఎందుకు పనికిరానివారమనే భావన వారిలో కలిగిస్తాయి. కఠినంగా కోపంగా మాట్లాడే మాటలు మానసికంగా కృంగదీస్తాయి, వాటి నుండి ఆ వ్యక్తి ఎప్పటికీ బయటపడలేడు. మాట్లాడే వ్యక్తి, బాధను అర్థం చేసుకోకుండా వాటికి, క్షమాపణ చెప్పనప్పుడు ముఖ్యంగా ఇలాంటివి జరుగుతాయి.

ధృవీకరణ మాటలు ఒక వ్యక్తి విలువకు సంబంధించినట్లే, అత్యంత బాధాకరమైన మాటలు కూడా ఆ వ్యక్తి పై దాడి చేసినట్లుగా ఉంటాయి. ఉదాహరణకు, "నేను నిన్ను కలవకుండా ఉంటే బాగుండేది."

తరువాత బాధ కలిగించే మాటలు అంటే, ప్రవర్తన గురించి ప్రతికూలంగా మాట్లాడడం, "నువ్వు _______ఉన్నావు." ఇంకా, ప్రవర్తన గురించిన హానికరమైన మాటలు ఇలా మొదలౌతాయి, "నువ్వు ఎల్లప్పుడు________చేస్తావు" లేక "నువ్వు ఎన్నడు_______చెయ్యవు." ఈ విషయాలు, ఒక వ్యక్తి తన లోపాలను మార్చుకోలేడని సూచిస్తున్నాయి ఎందుకంటే ఆ లోపాలు లోతైనవి, మారనివి.

ఎవరైనా గాయపడినప్పుడు-ముఖ్యంగా అతని ప్రాథమిక ప్రేమ భాషను అనుభవించే విధానంలో గాయపడినప్పుడు-మరింత గాయపడకుండా దూరంగా ఉండడానికి ఇష్టపడతాడు. ప్రతికూలంగా మాట్లాడే వారు సహజంగా అనుకూలంగా మాట్లాడడానికి ఇష్టపడరు, కాబట్టి తన ప్రవర్తన మార్చుకోవడం వలన అనుకూల మాటలు పొందుకోగలననే ఆశ వినేవారిలో ఉండదు. ప్రేమను పొందడానికి తన ప్రవర్తన మార్చుకోవాలన్న ఆశ కూడా వారిలో కలుగదు.

కొన్నిసార్లు కోపిష్టులు బాధపెట్టాలనే ఉద్దేశ్యంతో ఎదుటివారిని బాధపెడతారు. మరికొన్నిసార్లు, బాధపెట్టాలనే ఉద్దేశ్యం లేకపోయినా, వారి మాటలు బాధపెడతాయి. కొన్నిసార్లు ప్రవర్తనలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో కొందరు కఠినంగా మాట్లాడతారు, కాని అది అంతగా పనిచెయ్యదు.

► ఒక విద్యార్థి తరగతి కోసం కొలొస్స 3:8 చదవాలి. విశ్వాసులు దేవునికి, ఇతరులకు విరుద్ధంగా ఏ విధానాల్లో పాపం చేయడం కొనసాగించకూడదు.

## సమూహ చర్చ కోసం

► మీ సొంత మాటల్లో, నిజమైన ప్రేమ గురించి చెప్పండి. మనం ఇతరులను ప్రేమించడానికి పరిశుద్ధాత్ముడు మనకు ఎందుకు సహాయం చెయ్యాలి?

► ఒకరిని షరతులు లేకుండా ప్రేమించడం అంటే ఏంటో వివరించండి. దేవుడు మీ పట్ల చూపించే షరతులు లేని ప్రేమ ప్రాముఖ్యత ఏంటి?

► మీ జీవిత భాగస్వామిని లేక మీ పిల్లలను, వారు ఎక్కువగా ప్రేమను అనుభవించే విధానంలో ప్రేమించడం ఎందుకు ప్రాముఖ్యం?

► ధృవీకరణ మాటలు పొందడం మీకు ఎలా సహాయకరం?

► ఈ వారంలో, ధృవీకరణ మాటల ద్వారా మీ కుటుంబీకులకు మీ ప్రేమను ఎలా వ్యక్తపరిచారు?

## ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ,

నిజమైన, షరతులు లేని ప్రేమను నాకు బోధించినందుకు వందనాలు. దానిని నీ వాక్యంలో వివరించినందుకు, నా పట్ల నీవు చూపించిన ప్రేమలో వెల్లడిచేసినందుకు ధన్యవాదాలు.

క్రీస్తు ప్రేమించి, పరిచారం చేసినట్లుగా, నా కుటుంబాన్ని ప్రేమించి, పరిచారం చేయడం నాకు నేర్పించు. నా జీవిత భాగస్వామి, పిల్లలు, తోబుట్టువులు, తల్లిదండ్రుల మేలు కోరడానికి సహాయం చెయ్యి.

నేను మాట్లాడే మాటల్లోని ప్రాముఖ్యత గురించి నాకు గుర్తు చేసినందుకు వందనాలు. ఇతరులకు బాధ కలిగించే మాటలు నేను మాట్లాడినందుకు, నిన్ను అగౌరవపరచినందుకు నన్ను క్షమించు. నేను మాట్లాడే మాటలు అభినందించేవిగా, జీవితాల్ని కట్టేవిగా, స్వస్థత కలిగించేవిగా ఉండుటకు సహాయం చేయుము.

ఆమెన్

## పాఠం అభ్యాసాలు

(1) దృఢమైన వైవాహిక జీవితం కలిగియున్న దంపతులతో మాట్లాడండి, వారి జీవితాల్లో నుండి నేర్చుకోవడానికి ప్రశ్నలు అడగండి. మాట్లాడడం అయిపోయిన తర్వాత, వారు పంచుకున్న విషయాలను గురించి అలాగే మీ వైవాహిక జీవితంలో మీరు పాటించాలనుకుంటున్న వాటి గురించి రెండు పేరాలు రాయండి.

మీరు అడుగవలసిన కొన్ని ప్రశ్నలు ఇక్కడ ఉన్నాయి:

- మీ వ్యక్తిత్వంలో ఉన్నటువంటి ఏ తేడాలు మీ వైవాహిక బంధాన్ని ప్రభావితం చేశాయి?
- ఈ తేడాలు మీ ఎదుగుదలకు ఎలా తోడ్పడ్డాయి?
- ఒకరినొకరు గౌరవించుకుంటూ, పరిచారం చేసుకోవడానికి మీ ఆలోచనలు, అభిప్రాయాలు, ప్రవర్తనలు ఎలా మార్చుకున్నారు?
- మీరు ప్రేమను చూపించే కొన్ని ఆచరణాత్మకమైన మార్గాలు ఏంటి?
- మీలో ప్రేమ పొందుకుంటున్నామనే భావన కలిగించడానికి, మీ జీవిత భాగస్వామి ఏం చేస్తాడు లేక ఏం చెబుతాడు?
- మీ జీవిత భాగస్వామితో ఉన్నటువంటి మీ బంధం, దేవునితో మీకున్న బంధాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?

(2) సామెతలు 31:10-31లో, రచయిత తన భార్యను అనేక తన మాటలతో ధృవీకరిస్తాడు. ఆమె ప్రవర్తన గురించి పలికిన ఆ మాటలు, ఆమె స్వభావాన్ని చూపిస్తాయి. ఎలాంటి విషయాలను బట్టి అతడు తన భార్యను ధృవీకరిస్తున్నాడు? ఈ విషయాల కోసం వాక్యభాగంలోకి చూడండి:

- ఆమె రూపం
- ఆమె విజయాలు, సేవ
- ఆమె గుణం, కృషి
- ఒక వ్యక్తిగా ఎలా ఉంది
- ఒక విశ్వాసిగా ఎలా ఉంది

ఈ వాక్యభాగంలో ఉద్ఘాటించబడిన విషయాల నుండి మనం ఏం నేర్చుకోగలం?

# పాఠం 9

# ప్రేమకు ఐదు భాషలు – భాగం 2

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) ప్రేమ వ్యక్తపరచబడిన ఐదు భాషల్ని అర్థం చేసుకోవాలి.

(2) ఈ ప్రతి ప్రేమ భాషను దుర్వినియోగం చేయడం వలన లేక నిర్లక్ష్యం చేయడం వలన కలిగే ప్రమాదాలను చర్చించాలి.

(3) పిల్లల భావోద్వేగ ట్యాంక్ నిండుగా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలి.

(4) మీ కుటుంబ సభ్యుల ప్రాథమిక ప్రేమ భాషను గుర్తించాలి.

(5) ఈ ఐదు ప్రేమ భాషల్లో, ప్రతి ఒక్క ప్రేమ భాష ద్వారా కుటుంబ సభ్యులను ఎలా ప్రేమించగలరో చెప్పాలి.

(6) కుటుంబంలో ప్రతి ఒక్కరికి తమ ప్రధాన ప్రేమ భాషలో ప్రేమ చూపడానికి కట్టుబడి ఉండాలి.

## పరిచయం

గత పాఠంలో, త్యాగం గురించి, షరతులు లేని ప్రేమ గురించి మనం నేర్చుకున్నాం. ఐదు విభిన్నమైన మార్గాల్లో (ప్రేమ భాషల్లో) ప్రేమ చూపించగలమని కూడా నేర్చుకున్నాం. సహజంగా, చాలామంది ఈ ఐదు ప్రేమ భాషల్లో ఒకటి లేక రెండు భాషల్లో తమ ప్రేమను వెల్లడిచేస్తారు.

ధృవీకరణ మాటల గురించి మాట్లాడుకున్నాం, కుటుంబ సభ్యులకు ప్రేమ చూపించే ఆచరణాత్మకమైన మార్గాలు కనుగొన్నాం. ఈ పాఠంలో, మిగిలిన నాలుగు ప్రేమ భాషల గురించి నేర్చుకుందాం, ఆ తర్వాత మన పిల్లలకు ఆ ప్రేమను చూపించే కొన్ని ప్రత్యేకమైన అన్వయాలు కూడా చూద్దాం.

## ప్రేమ భాష 2: నాణ్యమైన సమయం

నాణ్యమైన సమయాన్ని, ప్రాథమిక ప్రేమ భాషగా ఉన్నవారు, ఇతరులు తమతో గడపడానికి ప్రత్యేకంగా సమయం కేటాయించినప్పుడు, పూర్తిగా తమపై దృష్టి పెట్టినప్పుడు, మరియు కలిసి ఆనందంగా గడిపినప్పుడు తమకు అత్యంత

ప్రేమ లభించిందని భావిస్తారు. ఈ సమయం కేటాయించడం అనేది కేవలం కలిసి ఉండటం కాదు, ఒకరిపై ఒకరు పూర్తి శ్రద్ధ పెట్టడం, మరియు ఆ బంధాన్ని ఆస్వాదించడం.

నాణ్యమైన సమయం, యాదృచ్ఛికం కాదు లేక ఖాళీ సమయాల్లో వెచ్చించేది కాదు. ఒకవేళ మీరు ట్రాఫిక్ లో ఇరుక్కుపోయినప్పుడో లేక అపాయింట్మెంట్ కోసం వేచి ఉన్నప్పుడో, ఆ సమయాన్ని జ్ఞానంగా వాడుకోవచ్చు కాని ఇది ఉద్దేశ్యపూర్వకంగా కేటాయించిన నాణ్యమైన సమయంగా పరిగణించకూడదు. జీవిత భాగస్వామి లేక మీ పిల్లలు మీతో కలిసి పని చేయవచ్చు, కాని అది వారికి కావలసిన నాణ్యమైన సమయాన్ని ఇవ్వకపోవచ్చు.

ఆటంకాలు లేకుండా మాట్లాడుకోవడం నాణ్యమైన సమయం యొక్క ఉత్తమ రూపాలలో ఒకటి. అలాంటి సంభాషణల్లో, ప్రతి ఒక్కరు ఎదుటి వ్యక్తి చెప్పే మాటల్ని శ్రద్ధగా వింటారు. ఎదుటి వ్యక్తి మీద మరియు సంభాషణ మీద దృష్టి పెట్టడానికి, ఫోన్ కాల్స్, మెసేజ్లు వంటి ఆటంకాలను ప్రక్కనబెడతారు.

ఆటంకాలు లేకుండా మాట్లాడుకోవడం ఒక విధంగా నాణ్యమైన సమయం కేటాయించినప్పుడే సాధ్యమౌతుంది. అలాంటి సంభాషణల్లో, ప్రతి ఒక్కరు ఎదుటి వ్యక్తి చెప్పే మాటల్ని శ్రద్ధగా వింటారు. ఎదుటి వ్యక్తి చెప్పే మాటల్ని శ్రద్ధ వినడానికి, సంభాషణ మీద దృష్టిపెట్టడానికి ఫోన్ కాల్స్, మెసేజ్లు వంటి వాటిని ప్రక్కనబెడతారు.

మీరు శ్రద్ధగా వింటున్నారని చూపించే కొన్ని మార్గాలు ఇక్కడ ఉన్నాయి:

1. **ఎదుటి వ్యక్తి కళ్ళను చూస్తూ మాట్లాడాలి.**

2. **శ్రద్ధగా వినాలి.** ఇతరులు చెప్పేది శ్రద్ధగా వినండి. మీరు తర్వాత ఏం మాట్లాడాలి అనే దాని గురించి మాత్రమే ఆలోచించకండి. బదులుగా, అవతలి వ్యక్తి ఏం ఆలోచిస్తున్నారో, ఏం చెప్తున్నారో మీకు ఎంతవరకు అర్థమైందో ఖచ్చితంగా తెలుసుకోవడానికి సమయం కేటాయించండి. మీరు సరిగ్గా అర్థం చేసుకున్నారని నిర్ధారించుకోవడానికి, "నేను సరిగ్గా అర్థం చేసుకున్నట్లయితే, మీకు ఇలా అనిపిస్తుంది..." వంటి వాక్యాలు ఉపయోగించవచ్చు.

3. **మధ్యలో అడ్డుకోవద్దు.** చాలా సందర్భాల్లో వినే వ్యక్తి, తనకు అర్థమైందని అనుకొని, తన అభిప్రాయం చెప్పడానికి మధ్య అడ్డుకుంటాడు. ఇలా చేయడంవలన, చెప్పే వ్యక్తి, వింటున్న వ్యక్తి తనను సరిగా అర్థం చేసుకోవట్లేదని భావిస్తాడు.

4. **కేవలం మాటలే కాకుండా భావాలు కూడా ఆలకించండి.** ఇతరుల భావాలు మనం అర్థం చేసుకున్నప్పుడే, వారికి విలువ ఇచ్చినవారిగా పరిగణించబడతాం. మనస్ఫూర్తిగా వారి మాటలు వినడంవలన, వారి అభిప్రాయాలూ వారి భావాలు మనకు ముఖ్యమని సూచిస్తాం; వారు కూడా మనకు ముఖ్యమేనని సూచిస్తాం.

మంచి నాణ్యమైన సమయం అంటే ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ, మరేమీ చేయకుండా గడపడమే. అయితే, ఇతర రకాల సమయాలు కూడా విలువైనవే. ప్రతి రోజు భోజన సమయంలో, కుటుంబ సభ్యులతో ముఖాముఖిగా మాట్లాడుతూ కూడా నాణ్యమైన సమయాన్ని గడుపవచ్చు.

పిల్లలకు కథలు చదివి వినిపించడం, కలిసి ఆడుకోవడం, కలిసి వినోదాత్మకమైన కార్యక్రమాల్లో పాల్గొనడం ఇలాంటి వాటి ద్వారా కుటుంబంతో నాణ్యమైన సమయం గడపవచ్చు. పాఠశాల కోసం లేక పరిచర్య కోసం కాకుండా కేవలం వినోదం కోసమే కలిసి ఏదైనా పని చేసినప్పుడు అది కూడా నాణ్యమైన సమయంగానే పరిగణించబడుతుంది.

ఎవరైనా కుటుంబానికి దూరంగా ఉన్నప్పుడు, ఫోన్ ద్వారా వారితో కలిసి నాణ్యమైన సమయం గడపవచ్చు.

నాణ్యమైన సమయం అంటే ఎటువంటి కంగారు లేకుండా ఒకరినొకరు చూసుకుని, ఒకరి సహవాసాన్ని ఒకరు ఆనందించుకోవడానికి కేటాయించుకున్న సమయం. ప్రతిరోజు జీవిత భాగస్వామితో, పిల్లలతో గడపడానికి కొంత నాణ్యమైన సమయాన్ని కేటాయించాలి.

**సమయాన్ని కేటాయించనప్పుడు**

జీవితభాగస్వామి లేక తల్లి/తండ్రి పరిచర్య చేసే నాయకులుగా ఉన్నప్పుడు, కుటుంబానికి నాణ్యమైన సమయం కేటాయించడం చాలా కష్టమౌతుంది. తమ తండ్రికి ఎవరు ఫోన్ చేసినా స్పందిస్తారు కానీ తమకు సమయం ఇవ్వడానికి చాలా బిజీగా ఉంటారని పాస్టర్ల పిల్లలు సహజంగా భావిస్తుంటారు. పరిచర్య కోసం కుటుంబానికి ఇవ్వవలసిన సమయాన్ని కూడా త్యాగం చేస్తున్నారని అనిపించవచ్చు.

పరిచర్యలో ఉన్నవారు అంతరాయాల్ని పూర్తిగా నివారించలేరు, అయినప్పటికీ కుటుంబానికి సమయం కేటాయించే ప్రయత్నం చెయ్యాలి. అలా చేసినప్పుడు, మీ కుటుంబం మీ దైనందిన బాధ్యతల్ని, అప్పుడప్పుడు వచ్చే అనివార్యమైన అంతరాయాల్ని అర్థం చేసుకుంటుంది.

తనకి ముఖ్యమైన ప్రేమ భాష 'నాణ్యమైన సమయం' అయిన వ్యక్తికి, కుటుంబంతో ఉద్దేశపూర్వకమైన, శ్రద్ధగా గడిపే సమయం దొరకనప్పుడు చాలా తక్కువగా ప్రేమించబడినట్లు అనిపిస్తుంది. నాణ్యమైన సమయానికి ప్రాధాన్యత ఇవ్వనప్పుడు, కొన్ని అంతరాయాల వలన నాణ్యమైన సమయాన్ని కేటాయించలేనప్పుడు అతడు చాలా

బాధపడతాడు. కుటుంబీకులు అతనితో సమయం గడుపలేనంత బిజీగా ఉన్నప్పుడు, బాధపడతాడు. కుటుంబీకులు శ్రద్ధగా అతని మాటలు విననప్పుడు, తనకు అంత విలువలేదనుకుంటాడు.

మీరు మీ జీవితభాగస్వామి లేక పిల్లలపై శ్రద్ధ చూపనప్పుడు, వారి కోసం ఏ పని చేసినా మీ ప్రేమ వారికి అర్థం కాదు. ఒక వ్యక్తి తన కుటుంబం కోసం కష్టపడి పని చేస్తున్నా, అతడు తన భార్యతో సమయం గడపలేనంత బిజీగా ఉంటే, ఆమె అతని ప్రేమను అర్థం చేసుకోలేదు.

ఒక బాలుడు ఇటీవల విన్న కథను తన తండ్రితో పంచుకోవాలని అతని దగ్గరకు వెళ్లాడు. ఆ సమయంలో, తండ్రి పుస్తకం చదువుకుంటూ ఉన్నాడు, కాని తన పుస్తకం పక్కన పెట్టి బాలుడు చెప్పే కథ వినడం ప్రారంభించాడు, కథ మధ్యలో ఉండగా అతడు మళ్ళీ తన పుస్తకం తీసుకుని చదవడం కొనసాగించాడు. ఆ క్షణంలో బాలుడికి కలిగిన ఆ బాధను తన జీవితాంతం గుర్తుపెట్టుకున్నాడు.

► సాధారణంగా, నాణ్యమైన సమయం మీ కుటుంబానికి ఎలా కనిపిస్తుంది? కలిసి అర్థవంతమైన సమయం గడపడంలో మీరు ఎదుర్కొనే కష్టాలు ఏంటి?

### ప్రేమ భాష 3: బహుమతులు

బహుమతులు స్వీకరించడాన్ని ప్రేమ భాషగా భావించేవారు, ఎవరైనా వారిని గుర్తుపెట్టుకుని వారికి బహుమానాలు ఇచ్చినప్పుడు ప్రేమను అనుభవించగలుగుతారు.

ఒక వ్యక్తిలో ప్రేమ అనుభూతిని కలిగించే బహుమతులు, ఆలోచనతో ఇస్తారు. వాటిని అందుకునే వ్యక్తి అభిరుచి ఆధారం చేసుకొని ఎన్నుకుంటారు. అవి, అవసరంగా లేక ఉపయోగపడేవిగా ఉండాల్సిన అవసరం లేదు. ప్రేమ బహుమతులు ఇచ్చేవారికి వాటి అవసరం లేదు కాబట్టే వాటిని ఇవ్వకూడదు. బహుమతుల్ని ఉద్దేశ్యపూర్వకంగా ఎంచుకోవాలి లేక ఇచ్చేవారే తయారు చేసి ఇవ్వాలి.

ప్రేమ అనుభూతిని కలిగించడానికి ఇచ్చే బహుమతి ఖరీదైనదిగా ఉండనక్కరలేదు. అది, కొన్ని గంటల్లో అయిపోయే ప్రత్యేకమైన ఆహారం కావచ్చు లేక చాక్లెట్ వంటిది కావచ్చు; లేక బంధానికి గుర్తుగా ఎక్కువ కాలం ఉండే బహుమతి కావచ్చు. బహుమతులు స్వీకరించడం ఒకరి ప్రాథమిక ప్రేమ భాషయైనప్పుడు, వారికి పుట్టినరోజులు, వార్షికోత్సవాలు, సెలవు దినాలు చాలా ముఖ్యం. కుటుంబ సభ్యులు ఈ ప్రత్యేక దినాల్ని గుర్తు పెట్టుకుని, ఆ వ్యక్తికి బహుమతి ఇవ్వడం ఇంకా ముఖ్యం. ఈ దినాల్లో బహుమతి అందకపోవడం, ఈ వ్యక్తికి చాలా బాధాకరంగా ఉంటుంది.

బహుమతులు ఇవ్వడం ఈ ప్రత్యేక రోజులకే పరిమితం కాకూడదు; ఇది ఎల్లప్పుడు జరుగుతూ ఉండాలి. బహుమతులు స్వీకరించడాన్నే ప్రాథమిక ప్రేమ భాషగా భావించేవారి జీవితభాగస్వామి, తల్లి/తండ్రి లేక పిల్లలు బహుమతుల కోసం వెతకడం అలవాటు చేసుకోవాలి, అప్పుడే తాము గుర్తున్నామని, తమ గురించి ఆలోచిస్తున్నారని, తమను ప్రేమిస్తున్నారనే భావన వారిలో కలుగుతుంది.

బహుమతులు స్వీకరించడాన్ని ప్రాథమిక ప్రేమ భాషగా భావించే భార్యకు, తన భర్త అవసరమైనది మాత్రమే బహుమతిగా ఇచ్చి ఖర్చు ఆదా చేయడానికి ప్రయత్నించినప్పుడు, భర్త తనను ప్రేమించట్లేదని అనుకుంటుంది. బహుశా ఆమెకు క్రొత్త చీపురు అవసరం, అది ఇచ్చాడు. క్రొత్త చీపురు ఆమెకు మంచిదే, కాని ఆ బహుమతి ద్వారా ఆమె ప్రేమ అనుభూతిని పొందుకోలేదు.

బహుమతులు ఇచ్చే వ్యక్తి, అందుకునే వ్యక్తిని మంచిగా అర్థం చేసుకుని, జాగ్రత్తగా అలోచించి ఇచ్చినప్పుడు అవి గొప్పవి అవుతాయి. అవి అవసరమైనవి కానప్పటికీ ప్రాముఖ్యమైనవే. అలోచించి, ప్రయత్నించి, ఖర్చు పెట్టి బహుమతి ఇచ్చినప్పుడు, అది గొప్పగా ఉంటుంది.

బహుమతులు స్వీకరించడాన్ని ప్రాథమిక ప్రేమ భాషగా భావించే పిల్లలకు, వారి తండ్రి స్కూల్ ఫీజు- ముఖ్యమైంది, ఎక్కువ ఖర్చుతో కూడినది- కట్టినప్పుడు వచ్చే ఆనందం కంటే వారికి ఐస్ క్రీం కొనిచ్చినప్పుడు వచ్చే ఆనందాన్నే గొప్పగా అనుభవిస్తారు. కాబట్టి, మనం మామూలుగా చేసే పనులను కుటుంబ సభ్యులు గుర్తించాలని ఆశించడం కంటే, వారికి ప్రత్యేకంగా అనిపించే పనులను చేయడానికి ప్రయత్నించాలి.

కొంతమంది, వారి పిల్లలు లేక జీవితభాగస్వామి ప్రతిదానికి వారినే అడగాలని అనుకుంటారు. తక్కువగా ఖర్చుచేసేవాడు లేక తమ కోసం ఏది ఖర్చుపెట్టుకోనివాడు, దాతృత్వంగా ఉండలేడు, అవసరంలేని బహుమతులు ఇవ్వడు. తన కుటుంబీకులు బహుమతులు ఆశించకూడదని అనుకుంటాడు. ఒకవేళ బహుమతుల్ని ప్రాముఖ్యంగా ఎంచే జీవితభాగస్వామి లేక పిల్లలు అతనికి ఉన్నట్లయితే, తన స్వాభావిక అలవాటును అధిగమించడానికి ప్రయత్నించాలి. వారు బహుమతుల్ని ఎలా - ప్రాముఖ్యంగా మరియు విలువైనవిగా- చూస్తున్నారో అతడు కూడా అలాగే చూడాలి. బహుమతులు ఇస్తున్నప్పుడు, ఉచితంగా ఇవ్వాలి, ఆనందంతో ఇవ్వాలి!

► ఒక విద్యార్థి తరగతి కోసం 2 కొరింథీయులకు 9:6-9 చదవాలి. ఈ వాక్యభాగంలో, అవసరతలో ఉన్న తన తోటివిశ్వాసులకు దాతృత్వంతో ఇవ్వాలని పౌలు కొరింథీయులకు విశ్వాసుల్ని హెచ్చరిస్తున్నాడు. ఈ వచనాల నుండి, దాతృత్వంగా ఉండడానికి మనల్ని ప్రోత్సహించే నాలుగు లేక ఐదు విషయాలు గుర్తించడానికి ప్రయత్నించండి. ఈ వాక్యభాగంలోని సూత్రాలు మన కుటుంబాల్లో దాతృత్వానికి ఎలా వర్తిస్తాయి?

► మీ కుటుంబంలో బహుమతులు ఇవ్వడానికి ఎటువంటి స్థానం ఉంది? బహుమతులు ఇవ్వడం ద్వారా ప్రేమ పంచడం మీకు కష్టం అనిపిస్తుందా? ఎలాంటి కష్టాలు ఉన్నాయి, వాటిని మీరెలా అధిగమించగలరు?

### ప్రేమ భాష 4: సేవా కార్యాలు

ప్రాథమిక ప్రేమ భాష 'సేవా కార్యాలు' అయిన వాళ్ళు, ఇతరులు తమ కోసం పనులు చేసినప్పుడు ఎక్కువగా ప్రేమించబడినట్లు భావిస్తారు.

సేవా కార్యాలు రోజువారీ అవసరాల్ని తీరుస్తాయి. అవి ఒక వ్యక్తి చేయలేని పనులు అయ్యుండొచ్చు లేక చేయగల పనులు అయ్యుండొచ్చు. సేవా కార్యాలు అంటే, మంచినీరు ఇవ్వడం. అనారోగ్యంగా ఉన్నవారిని చూసుకోవడం. అవసరతలో ఉన్నవారికి సహాయం చేయడం వంటి పనులు కావచ్చు.

చాలా కుటుంబాల్లో, ఒక కుటుంబ సభ్యుడిని ఎక్కువ కాలం పాటు దగ్గర ఉండి చూసుకోవలసిన పరిస్థితి ఉంటుంది. కుటుంబ సభ్యుల ప్రేమ, సమర్పణ వల్ల, వారు అనేక సేవా కార్యాలు చేయడం కొనసాగిస్తారు. సేవా కార్యాల కోసం చాలా సమయం వెచ్చించినప్పటికీ, ముఖ్యంగా ఈ వ్యక్తి ప్రాథమిక ప్రేమ భాష సేవా కార్యాలు కానప్పుడు కుటుంబీకులు మరింత అర్థవంతమైన విధానాల్లో ప్రేమను చూపించాలి.

కొన్ని సేవా కార్యాలు దినచర్యగా అనిపిస్తాయి, వాటిని నిర్లక్ష్యం చేయొచ్చు లేక తేలికగా తీసుకోవచ్చు. చాలామంది స్త్రీలు ప్రతిరోజు వంట చేయడం, ఇంటి పనులను చక్కబెట్టడం ద్వారా తమ ప్రేమను వ్యక్తపరుస్తున్నారు. అలాగే, ఒక పురుషుడు తన కుటుంబాన్ని పోషించడానికి కష్టపడి పని చేయవచ్చు. ఒకవేళ మీరు మీ కుటుంబానికి ఈ విధంగా రోజువారీ పనుల ద్వారా సేవా కార్యాలు చేస్తున్నప్పటికీ, మీ కుటుంబ సభ్యులలో ఒకరికి ఈ 'సేవా కార్యాలు' అనేదే ప్రధానమైన ప్రేమ భాష అయితే, మీరు వారికోసం ప్రత్యేకమైన పద్ధతుల్లో సేవ చేయడానికి ప్రయత్నించాలి.

భార్య, తన భర్తకుండే చిన్న చిన్న అవసరాలు పట్టించుకోనప్పుడు, ఈ ప్రేమ భాషలో ప్రేమను వ్యక్తపరచకుండా విఫలమౌతుంది. "ఆయనే నీళ్లు తీసుకుని త్రాగగలడు" అని ఆమె అనుకోవచ్చు. కాని ఆమె నీళ్లు తీసుకొచ్చి అతనికి ఇచ్చినప్పుడు, ఆమె అతని పట్ల ప్రేమ చూపించినట్లు అవుతుంది.

అలాగే, భర్త కూడా శ్రద్ధ చూపించాలి. భార్య సాధారణంగా చేసే పనిని, తనంతటతానే చేసి, ఆమెకు కొంత విశ్రాంతి ఇచ్చినప్పుడు, అతడు ఆమె పనిని గౌరవిస్తాడు, ఆమె చేసే పని ఎంత కష్టమైందో ఎంత ముఖ్యమైందో గుర్తిస్తాడు.

ఒక భర్త, తాను ఇప్పటికే కష్టపడి చాలా పనిచేస్తున్నానని, ఇంటి పనులన్నిటి బాధ్యత భార్యదే అని అనుకోవచ్చు. ఆమె చేసేదానికంటే కూడా మరింత సమర్థవంతంగా పనిచేయాలని అనుకోవచ్చు. ఇంటి పనులు తన స్థాయికి తక్కువని

భావిస్తే, అతడు స్త్రీలను తక్కువారిగాను, తక్కువ పనులకు అర్హులుగాను భావిస్తున్నట్లు అర్థమౌతుంది. స్త్రీలు తక్కువవారు కాదు, ఇంటిపనులు బయట పనుల కంటే తక్కువ కాదు.

గృహంలో తన భార్యకు సహాయం చేస్తున్నప్పుడు ఒక పురుషుడు తాను సేవకుడి పాత్ర పోషిస్తున్నాను (తన భార్య కంటే తక్కువగా) అని భావించవచ్చు, కానీ అది నిజం కాదు. అతను స్వచ్ఛందంగా సహాయం చేయడానికి ముందుకు వచ్చినప్పుడు, ఆ పని యొక్క విలువను, అలాగే తాను సహాయం చేస్తున్న వ్యక్తి యొక్క విలువను కూడా అతను చూపిస్తున్నాడు. అతని సేవ సాధారణంగా ఆ పని చేసే వ్యక్తిని గౌరవిస్తుంది, మరియు అతని అభినందనను తెలియజేస్తుంది. అతని భార్య అతన్ని సేవకుడిలా కాకుండా, మరింత గౌరవప్రదంగా చూస్తుంది.

ఒకవేళ ప్రజలు సణుక్కుంటూ, అయిష్టంగా సహాయం చేసినప్పుడు, బలవంతంగా సహాయం చేస్తున్నట్లు అనిపిస్తుంది. వారి సేవా కార్యాలు ప్రేమను చూపించవు. ఒకవేళ వారు ఉత్సాహంగా, కష్టపడి సేవాకార్యాలు చేస్తుంటే, వారు సేవ చేయడానికి ఇష్టపడుతున్నారని తెలియజేస్తుంది, ఎందుకంటే ఎవరు అలాంటి సేవను బలవంతం చేయలేరు. ఈ ఆనందకరమైన సేవా కార్యాలు వారి ప్రేమను స్పష్టంగా వెల్లడిచేస్తాయి. దీనివలన వారు, వారి ప్రియుల నుండి గౌరవాన్ని కూడా పొందుకుంటారు.

► మీ కుటుంబానికి సేవ చేయడం మీకు ఎప్పుడు కష్టమని అనిపించింది? సేవా కార్యాల్ని ప్రేమ వ్యక్తీకరణగా భావించడం మీ అభిప్రాయాన్ని ఎలా మారుస్తుంది?

## ప్రేమ భాష 5: శారీరక స్పర్శ

శారీరక స్పర్శనే ప్రధాన ప్రేమ భాషగా భావించేవారిని, కుటుంబ సభ్యులు ప్రేమగా తాకినప్పుడు అధిక ప్రేమను అనుభవిస్తారు.

శారీరక స్పర్శ ద్వారా ప్రేమను చూపించడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. కొన్ని విధానాలు, కొన్ని బంధాలకు మాత్రమే వర్తిస్తాయి కాని ఇతర బంధాలకు వర్తించవు. ఇక్కడ కొన్ని ఉదాహరణలు ఉన్నాయి:

- ఒకరినొకరు హత్తుకోవడం
- ఒకరి వీపుపై లేక భుజంపై చేయి వేయడం
- భుజాలపై చేతులు పెట్టడం
- వీపుపై లేక భుజాలపై తట్టడం
- కలిసి కూర్చోవడం

- ఒకరికొకరు చేతులు పట్టుకోవడం
- ముద్దు పెట్టుకోవడం
- వీపు ఒత్తడం
- పిల్లలను పట్టుకోవడం
- పిల్లల జుట్టు నిమరడం లేక దువ్వడం
- అనారోగ్యంగా ఉన్నప్పుడు లేక శరీర బలహీనతతో ఉన్నపుడు మృదువుగా, సున్నితంగా ఉండడం

ఎవరైనా కష్టకాలంలో ఉన్నపుడు, శారీరక స్పర్శ వారికి కూడా అర్థవంతంగా ఉంటుంది. దుఃఖ సమయంలో, బాధలో, ఒంటరితనంలో లేక నిరాశలో ఉన్నవారికి, ప్రాథమిక ప్రేమ భాష శారీరక స్పర్శ అయ్యింటే, ఆదరణ మాటల కంటే, సేవా కార్యాల కంటే కౌగలింత అర్థవంతంగా ఉంటుంది.

శారీరక స్పర్శనే ప్రధాన ప్రేమ భాషగా భావించేవారికి, వారు అనారోగ్యంలో ఉన్నప్పుడు కూడా సాధ్యమైతే శారీరక స్పర్శ ద్వారా ప్రేమను వ్యక్తపరచడం ప్రాముఖ్యం. ప్రేమ షరతులు లేనిది, త్యాగపూరితమైనదని గుర్తుంచుకోండి. లూకా 15:20 లోని తండ్రి, పశ్చాత్తాపంతో ఉన్న తన కుమారుడు మురికిగా ఉన్నా, దుర్వాసనతో ఉన్నా, ఏ విధంగాను ప్రేమించే స్థితిలో లేకున్నా అతనిని హత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు.

శారీరక స్పర్శ ద్వారా ప్రేమను వ్యక్తపరచడం అంటే అది కేవలం లైంగికత గురించే కాదు. లైంగిక చర్య స్పర్శకు సంబంధించినదే. తాకాలి, తాకబడాలనే కోరిక లైంగిక చర్యకు దారితీయవచ్చు, అందులో వ్యక్తమవ్వవచ్చు కాని శారీరక స్పర్శయే ప్రధానమైన ప్రేమ భాషగా ఉన్న వ్యక్తికి కేవలం లైంగిక చర్య మాత్రమే చాలదు.

శారీరక స్పర్శ ద్వారా ప్రేమను అనుభవించాలనే కోరిక ఒక వ్యక్తిని అనైతిక లైంగిక చర్య వైపు శోధించబడవచ్చు. తల్లిదండ్రులు, తగిన లైంగికేతర శారీరక స్పర్శను వారి కుమారులకు, కుమార్తెలకు ఇవ్వడం చాలా ప్రాముఖ్యం, తద్వారా పిల్లల శారీరక స్పర్శ అవసరాలు తీరుతాయి. ప్రేమించబడే పిల్లల్లో శోధనలను ఎదుర్కొనే శక్తి ఉంటుంది.

**శారీరక స్పర్శ ద్వారా జరిగే పాపాలు**

శారీరక స్పర్శను ప్రాథమిక ప్రేమ భాషగా భావించేవారిని, బలవంతంగా తాకినప్పుడు బాధపడతారు. కోపంతో ఎవరినైనా కొట్టడం (గలతీయులకు 5:20), అవమానించాలని చెంపమీద కొట్టడం (మత్తయి 5:39), లేక అధికారాన్ని తప్పుగా ఉపయోగించి కొట్టడం (మత్తయి 24:48-49) పాపం. తల్లిదండ్రుల కోపంతో ఉన్నా లేక విసిగిపోయినా పిల్లలను హింసించే హక్కు వారికి లేదని ఈ లేఖనభాగాల ద్వారా మనకు అర్థమౌతుంది. పిల్లలు తల్లిదండ్రులను కొట్టడం కూడా పాపమేనని దేవుడు సెలవిస్తున్నాడు (నిర్గమకాండము 21:15).

తల్లిదండ్రులు పిల్లలను సరిచెయ్యడానికి, నీతియందు శిక్షణ ఇవ్వడానికి మృదువుగా వారిని క్రమశిక్షణలో పెట్టినప్పుడు (కొలొస్సయులకు 3:21), అది పాపం కాదు. బదులుగా, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రాణాలను కాపాడాలనేది దేవుని ఉద్దేశ్యమై ఉంది (సామెతలు 13:24, సామెతలు 19:18, సామెతలు 29:15, హెబ్రీయులకు 12:5-7).

సమస్త విధమైన లైంగిక చర్యలు, లైంగిక వేధింపులు, వావి వరుసతప్పి చేసే లైంగిక చర్యలు అన్నియు కూడా (లేవీయకాండము 20:11-12, 14) పాపమే.

## మీ ప్రాథమిక ప్రేమ భాషను గుర్తించడం

చాలామందికి తమ ప్రాథమిక ప్రేమ భాష గురించి తెలియదు. వారు ఇతరుల్ని ఎలా ప్రేమిస్తున్నారో గమనించకపోవచ్చు. అలాగే ఇతరులును తమను ఎలా ప్రేమిస్తున్నారో గుర్తించకపోవచ్చు. కొంత సమయం తీసుకుని, ఐదు ప్రేమ భాషల గురించి మీకు తెలిసిన వాటిని ఆలోచించండి.

► మీరు సాధారణంగా, ఎక్కువగా ఇతరులపై మీ ప్రేమను ఎలా (ఏ ప్రేమ భాషలో) వ్యక్తపరుస్తారు?

► మీ ప్రధాన ప్రేమ భాష, రెండవ ప్రాధాన్యత గల ప్రేమ భాష ఏవీ? ఏ ప్రేమ వ్యక్తీకరణలు మీకు ముఖ్యమో తెలుసుకోవడం కష్టమనిపిస్తే, మీక సహాయం చేసే కొన్ని ప్రశ్నలు ఇక్కడ ఉన్నాయి:

- మీకు సంతోషం కలిగించే విషయాలు ఏంటి?
- మీకు ఇష్టమైన జ్ఞాపకాలు ఏంటి?
- మీరు దేని గురించి (మౌనంగా అయినా) ఫిర్యాదు చేస్తారు?
- మీకు ఏది బాధను కలిగిస్తుంది?

## ప్రేమకు ఐదు భాషలు మరియు పిల్లలు

ప్రతి ఒక్కరికీ ఐదు రకాల ప్రేమ భాషలలో ప్రేమను వ్యక్తపరచడం అవసరం, అయితే ఇది పిల్లలకు మరీ ముఖ్యం. పిల్లలు భావోద్వేగంగా ఆరోగ్యంగా, సమతుల్యంగా ఎదగడానికి, తల్లిదండ్రులు వారిని షరతులు లేకుండా ప్రేమిస్తున్నారని స్థిరంగా, తరచుగా వారికి చెప్పడం, చూపించడం అవసరం. తల్లిదండ్రులు తమ ప్రేమను తమ పిల్లల పట్ల వివిధ మార్గాలలో ప్రతిరోజు అనేక సార్లు చూపించినప్పుడు, అది వారి పిల్లల హృదయాలనే నేలపై కురిసే మృదువైన, పోషణనిచ్చే వర్షం వంటిది.

మీ పిల్లలకు మీ ప్రేమ ఇప్పటికే తెలుసని అనుకోవద్దు. వారికి ఇష్టమైన ప్రేమ భాషలో మాత్రమే కాకుండా, ఇతర ప్రేమ భాషల్లోను, వారు మీ ప్రేమను నిరంతరం చూస్తుండాలి.

**పిల్లల ప్రాథమిక ప్రేమ భాషను గుర్తించడం**

మీరు మీ పిల్లల ప్రాథమిక ప్రేమ భాషను గుర్తించడానికి గ్యారి చాప్మేన్ మరియు రాస్ క్యాంప్బెల్ ఈ సూచనలు ఇచ్చారు:[35]

1. మీ పిల్లలు మీపై ప్రేమను ఎలా వ్యక్తపరుస్తున్నారో గమనించాలి.
2. మీ పిల్లలు ఇతరులకు ప్రేమను ఎలా వ్యక్తపరుస్తున్నారో గమనించాలి.
3. మీ పిల్లలు ఎక్కువగా ఏం అడుగుతున్నారో వినండి.
4. మీ పిల్లలు ఎక్కువగా ఏ విషయంలో ఫిర్యాదు చేస్తున్నారో చూడండి.
5. మీ పిల్లలకు రెండు విషయాలు ఇచ్చి ఎంపిక చేసుకోమని చెప్పండి.

ఐదు సంవత్సరాల వయసు వరకు, మీ పిల్లల ప్రాథమిక ప్రేమ భాషను గుర్తించడం సాధ్యం కాకపోవచ్చు.

**పిల్లల ప్రేమ భాషలపై ప్రత్యేకమైన గమనికలు**

ప్రతి ప్రేమ భాష గురించి ముందుగానే చర్చించుకున్నాం గనుక ఇక్కడ వివరంగా మాట్లాడుకోము. బదులుగా, పిల్లలపై ప్రేమ చూపించే కొన్ని ప్రత్యేకమైన భావాలను గురించి, అన్వయాలను గురించి మాత్రమే ఇక్కడ చూస్తాం.

*ధృవీకరణ మాటలు*

ఎవరైనా ఎక్కువగా తప్పులు చేస్తున్నప్పుడు లేక సరిగా ప్రదర్శించనప్పుడు, వారికి అభినందించే మాటలు చెప్పడం చాలా కష్టం అనిపిస్తుంది. కాని మీరు యధార్థంగా, అభినందించేది ఏదైనా కనుగొని చెప్పగలిగితే, అది మీ పిల్లలను ప్రోత్సహిస్తుంది, అప్పుడు వారు ఎదిగే అవకాశం కూడా ఉంటుంది.

*నాణ్యమైన సమయం*

కుటుంబాలు కనీసం రోజులో ఒకసారైన కలిసి భోజనం చేయడం, ఆ సమయంలో ఒకరికొకరు మాట్లాడుకోవడం చాలా ప్రయోజనకరం.

---

[35] Dr. Gary Chapman మరియు Dr. Ross Campbell, *The Five Love Languages of Children*, (Northfield Publishing, Chicago, 1997), 101-103.

అనేకమంది పిల్లలున్న కుటుంబాల్లో, ఒక బిడ్డతో నాణ్యమైన సమయం గడపకుండా నిర్లక్ష్యం చేయడం చాలా సులభం. అయితే, ఒక్కొక్క బిడ్డకు సమయం కేటాయించి వారికోసం ఏదైనా చేసినప్పుడు, మీ ప్రేమను పొందుకుంటారు. ఆ సమయంలోనే, తోబుట్టువుల మధ్య లేక ఇతర కుటుంబీకుల మధ్య పంచుకోలేని వ్యక్తిగత విషయాలు మీతో పంచుకునే అవకాశం ఉంటుంది.

చాలాసార్లు, పిల్లలు అనుకోకుండా ఒక్కసారిగా తల్లి/తండ్రితో నాణ్యమైన సమయం గడపాలని కోరుకుంటారు. కొన్నిసార్లు, రాత్రిపూట నిద్రపోయే సమయంలో పిల్లవాడు తన మనసులో ఉన్న బాధను చెప్పాలనుకుంటాడు. ఇలాంటి సమయాల్లో తల్లిదండ్రులు కొంత సమయం కేటాయించి పిల్లలు చెప్పే మాటలు వినడం చాలా ముఖ్యం. చాలాసార్లు పిల్లవాడు ఆత్మీయ విషయాలను గురించి ఆలోచిస్తూ, వ్యక్తిగతంగా అమ్మ లేక నాన్న దగ్గరకు వచ్చి, ఆత్మీయ విషయాల్లో సహాయం కోరుతుంటాడు. ఇలాంటి సందర్భాల్లో, తల్లిదండ్రులు తమ పిల్లల్ని యేసు వైపు నడిపించడానికి ప్రత్యేకమైన అవకాశం పొందుకుంటారు.

మీరు మీ పిల్లలతో గడిపే ఆ నాణ్యమైన సమయంలో, వారు వివరంగా సమాధానాలు చెప్పగలిగే (ఓపెన్-ఎండెడ్) ప్రశ్నలు అడగడం నేర్చుకోవాలి అప్పుడే వారు ఏం ఆలోచిస్తున్నారో ఏం భావిస్తున్నారో అర్థమౌతుంది. ఓపెన్-ఎండెడ్ ప్రశ్నలు అంటే "అవును" లేక "కాదు" అనే ప్రతిస్పందనతో సమాధానం ఇవ్వలేని ప్రశ్నలు. ఓపెన్-ఎండెడ్ ప్రశ్నలకు ప్రత్యేకమైన సమాధానం అంటూ ఉండదు. ఓపెన్-ఎండెడ్ ప్రశ్నలు సహజంగా "ఎందుకు....." "ఎలా..." లేక "....ఏంటి" అనే వాటితో ప్రారంభమౌతాయి. ఓపెన్-ఎండెడ్ సంభాషణ మొదలుపెట్టేవారు "..........గురించి చెప్పండి" లేక "......గురించి మీ అభిప్రాయం ఏంటి" అనే మాటలతో మొదలుపెడతారు.

మీ పిల్లలు మీ ప్రశ్నకు సమాధానం ఇస్తున్నప్పుడు, వాళ్ల జవాబులు జాగ్రత్తగా విని, సరిగా స్పందించాలి. కొన్నిసార్లు, ఆ జవాబుకు సంబంధించి మరిన్ని ప్రశ్నలు అడుగవలసి వస్తుంది. మరికొన్నిసార్లు, వారు చెప్తున్న జవాబు మీకు అర్థమైందని స్పష్టత ఇవ్వాలి. ఇంకొన్నిసార్లు, వారు అర్థం చేసుకుంటున్న విషయాల్ని, వారు అనుభవిస్తున్న భావాల్ని మీరు ప్రోత్సహించాలి. అది ఒక ఇంటర్వ్యూలాగా ఉండకుండా, సహజ సంభాషణగా ఉండేలా చూడడం ఎంతో ముఖ్యం. మీరు జాగ్రత్తగా వినడం వలన, తల్లి/తండ్రి నన్ను ప్రేమిస్తున్నారు, నాకు విలువిస్తున్నారని మీ బిడ్డ అనుకుంటాడు.

పిల్లలు కథ చెప్తుండగా సమయం తీసుకుని శ్రద్ధగా ఆలకించినప్పుడు, మీరు వారిని బాగా ప్రేమిస్తున్నారని అనిపిస్తుంది. పిల్లలకు కథలు చెప్పడం లేక పుస్తకాలు చదివి వినిపించడం కూడా నాణ్యమైన సమయం గడిపే ఒక అద్భుతమైన మార్గం.

కలిసి ఆటలు ఆడడం లేక వినోదాత్మకమైన పనులు చేయడం ద్వారా కూడా నాణ్యమైన సమయం గడపవచ్చు.

కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన సమయం ఇవ్వరు. ఈ నాణ్యమైన సమయాన్ని బహుమతులతో భర్తీ చేయడానికి ప్రయత్నిస్తుంటారు. అయితే, బహుమతులు నాణ్యమైన సమయాన్ని భర్తీ చేయలేవు. పిల్లల ప్రాథమిక ప్రేమ భాష ఏదైనప్పటికీ, తల్లిదండ్రులు పిల్లలతో నాణ్యమైన సమయం గడపడం ఎంతో అవసరం. మీరు మీ పిల్లలతో గడిపే ఆ నాణ్యమైన సమయాన్ని ఎన్ని బహుమతులైనా భర్తీ చేయలేవు.

*బహుమతులు*

చాలామంది తల్లిదండ్రులు, తమ పిల్లలకు ఆట వస్తువులుగాని లేక ఆసక్తికరమైన పుస్తకాలుగాని కొనుగోలు చేయరు ఎందుకంటే అవి అంత అవసరమైనవిగా అనిపించవు. అయితే, అవి పిల్లల అభివృద్ధికి తోడ్పడతాయి, అలాగే ప్రేమను వ్యక్తపరచే మార్గంగా కూడా ఉంటాయి.

*సేవా కార్యాలు*

సేవా కార్యాల ద్వారా మీరు మీ పిల్లలను ఎలా ప్రేమించగలరో చూపించే కొన్ని విషయాలు:

- పుట్టినరోజున వారికి ఇష్టమైన భోజనం తయారు చేయడం
- అనారోగ్యంగా ఉన్నప్పుడు ప్రేమగా చూసుకోవడం
- స్కూల్ ప్రాజెక్టులో సహాయం చేయడం
- మీ పిల్లలతో కలిసి ఇంటి పనులు చేయడం, వారి సహాయాన్ని అభినందించడం
- బయట వ్యక్తులకు సహాయం చేయడానికి మీ పిలల్లతో కలిసి పనిచేయడం.

*శారీరక స్పర్శ*

శిశువులందరూ, చిన్న పిల్లలందరూ శారీరక స్పర్శ ద్వారా ప్రేమ పొందుకుంటారు. చిన్న పిల్లలకు డైపర్లు మార్చడం, తినిపించడం వంటి అవసరాలు ఉంటాయి, అయితే వారిని ఎత్తుకోవడం, లాలించడం, ముద్దాడడం వంటి వాటిని చేయడం కూడా ఎంతో అవసరం. ఈ విధమైన శారీరక స్పర్శ ద్వారా వారు ప్రేమను పొందుకుంటారు, వారి భావోద్వేగ మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది.

తండ్రి తన కుమారులతో పోట్లాడడం ద్వారా కూడా ప్రేమను చూపించవచ్చు. కాని, పోటీ బాధాకరంగా, కోపంగా లేక నియంత్రించలేనిదిగా ఉండకూడదు.

## తల్లిదండ్రులు యొక్క మాటలు, క్రియలు వలన కలిగే దీర్ఘకాలిక ప్రభావాలు

తల్లిదండ్రులు పిల్లలతో వ్యవహరిస్తున్నప్పుడు దేవుని మాదిరిని అనుసరించాలి. ఆయన ఎల్లప్పుడు తన పిల్లల విషయంలో పరిపూర్ణమైన, త్యాగపూరితమైన, షరతులు లేని ప్రేమను చూపిస్తాడు. పిల్లల పట్ల ఆయనకున్న ప్రేమను బట్టి శిక్షణ ఇస్తాడు, సరిచేస్తాడు, క్రమశిక్షణలో పెడతాడు (హెబ్రీయులకు 12:5-7). తండ్రి/కుమారుడు మధ్య ఉన్న సంబంధం నేపథ్యంలోనే, ఆయన స్వరూపంలోనికి మార్చుకోవడానికి విశ్వాసుల జీవితాల్లో పని చేసి చేస్తాడు (హెబ్రీయులకు 12:10-11).

తల్లిదండ్రులు చూపించే ప్రేమ పిల్లల ప్రవర్తన మీద ఆధారపడడం మంచిది కాదు. నిజానికి, మంచి ప్రవర్తనకు బహుమతులివ్వడం లేక చెడు ప్రవర్తనకు శిక్షించడం పిల్లలకు ఇచ్చే శిక్షణలో భాగమే, కాని ప్రవర్తనను బట్టి ప్రేమించడం లేక ప్రేమించకపోవడమనేది మంచిది కాదు.

పిల్లవాడు తన తల్లిదండ్రుల ప్రేమను షరతులు లేకుండా అనుభవించినప్పుడు, దేవుని ప్రేమను సులభంగా అర్థం చేసుకుని నమ్మగలడు. అయితే, చిన్నతనంలో వేధింపులకు గురై, నిర్లక్ష్యం చేయబడిన పిల్లలు, పెద్దయ్యాక కూడా దేవుని అర్థం చేసుకోవడం, ఆయనను నమ్మడం చాలా కష్టం.

పిల్లలు తమ్ముతామును అర్థం చేసుకునే విధానం-వ్యక్తిగతంగా తమ విలువను గుర్తించుకోవడం-ఎక్కువగా ఇతరులు చెప్పే మాటల ద్వారా, ఇతరుల నుండి పొందుకునే అనుభవాల ద్వారా ఏర్పడుతుంది. తల్లిదండ్రులు చెప్పే మాటలు, చేసే పనులు వారి మీద గొప్ప ప్రభావం చూపిస్తాయి, అయితే బంధువులు మిత్రులు కూడా ప్రభావితం చేస్తారు. పిల్లలు తమకు అవసరమైన ప్రేమను పొందినా లేక పొందకపోయినా, అది వారి స్వీయ-చిత్రం (self-image) మీద ప్రభావం చూపిస్తుంది. పిల్లల్ని ప్రేమించనప్పుడు, లేక వారు భావోద్వేగ లేక శారీరక వేధింపులకు గురైనప్పుడు, అది వారి జీవితమంతా ప్రభావితం చేసే విధంగా స్వీయ-విలువను దెబ్బతీస్తుంది.

తల్లిదండ్రుల మాటలు, పిల్లలు స్వీయ అవగాహనను ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు:

- **ధృవీకరణ మాటలు:** "నువ్వు కష్టపడి పనిచేస్తున్నందుకు నాకు చాలా గర్వంగా ఉంది! నువ్వు తప్పక విజయం సాధించగలవని నాకు తెలుసు!" దీని ద్వారా, కష్టానికి విలువ ఉందని, వారు విజయం సాధించగలరన్న నమ్మకం మీకు ఉందని పిల్లలకు అర్థమౌతుంది.
- **గాయపరిచే మాటలు:** "నువ్వు చాలా సోమరిపోతువు. కాబట్టి ఏ విషయంలో నీ మీద ఆధారపడలేను!" అని చెప్పినప్పుడు పిల్లలు, ఇంకా మారలేమని అనుకుంటారు; మారడానికి లేక గౌరవాన్ని పొందుకోవడానికి ఏం

చెయ్యలేము ఎందుకంటే ఇప్పటికే నన్ను విడిచిపెట్టేశారని అనుకుంటారు. మీరు వారిని తిరస్కరించారని కూడా భావిస్తారు.

- **ధృవీకరణ మాటలు**: "ఫర్వాలేదు. కొన్నిసార్లు మనందరం తప్పులు చేస్తుంటాం, ఆ తర్వాత ఇంకా మంచిగా బాగా ఎలా చెయ్యాలో నేర్చుకుంటాం." తప్పులు చెయ్యడం సహజమే-వారి పట్ల మీ ప్రేమ వారి పరిపూర్ణ ప్రదర్శన మీద ఆధారపడదు- అని పిల్లలకు అర్థమౌతుంది. ప్రయత్నించడానికి కారణాలు ఉన్నాయని, వారు ఎదగాలని కూడా పిల్లలు అర్థం చేసుకుంటారు.
- **గాయపరిచే మాటలు**: "నువ్వు మూర్ఖుడివి. ఎప్పుడు గందరగోళం చేస్తావు." పిల్లలు, ప్రయత్నించడం వలన ఉపయోగం లేదని అనుకుంటారు. వారి విలువ వారు చేసే పని మీద ఆధారపడి ఉందని భావిస్తారు; వారు ఎల్లప్పుడు వైఫల్యం చెందుతూ ఉంటారు గనుక విలువలేదని అనుకుంటారు. మీ ద్వారా లేక ఇతరుల ద్వారా ప్రేమను పొందుకునే అర్హత లేదనుకుంటారు.

ఒక పిల్లవాడు తననుతాను ఒక వ్యక్తిగా అర్థం చేసుకునే విధానం, అతడు పొందుకునే లేక పొందుకొనని ప్రేమ ద్వారా రూపుదిద్దుకుంటుంది. ఇతరులతో ఆరోగ్యకరమైన బంధాలు పెట్టుకున్నాడా లేదా అనే విషయం తల్లిదండ్రులతో తనకున్న బంధం మీద ఆధారపడి ఉంటుంది. బాగా ప్రేమ పొందుకున్నవాడు ఇతరుల్ని నిస్వార్థంగా, షరతులు లేకుండా ప్రేమిస్తాడు. అతడి గుండె నిండా ప్రేమ ఉంటుంది, ఆ ప్రేమను పంచిపెడతాడు.

పెద్దలవలనే, నిజమైన ప్రేమ అనేది పిల్లలకు కూడా భావోద్వేగ ఇంధనం వంటిది.

**భావోద్వేగ ఇంధన ట్యాంక్ నింపబడడం వలన కలిగే ప్రయోజనాలు**

భావోద్వేగ ఇంధన ట్యాంక్ నింపబడడం వలన పిల్లలు అనేక ప్రయోజనాలను పొందుకుంటారు. పిల్లలు ప్రేమను అనుభవించినప్పుడు, సవాళ్లు ఎదుర్కోవడానికి, అభివృద్ధి చెందడానికి బలంగా, స్థిరంగా ఉంటారు.

షరతులు లేకుండా ప్రేమను పొందుకునే పిల్లలు మానసికంగా బలంగా ఉంటారు. దీని కారణంగా, వారు తల్లిదండ్రుల క్రమశిక్షణను, దిద్దుబాటును, నడిపింపును అంగీకరిస్తారు. తోటివారు కలిగించే ఒత్తిళ్ళను సైతం ఎదురించగలుగుతారు ఎందుకంటే వారెవరో వారికి తెలుసు గనుక, ఇతరులకు నిరూపించుకోవాల్సిన అవసరం లేదనుకుంటారు.

అబ్బాయిలతో తరచుగా సరసాలాడే అమ్మాయి, బహుశా వాళ్ళు తనని ఇష్టపడరేమో లేదా పట్టించుకోరేమో అని భయపడి అలా ప్రవర్తించవచ్చు. ఇంకొందరు అమ్మాయిలు అబ్బాయిల పట్ల సిగ్గుపడతారు, ఎందుకంటే వాళ్ళు తమ నిజమైన వ్యక్తిత్వాన్ని బయటపెడితే వాళ్ళు ఇష్టపడరేమో అని వాళ్ళు భయపడతారు. కానీ, తమ తండ్రుల నుండి

మెప్పు, ఆప్యాయత పొందే కూతుర్లు అబ్బాయిలతో ఆరోగ్యకరమైన రీతిలో, సరసాలాడకుండా లేదా సిగ్గుపడకుండా మెలుగుతారు. ఎందుకంటే వాళ్ళ తండ్రి ప్రేమ వల్ల వాళ్ళు తమ గుర్తింపులో సురక్షితంగా ఉంటారు. వాళ్ళకి తమ గురించి ఒక స్పష్టమైన, భద్రమైన భావన ఉంటుంది.

ఐదు ప్రేమ భాషల్లో తరచుగా తల్లిదండ్రులు నిజమైన షరతులు లేని తమ ప్రేమను పిల్లలపై చూపినప్పుడు, ప్రమాదాల నుండి కాపాడబడతారు. సహజంగా ప్రేమను పొందుకునే పిల్లలు, హాని కలిగించే వ్యక్తుల నుండి ప్రేమను, భద్రతను ఆశించరు.

సంక్షిప్తంగా, భావోద్వేగ ఇంధన ట్యాంక్ నింపబడడం వలన పిల్లలకు అనేక లాభాలు ఉన్నాయి:

- ఒకరి విలువను, దాని మూలాన్ని సరిగా అర్థం చేసుకుంటారు.
- ప్రయత్నం, తప్పులు, ఎదుగుదల, షరతులు లేని ప్రేమను సరిగా అర్థం చేసుకుంటారు
- ఇతరుల్ని ప్రేమించడం నేర్చుకోగలుగుతారు
- సవాళ్లను ఎదుర్కోవడానికి, అభివృద్ధి చెందడానికి కావాల్సిన బలం, స్థిరత్వం ఉంటుంది
- భావోద్వేగ భద్రత
- క్రమశిక్షణ, దిద్దుబాటు, నడిపింపును అంగీకరించగలరు
- తోటివారి తప్పుడు ప్రభావాలను తిరస్కరించగలరు
- భవిష్యత్తు బంధాల్లో వేధింపులకు గురికాకుండా ఉంటారు

► ప్రేమను పొందుకోవడం ద్వారా, పిల్లలు ఇంకా ఏ రకంగా మేలు పొందుతారు?

### భావోద్వేగ ఇంధన ట్యాంక్ నింపబడనప్పుడు కలిగే నిష్ప్రయోజనాలు

ప్రేమ పొందటం లేదని అనిపించే పిల్లలు నడిపింపును అంగీకరించరు, ఎందుకంటే తమ తల్లి లేక తండ్రిని మెప్పించాలన్న కోరిక వారిలో ఉండదు. భావోద్వేగ ఇంధన ట్యాంక్ నింపబడనప్పుడు, చాలామంది పిల్లలు తమను నడిపించే తల్లి/తండ్రితో బలమైన, అనుకూలమైన విశ్వాస బంధాన్ని కలిగి ఉండరు.

కుటుంబ సభ్యులతో ఆరోగ్యకరమైన, ప్రేమగల బంధాలను కలిగియుండే పిల్లల కంటే తమ భావోద్వేగ ఇంధన ట్యాంకులు ఖాళీగా ఉన్న పిల్లలు, వేధింపులకు ఎక్కువగా గురౌతారు. ప్రేమ పొందకపోవడం వలన, వాడుకుని వారికి హాని కలిగించే ప్రజల నుండి ప్రేమ కోరుకుంటారు.

## బలమైన కుటుంబాలకు ఉండే లక్షణాలు

ఈ పాఠాల్లో, ఐదు ప్రాథమిక ప్రేమ భాషలు గురించి నేర్చుకున్నాం. సహజంగా ప్రతి ఒక్కరికి ఒకటి లేక రెండు ప్రాథమిక ప్రేమ భాషలున్నప్పటికీ, ప్రతి ఒక్కరు ఎల్లప్పుడు ఈ ఐదు ప్రేమ భాషల్లో ప్రేమను పొందుకోవాలి. ఆరోగ్యకరమైన కుటుంబంలో, ప్రతి ఒక్కరు ప్రతి రోజు ధృవీకరణ మాటలు మాట్లాడతారు, నాణ్యమైన సమయం గడుపుతారు, సేవా కార్యాలు చేస్తారు, శారీరక స్పర్శ ఇస్తారు తద్వారా ఉద్దేశ్యపూర్వకంగా బంధాలను సంరక్షిస్తారు. ఒకరికొకరు బహుమతులు ఇచ్చువడం ప్రతి రోజు జరిగే పని కాదుగాని ఆరోగ్యకరమైన కుటుంబాల్లో ఇది కూడా ఒక ముఖ్య భాగం.

► మీ కుటుంబాల్లో ప్రేమను ఎక్కువగా ఎలా చూపిస్తారు? ఐదు భాషల్లో చూపిస్తారా? ఎంత తరచుగా ప్రేమను పంచుకుంటారు?

మతాన్ని ఆధారంగా పెట్టుకోకుండా 25 సంవత్సరాల పాటు 14,000 కుటుంబాలపై చేసిన ఒక పరిశోధన ప్రకారం, వివిధ సాంస్కృతిక నేపథ్యాల నుండి వచ్చిన ఆరోగ్యకరమైన, విజయవంతమైన, సమతుల్య కుటుంబాల్లో ఆరు సాధారణ లక్షణాలు ఉన్నాయి.[36] ఈ ఆరు లక్షణాల్లో కొన్ని నేరుగా ప్రేమ భాషలతో సంబంధం కలిగియున్నాయి, ప్రేమను వివిధ రకాలుగా చూపించడం ఎంత ముఖ్యమో ఇవి నొక్కి చెబుతాయి. స్టిన్నెట్ మరియు బీమ్ ఈ ఆరు లక్షణాలను మరియు వాటి వివరణలను ఇచ్చారు:

1. **సమర్పణ.** బలమైన కుటుంబ సభ్యులు ఒకరికొకరి మేలు కోసం, సంతోషం కోసం కృషి చేయడానికి కట్టుబడి ఉన్నారు. వారు కుటుంబ ఐక్యతను విలువిస్తారు.

2. **అభినందించడం, ఆప్యాయత చూపడం.** బలమైన కుటుంబ సభ్యులు తరచుగా ఒకరికొకరు అభినందించుకుంటూ ఉంటారు. వారి కుటుంబం మంచిదని భావిస్తారు.

3. **అనుకూల సంభాషణ:** మంచి కుటుంబ సభ్యులు, మంచి సంభాషణ నైపుణ్యాలు కలిగియుంటారు, ఒకరికొకరు మాట్లాడుకుంటూ అధిక సమయం గడుపుతారు.

4. **కలిసి గడిపే సమయం.** బలమైన కుటుంబ సభ్యులు కలిసి సమయం -దాతృత్వంగా విలువైన సమయాన్ని- గడుపుతారు.

---

[36] Dr. Nick & Nancy Stinnett and Joe & Alice Beam, *Fantastic Families: 6 Proven Steps to Building a Strong Family*, (Brentwood, TN: Howard Books, 2008)

5. **ఆత్మీయాభివృద్ధి.** మతపరమైన కార్యక్రమాలకు వెళ్లినా వెళ్లకపోయినా, బలమైన కుటుంబాలు, జీవితంలో దేవుని పట్ల గొప్ప విశ్వాసాన్ని కలిగి ఉంటారు నమ్మకమే వారిని బలపరుస్తుంది, ఉద్దేశ్యాన్ని ఇస్తుంది.

6. **ఒత్తిడి, సంక్షోభాన్ని ఎదుర్కొనే సామర్థ్యం.** బలమైన కుటుంబ సభ్యులు ఒత్తిడి లేక సంక్షోభాన్ని అభివృద్ధి చెందడానికి అవకాశాలుగా చూస్తారు.

## వ్యక్తిగత అన్వయం

ఈ రెండు పాఠాల్లో, అనేక విషయాలను గురించి మనం నేర్చుకున్నాం. నిజమైన ప్రేమ గురించిన చర్చతో ప్రారంభించాం, సహజంగా ప్రేమను చూపించే ఐదు ప్రేమ భాషల్ని గుర్తించాం. భావోద్వేగ ఇంధన ట్యాంక్ గురించి, మన కుటుంబ సభ్యులు వారి ప్రాథమిక ప్రేమ భాషలో ప్రేమను పొందుకోవలసిన అవసరత గురించి నేర్చుకున్నాం. కుటుంబ సభ్యుల్లో ఉన్న భిన్న వ్యక్తిత్వాల కారణంగా ప్రేమలో ఎలా ఎదగగలమో చూశాం.

ఆ తర్వాత, ఐదు ప్రేమ భాషల్ని లోతుగా అన్వేషించాం, ప్రతి ఒక్కదానికి ఉదాహరణలు చూశాం, వాటిని నిర్లక్ష్యం చేసినప్పుడు లేక దుర్వియోగం చేసినప్పుడు కలిగే ప్రమాదాలు గురించి నేర్చుకున్నాం. భావోద్వేగ ఇంధన ట్యాంకులు నిండి ఉన్నప్పుడు పిల్లలు ఎలా మేలు పొందుకున్నారో, భావోద్వేగ ఇంధన ట్యాంకులు ఖాళీగా ఉన్నప్పుడు ఎలా బాధపడ్డారో చూశాం. మన పిల్లలకు ప్రేమను ఎలా వ్యక్తపరచాలో లోతుగా చర్చించాం. ఆ తర్వాత, ప్రేమకు ఐదు భాషలు పాటించడం, బలమైన కుటుంబాల్లో ఉండే ఆరు సహజ లక్షణాలకు ఎలా అనుసంధానం ఉందో కూడా చూశాం.

ఈ పాఠాల్ని ముగించుకునే ముందు, మీ వ్యక్తిగత బాధ్యత గురించి చర్చించుకుందాం-మీరు నేర్చుకున్న విషయాల ఆధారంగా మీరు ఏం చేయగలరు మరియు ఏం చేయాలి.

### (1) మీ కుటుంబ సభ్యుల్ని ప్రేమించే బాధ్యత మీకుంది.

మీ కుటుంబ సభ్యులు మిమ్మల్ని ప్రేమించేవరకు వేచి ఉండకుండా, మీరు అవసరమైన మార్పులు చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలి. నిజమైన ప్రేమ, ఎదుటివాడు ప్రేమ చూపించే వరకు వేచి ఉండదు. ఎదుటి వ్యక్తి ప్రేమను పొందడానికి అర్హుడు కాకపోయినా ప్రేమ చూపిస్తుంది, ఎందుకంటే ప్రేమ దానిని పొందుకునే వ్యక్తి యొక్క విలువ మీద ఆధారపడదు.

**(2) మీ కుటుంబానికి అత్యంత ముఖ్యమైన రీతిలో ప్రేమను వ్యక్తపరచడానికి మీవంతు శ్రద్ధతో ప్రయత్నించవలసిన బాధ్యత మీపై ఉంది.**

మనకు అలవాటు లేని భాషలో ప్రేమను వ్యక్తపరచడానికి మనం మరింత కృషి చేయాల్సి ఉంటుంది. ప్రారంభంలో, ప్రేమను వ్యక్తపరిచే కొన్ని పద్ధతులు మీకు సహజంగా అనిపించకపోవచ్చు, కొంచెం ఇబ్బందిగా లేదా విచిత్రంగా కూడా అనిపించవచ్చు.

మీ కుటుంబ సభ్యులకు ప్రేమ చూపించే అవకాశాలు గమనించడం నేర్చుకోవాలి. మీ కటుంబ సభ్యులకు ఆ సమయంలో ఏది అవసరమో శ్రద్ధగా గ్రహించాలి. ప్రతి ప్రేమ భాషకు కొన్ని ఉదాహరణలు ఇక్కడ ఉన్నాయి:

- **ధృవీకరణ మాటలు:** ఆలోచించు, "________బహుశా ఇప్పుడు చెప్పిన దాని గురించి అతడు నిశ్చయతతో లేడు. కాని అతడు చెప్పింది నిజమే. నేను **దృఢపరచే** విషయం చెప్పాలి."
- **నాణ్యమైన సమయం**: ఇలా అడగండి, "దాని గురించి మాట్లాడాలని అనుకుంటావా**?"** ఆ తర్వాత మీరు చేస్తున్న పనిని ఆపి, మీ సంపూర్ణ శ్రద్ధను ఇవ్వండి, నిజంగా వింటున్నారని మీ శరీర భాష ద్వారా చూపించండి.
- **బహుమతులు: బహుమతి** ఇస్తుండగా, "ఇది చూడగానే, నువ్వే గుర్తుకువచ్చావ్" అని చెప్పండి.
- **సేవా కార్యాలు:** యెగిరి, అడగండి "నేనది అందించనా?" లేక "నీకు సహాయం చెయ్యనా?"
- **శారీరక స్పర్శ**: వాళ్ల దగ్గరకు వెళ్లి, వాళ్లని హత్తుకొంటూ "నీకు కౌగలింత అవసరం" అని చెప్పండి.

**(3) మీ భావోద్వేగాలకు మీరే బాధ్యులు**

మనం ఇతరులతో ఆరోగ్యకరమైన బంధాలు కలిగి ఉండే విధంగా దేవుడు మిమ్మల్ని సృజించాడు. కాని అది సాధ్యమైనా కాకపోయినా, దేవుడే మీకు ఆధారం, సంతృప్తి కలుగజేయువాడు. మీ భావోద్వేగ శ్రేయస్సుకు మీ కుటుంబం పూర్తిగా బాధ్యత వహించదు. దేవుడే పరిపూర్ణంగా ప్రేమించగలడు, మరెవ్వరు అలా ప్రేమించలేరు. ఆయన ప్రేమలో అంటుకట్టబడి ఉన్నప్పుడు, హృదయంలో ఉండే ఏ లోటైనా ఆయన తీర్చగలడు (యోహాను 15:9-11).

మీ ప్రాథమిక ప్రేమ భాషలో మీ కుటుంబం మిమ్మల్ని ప్రేమించలేకపోవచ్చు. మీ ప్రాథమిక ప్రేమ భాష, మీ భావోద్వేగ అవసరత వారికి తెలీకపోవచ్చు. మీకు ఇష్టమైన రీతిలో ప్రేమను చూపించలేకపోవచ్చు. మీరెలా ప్రేమ పొందుకోగలరో వారికి మీరు వివరించియుండవచ్చు. కాని ఆ విధంగా ప్రేమ చూపించాలని మీరు వారిని బలవంతం చేయలేరు.

బహుశా మీ కుటుంబం ఇతర మార్గాల్లో ప్రేమ చూపిస్తుండవచ్చు. ప్రేమ భాషలు గురించి తెలుసుకునే కొద్దీ, వారు చూపించే ప్రేమను మీరు అర్థం చేసుకోగలరు. వారిని మీరు మార్చలేరు కానీ వారు చూపించే ప్రేమను అంగీకరించి, ఆ ప్రేమకు కృతజ్ఞులుగా ఉండగలరు.

## ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ,

నాకు నా కుటుంబాన్ని ఇచ్చినందుకు వందనాలు. నేను విలువ ఇవ్వవలసిన రీతిలో వారికి విలువ ఇచ్చేలా, మరియు ఒకొక్కరితో మంచి సంబంధం కలిగి ఉండేలా సహాయం చేయండి.

నా కుటుంబానికి నా ప్రేమను చూపించే విధానలను పరిశీలించుకునే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. యేసువలె మారడానికి సహాయం చేయండి: నా సమయాన్ని, మానసిక మరియు శారీరక శక్తిని, నాకున్న వనరులను నా కుటుంబ దీవెనకై, దాని ప్రోత్సాహానికై ఇచ్చేందుకు సహాయం చేయండి. నా సొంత అవసరాలు కంటే ఇతరుల అవసరాలకు ప్రాధన్యత ఇచ్చే వినయముగల మనసు నాకు దయచేయండి. ప్రతి కుటుంబ సభ్యునికి ప్రేమను చూపించే అవకాశాలు గమనించేలా సహాయం చేయండి.

నిజమైన ప్రేమను నాకు చూపించావు. నీవు నాకు చూపించిన ప్రేమ ప్రకారంగా నా కుటుంబమును ప్రేమించాలని ఆశపడుతున్నావు. నేను నా జీవిత భాగస్వామిని, పిల్లలను నిస్వార్థ, భేషరతు ప్రేమతో ప్రేమించాలను ఆశపడుతున్నాను. నేను విఫలమైన మార్గాల్లో నన్ను కనికరించి, కృప చూపుము. ప్రేమించవలసిన రీతిలో వారిని ప్రేమించడానికి సహాయం చేయండి.

ఆమెన్

## పాఠం అభ్యాసాలు

(1) మీ జీవిత భాగస్వామి, మీ పిల్లల ప్రాథమిక ప్రేమ భాష గురించి ఆలోచన చేయండి. మీ కుటుంబ సభ్యుల పేర్లు రాయండి. ప్రతి ఒక్కరి ప్రేమ భాషలు ఒకటి లేక రెండు రాయండి.

(2) ఏ ప్రేమ భాషకు, మీ అదనపు కృషి అవసరం? వాటిని గుర్తించండి. ఈ విధానాల్లో మీ కుటుంబీకులకు ప్రేమను ఎలా చూపించగలరో కొన్ని ఆలోచనలు రాయండి.

(3) మీ సంస్కృతి గురించి, మరిముఖ్యంగా మీ సొంత సమాజం బృందాన్ని పరిశీలించండి. ఐదు ప్రేమ భాషల జాబితా చేయండి. మీ సంస్కృతిలో, ప్రతి ప్రేమ భాష ఎలా వ్యక్తీకరించబడుతుంది? ఈ ఐదింటిలో విస్మరించబడేవి ఏవైనా ఉన్నాయా? మీ సంస్కృతిలో సహజంగా కనిపించే దానికంటే ఉత్తమమైన మార్గాల్లో ప్రేమను చూపించగల కొన్ని ప్రత్యేక పద్ధతులు ఏంటి? ఈ ప్రశ్నలకు జవాబిస్తూ అనేక పేరాలు రాయండి.

# పాఠం 10

# సంతానలేమి సమస్య

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) గొడ్రాలితనం గురించి బైబిలు అభిప్రాయాన్ని అర్థం చేసుకుని, స్పందించాలి.

(2) ప్రతి వ్యక్తిని దేవుని స్వరూపిగా గుర్తించి విలువివ్వాలి.

## బుసాబా యొక్క దుఖం

బుసాబా ఆసియా దేశంలో పుట్టింది. ఒక యువ వ్యాపారవేత్తను పెళ్లి చేసుకున్నప్పుడు, ఇద్దరూ కలిసి ఆనందకరమైన జీవితం గడుతామనే ఆశతో ఆమె చాలా సంతోషించింది. కొన్ని సంవత్సరాలు గడిచాయి, బుసాబాకు పిల్లలు పుట్టలేదు. బుసాబాకు పిల్లలు పుట్టడం సాధ్యం కాదని వైద్యుడు చెప్పాడు. అప్పుడు ఆమె భర్తకు బాధ కలిగింది, కోపం వచ్చింది. అప్పుడు బుసాబాకు విడాకులు ఇచ్చి, వేరొక స్త్రీని వివాహం చేసుకుందామని అనుకున్నాడు. ఇప్పుడు బుసాబా వయస్సు పెరిగిపోయింది. ఒంటరిగా ఒక చిన్న ఇంట్లో ఉండేది, బంధువులు కూడా ఎవరు పట్టించుకోవట్లేదు. ఆమె భౌద్ధమతానికి చెందినది గనుక, భవిష్యత్తు ఏదొక రోజు పిల్లలు పుడతారు, ఇక అవమానం ఉండదని ఆమె ఆశించింది.

► ఒకవేళ మీరు బుసాబా ఉండే సమాజంలో ఒక పాస్టర్ అయితే, ఆమెకు ఏం చెబుతారు? మీరు బుసాబాకి ఇచ్చే క్రైస్తవ సందేశం ఏంటి?

ఈ పాఠంలో, సంతానలేమి సమస్యలకు బైబిలు ఎలా స్పందిస్తుందో చూద్దాం.

## పిల్లలు మరియు దేవుని ఆశీర్వాద కార్యం

దేవుడు మొదటి పురుషుడిని, స్త్రీని చేసిన తక్షణమే, పిల్లల్ని కని, అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నింపమని చెప్పాడు (ఆదికాండము 1:28).

పాత నిబంధనలో, దేవుడు కొన్నిసార్లు ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబంలోని అనేక తరాలను ఆశీర్వదించాడు. ఉదాహరణకు, దేవుడు అబ్రాహాముకు ఇచ్చిన ఆశీర్వాదాలు కేవలం అబ్రాహాముకే కాదు కాని తరువాత వచ్చే తరాలకు

కూడా వర్తిస్తాయి. అబ్రాహాము సంతానం సముద్ర ఇసుక రేణువులవలె ఉంటారని దేవుడు వాగ్దానం చేశాడు. అద్భుతరీతిగా శారా, ఇస్సాకును గర్భం దాల్చింది. కాలక్రమేణా కుటుంబం విస్తరించింది, తరాలు పెరిగాయి, తద్వారా దేవుడు తన వాగ్దానాన్ని నెరవేరుస్తున్నాడని స్పష్టమైంది.

నిర్గమకాండము 23:25-27లో దేవుడు, ఇశ్రాయేలు నూతన వాగ్దాన భూమిలోనికి వెళ్ళినప్పుడు వారిని దీవిస్తానని చెప్పాడు. వారి ఆహారాన్ని దీవిస్తానని, వారి మధ్య నుండి రోగాలు తొలగిస్తానని, కడుపు దిగబడడంగాని గొడ్డుదిగాని వారి దేశంలో ఉండదని, శత్రువులను నాశనం చేస్తానని దేవుడు ఇశ్రాయేలుకు వాగ్దానం చేశాడు. ఈ వాగ్దానాలు ఇశ్రాయేలీయుల విధేయతపై ఆధారపడి ఉన్నాయి. దేవుడు తన షరతులను వివరించాడు (నిర్గమకాండము 23:32లోని ఆజ్ఞ వంటివి). వాగ్దానాలు వ్యక్తిగతంగా కాకుండా దేశమంతటికి ఇచ్చాడు. దేశమంతటి విధేయత లేక అవిధేయత వ్యక్తుల మీద (ఒకొక్కరి మీద) ప్రభావం చూపిస్తుంది. ఉదాహరణకు, ఒక వ్యక్తికి అనారోగ్యం రావచ్చు, లేక స్త్రీకి పిల్లలు లేకపోవచ్చు అందుకు కారణం వారు చేసిన పాపం కాదుగాని దేశమంతా దేవునికి అపనమ్మకం చూపడం వలన కలుగుతుంది. కాబట్టి, సంతానం లేకపోవడం స్త్రీ చేసిన పాపానికి శిక్ష కాదు.

ద్వితీయోపదేశకాండము 7:12-15లో ఇశ్రాయేలుకు చేసిన వాగ్దానాలను చూస్తాం. మానవులకుగాని జంతువులకుగాని రోగం ఉండదు, గొడ్డుతనముండదు. ఇశ్రాయేలీయులు దేవునికి విధేయులైనప్పుడు, ఆయన తమ పితరులతో ప్రమాణం చేసిన నిబంధనను నెరవేర్చి ఆశీర్వదిస్తాడని 12వ వచనం మాట్లాడుతుంది. ఒకవేళ ఇశ్రాయేలీయులు దేవుని పట్ల అపనమ్మిక చూపితే, కొందరు బీదలౌతారు, కొందరు స్త్రీలు సంతానలేమితో బాధపడతారు.

దేవుడు తన ప్రజలపట్ల కలిసియున్న ప్రణాళికలో పిల్లలు ముఖ్యులు. ఈ కోర్సులోని ఇతర భాగాల్లో, పిల్లలు దేవుని స్వరూపంలో సృజించబడిన కారణాన్ని బట్టి వారికి ఎంత విలువ ఇవ్వాలో మాట్లాడుకున్నాం. ప్రతి బిడ్డ విలువైనవాడు గనుక వారిని ప్రేమగా, శ్రద్ధగా చూడాలి. అయితే, కొంతమంది భవిష్యత్తులో తమ కుటుంబాన్ని బలంగా ఉంచగలరనే ఉద్దేశ్యంతో పిల్లలకు విలువిస్తారు. కొన్నిసార్లు, పిల్లవాడు తన తండ్రి గుర్తింపును ముందుకు తీసుకెళతాడు గనుక తండ్రి వాడికి విలువిస్తాడు. అయితే దేవుడు తన సొంత ఉద్దేశ్యాల కోసం బిడ్డల్ని ఇస్తున్నాడని మనం గుర్తుంచుకోవాలి (మలాకీ 2:15).

► ఒకరు కీర్తన 127:3-5 బిగ్గరగా చదువుతుండగా మిగిలినవారంతా వాక్య భాగంలోకి చూడాలి.

పిల్లలు యెహోవా ఇచ్చు ఆశీర్వాదమని ఈ వాక్యం సెలవిస్తుంది. వారు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యం. ఆయన ఇచ్చు బహుమానం. వారు భవిష్యత్తులో కుటుంబానికి రక్షణ, భద్రతను అందిస్తారు.

కొన్నిసార్లు, లేఖనంలో రెండు ఆశీర్వాదాలు - దీర్ఘాయువు, తరాలను చూడడం- గురించి ఒకేసారి ప్రస్తావించబడుతుంది. యోబు ఆశీర్వదించబడినవాడు ఎందుకంటే అతనికి పదిమంది పిల్లలు, అలాగే కుమారులను, కుమారుల కుమారులను నాలుగు తరాలవరకు చూశాడు (యోబు 42:13, 16). కీర్తన 128:6 లోని ఆశీర్వాదం ప్రకారం, మనవళ్లు మనవరాళ్లను చూడడం దేవుడు అనుగ్రహించిన గొప్ప వరం.

దేవుడు యెహోనాదాబు కుటుంబాన్ని ఆశీర్వదించి, ప్రతి తరాన్ని నడపడానికి సంతతివాడు ఎన్నడు ఉండకుండా మానడు అని వాగ్దానం చేశాడు (యిర్మీయా 35:19). అలాగే, నీ సంతానం నీ రాజ్యం నిత్యం స్థిరపడుతుందని దేవుడు రాజైన దావీదు కుటుంబాన్ని ఆశీర్వదించాడు (2 సమూయేలు 7:16).

కాబట్టి, దేవుడు కుటుంబానికి ఇచ్చే ఆశీర్వాదాల్లో పిల్లలు కూడా భాగమని, పిల్లల ద్వారానే దేవుని ఆశీర్వాదాలు తరతరాలకు కొనసాగుతాయని మనం చూశాం.

### గొడ్రాలితనం గూర్చి బైబిలు అవగాహన

కొన్ని సందర్భాల్లో పిల్లలు లేకపోవడం దేవుని శాపానికి సాదృశ్యం. దేవుడు పిల్లలు కలుగకుండా కుటుంబాల్ని శపించిన సందర్భాల గురించి బైబిలు మాట్లాడుతుంది. ఉదాహరణకు, అబీమెలెకు తప్పు చేశాడు గనుక తన తప్పును సరిదిద్దుకునే వరకు దేవుడు తన ఇంటిలో ప్రతి గర్భాన్ని మూసివేశాడు (ఆదికాండము 20:18). ఇక్కడ స్త్రీలు తప్పు చేయలేదు గాని రాజు చేసిన పాపానికి శిక్ష అనుభవించారు.

ఆదాము, హవ్వ పాపం చేసిన తర్వాత, వారి పాప ప్రభావం లోకమంతటిమీద పడుతుందని దేవుడు చెప్పాడు. ఆ శాపం కారణంగా, బంధాల్లో కష్టాలు ఉంటాయి, పిల్లలకు జన్మనిచ్చేటప్పుడు వేదన, బాధ కలుగుతుంది, ప్రయాసపడాలి, భూమి సాగు చేయడానికి సహకరించదు, చివరికి మరణం వస్తుంది (ఆదికాండము 3:14-19). ఆదాము మొదలుకొని ప్రతి మానవుడు, వ్యక్తిగతంగా పాపాలు చేయకమునుపే పుట్టుకతోనే శాపం అనుభవిస్తున్నాడు. పాప రహితుడైన యేసు సైతం, శాపానికి లోనైన మానవ శరీరంలోనే భూలోకానికి వచ్చాడు. కాబట్టి, ఒక వ్యక్తి బాధ అనుభవించడానికి కారణం అతను చేసిన తప్పేనని మనం చెప్పకూడదు. మనందరం వృద్ధులౌతాం, అనారోగ్యానికి గురౌతాం, అనేక విధాలుగా బాధపడతాం, చివరికి మరణిస్తాం. పిల్లలు కనడంలో ఉండే సమస్యలతో సహా ఈ సమస్యలన్ని ఆదాము చేసిన మొదటి పాపం ఫలితంగా వచ్చాయి.

ఆదాము చేసిన పాపంతో పాటుగా, మన పూర్వికుల పాప ప్రభావం కూడా మనపై ఉంటుంది ఎందుకంటే వారి చర్యలు ప్రభావితం చేసిన సమాజంలోనే మనం పుట్టాం. మన కుటుంబస్తుల పాపం, మన సమాజం, మన దేశం చేసిన పాపం మనపై ప్రభావం చూపిస్తుంది. లోకంలో ప్రతిచోట ఉన్నటువంటి విశ్వాసులు వారు నియంత్రించలేని సమాజం సృష్టించిన

షరతులను అనుభవిస్తున్నారు. స్వేచ్ఛ, అవకాశాలు లేని సమాజంలో ఉండడం వలన కుటుంబాలు పేదరికాన్ని అనుభవించవచ్చు. ఒక శిశువు తాను చేయని తప్పువలన కూడా శారీరక లోపంతో పుట్టొచ్చు (యోహాను 9:1-3).

దేవుడు కొందరికి పిల్లల్ని ఇవ్వడానికి లేక మరికొందరికీ పిల్లల్ని ఇవ్వకపోవడంలో ఆయన ఉద్దేశ్యం ఏంటో మనకు తెలియదు. కొన్నిసార్లు ప్రజల నిర్లక్ష్యంతో, తిరుగుబాటు ధోరణితో పాపం చేయడంవల్ల అనేకమంది పిల్లల్ని కని, దేవుని మహిమపరిచే విధానంలో వాళ్ళను పెంచరు (కీర్తన 17:14). కొన్నిసార్లు, నమ్మకంగా జీవించే విశ్వాసులకు సంతానం కలగదు. కాబట్టి ఎవరికైన సంతానం లేనప్పుడు అది వారి పాప ఫలితమని మనం ఎన్నడు భావించకూడదు.

దేవుడు ఏ సమయంలోనైనా స్వస్థత ఆశీర్వాదం ఇవ్వగలడు కాని సాధారణంగా, విశ్వాసులు ఈ లోక పరిస్థితుల్ని భరించాలి. దేవుడు తన సృష్టిని పునరుద్ధరించే సమయం కోసం విశ్వాసంతో వేచి చూడాలి (రోమా 8:18-23).

పిల్లలు లేనందువల్ల స్త్రీని నిందించడం అన్యాయం. అలాగే, శిశువు గర్భంలోనే మరణిస్తే, ఆ మరణానికి తల్లి కారణం కాదు. ఆదాము చేసిన పాపం, ఇతరులు చేసిన పాపం వలన మరియు లోక సహజ పరిస్థితులను బట్టి వ్యక్తులు బాధపడుతుంటారు. ప్రతి ఒక్కరు పాపం చేశారు గనుక లోక పరిస్థితికి స్వరమానవాళి బాధ్యత వహిస్తుంది, కాని ప్రజల బాధలు వివిధ రకాలుగా ఉంటాయి.

## దేవుని అద్భుతాలు

యేసు స్వస్థపరచినప్పుడు, ఇతర అద్భుతకార్యాలు చేసినప్పుడు దేవుని ప్రేమ చూపించాడు. బైబిలు చరిత్ర అంతటిలో, దేవుడు తన ప్రజల కోసం చేసిన ఎన్నో అద్భుత కార్యాలు మనం చూస్తాం.

దేవుడు మనం ఈ అందమైన ప్రపంచంలో సంతోషంగా, బాధలు లేకుండా జీవించాలని కోరుకుంటున్నాడు (ఆదికాండము 1:28, 31, 1 తిమోతి 6:17). అయితే, దేవుని మొదటి ప్రాధాన్యత పాపం నుండి మనలను రక్షించడం, తద్వారా మనం ఆయనతో శాశ్వత సంబంధాన్ని ఆస్వాదించగలం. పాపుల రక్షణకు సమయం పడుతుంది, ఎందుకంటే ప్రజలు పశ్చాత్తాపపడి, నమ్మాలనే నిర్ణయం తీసుకోవాలి. దేవుడు ఇప్పుడే అన్ని శ్రమల్ని అంతం చేస్తే, చాలా తక్కువ మంది పశ్చాత్తాపపడతారు, ఎందుకంటే వారికి పాపం యొక్క చెడుతనం అర్థం కాదు. కాబట్టి ఇప్పుడు, సువార్త ప్రపంచవ్యాప్తంగా బోధించబడుతున్నందున శ్రమలు కొనసాగాలి. దేవుడు మన కోసం అప్పుడప్పుడు అద్భుతాలు చేసినప్పటికీ, మన సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి మరియు మన శ్రమలన్నింటినీ తొలగించడానికి మనం అద్భుతాలను ఆశించలేము. అంతిమంగా, దేవునితో సంబంధం ఉన్నవారికి శ్రమలన్నీ అంతమవుతాయి. అయితే ఈలోగా, దేవుడు మన బాధలలో మనతో కలిసి దుఃఖిస్తాడు (యోహాను 11:35) మరియు అనేక విధాలుగా మనలను ఓదారుస్తాడు (2 కొరింథీయులకు 1:3-7).

దేవుడు చేసే అద్భుతాల్లో ఒకటి, సంతులేనిదానిని ఇల్లాలుగాను కుమాళ్ల సంతోషముగల తల్లిగాను చేయడం (కీర్తన 113:9).

బైబిల్లో కనీసం ఆరు సందర్భాల్లో దేవుడు సంతులేనిదానికి కుమారుల్ని అనుగ్రహించాడు. దేవుడు చాలాసార్లు ఇదే అద్భుతం చేసినా, చరిత్రలో పిల్లలు ముఖ్య పాత్ర పోషించినందున ఈ ఆరు సందర్భాలు మాత్రమే బైబిల్లో లిఖించబడ్డాయి. శారాకు ఇస్సాకు పుట్టాడు (ఆదికాండము 21:1-3). రిబ్కాకు యాకోబు, ఏశావు పుట్టారు (ఆదికాండము 25:21, 25-26). రాహేలుకు యోసేపు పుట్టాడు (ఆదికాండము 30:22-24). మనోహ భార్యకు సంసోను, పుట్టాడు (న్యాయాధిపతులు 13:2-3, 24). హన్నాకు సమూయేలు పుట్టాడు (1 సమూయేలు 1:20). ఎలీసబెతుకు యోహాను పుట్టాడు (లూకా 1:13, 57).

ఈ ఆరు సందర్భాల్లో, స్త్రీకి పిల్లలు లేనందువల్ల దంపతులిద్దరూ బాధపడ్డారు. బైబిల్లో, స్త్రీకి పిల్లలు కలుగకపోవడం వలన దేవుడు ఏ ఒక్కరిని నిందించలేదు. పిల్లలు లేనందువల్ల, దేవుడు తల్లి/తండ్రిని ఇష్టపడలేదని బైబిల్లో ఎక్కడా కనిపించదు. జెకర్యా, ఎలీసబెతులు దేవుని దృష్టిలో నీతిగా ఉన్నారని, ఆయన ఆజ్ఞలకు పుర్తిగా లోబడ్డారని, కాలం గడిచి వృద్ధులైనా వారికి పిల్లలు కలుగలేదని లూకా 1:5-7 మాట్లాడుతుంది. ఈ ఆరు సందర్భాల్లో, వారు అద్భుతం కోసం ప్రార్థన చేస్తుండగా, పాపాన్ని ఒప్పుకున్నట్లుగాని లేక పశ్చాత్తాపపడినట్లుగాని అక్కడ కనిపించదు. దేవుడు వారికిచ్చిన సందేశాల్లో కూడా సంతానలేమికి కారణాలు చెప్పలేదు. కాబట్టి, సంతానం లేకపోవడం వలన, వ్యక్తిగతంగా వారిని నిందించకూడదని ఈ సంఘటనలు తెలియజేస్తాయి.

దేవుడు సంతానాన్ని ఇచ్చేటట్లు ప్రార్థించడం మంచిదే, కాని తుదకు మనం దేవుని నిర్ణయాన్ని అంగీకరించవలసినదే. దేవుడు ప్రతి అనారోగ్యాన్ని స్వస్థపరచనట్లే, ప్రతి బాధను తీసివేయనట్లే, ప్రతి సందర్భంలోను సంతానం ఇస్తాడని మనం అనుకోకూడదు.

అపొస్తలుడైన పౌలు తన శరీరంలోని ముల్లును తీసివేయాలని దేవుణ్ణి ముమ్మారు అడిగాడు (2 కొరింథీయులకు 12:7-10). అతని సమస్య ఏంటో మనకు స్పష్టంగా తెలీదు, కానీ అది ఒక రకమైన శరీర బలహీనత. దేవుడు ఆ పరిస్థితిని మారుస్తాడని అనుకుని, అద్భుతం కోసం ప్రార్థించాడు. అయితే దేవుడు ఆ ముల్లును తీసివేయకుండా, ఆ బలహీనత కంటే గొప్పదైన తన కృపను అనుగ్రహిస్తానని చెప్పాడు. ఆ బలహీనత దేవునికి మహిమ తీసుకొస్తుందని పౌలు చెప్పాడు ఎందుకంటే దేవుని శక్తి కనుపరచడానికి అది సహాయపడింది. బలహీనతల్లో, బాధల్లో దేవుడు మహిమపరచబడుతున్నాడు గనుక పౌలు వాటియందు సంతోషిస్తున్నానని చెప్పాడు.

అపొస్తలుడైన పౌలు గొప్ప విశ్వాసవీరుడు, కాని అతనికి కావలసిన అద్భుతాలు ఎల్లప్పుడు పొందుకోలేదు. అతడు దేవుని చిత్తాన్ని అంగీకరించాడు. మనం ఎల్లప్పుడూ దేవుని నుండి అద్భుతం కోరుతున్నప్పటికీ, దేవుని నిర్ణయాల్ని అంగీకరించేవారిగా ఉండాలి. కొన్నిసార్లు మన బలహీనతల ద్వారా ఆయన మరింత మహిమ పొందుకుంటాడు.

► మీరు అనుకున్నటువంటి అద్భుతాన్ని మీ జీవితంలో చేయకుండా దేవుడు మీపై కృప చూపిన ఒక సందర్భం గురించి పంచుకోండి.

### గొడ్రాలితనంపై సాంస్కృతిక స్పందనలు

పిల్లలకు విలువ ఇచ్చే విషయంలో సంస్కృతులన్ని ఒకేలా ఉండవు. కొన్ని దేశాల్లో, కుటుంబాలు ఎక్కువమంది పిల్లల్ని కోరుకుంటారు. కుటుంబానికి మద్దతుగా పిల్లలు పనిలో సహాయం చేయగలరని అనుకుంటారు. దూరపు బంధువులైన బావలు, మేనమామలు, మరుదులు అవసరమైనప్పుడెల్లా పరస్పర సంరక్షణ అందించుకుంటూ ఉంటారు. ఆ పెద్ద కుటుంబంలోని ప్రతి భార్య పిల్లలను కంటూ కుటుంబాన్ని విస్తరింపజేస్తుంది. పెద్ద కుటుంబాల్లో ఎక్కువ కుమారులున్న తండ్రికి అధిక ప్రాముఖ్యత ఇస్తారు. కుటుంబంలో పెద్దవారందరినీ చూసుకనే బాధ్యత కుటుంబంపై ఉంటుంది.

ఇంకొన్ని దేశాల్లో, చాలా కుటుంబాలు పట్టణంలో లేక నగరాల్లో ఉంటాయి, ఆ కుటుంబాల్ని తల్లి తండ్రి ఉద్యోగం చేస్తూ పోషిస్తారు. నగరాల్లో, పిల్లలు కుటుంబానికి తగినంత సహాయం చేయలేరు. పిలల్ని పోషించడానికి, వారికి విద్య అందించడానికి చాలా ఖర్చు అవుతుంది. కాలం గడిచేకొద్దీ, కుటుంబాలు అనేక తరాలపాటు నగరంలో నివసిస్తున్నప్పుడు, తక్కువమంది పిల్లలు కావాలని అనుకుంటారు. నగరాల్లో ఉండే కుటుంబాలు, ఒకరు లేదా ఇద్దరు పిల్లల్ని మాత్రమే కోరుకుంటాయి.

చాలా సంస్కృతులలో పిల్లలకు ఉన్న విలువ చాలా గొప్పది కాబట్టి దంపతులు గౌరవాన్ని విలువను పొందుకోవాలంటే ఖచ్చితంగా పిల్లల్ని కనాలని భావిస్తారు. పిల్లలు లేని తల్లి, తన జీవితంలో ముఖ్య బాధ్యతను నిర్వర్తించలేకపోతున్నానని అనుకుంటుంది. అలాగే, పెళ్లికాని స్త్రీ ఒకరికి భార్య కాలేనందున, పిల్లల్ని కనలేనందున సిగ్గుపడుతుంది.

చాలా సంస్కృతుల్లో, కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, నడిపించడానికి కుమారులు అవసరమని భావిస్తారు. కుమార్తెలకు పెద్దగా విలువ ఇవ్వరు. ఆడ శిశువుల్ని చంపేస్తారు లేక విడిచిపెట్టేస్తారు. చాలా దేశాలు శిశువు కడుపులో ఉన్నప్పుడే లింగాన్ని పరిశోధించి తెలుసుకునే పరీక్షలను నిషేధించాయి ఎందుకంటే చాలా కుటుంబాల్లో ఆడ శిశువుల్ని కడుపులోనే చంపేస్తున్నారు. అబ్బాయిలతో పాటుగా అమ్మాయిలకు కూడా అదే గౌరవం, విలువ ఉన్నాయని లేఖనాల

ద్వారా మనకు అర్థమౌతుంది ఎందుకంటే వారు దేవుని స్వరూపంలో సృజించబడ్డారు (ఆదికాండము 1:27). కాబట్టి, సంస్కృతితో నిమిత్తం లేకుండా, క్రీస్తును అనుసరించే కుటుంబాలు కుమారుల్ని, కుమార్తెల్ని ఒకే విధంగా చూడాలి.

ఒకవేళ కుటుంబం బిడ్డను బట్టి అతిశయించాలనుకుంటే, బహుశా వారు శారీరక లేక మానసిక వైకల్యంతో పుట్టిన బిడ్డల్ని తిరస్కరించే ప్రమాదం ఉంటుంది. కొన్ని దేశాల్లో, చాలామంది అంగవైకల్యంతో పుట్టిన పిల్లలు, తల్లిదండ్రుల తిరస్కరణ కారణంగా అనాధ ఆశ్రమాల్లో ఉంటున్నారు. ఈ విధంగా పిల్లల్ని తిరస్కరించడం మంచిది కాదు, ఎందుకంటె వారి పరిమితి ఏదైనా లేక వారి సామర్థ్యాలు ఎలా ఉన్నా వారు దేవుని స్వరూపంలో చేయబడ్డారు, ఆయన దృష్టిలో విలువైనవారు.

కొన్ని సంస్కృతులలో, బహుభార్యత్వం పిల్లల విలువ మీద ఆధారపడి ఉంటుంది. పురుషుడు చాలామంది భార్యల ద్వారా సంతానాన్ని విస్తరింపజేయాలనుకుంటాడు. అయితే భర్త కేవలం ఒకే భార్యను కలిగియుండడం దేవుని ఉద్దేశ్యమని బైబిల్ సెలవిస్తుంది (ఆదికాండము 2:22-24, 1 తిమోతికి 3:2).

పాత నిబంధన గ్రంథంలో, భర్తకు పిల్లల్ని కనాలని, భార్యలు తమ దాసీలను భర్తలకు ఇచ్చే సందర్భాలు ఉన్నాయి. దాసీ పిల్లల ద్వారా భార్య గౌరవాన్ని పొందుకునేది. యాకోబు భార్యలైన లేయ, రాహేలు ఎక్కువ మంది పిల్లల ద్వారా గౌరవం పొందుకోవాలని తమ దాసీలను యాకోబుకు ఇచ్చారు.

ఎక్కువమంది పిల్లలకోసం దాసీలను వాడడం సంక్లిష్ట సంబంధాలకు దారితీస్తుంది. శారా అబ్రాహాముకు హాగరును ఇచ్చింది, హాగరుకు బిడ్డ పుడితే తనకు గౌరవం వస్తుందని ఆశపడింది (ఆదికాండము 16:2-6). హాగరు గర్భం ధరించి, శారా కంటే గొప్పగా భావించుకుంది. శారా ఆమెను కఠినంగా శిక్షించి, తన సొంత అధికారం కోసం ప్రయత్నించింది.

అమినాటా పశ్చిమ ఆఫ్రికా దేశంలో పుట్టింది. పెళ్ళైన మూడు సంవత్సరాల వరకు ఆమెకు బిడ్డలు పుట్టలేదు. అమినాటా సంస్కృతిలో, సొంత బిడ్డలు లేనందువలన కలిగిన అవమానం, బిడ్డను దత్తతు తీసుకున్నప్పటికీ, తొలగిపోలేదు. అమినాటా మారుమూల గ్రామంలో ఉండే ఒక పేద గర్భవతిని కనుగొని, ఆమె బిడ్డను కొనుక్కోవాలనుకుంది. చాలా నెలలు పాటు తాను గర్భవతిగా కనబడాలని ఎత్తుగా ఉండేందుకు తన డ్రస్ లోపల యేవో పెట్టుకుంది. బిడ్డ పుట్టే సమయం ఆసన్నమైనప్పుడు, అమినాటా ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్లినట్లు నటించింది, ఆ తర్వాత ఆ గ్రామంలో నుండి ఆ బిడ్డతో ఇంటికి తిరిగి వచ్చింది.

ఒక కుటుంబం దాని ప్రయోజనం కోసమే పిల్లలు కావాలనుకుంటే, దేవుని స్వరూపంలో పుట్టిన బిడ్డలుగా వారికి విలువ ఇవ్వడంలో విఫలమైపోతారు. అంగవైకల్యంతో పుట్టిన బిడ్డను అంగీకరించరు, ప్రేమించరు. కుమారుడు కావాలి కాబట్టి కుమార్తెను తిరస్కరిస్తారు. అనాధలను లేక నిరాశ్రయులను దత్తత తీసుకోవాలనే ఆలోచనను అంగీకరించరు. ఈ

వైఖరులు, చర్యలు అన్ని స్వార్థంతో కూడినది, మంచివి కావు. ఏ కారణం చేతనైనా మనం వీరిని త్రుణీకరించినప్పుడు, సృష్టికర్తయైన దేవుణ్ణి అవమానిస్తున్నాం (నిర్గమకాండము 4:11, సామెతలు 14:31).

హెన్రీ VIII 1509-1547వరకు ఇంగ్లాండ్ దేశానికి రాజుగా ఉన్నాడు. అతనికి ఖచ్చితంగా కుమారుడు కావాలనే బలమైన కోరిక ఉండేది. తన భార్యకు కుమార్తె ఉంది కాని కుమారుడు ప్రాణాలతో బయటపడలేదు, హెన్రీ ఆమెను విడిచి, మరొక స్త్రీని పెళ్లి చేసుకున్నాడు. రెండవ భార్య కూడా కుమారుని కనలేనప్పుడు, ఆమె రాజద్రోహం చేసిందని చెప్పి ఉరిశిక్ష విధించాడు.

పురుషుడి యొక్క వీర్యం పిల్లల లింగాన్ని నిర్ణయిస్తుందని వైద్యశాస్త్రం నిరూపించింది. కుమార్తె పుడుతుందా లేక కుమారుడు పుడతాడా అనేది స్త్రీ శరీరం నిర్ణయించదు. అయితే, కుమారులు కాకుండా కుమార్తెలకు జన్మనిచ్చిందని చాలామంది పురుషులు తమ భార్యలపై కోపపడతాడు.

తనిష్ మరియు అతని భార్యకు ఇద్దరు కుమార్తెలున్నారు. తనిష్ భార్య మూడవసారి ప్రసవించడానికి ఆసుపత్రికి వెళ్లినప్పుడు, కొడుకు పుడతాడని ఆశించాడు. మూడవసారి కూడా కుమార్తె పుట్టింది. కాబట్టి తనిష్ భార్యను చూడడానికి ఆసుపత్రికి వెళ్లలేదు, ఆసుపత్రి బిల్ కూడా చెల్లించలేదు.

యోబు 24 లో యోబు, దుష్టుల చర్యలు గురించి సుదీర్ఘంగా మాట్లాడాడు. అక్కడ అతడు చెప్పిన ఒక చర్య ఏమిటంటే, దుష్టుడు పిల్లలు కనని గొడ్రాండ్రను బాధపెడతారు (యోబు 24:21). పిల్లలు లేని స్త్రీని బాధపెట్టినప్పుడు దేవుడు సంతోషించడు.

► మీ సంస్కృతి పిల్లలకు ఎలా విలువను ఇస్తుంది? ప్రజలు, పిల్లలు కావాలనుకోవడానికి కొన్ని కారణాలు ఏంటి?

► మీ సంస్కృతిలోని కట్టుబాట్లవలన జరిగే అన్యాయాలు ఏంటి?

### దేవుడు ఏం చెబుతున్నాడు

దేవుడు పిల్లలు లేనివారికి పిల్లలను అనుగ్రహించాడని తెలియజేసే బైబిల్లోని ఆరు కథనాల్లో, పిల్లలు లేకపోవడాన్ని బట్టి దేవుడు వారిని నిందించలేదు. నిజానికి, ప్రత్యేకమైన కుమారులను సంరక్షించడానికి దేవుడు ప్రత్యేకమైన తల్లిదండ్రులను ఎన్నుకున్నాడు. జెకర్యా ఎలిసబెతు నీతిమంతులుగా పిలువబడ్డారు (లూకా 1:5-6). ఒక స్త్రీ దేవుణ్ణి సంతోషపెట్టలేని కారణాన్ని బట్టి గొడ్రాలైందని మనం ఎన్నడు భావించకూడదు.

పిల్లల్ని కనని గొడ్రాండ్రను బాధపెట్టుట దుష్ట కార్యమని యోబు 24:21 చెబుతుంది. సంతానం లేని స్త్రీకి దేవుడు తీర్పుతీర్చడు లేక బాధపెట్టడు కాబట్టి మన కూడా బాధపెట్టకూడదు.

యెషయా 56:4-5లో, పిల్లలు లేని తండ్రి గురించి దేవుడు మాట్లాడాడు. ఈ వ్యక్తి దేవునికి విధేయుడై, ఆయన నిబంధనను గైకొనినప్పుడు, కుమారులు కుమార్తెలు కలిగినప్పుడు కలిగే గౌరవం కంటే మరింత ఉత్తమమైన స్థానాన్ని, గౌరవాన్ని కలుగజేస్తానని దేవుడు సెలవిచ్చాడు.

అపొస్తలుడైన పౌలు, తిమోతికి (1 తిమోతికి 1:2) తీతుకు (తీతుకు 1:4) మరియు ఒనేసిముకు (ఫిలేమోనుకు 10) తాను తండ్రినని చెప్పుకున్నాడు. కొరింథీయులకు విశ్వాసులకు తననుతాను తండ్రిగా పిలుచుకున్నాడు (1 కొరింథీయులకు 4:15). అతడు వారి శారీరక తండ్రి కాదుగాని ఆత్మీయ తండ్రిగా ఉన్నాడు. వారి ఆత్మీయ తండ్రిగా ఉండడం ఎంతో ముఖ్యం.

యేసు బోధిస్తుండగా ఆయన తల్లి మరియు ఆయన సోదరులు వచ్చిన సందర్భం గురించి మత్తయి 12:46-50 మాట్లాడుతుంది. అప్పుడు యేసు ఆయన మాటలు వింటున్నవారితో, "నా తల్లి యెవరు? నా సహోదరు లెవరు?" అని అడిగాడు. దేవుని చిత్తము నెరవేర్చువారే తన సహోదరులు, సహోదరీలు, మరియు తన తల్లి అని చెప్పాడు. యేసు తన కుటుంబం పట్ల శ్రద్ధ చూపించాడని మనకు తెలుసు (యోహాను 19:26-27). అయితే శారీరక కుటుంబం కంటే ఆత్మీయ కుటుంబం మరింత ప్రాముఖ్యమైనదని యేసు చెప్పాడు.

విశ్వాస కుటుంబం శారీరక కుటుంబాన్ని భర్తీ చేయలేదు, కాని విశ్వాస కుటుంబంలో ఒక వ్యక్తి స్థానాన్ని బట్టి అతనికి లేక ఆమెకు ప్రాముఖ్యమైన గుర్తింపు లభిస్తుంది. సంఘంలో ఉపయోగించబడు *సహోదరుడు* మరియు *సహోదరి* అనే పదాలు విశ్వాస కుటుంబంలోని ప్రాముఖ్యతను చూపిస్తాయి (కొలొస్స 1:2).

ప్రవక్త్రియైన దెబోర ఇశ్రాయేలులో న్యాయాధిపతిగా చేసింది (న్యాయాధిపతులు 4:4). ఇశ్రాయేలీయులను అణగద్రొక్కుతున్న దేశం నుండి కాపాడడానికి, యుద్ధంలో నాయకత్వం వహించింది. న్యాయాధి 5:7లో, దెబోరా తననుతాను ఇశ్రాయేలుకు తల్లిగా చెప్పుకుంది. దెబోరా శారీరక పిల్లలు గురించి బైబిలు ప్రస్తావించదు, కాని ఆమె నాయకత్వం ద్వారా ప్రజల్ని చూసుకున్న విధానాన్ని బట్టి ఇశ్రాయేలుకు తల్లిగా పరిగణించబడింది.

శారా మాదిరిని అనుసరించే స్త్రీలు ఆమె కుమార్తెలని అపొస్తలుడైన పేతురు చెప్పాడు (1 పేతురు 3:6). ఈ మాటలో శారాకు ఇవ్వబడిన గొప్ప హోదా గురించి ఒక్కసారి ఆలోచించండి! ఈ హోదా ఆమె ఇస్సాకుకు తల్లిగా ఉన్నందువల్ల కలుగలేదుగాని ఆమె విశ్వాసం, విధేయత కారణాన్ని బట్టి ఇవ్వబడింది.

విశ్వాసం ద్వారా కృపచేత రక్షించబడిన వారందరూ అబ్రాహాము పిల్లల్లే (గలతీయులకు 3:7). విశ్వాసులకు తండ్రిగా అబ్రాహాముకు గొప్ప హోదా అనుగ్రహించబడింది. దేవుడు ఆత్మీయ తండ్రులను, తల్లులను ఘనంగా ఎంచుతాడని అబ్రాహాము మరియు శారా ద్వారా మనకు అర్థమౌతుంది.

పెళ్లి చేసుకోకుండా ఉండడంలో ప్రయోజనం ఏంటో అపొస్తలుడైన పౌలు చెప్పాడు. పెళ్లి చేసుకోని వ్యక్తి ఇతర ఎటువంటి బాధ్యతలు లేకుండా దేవుని సంతోషపెట్టే కార్యాల పట్ల శ్రద్ధ చూపుతారు (1 కొరింథీయులకు 7:32-35). పెళ్లికాని వ్యక్తికి సంతానం లేనప్పటికీ, ఒంటరిగా పవిత్రమైన జీవితం గడపగలిగినట్లయితే అది మంచిదని పౌలు చెప్పాడు. ఈ మాటల ప్రకారంగా, ఒంటరితనం (పెళ్లి చేసుకోకపోవడం) కొందరి విషయంలో దేవుని చిత్తమేనని మనం చెప్పగలం.

ఒంటరితనంవలెనే, గొడ్రాలితనానికి కూడా కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. ఒంటరిగా ఉన్నవారికి దేవుడు కొన్ని ప్రత్యేకమైన అవకాశాలు ఇచ్చినట్లే, పెళ్లి చేసుకుని పిల్లలు లేనివారికి కూడా దేవుడు కొన్ని ప్రత్యేకమైన అవకాశాలు ఇచ్చాడు. వారు పిల్లలు వద్దని నిర్ణయించుకోకపోయినా, దేవుని కోసం ఉత్తమంగా పని చేయడానికి ప్రయత్నించాలి.

ఒంటరితనంలో, గొడ్రాలితనంలో, మరియు ఇతర పరిస్థితుల్లో, మనతో పాటు ఇతరులకు ఆత్మీయ మేలులు కలిగించడానికి దేవుడు మన ద్వారా పని చేస్తాడని మనం నమ్మాలి (రోమా 8:28).

చాలామందికి శ్రద్ధ చూపించే తల్లిదండ్రులు ఉండరు. విశ్వాస కుటుంబంలోని కొందరు వ్యక్తులు లేక దంపతులు ఈ పిల్లల్ని ప్రేమించడానికి కృషి చేయకపోతే, వారి జీవితాల్లో ఉన్నటువంటి ఈ అవసరాన్ని ఎవరు తీర్చలేరు.

మనం మన శరీరాలు దేవునికి సమర్పించుకోవడానికి, దేవునికి సేవ చేయడానికి మనం పిలువబడ్డాం (రోమా 12:1).

### సంక్షిప్త సూచనలు

1. పిల్లలు దేవుడు అనుగ్రహించు ఆశీర్వాదం, దేవుడు పిల్లల్ని కలుగజేయాలని దంపతులు ప్రార్థించడం మంచిది.
2. అద్భుతంగా పిల్లల్ని అనుగ్రహించడం ఎల్లప్పుడు దేవుని చిత్తమే అని తప్పుగా అర్థం చేసుకోకూడదు. ఆయన ప్రతి అవసరంలో అద్భుతం చేయనట్లుగానే, ఎల్లప్పుడు బిడ్డలను కలుగజేయడు.
3. పిల్లలు కలగకపోవడాన్ని బట్టి స్త్రీని లేక దంపతుల్ని నిందించడం చాలా తప్పు. ఆదాము చేసిన పాపం, మన పూర్వికులు చేసిన పాపం, మన సమాజం చేసిన పాపం కారణంగా మానవుని పరిస్థితి ప్రభావితమౌతుంది.
4. కుమారులు, కుమార్తెలు దేవుని స్వరూపంలో సృజించబడ్డారు గనుక వారిరువురిని ఒకే విధంగా ప్రేమించాలి, విలువ ఇవ్వాలి.
5. ఒక వ్యక్తి శారీరకంగా పిల్లలు లేనప్పటికీ, వారు అనేక తరాల వారిని ప్రభావితం చేసే ఆత్మీయ తల్లిదండ్రులుగా ఉండగలరు.
6. దేవుడు, పెళ్లికాని వారికి లేక సంతానం లేనివారికి పరిచర్యలో ప్రత్యేక అవకాశాలు ఇస్తాడు.

7. దేవుడు, మనల్ని ఉంచిన పరిస్థితుల్లోనే మనమాయనను సేవించాలి, ఘనపరచాలి.

## సేవకుని పరిచర్య

దురదృష్టవశాత్తూ, చాలా ప్రాంతాల్లోని సంఘాలవారు గొడ్రాలితనంతో బాధపడుతున్నప్పుడు దేవుని వాక్యాన్ని పాటించకుండా తమ సొంత సంప్రదాయాలను పాటిస్తూ ఉంటారు.

గొడ్రాలితనాన్ని బైబిల్ దృక్కోణంలో, ముఖ్యంగా మునుపటి భాగంలో సంగ్రహించినట్లుగా చూడాలని సేవకుడు తన ప్రజలకు బోధించాలి.

సంతానం లేని దంపతుల జీవితంలో అద్భుతం జరగాలని సేవకుడు ప్రార్థిస్తుంటే, విశ్వాసం కలిగి ఉండే బాధ్యతను భార్యాభర్తలపై ఉంచకూడదు. యేసు చిన్న పిల్లవాడిని స్వస్థపరచినప్పుడు లేక చనిపోయినవానిని లేపినప్పుడు, ఆ అద్భుతం స్వస్థపడిన లేక తిరిగి లేపబడిన వ్యక్తి విశ్వాసంపై ఆధారపడలేదు. పాస్టర్‌కి దేవుడు అద్భుతం చేస్తాడనే నమ్మకం ఉంటే, దానికి భార్యాభర్తల విశ్వాసం లేకపోవడమే కారణమని నిందించకుండా, పాస్టర్‌కి విశ్వాసం ఉండాలి.

రోమా 12:15, దుఃఖించేవారితో దుఃఖపడాలని బోధిస్తుంది. సేవకుడు, తన సంఘంలో ఎవరు దుఃఖపడుతున్నారో తెలుసుకోవాలి. సంతానం లేకపోవడం వలన లేక పిల్లల్ని కోల్పోవడంవలన దుఃఖపడేవారిని సేవకుడు చొరవ తీసుకుని ప్రోత్సహించాలి, ఆదరించాలి. జన్మించని బిడ్డ విషయంలో తల్లిదండ్రులు దుఃఖపడతారు. భార్యభర్తలు ఇరువురు బాధపడతారు కాని ఆ బాధను భిన్నంగా వ్యక్తపరుస్తారు. దుఃఖపడే వారు స్వయంగా సలహా కోసం వచ్చేంతవరకు సేవకుడు వేచి ఉండకూడదు. సంఘంలో ప్రతి ఒక్కరు ఒకరినొకరు ప్రోత్సహించుకోవాలని, పరస్పర సహాయం చేసుకోవాలని సేవకుడు బోధించాలి.

పిల్లలు లేని వృద్ధ దంపతులతో సంబంధాలను పెంచుకునేలా, వారి బాగోగులు చూసుకునేలా సంఘకాపరి తన సంఘాన్ని నడిపించి, ప్రోత్సహించాలి. విశ్వాస కుటుంబీకులు వారిని ప్రేమిస్తూ, వారితో సమయం గడుపుతూ, వారికి కావలసిన అవసరాలు తీరుస్తూ వారిని తల్లిదండ్రులుగా లేక తాత అమ్మమ్మలుగా పరిగణించాలి.

అవివాహితులు, సంతానం లేనివారు సంఘానికి, సమాజానికి ఆశీర్వాదకరంగా ఉండేలా సేవకుడు వారికీ సహాయం చెయ్యాలి. విశ్వాస కుటుంబంలో ప్రతి వ్యక్తి విలువైనవాడేనని సేవకుడు ధృవీకరించాలి.

## సమూహ చర్చ కోసం

► మీ సంస్కృతిలోని ప్రజలు పిల్లల్ని ఎలా చూస్తారు? సంతానలేమిని ఎలా చూస్తారు?

► మీ సంస్కృతిలోని విశ్వాసులు పిల్లల్ని ఎలా చూస్తారు? సంతానలేమిని ఎలా చూస్తారు?

► ఈ పాఠంలో చర్చించిన లేఖన సూత్రాల్ని అధ్యయనం చేయడం వలన సంతానలేమిపై మీ అవగాహన ఎలా మారుతుంది లేక ఎలా సవాలు చేయబడుతుంది?

► మీ సంఘ కుటుంబంలో పిల్లలు లేక బాధపడుతున్న జంటలు ఎవరైనా ఉన్నారా? అలా అయితే, మీ సంఘం వారికి ఎలా అండగా ఉండగలదు మరియు వారు తమ కష్టాలను పంచుకోవడానికి సురక్షితమైన వాతావరణాన్ని ఎలా కల్పించగలదు?

## ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ,

క్రైస్తవ కుటుంబాలను బట్టి వందనాలు. మీ కోసం బ్రతుకుతున్న భార్యాభర్తలను బట్టి, రాజ్య విస్తరణ కోసం వారు చేస్తున్న పనిని బట్టి కృతజ్ఞతలు.

గొడ్రాలితనాన్ని అనుభవిస్తున్నవారి కోసం ప్రార్థిస్తున్నాం. వారిని ఆదరించి, వారి హృదయాల్ని బలపరచండి. వారికి సంతానం కలుగనప్పటికీ నీ ప్రేమ వారి యెడల స్థిరమైనదని తెలుసుకోవడానికి సహాయం చేయండి.

నీ చిత్తమైతే నీ సమయంలో వారికి పిల్లలను అనుగ్రహించుమని ప్రార్థిస్తున్నాం. వారికి పిల్లల్ని అనుగ్రహించినా లేకపోయినా, ఇతరులకు ఆత్మీయ తల్లిదండ్రులుగా ఉండడానికి సహాయం చేయండి.

ప్రతి ఒక్కరు నీ స్వరూపంలో చేయబడ్డారని గ్రహించి విలువ ఇవ్వడానికి విశ్వాసులందరికి సహాయం చేయండి.

ఆమెన్

## పాఠం అభ్యాసాలు

(1) రెండు-పేజీల్లో ఈ విషయాలు గురించి రాయండి:

- పిల్లలు, గొడ్రాలితనం విషయంలో మీ సమాజ దృక్కోణాన్ని వివరించండి.
- పిల్లల గురించి లేఖనం ఏం బోధిస్తుందో వివరించండి.
- గొడ్రాలితనం గురించి లేఖనం ఏం బోధిస్తుందో వివరించండి.
- సంతానలేమి వలన పెళ్ళైన దంపతులను ఎందుకు నిందించకూడదో లేఖన సూత్రాలు వివరించండి.

(2) సంతానలేమితో ఉన్నవారిని ప్రోత్సహించండి.

ఎంపిక 1: సంతానలేమితో బాధపడుతున్నవారి పట్ల ఏ విధంగా కనికరం చూపగలరో రాత పూర్వకంగా వివరించండి. క్రీస్తునందు మీ సహోదరునికి లేక సహోదరికి ఆశీర్వాదకరంగా ఉండునట్లు మీరు చేయగల లేక చెప్పగల విషయాలు ప్రత్యేకంగా పేర్కొనండి.

ఎంపిక 2: మీకు తెలిసి సంతానలేమితో బాధపడుతున్నవారిని ప్రోత్సహించడానికి కొన్ని మాటలు రాయండి. వారి బాధను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. వారి భావాలు పట్టించుకుంటున్నట్లు వారికి అనిపించేలా చేయండి. వారి కోసం ప్రార్థన చేస్తున్నామని చెప్పండి. మీరు వాళ్ళ గురించి శ్రద్ధ తీసుకుంటున్నాను అని చెప్పినప్పుడు, వారి మాటలు వినడానికి అందుబాటులో ఉండండి లేక సరైన రీతిలో మీ ప్రేమను వారికి చూపించండి.

## సంతాన నియంత్రణ

11వ పాఠంలోకి వెళ్ళే ముందు, క్లాసు అంతా అనుబంధం B అధ్యయనం చేసి, చర్చించాలి. ఇది సంతాన నియంత్రణపై ఇది క్లుప్త చర్చ, ఇది వివాహానికి కుటుంబానికి సంబంధించిన ముఖ్య విషయం.

# పాఠం 11

# పిల్లల అభివృద్ధి, సంరక్షణ

### పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) ప్రతి ఒక్కరిని సృజించడంలో దేవుని అద్భుత కార్యాన్ని అభినందించాలి.

(2) మానవుని జీవితం పవిత్రమైందని నమ్మాలి.

(3) గర్భం ధరించినది మొదలుకొని మానవ జీవితాన్ని కాపాడడానికి ప్రోత్సహించాలి.

(4) పిల్లల ఆరోగ్యకరమైన అభివృద్ధిని తల్లిదండ్రుల సంరక్షణ ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలి.

### చిన్న కవలలు

హర్ష మరియు అన్విత భారతదేశంలో నివసిస్తున్నారు. వారికి వివాహమై కొన్ని సంవత్సరాలు గడిచినా సంతానం పిలలు పుట్టలేదు, వారికి అనుకోకుండా ఒక అవకాశం లభించింది. అన్విత బంధువుల్లో ఒకరికి కవల పిల్లలు పుట్టారు, కాని వారు వారిని సంరక్షించలేకపోయారు. హర్ష మరియు అన్విత ఆ ఇద్దరు శిశువులను ఎంతో ఆనందంతో అంగీకరించారు, కాని కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ శిశువులు నెలలు నిండక ముందే జన్మించారు, ఒకొక్కరు కేజీన్నర బరువే ఉన్నారు. ఆ చిన్న బిడ్డల్ని ఎలా సంరక్షించాలో నూతన తల్లిదండ్రులు నేర్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. చాలా నిద్రలేని రాత్రులు గడిపారు, కాని ఆ అమ్మాయిలు మంచిగా ఆరోగ్యంగా పెరిగారు.

### శిశువు

#### గర్భధారణ సమయంలో శిశువు ఎదుగుదల

► ఒక విద్యార్థి తరగతి కోసం కీర్తన 139:13-18 చదవాలి.

తల్లి గర్భములో రూపించబడక మునుపే దేవుడు మనల్ని ఎరిగియున్నాడని ఈ వాక్యభాగం చెబుతుంది (16వ వచనం). మీరు పుట్టక ముందే దేవుడు మిమ్మల్ని ఎరిగియున్నాడు మీ కోసం ఒక ప్రణాళిక కలిగియున్నాడు.

ఒక స్త్రీ లోపల పురుషుడి వీర్యం ఆమె అండంతో కలిసిన క్షణంలో ఒక బిడ్డకు ప్రాణం పోస్తుంది. ఆ క్షణంలోనే ఒక కొత్త మానవ జీవితం - ఒక కొత్త వ్యక్తి - ఉనికిలోకి వస్తాడు! ఆ వ్యక్తికి సంబంధించిన మొత్తం జన్యు సమాచారం ఆ ఒక్క కొత్త కణంలో ఉంటుంది. గర్భధారణ జరిగిన 24 గంటల్లోగా, ఆ కణం రెండు కణాలుగా విభజించబడుతుంది. ఆ కణాలలో ప్రతి ఒక్కటి మరో రెండు కణాలుగా విభజించబడుతుంది. ప్రతి కణం రెండింటిగా విభజించబడటంతో కణాల సంఖ్య నిరంతరం పెరుగుతూ ఉంటుంది. దాదాపు ఒక వారంలో, బిడ్డ, ఇప్పుడు అనేక కణాలుగా మారి, తల్లి గర్భాశయం లోపలి భాగానికి అంటుకుంటుంది, అక్కడ అది పెరుగుతూ అభివృద్ధి చెందుతూ ఉంటుంది. కణాలలో ప్రతి ఒక్కటి ఆ వ్యక్తిని తయారు చేయడానికి అవసరమైన "కోడ్" (DNA)ని కలిగి ఉంటుంది. కణాలు కోడ్‌లోని సూచనలను అనుసరించి, శరీరంలోని ప్రతి భాగాన్ని రూపొందించడానికి ప్రత్యేకంగా మారతాయి.

మూడవ వారం నాటికి, శిశువు యొక్క వెన్ను, మెదడు ఏర్పడటం ప్రారంభమవుతుంది. గర్భధారణ జరిగిన నాలుగవ వారం నాటికి, శిశువు కళ్ళు ఏర్పడటం, గుండె పనిచేయడం, మరియు చేతులు ఏర్పడటం ప్రారంభమవుతుంది. గర్భం దాల్చిన 12 వారాల నాటికి, శిశువు శరీరంలో అన్ని ముఖ్యమైన అవయవాలు ఉంటాయి.

14వ వారం వచ్చేసరికి, శిశువు వేలి ముద్రలు పూర్తిగా యేర్పడతాయి. 16-24 వారాలకి, గర్భంలో శిశువు కదలికలను తల్లి అనుభవిస్తుంది. 26-28 వారాల మధ్య, శిశువు ఊపిరి పీల్చుకోవడానికి ఊపిరితిత్తులు అభివృద్ధి చెందుతాయి, శిశువు బరువు సుమారు 900 గ్రాములు ఉంటుంది. సహజంగా, గర్భం దాల్చిన 38-40 వారాలకు పిల్లలు పుడతారు. ప్రతి బిడ్డ, మన సృష్టికర్తయైన దేవుడు సృజించిన అద్భుతమైన, ప్రత్యేకమైన సృష్టి.

► ఒక విద్యార్థి తరగతి కోసం ప్రసంగి 11:5 చదవాలి.

తల్లి గర్భంలో దేవుడు ఒక బిడ్డను సృజించిన, రూపించిన, నిర్మించిన విధానం నిజంగా ఎంతో అద్భుతం. ప్రజలు ఆ ప్రక్రియను లేక ప్రతి ఒక్క విషయాన్ని ఎప్పటికీ పూర్తిగా అర్థం చేసుకోలేరు. అయినప్పటికీ, అన్ని ఖండాల్లో అన్ని సమాజాల్లో, అన్ని సంస్కృతుల్లో పిల్లలు ఎదిగే ప్రక్రియ, విధానం ఒకేలా ఉంటుంది. సృష్టికర్త రూపకల్పనా పరిపూర్ణమైంది!

► ఒక విద్యార్థి తరగతి కోసం యోబు 10:8-12 చదవాలి.

ఈ వచనాల్లో, తల్లి గర్భంలో గర్భధారణ, బిడ్డ ఎదుగుదలను సూచించే పోలికను ఉపయోగించాడు. జీవమిచ్చువాడు సృష్టికర్తయైన దేవుడు అని యోబు చెప్పాడు.

**దేవుని స్వరూపంలో సృజించబడడం ద్వారా వచ్చే విలువ**

మనం దేవుని స్వరూపంలో సృజించబడ్డామని ఆదికాండము 1:26-27 మరియు ఆదికాండము 9:6 మాట్లాడతాయి. మానవుల జీవితమంతా పవిత్రమైనదే. కావున మానవులను చంపడం పాపం (ఆదికాండము 9:5, నిర్గమకాండము 20:13).

యెహెజ్కేలు 16:20-21, 36, 38లో, దేవుడు పిల్లలను చంపేవారికి వ్యతిరేకంగా చాలా కఠినంగా మాట్లాడాడు. విగ్రహాలకు పిల్లలను బలి అర్పించే ఇశ్రాయెలీయులను హెచ్చరించాడు, వారికి తీవ్రమైన తీర్పు వస్తుందని చెప్పాడు.

యెషయా 46:3-4లో, దేవుడు ఇలా మాట్లాడినప్పుడు, మానవుడు అభివృద్ధి చెందే దశలన్నిటిలో ఆయనకున్న శ్రద్ధ గురించి పేర్కొన్నాడు:

> యాకోబు ఇంటివారలారా, ఇశ్రాయేలు ఇంటివారిలో శేషించినవారలారా,గర్భమున పుట్టినది మొదలుకొని నా చేత భరింపబడిన వారలారా,తల్లి ఒడిలో కూర్చుండినది మొదలుకొని నేను చంక పెట్టుకొనినవారలారా, నా మాట ఆలకించుడి.ముదిమి వచ్చువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే తల వెండ్రుకలు నెరయువరకు నిన్ను ఎత్తికొనువాడను నేనే నేనే చేసియున్నాను చంకపెట్టుకొనువాడను నేనే నిన్ను ఎత్తికొనుచు రక్షించువాడను నేనే.

ఎంత గొప్ప వాగ్దానం!

ప్రజలందరికి విలువ ఉంది, పుట్టని పిల్లలకు, అంగవైకల్యం కలిగిన వారికి, ప్రత్యేక అవసరాలు ఉన్నవారికి, పెద్దవారికి కూడా విలువ ఉంది. ఒక వ్యక్తి విలువ, తాను ఏమి చేయగలడో లేక ఒక్కడే బ్రతుకగలడో లేదో అనే విషయంమీద ఆధారపడి ఉండదు. అందరు దేవుని స్వరూపంలో సృజించబడ్డారు గనుక ప్రతి వ్యక్తికి విలువ ఉంటుంది.

గర్భధారణ సమయం నుండే ప్రతి బిడ్డ దేవుని దృష్టిలో విలువైనవాడని బైబిల్ చెబుతుంది (కీర్తన 139:13-18). ఈ కారణం చేత, గర్భధారణ సమయం నుండే మనం మనుషులని మనకు తెలుసు. ఉద్దేశ్యపూర్వకంగా గర్భస్రావం ద్వారా గర్భాన్ని తీసివేయడం మనిషిని హత్య చేయడమే అవుతుంది.

పుట్టని పిల్లల జీవితాల్ని కాపాడాలంటే, తల్లులకు పరిచారం చేయాలంటే క్రీస్తు అనుచరులు ఈ నాలుగు మార్గాలు పాటించాలి.

1. భ్రూణ హత్యాలను నివారించే తీర్పులు ఇచ్చి, చట్టాలు అమలులోకి తీసుకురాగలిగేలా వారు ప్రభుత్వాల్ని, రాజ్య న్యాయస్థానాల్ని ప్రభావితం చేయాలి.

2. గర్భవతులై, గర్భస్రావం తప్ప మరో దారి లేదనుకునే స్త్రీలకు ఆపద్ధర్మ సహాయం అందించాలి, తద్వారా వారు శిశువు ప్రాణాల్ని కాపాడాలని భావిస్తారు.

3. వద్దనుకున్న పిల్లలపై శ్రద్ధ చూపించాలి.

4. గత గర్భస్రావాల వల్ల అపరాధ భావం, అపమానం మరియు అవమాన భావనతో బాధపడుతున్న స్త్రీలకు వారు దేవుని కృపను తెలియజేసి, ఆత్మీయ సహాయాన్ని అందించాలి.

**పుట్టని పిల్లలపై శ్రద్ధ చూపడం**

ఒక తల్లి తన కడుపులో మోస్తున్న బిడ్డకు శాశ్వతమైన గమనం ఉందని గ్రహించడం చాలా ముఖ్యం. ఆ వ్యక్తి ఎప్పటికీ ఉనికిలో ఉంటాడు. దీనివల్ల, తల్లిదండ్రులు ప్రతి కోణంలో- శారీరకంగా, మానసికంగా, సాంఘికం/భావోద్వేగపరంగా, మరియు ఆత్మీయంగా - పిల్లలపై శ్రద్ధ చూపించాలి.

► ఒక విద్యార్థి తరగతి కోసం మత్తయి 18:2, 10 చదవాలి.

మనిషి ప్రవర్తన పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపగలదు మరియు తండ్రి అయ్యే అవకాశాన్ని నిరోధించగలదు.. మద్యపానం, కొకైన్, లేక ధూమపానం పురుషుని వీర్యకణాల్ని దెబ్బతీస్తాయి, సంతానం కలిగే అవకాశాల్ని తగ్గిస్తాయి (గర్భధారణ అసాధ్యమౌతుంది) లేక గర్భస్రావం (గర్భధారణ సమయంలో శిశువు సహజంగా చనిపోవడం) జరుగుతుంది.

గర్భం ధరించిన తల్లి మత్తుపదార్థాలు (సూచించినవి లేక చట్ట విరుద్ధమైనవి), మద్యపానం లేక సిగరెట్లు వంటి వాటి వల్ల తన బిడ్డ శాశ్వత ప్రమాదం ఎదుర్కొంటుంది. అలాంటి పదార్థాలు బిడ్డ ఎదుగుదలను ఆపివేస్తాయి మరియు శారీరక, మానసిక సమస్యలతో పుట్టే అవకాశాలని పెంచుతాయి.[37]

బిడ్డకు ఎదుగుదలలో అత్యంత ముఖ్యమైన సమయం ఏమిటంటే, ముఖ్యంగా 3-4 వారాల్లో అవయవాలు, నరాలు ఏర్పడే సమయం. ఈ సమయంలో, చాలామంది స్త్రీలకు గర్భం ధరించారన్న విషయం కూడా తెలియదు!

► ఒక విద్యార్థి తరగతి కోసం 1 కొరింథీయులకు 10:31 చదవాలి.

[37] Greg Cook & Joan Cook, *The World of Children*, 3rd ed. (Pearson Education, 2013), 85.

పుట్టబోయే బిడ్డ యొక్క ఆరోగ్య పరిస్థితిని తల్లి పూర్తిగా నియంత్రించలేనప్పటికీ, మంచి ఆహారం తీసుకోవడం వలన, హానికరమైన వస్తువులను పక్కన పెట్టడం వలన బిడ్డ ఆరోగ్యానికి సహాయపడవచ్చు. పిల్లలు విలువైనవారని దేవుడు చెబుతున్నాడు మరియు పిల్లలను మంచిగా చూసుకోవడం వలన మనం దేవుణ్ణి మహిమపరుస్తాం.

బిడ్డ జన్మించకముందే చనిపోవడం చాలా విషాదకరం. సహజంగా, బిడ్డ జన్మించకముందే చనిపోవడమనేది తల్లి చేసిన ఏ పని ఫలితం కాదు. తల్లిదండ్రులు గొప్ప బాధలో ఉంటారు, మరియు ఇతర విశ్వాసులు ఆ సమయంలో వారిని ఆదరించడానికి ప్రయత్నించాలి.

**జననం**

ప్రసవ అనుభవాలకు సంబంధించిన ఆయా సాంస్కృతిక ఆచారాలు వైవిధ్యంగా ఉన్నప్పటికీ, లోకంలో స్త్రీలందరూ ఒకే విధంగా జన్మనిస్తారు. ఆదికాండము 3:16లో దేవుడు ఇలా సెలవిచ్చాడు: "నీ ప్రయాసమును నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను; వేదనతో పిల్లలను కందువు..."

శతాబ్దాలు గడిచిపోతున్నాయి, దేవుని వాక్యం లోకమంతటా సత్యంగానే నిలుస్తుంది. ఆదాము, హవ్వలు చేసిన మొదటి పాప ప్రభావం ఇంకనూ ప్రసవ వేదనలో కనబడుతుంది. యేసు తల్లియైన మరియ కూడా ప్రసవ వేదన పడింది.

## ప్రారంభ బాల్యం

**శారీరక ఎదుగుదల**

బిడ్డ శారీరక ఎదుగుదల అంచలంచలుగా జరుగుతుంది. మొదటిగా బిడ్డ తల నిలుపుకుంటాడు, ఆ తర్వాత కూర్చుంటాడు, ప్రాకుతాడు, ఆ తర్వాత నడుస్తాడు. ఇవి సరైన సమయంలో జరగనప్పుడు తల్లిదండ్రులు చింతిస్తారు. పిల్లలు ఎదుగుతుండగా, వారు ఎక్కాలని, దూకాలని, 4-5 సంవత్సరాలలో పరిగెత్తాలని మనం ఆశపడతాం. మొదటిగా పాలు త్రాగుతూ బలమైన ఆహారం తినడం మొదలుపెడతారు. కుటుంబ సభ్యులు ఈ శారీరక అభివృద్ధిని సహజంగా ఆనందిస్తారు.

**మానసిక అభివృద్ధి**

పిల్లలను చూసుకునేవారు మొదటిగా శిశువు ఏడ్చే శబ్దాన్ని వినాలని ఎదురుచూస్తారు, రెండు నెలల్లో నవ్వే శబ్దాలు చేయాలని ఆశపడతారు. తరువాత, శిశువు అల్లరి శబ్దాలు చేస్తూ, కొంతమంది శబ్దాలను పునరావృతం చేయడం ప్రారంభిస్తాడు. ఆరు నెలల్లో "అమ్మ" లేక "నాన్న" అనే తొలి పలుకులు విని తల్లిదండ్రులు ఎంతో ఆనందిస్తారు. పిల్లలు

సాధారణంగా ఒక సంవత్సరం వయస్సు నాటికి మాటలు మాట్లాడటం మొదలుపెట్టి, రెండు సంవత్సరాల వయస్సు నాటికి పూర్తి వాక్యాలు మాట్లాడతారు.

చిన్నపిల్లలు గుర్తుపెట్టుకునే విషయాలు మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. చాలా ప్రశ్నలు అడుగుతుంటారు. వారితో ఏదైనా ప్రత్యేకమైన పని చేస్తానని వాగ్దానం చేస్తే, వారు దానిని ఎప్పటికీ గుర్తుంచుకుంటారు. దేవుని నిర్మాణం వలన వారి మనసు అభివృద్ధి చెందుతుంది, కానీ తల్లిదండ్రులు మరియు ఇతర సంరక్షకుల పెంపకం పిల్లలు వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడంలో చాలా సహాయపడుతుంది.

**సాంఘిక, భావోద్వేగ అభివృద్ధి**

పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే, శారీరకంగా అభివృద్ధి చెందాలంటే తల్లిదండ్రుల సహాయం ఎంతో అవసరం. అయితే, మానసికంగా, సాంఘికంగా అభివృద్ధి చెందాలంటే వారికి ప్రోత్సాహం కూడా ఎంతో అవసరం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మరియు ఇతర సంరక్షకులు ఉద్దేశ్యపూర్వకంగా ప్రతి బిడ్డ మానసికంగా, సాంఘికంగా ఎదగడానికి ఎంతో సహాయపడాలి.

తల్లిదండ్రులు క్రింద ఇవ్వబడిన జాబితాలోని విషయాలు పాటించినప్పుడు, వారి పిల్లలు మానసికంగా, సాంఘికంగా ఎదగడానికి సహాయపడతారు.

► ఈ జాబితా జాగ్రత్తగా చదవండి. రెండవసారి మరలా చదవండి. తల్లిగా/తండ్రిగా మీరు ఇప్పటికే చేస్తున్న పనితో పాటుగా, ఆ పనిని ఏ విధంగా చేస్తున్నారో కూడా ఒక ఉదాహరణ రాయండి. మీరు ఉద్దేశ్యపూర్వకంగా చేయకుండా ఉన్నటువంటి విషయాల ప్రక్కన టిక్ గుర్తు పెట్టండి. ఆ తర్వాత దాని ప్రక్కన, మీరు చేయడానికి పూనుకున్న దానిని రాయండి. ఒకవేళ మీరు తల్లి/తండ్రి కాని యెడల, మీ బంధువుల్లో లేక మీ సన్నిహితుల్లో పిల్లలకు మీరు చేయగల విషయాలను ఈ జాబితాలో నుండి ఎంపిక చేసుకోండి.

***మీ పిల్లల అభివృద్ధికి మీరు సహాయం చేయగల మార్గాలు***[38]

(1) మిమ్మల్ని మీరు పట్టించుకోవడం ద్వారా

- మీ వ్యక్తిగత ఒత్తిడిని సరిగా నిర్వహించుకోవాలి

---

[38] Charles A. Smith, et al., *National Extension Parent Education Model*. (Manhattan, Kansas: Kansas Cooperative Extension Service, 1994) నుండి తీసుకొనబడింది. https://www.k-state.edu/wwparent/nepem/nepem.pdf నుండి July 31, 2023న తీసుకొనబడింది.

- మీ కుటుంబ వనరులను సరిగా చూసుకోవాలి
- ఇతర తల్లిదండ్రులకు సహాయం చేయాలి
- అవసరమైనప్పుడు ఇతరుల సహాయాన్ని అడిగి పొందుకోవాలి.
- మీ వ్యక్తిగత సామర్థ్యాలు, సంరక్షించే సామర్థ్యాలు గుర్తించాలి
- పిల్లలను పెంచడంలో మీ లక్ష్యాలు స్పష్టంగా ఉంచుకోవాలి

(2) అర్థం చేసుకోవడం ద్వారా

- మీ పిల్లలను జాగ్రత్తగా గమనిస్తూ, వారి అభివృద్ధిని అర్థం చేసుకోవాలి
- పిల్లలు వారి చుట్టూ జరిగే వాటికి ఎలా స్పందిస్తారో, వారిపై వాటి ప్రభావం ఎలా ఉంటుందో గుర్తించాలి.

(3) మార్గనిర్దేశం చేయడం ద్వారా

- మంచి ప్రవర్తన చూపించి, ఆదర్శంగా ఉండాలి.
- సహేతుకమైన పరిమితులను యేర్పరచి, వాటిని ఆచరించాలి.
- బాధ్యతను నేర్పించే అవకాశాలు పిల్లలకు ఇవ్వాలి. (అవకాశాలు వారి దశకు తగినట్లుగా ఉండాలి).
- సమస్యను పరిష్కరించే నైపుణ్యాలు బోధించాలి
- పిల్లల కార్యక్రమాలపై దృష్టి ఉంచాలి
- పిల్లలు ఇతర పిల్లలతో మరియు పెద్దలతో ఎలా మాట్లాడుతున్నారో, ఎలా ఉంటున్నారో గమనించాలి.

(4) పోషించడం ద్వారా

- ఆప్యాయత, కనికరం చూపించాలి.
- పిల్లల ఆత్మాభిమానాన్ని, నిరీక్షణను పెంపొందించాలి.
- పిల్లల భావాలు, ఆలోచనలు వినాలి, శ్రద్ధ చూపించాలి
- కనికరం నేర్పించాలి
- సంరక్షణ, ఆశ్రయం, దుస్తులు, ఆరోగ్యం మరియు భద్రత వంటి అవసరాలు తీర్చాలి
- పిల్లలతో జీవితాన్ని ఆనందించాలి
- కుటుంబ చరిత్రతో, సంస్కృతితో అనుసంధానంగా ఉండేలా పిల్లలకు సహాయం చెయ్యాలి

(5) ప్రోత్సహించుట ద్వారా

- తమ గురించి, ఇతరుల గురించి, చుట్టూ ఉన్న ప్రపంచం గురించి పిల్లలకు బోధించాలి.
- జిజ్ఞాస, ఊహ మరియు జ్ఞానం కొరకైన ఆశను ప్రోత్సహించాలి
- నేర్చుకునే వాతావరణాన్ని సృష్టించాలి
- సమాచారాన్ని అర్థం చేసుకొని, దానిని ఉపయోగించడంలో పిల్లలకు సహాయం చేయాలి.

(6) సలహాలిచ్చుట ద్వారా

- సొంత పిల్లలు, సమాజంలో పిల్లల మేలు కోసం సామాజిక వనరులు కనుగొనాలి. ఉపయోగించాలి అవసరమైతే క్రొత్తవి కనిపెట్టాలి.
- పిల్లలకు, కుటుంబాలకు అనుకూలమైన వాతావరణాన్ని సృజించడానికి సామాజిక మార్పును ప్రోత్సహించాలి.
- కుటుంబంతో, పొరుగువారితో, సమాజంతో బంధాలు నిర్మించుకోవాలి.

**ఆత్మీయ అభివృద్ధి**

దేవుడు మనల్ని ఆత్మీయ జీవితంతో సృజించాడు గనుక (ఆదికాండము 2:7), పిల్లలకు విశ్వాసం బోధించాలి, దేవుని సహవాసంలో జీవించేలా వారిని నడిపించాలి.

► విద్యార్థులు తరగతి కోసం కీర్తన 78:5-8 మరియు ద్వితీయోపదేశకాండము 6:4-9 చదవాలి. మీ కుటుంబానికి జాగ్రత్తగా బోధించుమన్న దేవుని ఆజ్ఞను మీరు ఏ విధంగా పాటిస్తున్నారు? మీరు ఇంకా ఏ విషయాల్లో ఎదగవలసిన అవసరత ఉంది?

కుటుంబాలకు బోధించుమన్న దేవుని ఆజ్ఞలను మనం తీవ్రంగా పరిగణించాలి. లేనియెడల, దేవునికి అవిధేయత చూపిస్తాం, మన పిల్లలు కూడా దేవుని అధికారాన్ని తిరస్కరిస్తారు.

పిల్లలకు వివిధ రకాలుగా బోధించవచ్చు: బైబిల్ పఠనం, యేసు పాటలు పాడడం, లేఖన కంఠస్తం, ప్రార్థన, బోధించడానికి ప్రశ్నలు సమాధానాలు ఉపయోగించడం, అనుదిన సంభాషణలు చేయడం. సంఘంలో పాలుపొందడం కూడా కుటుంబమంతటికీ ఎంతో ముఖ్యం.

కొన్నిసార్లు పిల్లలను నిద్రపుచ్చే సమయంలో, తల్లి/తండ్రి వారిని ఒడిలో పడుకోబెట్టుకుని, విశ్వాసం గురించి యేసు ప్రేమ గురించి పాటలు పాడుతారు. వారు దేవుని ప్రేమ గురించి వింటూ, తల్లిదండ్రుల ప్రేమను అనుభవిస్తున్నప్పుడు వారి విశ్వాసం బలపడుతుంది.

## ముగింపు

మీరు తల్లిగా/తండ్రిగా ఉన్నప్పుడు, మీ రోజులు చాలా సుధీర్ఘముగా ఉంటాయి. అవి చాలా బిజీగా, అలసిపోయేలా ఉంటాయి. అవి మీ దినాలు కాదు. అయినప్పటికిని, పిల్లల ఏడుపులు, ఒలికిన పాలు, తడిసిన డైపర్లు, ఎప్పటికీ ముగియని రోజువారీ పనుల మధ్య, కొంచెం సమయం తీసుకొని లోతుగా ఆలోచించండి. దేవుని పిల్లలలో ఒకరిని మీరు చూసుకుంటున్నారని, దేవుడు తన శాశ్వత ప్రణాళికలో మిమ్మల్ని నమ్మి ఆ బిడ్డను అప్పగించాడని జ్ఞాపకం చేసుకోండి. ఆయన మీ నుండి ఒక పరిపూర్ణమైన ఇంటిని, గొప్ప ఆర్థిక ప్రణాళికను, విలాసవంతమైన భోజనాన్ని, లేదా ఆయన పిల్లల కోసం ఖరీదైన దుస్తులను అడగడం లేదు. ఆయన మీ నుండి అడుగుతున్నది ఇదే:

> నీ పూర్ణహృదయముతోను నీ పూర్ణాత్మతోను నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను. నేడు నేను నీకాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో ఉండవలెను.నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి, నీ యింట కూర్చుండునప్పుడును త్రోవను నడుచునప్పుడును పండుకొనునప్పుడును లేచునప్పుడును వాటినిగూర్చి మాటలాడవలెను (ద్వితీయోపదేశకాండము 6:5-7).

## సమూహ చర్చ కోసం

► మీ సమాజంలో పిల్లల సంరక్షణకు సంబంధించిన ఏ విషయాలు తరచుగా నిర్లక్ష్యం చేస్తారు?

► కుటుంబాలు ఎలాంటి కష్టాలు ఎదుర్కొంటాయి? ఈ పాఠంలో వివరించబడిన పిల్లల సంరక్షణను అందించడం వారికీ ఎందుకు అంత సులభం కాదు?

► గర్భవతులైన తల్లులు వారినివారు చూసుకుంటూ పుట్టబోయే బిడ్డలను కూడా చూసుకోవడానికి విశ్వాసులు ఎలా సహాయపడగలరు?

► చిన్న పిల్లల జీవితాల్ని వారి తల్లుల జీవితాల్ని ఆశీర్వదించడానికి క్రైస్తవ కుటుంబాలు ఏ విధంగా కలిసి పనిచేయగలరు?

► చిన్న పిల్లల అవసరాలు తీర్చడానికి సంఘం ఎలాంటి పరిచర్య కార్యాలు ఏర్పాటు చేయగలదు?

## ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ,

అద్భుతమైన సృష్టికర్తా నిన్ను ఆరాధిస్తున్నాం. నీవు మమ్మును మా తల్లి గర్భంలో రూపించావు మరియు మా జీవితకాలమంతా శ్రద్ధ చూపించావు. మేము పుట్టక మునుపే నీవు సమస్తం ఎరిగియున్నావు.

బలహీనులను, తల్లి గర్భంలో ఉన్నవారిని కాపాడేందుకు మేము చేయగల కార్యాలు చేయడానికి మాకు సహాయం చేయుము. గర్భవతులైన తల్లులకు పరిచర్య చేయువారిని ఆశీర్వదించుము.

మమ్మును నమ్మి పిల్లలను కని, పెంచే బాధ్యతను మాకు అప్పగించినందుకు ధన్యవాదములు. మీరు మీ పిల్లలను కని, పెంచుతుండగా, వారి పట్ల శ్రద్ధ చూపిస్తూ, వారికి శిక్షణ ఇచ్చే విషయంలో జాగ్రత్తగా ఉండడానికి మాకు సహాయం చేయుము.

మా పిల్లలను పెంచే విషయంలో నీకు లోబడి జీవించాలని ఆశించుచున్నాం. మా పిల్లలకు నిన్ను సరిగా చూపించడానికి సహాయం చేయుము. మా పిల్లలకు నీ ప్రేమను నీ విధేయతను నేర్పుటకు సహాయం చేయుము.

ఆమెన్

**పాఠం అభ్యాసాలు**

(1) 2 తిమోతికి 1:3-5; 1 కొరింథీయులకు 4:17; ఫిలిప్పీయులకు 2:19-23 చదవండి. ఈ ప్రశ్నలకు సమాధానలిస్తూ పేరా రాయండి:

- ఏ ఇద్దరు స్త్రీల గురించి పేర్కొనబడింది మరియు కుటుంబంలో వారి పాత్ర ఏంటి?
- వారు తిమోతిపై స్పష్టంగా ఎలాంటి ప్రభావం చూపించారు?
- ఆది సంఘంలో వారి ప్రభావం ఎలాంటి మార్పు తెచ్చింది?

(2) ఈ కోర్సులో మీరు కంఠస్థం చేసిన వాక్యభాగాలను సమీక్షించండి: ద్వితీయోపదేశకాండము 6:4-9, రోమా 6:11-14, కొలొస్స 3:5-7, అలాగే 5వ పాఠంలో, 4వ అభ్యాసంలో మీరు ఎంపిక చేసుకున్న వచనాలను కూడా సమీక్షించండి. ఈ వచనాలు మీరు అధ్యయనం చేస్తుండగా మీపై ఎలాంటి ప్రభావం చూపించాయి?

(3) కీర్తన 78:4-8 కంఠస్థం చేయండి. తరువాత క్లాసు మొదలుపెట్టే ముందు, కంఠస్థం చేసిన వాక్యభాగాన్ని రాయండి లేక ఉల్లేఖించండి.

(4) మీ కుటుంబలో ఉన్న ప్రతి ఒక్కరి వ్యక్తిగత అవసరాలు కోసం ప్రార్థించండి. మీ కోసం ప్రార్థన చేసుకోండి.

# పాఠం 12

# ఉద్దేశ్యపూర్వక పిల్లల పెంపకం

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) దేవుడు తల్లిదండ్రులకు ఇచ్చిన బాధ్యతలు వివరించాలి.

(2) ప్రవర్తన అభివృద్ధి చెందే ఆరంభ దశ ప్రాముఖ్యతను గ్రహించాలి.

(3) జీవితంలో తొమ్మిది రంగాల్లో పిల్లల అభివృద్ధి కోసం ఉద్దేశ్యపూర్వకంగా ప్రణాళిక చేయడానికి సిద్ధంగా ఉండాలి.

(4) పిల్లల స్వీయచిత్తం, పిల్లలపై బాహ్య ప్రభావాలు మధ్య పరస్పర చర్యను వివరించాలి.

(5) పిల్లలను నమ్మకంగా శిష్యులనుగా చేయడానికి కట్టుబడి ఉండాలి.

## జోనాథన్ ఎడ్వార్డ్స్, కుటుంబ వారసత్వానికి తండ్రి

జోనాథన్ ఎడ్వర్డ్స్ 1700లలో ఒక గొప్ప గౌరవం పొందిన సేవకుడుగాను, వేదాంతవేత్తగాను జీవించాడు. అతను మరియు అతని భార్య శారాకు పదకొండు మంది పిల్లలు. శారా ఒక గొప్ప భార్య మరియు గొప్ప తల్లి, ఆమె తన పిల్లల ప్రవర్తన విషయంలో గొప్ప ప్రభావం చూపింది. జోనాథన్ ఒక సమర్పణగల తండ్రి. "ప్రతి రాత్రి జోనాథన్ ఇంటికి వచ్చినప్పుడు, ఒక గంటపాటు కుటుంబంతో మాట్లాడి ఆ తర్వాత పిల్లల కోసం ప్రార్థించి వారిని దీవించేవాడని" మనకు చెప్పబడింది."[39]

ఏ. ఈ. విన్ షిప్, 1800 చివరి కాలంలో బోధించిన విద్యావేత్త జోనాథన్ మరియు శారా ఎడ్వర్డ్స్ కుటుంబ వారసత్వాన్ని పరిశీలించాడు, జోనాథన్ చనిపోయిన తర్వాత, 150 సంవత్సరాల తరాల గురించి పరిశోధించాడు. ఎడ్వర్డ్ కుటుంబ తరాల విషయంలో ఇవి కనుగొన్నాడు:

---

[39] ఈ ఉల్లేఖనం మరియు ఈ భాగానికి సంబంధించిన సమాచారం Larry Ballard, "Multigenerational Legacies – the Story of Jonathan Edwards," YWAM Family Ministries, July 1, 2017 నుండి వచ్చింది. https://www.ywam-fmi.org/news/multigenerational-legacies-the-story-of-jonathan-edwards/ on January 11, 2021 నుండి తీసుకోబడింది.

- 1 అమెరికా ఉప-అధ్యక్షుడు
- 1 న్యాయ పాఠశాల డీన్
- 1 వైద్య పాఠశాల డీన్
- 3 అమెరికా సినేటర్లు
- 3 గవర్నలు
- 3 మేయర్లు
- 13 కళాశాల పెసిడెంట్లు
- 30 న్యాయమూర్తులు
- 60 వైద్యులు
- 65 ప్రొఫెసర్లు
- 75 మిలటరీ అధికారులు
- 80 ప్రభుత్వ అధికారులు
- 100 న్యాయవాదులు
- 100 పాస్టర్లు/ సంఘు నాయకులు
- 285 కళాశాల పట్టభద్రులు

ఇంత గొప్ప ఫలవంతమైన వారసత్వం ఎలా సాధ్యమైంది? ఎడ్వర్డ్స్ దంపతుల పదకొండు మంది పిల్లల జీవితాల్లో దేనిని పెంచితే, వారి వారసులు వారి నిజాయితీ, బాధ్యత, నాయకత్వం, సమాజానికి సేవ వంటి వాటితో ప్రసిద్ధి చెందారు? నిస్సందేహంగా, జొనాథన్ ఒక దైవభీతిగల, శ్రద్ధగల తండ్రి, అతను తన పిల్లలకు ఆదర్శప్రాయంగా ఉన్నాడు.

తల్లిదండ్రులు తీసుకునే నిర్ణయాలు, భవిష్యత్తు తరాలపై దేవునితో తమ పిల్లలకున్న సంబంధంపై ప్రభావం చూపుతాయని బైబిల్ చెబుతుంది.

► విద్యార్థులు తరగతి కోసం ద్వితీయోపదేశకాండము 5:9-10 మరియు ద్వితీయోపదేశకాండము 7:9 చదవాలి.

ఒకరి తల్లిదండ్రులు ఏ నిర్ణయాలు తీసుకున్నారన్న దానితో సంబంధం లేకుండా, ప్రతి ఒక్కరికి ప్రభువును సేవించే అవకాశం ఉంది, తమ పిల్లలకు దైవికమైన తల్లిదండ్రులుగా ఉండే అవకాశం ఉంది. మీరు మీ వారసులు నమ్మకంగా ప్రభువును సేవిస్తూ, ఆయన కృపా ఆశీర్వాదాలను అనుభవించవచ్చు. దేవుణ్ణి నమ్మకంగా సేవిస్తూ, మీ పిల్లలను ఆయన అవగాహనలోకి నడిపించే తల్లిదండ్రులుగా ఉండడానికి మీరు ఇష్టపడుతున్నారా?

## పిల్లవాడికి దేవునిని పరిచయం చేయడం

దేవుడు యాకోబుతో మొదటిగా మాట్లాడినప్పుడు, "నేను విశ్వానికి దేవుడను," లేక "నేను లోకాన్ని సృష్టించిన దేవుడను," అని ఆయన చెప్పలేదు, నిజానికి ఈ రెండు ప్రకటనలు వాస్తవాలే. ఆయన ఇలా చెప్పాడు, "నేను నీ తండ్రియైన అబ్రాహాము దేవుడను ఇస్సాకు దేవుడైన యెహోవాను..." (ఆదికాండము 28:13). యాకోబు దేవునితో తన సంబంధాన్ని, ఆయన గురించి ఏమాత్రం తెలియకుండానే ప్రారంభించలేదు. తన తండ్రి, తాతల బోధల ద్వారా అతనికి దేవుని గురించి తెలుసు.

అబ్రహాము దేవుడిని ఆరాధించే ఒక సంప్రదాయాన్ని ప్రారంభించాడు. అబ్రహామును చూసి, వారంతట వారికి దేవుడితో అనుభవం కలగక ముందే, చాలా మందికి దేవుడిపై నమ్మకం కలిగింది. అబ్రహాము సేవకుడైన ఎలీయెజెరు ప్రార్థన చేసినప్పుడు, అతడు తన యజమానియైన అబ్రహాము దేవుడైన యెహోవాను ప్రార్థించాడు (ఆదికాండము 24:12).

తర్వాత కాలంలో, దేవుడు అనేకసార్లు "అబ్రాహాము దేవుడు, ఇస్సాకు దేవుడు, యాకోబు దేవుడు"గా గుర్తించబడ్డాడు (ఉదాహరణకు, నిర్గమకాండము 3:15). తర్వాతి తరంవాడైన యోసేపు, దేవుడు అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులకు చేసిన వాగ్దానాలను గుర్తు చేశాడు (ఆదికాండము 50:24). గత తరాలకు దేవుడు చేసిన వాగ్దానాల కారణంగా తన కుటుంబం దేవునికి నమ్మకంగా ఉంటుందని యోసేపు ఆశించాడు.

► దేవుడు తననుతాను గుర్తించుకున్న విధానం ద్వారా, ప్రజలు దేవుణ్ణి తెలుసుకున్న విధానం గురించి మనం ఏం నేర్చుకోగలం?

సహజంగా ప్రజలు, కేవలం దేవుని గురించిన సిద్ధాంతాలు మాత్రమే విని దేవునితో సహవాసం చేయరు. దేవునితో సహవాసం చేసే వారి జీవితాల్ని పరిశీలిస్తూ దేవుని గురించి నేర్చుకుంటారు. **గొప్ప ఆత్మీయ ప్రభావం దైవభక్తిగల తల్లిదండ్రుల నుండి వస్తుంది.**

పరిగణలోకి తీసుకోవలసిన కొన్ని ముఖ్యమైన వ్యక్తిగత ప్రశ్నలు ఇక్కడ ఉన్నాయి: మీ జీవితాన్ని పరిశీలించడం ద్వారా మీ పిల్లలు దేవుని గురించి ఏం నేర్చుకుంటారు? మీ పిల్లలు, దేవునితో మీకున్న సంబంధాన్ని చూసి దేవునికి నమ్మకంగా ఉండాలని అనుకుంటారా?

## తల్లిదండ్రుల బాధ్యత

దేవుడు తల్లిదండ్రులకు గొప్ప బాధ్యత అనుగ్రహించాడు. "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు" (సామెతలు 22:6).

పిల్లలు దేవుణ్ణి అనుసరించే విధంగా తల్లిదండ్రులు ఉద్దేశ్యపూర్వకంగా వారికి బోధించాలి. పిల్లల్ని నడిపిస్తూ వారికి శిక్షణ ఇచ్చే బాధ్యతను తల్లిదండ్రులు తప్పక అర్థం చేసుకోవాలి.

పిల్లలకు శిక్షణ ఇచ్చే బాధ్యత ముందుగా తల్లిదండ్రులదే, సమాజానిది, పాఠశాలది లేదా సంఘానిది కాదు. తల్లిదండ్రులు తమ పిల్లలు సంఘంలో ఉండేలా చూసుకోవాలి, కానీ చర్చి తమ పిల్లలకు శిక్షణ ఇస్తుందని వారు భావించకూడదు.

► ఒక విద్యార్థి తరగతి కోసం ఎఫెసీయులకు 6:1-4 చదవాలి. తండ్రులు ఏమి చేయవలసి ఉంది?

పిల్లలకు శిక్షణ ఇవ్వడం కేవలం తల్లి బాధ్యత కాదు. కుటుంబాన్ని ఆత్మీయంగా సంరక్షించవలసిన బాధ్యత తుదకు తండ్రిపై ఉంది.

పిల్లల జీవితానికి అవసరమైన శిక్షణ ఇవ్వడం తల్లిదండ్రుల గొప్ప బాధ్యత. జీవితానికి అవసరమైన శిక్షణ అంటే వృత్తి కోసం ఇచ్చే శిక్షణ కాదు; దేవునికి ఇష్టమైన నీతి జీవితాన్ని గడపడానికి అవసరమయ్యే శిక్షణ అని అర్థం. తల్లిదండ్రులు, పిల్లలు నిదానంగా మారతారులే అనే ఆలోచనతో వారిని పాపంలో కొనసాగనియ్యకూడదు.

లోకం అందించే తప్పుడు తత్వశాస్త్రాలు నేర్చుకోకూడదని లేఖనం మనల్ని హెచ్చరిస్తుంది.

► ఒక విద్యార్థి తరగతి కోసం కొలొస్స 2:8 చదవాలి.

మనం తప్పుడు జ్ఞానాన్ని నమ్మడం ద్వారా, తప్పుడు జీవనశైలిని అంగీకరించడం ద్వారా మోసపోతామని లేఖనం హెచ్చరిస్తుంది. క్రీస్తును అనుసరించకుండా, లోక ఆలోచనల్ని అనుసరించాలని బోధిస్తూ లోకం మన పిల్లల్ని మోసం చేస్తుంది.

పిల్లలు తమ విద్యను క్రైస్తవ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుండి నేర్చుకోవడం మంచిది. క్రైస్తవ పాఠశాలలు అందుబాటులోలేని ప్రాంతాల్లో, పిల్లలకు జీవితం గురించిన మంచి దృక్కోణాన్ని పొందుకునేలా తల్లిదండ్రులు చూడాలి. లౌకిక విద్య పిల్లలకు నాస్తికత్వం, పరిణామ క్రమం మరియు మానవత్వం గురించి బోధిస్తుంది. పిల్లలు ముఖ్యంగా అబద్ధ బోధలకు లోనైపోతారు (ఎఫెసీయులకు 4:14), తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పక కాపాడుకోవాలి.

తప్పుడు తత్వజ్ఞానాల నుండి ప్రజలను కాపాడగలిగే సిద్ధాంతాలను ఎలా బోధించాలో సేవకులు నేర్చుకోవాలి. పిల్లలను సత్యంలో స్థిరపరచడానికి సహాయపడే సమాచారాన్ని, సేవకులు బోధకులు కుటుంబాలకు అందించాలి.

### ఆరంభ శిక్షణ

► ఒకరు Children Are Wet Cement (పిల్లలు తడి సిమెంట్ లాంటి వాళ్ళు) అనే పుస్తకాన్ని రాశారు. ఈ పేరుకు అర్థం ఏమై ఉండవచ్చని మీరు భావిస్తున్నారు?

పిల్లలు జీవితం గురించి నేర్చుకుని, చిన్నప్పుడే ఏది ప్రాముఖ్యమో నిర్ణయించుకుంటారని తల్లిందండ్రులు గ్రహించాలి. చిన్నతనంలోనే పిల్లల గుణం రూపొందించబడుతుంది.

పిల్లలు కౌమార దశలోకి వెళ్లకముందే క్రమశిక్షణ గురించిన బోధ ఎక్కువగా చెయ్యాలి. బైబిలు సాహిత్య లక్ష్యాలు, స్వభావ లక్ష్యాలు, వ్యక్తిగత, సాంఘిక, ఆత్మీయ అలవాట్లు కౌమార దశకు ముందే వృద్ధిచెందాలి.

ఐదేళ్లు రాకముందే, ఒక పిల్లవాడు ప్రజలు ఒకరితో ఒకరు ఎలా సంబంధం పెట్టుకుంటారు మరియు ఎలాంటి ప్రవర్తనతో తాను కోరుకున్న ఫలితాలు పొందుతాడో అనే విషయాల ప్రాథమిక అంశాలను నేర్చుకుంటాడు. అతను న్యాయం ఆశించవచ్చా లేదా మరియు శిక్షలు, బహుమతులు స్థిరంగా ఉంటాయా లేదా అని తెలుసుకుంటాడు. తనని ప్రేమిస్తున్నారో లేదో అతనికి తెలుసు. తన భావాలు ఇతరులకు ముఖ్యమైనవో కాదో అతనికి తెలుసు. తప్పు చేసినప్పుడు తనని క్షమించగలరో లేదో అతనికి తెలుసు. తన తప్పులు, పాపాలను ఒప్పుకోవాలా లేక దాచాలా అని అతను నేర్చుకుంటాడు. అధికారం ఉన్న వ్యక్తులను నమ్మి, తన పట్ల శ్రద్ధ తీసుకుంటారని మరియు వారి వాగ్దానాలను నిలబెట్టుకుంటారని నమ్మవచ్చా లేదా అని అతను నిర్ణయించుకుంటాడు.

పిల్లలు తమ తల్లిదండ్రులు ఉద్దేశపూర్వకంగా నేర్పించాలని ప్రయత్నించనప్పుడు కూడా, వారి మాటలు, చేతల నుండి నేర్చుకుంటారు (ఎఫెసీయులకు 5:1). పెద్దల జీవనశైలుల ద్వారా జీవితమంటే ఏమిటో పిల్లలు నేర్చుకుంటారు. పెద్దలకు ఏది ముఖ్యమో దానిని చూసి, పిల్లలు కూడా అదే ముఖ్యమని నేర్చుకుంటారు. ఇతరులతో ఎలా ఉండాలో, పరిస్థితులకు ఎలా స్పందించాలో, బాధ్యతలు ఎలా నిర్వహించాలో పెద్దలను చూసి నేర్చుకుంటారు. ఈ విద్య, బిడ్డ జన్మించినప్పటినుండే ప్రారంభమౌతుంది.

పిల్లలు ఏం చెయ్యాలో వారికి నేర్పించినప్పుడే బోధిస్తున్నామని కొంతమంది తల్లిదండ్రులు భావిస్తారు. అయితే, పిల్లలు తల్లిదండ్రులను పరిశీలించిన ప్రతిసారి కూడా వారు పిల్లలకు బోధిస్తున్నారు.

ఒక అబ్బాయి, పెద్దలను చూసి ఒత్తిళ్ళలో ఎలా స్పందించాలో నేర్చుకుంటాడు. అపరిచితులతో ఎలా వ్యవహరించాలో నేర్చుకుంటాడు. తక్కువ స్థాయిలో ఉన్నవారితో ఎలా ఉండాలో నేర్చుకుంటాడు. విమర్శల సమయంలో ఎలా

స్పందించాలో నేర్చుకుంటాడు. ఇతరుల అవసరాలకు ఎలా స్పందించాలో నేర్చుకుంటాడు. తల్లిదండ్రులు పిల్లలకు బోధించట్లేదు అని భావించినప్పుడు కూడా ఎల్లప్పుడు పిల్లలకు బోధిస్తారు.

ఒక పిల్లవాడిని ఎప్పుడూ విమర్శిస్తూ ఉంటే, అతను తన తప్పులను దాచడం, సాకులు చెప్పడం, మరియు ఇతరులను నిందించడం నేర్చుకుంటాడు. అతను పెద్దవాడైనప్పుడు ఖండిస్తూ, వేషధారణతో కూడిన రహస్య జీవితాన్ని జీవిస్తాడు. ఇంట్లో తరచు సంఘర్షణలు ఉంటే, అతడు పిరికితనంతో ఉంటాడు లేక కోపంతో మండిపడతాడు. కుటుంబ సభ్యులు అతడిని ఎగతాళి చేస్తే, అతను ఇతరులతో కలవకుండా దూరంగా ఉంటాడు లేదా ఇతరులను వేధించేవాడిగా మారతాడు. ఒకవేళ తన తల్లిదండ్రులు ఎల్లప్పుడు అతన్ని అవమానిస్తుంటే, అపరాధ భావంతోనే జీవిస్తాడు, దేవుడు నన్ను ఎన్నడు అంగీకరించడనే భావనలో బ్రతుకుతాడు. తల్లిదండ్రులు ఆశించే జీవితాన్ని జీవించలేనప్పుడు, తిరుగుబాటు చేస్తాడు మరియు ఇతర తిరుగుబాటు చేసే వారితో మమేకమై దాన్నే ఒక కుటుంబంగా భావిస్తాడు.

ఒకవేళ ప్రజలు అతనితో సహనంగా ఉంటే, ఇతరులతో సహనంగా ఉండడం నేర్చుకుంటాడు. ప్రజలు అతన్ని ప్రోత్సహిస్తే, ప్రయత్నించాలనే నమ్మకంతో ఉంటాడు. అతన్ని మెచ్చుకుంటే, తాను విలువైనవాడనని భావించి, ఇతరులను మెచ్చుకుంటాడు. అతడు న్యాయాన్ని చూసినప్పుడు, న్యాయంగా ఉండాలనుకుంటాడు.

తల్లిదండ్రులు సూత్రాల్ని ఉల్లంఘిస్తూ, విధేయత చూపాలని వాళ్ళ పిల్లవానికి చెబితే, ఒకరోజు పెద్దవాడైనప్పుడు తాను కూడా సూత్రాల్ని ఉల్లంఘించగలనని అనుకుంటాడు. తల్లిదండ్రులు ఇతరులపట్ల కనికరం చూపనప్పుడు, పిల్లవాడు కూడా బలవంతుడై ఇతరుల పట్ల కనికరం చూపకూడదని అనుకుంటాడు. పిల్లల సమస్యలు, అవసరాలు అంత ప్రాముఖ్యం కాదని తల్లిదండ్రులు భావిస్తే, పిల్లవాడు పెద్దయ్యాక తనను మాత్రమే పట్టించుకుంటూ ఇతరులను విస్మరించగలనని భావిస్తాడు.

తల్లిదండ్రులు ఎలప్పుడు దేవుని పట్ల సమర్పణను చూపిస్తూ ఉండాలి. తమ తల్లిదండ్రులు దేవుని వాక్యానికి లోబడతారని పిల్లలకు తెలియాలి. దేవుని అధికారం కంటే తమ ఇష్టమే గొప్పదని తల్లిదండ్రులు చూపించినప్పుడు, పిల్లలు కూడా అదే విధంగా జీవించాలని చూస్తారు. తల్లిదండ్రులు ఎల్లప్పుడు, నిర్ణయం తీసుకునేటప్పుడు పరిగణించగలసిన కారణాలను, విషయాలను పిల్లలకు వివరించాలి. ఇది, నిర్ణయాలు ఎలా తీసుకోవాలో పిల్లవాడికి నేర్పుతుంది.

తల్లిదండ్రులు పిల్లలతో ఆటలు ఆడినప్పుడు వారు నేర్చుకుంటారు. వారు న్యాయాన్ని, పరిగణలోకి తీసుకోవలసిన విషయాల్ని, ఇతరులకు స్పందించవలసిన విధానాన్ని నేర్చుకుంటారు. ఆటలు పిల్లల నైపుణ్యాల్ని మెరుగుపరుస్తాయి. కుటుంబంలో ఆడే ఆటల ఉద్దేశ్యం నేర్చుకోవడం, వ్యక్తిగత అభివృద్ధి, కుటుంబ సభ్యులతో ఆనందంగా సమయం

గడపడం. కుటుంబ ఆటల్లో పోటీతత్వం మంచిదే కాని ఇతరులను అధిగమించాలనే ఉద్దేశ్యంతో ఉండకూడదు, ఒకవేళ ఆ విధంగా ఉంటే గెలిచినవాడు ఆధిపత్య భావనను ఆనందిస్తాడు. ఆటలు ఆడేడప్పుడు, "అందరు ఆటను ఆనందిస్తున్నారా?" అనే ప్రశ్నను పరిగణలోనికి తీసుకోవాలి. కేవలం గెలిచినవాడు మాత్రమే ఆటను ఆనందిస్తే, అక్కడ తప్పుడు ఉద్దేశ్యం పని చేస్తుంది. ఆటలో ఆడేవారికి కోపం వస్తుంటే లేక నిరుత్సాహపడుతుంటే, ఆటలో మంచి ఉద్దేశ్యం లేదని అర్థం.

తల్లిదండ్రులు పిల్లల కార్యాచరణలకు సమయం వెచ్చించినప్పుడు పిల్లలు ఎంత విలువైనవారో చూపించగలరు. తల్లిదండ్రులు పిల్లలకు తమ స్కూల్ ప్రాజెక్టుల్లో, ఆట బొమ్మలను తయారు చేయడంలో లేక బాగు చేయడంలో సహాయం చెయ్యాలి, ఇంట్లో పిల్లలకు ప్రత్యేక స్థలం కల్పించాలి, వారి కథలు జోకులు వినాలి మరియు బాధలో ఉన్నప్పుడు ఆదరించాలి.

తల్లిదండ్రులు తమ పిల్లల ఉపాధ్యాయులను కచ్చితంగా తెలుసుకోవాలి. పిల్లల చదువు గురించి తెలుసుకోవడానికి ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశాలకు వారు హాజరు కావాలి. వీలైతే, తల్లిదండ్రులు ఇద్దరూ కలిసి వెళ్లాలి. ఒకవేళ తండ్రి వెళ్లకపోతే, అతనికి తన పిల్లల కన్నా వేరే విషయాలు ముఖ్యమని అనిపిస్తుంది.పిల్లల మార్కుల గురించి, పాఠశాలలో జరిగే విషయాల గురించి తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అడగాలి. తల్లిదండ్రులకు ఆసక్తి ఉందని తెలిస్తే, ఉపాధ్యాయులు పిల్లల పట్ల మరింత శ్రద్ధ పెట్టి, వారితో దురుసుగా ప్రవర్తించడం మానేస్తారు.

ఒక కుటుంబంగా కలిసి నివసించే వ్యక్తులు ఒకరినొకరు బాగా తెలుసుకుంటారు. పరస్పర అవసరాలు, లోపాలు అర్థం చేసుకుంటారు. పరస్పరం ప్రేమ చూపించుకుంటారు, లోకంలో ఇతరులపై చూపించే ప్రేమ కంటే ఎక్కువగా ప్రేమించగలుగుతారు. ఒకవేళ పరస్పరం ప్రేమ చూపకపోయినట్లయితే, ఇతరులకంటే ఎక్కువగా ఒకరినొకరు బాధించుకుంటారు. కొంతమంది అపరిచితులకంటే కుటుంబ సభ్యుల్ని చులకనగా చూస్తారు. క్రైస్తవ కుటుంబంలో సహనం, క్షమాపణ, శ్రద్ధ, కనికరం ఉండాలి.

### బాల కార్మికులు

చిన్నపిల్లవాడికి ప్రతిరోజు ఆడుకునే సమయం ఉండాలి, అలాగే విశ్రాంతి తీసుకునే సమయం ఉండాలి. విశ్రాంతి తీసుకోవడానికి, ఆలోచనా శక్తిని ఉపయోగించడానికి, పుస్తకాలు చదవడానికి, ఏదొక బొమ్మ తయారు చేయడానికి లేక నిర్మించడానికి, ప్రకృతిని ఆనందించడానికి సమయం ఉండాలి. ఆహారం సమకూర్చుకోవడానికి లేక మరేదైనా చేయడానికి కుటుంబమంతా కలిసి పనిచేసే నేపథ్యాల్లో, పిల్లలు కుటుంబ పనుల్లో సహాయం చేయడం మంచిది, అయితే తల్లిదండ్రులు ఇతర విలువలు కూడా గుర్తుంచుకోవాలి.

పిల్లలు, ఎక్కువ గంటలు పని చేయడం వల్ల అది కేవలం శారీరకంగా కష్టమనిపించడమే కాకుండా అదే పని మళ్ళీ మళ్ళీ చేస్తుంటే అది వారికి విసుగ్గా అనిపిస్తుంది. కల్పనాశక్తిని ఉపయోగించి చేసే పనులకు సమయం కేటాయించాలనుకుంటాడు. పిల్లవాడు తినడానికి, నిద్రపోవడానికి మాత్రమే తన ఖాళీ సమయాన్ని వెచ్చించి, మిగిలిన సమయమంతా అధికంగా పనిచేయడం చాలా విచారకరం.

> "ఒక వ్యక్తికి చిన్నవారి యెడల సానుభూతి లేనప్పుడు, భూలోకంలో అతని వల్ల ప్రయోజనం లేనట్లే."
> - George MacDonald

కొన్ని కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటాయి గనుక పిల్లలు పనిచేస్తే ఆ ఆదాయం ఉపయోగపడుతుందని అనుకుంటారు. అయితే, వారి పిల్లలను చదివించకపోతే, వారి కుటుంబ పరిస్థితి ఎన్నటికి మారదు. పిల్లవాడు స్కూల్ కు వెళ్లకుండా పనిచేసుకుంటే, అతడు జీవిత కాలమంతా తక్కువ జీతానికే పని చేయవలసి వస్తుంది. మంచి మంచి ఉద్యోగ, వ్యాపార అవకాశాలు అతనికి అందుబాటులో ఉండవు.

కొంతమంది ప్రజలు తమ సొంత పిల్లలకు విద్యను అందిస్తారు, కానీ పేద కుటుంబాల పిల్లలను పొలాలలో లేదా ఇంటి పనులలో లేదా వీధి వ్యాపారంలో ఎక్కువ గంటలు పనిలో పెట్టుకుని తప్పుగా ప్రయోజనం పొందడానికి సిద్ధంగా ఉంటారు, వారికి విద్య అందడం లేదని తెలిసినా కూడా అలాగే చేస్తారు. క్రైస్తవులు తమ సమాజంలోని కుటుంబాల కోసం మెరుగైన పరిష్కారాలను కనుగొనడానికి కలిసి పనిచేయాలి.

పిల్లలకు ఏదైనా పనిలో విజయం సాధించాలనే భావన కలిగితే, వారు ఆ పనిని ఆనందిస్తారు. అలాగే, తల్లిదండ్రులు ప్రోత్సహించే విధంగా ఉంటే, వారితో కలిసి పని చేయడానికి కూడా పిల్లలు ఇష్టపడతారు. తల్లిదండ్రులు తమ పిల్లల సామర్థ్యాలపై వాస్తవిక అంచనాలను కలిగి ఉండాలి. పిల్లలు నిరంతరం నేర్చుకుంటూ, ఎదుగుతూ ఉండేందుకు వీలుగా, నిర్మాణాత్మకమైన సలహాలను సానుకూల దృక్పథంతో ఇవ్వాలి.

పిల్లలు నమ్మదగినవారుగా, శ్రద్ధగలవారుగా ఉండడానికి రోజువారి బాధ్యతలు అప్పగించడం మంచిది. పిల్లలు పనిచేస్తున్నప్పుడు వారిలో కనిపించే మంచి గుణాలను అంటే చొరవ తీసుకునే విధానం, శ్రద్ధ, జాగ్రత్త, పట్టుదల వంటి వాటిని తల్లిదండ్రులు మెచ్చుకోవాలి. దేవుని వాక్యం చెప్పే పని సూత్రాలు వారికి బోధించాలి.

పిల్లలు సొంతంగా డబ్బు సంపాదించుకునే అవకాశముండడం మంచిది, వారు దానిని ఎలా ఖర్చు చేయాలో నిర్ణయించుకోగలరు. వారి పని విలువ తెలుసుకుంటారు, మంచి ఫలితాల కోసం డబ్బు ఎలా ఉపయోగించుకోవాలో నేర్చుకుంటారు. డబ్బు సంపాదించడానికి పని చేసే పిల్లవాడు వాటిని పూర్తిగా చాక్లెట్లు కొనుక్కోవడానికి వాడకూడదని

గ్రహించాలి; అతడు ఎక్కువకాలం ఉంచుకోగలిగే వాటిని కొనుక్కోవాలి. డబ్బును దైవికమైన మార్గంలో ఉపయోగించేలాగా తల్లిదండ్రులు తమ పిల్లలకు శిక్షణ ఇవ్వాలి.

పిల్లలకు మరియు కౌమారదశలో ఉన్నవారికి వారి సామర్థ్యాల్ని పెంచే పనుల గురించి పరిచయం చేయడం మంచిది. రకరకాల నైపుణ్యాలుగలవారితో పనిచేసే అవకాశం వస్తే అది యౌవనులకు చాలామంచిది. వారు దాని ద్వారా నేర్చుకుంటారు.

► మీ సమాజంలో ఎలాంటి బాల కార్మిక పరిస్థితులు ఉన్నాయి? తల్లిదండ్రులు ఏమి చేయాలి? సంఘం ఏమి చేయాలి?

## ఉద్దేశ్యపూర్వక పిల్లల అభివృద్ధి

తమ పిల్లల ప్రవర్తనను పెంపొందించే విషయంలో తల్లిదండ్రులు బాధ్యత వహిస్తారు. మ్యాట్ మరియు మేరి అనే ఒక క్రైస్తవ దంపతులు తమ పిల్లల్లో పెంపొందించుకోవాలని ఆశపడిన గుణాల జాబితా చేశారు. జాబితా చేసిన తర్వాత, వారు దాన్ని సమీక్షించి, ఈ ప్రతి గుణాన్ని పెంపొందించుకోవడానికి ఎలాంటి పనులు చేయాలో ప్రణాళిక రూపొందించారు. ప్రక్రియ త్వరితంగా ఉండదు. ఈ గుణాలు వెంటనే కనిపించవు. తల్లిదండ్రులు పిల్లల్ని పెంచే సంవత్సరాలన్నిటిలో స్థిరంగా, ఉద్దేశ్యపూర్వకంగా ఉండాలి. క్రింద ఫ్రైడ్మన్ కొన్ని గుణాలు జాబితా చేశాడు.[40] ఈ జాబితాలో ఇతర గుణాలు కూడా జోడించబడ్డాయి.

| శ్రేణి | 18వ ఏళ్ల వయసులోపు ఉండవలసిన లక్షణాలు |
|---|---|
| ఆధ్యాత్మికత | • వారు దేవుని స్వరూపాన్ని కలిగి ఉన్నారని, వారికి నిత్యత్వపు విలువ ఉందని తెలుసుకోండి.<br>• వారు పాపులని, వారికి రక్షకుడు అవసరమని తెలుసుకోండి.<br>• క్రీస్తుకు సమర్పించుకోవాలి<br>• అనుదినం భక్తి జీవితం గడపాలి<br>• ఆత్మీయ వరాలు ఉపయోగించాలి<br>• క్రైస్తవ పరిచర్య కోసం సిద్ధపడాలి<br>• వివాహం వరకు లైంగిక పవిత్రతతో ఉండాలి |

[40] Matt Friedeman, *Discipleship in the Home,* (Wilmore: Francis Asbury Society, 2010), 31-33.

| | |
|---|---|
| బైబిలు సాహిత్యం | • మూల క్రైస్తవ సిద్ధాంతాలు అర్థం చేసుకోవాలి<br>• ముఖ్య లేఖన వచనాలు కంఠస్తం చేయాలి (300 వచనాలు)<br>• బైబిలు కథలు తెలుసుకోవాలి<br>• బైబిలు పుస్తకాలు తెలుసుకోవాలి<br>• పది ఆజ్ఞలు, కొండమీద ప్రసంగం తెలుసుకోవాలి<br>• బైబిలు అంతటిలో పాపం మరియు రక్షణ గురించి సువార్త విషయాలు చూడాలి. |
| బైబిలు దృష్టికోణం | • విశ్వాసాన్ని ఎలా కాపాడుకోవాలో తెలుసుకోవాలి<br>• జీవితంలో వచ్చే పెద్ద పెద్ద ప్రశ్నలకు బైబిలు ఆధారంగా సమాధానాలు ఇవ్వగలగాలి.<br>• ప్రపంచ మతాలు, తప్పుడు బోధల్లో క్రైస్తవ్యం ఎందుకు ప్రత్యేకమైందో గ్రహించాలి. |
| జ్ఞానం (విద్య) | • వీలైనంతవరకు క్రైస్తవ విద్యను అభ్యసించాలి<br>• క్రమం తప్పకుండా చదవడం, పాడ్‌కాస్ట్‌లు లేదా విద్యాపరమైన వీడియోలు వినడం అలవాటు చేసుకోవాలి<br>• వారి బహుమతులు, పిలుపులను బట్టి కళాశాల విద్యను లేదా వృత్తిపరమైన శిక్షణను పొందాలి |
| ప్రవర్తన | • ఆశా-నిగ్రహాన్ని పాటించాలి<br>• విధేయతతో ఉండాలి-క్షమాపణ చెప్పే విధంగా ఉండాలి<br>• అధికారంలో ఉన్నవారి యెడల గౌరవం చూపించాలి.<br>• దయగా మాట్లాడాలి<br>• సమయాన్ని తెలివిగా ఉపయోగించాలి- సోషల్ మీడియా, వినోదం మొదలగువాటి విషయంలో క్రమశిక్షణతో ఉండాలి |

| | |
|---|---|
| డబ్బు & సేవ | • పేదల పట్ల దేవుని శ్రద్ధను అర్థం చేసుకోవాలి<br>• దాతృత్వంగా ఉండాలి, పేదలకు సేవ చేయాలి<br>• దశమ భాగం ఇవ్వాలి మరియు పొదుపు చేసుకోవాలి<br>• ఆర్థిక బడ్జెట్ ఎలా ఉపయోగించాలో నేర్చుకోవాలి |
| సంబంధాలు | • తోబుట్టువులను ప్రేమించాలి, కలిసిమెలిసి ఉండాలి<br>• సమాజంలో సాధారణ మర్యాద పాటించాలి<br>• నమ్మకమైన మిత్రుడుగా ఎలా ఉండాలో నేర్చుకోవాలి<br>• పెద్దలతో గౌరవంగా, నమ్మకంతో మాట్లాడగలగాలి |
| ఆరోగ్యం | • మంచి పరిశుభ్రత పాటించాలి<br>• ప్రతిరోజు వ్యాయామం చేయాలి<br>• వారికి వడ్డించిన ఆహారం తినాలి<br>• సాధ్యమైనప్పుడు ఆరోగ్యకరమైన ఆహారం తినాలి |
| నైపుణ్యాలు | • దేవుడు వారికి ఇచ్చిన వరాలు అభివృద్ధి చేసుకోవాలి<br>• స్థిరమైన అభ్యాసం ద్వారా క్రమశిక్షణతో తమ నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలి |

ఈ గుణాలు జాబితా చేసిన తర్వాత అతడు అతని భార్య ఏమి చేశారో మాట్ ఫ్రైడ్మెన్ వివరించాడు.

> ఒక పేపరులో పైన చెప్పినవాటిని [గుణాలు] రాసిన తర్వాత, పేపరు మధ్యలో ఒక గీత గీసి, “ఇప్పుడు మనం ఏం చెయ్యాలో[మన పిల్లల్లో ఈ గుణాలు పెంపొందించడానికి మనం వంతు ఏం చెయ్యాలో]?” అని మమ్మును మేము ప్రశ్నించుకున్నాం. ఆ పేపరు యెడమ ప్రక్క, [మన]తల్లిదండ్రుల బాధ్యతలు పెర్కొన్నాం.[41]

ఇది ఒక గొప్ప బాధ్యతగా కనిపించినట్లయితే, దేవుడు మన పిల్లలను శిష్యులుగా చేయడానికి 16-18 ఏళ్ళు ఇచ్చాడని గుర్తుంచుకోండి. ఇవి చాలా ప్రాముఖ్యం:

1. శిష్యత్వ ప్రణాళిక అమలు చేయాలి.

[41] Matt Friedeman, *Discipleship in the Home,* 33.

2. అనుదిన ఆహారం మరియు కొద్ది నిమిషాలు నిర్మాణాత్మకమైన బోధన/శిక్షణ వంటి కుటుంబ ఆచారాలు ఏర్పాటు చేయాలి.

3. శిష్యత్వాన్ని దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని, వారికి బోధించడానికి శిక్షణ ఇవ్వడానికి అనేక అవకాశాలు ఉపయోగించాలి.

4. మీ పిల్లల గురించి ఎల్లప్పుడు దేవుని వాక్యాన్ని ప్రార్థించాలి.

5. విఫలమైనప్పటికీ ఎన్నడు విడిచిపెట్టొద్దు

► పైన ఇచ్చిన చార్టులో నుండి కొన్ని విషయాలు ఎంపిక చేసుకుని, ఆ లక్ష్యాలు చేరుకోవడానికి తల్లిదండ్రులు ఉద్దేశ్యపూర్వకంగా ఏం చేయగలరో వివరించండి.

### మానవుని చిత్తం అనే అంశం

► కొన్నిసార్లు ఒక వ్యక్తి, "నేను ఈ రోజు ఇలా ఉన్నానంటే అందుకు నా అనుభవాలే కారణం" అని చెబుతుంటారు. మరో విధంగా చెప్పాలంటే, "ఒక వ్యక్తి తన పరిస్థితుల ద్వారా వచ్చిన ఫలితమే." ఈ మాటలు వాస్తవమేనా?

మానవులు దేవుని పోలికెలో సృజించబడ్డారు. ప్రజలు ఎంపికలు చేసుకుంటారుగాని పరిస్థితుల ద్వారా లేక ప్రవృత్తి ద్వారా నడిపించబడరు. లేఖనమంతటా, ప్రజలు చెడును విసర్జించి మంచిని ఎంపిక చేసుకోవాలని దేవుడు పిలుస్తున్నాడు.[42] ప్రజలు తీసుకున్న నిర్ణయాల్ని బట్టి దేవుడు తీర్పుతీరుస్తాడు.

మన పర్యావరణం, మన అనుభవాలు మనల్ని ప్రభావితం చేస్తాయి, కాని మనల్ని నడిపించవు, ఎందుకంటే దేవుని స్వరూపంలో సృజించబడిన మానవులముగా మనం నిర్ణయాలు తీసుకుంటాం. అంటే, ఒక పిల్లవాడు తాను పెరిగిన పర్యావరణానికి, కుటుంబానికి భిన్నంగా బహుశా నిర్ణయాలు తీసుకుంటాడు. సహజంగా పాపభరితమైన అన్యుల కుటుంబంలో నుండి వచ్చిన పిల్లవాడు బహుశా మారుమనస్సు పొంది దేవుని కోసం జీవిస్తాడు. క్రైస్తవ కుటుంబంలో పుట్టిన పిల్లవాడు బహుశా దేవుణ్ణి అనుసరించకూడదని నిర్ణయించుకుంటాడు.

ప్రజలు నిజమైన నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, వారు పరిపూర్ణ స్వేచ్ఛాపరులు కాదు. మనం పాప స్వభావంతో జన్మించామని బైబిల్ బోధిస్తుంది (కీర్తన 51:5, కీర్తన 58:3). మానవులు అధికారాన్ని ఎదురిస్తారు, తమ సొంత దిశను వెదుక్కుంటారు, శోధనకు గురౌతారు, ఇతరుల్ని మోసం చేస్తారు మరియు స్వార్థంగా ఉండాలనే స్వాభావిక ధోరణితో

[42] యెహోషువ 24:14-15, యెహెజ్కేలు 33:10-11, ప్రకటన 22:17

ఉంటారు (ఎఫెసీయులకు 2:1-3). పిల్లలు ఏ దిశలోనైన నడిపించబడడానికి ఎదురుచూస్తూ తటస్థంగా ఉండరు. పిల్లలు తమ సొంత కోరికలు తీర్చుకోవడానికి అబద్ధాలు చెబుతారు, తమకు కావలసినది పొందుకోవడానికి అవిధేయత చూపుతారు. అంతేకాదు, సాతాను వారిని మోసం చేస్తాడు, శోధిస్తాడని మనకు తెలుసు (ఎఫెసీయులకు 2:2, ప్రకటన 12:9).

పిల్లల్ని సరైన మార్గంలో నడిపించడానికి కేవలం సూచనలు ఇస్తే చాలదని తల్లిదండ్రులు తప్పక గ్రహించాలి. ఆత్మీయ పోరాటం ఉంది (గలతీయులకు 5:17). దేవుని ఆత్మ పిల్లల్ని ప్రభావితం చేసి, వారిని నడిపించునట్లుగా తల్లిదండ్రులు ప్రార్థించాలి. తల్లిదండ్రులు జ్ఞానం కోసం మరియు ఆత్మీయతకు ఆదర్శంగా నిలబడే బలం కోసం దేవుని మీద ఆధారపడాలి. తమ పిల్లలు మారుమనస్సు పొందాలని, చిన్నతనంలోనే ఆత్మీయంగా తిరిగి జన్మించాలని తల్లిదండ్రులు నిరంతరం ప్రార్థించాలి.

పిల్లవాడు మారుమనసుపొందినప్పటికీ, పిల్లవాడు పరిణతిచెందిన క్రైస్తవుడుగా ఉండాలని తల్లిదండ్రులు ఆశించకూడదు. అతని వైఖరులు, అనుభూతులు స్థిరంగా ఉండవు. కొన్నిసార్లు అతడు శోధనలో పడిపోతాడు. పిల్లవాడు సరైన పని చేయాలనే కోరికను చూపించినంత కాలం, క్రైస్తవునిగా జీవించే విషయంలో నీవు విఫలమౌతున్నావు అని చెప్పి తల్లిదండ్రులు అతన్ని నిరుత్సాహపరచకూడదు. బదులుగా, తల్లిదండ్రులు పిల్లల మంచి ప్రవర్తనను మెచ్చుకోవాలి మరియు పోరాటాల్లో దేవుని సహాయం కోసం ప్రార్థించమని ప్రోత్సహించాలి.

ప్రతి మానవుడు పాప ప్రవృత్తితో జన్మించినప్పటికీ, ప్రతి మానవునికీ దేవుని అవసరత ఉంది. పరిశుద్ధాత్ముడు ప్రతి ఒక్కరితో మాట్లాడుతున్నాడు, దేవునితో సహవాసం కలిగి జీవించాలనే ఆశ కలిగిస్తున్నాడు. మనం మన పిల్లలకు దేవుని వాక్యాన్ని బోధిస్తున్నప్పుడు దేవుని సహాయం పొందుతున్నామని మనకు తెలుసు. దేవుని ఆత్మ పిల్లవాడి హృదయంలో సహాయకునిగా పనిచేస్తూ, సత్యాన్ని ధృవీకరిస్తూ, దేవునితో సంబంధం కలిగియుండాలనే ఆశను ఇస్తున్నాడు.

## కుటుంబ ప్రార్థన సమయం

కుటుంబాలు ప్రతిరోజు కొంత సమయం గడుపుతూ బైబిలు చదవాలి, చర్చించాలి, మరియు ప్రార్థించాలి. తల్లిదండ్రులు ఇరువురు, కుటుంబంలోని పిల్లలందరు హాజరవ్వాలి. తండ్రి నడిపించాలి, కాని లేఖనం చదవమని, వివిధ రకాలుగా పాలుపొందాలని కుటుంబీకుల్ని అడగొచ్చు.

భక్తి సమయం ఎల్లప్పుడు ఒకే విధానంలో ఉండవలసిన పని లేదు. వివిధ రూపాల్లో ఉండొచ్చు, బైబిలు కథలు, క్రైస్తవ చరిత్ర మరియు పరిచర్యలు గురించిన కథలు, ప్రశ్నలు చర్చించుకోవడం, సిద్ధాంత సత్యాలు బోధించడానికి కంఠస్తం చేసిన ప్రశ్నలు సమాధానాలు ఉపయోగించడం, క్రైస్తవ పుస్తకాలు చదవడం, పాటలు, బైబిల్ వచనాలు కంఠస్తం చేయడం, నాటకం, వివిధ రకాలైన ప్రార్థనలు భాగం కావచ్చు.

భక్తి సమయ కార్యాచరణ ఉదాహరణ: బైబిలు కథ ఎంపిక చేసుకుని, కుటుంబ సభ్యులు దానిని నటించి చూపాలి.

పాస్టర్లైనవారు తమ సంఘంలో భక్తి సమయం గురించి బోధించడానికి కొంత సమయం కేటాయించాలి. దేవుని వాక్యాన్ని తమ పిల్లలకు బోధించే బాధ్యత తమపై ఉందని తల్లిదండ్రులు జ్ఞాపకం చేసుకోవాలి (ద్వితీయోపదేశకాండము 6:5-7).

## సమూహ చర్చ కోసం

► ఈ పాఠంలో మీకు క్రొత్త అనిపించిన విషయాలు ఏంటి? మీరు నేర్చుకున్న సత్యాన్ని ఎలా అన్వయించుకోవాలని ఆశపడుతున్నారు?

► కుటుంబాలను బలపరచడానికి, పిల్లల్ని పెంచే విషయంలో తల్లిదండ్రులకు సహాయం చేయడానికి సంఘం ఏమి చేయగలదు?

► క్రీస్తు వెంబడించడానికి పిల్లలకు శిక్షణనిచ్చే సవాలు విషయంలో సహాయం చేయడానికి సంఘం, ప్రజలు కలిసి ఎలా పనిచేయగలరు?

► కుటుంబాలు పాటించవలసిన అనుదిన కార్యచరణలకు కొన్ని ఉదాహరణలు ఏంటి?

## ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ,

కుటుంబాన్ని రూపొందించినందుకు, తల్లిదండ్రులుగా ఉండే గొప్ప ఆధిక్యతను ప్రజలకు ఇచ్చినందుకు ధన్యవాదాలు.

మీవలే పిల్లల్ని ప్రేమించడానికి సహాయం చేయండి. వారు నిన్నెరగడానికి మరియు నీకు పరిచర్య చేయడానికి వారు సృజించబడ్డారని ఎల్లప్పుడు జ్ఞాపకముంచుకోవడానికి సహాయం చేయండి.

పిల్లలు నిన్ను అనుసరించేలా, వారికి శిక్షణ ఇవ్వడానికి అవసరమైన ప్రేమ, సహనం మరియు అవగాహన మాకు దయచేయండి.

కుటుంబాల్ని, యౌవనుల్ని, పిల్లల్ని వారి విశ్వాసంలో విధేయతలో బలంగా ఉండేలా చేయడానికి మా సంఘాల్లో విశ్వాసులకు సామర్థ్యం అనుగ్రహించండి.

ఆమెన్

## పాఠం అభ్యాసాలు

(1) ఈ క్రింది ఇవ్వబడిన వాక్యభాగాలను అధ్యయనం చేయండి. తల్లిదండ్రుల బాధ్యత గురించి లేఖనం ఏం బోధిస్తుందో ఈ వాక్యభాగాలను ఉపయోగించి మూడు పేజీలు రాయండి:

- ఆదికాండము 18:17-19
- ద్వితీయోపదేశకాండము 6:4-9
- కీర్తన 78:1-8
- కొలొస్స 3:21
- ఎఫెసీయులకు 6:4
- 1 తిమోతికి 3:4-5, 12
- 2 తిమోతికి 3:14-17
- మత్తయి 18:5-6

(2) మీరు తల్లిదండ్రులైనా కాకపోయినా, ఈ పాఠంలో ఇచ్చిన గుణలక్షణాల లక్ష్యాల జాబితాలో ఐదు గుణలక్షణ లక్ష్యాలను ఎంపిక చేసుకోండి. ఎంపిక చేసుకున్న ఐదు గుణలక్షణ లక్ష్యాలను మీ పిల్లలు చేరుకోవడానికి సహాయపడే మూడు ఆచరణాత్మక మార్గాలు రాయండి.

(3) ఒకవేళ మీరు తల్లిదండ్రులైతే, మీ పిల్లలతో అనుదినం భక్తి సమయం గడపడానికి ఒక ప్రణాళికను, సమర్పణను రాయండి. మీరు చేసిన ప్రణాళిక, సమర్పణ విషయంలో ఎవరికైన లెక్క అప్పజెప్పేవారిగా ఉండండి.

# పాఠం 13

# పిల్లలను పెంపకంలో సమస్యలు

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) పిల్లల క్రమశిక్షణ, మరియు దిద్దుబాటు విషయంలో దేవుని దృక్పథాన్ని తీసుకోవాలి.

(2) పిల్లల క్రమశిక్షణ కోసం ఇంటిలోనే ఒక మంచి వాతావరణాన్ని సృష్టించడానికి కట్టుబడి ఉండాలి.

(3) దేవుని పట్ల పిల్లల బాధ్యత అర్థం చేసుకోవాలి.

(4) అనుదినం తల్లిదండ్రులు ఎదుర్కొనే పరిస్థితుల్లో ఆచరణాత్మక ఆలోచనలు కలిగియుండాలి.

## సూసన్న వెస్లీ, ఉద్దేశ్యపూర్వకమైన తల్లి

సూసన్న వెస్లీ 19మంది పిల్లలకు జన్మనిచ్చింది, కాని ఆ కాల పరిస్థితుల్ని బట్టి తొమ్మిదిమంది చనిపోయారు. జాన్ వెస్లీ, చార్ల్స్ వెస్లీతో పాటుగా 10మంది పిల్లల్ని పెంచింది. ఆమె కుమారుడైన జాన్ పెద్దవాడైన తర్వాత, పిల్లల్ని పెంచే విషయంలో ఆమె పాటించిన పద్ధతి ఏంటో దానిని రాసి ఇవ్వమని కోరాడు, అందుకు ఆమె ఈ వివరణతో అతనికి ఒక లేఖ రాసి పంపింది.[43]

పిల్లలు మాట్లాడటం మొదలుపెట్టగానే పరలోక ప్రార్థన బోధించింది, ప్రతి ఉదయం సాయంత్రం దాన్ని పదే పదే చెప్తుండేవారు. పిల్లలు ప్రతిరోజు కలిసి లేఖనంలో ఒక అధ్యాయం చదివేవారు. ఆ రోజుల్లో చాలామంది స్త్రీలు విద్యలేని పామరులు, కాని సూసన్న పిల్లలందరికి చదువు నేర్పించాలని పట్టుబట్టింది. పని నేర్చుకోవడం కంటే విద్యకు ఎక్కువ ప్రాధాన్యత చూపించింది.

[43] Eliza Clark, *Susanna Wesley*, (London: W. H. Allen & Co, 1886), 30-36.
https://archive.org/details/susannawesley00clariala/page/30/లో అందుబాటులో ఉంది.

తిరుగుబాటే పాపాలన్నిటికి, దుఃఖాలన్నిటికి మూలమని సూసన్న చెప్పింది. పిల్లలు తమ ఆవేశాల్ని నియంత్రించుకుని అధికారానికి లోబడాలని బోధించింది. పని పరిపూర్ణంగా చేయకపోయినా, ప్రతి విషయంలో విధేయత చూపినప్పుడు అది మెచ్చుకోబడుతుందని చెప్పింది. తప్పులు సహించవచ్చుగాని అవిధేయతకు తగిన శిక్ష ఉంటుంది.

కుటుంబమంతా ఎల్లప్పుడు కలిసి భోజనం చేసేవారు, మరియు భోజనంలో ఏదైతే వడ్డించారో ఎటువంటి ఫిర్యాదు లేకుండా తినడం పిల్లలు నేర్చుకున్నారు.

### దిద్దుబాటు మరియు క్రమశిక్షణ

"బాలుని హృదయములో మూఢత్వము స్వాభావికముగా పుట్టును..." (సామెతలు 22:15) అని బైబిల్ మాట్లాడుతుంది. పిల్లలు పుట్టినప్పుడే అబద్ధాలు చెబుతారని కీర్తనాకారుడు చెప్పాడు, "...పుట్టినతోడనే అబద్ధములాడుచు తప్పిపోవుదురు" (కీర్తన 58:3). ఇది వాస్తవం కాబట్టి పిల్లల్ని సరిదిద్దే బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

ఒక మూడు సంవత్సరాల పిల్లవాడిని, ఒక చాక్లెట్ ఇప్పుడే కావాలా లేక వారానికి ఒక పెట్టెడు చాక్లెట్లు కావాలా అని అడగండి. తల్లిదండ్రులు ఆ పిల్లవాడికి ఎంపిక గురించి స్పష్టంగా వివరించినప్పటికీ, చాలామంది పిల్లలు వెంటనే ఆ ఒక్క చాక్లెట్ ని ఎంపిక చేసుకుంటారు. పిల్లల దుష్ప్రవర్తనను సరిదిద్దడానికి *వివరణ* ఒకటే సరిపోదని ఈ దృష్టాంతం మనకు చూపిస్తుంది.

పిల్లవాడిని సరిదిద్దడానికి తప్పొప్పుల గురించి వివరిస్తే చాలదు, ఎందుకంటే

1. పిల్లలు పెద్దవారి ఆలోచనను అర్థం చేసుకోలేరు (1 కొరింథీయులకు 13:11).
2. పిల్లలు తమ చర్యల వలన వచ్చే దీర్ఘకాల ఫలితాల్ని పరిపూర్ణంగా చూడలేరు
3. పిల్లలు తమ ఆవేశాల్ని, కోరికల్ని హేతుబద్ధంగా నియంత్రించుకునేంత పరిపక్వత స్థితిలో ఉండడు.

పిల్లవాడిని శారీరకంగా బాధించడం బహుశా క్రూరంగా అనిపిస్తుంది, కాని తల్లిదండ్రులు, మరింత ఘోరమైన హాని నుండి తప్పించడానికి ఆ విధంగా చేస్తారు: "బెత్తము వాడనివాడు తన కుమారునికి విరోధి కుమారుని ప్రేమించువాడు వానిని శిక్షించును" (సామెతలు 13:24). ఉదాహరణకు, మంట దగ్గర ఆడుకునే పిల్లోడు అందులో పడిపోతాడు, మరియు గాయాలపాలౌతాడు ఎందుకంటే ప్రమాదం గురించి వాడికి తెలీదు. కాని వాడు మంట దగ్గరకు వెళ్లినప్పుడు తల్లి వాడిని కొడితే, ఆ చిన్న బాధ పెద్ద ప్రమాదం నుండి తప్పిస్తుంది.

కొందరు, తమను ప్రేమించనివారి నుండి శారీరక బాధలు అనుభవిస్తారు. ఈ కారణం చేత, పిల్లల్ని శారీరకంగా శిక్షించే విధానాన్ని వారు ద్వేషిస్తారు. అయితే, సరైన దిద్దుబాటును నిర్లక్ష్యం చేసే తల్లిదండ్రులు తర్వాత తమ పిల్లలకు చాలా ఇబ్బంది కలిగిస్తారు.

► విద్యార్థులు తరగతి కోసం సామెతలు 19:18 మరియు సామెతలు 29:17 చదవాలి.

పిల్లవాడు తల్లిదండ్రుల్ని ఎదిరిస్తున్నాడనే అర్థం చేసుకునే వయస్సు రాగానే దిద్దుబాటు మొదలుపెట్టాలి. తాను సహరించట్లేదని చిన్న పిల్లవాడికి కూడా అర్థమైపోతుంది.

పిల్లవాడు చిన్నవాడిగా, సున్నితంగా ఉన్నప్పుడే చాలా దిద్దుబాటు జరగాలి (సామెతలు 22:15). కాలక్రమేణా గట్టిపడి, కావలసిన ఆకారంలోకి మలచడం కష్టతరం అయ్యే మట్టిలాగే, కాలం గడిచేకొద్దీ పిల్లల స్వభావాన్ని తీర్చిదిద్దడం కష్టం అవుతుంది. ఒకవేళ పిల్లవాడు 10 సంవత్సరాల వయసు తర్వాత కూడా తన తల్లిదండ్రులను నిరంతరం ధిక్కరిస్తూ ఉంటే, తల్లిదండ్రులు తమ దిద్దుబాటులో విజయం సాధించలేదని, వారి అంతిమ విజయావకాశాలు చాలా తగ్గుముఖం పడుతున్నాయని అర్థం. పిల్లవాడికి వయసు పెరిగే కొద్దీ శారీరక దిద్దుబాటు తక్కువ ప్రభావం చూపుతుంది. పిల్లవాడు పెద్దయ్యాక దిద్దుబాటు చేయడం సులభం అవుతుందని తల్లిదండ్రులు భావించడం పొరపాటు; అది మరింత కష్టమవుతుంది, చివరికి అసాధ్యం అవుతుంది.

పిల్లలు యుక్తవయసులోకి వచ్చే కొద్దీ, చిన్నతనంలో మాదిరిగా వారిని భౌతికంగా సరిదిద్దలేము. యువతీ యువకులకు వారి ప్రవర్తన పరిణతి చెందినది కాకపోయినా, వారికి గౌరవం అవసరం. తల్లిదండ్రులు వినోదం, ఫోన్ సమయం లేదా సామాజిక కార్యకలాపాలను పరిమితం చేయడం వంటి ఇతర మార్గాల ద్వారా వారిని సరిదిద్దవచ్చు, కానీ ప్రేమతో కూడిన, జాగ్రత్తగా చెప్పే సంభాషణ చాలా ముఖ్యం. యుక్తవయసులో ఉన్నవారు నిజమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని తల్లిదండ్రులు గ్రహించాలి. తల్లిదండ్రులకు వారిపై ప్రభావం ఉన్నప్పటికీ, ఆ యవ్వన వ్యక్తి తన వ్యక్తిగత అభిప్రాయాన్ని వ్యక్తపరచకుండా, తన నిర్ణయాల పర్యవసానాలను అనుభవించకుండా నిరోధించలేరు.

కొంతమంది తల్లిదండ్రులకు పిల్లలను శారీరకంగా శిక్షించేటప్పుడు ఎంత కఠినంగా ఉండాలో తెలియదు. ఒక బిడ్డ శిక్ష తర్వాత కూడా కోపంగా, ఎదురు తిరుగుతూ ఉంటే, ఆ శిక్ష సరిపోనంత కఠినంగా లేదు (శారీరక శిక్షతో సరిదిద్దడానికి చాలా పెద్ద వయసు ఉన్న పిల్లలకు ఈ సూత్రం వర్తించదు). ఆ బిడ్డ తన అవిధేయతకు పశ్చాత్తాపపడి, అధికారాన్ని అంగీకరించేలా చేసేంత కఠినంగా శిక్ష ఉండాలి. శిక్ష గాయాలు కలిగించకూడదు. చర్మంపై గాయాలు లేదా ఎక్కువసేపు ఉండే గుర్తులు కలిగించే శిక్ష చాలా కఠినమైనది కావచ్చు.

దేవుడు పిల్లలతో వ్యవహరించే విధానాన్ని వివరించడానికి, బైబిల్ శారీరక శిక్ష దృష్టాంతాన్ని ఉపయోగిస్తుంది.

► విద్యార్థులు తరగతి కోసం సామెతలు 3:11-12 మరియు హెబ్రీయులకు 12:5-8 చదవాలి.

దేవుడు తన పిల్లల్ని ప్రేమిస్తున్నాడు గనుక వారిని క్రమశిక్షణలో ఉంచుతున్నాడని ఈ లేఖన భాగాలు మనకు బోధిస్తాయి. అలాగే, తండ్రి తన కుమారుని ప్రేమిస్తున్నాడు గనుక క్రమశిక్షణలో ఉంచుతాడు. సరైన క్రమశిక్షణ ప్రేమకు ప్రతీక. క్రమశిక్షణ లేకపోవడం అంటే ప్రేమ లేకపోవడమే.

శారీరక దిద్దుబాటు పిల్లవాడికి ఆశా నిగ్రహాన్ని బోధిస్తుంది ఎందుకంటే తాను ఒకవేళ తప్పు చేస్తే శిక్షించబడతాడని తెలుసు గనుక, శోధనను ఎదురించడం నేర్చుకుంటాడు. తప్పు చేయాలనే శోధనను జయించినప్పుడు, అతడు బలమైన వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకుంటాడు. అతడు పరిణతి చెందినప్పుడు, శారీరక శిక్షవలన కాకుండా దాని పర్యావసానాల్ని గ్రహించి శోధనను జయిస్తాడు. ఏదేమైనా, క్రమంగా దిద్దుబాటు పొందని పిల్లవాడు, పెద్దవాడై శోధన చెడ్డదని తెలిసినప్పటికీ దానిని అడ్డుకునే శక్తి లేకుండా ఉంటాడు.

తల్లి లేదా తండ్రి, పిల్లవాడు తినాలని కోరుకున్నందుకే కేవలం మిఠాయి మాత్రమే ఇస్తున్నాడని ఊహించండి. అతడు పిల్లవాడిని బాధ పెట్టకూడదని అనుకుంటున్నాడు, కాని నిజానికి అతడికి హాని చేస్తున్నాడు. అదే విధంగా, ఎప్పుడూ పిల్లవాడి ప్రవర్తనకు తలొగ్గే తల్లిదండ్రులు, తమ పిల్లల స్వభావానికి మరియు భవిష్యత్ పరిస్థితులకు హాని కలిగిస్తున్నారు. దిద్దుబాటు చేయని తండ్రి తన కుమారుని ద్వేషిస్తున్నాడని బైబిల్ కూడా చెబుతోంది (సామెతలు 13:24).

సరిహద్దులు లేని కుటుంబంలో పెరిగే పిల్లవాడు అనందంగా ఉండడు. హద్దులు భద్రత కలిగిస్తాయి. వాదించడంవల్ల, ఏడ్వడంవల్ల తనకేదైనా లభిస్తుందనే విధానాన్ని పిల్లవాడు నేర్చుకుంటే, ఎల్లప్పుడు అలాగే చేస్తుంటాడు కాని సంతోషంగా ఉండలేడు. పిల్లలు భద్రంగా ఉన్నప్పుడు, పరిమితుల్లో నడిపించబడుతున్నప్పుడు సంతోషంగా ఉంటారు, ఏదైనా పొందుకోవడానికి పోరాడాలి, నియంత్రణను నిరోధించాలని భావించరు. క్రమశిక్షణ నొందని పిల్లవాడు సంతోషంగా ఉండలేడు.

పిల్లోడు పెరిగి పెద్దవాడైనప్పుడు, తాను కోరుకున్న ప్రతిదీ లోకం ఇవ్వదు. మర్యాద లేకుండా మూర్ఖంగా స్వార్థంగా, బాధ్యతారహితంగా ఉంటే అతనికి గౌరవం రాదు, పదవులు ప్రమోషన్లు కూడా రావు. అందుకే తల్లిదండ్రులు జీవితాన్ని ఎదుర్కొనే విధంగా పిల్లలను సిద్ధపరచాలి. తల్లిదండ్రులు పిల్లల్ని కాదు; పెద్దల్ని పెంచుతున్నారని తప్పక గుర్తుంచుకోవాలి.

తల్లిదండ్రులు తమ పిల్లల్ని సరిదిద్దుతున్నారంటే, వారిని నమ్మకమైన, గౌరవనీయమైన మంచి వ్యక్తులుగా ఎదగడానికి సహాయపడుతున్నారని వారికి వివరించాలి, చూపించాలి.

► విద్యార్థులు తరగతి కోసం సామెతలు 22:15, సామెతలు 23:13-14, మరియు సామెతలు 29:15 చదవాలి.

దిద్దుబాటు పిల్లవాడి అభివృద్ధి కోసమేనని గుర్తుంచుకోవాలి. పిల్లవాడు తాను చేసిన తప్పును అర్థం చేసుకుని, పశ్చాత్తాపపడినప్పుడు, శారీరక శిక్ష అవసరం లేకపోవచ్చు. దీని ఉద్దేశ్యం సరిదిద్దడం, న్యాయం కాదు; పిల్లవాడికి తగిన శిక్ష పడేలా చూసుకోవలసిన అవసరత తల్లిదండ్రులకు లేదు.

► ఒక తల్లిదండ్రులు తమ బిడ్డను సరిదిద్దడానికి తీసుకునే చర్యలకు, భయపెట్టి, బెదిరించి ఇతరులను తమ చెప్పుచేతల్లో పెట్టుకోవాలనుకునే వ్యక్తి చర్యలకు మధ్య తేడా ఏమిటి?

ఒక హింసాత్మకమైన వ్యక్తి తనకు కావలసిన దానిని పొందుకోవడానికి ఇతరులకు హాని కలిగించడానికి ఇష్టపడతాడు. తల్లిదండ్రులు తమ బిడ్డను ప్రేమిస్తారు. పిల్లవాడి ప్రయోజనం కోసం శారీరకంగా శిక్షిస్తారు. ప్రేమగల తల్లిదండ్రులు పిల్లవాడికి హాని కలిగించడానికి ఇష్టపడరు. ఎగతాళి చేస్తూ, చిన్నచూపు చూసేవారు, బాధించేవారు తనను ప్రేమిస్తున్నారని ఎవరు భావించలేరు కాని దిద్దుబాటు పొందుతున్నప్పుడు కూడా తాను ప్రేమించబడుతున్నాడని పిల్లవాడు తెలుసుకోగలడు. తన తల్లిదండ్రుల అధికారాన్ని బట్టి తన జీవితం ఉత్తమంగా ఉందని గ్రహించగలడు.

కొంతమంది తల్లిదండ్రులు కోపం లేక క్రూరత్వం కారణంగా అప్పుడప్పుడు కఠినంగా శిక్షిస్తారు. పిల్లల్ని శారీరకంగా, మానసికంగా గాయపరుస్తారు. జీవితంలో వారికున్న ఒత్తిళ్లు నిరాశలు తగ్గించుకోవడానికి తమ పిల్లల్ని శిక్షిస్తారు. ఇది చాలా తీవ్రమైన సమస్య గనుక గమనిస్తున్నవారు దీనిని సహించకూడదు. పిల్లవాడిని ఇబ్బంది పెడుతున్నప్పుడు, మిత్రులు, పొరుగువారు, మరియు బంధువులు ఖచ్చితంగా ఎదుర్కోవాలి. శారీరకంగా వేధించే వ్యక్తి యొక్క భాగస్వామి, బంధువులు, మిత్రులు లేక పాస్టర్ సహాయం తీసుకోవాలి. పిల్లల్ని కాపాడడం చాలా ప్రాముఖ్యం.

► కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలు తప్పుచేసినప్పుడు బహిరంగంగా వారిని అవమానిస్తారు. ఇది దిద్దుబాటుకు సరైన విధానమేనా?

► ఒక విద్యార్థి తరగతి కోసం ఎఫెసీయులకు 6:4 చదవాలి.

తల్లిదండ్రులు తనను ప్రేమిస్తున్నారని, దిద్దుబాటు తన ప్రయోజనం కోసమని పిల్లవాడు నిర్ధారించుకోవాలి. తల్లిదండ్రులు పిల్లవాడిని అవమానించినప్పుడు, ప్రేమించబడుతున్న భావన అతనిలో కలుగదు. అతడు మరింత బాధకు గురై, తల్లిదండ్రుల అధికారం హానికరమైందని భావించి, తప్పించుకోవాలని అనుకుంటాడు. అందుకే తల్లిదండ్రులు పిల్లల్ని బహిరంగంగా శిక్షించక ఏకాంతంగా శిక్షించాలి, ఇతరుల ఎదుట అవమానించకూడదు. తల్లిదండ్రులు సహనంగా

సున్నితంగా పిల్లల్ని హెచ్చరించాలి, సరిదిద్దాలి.[44] సామెతలు 16:21b ఇలా సెలవిస్తుంది "... రుచిగల మాటలు పలుకుటవలన విద్యయెక్కువగును."

► మీరు మీ పశువులకు చూసుకునే బాధ్యత మీ పిల్లలకు ఇచ్చారని ఊహించండి. మీరు సాయంకాలం ఇంటికి వచ్చేవేళకు, జంతువులకు మేత వేయలేదు. రోజంతా పని చేసి మీరు బాగా అలసిపోయారు, కాని మీ పిల్లలు, జంతువులకు మేత వెయ్యలేదు కాబట్టి మీరు విశ్రాంతి తీసుకునే ముందే వాటికి మేత వెయ్యాలి. మీరు కోపపడతారా? తల్లి/తండ్రి తన కుమారుడి విషయంలో కోపపడడం తప్పా?

దిద్దుబాటు పిల్లవాడి ప్రయోజనం కోసమని తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలి. తనను అగౌరవపరచినందుకు లేక పిల్లవాడు చూపిన అవిధేయత తనకు అసౌకర్యం కలిగించినందుకు తల్లి/తండ్రి కోపపడినప్పుడు, అతని కోపం పిల్లవాడికి మంచి చేయదు (యాకోబు 1:20). అతని కోపం స్వార్థపూరితం.

తల్లిదండ్రులు కోపాన్ని ఈ విధంగా సరైన రీతిలో వ్యక్తపరచవచ్చు: "బిడ్డా, నేను చెప్పినట్లుగా నువ్వు పశువులకు మేత వేయలేదు. అవి ఆకలిగా ఉన్నాయి. నేను వేయకపోతే అవి రాత్రంతా ఆకలితో ఉండిపోయేవి. రోజంతా పనిచేసి అలసిపోయినా, నేను వాటికి మేత వేయాల్సి వచ్చింది. నీకు చెప్పిన పని చేయకపోవడం వల్ల నేను కోపపడ్డాను—ఎందుకంటే ఇతరుల అవసరాలను పట్టించుకోని వ్యక్తిగా మారకూడదని కోరుతున్నాను. సామెతలు 12:10 ఇలా బోధిస్తుంది, 'నీతిమంతుడు తన పశువుల ప్రాణమును దయతో చూచును భక్తిహీనుల వాత్సల్యము క్రూరత్వమే.'"

జ్యోతి తన పిల్లలతో కొత్తగా కార్పెట్ వేసిన గదిలోకి ఆహారం లేదా పానీయాలు తీసుకెళ్లవద్దని చెప్పింది. మరుసటి రోజు ఆమె పిల్లలలో ఒకరు ఆ గదిలో తింటూ ఉండటం చూసి, అతన్ని మందలించింది. ఆ తర్వాత పిల్లలలో ఇంకొకరు ఒక గ్లాసు నిండా జ్యూస్ తీసుకెళ్తుండగా చూసి, అతన్ని కూడా మందలించింది. ఆ తర్వాత కొద్ది రోజులు పిల్లలు అప్పుడప్పుడు పానీయాలు ఆ గదిలోకి తీసుకెళ్తుండేవారు, కానీ జ్యోతి బిజీగా ఉండటం వల్ల వాళ్లను సరిదిద్దలేదు. ఆ తర్వాత ఒకరోజు తన కొడుకు కార్పెట్ మీద కోకా-కోలా కింద పడేశాడు. జ్యోతికి కోపం వచ్చి అతన్ని కొట్టింది.

► జ్యోతి తన పిల్లల్ని సరిదిద్దే విషయంలో ఎక్కడ తప్పు చేసింది?

జ్యోతి పెట్టిన నియమం ఏమిటంటే పిల్లలు ఆహారాన్ని లేదా పానీయాలను కార్పెట్ ఉన్న గదిలోకి తీసుకువెళ్ళకూడదు. కానీ ఆమె వారు ఆ నియమాన్ని ఉల్లంఘిస్తున్నప్పటికీ ఒక సంఘటన జరిగే వరకు సహించింది. ఆమె ఆ నియమాన్ని

---

[44] 2 తిమోతికి 2:24-25 మరియు గలతీయులకు 6:1 సంఘంలో పాపంతో వ్యవహరించడానికి హెచ్చరికగా రాయబడినప్పటికీ, తప్పు చేసేవారిని సరిదిద్దుతూ సహనంగా, మృదువుగా ఉండాలని చెప్పే సూచనలు, తల్లిదండ్రులకు కూడా వర్తిస్తాయి.

ఉల్లంఘించినందుకు శిక్షించకుండా ఆ సంఘటన జరిగినప్పుడు శిక్షించింది. చెడు పరిణామాలు రాకుండా చూడగలిగితే నిబంధనలను ఉల్లంఘించవచ్చని ఇది పిల్లలకు నేర్పుతుంది. ఇది అన్ని నియమాలను ఉల్లంఘించడానికి ఆధారమైనందున చెడు లక్షణాన్ని అభివృద్ధి చేస్తుంది. ఒక వ్యక్తి తాను కోరుకున్న ఫలితాలను పొందగలనని మరియు చెడు ఫలితాలను నివారించగలనని భావించి నిబంధనలను ఉల్లంఘిస్తాడు. తల్లిదండ్రులు పిల్లల తప్పు చేసినప్పుడు శిక్షించకుండా వారి అవిధేయతను సరిదిద్దాలి.

లోహిత్ తన కుమారులకు సాయంకాల సమయాల్లో సైకిళ్లు ప్రక్కనపెట్టమని చెప్పాడు. ఒక వారం పాటు ప్రతిరోజు, లోహిత్ ఇంటికి వచ్చినప్పుడు సైకిళ్లు బయటే ఉన్నాయి. ఒకరోజు లోహిత్ పనిలో ఉన్నప్పుడు ఒక పనిముట్టు పోయింది, అనుకోకుండా తన వ్రేలికి దెబ్బతగిలింది, ఇంటికి వస్తుండగా టైర్ పంచర్ పడింది. ఇంటికి వచ్చేసరికి సైకిళ్లు ఇంకా బయటే ఉన్నాయి, కాబట్టి అతడు తన కుమారుల్ని శిక్షించాడు.

► తన కుమారుల్ని సరిదిద్దే విషయంలో లోహిత్ చేసిన తప్పేంటి?

చాలామంది తల్లిదండ్రులు మంచిగా ఉన్నప్పుడు అవిధేయతను సహిస్తారు, జీవిత పరిస్థితులను బట్టి కోపంగా ఉన్న సమయంలో అవిధేయతను శిక్షిస్తారు. తల్లిదండ్రులు స్థిరంగా సరిదిద్దితే తప్ప పిల్లలు విధేయత నేర్చుకోరు.

► క్రింద ఇవ్వబడిన వాటిని చూసి, ప్రతిదీ ఎందుకు ముఖ్యమో వివరించండి. తల్లిదండ్రులు ఈ విషయాలు అనుసరించకపోతే ఏం జరుగుతుంది?

- అవసరాలు పిల్లల సామర్థ్యాలకు, పరిపక్వతకు తగినవిగా ఉండాలి.
- అనుకోకుండ తప్పు చేసినప్పుడు కాకుండా, ఉద్దేశ్యపూర్వకంగా అవిధేయత చూపినప్పుడే శిక్షించాలి.
- నియమాలు మరియు అవసరాలు స్పష్టంగా, అర్థవంతంగా ఉండాలి.
- పిల్లవాడు అవిధేయత చూపినప్పుడు, పిల్లవాడు ఏమి చేసి ఉండాలో తల్లిదండ్రులు వివరించాలి.
- పిల్లవాడి స్వాధీనంలో లేనిదానికి ఎన్నడు శిక్షించవద్దు.

### పిల్లల నుండి ఆచరణాత్మక హెచ్చరికలు

కొన్ని సంవత్సరాల క్రితం, డా.ఆర్.యఫ్. హెర్ట్జ్ అనే బ్రిటీషు మనస్తత్వవేత్త ఒక పరిశోధనా ప్రాజెక్ట్ చేపట్టాడు. అతను 8 నుండి 14 ఏళ్ల మధ్య వయస్సున్న లక్షమంది పిల్లల్ని 24 దేశాల నుండి ఎంపిక చేసి, తల్లిదండ్రులు ఎలా ప్రవర్తించాలనే విషయమై నిబంధనల జాబితా తయారుచేయమని కోరాడు. ఈ పరిశోధనకు దేవుని వాక్య అధికారం లేదుగాని పిల్లలు అవసరమని భావించే కొన్ని అవసరాల్ని ఇది చూపిస్తుంది. కొన్ని సాధారణ ప్రతిస్పందనలు ఇక్కడ ఉన్నాయి:

- మీ పిల్లల ముందు గొడవపడవద్దు.
- పిల్లలకు అబద్ధం చెప్పవద్దు.
- పిల్లల ప్రశ్నలకు ఎల్లప్పుడు జవాబులు ఇవ్వాలి.
- మీ పిల్లలందర్నీ ఒకే విధంగా ప్రేమించాలి.
- తల్లిదండ్రులు, పిల్లలు మధ్య ఖచ్చితంగా [స్నేహబంధం] ఉండాలి.
- మీ పిల్లల స్నేహితుల్ని స్వాగతించే అతిథులుగా భావించాలి.
- స్నేహితుల యెదుట మీ పిల్లల్ని నిందించవద్దు, శిక్షించవద్దు.
- మీ పిల్లల మంచి అలవాట్లు మీద దృష్టిపెట్టాలి, వారి వైఫల్యాల్ని ఎక్కువగా నొక్కి చెప్పకూడదు.
- ఆప్యాయత చూపించే విషయంలో, భావాల విషయంలో స్థిరంగా ఉండాలి.

పిల్లల సమక్షంలో తండ్రి, తల్లిని విమర్శించినప్పుడు, పిల్లలు కూడా గౌరవించబడని తల్లిలో తప్పులు వెదకాలని, ఆమెతో ఏకీభవించకూడదని భావిస్తారు.[45] తల్లిదండ్రులు తమ విభేదాలను వ్యక్తిగతంగా చర్చించుకుని, సహకారంతో అనుసరించాల్సిన విధానాలను రూపొందించుకోవాలి.

తల్లిదండ్రులు, తమ పిల్లలు సహకరించాలని లేక తమ పిల్లల ఆందోళనలు తీర్చాలనే ఉద్దేశ్యంతో కూడా పిల్లలతో అబద్ధమాడకూడదు (కొలొస్స 3:9). తన తండ్రి తనతో అబద్ధమాడుతున్నాడని పిల్లవాడు గ్రహించినప్పుడు, సురక్షితంగా భావించడు. తల్లిదండ్రులు చెప్పింది పిల్లలు నమ్మరు గనుక పిల్లలు భయపడినప్పుడు కొంతమంది తల్లిదండ్రులు వారి పిల్లల్ని ఆదరించలేరు లేక నడిపించలేరు.

► పైన ఇవ్వబడిన వాటిలో ఒకదానిని ఎంపిక చేసుకుని, తల్లిదండ్రులు ఆ విధంగా నడవనప్పుడు కలిగే సమస్యలు గురించి వివరించండి.

### ఒక క్రైస్తవ కుటుంబం

► ఒక కొత్త వ్యక్తి మీ ఇంటికి వచ్చినప్పుడు, అది క్రైస్తవులు నివసించే ఇల్లని వెంటనే అతనికి అర్థమౌతుందా? ఎలా?

► ఒక విద్యార్థి తరగతి కోసం ద్వితీయోపదేశకాండము 6:6-9 చదవాలి.

ఇశ్రాయేలీయులు పిల్లల స్వభావాన్ని రూపొందించడం ద్వారా పిల్లల భవిష్యత్తును రూపొందించడంపై దృష్టిపెట్టాలి. అయితే వారు దానిని ఎలా చేయాలి? తమ పిల్లల్ని బైబిలు సూత్రాల ఆధారంగా క్రమశిక్షణలో పెట్టడానికి సురక్షితమైన

[45] ఎఫెసీయులకు 4:29-32, ఎఫెసీయులకు 5:33; 1 పేతురు 3:7-12 లోని సూత్రాలు మరియు ఉపదేశాలు ఇక్కడ కూడా వర్తిస్తాయి.

పరిసరాలు సృష్టించాలి. వారు ప్రతిచోట లేఖనాల్ని ఉంచాలి ("నీ యింటి ద్వార బంధములమీదను నీ గవునులమీదను వాటిని వ్రాయవలెను.") లేఖనాల్ని ఇంట్లో పెట్టుకోవడమే కాదుగాని, ముఖ్యంగా, ఇంట్లో జరిగే ప్రతిదీ లేఖనానుసారంగా ఉండాలి.

ఈ కుటుంబాల్లో ఒక గోడమీద పదిఆజ్ఞలు, మరొక గోడమీద లోక సంబంధమైన వినోదం కలిగించే, పాప చిత్రాలు ఉండకూడదు. ఇది, విలువలపై పిల్లలకున్న అవగాహనను తారుమారు చేస్తుంది.

పిల్లలు ప్రతిరోజు చూసే, వినే విషయాల ద్వారా తెలియకుండానే ప్రభావితమవుతారు. ఒకవేళ వారి ఇంట్లో ఎల్లప్పుడు రేడియో మ్రోగుతుంటే, ఆ సంగీతంలో ఉండే తత్వాన్ని వారు గ్రహిస్తారు.

తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఈ దుష్ట లోకం నుండి, లోక ప్రభావం నుండి కాపాడడం అసాధ్యం, కాని క్రైస్తవ తల్లిదండ్రులు తమ పిల్లలకు, వారు చూసే ప్రతిదీ వినే ప్రతిదీ దేవుని వాక్య ఆధారంగా పరిశీలించాలని బోధించాలి. యేసు, "నీవు లోకములోనుండి వారిని తీసికొనిపొమ్మని నేను ప్రార్థించుటలేదు గాని దుష్టునినుండి వారిని కాపాడు మని ప్రార్థించుచున్నాను...సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము; నీ వాక్యమే సత్యము" (యోహాను 17:15, 17) అని ప్రార్థించాడు.

తల్లిదండ్రులు ఎవర్ని హీరోలుగా ఆరాధిస్తారో పిల్లలు గమనిస్తారు. తల్లిదండ్రులు ఎవర్ని గౌరవిస్తారో పిల్లలకు తెలుసు. తల్లిదండ్రులు లోక సంబంధమైన, అనైతికమైన ప్రజల్ని ప్రేమిస్తూ, క్రైస్తవ సత్యం గురించి పిల్లలకు బోధించడం సరైంది కాదు. ఈ విధంగా బోధించే వ్యక్తి, ఒక నమ్మకమైన క్రైస్తవుడుగా ఉండడం కంటే లోకరీతిగా పేరుపొందిన వ్యక్తిగా ఎదిగితేనే తల్లిదండ్రులు ఇష్టపడతారనే భావన పిల్లల్లో కలుగజేస్తాడు.

తల్లిదండ్రులు, పాప విషయాలు ఎందుకు తప్పో తమ పిల్లవాడికి వివరించిన తర్వాత, వాడు వాటికి గురికావడం సరైనదే అని ఆలోచిస్తుంటారు. కానీ దీని గురించి ఇలా ఆలోచించండి: మీ పిల్లవాడు మంచి ఆహారం తినాలని మీరు అనుకున్నప్పుడు, అతని ముందు చాక్లెట్లు, కేకు పెట్టి ఆ తర్వాత కూరగాయలే ఎందుకు తినాలో చెప్పకూడదు. విటమిన్లు గురించి మీరిచ్చిన వివరణ, చాక్లెట్లు చూడడం ద్వారా అతనిలో కలిగిన ఆ సహజ కోరికను అడ్డుకోలేదు.

కొంతమంది తల్లిదండ్రులు పిల్లలు ఏమి చూస్తున్నారో పట్టించుకోకుండా ఎప్పుడు టి.వి. ఆన్ చేసి పెట్టుకుంటారు. ఫలితాల్ని నియంత్రించగలిగేంత వరకు పాపం చేయడం సరైనదేనని సమాజం బోధిస్తుందని క్రైస్తవులు తప్పక గుర్తుంచుకోవాలి. ఎలాంటి పరిణామాలు లేకుండా పాపంలో జీవించే ప్రజల్ని టి.వి చూపిస్తుంది, కాని ఇది నిజ జీవితం గురించిన నిజమైన వివరణ కాదు. తన తల్లిదండ్రులు జీవితాన్ని ఆనందించకుండా తనను నియంత్రిస్తున్నారని

పిల్లవాడు భావించేలా చేస్తుంది. టి.వి. చూడడం అతడు తనకు నచ్చింది చేయగల సమయం కోసం ఎదురుచూస్తూ ఉంటాడు.

చాలామంది క్రైస్తవులు, తమ క్రైస్తవేతర బంధువులతో కలిసి జీవిస్తుంటారు. అలాంటి సందర్భాల్లో, తప్పుడు ప్రభావాల నుండి కాపాడబడే విధానం ఇంట్లో ఉండదు. పరిశుద్ధాత్ముడు తమ పిల్లల్ని మంచి మార్గంలో నడిపించడానికి సహాయపడాలని ప్రార్థిస్తూ, క్రైస్తవ తల్లిదండ్రులు ప్రేమ, నమ్మకం, పరిశుద్ధత, మరియు ఆనందానికి మాదిరిగా జీవించాలి.

## అసంపూర్ణ కుటుంబాలు

కుటుంబాలు పరిపూర్ణంగా ఉండవు కాబట్టి, సంబంధాలలో తరచుగా గతంలో చేసిన తప్పులు మరియు పరిష్కారం కాని వివాదాల చరిత్ర ఉంటుంది.

ప్రతి క్రైస్తవ తల్లి/తండ్రి పరిపూర్ణులు కారు. నియమాలు సృష్టించే విషయంలో వాటిని అమలు చేసే విషయంలో వారెప్పుడు స్థిరంగా ఉండరు. కౌమారదశలో ఉన్న వారి పరిస్థితి ఎల్లప్పుడు అర్థం చేసుకోలేరు-క్రొత్త తరంలో పరిస్థితులు మారిపోయాయి. పిల్లవాడు ఎదుర్కొనే సమస్యల విషయంలో ఎల్లప్పుడు సానుభూతి చూపించరు. ఎల్లప్పుడు మంచి వైఖరి చూపించరు, బాధించే మాటలు మాట్లాడతారు.

దేవుడు మొదటి మనుష్యులను సృజించి, కుటుంబాన్ని రూపొందించాడు. పురుషుని చేశాడు, అతనికి భార్యను ఇచ్చాడు, వారు పెంచడానికి పిల్లల్ని ఇచ్చాడు. దేవునికి సమస్తం తెలుసు. తల్లిదండ్రులు తప్పులు చేస్తారని దేవునికి తెలుసు, అయినప్పటికీ తల్లిదండ్రుల బాధ్యతనిచ్చాడు. ప్రజలకు ఎన్ని బలహీనతలున్నా, ఇది ఉత్తమమైన మార్గమని ఎంచాడు. అంటే, కుటుంబం ముందుకు సాగాలంటే ఒక మార్గం ఉండాలి. కుటుంబం పరిపూర్ణంగా లేనప్పటికీ, కుటుంబ వ్యవస్థలో అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

దేవుడు తల్లిదండ్రుల్ని ఏర్పరచాడనే వాస్తవం పిల్లలకు చాలా ప్రాముఖ్యం. అంటే, పిల్లలు తిరుగుబాటు చేసినప్పుడు దేవుడు ఏర్పాటు చేసిన వ్యవస్థను తిరస్కరించడానికి పూనుకున్నారని దీని అర్థం. దేవుడు, "పిల్లలారా... మీ తల్లిదండ్రులకు విధే యులైయుండుడి" (ఎఫెసీయులకు 6:1) అని చెప్పాడు. దేవుడు తల్లిదండ్రులకిచ్చిన బాధ్యతల్ని విస్మరించినప్పుడు, వారు దేవుని ప్రణాళిక విషయంలో తిరుగుబాటు చేస్తున్నారని అర్థం. దేవుని ప్రణాళికను తిరస్కరించమంటే దేవుని మీద తిరుగుబాటు చేయడం.

## పిల్లల్ని పెంచే బాధ్యత

తల్లిదండ్రులు పిలల్ని పెంచే విషయం గురించిన ఈ దృశ్యంలో, మూడు బాధ్యత కోణాలు ఉన్నాయి. పిల్లవాడి బాధ్యత. తల్లిదండ్రుల బాధ్యత. దేవుని బాధ్యత. గత రెండు పాఠముల్లో తల్లిదండ్రుల బాధ్యత గురించి లోతుగా పరిశీలించాం. ఇప్పుడు పిల్లల జీవితాల్లో, పిల్లల బాధ్యతల్లో దేవుని పాత్రను పరిశీలిద్దాం.

### పిల్లల జీవితాల్లో దేవుని కార్యం

1. యేసునందు విశ్వాసం ద్వారా పిల్లలు తనతో వ్యక్తిగత సంబంధం కలిగియుండాలని దేవుడు ఆశిస్తున్నాడు. (మత్తయి 18:1-6 మరియు మత్తయి 19:13-15 చదవండి)
2. పిల్లల్ని ఆయనతో సంబంధంలోకి నడిపించడానికి దేవుడు నమ్మదగినవాడు (యోహాను 6:44 చదవండి).
3. దేవుడు తన వాక్యం ద్వారా మన పిల్లలతో మాట్లాడతాడు. (2 తిమోతికి 3:14-15 చదవండి)

### దేవునితో సంబంధమున్న పిల్లలు

1. పిల్లలు తమ పాపాల నుండి క్షమించబడతారు (1 యోహాను 2:12).
2. పిల్లలు దేవుని తెలుసుకుంటారు (1 యోహాను 2:13).
3. దేవునితో సహవాసంలో పిల్లలు ఎదుగుతారు (1 సమూయేలు 2:26).
4. పిల్లలు దేవుణ్ణి ఆరాధిస్తారు (మత్తయి 21:15-16).
5. పిల్లల్ని, యౌవనులను దేవుడు వాడుకుంటాడు (యోవేలు 2:28).

దేవుడు తన ఉద్దేశ్యాలు నెరవేర్చుకోవడానికి పిల్లల్ని, యౌవనుల్ని ఉపయోగించుకున్న అనేక సందర్భాలు బైబిల్లో ఉన్నాయి; సమూయేలు, నయమాను ఇంటిలో పనిచేసే చిన్నది, జనసమూహానికి ఆహారం పెట్టడానికి యేసుకు ఐదు రొట్టెలు రెండు చేపలు ఇచ్చిన బాలుడు, దానియేలు, యోసేపు, దావీదు మరియు మరియ, కొంతమందిని పేర్కొనవచ్చు.

### పిల్లవాడి బాధ్యత

దేవుని వాక్య ప్రకారం, తల్లిదండ్రులకు విధేయత చూపడమే పిల్లవాడి బాధ్యత (ఎఫెసీయులకు 6:1-3). కొన్నిసార్లు తల్లిదండ్రులు తప్పు చేస్తే ఏమౌతుంది? పిల్లవాడు తన బాధ్యతను నెరవేర్చాలి కాని తల్లిదండ్రుల ప్రవర్తన ఆధారంగా

బాధ్యత వహిస్తానని షరతులు పెట్టకూడదు. తల్లిదండ్రుల ప్రవర్తనకు పిల్లవాడు బాధ్యుడు కాదు. విధేయత చూపవలసిన బాధ్యత పిల్లవాడిది.

తల్లిదండ్రులు మంచి చేసినప్పుడు మాత్రమే పిల్లవాడు విధేయత చూపించాలని నిర్ణయించుకుంటే, తల్లిదండ్రులకు ఎలాంటి అధికారం ఉండదు. అది దేవుని ఉద్దేశ్యం కాదు ఎందుకంటే అది పూర్తి వ్యవస్థనే నాశనం చేస్తుంది.

తల్లిదండ్రులు తమ అధికారాన్ని ఎలా ఉపయోగిస్తారనేది పిల్లవాడి బాధ్యత కాదు. విధేయత చూపవలసి బాధ్యత మాత్రం అతనిపై ఉంది. ఒకవేళ తల్లిదండ్రులు పిల్లవాడికి, రిఫ్రిజరేటర్ నుండి బీరు తీసుకురమ్మని చెప్పడం వంటి తప్పుడు పనులు చెప్పినప్పుడు ఏం చెయ్యాలి? తల్లిదండ్రులు తప్పు చేస్తున్నారా లేదా అనే విషయాన్నీ నిర్ణయించే బాధ్యత పిల్లవాడికి ఉండదు. అతడు తన అభిప్రాయాన్ని మర్యాదపూర్వకంగా చెప్పొచ్చు, కాని అతడు తప్పక పాటించాలి.[46]

పిల్లలకు వారి తల్లిదండ్రులకు మధ్య ఉన్న సమస్యలు, సాధారణంగా తల్లిదండ్రుల ఆదేశాలు క్రైస్తవ సూత్రాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అని ప్రశ్నించడం వల్ల కాదు. తిరుగుబాటు చేసే పిల్లలు వారి గదిని శుభ్రం చేయడం, ఇంటి పనుల్లో సహాయపడటం, నిర్ణీత సమయానికి ఇంటికి రావడం, లేదా వారు వినోదం కోసం ఉపయోగించే పరికరాలపై పరిమితులు వంటి రోజువారీ విషయాలలోనే తమ తల్లిదండ్రులను ప్రతిఘటిస్తుంటారు.

తిరుగుబాటు చేసే పిల్లవాడు, తన తల్లిదండ్రుల ఆదేశాలు సరైనవి కానప్పుడు, తమకు నచ్చింది నిర్ణయించుకునే హక్కు తనకుందని చెప్పుకోవడం ద్వారా తల్లిదండ్రుల అధికారాన్ని ప్రతిఘటిస్తాడు. అతని ప్రతిఘటన స్వేచ్ఛగా, స్వయం-అధికారంతో, మరియు వ్యక్తిగత స్వయంప్రతిపత్తిగా ఉండాలనే తన కోరికల నుండి వస్తుంది. ఒక వ్యక్తిని ఏ వయసులో వీటిని పొందుతాడు? ఎన్నడు కాదు.

స్వేచ్ఛ అనే భావనే ఒక భ్రమ. ఇతర వ్యక్తుల్ని పరిగణలోకి తీసుకోవడం ద్వారా ఎల్లప్పుడు మీకు బాధ్యతలు ఉంటూ ఉంటాయి. ఒకవేళ బాధ్యతలు గురించి చెప్పడానికి మీ తల్లి లేనప్పటికీ, మీరు చేయవలసిన పనులు ఎల్లప్పుడు ఉంటాయి. ఇతరుల విషయంలో ఎలాంటి బాధ్యత లేకుండా జీవించాలనుకునే వ్యక్తి, అతని మీద ఆశపెట్టుకున్నవారికి తన మీద ఆధారపడేవారికి దుఃఖాన్ని, బాధను, నాశనాన్ని కలిగిస్తాడు.

కొన్నిసార్లు తమ తల్లిదండ్రులు, తమని ఇంకా ఎక్కువగా నమ్మాలని భావించి, వారి తల్లిదండ్రులు చింతించడాన్ని బట్టి పిల్లలు కొప్పడతారు. పిల్లవాడు తల్లిదండ్రుల ఆందోళనలు అర్థం చేసుకుని, గౌరవిస్తే, తల్లిదండ్రులు ఆ పిల్లవాడిని

[46] ఒక పిల్లవాడు తల్లిదండ్రుల నుండి లేక వేరొకరి నుండి శారీరక లేక లైంగిక వేధింపులకు గురైనట్లయితే, ఆ పిల్లవాడిని కాపాడడానికి ఎవరొకరు చొరవ తీసుకోవాలి. ఆ పరిస్థితిలో ఎలా సహాయం పొందాలి పిల్లవాడికి సహజంగా అర్థం కాదు.

ఎక్కువగా నమ్ముతారు, ఆంక్షలను సర్దుబాటు చేయడానికి సిద్ధంగా ఉంటారు. పిల్లవాడు తల్లిదండ్రుల ఆలోచనలను, ఆందోళనలను తిరస్కరించినప్పుడు, పిల్లవాడి మీద మరిన్ని ఆంక్షలు పెట్టాలని భావిస్తారు.

## తప్పులు ఒప్పుకోవడం

చాలామంది వ్యక్తులు ఒక సంబంధంలో తాము చేసిన తప్పును అంగీకరించడానికి భయపడతారు, ఎందుకంటే ఆ అంగీకారం భవిష్యత్తులో వచ్చే గొడవలలో తమ స్థానాన్ని బలహీనపరుస్తుందని వారు భావిస్తారు. వాస్తవానికి, నిజాయితీగా ఉండి, సరైనది చేయడానికి సిద్ధంగా ఉండటమే అత్యంత బలమైన స్థానం. ఆ స్థానాన్ని పొందడానికి, అందులో కొనసాగడానికి ఉన్న ఏకైక మార్గం ఏమిటంటే, మీరు చేసిన తప్పులను ఒప్పుకోవడం, సరైన పనులను చేయడం ప్రారంభించడం మరియు మీరు తప్పు చేసినప్పుడు ఎప్పుడైనా సరిదిద్దబడటానికి సిద్ధంగా ఉండటం.

కొన్నిసార్లు అధికారంలో ఉన్న వ్యక్తి తన క్రిందున్న వారు తప్పులు చేసినప్పుడు వాటిని ఒప్పుకోవాలని భావిస్తాడు కాని తాను తప్పుచేసినప్పుడు ఒప్పుకోవడానికి ఇష్టపడడు ఎందుకంటె అలా ఒప్పుకోవడం అతని అధికారాన్ని తగ్గిస్తుందని భావిస్తాడు. అది తప్పు. అధికారంలో ఉన్న వ్యక్తి తన తప్పులు ఒప్పుకోనప్పుడు, అతని క్రిందున్న వారు అతన్ని నమ్మరు. ఈ సూత్రం తల్లిదండ్రుల అధికారంతో సహా ప్రతి అధికారానికి వర్తిస్తుంది.

తల్లిదండ్రులారా, మీరు మీ పిల్లవాడితో గొడవపడినప్పుడు, బహుశా మీరు కొన్ని తప్పులు చేసి ఉంటారు కాబట్టి వాటిని ఒప్పుకోవాలి. మీ తప్పులను బట్టి పిల్లవాడు తన తప్పులు సమర్థించుకుంటాడు. మీరు కఠినమైన మాటలు మాట్లాడినందుకు, అనాలోచితంగా స్పందించినందుకు, పరిస్థితిని అర్థం చేసుకోవడంలో విఫలమైనందుకు క్షమాపణ చెప్పండి. మీరు ఇలా చేసే వరకు సంఘర్షణ ముగింపు ఉండదు, ఎందుకంటే, "...దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును" (యాకోబు 4:6).

మీరు తల్లిదండ్రులైనా లేక పిల్లలైనా, మీ తప్పులు ఒప్పుకోవాలి. పశ్చాత్తాపపడినప్పుడు, క్షమాపణ చెప్పినప్పుడు, దేవుని అధికారానికి స్థిరంగా లోబడినప్పుడు, సహజంగా ఇతరులతో మెరుగ్గా సహకరించగలుగుతారు, కాని ఇతరులతో మెరుగ్గా సహకరించడమే కారణం కాకూడదు. దేవుణ్ణి సంతోషపెట్టడానికి చెయ్యాలి.

మీరు చేసిన తప్పులు ఒప్పుకున్నప్పుడు, ఎదుటి వ్యక్తి చేసిన తప్పులకు నిందలు పొందుకునేలా చూడవలసిన అవసరత మీకు ఉండదు. మీరు చేసిన తప్పులకు సాకులు చెప్పేలా ఎదుటి వ్యక్తి తప్పులను ఉపయోగించకూడదు.

కొంతమందిలో బంధం వెంటనే మెరుగుపడుతుంది, మరికొంతమందిలో సమయం పడుతుంది. ఒక మార్పు నిజమని ప్రజలు గ్రహించినప్పుడు మాత్రమే, వాళ్ళు కూడా మారతారు. కానీ మీరు సరైన పని చేయడానికి గల కారణం వేరొకరిని

మార్చడం కాదు. దేవుడు మీకు కేటాయించిన పనిని మీరు చేయాలి. బహుశా అవతలి వ్యక్తి మారకపోవచ్చు, కానీ మీకు మాత్రం మంచి మనసు, మరియు దేవుని ఆశీర్వాదం లభిస్తాయి, ఎందుకంటే మీరు మీ బాధ్యతను నెరవేరుస్తున్నారు. మిగిలిన బాధ్యతలను దేవుడే చూసుకుంటాడని నమ్మండి.

### జీవితంలోని ప్రతి విషయాన్ని దేవుని అధికారానికి అప్పగించుకోవడంలో ఉన్నప్రాముఖ్యత

జీవియా అనే చిన్న ద్వీపాన్ని గురించి ఆలోచించండి. సమీపంలో ఉన్నటువంటి గ్రేకియా ద్వీపం, జీవియాను జయించాలని అనుకుంది. జీవియా ద్వీపం మధ్యలో ఒక 10 ఎకరాల భూమిని గ్రేకియాకు ఇచ్చినట్లయితే, ఆ రెండు ద్వీపాల మధ్య శాంతి ఉంటుందని గ్రేకియా పాలకుడు జీవియా ప్రభుత్వానికి హామీ ఇచ్చాడు. శాంతి కలిగించడానికి ఇది సరైన పరిష్కారమేనా? జీవియా ద్వీపస్తులు తమ భూభాగంలో కొంత తన శత్రువులకు ఇచ్చినప్పుడు, శత్రువు దానిని స్వాధీనం చేసుకుని మరింత భూభాగాన్ని సొంతం చేసుకుంటాడు.

మీ జీవితాన్ని వివిధ ప్రాంతాలతో కూడిన ఒక భూభాగంగా ఊహించుకోండి. ఒక ప్రాంతం మీ ఉపాధి లేక విద్య కావచ్చు. మరో ప్రాంతం మీ వినోదం కావచ్చు. ఇంకొక ప్రాంతం మీ కుటుంబ సభ్యులతో మీకున్న సంబంధం కావచ్చు. ఇంకా చాలా ప్రాంతాలు ఉంటాయి.

మీ జీవితంలో ఉన్నటువంటి అన్ని ప్రాంతాలతో ఆ భూభాగమంతా, దేవుని స్వాధీనంలో ఉండాలి. ఒకవేళ ఒక ప్రాంతం, మీ కుటుంబంతో మీకున్న సంబంధాలు దేవుని స్వాధీనంలో లేకపోతే ఏమి అవుతుంది? ఆ ప్రాంతంలోకి సాతానుడిని ఆహ్వానించినట్లు అవుతుంది. ఆ ప్రాంతంలో మొదలుకొని మీ జీవితంలోని ఇతర ప్రాంతాలన్నిటిని సాతానుడు స్వాధీనం చేసుకుంటాడు. అదే విధంగా, ఒక వ్యక్తి తన వినోదాల విషయంలో అపవిత్రంగా ఉంటే, తన జీవితంలోని ఇతర విషయాలన్నిటిని సాతానుడు స్వాధీనం చేసుకుంటాడు. క్రైస్తవుడు తన జీవితంలోని ప్రతి ప్రాంతాన్ని దేవుని అధికారానికి అప్పగించుకోవాలి.

### తల్లిదండ్రులకు కొన్ని ముఖ్య సూచనలు

► విద్యార్థులు తరగతి కోసం ఎఫెసీయులకు 6:4, కొలొస్స 3:21, 1 కొరింథీయులకు 13:11, మరియు కొలొస్స 3:8 చదవాలి.

మీ బిడ్డ భావోద్వేగానికి లోనై, కోపాన్ని నిరాశను చూపిస్తుంటే మీరు వాడిని అర్థం చేసుకోవట్లేదని ఆలోచిస్తాడు. మీరు అతనిని పట్టించుకోకుండా, అతని మాటలు సరిగా వినట్లేదని, సరిగా అర్థం చేసుకోవట్లేదని భావిస్తాడు.

వినడానికి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. మీరు అతని సమస్యల్ని చిన్నవిగా లేక హాస్యాస్పదంగా భావించినప్పుడు, అతడు నిజమైన బాధను మీరు సరిగా అర్థం చేసుకోలేరు. ఒకవేళ అది అతనికి పెద్ద సమస్యగా అనిపిస్తే, అది అతని విశ్వాసాన్ని, ప్రవర్తనను సవాలు చేస్తుంది. అతడు అంత బలంగా ఎందుకు స్పందిస్తున్నాడో మీరు అర్థం చేసుకోలేకపోతే, ఆ పరిస్థితిలో ఉన్నటువంటి తీవ్రత మీకు అర్థం కాదు.

మీ బిడ్డను ఎన్నడు పట్టించుకోకుండా ఉండవద్దు, మీరు పట్టించుకోవట్లేదని తెలియజేసే ప్రకటనలు మీరు చేయవద్దు.

మీ పిల్లలందరూ ఒకేలా ఉన్నారని మీరు అనుకుంటున్నారా?

► ఒక విద్యార్థి తరగతి కోసం ఎఫెసీయులకు 4:30-32 చదవాలి.

సమస్య ఎదురైనప్పుడు, గత వైఫల్యాలను మళ్ళీ ప్రస్తావించకూడదు. పిల్లవాడు తన గత వైఫల్యాలను ప్రస్తుత పరిస్థితికి సంబంధించినవిగా చూడాలనుకోడు. ఇప్పుడు మారిపోయాడని, గతంలో చేసిన తప్పులు గుర్తు చేయడం అన్యాయమని భావిస్తాడు. అయితే, అతడు మీతో ఉదారంగా ఉంటాడని అనుకోవద్దు.

## సమూహ చర్చ కోసం

► ఈ పాఠంలో మీకు క్రొత్తగా అనిపించిన కొన్ని విషయాలు ఏంటి? మీ అలవాట్లలో మీరు మార్చుకోవాలని అనుకున్న కొన్ని విషయాలను పంచుకుంటారా?

► సంఘ కుటుంబాలు, గృహాలలో జీవితాన్ని మెరుగుపరచడానికి, చర్చిలోని పిల్లలకు సహాయం చేయడానికి కలిసి పనిచేయగల మరిన్ని మార్గాలను చర్చించండి.

## ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ,

మా కుటుంబాలు ప్రేమ, భద్రత, మరియు ఆశీర్వాద స్థానాలుగా ఉండాలని ఆశిస్తున్నాను. మేం చేసే ప్రతి పనిలో పవిత్రంగా ప్రేమ ఉండునట్లు మాకు సహాయం చేయుము.

క్రైస్తవ బోధలో, ప్రవర్తనలో స్థిరంగా ఉండునట్లు సహాయం చేయుము. నిన్ను అనుసరించే ఆశ మా పిల్లలకు అనుగ్రహించుము.

మా పిల్లల విషయంలో నమ్మకంగా ఉన్నందుకు ధన్యవాదాలు. వారి హృదయాల్లో నీ ఆత్మ కార్యం జరిగిస్తుందని మాకు తెలుసు.

ఆమెన్

## పాఠం అభ్యాసాలు

(1) కుటుంబాల కోసం బైబిల్ ఇచ్చిన ఏడు మార్గదర్శకాల జాబితాను సంకలనం చేయండి. ఆ తర్వాత, ఆ మార్గదర్శకాలను నిజ జీవిత పరిస్థితులకు అన్వయించండి. ప్రతి అన్వయాన్ని వివరిస్తూ ఒక పేరా రాయండి (మొత్తం ఏడు పేరాలు).

(2) క్రింది పేర్కొన్న అంశాలలో నుండి ఒక దానిని ఎంపిక చేసుకోండి. సామెతలు గ్రంథాన్ని పరిశీలించి, ఈ అంశం గురించి మాట్లాడే సామెతలను ఒక జాబితాగా చేయండి. ఆ తర్వాత, ఆ అంశం గురించి సామెతలు గ్రంథం ఏమి బోధిస్తుందో రెండు పేరాల్లో సంక్షిప్తంగా రాయండి. తరువాత, తల్లిదండ్రులు ఈ సూత్రాల్ని తమ పిల్లలకు లేదా కౌమారదశలో ఉన్నవారికి ఎలా బోధించగలరో మూడు పేరాల్లో రాయండి. అంశాలు:

- సత్యం మాట్లాడడం
- ఆర్థిక విషయాలు
- జ్ఞానం, ధనం విలువల విషయంలో వ్యత్యాసాలు
- విశ్వసనీయత
- లైంగిక పవిత్రత
- విధేయత
- ఉపదేశం, దిద్దుబాటు పొందుకోవడం
- శ్రద్ధగా ఉండడం/చొరవ తీసుకోవడం
- సుఖం గురించి దేవుడు ఏం చెప్పాడు
- ఉపదేశం
- ఇతరులతో సంబంధాలు
- దాతృత్వం

# పాఠం 14

# కౌమారదశలోని పిల్లలను పెంచడం

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) కౌమారంలో ఉన్న వారిపట్ల దేవుని ప్రాధాన్యతలను అర్థం చేసుకోవాలి.

(2) కౌమారదశలో ఉన్నవారిని యువకులుగా సిద్ధపరచేటప్పుడు వారిని ప్రభావితం చేయడానికి, వారిని శిక్షణ ఇవ్వడానికి బాధ్యత వహించాలి.

(3) కౌమారదశలో ఉన్న వారితో ఆరోగ్యకరమైన, ఫలవంతమైన బంధాలు ఏర్పరచుకోవడానికి ప్రోత్సహించబడాలి.

(4) కౌమారదశలోని సవాళ్లు ఎదుర్కొంటూనే లేఖన సూత్రాలు పాటించడానికి సిద్ధపడాలి.

## నిఖిత – ఇంటిలో శిక్షకురాలు

ప్రతి సాయంత్రం నిఖిత తన ఇద్దరు పిల్లలతో ప్రార్థన చేయడానికి, వాక్యం చదవడానికి కొంత సమయం వెచ్చించేది. లేఖన భాగంలో కొన్ని వచనాలు చదివి, ఒకొక్క వచనానికి మధ్య కొంచెం సమయం తీసుకుని అవి జీవితానికి ఎలా వర్తిస్తాయో మాట్లాడేది. ఆమె పిల్లలు కౌమారదశలో ఉన్నప్పుడు, లేఖన భాగాలు చదివి వాటిని వివరించడానికి వారికి సమయం ఇచ్చింది. అప్పుడు వారు లేఖనాల్ని అద్భుతంగా వివరించారు ఎందుకంటే వారు ఆమె తల్లి నుండి నేర్చుకున్నారు. ఆమె నుండి నేర్చుకున్న జీవిత సూత్రాల్ని తమ సొంత మాటల్లో చెప్పగలిగారు.

## కౌమారదశ

ప్రతి సమాజంలో బాల్యానికి, యుక్తవయస్సుకు మధ్య జీవిత కాలానికి ఒక పేరు ఉంటుంది. ఈ కాలంలో, యవ్వనస్థుల్లో లైంగికత వంటి వయోజనుల ఆసక్తులు మొదలౌతాయి, కానీ వయోజనులు తీసుకునే బాధ్యతలు చేపట్టలేడు. కొన్ని దేశాల్లో, చట్టపరంగా 18 సంవత్సరాలు వస్తేనే వయోజనుల వయస్సులో ఉన్నట్లుగా పరిగణిస్తారు. అలాంటి దేశాల్లో, 18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్నవారు వివాహం చేసుకోలేరు, సైన్యంలో పనిచేయలేరు లేక తల్లిదండ్రుల అనుమతి లేకుండా చట్టబద్ధంగా ఒప్పందాలు చేయలేరు.

కౌమారదశ ప్రతిచోట ఒకేలా ఉండదు. కొన్ని సమాజాల్లో, వయోజనులు చేసే పనులు అతడు లేక ఆమె నేర్చుకున్నప్పుడు, 18 సంవత్సరాల్లోపే వయోజనులుగా జీవించడానికి సిద్ధంగా ఉంటారు. మరికొన్ని సమాజాల్లో, 18 సంవత్సరాలు దాటిన తర్వాత కూడా విద్య అభ్యసిస్తుండగా తల్లిదండ్రుల మీద ఆధారపడతారు.

► బాల్యానికి, వయోజన వయస్సుకు మధ్య కాలాన్ని సూచించడానికి మీ సమాజంలో ఏ పదం ఉపయోగిస్తారు?

► వయోజన (దశ) అంటే ఏంటి?

మనుష్యులకు, జంతువులకు రెంటికీ ఉపయోగించే *వయోజన* (దశ) అను పదానికి నిర్వచనం ఇది: శారీరక పరిపక్వతగల జీవి. అయితే మనుష్యుల దృక్కోణంలో, వయోజన (దశ) అంటే శారీరక పరిపక్వత కంటే మించినది. యువకుడికి, వయోజనునికి ఉండే బలం, పరిమాణం ఉండొచ్చు కాని, వయోజనుడు తీసుకునే బాధ్యతలు తీసుకోవడానికి సిద్ధంగా ఉండడు.

**► వయోజనులకు శారీరక ఎదుగుదలతో పాటుగా ఇంకేమి లక్షణాలు ఉంటాయి?**

సాధారణంగా, ఒక వయోజనుడు అంటే స్వయంగా నిర్ణయాలు తీసుకోగల మరియు వాటికి బాధ్యత వహించగల వ్యక్తి. ఈ నిర్వచనం ఖచ్చితమైనది కాకపోవచ్చు, ఎందుకంటే వ్యక్తిగత బాధ్యత స్థాయిలు చాలా తేడాగా ఉంటాయి. ఒంటరిగా జీవించేవారు తప్ప ప్రతి ఒక్కరూ ఇతరుల ప్రభావానికి లోనవుతారు, మరియు పెద్దలు కూడా అన్ని నిర్ణయాలలో పూర్తిగా స్వతంత్రంగా ఉండరు. అయినప్పటికీ, వయోజనుల లక్షణం ప్రధానంగా సొంత నిర్ణయాలు తీసుకోవడం మరియు వాటికి బాధ్యత వహించడం. కౌమారదశ ముగిసే సమయానికి, వ్యక్తి తన కోసం నిర్ణయాలు తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలి. ఆ బాధ్యతకు కౌమార దశలో ఉన్నవారిని సిద్ధం చేయడమే తల్లిదండ్రుల లక్ష్యం.

తండ్రి బ్రతికి ఉండగానే తనకు రావలసిన ఆస్తిని అడిగిన కుమారుడి గురించి యేసు ఒక కథ చెప్పాడు (లూకా 15:11-32). కుమారుడు డబ్బు తీసుకుని నిర్లక్ష్యంగా వృథా చేశాడు. కౌమారదశ ముగించుకుని వయోజన దశలోకి అడుగుపెట్టినప్పటికీ, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి సిద్ధంగా లేని వ్యక్తికి ఇది ఒక మంచి ఉదాహరణ. వయోజన దశలోని బాధ్యతలు, స్వేచ్ఛ స్వీకరించడానికి ముందు వారు సరిగా ఎదగలేదు గనుక యుక్తవయసులో ఉన్న చాలామంది తాము తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్ల పెద్ద పెద్ద సమస్యలు ఎదుర్కొంటున్నారు.

మానవ అభివృద్ధిలో ఒక ముఖ్య దశయైన కౌమారదశకు సంబంధించి దేవుని వాక్యంలో గొప్ప జ్ఞానం దాగియుంది.

## శారీరక, మానసిక పురోగతి

► ఒక విద్యార్థి తరగతి కోసం లూకా 2:40, 52 చదవాలి.

యేసు యుక్తవయస్సులోకి అడుగుపెట్టి, మానసికంగా, శారీరకంగా ఎదిగాడు. ఈ రెండు వచనాల మధ్య, యేసు దేవాలయాన్ని సందర్శించి బోధకులతో మాట్లాడిన విషయం ఉంది. ఆయన శారీరకంగా ఎదగడమే కాకుండా, మరింత స్వతంత్రంగా ఉండగలనని భావించాడు. తన కుటుంబం, స్నేహితులకు మించి ఇతరులతో కూడా తన ఆలోచనలను పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు.

యేసు బోధకులతో సంభాషించడం చూసిన మరియ, యోసేపులు ఆశ్చర్యపోయారు అయితే వారు మూడు దినాల నుండి యేసు విషయంలో ఆందోళన చెందుతున్నారని మరియ యేసుతో చెప్పింది (లూకా 2:46-48). అయితే యేసు, మీరు చింతించకూడదు, ఎందుకంటే నేను నా తండ్రిపనుల మీద ఉన్నానని చెప్పాడు (లూకా 2:49). ఒక యువకుడుగా తన జీవితంలో తన ఆలోచనలు అనుసరించి నడుచుకోవాలనే సాధారణ కోరిక ఆయనలో ఉంది. అయితే, ఆయన ఇంటికి తిరిగివచ్చి, మిగిలిన కౌమారదశ అంతటా తన తల్లిదండ్రులకు లోబడి ఉన్నాడు (లూకా 2:51).

పూర్వ వయోజనదశలో, పిల్లల శరీరం పెద్దవారిలా మారుతుంది. పిల్లలు వేగంగా ఎత్తు పెరుగుతారు. శరీరంలో పలుచోట్ల వెంట్రుకలు వస్తాయి. స్వరం గంభీరంగా మారుతుంది. ఈ మార్పులు సహజమేనని పిల్లలు అర్థం చేసుకునేలా తల్లిదండ్రులు సహాయపడాలి. దేవుడు మానవులలో సహజ శరీర, మానసిక అభివృద్ధిని ప్రణాళిక చేశాడు.

మీ పిల్లలతో మంచి సంబంధం కలిగి ఉండడంవల్ల, ఈ కాలంలో వారు మీతో పారదర్శకంగా మాట్లాడగలుగుతారు. ఈ విషయాల గురించి తల్లిదండ్రులతో మాట్లాడలేనివారు లోలోపల భయపడతారు. వీటి గురించి మరింత సమాచారం కోసం మిత్రుల్ని అడుగుతారు లేక ఆన్లైన్లో వెదుకుతుంటారు.

## మానసిక పురోగతి

కౌమారదశ అనేది, బాల్య దశ కొనసాగింపు మాత్రమే కాదు. తల్లిదండ్రులు, తమ పిల్లల చిన్నతనంలో ఎలా బోధించాలో కౌమారంలో ఉన్నప్పుడు కూడా అలాగే బోధించవచ్చు లేక నడిపించవచ్చు అని అనుకోవడం తప్పు. కౌమారంలో ఉన్నప్పుడు ఆలోచనలు, ఆసక్తులు మారుతుంటాయి. అతడు స్వేచ్ఛ, విజయం మరియు గౌరవం కోసం చూస్తాడు. కౌమారంలో ఉన్నవారితో చిన్నపిల్లలతో వ్యవహరించినట్లుగా వ్యవహరిస్తే చిరాకుపడతారు.

లేఖనమంతటా యేసువలే తెలివిగల నిర్ణయాలు తీసుకున్నవారు, లేక యేసు చెప్పిన కథలోని వ్యక్తివలే చెడ్డ నిర్ణయాలు తీసుకున్న చాలామంది ఉన్నారు (లూకా 15:11-32). తమ కుమారుడు లేక కుమార్తె మానసికంగా ఎలా

అభివృద్ధి చెందుతుందో తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి. తల్లిదండ్రుల లక్ష్యం ఏమిటంటే, యువత జీవితంలోని అన్ని విషయాల్లో ముఖ్యంగా భావోద్వేగాల విషయంలో ఆశా-నిగ్రహం నేర్చుకోవడానికి సహాయపడాలి, అప్పుడు వారికి తల్లిదండ్రుల నియంత్రణ అవసరం ఉండదు.

► ఎఫెసీయులకు 6:1-4 చదవండి. ఈ వాక్యభాగం నుండి మనకు ఎలాంటి నిర్దిష్టమైన మార్గదర్శకాలు లభిస్తాయి?

పిల్లలు తల్లిదండ్రులకు ఇద్దరికీ లోబడవలసి ఉంది, అంటే అందుకు తల్లి, తండ్రి ఇద్దరూ కూడా సహకరించాలని ఇది సూచిస్తుంది. తల్లిదండ్రులకు చూపించే విధేయతకు, దేవునికి చూపించే విధేయతకు మధ్య ఒక స్పష్టమైన సంబంధాన్ని ఈ వాక్యభాగం చూపిస్తుంది. తమ పిల్లలకు విధేయత నేర్పని తల్లిదండ్రులు, దేవుని పట్ల విధేయత చూపడానికి వారిని సిద్ధపరచడం లేదు. మీ పిల్లల్ని మీ మీద తిరుగుబాటు చేయడానికి అనుమతిస్తే, మీరు వారిని దేవుని మీద తిరుగుబాటు చేసేవారిగా సిద్ధపరుస్తున్నారు.

ఈ వాక్యభాగం ముఖ్యంగా తండ్రులకు ఉపదేశమిస్తుంది. తండ్రులు తమ పిల్లల్ని నిరుత్సాహానికి గురి చేయకుండా లేక వారికి కోపం రేపకుండా శిక్షణ ఇవ్వాలి. శిక్ష, దిద్దుబాటు అవసరం, మరియు అవి పిల్లవాడికి వెంటనే సంతోషాన్ని కలిగించవు, కాని తండ్రి స్థిరంగా, ప్రేమగా ఉండాలి. అంటే, తండ్రి తన బిడ్డలో జరిగే మానసిక పురోగతిని అర్థం చేసుకోవాలి.

తండ్రి దిద్దుబాటు మాత్రమే కాకుండా ప్రభువు శిక్షలో, బోధలో వారిని పెంచాలి. మనం కేవలం మన పిల్లల తప్పులు సరిదిద్దడం ద్వారానే వారిని పెంచం. మనం వారిని అర్థం చేసుకోవడానికి, ప్రోత్సహించడానికి ప్రయత్నించాలి. మనం మన సొంత అవసరాలే కాకుండా దేవుని సత్యాన్ని కూడా ఉపయోగించాలి. మనం దేవునికి విధేయత చూపుతున్నామని కూడా చూపించాలి.

పిల్లవాడు తన చిన్నతనంలో గౌరవించడం, విధేయత చూపడం నేర్చుకుంటే, కౌమార దశలో శిక్షణ ఇవ్వడం సులభం! పిల్లలు చిన్నవయసులో ఉన్నప్పుడు తల్లిదండ్రులు వారితో పెంచుకున్న సంబంధం, కౌమార దశలో శారీరక, మానసిక, ఆత్మీయ మార్పులు కలిగినప్పుడు వారికి సహాయపడుతుంది. పిల్లల పెంపకాన్ని సులభతరం చేసే సూచనలేమి లేవు, కాని చిన్ననాటి నుండే మంచి సంబంధం ఏర్పరచుకుంటే కౌమారదశ అంతా సంభాషణ సాధ్యమౌతుంది.

పిల్లలు తమ మాట వినాలని తల్లిదండ్రులు ఆశపడతారు, కాని తల్లిదండ్రులే ముందుగా పిల్లల మాట ఆలకించాలి. దయచేసి, మీ కోసం, వారి కోసం -మీ ఫోన్లు, పుస్తకాలు, పనులు లేక మీరు చేసే ఏ పనైనా ప్రక్కనబెట్టి, వారు మాట్లాడాలనుకున్నప్పుడు సమయం ఇవ్వండి. మరేది ముఖ్యం కాదు వారి మాటలే ముఖ్యం అన్నట్లుగా వినండి. మధ్య మధ్యలో తప్పులు సరిచేయకుండా, వారు చెప్పేది మీకు అర్థమయ్యేవరకు జాగ్రత్తగా వినండి. వారికి, వారి

ఆలోచనలకు మీరు విలువిస్తున్నారని, వారిని గౌరవిస్తున్నారని అనిపించాలి. మీ సలహాలు వారికి ఇష్టం లేకపోయినా, మీరు నిజంగా విన్నారని వారికి అర్థమైనప్పుడు వారు దాన్ని మరింత గౌరవిస్తారు.

యువకుడు నిరాశ, కోపం లేక ఒంటరిగా ఉండడం వంటి భావోద్వేగాలు వ్యక్తపరుస్తున్నప్పుడు వినడం కొంచెం కష్టంగానే ఉంటుంది. యువకుడికి తన సొంత భావాలు పూర్తిగా అర్థం కావని గుర్తుంచుకోండి. కొన్నిసార్లు వారి పరిస్థితులవల్ల, సంబంధాలవల్ల, మరియు శరీరమార్పులవల్ల భావోద్వేగాలు ప్రభావితమౌతాయి గనుక వారు ఏదొకటి మాట్లాడుతుంటారు. ఇవన్నియు కౌమారదశలో ఉన్నవారి భావోద్వేగాల్ని ప్రభావితం చేస్తాయి: పాఠశాలలో ఒత్తిడి, స్నేహితుల నుండి అంగీకారం పొందాలనే ఒత్తిడి, శారీరక మార్పులవల్ల కలిగే ఆందోళన, గౌరవం, విలువ పొందుకోవట్లేదనే అసహనం, హార్మోన్ల ప్రభావం మరియు అస్థిరమైన నిద్ర వలన కలిగే అలసట.

### ఆత్మీయ పురోగతి

► ప్రసంగి 11:9-12:1, 13 చదవండి. ఒక యువకునికి, ఈ వచనాల్లోని ఆజ్ఞల్ని మీరెలా వివరిస్తారు?

యువతలో అజాగ్రత్తను, అనైతికను ప్రపంచం క్షమించవచ్చు, కాని యువత తమ చర్యల విషయంలో దేవునికి లెక్క అప్పజెప్పవలసినవారిగా ఉన్నారనే విషయం గుర్తుంచుకోవాలని ఈ వచనాలు సెలవిస్తున్నాయి. ఆయన వారి న్యాయాధిపతి.

జీవితంలోని వివిధ కార్యకలాపాల మధ్య దేవుని వాక్యాన్ని బోధించడం ఈ దశలో కూడా ఎంతో ముఖ్యమైంది (ద్వితీయోపదేశకాండము 6:6-7). అయితే, ఇది చాలా కష్టం ఎందుకంటే కౌమారంలో ఉన్నవారు కుటుంబంతో గడిపే సమయంకంటే ఇతర కార్యక్రమాల్లో ఎక్కువ నిమగ్నమౌతారు. వారికి వారి సొంత ఆశలు ఉంటాయి, విద్యా కార్యకలాపాలు, క్రీడా కార్యక్రమాలు, స్నేహితుల గుంపులు మొదలైనవి ఉంటాయి. ఎల్లప్పుడు తల్లిదండ్రులు వారితో ఉండలేరు, కానీ దేవుడు ఉంటాడు. అయితే తల్లిదండ్రులు వారి కోసం నమ్మకంగా ప్రార్థించాలి. ప్రత్యేకమైన సంభాషణలకై సమయాన్ని కేటాయించడంలో తల్లిదండ్రులు దేవుని జ్ఞానం కోసం వేడుకోవాలి. పిల్లల వ్యక్తిగత జీవితంలోని వివిధ విషయాలు గురించి తల్లిదండ్రులు తెలుసుకోవడం, వాటిలో పాల్గొనడం ఎంతో ముఖ్యం.

► 1 స్సలొనీకయులకు 2:11-12 కలిసి చదవండి. ఎదుగుతున్న వారి పిల్లలతో వారికున్న సంబంధాల విషయంలో దేవుడు తండ్రులకు ఎలాంటి బాధ్యత ఇచ్చాడు?

సమస్యలు స్పష్టంగా కనిపించడం లేదనే కారణంతో అంతా బాగానే ఉందని తల్లిదండ్రులు అనుకోకూడదు. మీ కుమారుడు లేక కుమార్తె శోధనలకు గురౌతారని, బలహీనతలు అనుభవిస్తారని ఆశించండి, ఎందుకంటే వారు

ఖచ్చితంగా అనుభవిస్తారు! వారి ఆర్థిక విషయాల్లో, సమయాన్ని ఖర్చు చేసే విషయంలో, జీవిత నిర్ణయాల విషయంలో, లైంగిక పవిత్రత విషయంలో ఎలా ఉన్నారో అనేదానిపై లెక్క అప్పజెప్పేవారిగా చెయ్యండి. ఇతరుల ఆలోచనలు, సలహాలు అడగండి. గురువుల మాటలు , ఇతరుల ఆందోళనలు వినండి. మీ పిల్లల విషయంలో ఇతరుల అభిప్రాయాలతో మీరు ఏకీభవించనప్పటికీ, ఆ మాటలు శ్రద్ధగా విని, మీ పిల్లల అవసరాలు అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యండి.

కౌమారంలో ఉన్నవారి కోసం ప్రార్థించండి, వారి కోసం ప్రార్థిస్తున్నారని చెప్పండి. మీరు చేసే ప్రార్థన వారికి వినిపించండి. మీరు ఏ విషయాల కోసం ప్రార్థిస్తున్నారో వారితో పంచుకోండి. ఉదాహరణకు, ఇలా చెప్పవచ్చు, "నీవు నీతికొరకు ఆకలిదప్పులు (మత్తయి 5:6) కలిగియుండాలని ప్రార్థిస్తున్నాను; దుప్పినీటివాగుల కొరకు ఆశపడునట్లు నీవు ఆశపడాలని ప్రార్థిస్తున్నాను (కీర్తన 42:1). ఆత్మ పూర్ణులై ఉండాలని ప్రార్థిస్తున్నాను (ఎఫెసీయులకు 5:18) తద్వారా నీవు పూర్ణహృదయముతో, పూర్ణాత్మతో, పూర్ణ మనసుతో ఆయన్ను ప్రేమిస్తావు అలాగే నిన్నువలె నీ పొరుగువారిని [లేక తోబుట్టువుని] ప్రేమిస్తావు (మత్తయి 22:37-39)."

► ఇంకా ఏ ఇతర వాక్యభాగాలు కౌమారంలో ఉన్నవారి కోసం ప్రార్థించగలరు?

చివరిగా, కౌమారంలో ఉన్న మీ పిల్లలతో ఈ ఆత్మీయ ప్రయాణంలో, వారితో దేవుని వాక్యాన్ని ఉపయోగించండి:

- మాదిరిగా ఉండండి: ప్రతిరోజు వ్యక్తిగతంగా దేవుని వాక్యాన్ని అధ్యయనం చేయండి. దేవుడు మీకు ఏమి బోధిస్తున్నాడో, దేవుని వాక్యం జీవితాల్లో ఎలా అన్వయించబడుతుందో మీ కుమారుడు లేక కుమార్తెతో మాట్లాడండి. వారు ఉత్సాహంగా స్పందించకపోయినా లేక సంభాషణ కొనసాగించకపోయినా, వారు వింటున్నారు, వాక్యం ద్వారా ప్రభావితమౌతున్నారు!
- కుటుంబంగా కలిసి లేఖన భాగాలు కంఠస్తం చేయండి, మరియు భోజన సమయంలో లేక రోజు ముగింపులో వచనాలు చదవండి.
- సామెతల గ్రంథాన్ని ఒకొక్క వచనం చొప్పున చదవండి, మాట్లాడండి. కొద్ది సమయం కుటుంబంగా ధ్యానించడానికి సామెతల గ్రంథం ఒక అద్భుతమైన పుస్తకం, ప్రతిరోజుకు కావలసిన ఆచరణాత్మక జ్ఞానాన్ని అందిస్తుంది. అనేక సంభాషణలకు అవకాశాలు కలిగిస్తుంది, గొప్ప ప్రభావం చూపిస్తుంది.
- లేఖనంలో ఉన్నటువంటి సూచనలు, సూత్రాలు, మరియు ఉదాహరణలు జీవితంలో అన్ని కాలాలకు వర్తిస్తాయి, కాబట్టి మీ కుమారులు కుమార్తెలతో కలిసి దేవుని వాక్యమంతటిని అధ్యయనం చేయండి.

## సాంఘిక పురోగతి

లూకా 2:52, కౌమారంలో యేసు పురోగతిని వర్ణించే ఈ వచనం, ఆయన ఇతరులతో తన సంబంధాల విషయంలో కూడా ఎదిగాడని చెబుతుంది. దేవుడు మన సంబంధాల విషయంలో ఆసక్తి కలిగియున్నాడు. మానవులతో సంభాషించాలని, సహవాసం కలిగియుండాలని ఆయన మనల్ని రూపొందించాడు.

కుటుంబ సభ్యులతో పాటుగా, మనం మన సహవిద్యార్థులు, పొరుగువారు, సంఘ బృందాలు, యజమానులు, బోధకులు, ఇతర నాయకులు మరియు మీడియా ద్వారా ప్రభావితులౌతారు. తోటి స్నేహితులు సాధారణంగా మంచిగానో లేక చెడుగానో ఎక్కువ ప్రభావం చూపుతారు. క్రైస్తవ తల్లిదండ్రులు తమ పిల్లలు, యువకులు ఎవరితో ఎలా సన్నిహితంగా ఉంటున్నారో పర్యవేక్షించాలి.

మీ బిడ్డ యుక్తవయసులోకి అడుగుపెడుతున్నప్పుడు, వారు ఎంతవరకు ఒత్తిడిని తట్టుకోగలరో జాగ్రత్తగా, ప్రార్థనాపూర్వకంగా ఆలోచించండి. మీ కుటుంబంలోని కంప్యూటర్లు, మొబైల్ పరికరాల్లో, చెడ్డ విషయాలను చూడకుండా ఉండటానికి పాస్‌వర్డ్‌లను, నిర్దిష్ట యాప్‌లను ఉపయోగించండి. పరికరాలను వాడడానికి సమయ పరిమితులను ఏర్పాటు చేయండి. వెబ్‌సైట్లు, సినిమాలు, టీవీ కార్యక్రమాలు మరియు సోషల్ మీడియా వేదికలను పర్యవేక్షించండి. మీ బిడ్డ మీ పరిసరాల్లోని కొందరితో గడపడానికి మీరు ఎలా అనుమతించరో, అదే విధంగా వారి ఎలక్ట్రానిక్ పరికరాల్లో చెడ్డవారిని అనుసరించడానికి లేదా వారితో సంబంధాలు పెట్టుకోవడానికి అనుమతించవద్దు.

► మీ పిల్లల్ని కేవలం రక్షించడం మాత్రమే సరిపోదు. కౌమారంలో, మీ కుమారుడు లేక కుమార్తె దేవుణ్ణి గౌరవించి, వారి ఆత్మలను రక్షించుకునే తెలివిగల నిర్ణయాలు తీసుకునే విధంగా బాధ్యతను స్వీకరించడానికి కూడా మీరు వారిని సిద్ధపరుస్తున్నారు. కౌమారంలో ఉన్నవారు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే విషయంలో, వారి సాంఘిక లోకంలో బాధ్యతను, జవాబుదారీతనాన్ని నేర్పించగల కొన్ని మార్గాలు ఏంటి?

యవ్వనస్థులు మిత్రుల బృందాల్ని ఏర్పాటు చేసుకుని ఎక్కువ సమయం గడుపుతారు. వారు ఒకే రకమైన వినోదాన్ని ఆస్వాదించడం వంటి ఆసక్తులు పంచుకోవడం నేర్చుకుంటారు. సంఘం, తల్లిదండ్రులు, పాఠశాల, మరియు ఇతర సంస్థలపట్ల ఒకేరకమైన ఆలోచనలు పంచుకుంటారు. తల్లిదండ్రులు, తమ పిల్లల్లో కలిగే మార్పులకు తరచు ఆశ్చర్యపడుతుంటారు. యవ్వనస్థులు కొన్నిసార్లు ఊహించని వ్యాఖ్యలు చేస్తారు, విమర్శలు చేస్తారు, మిత్రుల నుండి నేర్చుకున్న పదజాలం వాడతారు. ఆ స్నేహితుల బృందం ఒక ప్రత్యామ్నాయ కుటుంబంగా మారి, దాని సభ్యుల్ని అంగీకరిస్తుంది. ఒకవేళ తన సొంత కుటుంబం నుండి విలువ, గుర్తింపు, అంగీకారం పొందనప్పుడు ఈ ప్రత్యామ్నాయ కుటుంబం వైపు బలంగా ఆకర్షించబడతారు.

కౌమారంలో ఉన్నవాడిని స్నేహితుల బృందం నుండి బయటకు తీసుకురావడం లేదా ఆ బృంద ప్రభావాన్ని తగ్గించడం చాలా కష్టంగా ఉంటుంది. తల్లిదండ్రులు ఆ బృందాన్ని లేక వ్యక్తుల్ని విమర్శించినప్పుడు, పిల్లవాడు వారి పక్షంగా నిలబడతాడు, తల్లిదండ్రులు తనను అర్థం చేసుకోవట్లేదని భావిస్తాడు. తండ్రి లేక తల్లి శ్రద్ధ చూపినప్పుడు, ఆసక్తి చూపించినప్పుడు, ప్రేమ చూపినప్పుడు కౌమారంలో ఉన్నవాడికి సహాయం చేస్తారు. తల్లిదండ్రులు తమ పిల్లల భావోద్వేగ అవసరాలు తీర్చినప్పుడు, ప్రత్యామ్నాయ కుటుంబమైన స్నేహితుల బృందం మీద వారు ఆధారపడరు.

► అనేక కుటుంబాల తల్లిదండ్రులు కౌమారంలో ఉన్న తమ పిల్లలకు సహాయం చేయడానికి ఎలా కలిసి పనిచేయగలరు?

► దేవుణ్ణి గౌరవించే ఆరోగ్యకరమైన సాంఘిక జీవితాలు గడపడంలో కౌమారదశలో ఉన్న తమ పిల్లలకు సహాయం చేస్తున్నప్పుడు, సంఘం తల్లిదండ్రులకు ఎలా మద్దతు ఇవ్వగలదు?

### యుక్తవయసుకు మారే తరుణంలో ఉండే ఇబ్బందులు

పిల్లవాడు ఒక్కసారిగా వయోజనుడు కాలేడు. ఒక బిడ్డ అనేక సంవత్సరాల పాటు ఉండే పరివర్తన కాలం గుండా వెళతాడు.

లేఖనమంతటిలో, ముఖ్యంగా సామెతలు గ్రంథం యువతను ఉద్దేశించి రాయబడింది. సామెతల గ్రంథంలో, జీవితం గురించి నేర్చుకుంటూ, ప్రాపంచిక దృక్కోణాన్ని అభివృద్ధి చేసుకునే తన కుమారుడ్ని ఉద్దేశించి రాజైన సొలొమోను మాట్లాడాడు. జీవితంలో ప్రతి కోణం గురించి, దేవుని మార్గాలు అనుసరించడంవల్ల కలిగే బహుమానాలు దేవుని మార్గాలు తిరస్కరించడంవల్ల కలిగే ప్రమాదాలు గురించి సొలొమోను తన కుమారుడితో మాట్లాడాడు.

బాల్యంలో, కౌమారదశలో ఏర్పడిన నమ్మకాలు, ఆ సమయంలో చేసుకున్న ఎంపికలు ఒక వ్యక్తి జీవితానికి చాలా ప్రాముఖ్యం. యుక్తవయసుకు మారే తరుణంలో ఎదురయ్యే అనేక సవాళ్లను మనం పరిశీలిస్తున్నప్పుడు, ఆ సమయంలో మన పిల్లలతో కలిసి ముందుకు సాగడంలో దేవుని వాక్యం మనకెలా సహాయం చేస్తుందో చూద్దాం.

**సవాలు 1**: కౌమారంలో ఉన్నవాడు తనకు బోధించబడినవాటన్నిటిని పరిశీలించుకుని, ఏది నమ్మాలో నిర్ణయించుకుంటాడు.

కౌమారంలో ఉన్నవ్యక్తి, తన మనసులో నమ్మకాలు స్పష్టంగా ఉండాలని కోరుకుంటాడు, కాబట్టి బోధించబడినవాటన్నిటిని పరిశీలించి, ప్రశ్నిస్తాడు. కొన్ని సందర్భాల్లో, తల్లిదండ్రులు బోధించేవాటన్నిటిని అంగీకరించకపోవచ్చు. అందువల్ల, తల్లిదండ్రులు ఆందోళనకు గురౌతారు. అతడు పరిశీలించే విషయాల్ని అర్థమయ్యేలా

తల్లిదండ్రులు చెప్పలేనప్పుడు, వారు అతన్ని మళ్ళీ చిన్నవాడిలా చూడడం మొదలుపెడతారు, ప్రశ్నించకుండా వారి నమ్మకాలు అంగీకరించాలని కోరతారు. దీనివలన, కౌమారంలో ఉన్నవారు తమకు సొంతంగా ఆలోచించే అవకాశం ఇవ్వట్లేదని భావిస్తారు.

తల్లిదండ్రులు తమ నమ్మకాల వెనుక ఉన్న కారణాలను ఓపికగా వివరించాలి మరియు ఆ నమ్మకాలను వివరించడంలో సహాయపడే ఇతర వ్యక్తులతో మాట్లాడే అవకాశాలను యవ్వనస్థులకు కల్పించాలి.

► సామెతలు 23:22-23 కలిసి చదవండి.

ఈ వచనాల్లో, యువకులు తమ తల్లిదండ్రుల జ్ఞానవాక్కులు వినడానికి నిర్ణయించుకోవాలని దేవుడు సెలవిస్తున్నాడు. ఈ విషయంలో తల్లిదండ్రులు వారి కుమారుడు లేక కుమార్తె కోసం ఈ నిర్ణయం తీసుకోలేరు, కాని మంచి సంబంధాన్ని పెంపొందించగలరు. తల్లిదండ్రులు తమ కుమారుడు లేక కుమార్తెతో గౌరవంగా మాట్లాడితే, అది వారిని మంచి నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహిస్తుంది.

**సవాలు 2**: కౌమారంలో ఉన్నవారు నిర్ణయాలు తీసుకునే బాధ్యతను స్వీకరించడం ఆరంభిస్తారు.

కౌమారంలో ఉన్నవాడు నిర్ణయాలు ఎలా తీసుకోవాలో అర్థం చేసుకోవడం ప్రారంభిస్తాడు, తన కోసం నిర్ణయాలు తీసుకోగలనని భావిస్తాడు, కాని అతని తల్లిదండ్రులు, ఇతరులు తన ఎంపికలని పరిమితం చేస్తూ ఉంటారు. వారు అతని సామర్థ్యాలు గుర్తించట్లేదని భావించి వారి అధికారంపై తిరుగుబాటు చేస్తాడు. అతడు తిరుగుబాటు చేస్తే, తల్లిదండ్రులు సహజంగా అతడిని మరింత నియంత్రించడానికి ప్రయత్నిస్తారు.

తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయసులోనే మంచి పునాది వేయాలి. దేవుని క్రమశిక్షణ మన మేలు కోసం ఉన్నట్లే (హెబ్రీయులకు 12:9-10), తల్లిదండ్రులు కూడా తాము విధించే నియమాలు వారి మేలు కోసమేనని తమ పిల్లలకు చూపించగలరు. తద్వారా, వారు కేవలం తమ సౌలభ్యం కోసమే నియమాలను పెట్టడం లేదని పిల్లలకు అర్థమవుతుంది.

రెండవదిగా, తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్యదశలో, కౌమారదశలో పెద్ద పెద్ద, ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే బాధ్యతను క్రమంగా అప్పగించవచ్చు. అప్పుడు వారు బాధ్యత తీసుకోవడం నేర్చుకుంటారు, వారి నమ్మకత్వాన్ని రుజువు చేసుకుంటారు, యుక్తవయసుకు సిద్ధపడతారు.

తల్లిదండ్రులు కౌమారంలో ఉన్న తమ పిల్లల విషయంలో పరిమితులు పెట్టడానికి దేవునికి ఇంకా బాధ్యులుగానే ఉన్నారు (1 తిమోతికి 3:4), అయితే కౌమారదశ, యుక్తవయస్సుకు సిద్ధపడే కాలం, అప్పుడు అతడు/ఆమె తాను తీసుకున్న నిర్ణయాల్ని బట్టి దేవునికి పూర్తిగా లెక్కఅప్పజెప్పవలసి ఉంటుంది. కాబట్టి తల్లిదండ్రులు కౌమారంలో ఉన్న

తమ పిల్లల్ని యుక్తవయసుకు సిద్ధపరచాలి. ఒక తండ్రి తన కుమారునితో తెలివైన నిర్ణయాలు తీసుకోవాలని వేడుకుంటూ సామెతలు రాశాడు. ఒక తండ్రిగా తాను తన కుమారుని కోసం నిర్ణయాలు తీసుకోలేడు కాని సరైన నిర్ణయాల్ని ఆకర్షణీయంగా కనిపించేలా చేయగలడని సొలొమోనుకు తెలుసు.

**సవాలు 3**: కౌమారంలో ఉన్నవారికి వయోజనులకు ఉన్న పరిణతి ఉండదు.

తల్లిదండ్రులు చింతించే ప్రమాదాలు, నష్టాలు కౌమారంలో ఉన్నవారు అర్థం చేసుకోలేకపోవచ్చు. సహజంగా కౌమారంలో ఉన్నవారు ప్రమాదాలు తప్పించుకుని లక్ష్యాలు సాధించగలరని అనుకుంటారు. తల్లిదండ్రులకు వారి సామర్థ్యాలు, వివేచన మీద నమ్మకంలేదని భావించి తరచు చిరాకుపడుతుంటారు.

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏది సరైనదో ఏది సరైనది కాదో చెప్పడమే కాకుండా లేక పరిమితులు పెట్టడమే కాకుండా, వారు చేసుకునే ప్రతి ఎంపిక ఫలితాలు గురించి వారితో మాట్లాడడం చాలా ముఖ్యమని సామెతలు గ్రంథం చూపిస్తుంది. ఈ సూచన ఆలకించినప్పుడు, అది అతడు మరింత పరిపక్వతతో ఆలోచించడానికి సహాయపడుతుంది.

► 1 పేతురు 5:5 కలిసి చదవండి.

ఒక యువకుడు చేయగల తెలివైన పని ఏంటంటే, దైవభక్తిగల తన తల్లిదండ్రుల అధికారానికి లోబడడం, వారి తెలివైన సలహాలు ఆలకించడం. 1 పేతురు 5:5 మాట్లాడుతున్నట్లుగా, ఇలా చేసే యువకులపై దేవుని ప్రత్యేక అనుగ్రహం ఉంటుంది.

**సవాలు 4**: కౌమారంలో ఉన్నవాడికి యుక్తవయసువారిలో ఉండే కోరికలు ఉంటాయి కాని వారికున్న విశేషాధికారాలు ఉండవు.

వయోజనుల్లో వివాహం, ఆస్తి యాజమాన్యం, నాయకత్వ స్థానాలు, నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ వంటి అనేక విశేషాధికారాలు ఉంటాయి. కౌమారంలో ఉన్నవారికి ఇలాంటి సహజసిద్ధమైన కోరికలు ఉన్నప్పటికీ విశేషాధికారాలు ఉండవు గనుక నిరుత్సాహానికి గురౌతారు. వారి కోరికలు బలమైన శోధనలు రేకెత్తిస్తాయి. ఈ గందరగోళ పరిస్థితుల్లో ఏం చెయ్యాలో 2 తిమోతికి 2:22 యువకులకు సహాయం చేస్తుంది.

► 2 తిమోతికి 2:22 కలిసి చదవండి.

తనకు విధేయత చూపడానికి ఇష్టపడే యువకుల పట్ల దేవుడు కృప చూపుతాడు. వారి నాయకులకు లోబడడానికి సహాయం చేస్తాడు, ఆయన సమయానికి లేక చిత్తానికి వెలుపలున్న సొంత కోరికలు నెరవేర్చుకోవడాన్ని తిరస్కరిస్తాడు.

అవగాహన, ప్రవర్తన, మరియు జీవిత నైపుణ్యాల్లో ఎదగడం ద్వారా యుక్తవయస్సు కోసం సిద్ధపడడానికి ఈ కోరికలను ప్రేరణగా మార్చడానికి దేవుడు కౌమారంలో ఉన్న క్రైస్తవులకు సహాయం చేస్తాడు.

**సవాలు 5**: కౌమారంలో ఉన్నవాడు ఇతరులలోని అస్థిరతను చూసి, బాధపడతాడు.

చాలాసార్లు, కౌమారంలో ఉన్నవారు ఆదర్శంగా ఉండవలసిన, ఉత్తమ ఆత్మీయ నాయకులుగా ఉండవలసిన వారిని చూసి నిరాశ చెందుతారు. ఇలా జరిగినప్పుడు, కౌమారదశలో ఉన్నవారు అందరినీ అనుమానించుటకు శోధించబడతారు. ఈ కారణం చేత, సంఘ నాయకులుగా, తల్లిదండ్రులుగా మీరు స్థిరమైన భక్తిగల జీవితం గడపడం ఎంతో అవసరం. మీ జీవితంలో అస్థిరతల ఫలితంగా యువకులు తమ నిత్యత్వాన్ని నరకంలో గడుపుతారు. యేసు కౌమారంలో ఉన్నవారి గురించి కాకుండా పిల్లల గురించి మాట్లాడుతున్నప్పటికీ మత్తయి 18:6 వచనం ఇక్కడ ఖచ్చితంగా వర్తిస్తుంది.

► మత్తయి 18:6 కలిసి చదవండి.

క్రైస్తవ యువకుడు ఇతరులలో దైవభక్తిగల జీవితం చూడనప్పటికీ, అతడు దైవభక్తికి ఆదర్శంగా ఉండవచ్చు. పాత నిబంధన గ్రంథంలో, సమూయేలు దీనికి ఉదాహరణ. సమూయేలు అనేక విధాలుగా భక్తిహీనతతో, దుర్నీతితో నిండిన యాజక కుటుంబంలో పెరిగినప్పటికీ, చిన్ననాటి నుండే దేవుని కోసం జీవించాలని నిర్ణయించుకున్నాడు (1 సమూయేలు 1:20; 1 సమూయేలు 2:11-18, 22-26). చిన్నతనంలోనూ, కౌమారంలోనూ పరిశుద్ధమైన జీవితం జీవించాడు (1 సమూయేలు 3:19, 21).

► 1 తిమోతికి 4:12 కలిసి చదవండి.

**సవాలు 6**: కౌమారంలో ఉన్నవారు అనేక నిర్ణయాలని, అవకాశాల్ని ఉత్సాహంగా ఎదుర్కొంటారు.

కౌమారంలో ఉన్నవారు అవకాశాలతో నిండిన ప్రపంచాన్ని చూస్తారు. వారు తమ జీవితాలకు దిశను కనుగొనడానికి కష్టపడవచ్చు. వారు అనేకమంది నుండి విరుద్ధమైన సలహాలు పొందుకుంటారు.

అవకాశాన్ని వెంబడించడానికి అవసరమైనవాటిని ఎవరైనా ఇవ్వాలని అనుకుంటారు. కౌమారంలో ఉన్నవారు చిన్న చిన్న విషయాల్లో దేవునికి నమ్మకంగా ఉంటూ, ఆయన సమయంలో మరిన్ని అవకాశాలు ఇస్తాడని నమ్మడం చాలా ముఖ్యం.

► లూకా 16:10 కలిసి చదవండి.

కౌమారంలో ఉన్నవారు దైవికమైన సలహా వినాలని నిర్ణయించుకోవడం కూడా ఎంతో ముఖ్యం.

► సామెతలు 11:14 కలిసి చదవండి.

దేవుని జ్ఞానమార్గాలు అనుసరించడంలో ఆశీర్వాదాలు, స్వేచ్ఛ ఉందని యువకులు కనుగొంటారు.

### సమూహ చర్చ కోసం

► ఈ పాఠంలో ఏ ఆలోచనలు మీకు అత్యంత సహాయకరంగా ఉన్నాయి? అవి మిమ్మల్ని, మీ కుటుంబాన్ని, సమాజాన్ని లేక సంఘాన్ని ఎలా ప్రభావితం చేస్తాయి?

► ఒకవేళ మీరు కౌమారంలో ఉన్న కుమారుడు లేక కుమార్తెకు తల్లిదండ్రులుగా ఉంటే, ఈ సమయంలో మీ బిడ్డతో గౌరవప్రదమైన పారదర్శకమైన సంబంధం కలిగియుండడానికి మీరు ఎలాంటి సలహా ఇవ్వగలరు? మీ తప్పుల విషయంలో యధార్థంగా ఉండండి.

► మీ పిల్లలు తెలివిగా ఆలోచిస్తూ మంచి నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడడానికి ఎలాంటి ఆచరణాత్మక విషయాలు ఇవ్వగలరు?

► మీ పిల్లల బాధ్యతలు, హక్కులు ఎప్పుడు విస్తరింపజేయాలో తల్లిదండ్రులుగా మీకెలా తెలుస్తుంది?

► తల్లిదండ్రుల ప్రధాన బాధ్యతలు, కౌమారంలో పిల్లల ప్రధాన బాధ్యతలను క్లుప్తంగా చెప్పండి.

► ఒక తండ్రి, తన పిల్లలు ఎదుగుతుండగా ఎలాంటి విషయాల్లో వారిని ప్రోత్సహించాలి, జాగ్రత్త వహించాలి, మార్గనిర్దేశం చెయ్యాలి?

## ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ,

పిల్లల్ని పెంచే బాధ్యత మాపై ఉంచి, మమ్మును నమ్మినందుకు ధన్యవాదాలు. ఈ బాధ్యత అనేక విధాలుగా సంక్లిష్టమైంది, అందుకు నీ అవగాహన మాకు అవసరం.

నీ వాక్యంలో, మా పిల్లలకు జ్ఞానాన్ని, ఆశా-నిగ్రహాన్ని, విధేయతను నేర్పించే మా బాధ్యతను మేం చూశాం. మా పిల్లలతో మాకున్న సంబంధాల్లో ఈ విషయాల్లో మేము అనేకసార్లు విఫలమైనందుకు మమ్మును క్షమించండి.

మేము నీ వాక్యం చదివి, విధేయత చూపుతుండగా, మా పిల్లల అవసరాల్లో ప్రత్యేక జ్ఞానం మాకు ఇవ్వండి. వారు తమ జీవితకాలమంతా నమ్మకంగా నిన్ను అనుసరించాలనేది మా గొప్ప ఆకాంక్ష.

ఆమెన్

## పాఠం అభ్యాసాలు

(1) మీ కుటుంబంలో లేక మీ ప్రభావ ఆధీనంలోఉన్న కౌమారదశలోని పిల్లల కోసం ప్రార్థించడానికి మీరు ఉపయోగించగల మూడు వచనాల్ని లేక వాక్యభాగాల్ని కనుగొనండి. ఈ క్రింది విషయాలకు సంబంధించిన లేఖన భాగాల కోసం చూడండి

- వారి ఆత్మీయ అవసరతలు
- వారి వ్యక్తిగత వికాసం
- వారిని ప్రభావితం చేసే విషయాలు , ప్రజలు
- వారు ఎదగడానికి, అభివృద్ధి చెందడానికి అవసరమయ్యే మార్గాలు

ఈ వచనాలను తరచు మీరు చూడగలిగే చోట రాసుకోండి. ప్రతిరోజు మీ పిల్లల కోసం ప్రార్థించడానికి ఈ వచనాలు ఉపయోగించండి.

(2) పాఠం చివర్లో ఉండే చర్చా ప్రశ్నల్లో రెండింటిని ఎన్నుకోండి. వాటిని ఒక పేరా చొప్పున జవాబులు రాయండి.

(3) చదవడానికి ఒక లేఖన భాగం ఎంచుకోండి:

- సామెతలు 4-5
- సామెతలు 6
- సామెతలు 23
- సామెతలు 24

మీరు చదువుతుండగా, క్రింది వాటిని పరిగణలోకి తీసుకోండి. ఈ వాక్యభాగం నుండి...

- కౌమారదశలో ఉన్న వారి తల్లిదండ్రులకు ఎలాంటి ప్రాధాన్యతలు ఉండాలి?
- కౌమారదశలో ఉన్న వారికి ఎలాంటి ప్రాధాన్యతలు ఉండాలి?
- కౌమారదశలో ఉన్న వారి తల్లిదండ్రులకు ఎలాంటి వైఖరులు ఉండాలి?
- కౌమారంలో ఉన్న వారికి ఎలాంటి వైఖరులు ఉండాలి?
- కౌమారదశలో ఉన్న వారి యొక్క తల్లిదండ్రులు ఏమి చేయాలి?
- కౌమారంలో ఉన్న వాడు ఏం చెయ్యాలి?
- తల్లిదండ్రులు మరియు కౌమారంలో ఉన్న వారు జీవితంలో ఏ విషయాలు గురించి మాట్లాడుకోవాలి?

కౌమారదశలో ఉన్న వారి తల్లిదండ్రులకు వాక్యభాగ సందేశాన్ని సంగ్రహిస్తూ ప్రకటనల జాబితా రాయండి. కౌమారదశలో ఉన్న వారికి వాక్యభాగ సందేశాన్ని సంగ్రహిస్తూ రెండవ ప్రకటనల జాబితా రాయండి.

# పాఠం 15

# యువ వయోజనుడు

## పాఠం లక్ష్యాలు

ఈ పాఠం ముగిసే లోపు, విద్యార్థి:

(1) యౌవనప్రాయంలోని బాధ్యతలు, విషయాలపై దేవుని దృక్పథాన్ని అర్థం చేసుకోవాలి.

(2) తెలివైన నిర్ణయాలు తీసుకుని దేవునికి విధేయత చూపించునట్లు యువకులను ప్రభావితం చేయడానికి సిద్ధపడాలి.

## అభయ్, ప్రేరేపించబడిన యువకుడు

అభయ్ చిన్నతనంలో, అతని తల్లిదండ్రులు అతనికి కష్టపడి పని చేయడం బోధించారు. అతనికి పని చేసి సంపాదించుకునే అవవకాశం వచ్చినప్పుడెల్లా సంతోషించేవాడు. అతనికి ఎవరైనా ఒక పని అప్పగిస్తే ఆ పని చేయడానికి సిద్ధంగా ఉండేవాడు. ఒక యువకుడుగా పెరటి పని చేసేవాడు, వార్తా పత్రికలు వేసేవాడు, సైకిళ్లు బాగు చేసేవాడు. అభయ్ కి వ్యాపారవేత్తగా ఉండడం ఎంతో ఇష్టం కాని దేవుడు పరిచర్య కోసం పిలుస్తున్నాడని తెలుసుకున్నాడు. అభయ్ బైబిల్ కళాశాలలో చదివాడు. అక్కడ తన ఖర్చుల కోసం ఆఫీసు శుభ్రం చేసేవాడు, రెస్టారెంట్లో పని చేసేవాడు, పెరట్లో పనిచేసేవాడు. అతడు పట్టభద్రుడైనప్పుడు, పరిచర్య ఆరంభించాడు కాని కొన్నిసార్లు ఇళ్లకు రంగులు వేసేవాడు లేక భవనాలు మరమ్మత్తులు చేసేవాడు ఎందుకంటే పరిచర్య వలన అతనికి పూర్తి మద్దతు దొరకలేదు. అతనికి భార్యా పిల్లలున్నప్పటికీ, లాభం కోసం కాకుండా ఎల్లప్పుడు పరిచర్య బాధ్యతల్ని, వ్యక్తిగత వికాస అభివృద్ధినే ధ్యేయంగా పెట్టుకునేవాడు. తుదకు అతని పరిచర్య అతనికి పూర్తిగా మద్దతిచ్చింది.

## పరిపక్వత మరియు ప్రవర్తన

► విద్యార్థులు తరగతి కోసం 1 తిమోతికి 4:12 మరియు విలాపవాక్యములు 3:27 చదవాలి.

1 తిమోతి పత్రిక అనేక సంఘాల్ని పర్యవేక్షించే బాధ్యత కలిగిన ఒక యౌవనస్థుడికి రాయబడింది. విశ్వాసులైన యువకులు తమ ప్రవర్తనలో, గుణంలో ఆదర్శంగా ఉండాలని దేవుడు ఆశిస్తున్నాడని 1 తిమోతికి 4:12 లో మనం చూస్తాం. క్రైస్తవ సిద్ధాంతాల్లో స్థిరపడడానికి ప్రాధన్యత ఇవ్వాలి. ఇతరులతో చేసే సంభాషణల్లో స్వచ్ఛత, నిస్వార్థమైన ప్రేమ చూపించాలి. వారి ప్రవర్తన, వారి మాటలు దేవుని గౌరవించేవిగా ఉండాలి, ఆయన్ను మహిమపరచాలి.

విశ్వాసులైన యువకులు జాగ్రత్తగా, ఉద్దేశ్యపూర్వకంగా జీవించాలి. ఈ కాలంలో దేవుడు వారికిచ్చిన బలాన్ని దుర్వినియోగం చేసుకోకూడదు. నేర్చుకోవడం, నైపుణ్యాలు పెంపొందించుకోవడం, ఇతరులకు పరిచారం చేయడం, బాధ్యతలు తీసుకోవడం వంటి అవకాశాలు వృథా చేసుకోకూడదు. కౌమారదశ, పూర్వ యౌవన దశను స్వార్థ లక్ష్యాల కోసం వృథా చేసుకోకూడదు. అవి ఎదుగుదలకు, సేవకు ప్రధానమైన సంవత్సరాలు. యువకులు ఆశా-నిగ్రహాన్ని నేర్చుకునేలా దేవుడు సహాయపడొచ్చు తద్వారా వారు ఆయన కొరకు ఫలవంతులౌతారు.[47]

### పని

### పని గురించిన దృక్పథాలు

కొన్ని సంస్కృతులలో, ప్రజలు ఆరోగ్యంగా యౌవ్వనంగా ఉన్నా పని చేయకుండా కూర్చుంటారు, ఇది వారికి సర్వసాధారణం. వారికి అవసరాలు ఉన్నప్పటికీ, వారు ఇతరులకు బాధ్యత వహిస్తున్నప్పటికీ, వారికీ పని చేయాలనే ప్రేరణ ఉండదు. మంచి జీతం వస్తేనే పని చేస్తామని వారు చెబుతారు. వారు, తక్కువ జీతానికి పని చేయరు లేక తక్కువ స్థాయిలో ఉండే పని చేయడానికి ఇష్టపడరు. వ్యక్తిగతంగా లాభం పొందకపోతే, పరిసరాలు అభివృద్ధి చేసుకోవడానికి కూడా కష్టపడి పని చేయడానికి ఇష్టపడరు.

కొన్నిసార్లు ఉద్యోగంలో చేరినవారు ఉద్యోగం పొందుకోవాలనే ఉత్సాహంతో ఉంటారు. బహుశా వారు ఎక్కువ శాతం మంది ప్రజలకు ఉపాధి దొరకని దేశంలో నివసిస్తున్నారు. కంపెనీ యూనిఫాం ధరించడాన్ని బట్టి వారు సంతోషిస్తుంటారు, ఉద్యోగ స్థితిని బట్టి అతిశయపడుతుంటారు. అయితే వారు తమ హోదాను చూసుకుని మురిసిపోతూ, యజమానుడికి లేక కస్టమర్లకు సేవ చేయాలనే విషయాన్ని పెద్దగా పట్టించుకోరు. ఆ కంపెనీలో భాగమైనందుకు గర్వపడతారు కాని అసలు ఎందుకు వాళ్ళను తీసుకున్నారో గ్రహించరు.

పని చేయడానికి నిరాకరించే వ్యక్తులకు భిన్నంగా, కొంతమంది ఉద్యోగం మీద లేక డబ్బు సంపాదించడం మీద ఎక్కువ దృష్టిపెడతారు. వారు, వారి పరిసరాల కంటే జీతం ఎక్కువగా ఇచ్చే ప్రాంతాలకు వెళ్తారు. వారు సాధ్యమైనంత ఎక్కువ డబ్బు సంపాదించడానికి పని చేస్తారు. వారు, దేవునితో, తమ కుటుంబంతో సంబంధాల్ని పెంపొందించుకోవడం వంటి ముఖ్య విషయాల్ని అంతగా పట్టించుకోరు.

---

[47] ఈ విషయం గురించి మరింత తెలుసుకోవాలంటే, *Spiritual Formation* లో పాఠం 12 చూడండి, ఇది Shepherds Global Classroomలో అందుబాటులో ఉంది.

సమాజంలో ప్రజలు ఇలాంటివి చేయవచ్చు కాని, విశ్వాసులు తమ సంస్కృతిలో సహజంగా జరిగే వాటిని చేయకూడదు. బదులుగా, వారు దేవుడు ఏం చెబుతున్నాడో తెలుసుకుని, ఆయనకు విధేయత చూపించాలి. పని, శ్రద్ధ మరియు ఉత్పాదకత గురించి బైబిలు చాలా విషయాలు మాట్లాడుతుంది.[48]

**పనికి మూలము**

దేవుడు సృజనాత్మకత కలిగినవాడు (కీర్తన 104:24). దేవుడు ఉత్పాదకుడు (కీర్తన 104). దేవుడు ఎల్లప్పుడు పని చేస్తున్నాడు, వ్యక్తుల జీవితాల్లో, ప్రాపంచిక విషయాల్లో అన్ని సమయాల్లోను పని చేస్తున్నాడు (యోహాను 5:17). దేవుడు మానవుల్ని సృజించినప్పుడు, ఆయన తన స్వరూపమందు, ఆయన పోలికలో సృజించాడు. ప్రజలు తన సృష్టిలో సృజనాత్మకంగా ఉత్పాదకంగా ఉండాలని కోరుకున్నాడు. దేవుడు, సముద్రపు చేపలు, ప్రతి భూజంతువు, ప్రతి ఆకాశపక్షిపై మానవుడికి అధికారం ఇచ్చాడు (ఆదికాండము 1:26). ఆయన తన ప్రజలను భూవనరులన్నిటిపై నిర్వాహకులుగా ఉంచాడు (ఆదికాండము 1:28-30).

పని, మానవుని జీవితం కోసం దేవుని రూపకల్పనలో ఒక భాగం. మొదటి నుండి, దేవుడు ప్రజలకు గొప్ప బాధ్యత అప్పగించాడు. ఆయన మనకిచ్చిన పనిని నమ్మకంగా చేశామో లేదో ఆయనకు లెక్క అప్పజెప్పాలి.

**సామెతల గ్రంథ సూత్రాలు**

సామెతల గ్రంథం ముఖ్యంగా యౌవనస్థులకు రాయబడింది, తెలివిగా అలోచించి ప్రవర్తించుమని వారికి బోధిస్తుంది. సామెతలు, పని గురించి చాలా విషయాలు మాట్లాడుతుంది.

► విద్యార్థులు తరగతి కోసం ప్రతి వాక్యభాగాన్ని చదవాలి.

**సామెతలు 6:6-11, సామెతలు 10:5.** చీమలు ప్రజలకు మంచి ఉదాహరణలు.

- **పని చేయమని ఎవ్వరు బలవంతం చేయనప్పటికీ అవి శ్రద్ధగా పని చేస్తాయి.** ఏం చెయ్యాలో లేక ఎలా చెయ్యాలో చెప్పేవారు లేకపోయినా, అవి ఉత్పాదకంగా ఉంటాయి. చీమల నుండి, పని చేయడానికి మనల్ని ఎవరూ బలవంతం చేయాల్సిన అవసరం లేదనే విషయాన్ని నేర్చుకుంటాం. మనం పని చేయాలని *అనుకోవాలి* ఎందుకంటే దేవుడు మన అవసరాలు ఈ విధంగా తీరుస్తాడు.

---

[48] ఈ విషయం గురించి మరింత తెలుసుకోవాలంటే, *Practical Christian Living* లో పాఠం 3 చూడండి, ఇది Shepherds Global Classroomలో అందుబాటులో ఉంది.

- **పని చేసే సమయంలో అవి పని చేస్తాయి.** పని చేయడానికి సమయం ఉంది, ఇతర కార్యకలాపాలకు, విశ్రాంతికి తీసుకోవడానికి ఒక సమయం ఉంది. "ఇప్పుడు నేను ఏమి చెయ్యాలి?" అని అడగడం సహాయకరంగా ఉంటుంది.
- **పని చేసే అవకాశం ఉన్నప్పుడు అవి పని చేస్తాయి.** కాలాలు మారతాయి, సంపాదించుకునే అవకాశాలు గతించిపోతాయి. మన అవకాశాలు కూడా వస్తూ పోతూ ఉంటాయి. ఇప్పుడు మనకున్న అవకాశాన్ని తప్పక ఉపయోగించుకోవాలి, లేక అది వృధా అయిపోతుంది.
- **తరువాత వాటికి అవసరమైన ఆహారం ఉండునట్లు అవి పని చేస్తాయి.** పని చేసే సమయంలో మనం కూర్చుని విశ్రాంతి తీసుకోకూడదు. పనిలో నిమగ్నమై ఉండవలసిన సమయంలో సోమరితనంతో ఉంటే, మన భవిష్యత్తు అవసరాలు తీరవు. **రేపటి** అవసరాలు తీర్చుకోవడం కోసం **నేడు** కష్టపడి పని చెయ్యాలి.

**సామెతలు 19:15, సామెతలు 20:4, సామెతలు 12:24.** మన ఎంపికలకు నిజమైన ఫలితాలు ఉండే విధంగా దేవుడు ఈ లోకాన్ని ఏర్పాటు చేశాడు (గలతీయులకు 6:7).

ఒకవేళ మనం ఎల్లప్పుడు దేహం విషయంలో సోమరితనంతో ఉంటే, భౌతికంగా బలహీనులైపోతాం. ఒకవేళ మనం మన ఆలోచనల విషయంలో సోమరులుగా ఉంటే, నేర్చుకోవడం, ఆలోచించడం మరియు తర్కించడంలో మనకు ఉండే సామర్థ్యం తగ్గిపోతుంది.

పని చేయగలిగినప్పుడు, పని చేయడానికి నిరాకరిస్తే, మనకు ఆహారం ఉండదని దేవుడు చెబుతున్నాడు (2 థెస్సలొనీకయులకు 3:6-12 చదవండి).

మనం శ్రద్ధగా ఉంటే, దేవుడు మనకు మరెక్కువ అవకాశాలు, గొప్ప బాధ్యతలు ఇస్తాడు.

దేవుడు, మన ఎంపికలకు సాధారణ ఫలితాలు ఏర్పాటు చేశాడు. మనం మన ఫలితాల్ని ఎన్నుకోలేము కాని మన పనిని ఎన్నుకోగలం!

**సామెతలు 14:23, సామెతలు 20:6.** కొంతమంది చాలా తెలివైనవారనుకుంటారు, కాని పని చేయడానికి నిరాకరిస్తారు. పని ఎలా చేయాలో కలలు కంటారు, దాని గురించి మాట్లాడతారు కాని నిజానికి వారేమి చేయరు. అయితే మనం కేవలం మాట్లాడడమే కాకుండా పని చేయాలనీ దేవుడు కోరుతున్నాడు. మనం బాధ్యతలు తీసుకోవాలని, చేస్తామని చెప్పిన పనిని నమ్మకంగా చేయాలని దేవుని కోరుతున్నాడు.

సామెతలు **15:19.** కొన్నిసార్లు ప్రజలు పని చేసే *విధానంలో* సోమరులుగా ఉంటారు. మంచి ఫలితాలు లేకపోయినా, సులభమైన మార్గాన్ని ఎంచుకుంటారు. బహుశా వారు తక్కువ ఖర్చుతో ఏదైనా చేస్తున్నారేమో కాని అది ఎక్కువ కాలం ఉండదు. బహుశా వారు తక్కువ శ్రమతో చేస్తున్నారేమో కాని చివరికి అందులో నాణ్యత ఉండదు. బహుశా వారు సవాళ్లను ఎదుర్కొని పని చేయడానికి ఇష్టపడకుండా, ఇతరులు పెట్టే ఒత్తిడికి లొంగిపోతున్నారు.

► పని చేసే విధానంలో సోమరులుగా ఉండే ప్రజల విషయంలో ఎలాంటి ఉదాహరణలు గురించి మీరు ఆలోచించగలరు?

మనం పని చేసే విధానంలో సోమరులుగా ఉన్నప్పుడు, అది మనకు, ఆ తర్వాత ఇతరులకు సమస్యలు సృష్టిస్తుందని ఈ సామెత మనకు బోధిస్తుంది. అయితే మనం సరైన పని చేసినప్పుడు, మంచి ఫలితాలు పొందుతాం. ఇప్పుడు మనం జాగ్రత్తగా, సంపూర్ణంగా ఉంటే, తరువాత మంచి ఫలితాలు అనుభవించగలం.

► సోమరితనం కష్టాల్ని, ఆ తర్వాత సమస్యల్ని కలిగించినప్పుడు ఎలాంటి ఉదాహరణ గురించి మీరు ఆలోచిస్తారు? నమ్మకత్వానికి, శ్రద్ధకు మంచి ఫలితాలు వచ్చినప్పుడు ఎలాంటి ఉదాహరణలు గురించి మీరు ఆలోచిస్తారు?

సామెతలు **12:11,** సామెతలు **21:20,** సామెతలు **28:19.** యౌవనస్తులారా, వ్యర్థమైన విషయాల్లో వృథా చేయడానికి దేవుడు మీకు బలాన్ని, ఆరోగ్యాన్ని ఇవ్వలేదు. మీరు మీ భౌతిక మానసిక సామర్థ్యాలు మంచిగా ఉపయోగించుకోగలరని ఆయన మిమ్మల్ని నమ్మాడు. ఆయన్ను సేవించగల అవకాశాలు మీకు ఇచ్చాడు. నమ్మకమైన సేవకుడుగా ఉండాలంటే మీకు ఆశా-నిగ్రహం ఉండాలి. మీరు మీ ఆనందం కోసం ప్రతి కోరికను నెరవేర్చలేరు. మీరు మీ శక్తిని, వనరుల్ని, సమయాన్ని దేవుని ఉద్దేశ్యాలు నెరవేర్చడానికి ఉపయోగించాలి.

మీరు మీ సొంత అవసరాలు, మీ కుటుంబ అవసరాలు (1 తిమోతికి 5:8), సహాయం పొందదగిన వారి అవసరాలు మరియు సహాయం చేయడానికి ఎవరు అందుబాటులో లేకుండా ఉన్నవారి అవసరాలు మీరు (1 తిమోతికి 5:3-16, ఎఫెసీయులకు 4:28, యాకోబు 1:27, యాకోబు 2:15-16) తీర్చాలని ఆశపడుతున్నాడు.

1 స్సలొనీకయులకు 4:11-12 సెలవిస్తుంది,

> ...అభివృద్ధినొందుచుండవలెననియు, సంఘమునకు వెలుపటివారి యెడల మర్యాదగా నడుచుకొనుచు, మీకేమియు కొదువలేకుండునట్లు మేము మీకు ఆజ్ఞాపించిన ప్రకారము మీరు పరులజోలికి పోక, మీ సొంతకార్యములను జరుపుకొనుటయందును మీ చేతులతో పనిచేయుటయందును ఆశకలిగి యుండవలెననియు, మిమ్మును హెచ్చరించుచున్నాము.

విశ్వాసుల విషయంలో ఇదే దేవుని చిత్తం.

► విశ్వాసులు ఎలాంటి పని చేయడానికి సిద్ధపడాలి? హోదా ముఖ్యమేనా? అలా అయితే, ఏ విధంగా ముఖ్యం లేక ఎంతవరకు ముఖ్యం?

ఆర్థిక విషయాలు గురించి చర్చిస్తూ ఈ విషయం గురించి లోతుగా మాట్లాడుకుందాం. దేవుడు, మనం పని చేయాలని చెప్పడానికి ముఖ్యమైన కారణాలు ఏంటో మనం చర్చించుకున్నాం, వాటిలో మన సొంత అవసరాలు, ఇతరుల అవసరాలు తీర్చడం కూడా భాగం. పని అనేది దేవుడు ఆహారం, వస్త్రాలు వంటి ప్రాథమిక అవసరాలు తీర్చే మార్గం (1 తిమోతికి 6:8). అనేకచోట్ల, ప్రజలు పని చేసుకుని డబ్బు సంపాదిస్తారు, ఆ తర్వాత భౌతిక అవసరాలు తీర్చుకోవడానికి ఖర్చు చేస్తారు. ఇంకొన్ని చోట్ల, ప్రజలకు డబ్బుకు బదులుగా ఆహారం, ఆస్తి లేక సేవతో చెల్లింపు చేస్తారు. ఎలాగైనా, దేవుడు వారి శ్రమ ద్వారా ప్రజల అవసరాలు తీరుస్తున్నాడు.

## ఆర్థిక విషయాలు

డబ్బు గురించి అనేక వాక్యభాగాలు మాట్లాడతాయి. మనం డబ్బు గురించి ఆలోచించే విధానం, దానితో వ్యవహరించే విధానం దేవునితో, ఇతరులతో మనకున్న సంబంధాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది చాలా ప్రాముఖ్యం గనుక, డబ్బు మరియు దాని ఉపయోగం విషయంలో మనకు సరైన అవగాహన ఉండాలని దేవుడు ఆశపడుతున్నాడు.[49]

### సామెతలు గ్రంథ సూత్రాలు

► విద్యార్థులు తరగతి కోసం ప్రతి వాక్యభాగం చదవాలి.

మన భద్రతకు మూలం ఏంటి?

1. తుదకు నీతిమంతులకు సహాయం చేయువాడు దేవుడే (సామెతలు 10:3).
2. మనం ధనమును నమ్ముకోకూడదు, ప్రేమించకూడదు ఎందుకంటే అది శక్తిలో పరిమితం, కాలంలో తాత్కాలికం (సామెతలు 11:4, 28).

► ఒక వ్యక్తికి సహాయం చేయువాడుగా, భద్రపరచువాడుగా ఏ ఆలోచనలు, వైఖరులు మరియు క్రియలు దేవునిపై నమ్మకాన్ని చూపిస్తాయి?

ధనవంతులుగా ఉండడం కంటే గొప్పవైన విషయాలు చాలా ఉన్నాయి; ఉదాహరణకు:

---

[49] ఈ విషయం గురించి మరింత తెలుసుకోవడానికి, *Practical Christian Living* లో పాఠం 9 చూడండి, ఇది Shepherds Global Classroomలో అందుబాటులో ఉంది.

1. ఇతరులతో మంచి సంబంధం కలిగి ఉండడం (సామెతలు 15:17).
2. బుద్ధి జ్ఞానం కలిగి ఉండడం (సామెతలు 8:10-11).
3. దేవునియందలి భయభక్తులు కలిగి, ఆయనతో సరైన సంబంధం కలిగి ఉండడం (సామెతలు 15:16).
4. సత్ప్రవర్తనవలన గౌరవించబడడం (సామెతలు 11:16).
5. నమ్మకంగా, యథార్థంగా మరియు దయగా ఉండడం (సామెతలు 19:22).

► మీ పరిస్థితుల కారణంగా వీటిలో ఏది మీకు గొప్ప సవాలుగా ఉంది?

డబ్బును సరిగా ఉపయోగించడానికి సూత్రాలు:

1. శ్రద్ధగా, నమ్మకంగా పని చేసి డబ్బు సంపాదించండి (సామెతలు 10:4).
2. ఓపికతో క్రమంగా డబ్బు కూర్చుకొనండి (సామెతలు 13:11).
3. మీ రాబడిలో ప్రథమఫలం ఇస్తూ దేవుణ్ణి గౌరవించండి (సామెతలు 3:9-10).
4. బీదల యెడల దాతృత్వం కలిగి ఉండండి (సామెతలు 11:24-25, సామెతలు 14:21, సామెతలు 19:17, సామెతలు 21:13).

► వీటిలో ఏ విషయంలో మీరు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు?

డబ్బును దుర్వినియోగం చేయడం గురించి హెచ్చరికలు:

1. డబ్బు సంపాదించే అవకాశం కోసం దేవుని వాక్యానికి ఎన్నడు అవిధేయత చూపవద్దు (సామెతలు 10:2, సామెతలు 15:27).
2. తొందరపడి లేక అజాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవద్దు (సామెతలు 21:5).
3. ఇతరుల రుణాలు తీరుస్తామని మాట ఇవ్వొద్దు (సామెతలు 6:1-5; సామెతలు 17:18).

► మీ సంస్కృతిలో, సామెతలు గ్రంథంలోని ఈ సూత్రాల్లో ఏవి ఎక్కువగా నిర్లక్ష్యం చేయబడతాయి?

### సన్నిహిత స్నేహితులు

► విద్యార్థులు తరగతి కోసం సామెతలు 13:20 మరియు 1 కొరింథీయులకు 15:33 చదవాలి.

యవ్వనస్థుల జీవితంలో అత్యంత శక్తివంతమైన ప్రభావాలలో సన్నిహిత స్నేహాలు ఒకటి. ప్రజలు సహజంగా తమ విలువలు పంచుకునేవారితో సన్నిహిత స్నేహితులౌతారు. కాని స్నేహం, స్నేహబంధంలో ఉన్న ప్రతి ఒక్కరిని, అయితే

మంచిగా లేకపోతే చెడుగా మారుస్తుంది. ఎవరితోనైన సన్నిహిత స్నేహితులుగా ఉంటూ ఉంటే, వారు మిమ్మల్ని ప్రభావితం చేస్తారు. మీ దృక్పథాలు, తత్వాలు, ప్రాధాన్యతలు, ప్రవర్తన, ఎంపికలు, మరియు వ్యక్తిత్వం ప్రభావితమౌతాయి. మీ సన్నిహిత స్నేహితులు వారి మాదిరి ద్వారా మిమ్మల్ని ప్రభావితం చేస్తారు, అలాగే మీ ఎంపికలను ఆమోదించడం లేక తిరస్కరించడం ద్వారా మరియు ఒప్పించే తమ మాటల ద్వారా మిమ్మల్ని ప్రభావితం చేస్తారు.

► ప్రతి విద్యార్థి, ఈ ప్రతి ప్రశ్నకు సమాధానంగా 1-5 మంది పేర్లు రాయాలి:

- ఆమోదం లేక ధృవీకరణ కోసం నేను సాధారణంగా ఎవరివైపు చూస్తాను?
- నా జీవితంలో సమస్యలు గురించి నేను ఎవరితో మాట్లాడతాను?
- నిర్ణయం తీసుకునేట ప్పుడు నేను ఎవరి సలహా కోసం చూస్తాను?
- ఎవరి ప్రవర్తన నన్ను ప్రభావితం చేస్తుంది?
- నేను ఎవరి తత్వాలు పంచుకుంటాను?

మీరు ఎవరి పేర్లు రాశారో వారి గురించి ఆలోచించండి. వారి గుణం ఎలా ఉంది? వారి ప్రవర్తన ఎలా ఉంది? వారి మాటలు ఎలా ఉన్నాయి? ఒకవేళ మీరు వారి మాదిరి అనుసరిస్తే, క్రీస్తును అనుసరిస్తున్నారా? (1 కొరింథీయులకు 11:1). వారిలో ఈ లక్షణాలు ఉన్నాయా:

- వారు దేవుని యెడల భయభక్తులుగలవారు (ద్వితీయోపదేశకాండము 10:12, 20, కీర్తన 112:1).
- వారు దేవుని వాక్యం చేత రూపించబడుతున్నారు (యోహాను 17:14-17).
- సమస్త విషయాల్లో దేవుని సంతోషపరచడం, ఆయనకు విధేయత చూపడమే వారి ప్రధాన లక్ష్యం (2 కొరింథీయులకు 5:9-10).

మీరు దేవునితో సన్నిహితంగా ఉండడానికి, ఆయనకు విధేయులవ్వడానికి వారు మిమ్మల్ని ప్రభావితం చేస్తున్నారా? వారు మీకు ఏది సత్యమో (దేవుని వాక్యానికి అనుగుణంగా) దాని గురించి చెబుతున్నారా, లేక వినడానికి సులభమైన దాని గురించి చెబుతున్నారా? మీకు ఇష్టమైనది చేయడానికి ప్రోత్సహిస్తున్నారా, లేక కష్టమైనా సరే దేవుని దృష్టిలో సరైన దానిని చేయమని ప్రోత్సహిస్తున్నారా?

ఒకప్పుడు ప్రభావంగల ఒక యౌవనస్తుడు ఉండేవాడు. ఇతర యౌవనస్తులు వారి ప్రవర్తన ఆమోదం కోసం అతనివైపు చూసేవారు. వారు వ్యంగ్యంగా లేక అసభ్యకరంగా మాట్లాడినప్పుడు, అతడు నవ్వుతున్నాడో లేదో చూస్తారు. వారు ఏదైనా తిరుగుబాటు చేస్తున్నప్పుడు, అతడు తన కళ్ళు ఎగరేసి తన ఆమోదం తెలుపుతున్నాడో లేదో చూస్తారు. వారు

అతన్ని సంతోషపెట్టాలని చూస్తారు. వారిలో ఏ ఒక్కరు కూడా ఈ ప్రశ్నలను పరిగణలోనికి తీసుకోరు: నాకు *అతని* ఆమోదం ఎందుకు అవసరం? నేను సంతోషపెట్టడానికి ప్రయత్నించవలసిన వ్యక్తి ఇతడేనా? అతని ప్రవర్తన, గుణం నాకు మంచి మాదిరేనా?

ఈ విషయాలు గురించి ఆలోచించడానికి కృషి అవసరం. విశ్వాసులు సన్నిహిత స్నేహితుల్ని, గొప్ప ప్రభావితుల్ని ఎంపిక చేసుకునే విషయంలో ఉద్దేశ్యపూర్వకంగా ఉండాలి. నిజానికి, తన ప్రజలు ఆత్మీయతలో పరిపక్వత లేనివారిని లేక అవిశ్వాసులైనవారిని ప్రభావితం చేయాలని దేవుడు ఆశపడుతున్నాడు, కాని వారు మన సన్నిహిత సహచరులుగా, సలహాదారులుగా, ప్రభావితులుగా ఉండడానికి అర్హులు కారు. మనం వారి ఆమోదం కోసం చూడకూడదు.

► ఒక విద్యార్థి తరగతి కోసం కీర్తన 101 చదవాలి.

ఈ కీర్తనను దావీదు రాశాడు. అతడు దేవునికి భయపడ్డాడు. యథార్థంగా జీవిస్తానని దేవునితో నిబంధన చేసుకున్నాడు. తనను ప్రభావితం చేయడానికి అతడు అనుమతించేవారు దేవుని ఆజ్ఞలు నెరవేర్చడంలో అతనికి సహాయపడతారు లేక భంగం కలిగిస్తారని అతనికి తెలుసు. ఈ కారణం చేత, తనను ప్రభావితం చేయడానికి కేవలం నమ్మకమైన, దైవభక్తిగలవారిని ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నాడు.

మనం దావీదు వలే రాజులము కాదు గనుక దావీదు మాట ఇచ్చినట్లుగా దుష్టులను శిక్షించే అధికారం లేక బాధ్యత మనకు లేదు. అయినప్పటికీ, ఇతర విషయాల్లో మనం దావీదును అనుసరించాలి. యథార్థంగా జీవించడానికి కట్టుబడి ఉండాలి. మన సన్నిహిత స్నేహితులుగా, గొప్ప ప్రభావితులుగా కేవలం దైవభక్తిగల ప్రజలను మాత్రమే ఎన్నుకోవడానికి నిర్ణయించుకోవాలి.

## నిర్ణయాలు తీసుకోవడం

ఆరంభ వయోజన దశ నిర్ణయాలు తీసుకునే సమయం. ఆ నిర్ణయాల్లో కొన్ని నిర్ణయాలు జీవితకాల (లేక నిత్య) ఫలితాలు కలిగియుంటాయి.[50] మనం మన ఎంపికలు పరిగణలోకి తీసుకునే ముందు ఈ క్రింది విషయాలు పరిగణలోకి తీసుకోవలసి ఉంది:

---

[50] ఈ విషయం గురించి మరింత తెలుసుకోవడానికి, *Practical Christian Living* లో పాఠం 5 చూడండి, ఇది Shepherds Global Classroomలో అందుబాటులో ఉంది.

- **ఈ చర్య దేవుడు నన్ను ఏం కావాలని కోరుతున్నాడో దానికు అనుగుణంగా ఉందా?** "నువ్వు నీలా ఉండు." "నీకు నువ్వు నిజాయితీగా ఉండు." నీ మనసు చెప్పేది చెయ్" అని సమాజం చెబుతుంది. అయితే మనం క్రీస్తుకు నిజాయితీగా ఉండడానికి పిలువబడ్డాం కాని మనకు మనం నిజాయితీగా ఉండడానికి పిలువబడలేదు. నిజానికి, మన సొంత కోరికలు ఆయనకు విధేయత చూపే విషయంలో అవరోధంగా ఉన్నప్పుడు వాటిని విస్మరించాలని ఆయన చెప్పాడు (మత్తయి 16:24-26). దేవుడు తన నీతి ప్రామాణికల ప్రకారం మనం జీవించాలని ఆశపడుతున్నాడు. ఆశీర్వదించబడిన ప్రజలు, ఆయనకు భయపడువారు, అన్నిటిలో ఆయనకు విధేయత చూపువారి గురించి ఆయన వివరిస్తున్నాడు (కీర్తన 15, కీర్తన 112, మత్తయి 5:3-11). మనం ఆయన్ను నమ్మకంగా వెంబడిస్తుండగా, దేవుడు ఆశించే ప్రజలుగా మనం మారిపోతాం.
- **ఈ చర్య నా ప్రతిష్ఠను ఎలా ప్రభావితం చేస్తుంది?** మనం చేసుకునే ప్రతి ఎంపిక విషయంలో, మనం మన ఖ్యాతిని నిర్మించుకుంటాం (సామెతలు 20:11). దేవుడు మన గురించి ఏం ఆలోచిస్తున్నాడో దాని గురించి ఎక్కువ శ్రద్ధ చూపించాలనే విషయం వాస్తవం. అయితే మనం యథార్థవంతులుగా ఉన్నప్పుడు, ఇతరులను మంచిగా ప్రభావితం చేస్తూ క్రీస్తుకు నమ్మకమైన సాక్షులుగా ఉంటాం. మనం గొప్ప సంపద కంటే మంచి పేరుకు ప్రాధాన్యత ఇవ్వాలని సామెతలు 22:1 బోధిస్తుంది.
- **ఈ ఎంపికకు ఎలాంటి ఫలితాలు ఉన్నాయి?** నేడు మంచి ఎంపికలు చేసుకోవడం ద్వారా రేపటికి సిద్ధపడాలని సామెతలు 22:3 చూపిస్తుంది. మనం మన ఎంపికల గురించి అలోచించినప్పుడు, ప్రతి ఎంపికకు వచ్చే ఫలితాల గురించి కూడా ఆలోచించాలి. మన ఎంపికలు మన జీవితాన్ని, ఇతర జీవితాల్ని ఎలా ప్రభావితం చేస్తాయి?

మన ఎంపికలు, ప్రవర్తనలు హృదయ ప్రేరణల నుండి వస్తాయని సామెతలు 4:23 సెలవిస్తుంది. మనం దేవుని సంతోషపెట్టే మంచి ఎంపికలు చేసుకోవాలంటే, మనం ఆయనకు నమ్మకంగా ఉండేలా చూసుకోవాలి (ద్వితీయోపదేశకాండము 6:2, 5-6, ద్వితీయోపదేశకాండము 13:4).

### శరీర ఆరోగ్యం

యువకులు, తినే ఆహారం, శారీరక వ్యాయామం, ఇతర వ్యాయామాలు, నిద్ర అలవాట్ల వంటి వాటితో సహా వ్యక్తిగత ఎంపికలకు బాధ్యత వహిస్తారు. ఈ విషయాలన్నిటిలో ఆశా-నిగ్రహం అతి ముఖ్యమైంది (1 కొరింథీయులకు 9:27). విశ్వాసుల శరీరాలు దేవుని ఆలయమని, క్రీస్తు రక్తం ద్వారా విమోచించబడినవని విశ్వాసులు గుర్తుంచుకోవాలి (1 కొరింథీయులకు 6:19-20). మనం దేవుని సేవకులం గనుక, ఈ చర్యలన్నిటిలో మంచి ఎంపికలు చేసుకునేలా మనం

మన శరీరాలను శ్రద్ధగా చూసుకోవాలి, మనల్ని మనం క్రమశిక్షణలో పెట్టుకోవాలి, అప్పుడు మనం ఆయన కోసం ఉత్తమంగా ఉండగలం.[51]

► విద్యార్థులు తరగతి కోసం 1 కొరింథీయులకు 6:12-13, 19-20, మరియు 1 కొరింథీయులకు 10:31 చదవాలి.

గత వారంలో మీ ఆహార ఎంపికలు, పరిమాణాల గురించి ఆలోచించండి. బహుశా మీరు తినడానికి చాలా రకాల ఆహారాలు, ఎంపికలు ఉండొచ్చు. లేక, తక్కువ ఆహారం తక్కువ ఎంపికలు ఉండొచ్చు. ఏదేమైనా, మీరు తినే తిండి, త్రాగే నీరు దేవునికి మహిమ తెచ్చేవిగా ఉండాలి. ఒకవేళ యేసు మీతో కూర్చుని భోజనం చేయడానికి అవకాశం ఉంటే, మీరు సాధారణంగా ఎంచుకునే ఆహారాన్ని, దాని పరిమాణాన్ని ఆయన ముందు కూడా ఎంచుకుంటారా? ఇది ఒక వెర్రి ప్రశ్నగా అనిపించవచ్చు, కానీ బహుశా ఇది తినేటప్పుడు శ్రద్ధగా, కృతజ్ఞతతో మరియు ఆశా-నిగ్రహంతో ఉండాలని గుర్తుచేయడానికి ఉపయోగపడుతుంది.

విశ్వాసులు ఆశా-నిగ్రహం చూపవలసిన మరొక కోణం, నిద్ర. మనం సోమరులుగా ఉండి, అతిగా నిద్రపోకూడదు (సామెతలు 6:10-11, సామెతలు 20:13), అయితే మన శరీరాలకు క్రమం తప్పక తగినంత విశ్రాంతి అవసరమయ్యేలా దేవుడు రూపొందించాడు (కీర్తన 3:5). ఆరోగ్యకరమైన యువకులకు ప్రతి రాత్రి 6-8గంటల నిద్ర అవసరం.

శ్రద్ధగా పనిచేసేవారికి నిద్ర ఒక వరమని ప్రసంగి 5:12 సెలవిస్తుంది. సామెతలు 3:24 మరియు కీర్తన 4:8 దేవుడు తన పిల్లలకు ఇచ్చే ప్రశాంతమైన నిద్ర గురించి మాట్లాడుతుంది. ఇలాంటి నిద్ర మన శరీరాలను పునరుద్ధరిస్తుంది. దేవుడు అనుగ్రహించే సమాధానం ద్వారా, నమ్మదగిన మన దేవుడు మనల్ని దృష్టిస్తున్నాడనే నమ్మకంతో పగటికాల చింతలన్నిటిని మరచిపోతాం. ప్రశాంతమైన నిద్ర శరీరాన్ని మనస్సును ఉత్తేజపరుస్తుంది, రాబోవు కార్యాకలాపాలకు, పరిచర్యకు మనల్ని సిద్ధపరుస్తుంది.

జ్ఞానం, అవగాహన, మరియు వివేచనతో కూడిన జీవితాన్ని గడపడానికి సూచనలు ఇచ్చే సామెతలు గ్రంథంలోని ఒక భాగంలో సామెతలు 3:24 కనిపిస్తుంది. మీకు ప్రశాంతమైన నిద్ర కావాలంటే, టి.వి. లేక సినిమాలు చూసే సమయాన్ని, ఇంటర్నెట్ లేక ఫోన్ వాడకాన్ని, మరియు స్నేహితులతో గడిపే సమయాన్ని తగ్గించుకోవడంతో పాటుగా మీరు మీ జీవితంలోని ఇతర విషయాల్లో తెలివిగల నిర్ణయాలు తీసుకోవాలి.

---

[51] ఈ విషయం గురించి మరింత తెలుసుకోవడానికి, *Practical Christian Living* లో పాఠం 13 చూడండి, ఇది Shepherds Global Classroomలో అందుబాటులో ఉంది.

నిద్ర అనేది మీ ఆహార ఎంపికల ద్వారా, తీసుకున్న మోతాదును బట్టి, చేసిన వ్యాయామాన్ని బట్టి, కష్టమైన పరిస్థితిని నిర్వహించిన విధానాన్ని బట్టి, లేక డబ్బును ఖర్చు చేసిన విధానాన్ని బట్టి ప్రభావితమౌతుంది. ఇతరులతో మనకున్న సంబంధం గలతీయులకు 5:22-23లో రాయబడిన ఆత్మ ఫలాలతో నింపబడినప్పుడు ప్రశాంతమైన నిద్ర వస్తుంది.

► పైభాగంలో ఇచ్చిన వాక్యభాగాన్ని చదవడానికి సమయం కేటాయించండి. ఈ లేఖన భాగాల్లో ఇవ్వబడిన సూత్రాల ఆధారంగా మీ నిద్రను పరీక్షించండి. దేవుడు ఉద్దేశించిన రీతితో శరీరం పనిచేయడానికి దానికి కావలసిన విశ్రాంతిని మీరు ఇస్తున్నారా? కీర్తనలలోని చరణాల సందర్భాన్ని గమనించండి: దావీదు ఒత్తిడికి గురైన పరిస్థితిలో దానిని రాశాడు, అయినప్పటికీ నిద్ర ద్వారా తన శరీరాన్ని పునరుద్ధరించడానికి సహాయం చేయడంలో దేవుని నమ్మకత్వానికి సాక్ష్యం ఇచ్చాడు.

### ఒత్తిడిని ఎదుర్కోవడం

దేవుని రూపకల్పన ద్వారా, ఆరంభ వయోజనులకు అనేక బాధ్యతలు, చింతలు ఉంటాయి, వాటికి శ్రద్ధ అవసరం, అవి ఒత్తిడికి గురి చేస్తూ ఉంటాయి (విలాప 3:27). ఒక వ్యక్తి తన చదువు పూర్తి చేసుకుని, వ్యాపారం మొదలుపెట్టి, ఉద్యోగం లేక అనేక ఉద్యోగాలు చేస్తూ ఉండొచ్చు. యువకుడి ఉద్దేశ్యపూర్వకంగా దృష్టి నిలిపే అనేక సంబంధాలు ఉంటాయి. ఆర్థిక విషయాలు, రవాణా అవసరాలు, ఇళ్లు వీటన్నిటికి శ్రద్ధ అవసరం, కాని ఒత్తిడి కలిగిస్తాయి.

ఒత్తిడిని ఇలా నిర్వచించారు, "మనల్ని బెదిరించే లేక మనల్ని సవాలు చేసే సంఘటనలకు శారీరక మరియు మానసిక ప్రతిస్పందన."[52] మీరు మీ పరిస్థితుల్ని ఎలా చూస్తారో ఆలోచించండి. మీరు అనుభవిస్తున్న పరిస్థితిని మానసికంగా ఎలా ఎదుర్కొంటారు?

మీ భవిష్యత్తులో ఏదైనా జరుగబోతున్నప్పుడు, మీరు దాని గురించి ఎలా ఆలోచిస్తారు? అవకాశాలు గురించి ఎలాంటి భావాలను మీరు అనుమతిస్తారు? ఆ పరిస్థితితో ఎలా వ్యవహరిస్తారో ఏ దృక్పథం ప్రభావితం చేస్తుంది? మీ సహజ స్వభావం, వ్యక్తిత్వం ఏంటి (సామెతలు 15:15)?

మీ అభిప్రాయం, స్వభావం, మరియు వ్యక్తిత్వం జీవిత పరిస్థితులకు ప్రతిస్పందించే విధానాన్ని మీరు అనుభవించే ఒత్తిడి స్థాయిని ప్రభావితం చేస్తుంది. ఒత్తిడి జీవితం సహజమైనప్పటికీ, ఒత్తిడితో ఎలా వ్యవహరిస్తారనేది వ్యక్తిగత విషయం. కొన్నిసార్లు ఆందోళన వలన తలనొప్పి, కండరాలు నొప్పి, అనారోగ్యం, అధిక రక్తపోటు, అల్సర్లు, ఇతర మానసిక

[52] Robert S. Feldman, *Discovering the Lifespan,* 2nd ed. (Upper Saddle River, NJ: Pearson, 2012), 317.

భావోద్వేగ, శారీరక బలహీనతలు సంభవిస్తాయి (సామెతలు 12:25). ఒత్తిడికి సరిగా స్పందించనప్పుడు, మీరు క్రీస్తుకు చేసే సేవకు భంగం కలుగుతుంది. దీని కారణంగా, దేవుని వాక్యం చింతించవద్దని చెప్పడంలో ఆశ్చర్యం ఏమి లేదు.

► విద్యార్థులు తరగతి కోసం మత్తయి 6:34, 1 పేతురు 5:7, మరియు కీర్తన 105:4 చదవాలి.

మనం విపత్కరమైన పరిస్థితులు ఎదుర్కొన్నప్పుడు, పరిమితులు లేని ఏకైక దేవుని నమ్మి, ఆయన మీద ఆధారపడాలి, బలంలో, జ్ఞానంలో, మంచితనంలో ఆయన పరిపూర్ణుడు. ఆయన తన పిల్లల్ని పరిపూర్ణ శ్రద్ధ చూపుతాడు. మనం ఆయన మీద ఆధారపడడాన్ని గ్రహించాలని, ప్రతిదీ ఆయనకు చెప్పాలని, ఆయన బలం కోసం వేడుకోవాలని కోరుతున్నాడు. మనం అలా చేస్తుండగా, ఆయన మనకు శాంతి, విశ్రాంతి, మనకు కావలసిన ప్రతిదీ దయచేస్తాడు. మన యౌవ్వనంలో, మనం దేవుని యెదుట నిశ్చలంగా, నిశబ్దంగా ఉండడం నేర్చుకోవాలి మరియు ఆయన నడిపింపు కోసం ఎదురుచూడాలి (కీర్తన 46:10, విలాప 3:25-27).

► మీరు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఒత్తిడి పరిస్థితులను జాబితా చేయండి. దేవుని వాక్య ఆధారంగా మీ ప్రతిస్పందన ఏంటి?

### సమూహ చర్చ కోసం

► ఈ పాఠంలో, ఏ ఆలోచనలు లేక సూత్రాలు మీకు క్రొత్తగా ఉన్నాయి? యౌవనస్థుల జీవితంలోని ఈ రంగాలకు సంబంధించిన ఇతర బైబిల్ సూత్రాలు ఏంటి?

► ఈ పాఠంలో మీరు చదివిన వాటి ద్వారా మీ వ్యక్తిగత జీవితం ఎలా ప్రభావితమౌతుంది?

► మీ సంఘంలో, యౌవనస్థులైన విశ్వాసుల మధ్య ఈ విషయాల్లో ఏవి చర్చించవలసిన అవసరం ఉంది?

► మీకు తెలిసిన క్రైస్తవ యవ్వనస్థులను ఈ రంగాల్లో ఈ విధంగా ఆలోచించడానికి, బైబిలు ప్రకారంగా ప్రవర్తించడానికి వారిని మీరెలా ప్రభావితం చేయగలరు?

## ప్రార్థన

పరలోకమందున్న తండ్రీ,

జీవితంలోని ప్రతి దశలో ఏ విధంగా జీవించాలో బోధించే నీ వాక్యాన్ని బట్టి కృతజ్ఞతలు. మా యౌవన ప్రాయంలో ఫలభరితమైన, ఉత్పాదకమైన జీవితాలు జీవించునట్లు మమ్ముమను సిద్ధపరస్తున్నందుకు వందనాలు.

నీవు మాకిచ్చిన బలం, వనరులు, అవకాశాలు నమ్మకంగా ఉపయోగిస్తూ నీకు మహిమ తెచ్చేవారంగా ఉండడానికి సహాయం చేయుము. ఇతరులపై దైవిక ప్రభావం చూపడానికి, దైవభక్తిగల స్నేహితుల్ని, సలహాదారుల్ని ఎన్నుకోవడానికి మాకు సహాయం చేయుము.

మేము తెలివైన నిర్ణయాలు తీసుకుని, మా శరీరాలు, మనసులు, మరియు ఆత్మలతో నిన్ను ఘనపరచుదముగాక.

ఆమెన్

## పాఠం అభ్యాసాలు

(1) 1 తిమోతికి 4:12లో, నిర్దిష్టమైన విషయాల్లో మాదిరి ఉండాలని పౌలు తిమోతికి ఉపదేశించాడు. అవేమిటో రాతపూర్వకంగా వివరించండి. ఆ తర్వాత, యౌవనస్థుల జీవితాల్లో వీటిని ఎలా అన్వయించుకోవాలో వివరించండి. ప్రతి దానికి కనీసం ఒక ఆచరణాత్మక ఉదాహరణ ఇవ్వండి.

(2) ఈ పాఠం నుండి ఒక విషయం ఎంపిక చేసుకోండి:

- పరిపక్వత మరియు ప్రవర్తన
- పని
- ఆర్థిక విషయాలు
- సన్నిహిత స్నేహితులు
- నిర్ణయాలు తీసుకోవడం
- భౌతిక ఆరోగ్యం
- ఒత్తిడి

మీరు ఎన్నుకున్న విషయం గురించి కనీసం మూడు పేరాలు రాయండి:

- ఆ విషయానికి సంబంధించి బైబిలు సూత్రాలు సంగ్రహించండి.
- ఆ సూత్రాలకు కట్టుబడి ఉండడం ద్వారా వచ్చే కొన్ని అనుకూల ఫలితాలు గురించి వివరించండి.
- ఆ సూత్రాల్ని నిర్లక్ష్యం చేసినప్పుడు వచ్చే కొన్ని ప్రతికూల ఫలితాలు గురించి వివరించండి.

అనుకూల, ప్రతికూల ఫలితాలు గురించి రాస్తున్నప్పుడు, ఒక వ్యక్తి చేసుకున్న ఎంపికలు ఇతర వ్యక్తుల మీద చూపే ప్రభావాలు గురించి ఆలోచించండి: ఆ వ్యక్తి, వారి కుటుంబం, వారి సమాజం, మరియు వారి సంఘం.

# అనుబంధం A

# స్త్రీల పట్ల గౌరవం

### స్త్రీలను గౌరవించే విషయంలో యేసు మాదిరి

మొదటి శతాబ్దం రోమా ప్రపంచంలో, యూదా మతంలో స్త్రీలను పురుషులకంటే తక్కువగా చూసేవారు. ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్కృతుల్లో, అనేక ఇళ్లల్లో స్త్రీలను ఇంకా చిన్న చూపు చూస్తున్నారు. స్త్రీలను అగౌరవపరుస్తున్నారు, లైంగిక సంబంధం కోసం వాడుకుంటారు, వేధిస్తారు. అయితే, యేసు స్త్రీలను గౌరవించిన విధానం మనకు మాదిరి.

క్రీస్తుకు, స్త్రీలంటే గౌరవం, పురుషులతో సమానం. యేసు చెప్పాడు, "సృజించినవాడు ఆదినుండి వారిని పురుషునిగాను స్త్రీనిగాను సృజించెననియు" (మత్తయి 19:4, ఆదికాండము 1:27). పురుషులవలే, స్త్రీలు కూడా దేవుని స్వరూపంలో సృజించబడ్డారు. పురుషులవలే, స్త్రీలకు స్వీయ-అవగాహన, వ్యక్తిగత స్వేచ్ఛ ఉంటుంది, సొంత నిర్ణయాలు తీసుకుంటారు, తీసుకున్న నిర్ణయాలకు బాధ్యత వహిస్తారు. యేసు, స్త్రీలను పురుషుల కోరికలు తీర్చేవారిగానే కాకుండా యథార్థపరులుగా చూశాడు. ఆయన వారి కోసమే ఈ లోకానికి వచ్చినట్లుగా, వారిని పరిగణించాడు (లూకా 8:1-3).

జాన్ పైపర్, వేయిన్ గ్రుడెమ్ తో సహా జేమ్స్ బోర్లాండ్, యేసు స్త్రీల పట్ల తన ఉన్నతమైన దృక్పథాన్ని, స్త్రీల పట్ల ఆయనకున్న గౌరవం గురించి నాలుగు సువార్తల్లో ఈ స్పష్టమైన ఉదాహరణలు ఇచ్చారు:

**(1) యేసు తరచుగా స్త్రీలతో బహిరంగంగా నేరుగా మాట్లాడాడు.**

యేసు కాలంలో, పురుషులు సహజంగా ఇలా చేయరు (యోహాను 4:27). యేసు సుఖారనబడిన బావి యొద్ద సమరయ స్త్రీతో మాట్లాడినప్పుడు శిష్యులు చూసి ఆశ్చర్యపడ్డారు (యోహాను 4:7-26). వ్యభిచారంలో పట్టబడిన స్త్రీతో కూడా యేసు స్వేచ్ఛగా మాట్లాడాడు (యోహాను 8:10-11). యేసు నాయీనను విధవరాలితో (లూకా 7:12-13), రక్తస్రావంగల స్త్రీతో (లూకా 8:48, మత్తయి 9:22, మార్కు 5:34), సమూహంలో నుండి వచ్చిన స్త్రీతో (లూకా 11:27-28) బహిరంగంగా మాట్లాడాడని లూకా పేర్కొన్నాడు. యేసు, 18 సంవత్సరాలు నడుము ఒంగిపోయిన స్త్రీతో (లూకా 13:12) మరియు సిలువ మార్గంలో స్త్రీల బృందంతో మాట్లాడాడు (లూకా 23:27-31).

**(2) యే యేసు స్త్రీలతో మాట్లాడిన విధానం, వారిపట్ల ఆయనకు ఉన్న గౌరవాన్ని, ఉన్నతమైన భావనను తెలియజేస్తుంది**

ఆయన ఆలోచననాత్మకంగా శ్రద్ధగా మాట్లాడాడు. యేసు రక్తస్రావంగల స్త్రీని "కుమారీ" అని మరియు బలహీనురాలైన స్త్రీని "అబ్రాహాము కుమార్తె" (లూకా 13:16) అని ప్రస్తావించాడని మత్తయి, మార్కు మరియు లూకా సువార్తలు చెబుతాయి. వారిని "అబ్రాహాము కుమార్తెలని" పిలవడం ద్వారా "అబ్రాహాము కుమారులతో" సమాన స్థాయిలో ఉంచాడు.

**(3) వారి పాపాలకు వారిని వ్యక్తిగత బాధ్యులనుగా చేయడం ద్వారా యేసు వారి సహజ విలువను చూపించాడు.**

ఇది, ఆయన బావి యొద్ద స్త్రీతో (యోహాను 4:16-18), వ్యభిచారంలో పట్టబడిన స్త్రీతో (యోహాను 8:10-11), ఆయన పాదాలను అభిషేకించిన పాపియైన స్త్రీతో (లూకా 7:44-50) వ్యవహరించిన విధానంలో కనిపిస్తుంది. వారి పాపాన్ని విస్మరించలేదుగాని ఖండించాడు. ప్రతి స్త్రీకి వ్యక్తిగత స్వేచ్ఛ ఉందని, ఆమె ఎంపికలకు ఆమే బాధ్యత వహిస్తుందని, మరియు పాపం, పశ్చాత్తాపం, క్షమాపణ వంటి సమస్యల్ని తనే వ్యక్తిగతంగా తప్పక పరిష్కరించాలని ఆయన కార్యాలు చూపిస్తాయి.

### యేసు స్త్రీలకు ఇచ్చిన విలువ నేటి సంఘాన్ని ఎలా నడిపించాలి

పరిచర్యలో మరియు కుటుంబంలో ఆదర్శవంతమైన దైవభక్తిగల స్త్రీ పాత్ర గురించి అనేక సంఘాలు, డినామినేషన్లు చర్చించుకోవలసిన రీతిలో చర్చలు జరుపుకుంటున్నాయి, అయినప్పటికీ దేవుని స్వరూపంలో సృజించబడిన వ్యక్తులుగా స్త్రీ విలువను, సమానత్వాన్ని ఎన్నటికి ప్రశ్నించకూడదు. యేసు ఎల్లప్పుడు స్త్రీలను గౌరవించాడు, వారికి విలువ ఇచ్చాడు. ఆయన పునరుత్థాన సువార్తను మొట్టమొదటిగా ప్రకటించడానికి యేసు స్త్రీలను నియమించాడు (యోహాను 20:17). ఆయన వారి సహవాసానికి, ప్రార్థనకు, క్రైస్తవ సేవకు, ఆర్థిక మద్దతుకు, సాక్ష్యానికి విలువ ఇచ్చాడు. యేసు స్త్రీలను గౌరవించాడు, వారికి బోధించాడు, ఆలోచనాత్మకమైన మార్గాల్లో వారికి పరిచర్య చేశాడు.

### స్త్రీల పట్ల గౌరవం క్రొత్త నిబంధనలో చూపించబడింది

స్త్రీలను గౌరవించవలసిన విషయంలో యేసు చూపిన మాదిరి, పరిశుద్ధాత్మ జీవితంలో కనిపిస్తుంది. పెంతెకొస్తను దినమందు, పరిశుద్ధాత్ముడు కుమారుల మీద కుమార్తెల మీద దాసుల మీద దాసురాండ్రమీద కుమ్మరించబడ్డాడు (అపొ. కా. 2:17-18). పరిశుద్ధాత్ముడు పక్షపాతం చూపించలేదు.

రోమా 16లో, సంఘపరిచారకురాలైన ఫీబేను (వచనం 1), అతని ప్రాణానికి వారి ప్రాణాలిచ్చుటకైనా తెగించి క్రీస్తుయేసునందు తన జతపనివారైన ప్రిస్కిల్ల, అకులను (వచనాలు 3-4), కష్టపడి పని చేసిన మరియను (వచనం 6), అపొస్తలులకు బాగా తెలిసిన యూనీయను (వచనం 7) మరియు ఇతర స్త్రీలను కూడా పౌలు అభినందించాడు.

1 థెస్సలొనీకయులకు రాసిన పత్రికలో, "అయితే స్తన్యమిచ్చు తల్లి తన సొంత బిడ్డలను గారవించునట్లుగా, మేము మీమధ్యను సాధువులమై యుంటిమి" (1 స్సలొనీకయులకు 2:7) అని పౌలు రాసినప్పుడు, దేవుడు రూపొందించిన సున్నితత్వాన్ని, తల్లి ప్రేమను అతడు ప్రశంసించాడు. ఎఫెసీయులకు రాసిన పత్రికలో, భర్తలు తమ భార్యల్ని ప్రేమించాలని ఆజ్ఞాపించాడు, "అటువలె క్రీస్తు కూడ సంఘమును ప్రేమించి... దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను," మరియు సొంతశరీరములనువలె (ఎఫెసీయులకు 5:25, 28). పేతురు భర్తలకు ఈ విధంగా చెప్పాడు, "భార్యను సన్మానించి...జ్ఞానము చొప్పున వారితో కాపురము చేయుడి" (1 పేతురు 3:7).

స్పష్టంగా చెప్పాలంటే, ఆది సంఘంలో స్త్రీలకు విలువిచ్చారు, మరియు పురుషులు, స్త్రీలను గౌరవించాలని నేర్చుకున్నారు. ప్రతిచోట ఉన్నటువంటి ఆత్మీయ నాయకులు స్త్రీల కోసం నిలబడడానికి, ప్రతి సంస్కృతిలో వారిపై జరిగే అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడడానికి ఇదే సమయం. దేవుడు తన స్వరూపంలో ప్రత్యేకంగా సృష్టించినవారిగా స్త్రీలకు మనం విలువివ్వాలి. కుటుంబంలో లేక సంఘంలో పురుషులు, స్త్రీల పాత్రల వైవిధ్యాలు గురించి బోధించే ముందు, దీనిని ఆధారంగా తీసుకోవాలి, లేనియెడల మన బోధ వేధింపులకు నడిపించవచ్చు.

### సమూహ చర్చ కోసం

► మీ సంస్కృతిలో స్త్రీ పురుషులు మధ్య ఉండే భిన్నతలు గురించి వివరించండి. బైబిలు సూత్రాలని వర్తింపజేయడం ద్వారా ఆ భిన్నత్వాలను ఎలా సంస్కరిస్తారు?

► మీ దేశంలోని సంఘాలు పురుషుల కంటే స్త్రీలను ఎలా భిన్నంగా చూస్తాయి? సంఘాలు, సంస్కృతులు మధ్య తేడా ఉందా?

► యేసు మాదిరి ఆధారంగా, ఏ ఆచారాలు మారాలి?

# అనుబంధం B

# జనన నియంత్రణ

## గర్భ నిరోధక పద్ధతులు

లైంగిక సంబంధాన్ని ఆశించి, పిల్లలు వద్దనుకునేవారికి గర్భం దాల్చకుండా ఉండే కొన్ని మార్గాలని వైద్య శాస్త్రం అభివృద్ధి చేసింది. గర్భ నిరోధక పద్ధతులకు వాడిన పదం ఏమిటంటే, కాంట్రాసెప్షన్ (గర్భ నిరోధకం). గర్భాన్ని నిరోధించడానికి అనేక పద్ధతులు ఉన్నాయి:

1. స్త్రీ శరీరంలో అండాన్ని ఉత్పత్తి కాకుండా చేసే మాత్రలు.
2. అండం ఫలదీకరణమైన తర్వాత దాన్ని చంపేసే మాత్రలు.
3. వీర్యకణాలు స్త్రీలోకి ప్రవేశించకుండ అడ్డుకునే పరికరాలు

ప్రతినెలలో, స్త్రీలో సంతానోత్పత్తి కలిగించే సామర్థ్యము కొన్ని రోజులపాటు ఉంటుంది. స్త్రీ శరీరం గురించి దంపతులు తెలుసుకుని, ఆ స్త్రీ గర్భం ధరించగలిగే సమయంలో లైంగిక సంబంధాన్ని నివారిస్తారు. గర్భధారణను నిరోధించే ఈ నాల్గవ పద్ధతిని గర్భనిరోధక పద్ధతిగా పరిగణించరు.

## ప్రజలు గర్భ నిరోధకాన్ని ఉపయోగించడానికిగల కారణాలు

వివాహేతర లైంగిక సంబంధాలు పెట్టుకునేవారి మధ్య గర్భధారణను నివారించడానికి లేక రోగాలు సంక్రమించకుండ ఉండడానికి కొన్ని సంస్థలు కండోములను వాడాలని చెబుతాయి. అయితే, ఇక్కడ వివాహేతర సంబంధాల వలన కలిగే గర్భధారణను నిరోధించడం గురించి చర్చించడం లేదు. వివాహేతర లైంగిక సంబంధాల్ని బైబిల్ ఖండిస్తుంది. వివాహేతర లైంగిక సంబంధాల మధ్య గర్భధారణను నివారించడానికి లేక రోగాలు సంక్రమించకుండ ఉండడానికి ఉత్తమ మార్గం, లైంగిక సంబంధాన్ని కేవలం వివాహ వ్యవస్థకు మాత్రమే పరిమితం చేయడమని ఇవాంజెలికల్ క్రైస్తవులు నమ్ముతారు.

వివాహమైన కొందరు దంపతులు గర్భ నిరోధకాలను ఉపయోగించడానికి అనేక కారణాలు ఉన్నాయి:

- అనేకమంది పిల్లల్ని పోషించడానికి ఇబ్బందిపడే పేద కుటుంబాలు గర్భ నిరోధకాలు ఉపయోగించాలని అనేక చోట్ల వైద్య నిపుణులు కోరుతుంటారు, తద్వారా తక్కువమంది పిల్లలు జన్మిస్తారు.

- కొన్నిసార్లు డబ్బు ఆదా చేయాలి లేక ఏదొక విధంగా తమ జీవన పరిస్థితిని మెరుగుపరచుకోవాలనే ఉద్దేశంతో, వివాహమైన తరువాత, దంపతులు పిల్లలు లేకుండా కొంతకాలం అలాగే ఉండాలని అనుకుంటారు.
- పిల్లల మధ్య వయసులో అంతరాన్ని పొడిగించడానికి దంపతులు గర్భనిరోధకాలు ఉపయోగిస్తారు.
- కొన్నిసార్లు తమకు కావలసినంతమంది పిల్లలు ఉన్నారు గనుక ఇంకా పిల్లలు అక్కర్లేదనే ఉద్దేశ్యంతో గర్భ నిరోధకాలు ఉపయోగిస్తారు.
- కొన్నిసార్లు స్త్రీకి ఆరోగ్య సమస్యలు ఉంటాయి, మరియు గర్భధారణ ఆమెకు, పుట్టబోవు బిడ్డకు ప్రమాదం గనుక వైద్యులే గర్భ నిరోధకాలు ఉపయోగించమని చెబుతారు.

**గర్భ నిరోధకాలకు సంబంధించి సంఘాల మధ్య చర్చలు**

గర్భధారణను నిరోధించడం తప్పా ఒప్పా అనేదాని గురించి బైబిల్ స్పష్టత ఇవ్వదు. రోమన్ కేథలిక్లు గర్భనిరోధకాలను ఖండిస్తారు కాని, గర్భం ధరించగల సమయాన్ని తెలుసుకుని లైంగిక సంబంధాన్ని నివారించడం ద్వారా గర్భధారణను నిరోధించే పద్ధతిని అంగీకరిస్తారు. కొందరు ఈస్ట్రన్ ఆర్తోడాక్స్ నాయకులు గర్భ నిరోధకాలను వ్యతిరేకిస్తారు కాని అన్నిటిని కాదు. ప్రొటెస్టెంట్లు, ఇంవాజెలికల్ సంఘాల మధ్య, భిన్నమైన సిద్ధాంతం ఉంటుంది.

గర్భ నిరోధకాల్ని నిషేధించడానికి కొన్ని సంఘాలు ఈ క్రింది వాటిని కారణాలుగా ఉపయోగిస్తాయి. ప్రతిదాని తర్వాత, అదనపు దృక్పథాన్ని అందించే చర్చ ఉంటుంది.

(1) పిల్లలు దేవుడు అనుగ్రహించు బహుమానం మరియు వివాహ్ ఉద్దేశ్యం.

సంతానలేమి గురించి చర్చించే పాఠం ప్రకారం, పిల్లలు దేవుని ఆశీర్వాదం. కొన్ని సంఘాల వాళ్ళు, దేవుడు పిల్లలకు ఇచ్చే ప్రాముఖ్యత వల్ల గర్భనిరోధక సాధనాలను ఉపయోగించకూడదని నమ్ముతారు. ఒకవేళ వారికి పిల్లలు ఉండి, ఆరోగ్య సమస్యలు లేక ఆర్థిక ఇబ్బందులుంటే, అదనపు గర్భధారణలు నివారించడం తప్పుకాదని, మరికొంతమంది విశ్వాసులు నమ్ముతారు.

(2) గర్భ నిరోధకాలు, అనైతిక లైంగిక చర్య నుండి దాని ఫలితాలు నుండి కాపాడడానికి ఉపయోగపడతాయి.

వాటిని అనైతిక ఉద్దేశ్యాల కోసం ఉపయోగించే విషయం నిజానికి, వివాహ దంపతుల సమస్యకు సంబంధించినది కాదు.

(3) గర్భనిరోధకాలు, పిల్లల్ని పొందే లైంగిక ఉద్దేశ్యాన్ని తొలగిస్తాయి గనుక లైంగిక చర్యను స్వార్థపూరితంగా, అపవిత్రంగా మారుస్తాయి.

నిజమేనని చెప్పాలి, లైంగిక సంబంధం స్వార్థపూరితమైంది లేదా అపవిత్రమైంది కావచ్చు, కానీ అది కేవలం పిల్లలను కనడానికి మాత్రమే కాదు, వివాహ బంధంలో భాగం (1 కొరింథీయులకు 7:3–5). భార్యాభర్తలు ఒకరికొకరు ఈ విధంగా సేవ చేసుకోవాలని బైబిల్ చెబుతోంది.

(4) గర్భ నిరోధకాలు గర్భధారణను దేవుని ఎంపికగా కాకుండా మానవుని ఎంపికగా చూస్తాయి.

దంపతులు ఎప్పుడు పిల్లల్ని పొందాలి, ఎంతమందిని పొందాలి అనే విషయాల్ని సొంతగా నిర్ణయించుకోకుండా, దేవుని మీద ఆధారపడాలని కొన్ని సంఘాలవారు నమ్ముతారు. మన జీవితంలో అన్ని విషయాల్లో నిర్ణయాలు తీసుకునే బాధ్యత మనపైనే ఉంది గనుక బైబిల్ ప్రాధాన్యతలు పాటిస్తూనే గర్భధారణ నివారించే నిర్ణయాలు తీసుకోవచ్చని మరికొంతమంది విశ్వాసులు చెబుతారు.

**మనస్సాక్షికి సంబంధించిన విషయం**

(1) బైబిలు, గర్భ నిరోధకాలు గురించి నిర్దిష్ట ప్రకటన చేయదు (2) ఈ విషయంపై ఇవాంజెలికల్ క్రైస్తవులకు అనేక భిన్నాభిప్రాయాలు ఉంటాయి కాబట్టి, విశ్వాసులు ఇతర విశ్వాసుల నిర్ణయాలను గౌరవించాలి. దంపతులు, దేవునికి లోబడేలా, బైబిలు సూత్రాలను పాటించేలా చూసుకోవాలి ఆ తర్వాత తెలివైన నిర్ణయాలు తీసుకోవడానికి జ్ఞానం కోసం ప్రార్థించాలి.

గర్భం దాల్చిన తరువాత, బిడ్డను కనాలా వద్దా అనే విషయంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకూడదు. కడుపులో ఉన్నటువంటి బిడ్డను చంపడం తప్పని లేఖనం స్పష్టంగా చెబుతుంది. మానవుని జీవితం గర్భధారణ సమయంలోనే ప్రారంభమౌతుంది గనుక ఫలదీకరణ చెందిన తర్వాత అండాన్ని జీవించకుండా నిరోధించే మాత్రలు వేసుకోవడం తప్పు. దంపతులు గర్భనిరోధకాలు ఉపయోగించాలని నిర్ణయించుకున్నప్పుడు, వారు గర్భధారణను అడ్డుకునే వాటిని ఉపయోగిస్తున్నారు గాని, ఫలదీకరణం చెందిన అండాన్ని చంపేదానిని కాదని నిర్ధారించుకోవాలి.

# సిఫార్సు చేయబడిన వనరులు


**వివాహానికి సిద్ధపాటు**

Drescher, John. *For Better, For Worse*. Morgantown, PA: Masthof Press, 2012.

Thomas, Gary. *Sacred Marriage*. Grand Rapids: Zondervan, 2000.

**వివాహం**

Eggerichs, Emerson. *Love and Respect*. Nashville: Thomas Nelson, 2004.

Thomas, Gary. *Sacred Search*. Colorado Springs: David C Cook, 2013.

**లైంగికత**

Ferrer, Hillary. *Mama Bear Apologetics Guide to Sexuality: Empowering Your Kids to Understand and Live Out God's Design*. Eugene: Harvest House Publishers, 2021.

Sprinkle, Preston. *People to Be Loved: Why Homosexuality is not Just an Issue*. Grand Rapids: Zondervan, 2015.

Yuan, Christopher. *Holy Sexuality and the Gospel: Sex, Desire, and Relationships Shaped by God's Grand Story*. New York: Multnomah, 2018.

Shimer, Ted. *The Freedom Fight: The New Drug and the Truths That Set Us Free*. Houston: High Bridge Books, 2020.

**పిల్లల పెంపకం**

Brown, Nadine M. *How to Have Kids with Character (Even if Your Kids are Characters)* Wheaton: Tyndale House Publishers, Inc., 1990.

Chapman, Gary and Ross Campbell. *The Five Love Languages of Children*. Chicago: Northfield Publishing, 1997.

Dobson, James. *Bringing up Boys*. Wheaton: Tyndale House Publishers, Inc., 2001.

Friedeman, Matt. *Discipleship in the Home: Teaching Children. Changing Lives*. Wilmore: Francis Asbury Society, 2010.

Hubbard, Ginger. *Don't Make Me Count to Three!* Wapwallopen, PA: Shepherd Press, 2003.

Mulvihill, Josh. *Biblical Worldview: What It Is, Why It Matters, and How to Shape the Worldview of the Next Generation.* Roanoke: Renewanation, 2019.

Tripp, Tedd. *Shepherding a Child's Heart*. Wapwallopen: Shepherd Press, 1995.

**కుటుంబం**

*కుటుంబ బోధనా సాధనాలు*. Shepherds Global Classroom, 2023. https://shepherdsglobal.org/courses/ ఈ లింకు నందు ఈ వనరులు డౌన్లోడ్ చేసుకోవడానికి ఉచితంగా అందుబాటులో ఉన్నాయి.

Garland, David and Diana Garland. *Flawed Families of the Bible*. Grand Rapids, MI: Brazos Press, 2007.

Mally, Sarah and Stephen Mally and Grace Mally. *Making Brothers and Sisters Best Friends*. Marion, IA: Tomorrow's Forefathers Inc, 2002.

# అభ్యాసాల రికార్డు

విద్యార్థి పేరు ________________________________________

దిగువ పట్టికలో, ప్రతి అభ్యాసం పూర్తయినప్పుడు విద్యార్థి పేరులోని మొదటి అక్షరాలు నమోదు చేయండి. Shepherds Global Classroom నుండి సర్టిఫికెట్ పొందాలంటే అభ్యాసాలన్నీ విజయవంతంగా పూర్తి చేయాలి.

| పాఠం | అభ్యాసం 1 | అభ్యాసం 2 | అభ్యాసం 3 | అభ్యాసం 4 |
|---|---|---|---|---|
| 1 | | | | |
| 2 | | | | |
| 3 | | | | |
| 4 | | | | |
| 5 | | | | |
| 6 | | | | |
| 7 | | | | |
| 8 | | | | |
| 9 | | | | |
| 10 | | | | |
| 11 | | | | |
| 12 | | | | |
| 13 | | | | |
| 14 | | | | |
| 15 | | | | |

Shepherds Global Classroom నుండి పూర్తి చేసిన సర్టిఫికెట్ కోసం దరఖాస్తు మా వెబ్‌సైట్ www.shepherdsglobal.org లో పూర్తి చేయవచ్చు. విద్యార్థి(ల) తరఫున దరఖాస్తును పూర్తి చేసే బోధకులు, సహాయపడేవారు SGC అధ్యక్షుడు డిజిటల్ ద్వారా సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారు.